# కథా కౌముది

## 2013 - Part 1



శ్రీ

కౌముది

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 82

కౌముది మాసపత్రికలో

2013 జనవరి నుంచి జూన్ 2013


వరకూ

వచ్చిన కథలు

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. మనీ ప్లాంట్ | డా.శ్రీమతి కొఠారి వాణీ చలపతిరావు | 5 |
| 2. త్రితంత్రం | డా.మూలా రవికుమార్ | 12 |
| 3. కనువిప్పు | ఆకెళ్ళ కృష్ణకుమారి | 19 |
| 4. మార్గమేదే మనసా? | తాడికొండ కె. శివకుమార శర్మ | 23 |
| 5. మంచుగాడు | ఎస్.నారాయణ స్వామి | 28 |
| 6. నీకేం తెలుసు? | వరలక్ష్మి పోలిన | 35 |
| 7. శూన్యమేరా జీవితం | మధు పెమ్మరాజు | 38 |
| 8. నువు నడు - నే వస్తా | చిలుకూరి సత్యదేవ్ | 45 |
| 9. హక్కు బాధ్యతే | ప్రవీణ కొల్లి | 50 |
| 10.ధర్మో రక్షతి రక్షితః | ఆర్. శర్మ. దంతుర్తి | **57** |
| 11.కాదేదీ బిజినెస్ కనర్హం | తాడికొండ కె. శివకుమార శర్మ | 61 |
| 12.నిత్యసుమంగళి | ఓలేటి సత్యనారాయణ | 68 |
| 13. రానీ.. ఆయన్ని! | పుట్టపర్తి తులజాదేవి | 73 |
| 14. భూతబలి | ఆదూరి హైమవతి | 76 |
| 15. చిక్కుముడి | కన్నెగంటి అనసూయ | 78 |
| 16. యుద్ధం | గన్నవరపు నరసింహమూర్తి | 84 |
| 17. హాశ్చర్యం! | పోలంరాజు శారద | 89 |
| 18. యుటోపియా | భద్రిరాజు శ్రీనివాస్ | 92 |
| 19. హింసాయా మా అహింసాం గమయ... వి-రాగి | | 96 |
| 20. అహం బ్రహ్మాస్మి | డా. వెంకటరావు కూచిభొట్ల | 104 |
| 21. సవ్యాజమానవులు | ఎలెక్ట్రాన్ | 114 |
| 22. ద్వంద్వం | శ్రీదేవి మురళీధర్ | 128 |
| 23. దిగుడు బావి | సత్యదేవ్ చిలుకూరి | 136 |

| | | |
|---|---|---|
| **24.** తెగులు బ్లాగు | ఆర్ శర్మ దంతుర్తి | 141 |
| **25.** నానాటి బ్రతుకు | ఆకెళ్ళ శివప్రసాద్ | 148 |
| **26.** ఆత్మావలోకనం | జొన్నలగడ్డ రామలక్ష్మి | 153 |
| **27.** వైదేహీ మైథిలీయం | సాయిపద్మ | 163 |
| **28.** వాసన | శ్రీముహ | 169 |
| **29.** కార్పొరేట్ సుడిగుండాలు | కప్పగంతు వెంకట రమణమూర్తి | 172 |
| **30.** దయామణి | శ్రీనివాసరావు ఆదూరి | 174 |

# మనీ ప్లాంట్

డా.శ్రీమతి కొఠారి వాణీ చలపతిరావు

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ.**

**చేతిలోని స్టిక్ ను ఊపుతూ పెద్ద పెద అంగలతో వాకింగ్ చేస్తున్నాను.** నా జీవితంలో నాకు నచ్చని విషయం అదొక్కటే.. వాకింగ్. ఎక్కడికెళ్ళినా కాలు కిందపెట్టే అవసరం లేకుండా గారేజీలో రెండుకార్లు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. ఏ పనీ స్వయంగా చేసుకునే అవసరం లేకుండా ఇంటినిండా నౌకర్లు, చాకర్లు ఉన్నారు. సూట్లు లాండ్రీ నుంచి తెచ్చి రెడీగా పెట్టేవాడు ఒకడయితే, షూస్ పాలిష్ చేసి తెచ్చి కాళ్ళ దగ్గర పెట్టేవాడు మరొకడు. కూర్చున్న దగ్గరికి కాఫీ, టీలు, పళ్ళరసాలు తెచ్చి ఇచ్చేవాడు ఒకడయితే, నేను ఎక్కడికెళ్ళినా నా బ్రీఫ్‌కేస్ మోస్తూ నా వెంట తిరిగేవాడు మరొకడు. ఏ పనీ స్వయంగా చేసుకోవాల్సిన అవసరం లేకుండా దర్జాగా రాజాలా రోజులు అంగరంగ వైభవంగా గడిచిపోతున్నాయి - అలాంటి సమయంలో ఎప్పటిలా జనరల్ చెకప్ కోసమని ఇంటికొచ్చిన మా ఫ్యామిలీ డాక్టరు 'ఫార్టీ ఫైవ్‌లో అడుగు పెట్టారు కదా.. ఇక నుంచీ మీరు కాస్త హెల్త్ కేర్ తీసుకోవాలి. బాడీ వెయిట్ కొద్దిగా పెరిగింది. కొలెస్ట్రాల్ ఉండాల్సిన దానికన్నా కొంచెం ఎక్కువ ఉంది. విధిగా మీరు వాకింగ్ చెయ్యాలి. ముందు జాగ్రత్తలు తీసుకోకపోతే ఆ తరువాత కష్టమవుతుంది' అన్నాడు.

'ఇదెక్కడి గోలరా బాబూ' అనుకున్నాను చిరాకుగా. మా అమ్మ నన్ను చిన్నప్పుడు కాలికి మట్టి అంటకుండా నౌకర్ల చంకనెత్తించి ఆయమ్మ అరచేతుల్లో అడుగులేయించి కార్లలో బడికి పంపించి పెంచింది.

ఇక కోట్ల టర్నోవర్‌తో బిజినెస్ చేసే నాన్న డబ్బు మీదే నా జీవితం నడిచేలా సకల సౌకర్యాలూ సమకూర్చి పెట్టాడు.

కాకుంటే - 'కడుపులో చల్లకదలకుండా ఫోమ్ కుర్చీలో కూర్చుని ల్యాప్ టాప్ ముందు పెట్టుకుని ఇంటర్‌నెట్ ద్వారా బిజినెస్ మాగ్నెట్ కావాలి. లేకుంటే మన సామ్రాజ్యం కుప్పకూలిపోతుంది జాగ్రత్త. ఎప్పుడు ఎవరు మన సామ్రాజ్యం మీద దాడి చేస్తారో చెప్పలేం' అని హెచ్చరికలు జారీ చేసేవారు. నా దృష్టి మరో వైపుకు మళ్ళకుండా స్వయంగా వీలుదొరికినప్పుడల్లా తన వ్యాపారం గురించిన మెళకువలు, రహస్యాలు, ఎత్తులు... పై ఎత్తులు అన్నీ నేర్పించారు. 'ఇక ఫరవాలేదు - దారిన పడ్డాడు' అనిపించిన తర్వాత నా మానాన నన్ను వదిలేసారు. పై ఎత్తున మాత్రం నామీద ఓ కన్నేసి ఉంచేవారు.

వ్యాపారస్తులకు బుర్రతో బాడీతో పని ఉండదు గనుక గంటలకొద్దీ ఇంట్లో, ఫ్యాక్టరీ ఆఫీసులో ల్యాప్‌టాప్ ముందు కూర్చుని లావాదేవీలు నడుపుతుండటం వల్ల ఈ మధ్య బొర్రకాస్త బాగానే పెంచాను.

'అదీ డాక్టర్ కంప్లయింట్. తిండి తగ్గించమన్నాడు. దేవుడిచ్చిన కాళ్ళను కాస్తంతయినా ఉపయోగించమన్నాడు' తప్పనిసరి పరిస్థితిలో ఈ మధ్య వాకింగ్ చేస్తున్నాను. అలవాటులేని శరీరం మొదట్లో ససేమిరా అంది. కాళ్ళూ, చేతులూ కదలనని మొండికేసాయి. బద్ధకం బాగా తలకెక్కిన మనసు తనూ మొరాయించింది. నాలుగడుగుల నడకకే ఆయాసం. వళ్ళంతా చిత్తడి చిత్తడిగా చెమటలు చిరాకు పుట్టిస్తుంటే దేవుడి మీద పిచ్చికోపం వచ్చేది. అన్నీ ఇచ్చినట్టే ఇచ్చి మళ్ళీ అంతలోనే. ఇదేంటి?

కష్టపడటం అలవాటు లేని వాడికి ఈ వాకింగ్‌లు, ఎక్సర్‌సయిజ్‌ల గొడవేంటి. కార్లలో తిరిగేవాడిని చూస్తే ఒక స్టేజ్ కొచ్చాక ఆ దేవుడికి కూడా జలసీ పుడుతుందనుకుంటా- ఇంకాస్తయితే స్వర్గసుఖాలతో తనకెక్కడ కాంపిటేషన్ వస్తాడోనని! అనుకుంటుండగా వెనక నుంచి ఎవరో పిలిచినట్టయి ఆగి వెనక్కు తిరిగి చూసాను.

"ఏమండోయ్ శ్రీపతిగారూ ఆగండాగండి" అంటూ తెల్ల ధోవతి, తెల్ల చొక్కా, భుజాన ఉత్తరీయం, చేతిలో గొడుగుతో ఓ నడివయసు వ్యక్తి పరుగులాంటి నడకతో నా వైపే రావటం చూసి ఆశ్చర్యపోయాను.

ఆయన్ని ఎక్కడో చూసినట్టు అనిపించింది. మళ్ళీ అంతలోనే చూస్తుంటేనే 'కుచేలుడి తమ్ముడిలా ఉన్న ఈయనతో నాకు పరిచయం ఏమిటి?' అన్న అహం అడ్డొచ్చింది. కట్టుకుంది తెల్లబట్టలే అయినా నీరు కావి రంగు కొచ్చేసాయి. ఇస్త్రీలేదు. అన్నీ ముడతలే.

మొహం కూడా జిడ్డు కారుతూ ఉంది.

"నన్ను పిలిచారా మీరు?" అన్నాను అనుమానంగా. ఆయన్ని 'మీరు' అని పిలవటానికి మనస్కరించకపోయినా కనీస మర్యాదగా అలా పిలవక తప్పలేదు అపరిచితుడు గనుక.

"అవును మిమ్మల్నే పిలిచాను. మర్చిపోయారా. మీరు నాకు ముప్పయి రూపాయలు ఇవ్వాలి. ఆ రోజు తీసుకున్నారు." అన్నాడు రొప్పుతూ.

"మీ దగ్గర నేను డబ్బులు తీసుకోవటం ఏమిటి? ఏం మాట్లాడుతున్నారు మీరు?" అన్నాను చిరాకుగా.

"అయ్యో అలా ఎలా మర్చిపోయారండీ!? నా కయితే ఎవరి దగ్గరనన్నా డబ్బులు బదులు తీసుకుంటే మళ్ళీ తిరిగి ఇచ్చిందాకా మెంటల్ పీస్ ఉండదు. నేను ఎవరికయినా ఇచ్చినా మళ్ళీ వసూలు చేసుకుందాకా అంతేననుకోండి. మరి మీరేంటి. అలా ఎలా మర్చిపోయారు."

"మీరెవరో నాకు తెలియదు. మీ దగ్గర నేను డబ్బులు తీసుకోవటం ఏమిటి అసహ్యంగా అయినా ఒకళ్ళ దగ్గర డబ్బులు తీసుకోవాల్సిన అవసరం నాకేంటి?" అన్నాను కోపంగా అసహనంగా.

"బాగా గుర్తుతెచ్చుకోండి. ఆరోజు వర్షం పడుతోంది. రేషన్ షాపుకని వచ్చి ఆ రోజు గొడుగు మర్చిపోవటంతో తడుస్తూ రోడ్డుమీద నుంచున్నాను. ఇంతలో మీరు కారులో అటు వస్తూ కనిపించారు. కొంత దూరమన్నా లిఫ్ట్ దొరికితే అక్కడినుంచి ఎలాగోలా ఇల్లుచేరుకోవచ్చునని. కారుకు అడ్డంగా వచ్చి లిఫ్ట్ అడిగాను. మీరు నాకు లిఫ్ట్ ఇవ్వటం ఇష్టం లేదన్నట్టు ముఖం పెట్టారు. అయినా మిమ్మల్ని నేను వదలలేదు. ప్లీజ్ ప్లీజ్ అంటూ పీడించుకు తిన్నాను. 'పోనీలెండి పాపం. పేద బ్రాహ్మణుడిలా ఉన్నాడు.' అన్నాడు డ్రైవర్ డోర్ తీస్తూ వచ్చి అతని పక్కన కూర్చున్నాను రేషన్ సంచి తడవకుండా పట్టుకుంటూ. ఆ తర్వాత మీరు ఒక దగ్గర కారు ఆపించి డ్రైవర్‌ని వెళ్ళి సిగరెట్ పెట్టెలు పట్టుకురమ్మని వెయ్యిరూపాయల నోటిచ్చారు. అతడు చిల్లర లేదంటున్నాడని 'తిరిగి వస్తే 'ఆ వెయ్యి రూపాయలకు ఎన్ని వస్తే అన్ని ఇమ్మను' అన్నారు మీరు కోపంగా.

'అన్ని లేవట' అని మళ్ళీ తిరిగొచ్చాడు డ్రైవర్ 'తన దగ్గరా డబ్బులేవన్నట్టు జేబులు తడుముకుంటూ.

"నా దగ్గర ముప్పయి రూపాయలున్నాయి" అన్నాను నేను జేబులో నుంచి పర్సు తీస్తూ. నా పాత పర్సువంకా నా చేతిలోని డబ్బుల వంకా మీరు మార్చి మార్చి చూస్తుండగానే డ్రైవర్ ఆ డబ్బులు తీసుకుని మీ దగ్గరున్న మరి కొన్ని పదిరూపాయల నోట్లు తీసుకుని ఒక సిగరెట్ డబ్బా తెచ్చాడు.

ఇవ్వటానికయితే ఇచ్చాను గానీ మీరెవరో ఎక్కడుంటారో మళ్ళీ ఆ డబ్బులు రాబట్టుకోవడం ఎలాగో తెలియక ఆ తర్వాత బోలెడు ఖంగారు పడిపోయాను.

అడ్రసు తెలుసుకుని ఉంటే ఎందుకయినా మంచిదని మీ డ్రయివర్‌ను 'సార్ ఎక్కడుంటాడు?' అని మాటల్లో పెట్టాను. మా వీధిలోనే. ఇంకొంచెం ముందుకు ఉంటారని గోధుమ రంగు మూడంతస్తుల మేడ మీదేననీ తెలిసి బోలెడు ఆనందపడిపోయాను. ఆ రోజు మా ఇంటి దగ్గరకు రాగానే 'ఒక్క నిముషం కారు ఆపమని' చెప్పి దిగిపోయి ఆ మర్నాడు, ఆ తరువాత రెండు సార్లు బాకీ వసూలు కోసం మీ గేటు ముందుగా చూసుకుంటూ వెళ్ళానుగానీ ఆల్సేషియన్ కుక్క నన్ను చూసి 'భౌ! భౌ!' మని అరిచింది. సెక్యూరిటీ గార్డుకు నా తెలుగు అర్థంకాక 'జావ్! జావ్!' అన్నాడు ' అని ఆయన చెబుతూ ఉంటే ఆ వింత వ్యక్తిని చూసి బోలెడు ఆశ్చర్యపోయాను నేను.

'ఉన్నవాళ్ళ ప్రాపకం కోసం దిగువ మధ్యతరగతివాళ్ళు తెగ ఆరాటపడటం నాకు తెలుసు. కానీ ఈయనేమిటి 'ముప్పయిరూపాయలు బాకీ ఉన్నావంటూ 'నక్షత్రకుడిలా' నా వెంటపడి ఇలా వేధిస్తున్నాడు. విచిత్రం కాకుంటే కట్టలు కట్టలు డబ్బులు ఎప్పుడూ బ్రీఫ్ కేస్‌లో ఉంచుకునే నేను ముప్పయి రూపాయల అప్పును నా ప్రమేయం ఏకుండానే నేను ఈయన దగ్గర చేయటం ఏమిటి?' దానికి ఈయన లక్షల్లో, కోట్లో బాకీ పడ్డట్టు ఇంత బిల్డప్ ఏంటి? ఇన్ని కార్లున్న నాకు వాకింగ్ ఖర్మ పట్టినట్టు. ఇది అలాంటిదేనా?! అనిపించింది.

ఆ తరువాత ఎలాగయినా ఆయన్ని వదిలించుకోవటం కోసం చటుక్కున జేబులో నుంచి పర్స్ తీసాను. కొన్ని వంద రూపాయల నోట్ల మధ్య ఓ యాభై రూపాయల నోటు కనిపిస్తే తీసి ఇవ్వబోయాను.

"మళ్ళీ ఛేంజ్ ప్రోబ్లమా? నా దగ్గరా ఇరవై రూపాయలు లేవు" అన్నాడు ఆయన జేబులు తడుముకుంటూ.

"ఫరవాలేదు ఉంచండి" అన్నాను నాకు ఇదొక లెక్క కాదన్నట్టు.

"ఈ ఇరవై అప్పు తీర్చటం కోసం మళ్ళీ మీరెక్కడ కనబడతారా అని వెతుకుతూ ఉండాలి నేను"

"తీర్చనవసరం లేదు!"

"అలా చేస్తే మీ ఋణాన పడి ఈ బాకీ తీర్చడం కోసం మళ్ళీ మరో జన్మ ఎత్తాల్సి ఉంటుంది నేను. అంతా ఋణానుబంధమే కదండీ" అన్నాడు.

ఆయన మాటలు ఆయన నమ్మకాలు నాకు ఆశ్చర్యాన్ని కలిగించాయి.

"ఇప్పుడేం చేయమంటారు?" అన్నాను యాభై నోటు ఆయనకు చూపిస్తూ విసుగ్గా.

"మా ఆవిడ ఎలాగూ ఓ పావుకిలో చింతపండు తెమ్మంది. అదిగో ఆ ఎదురుగా కనిపించే కిరాణా కొట్లో అది తీసుకుంటే చిల్లర ఎలాగూ వస్తుంది గనుక మీ ఇరవై మీరు తీసుకోవచ్చు" అంటూ నా చేతిలోని నోటు తీసుకుని అడుగులో అడుగేస్తూ వెళ్ళాడు ఆయన.

'ఈ ప్రపంచంలో ఇంత విచిత్రవ్యక్తులు ఉన్నారా' అనుకున్నాను. అక్కడే నిలుచుండిపోతూ వచ్చేటప్పుడు నడవలేక నడుస్తున్నట్లుగా వచ్చి - "మోకాళ్ళ నొప్పులండీ బాబూ! అట్టే నడవలేను. అలాగని ఇంట్లో కూర్చుండే పనులెలా అవుతాయి? మా పెద్దమ్మాయి వాళ్ళు ఇక్కడే ఉంటారు. మా మనవడికి ఐదారు రోజుల నుంచి హై టెంపరేచర్. చూసి మందులకూ వాటికీ కాసిని డబ్బులిచ్చిపోదామని వచ్చాను. వాళ్ళదీ అంతంత మాత్రం సంసారమేనాయె. పిల్ల ఇబ్బంది పడుతుంటే చూస్తూ ఊరుకుండలేదుగా నా ప్రాణం." అని నాతో మాట్లాడుతూ నడుస్తూనే వెనకనుంచి వస్తున్న ఓటూవీలర్ ను 'లిఫ్ట్ ప్లీజ్' అని అడిగి "వస్తానయ్యా.. మళ్ళీ ఇలాగే ఇంకోరోజు కలుద్దాం!" అంటూ తుర్రున వెళ్ళిపోయాడు ఆయన. ఆయన ఆ చొరవ - బతకనేర్చినతనం చూసి నేను మరోమారు ఆశ్చర్యపోయాను.

ఇంటికెళ్ళాక, ఆయన గురించి నా భార్య మంజులకు చెబితే 'పాపం !' అని సానుభూతి వ్యక్తం చేసింది ఆయన గురించి తనకు అంతా తెలిసిపోయినట్టు.

'అయినా కరెక్ట్‌గానే గెస్ చేసి ఉంటుంది ఆయన్ని. ఎందుకంటే ఈవిడా ఆ కేటగిరీ మనిషేగా ఎవరి 'దగ్గరి' వాళ్ళ గురించిన విషయాలు వాళ్ళకే బాగా తెలుస్తాయి' అనుకోగానే మా పెళ్ళి ఫ్లాష్ బ్యాక్ కళ్ళముందు మెదిలింది.

మంజుల చాలా అందంగా ఉంటుంది. కన్నెపిల్లగా అప్పుడు ఇంకా బాగుండేది. పచ్చటి వంటి రంగు మాట్లాడుతున్నట్టుండే అందమైన కళ్ళు వత్తైన పొడవాటి నల్లటి జడపొడుగ్గా నాజూగ్గా ఉండే పర్సనాలిటీతో చూడగానే నన్ను ఆకర్షించింది. మా అమ్మకు ఆ అమ్మాయిని చూపిస్తే - వెంటనే తన గురించి ఎంక్వయిరీ చేసింది.

'అమ్మాయి బాగుంది కానీ మన లెవల్‌కు సరిపడినవాళ్ళు కాదు. మధ్యతరగతి కుటుంబం. అయినా నాకు అభ్యంతరం లేదు. ఎందుకంటే కోడలిని తక్కువ ఇంటినుంచి తెచ్చుకోవాలని అంటారు. అలాంటి పిల్లలయితే మనం చెప్పినట్టు నడుచుకుంటారు. భయభక్తులతో ఉంటారు. ఇక ఆలోచించుకోవలసింది నువ్వే!' అంది.

ఆ క్షణంలో ఆ అమ్మాయి అందం. ఆ అందంతో పొందు తప్ప మరేమీ కనిపించలేదు. ఓకే చెప్పేసాను. రూపాయి కట్నం లేకుండా పెద్దింటి పిల్లాడు అల్లుడిగా దొరికినందుకు మంజుల తండ్రి తెగ మురిసిపోయాడని తెలిసింది.

కానీ - ఎందుకనో ఆ రోజు నుంచీ ఈ రోజు వరకు మంజుల కళ్ళల్లో మాటల్లో బాడీ లాంగ్వేజ్‌లో ఎక్కడా నాకు తనని పెళ్ళిచేసుకున్నందుకు కృతజ్ఞతగానీ అర్హతను మించి పెద్దింటి కోడలయినందుకు భయ, భక్తులు గానీ వంగివుండే తత్వంగానీ కనిపించలేదు. ఎప్పుడూ తను నాకు సాల్వ్‌కాని ప్రోబ్లమ్‌లాగే కఠినంగా అనిపిస్తుంది. 'ఈవిడ మరో విచిత్రవ్యక్తిలా ఉంది. ఇందాక ఆ ముప్పయి రూపాయల పెద్దమనిషి గురించి చెప్పి 'విచిత్రవ్యక్తి', అని నేను అంటే - వెంటనే అందుకుని - 'ఆయన విచిత్రవ్యక్తికాదు మీకు అర్థంకాని వ్యక్తి. అందరూ అందరికీ అర్థం కారు. ఒక మెట్టు ఎక్కటమో - ఒక మెట్టు దిగటమో చాతకానప్పుడు ఎదుటివాళ్ళ బతుకు చిత్రాలు ఒక పట్టాన అర్థంకావు' అంది మంజుల. మారుమాట్లాడకుండా ఉండిపోయాను నేను.

మంజుల మనసే కాదు - మాటలూ సరిగా నాకు అర్థం కావు. అర్థంకాని విషయం గురించి తలబద్దలు కొట్టుకునే అలవాటు సమయం నాకు లేవు.

●●●

ఇంగువ కట్టిన గుడ్డ వాసనలు పోనట్టు నా భార్య మంజులకు నేనెంతటి ఖరీదయిన జీవితాన్ని ఇచ్చినా పెళ్ళికాకముందు పుట్టింట్లో ఎంత సాధారణ జీవితాన్ని గడిపిందో అలాగే ఉంటుంది. తండ్రి చాలీచాలని జీతపు బడిపంతులు ఉద్యోగం వెలగబెట్టేవాడు. మగసంతానం కోసం ఎదురు చూస్తూ చ్యూబీతూ ఐదుగురు ఆడపిల్లలను కన్నారు. మా అత్తరు అనువైన చీరకట్టుకోగా పుస్తెలు, నల్లపూసలు తప్ప అదనపు నగపెట్టుకోగా నేనెప్పుడూ చూడలేదు. మంజులను కోరి నేను పెళ్ళి చేసుకుంటాననగానే కట్నం బాధ తప్పిందని తెగసంతోషపడిపోయారు.

ఆ కృతజ్ఞత ఇప్పటికీ వాళ్ళలో కనిపిస్తుంది గానీ మంజుల మాత్రం 'ఇదొక ఘనకార్యమా?' అన్నట్టు మామూలుగా ఉంటుంది.

నా వైభవాన్ని చూస్తూ మంజులను చూసేవాళ్ళు 'చాలా సింపుల్ మనిషి' .. నిగర్వి' అంటారు.

నాకు మాత్రం అలా అనిపించదు. ఉన్నదాన్ని అనుభవించటం చేతగాని మనిషి' అనిపిస్తుంది. 'డాబు, దర్పం, డిగ్నిటీ పుట్టకతో రక్తంలో రావాలిగానీ మధ్యలో నేర్పిస్తే వచ్చేవి కావు' అనిపిస్తుంది. 'పనివాళ్ళ దగ్గర తక్కువ మాట్లాడుతూ యజమాని హోదాతో

అధికారం చలయిస్తూ ఠీవిగా ఉండాలని' ఎన్నోసార్లు చెప్పాను. అయినా వినదు. వాళ్ళ కష్ట సుఖాలు, అవసరాలు అన్నీ తనకే కావాలి. ఇందాకటి నుంచీ మా పనిపిల్ల లక్ష్మితో ఎలా ముచ్చట్లు చెబుతోందో వింటుంటే ఒళ్ళంతా కంపరం పుడుతోంది.

"నిన్న పనికి రాలేదేమే మళ్ళీ మీ అక్కకు బాగోలేదా?"

"బాగలేదమ్మా.. మాటా పలుకూ లేకుండా అయిపోయింది. బతకదంటున్నారు డాక్టర్లు. ఏదో కిడ్నీలజబ్బట. హాస్పటల్ ఖర్చులకు వేలకు వేలు అవుతున్నాయి. 'చచ్చింది కాదు బతికింది కాదు' అంటూ మా నాయన తలపట్టుకుంటున్నాడు. "

"పిల్లలు కదూ?"

"ఆ ఇద్దరు పిల్లలు మా అక్కకేమన్నా అయితే ఇక ఆ పిల్లల్ని ఎవరు చూడాల? అందుకే నన్ను ఇద్దామనుకుంటున్నారు మా బావకు"

"నీ కిష్టమేనా మరి మీ బావను చేసుకోవటం?"

"ఇష్టమైనా కష్టమైనా తప్పదు కదమ్మా! మా అక్క రోగానికి ఇంతపెట్టి రేపు మళ్ళీ నాకు కట్నం ఇచ్చి పెళ్ళి చేయటమంటే మా నాయన వల్ల అయిద్దా? నన్నిస్తే మా బావ ఎదురుకట్నం ఇస్తానంటున్నాడు. ఆ డబ్బులు మా చెల్లి పెళ్ళికయినా పనికొస్తాయి కదా..?"

"ఇంత చిన్న వయసుకే ఎన్ని ఆలోచనలే నీకు?" అని పనిపిల్లను మెచ్చుకుంది మంజుల.

నాకు మాత్రం వళ్ళు మండిపోయింది.

అది వెళ్ళిపోయాక మంజులతో అన్నాను. "ఏంటి అంతగా మెచ్చుకుంటున్నావ్ ఆ పిల్లను - పెద్ద తెలివిగలది అయినట్లు. చావుబతుకుల్లో ఉన్న బిడ్డను 'చచ్చింది కాదు బతికింది కాదు' అనే తండ్రి ఇంకా చావక ముందే పెళ్ళి బేరాలు. డబ్బు! డబ్బు! ఈ పేదోళ్ళు డబ్బు కోసం ఏమయినా చేస్తారు. నీతి, నియమం, మంచి చెడు లేని మనుషులు!" అన్నాను ఈసడింపుగా.

"ఒడ్డున కూర్చున్నవాడు నీటమునుగుతున్న వాడిని చూసి ఆసరా ఇవ్వకుండా 'అలా ఎలా మునుగుతున్నావ్ పడేటప్పుడు కళ్ళు కనబడలేదా?' అని విమర్శించినట్టుగా ఉంది మీ పద్ధతి. దూరంగా ఉండి చూస్తే కొంతమంది జీవితాలు... అందరికీ అర్థం కావు. అది అంతే! ' అంది క్లుప్తంగా, తనేమన్నదో ఎవరిని ఉద్దేశించి అన్నదో అర్థం కాక ఇక అనవసర విషయాన్ని పొడిగించే ఓపిక లేక నేనూ కామ్‌గా ఉండిపోయాను.

మా వంటమ్మగారు "అమ్మాయ్! కూర ఏం చేయమంటావ్?"

అని వంటింటి గుమ్మంలో నుంచి తొంగి చూస్తూ అడగటంతో మంజుల కూడా అటువైపు వెళ్ళింది.

మా వంటమ్మగారి పేరు పార్వతమ్మ.

'మారువేషంలో ఉన్న సాక్షాత్తు ఆ పార్వతీదేవే!' అంటుంది మంజుల ఆవిడ గురించి చెప్పేటప్పుడు.

గోధుమ రంగు శరీర ఛాయితో కళగా ఉండే ముఖం మీద అర్ధరూపాయి బిళ్ళంత కుంకుమ బొట్టుతో నడిపాత గోరంచు జరీ చీరతో మెళ్ళో పసుపుతాడు, నల్లపూసల దండతో నిండుగా ఉంటుంది ఆవిడ 'మనిషి' మాత్రమేకాదు 'పని' కూడా బాగుంటుంది. శుచిగా రుచిగా వంట చేస్తుంది. పని అయిపోయక వంటిల్లు శుభ్రంగా సర్ది మంజుల ఏ కూరో, పప్పో ఇస్తే ఇంటికి పట్టుకెళుతుంది. 'ఇక్కడ భోజనం చేసి వెళ్ళండి' అంటే 'వద్దమ్మా! నా కోసం మా ఆయన ఎదురు చూస్తూ ఉంటారు. ఆయనకు పెట్టందే నాకు ముద్ద నోటికి పోదు' అంటుంది.

ప్రతి పనీ స్వయంగా తనే చేసుకోవటానికి ఇష్టపడే మంజుల ముందు వంటమనిషి వద్దంటే వద్దంది. నేనే మంజుల హోదాను, దర్పాన్ని నా లెవల్‌కి తగ్గట్టుగా పెంచడం కోసం ఎవరికో చెప్పి ఆ వంటావిడను తెప్పించాను. మంజుల అంచనాలను తల్లక్రిందులు చేస్తూ

ఇంటిమనిషిలా ఆవిడ వంట బ్రహ్మాండంగా చెయ్యటం నూనె మరకలు, అన్నం మెతుకులు లేకుండా వంటగదిని నీట్‌గా కడిగి శుభ్రంగా ఉంచటంతో మంజులకు ఆవిడ వంటగదిని నీట్‌గా కడిగి శుభ్రంగా ఉంచటంతో మంజులకు ఆవిడ తెగనచ్చేసింది.

ఆవిడ వంట తింటుంటే అచ్చం వాళ్ళ అమ్మ చేతి వంటలా ఉంటుందని పోయిన వాళ్ళ అమ్మను తలుచుకుంటూ ఆవిడను 'అమ్మా!' అని పిలుస్తుంది.

ఆవిడ సైతం మంజులను 'అమ్మాయ్!' అని పిలుస్తుంది. ఉదయం పదిగంటలకు వచ్చి మధ్యాహ్న భోజనంతో పాటు అదనంగా రాత్రికి మరో కూర చేసి హాట్ ప్యాక్‌లో పెట్టి వెళ్ళిపోతుంది. అన్నం ఒక్కటే మంజుల ఎలక్ట్రిక్ కుక్కర్‌లో వండేస్తుంది. అదిగాక ఎప్పుడు ఎక్స్‌ట్రా ఏ పని పడినా నౌకర్లను పంపించి వంటమ్మగారిని పిలిపించుకుంటుంది మంజుల. ఏ లడ్డూనో, జంతికలో చేయాలన్నా గుమ్మడికాయ వడియాలు పెట్టాలన్నా ఆవిడకు కబురు వెళ్ళాల్సిందే ఆవిడ రావాల్సిందే మా ఇంట్లో మనిషిలా అలా కలిసిపోయింది పార్వతమ్మగారు.

మంజులా అంతే. ప్రతి దసరా పండగకి ఆవిడకు చీరతో పాటు ఆవిడ భర్తకు పంచల చాపు పంపించడం, అడపాదడపా డబ్బు అవసరాలు ఏది పడినా సమయానికి సాయం చేసి ఆదుకోవటం చేస్తుంటుంది.

ఆవిడ కూడా పైసలతో సహా లెక్కగట్టి మంజుల దగ్గర తీసుకున్న చేబదుళ్ళు తీరుస్తూ ఉంటుంది.

మా ఇంటికి వచ్చిన ఎవరయినా వాళ్ళిద్దరి అన్యోన్యం చూసి ముక్కున వేలేసుకుంటూ ఉంటారు.

'పనివాళ్ళను ఎక్కడి వాళ్ళను అక్కడ ఉండనివ్వాలి' అని ప్రతిరోజూ చెప్పే నేనే వంటమ్మగారి విషయంలో మాత్రం ఆ అంతరం చూపించకపోవటం నాకే ఆశ్చర్యం వేస్తూ ఉంటుంది.

●●●

జీవితంలో అనుకోకుండా తారసపడే వ్యక్తులు కొంతమంది వదిలించుకుందామన్నా వదలకుండా పదే పదే తారసపడుతూ విసిగిస్తూ ఉంటారు. కాళ్ళకు బంధాలు వేస్తూ ఉంటారు. మాట్లాడటం మనకు ఇష్టం లేకపోయినా మాట్లాడిస్తూ ఉంటారు. 'వాళ్ళతో ఏ వ్యవహారం అయినా మనకు బిలో డిగ్నిటీ' అనిపించినా అది అర్థం చేసుకోకుండా రాసుకుని పూసుకుని తిరగాలనుకుంటారు.

అది నాకు చాలా చిరాకుని, అసహనాన్ని కలిగిస్తూ ఉంటుంది. అయినా 'ఎంతటివారలయినా' అన్నట్టు ఒక్కోసారి మన లెవల్‌ని తగ్గించుకుని వాళ్ళ లెవెల్‌కి దిగజారక తప్పని సందర్భాలు వస్తుంటాయి. ఒక సామాన్యుడిలా రోడ్డుమీద 'వాకింగ్' పేరిట నడవాల్సి వస్తున్నప్పటి నుంచీ ఈ నేలబారు మనుషులతో కలయిక, మాటామంతీ తప్పడం లేదు నాకు.

ఆ రోజూ అలాగే స్టిక్ చేతబట్టుకుని పెద్ద పెద్ద అంగలతో వాకింగ్‌కి వెళుతుంటే తన ఇంటి వీధి అరుగు మీద కుర్చున్న ఆ పెద్దమనిషి అదే ఆ నక్షత్రకుడు ఆ కుచేలుని తమ్ముడు మళ్ళీ వెనకనుంచి "శ్రీపతిగారూ ఏమండోయ్ మిమ్మల్నే" అంటూ ఒక్క గావు కేకపెట్టాడు.

నడిపాత పంచెతో వంటి మీద జంధ్యం పోగు తప్ప బనీను లేకుండా ఒక కాలు ముడిచి ఒక కాలు జాపి ఆయన అరుగుమీద కూర్చున్న ఆ తీరు నాకు అసహ్యం కలిగించింది. 'అలా ఆరుబయట రోడ్డుమీద అరుగు మీద ఎలా కూర్చోబుద్ధవుతుందో ఈ మనుషులకు లేకి మనుషులు. లేకి చేష్టలు అనుకున్నాను. ఆ తరువాత –

'మళ్ళీ పిలుస్తున్నాడు మళ్ళీ ఈయనకు నేనేమీ బాకీపడలేదుకదా!' అనుకున్నాను.

"ఇదే మా ఇల్లు రండి ఒకసారి లోపలకు" అని కూర్చున్నచోటు నుంచి లేచి లోపలికి దారి చూపిస్తుంటే నా స్థాయిని కించపరుస్తూ ఆయన చూపిస్తున్న ఆ అతి చనువుకు అవమానంగా అనిపించి కోపం కూడా వచ్చింది.

"నేను వెళ్ళాలి!" అన్నాను మొండిగా.

"వెలుదురుగాని లెండి. వాకింగ్ కేగా ఎదో ఒకటి రెండు సార్లు అనుకోకుండా కలుసుకుని పరిచయస్తులమయ్యాం. పైగా ఒక వీధిలో ఉంటాం ఏదో కాస్త కాలక్షేపం నాలుగు కబుర్లు చెప్పుకుంటే ప్రాణానికి హాయిగా ఉంటుంది!" అని జిడ్డులా పట్టుకోవడంతో లోపలికి వెళ్ళక తప్పలేదు నాకు.

ఒక పాత నవారు మంచం రెండు చెక్క కుర్చీలు. నాపరాళ్ళు పరిచిన ఇంటి గచ్చు పెచ్చులు ఊడుతున్న పాత సున్నంగోడలు చూసి ఆయన ఇంట్లో తాండవమాడుతున్న దరిద్రాన్ని నేను అంచనా వేయగలిగాను. ఇంటిముందు ఏపుగా పైకి ఎగబాగుతున్నట్లున్న పెద్ద పెద్ద ఆకుల పచ్చటి మనీప్లాంట్ మాత్రం తీగసాగి చూడగానే నన్ను ఆకర్షించింది. గుమ్మానికి అటూ ఇటూ ఉన్న రెండు మొక్కలు పైకి పాకాక ఆర్చిలా తయారై ఇంటికి వచ్చినవారికి ఆహ్వానం పలుకుతున్నట్టు ఉన్నాయి.

వాటివంటే చూస్తున్న నన్ను ఉద్దేశించి "మనీప్లాంట్ ఇంట్లో ఉంటే క్రమక్రమంగా అది పెరుగుతున్నట్టే. మన ఇంట్లో కూడా మనీ పెరుగుతుందని ఎవరో చెబితే ఒకటి కాదు రెండు మొక్కలు తెచ్చి వేసాను. అవి పచ్చగా ఏపుగా పెరుగుతున్నాయిగానీ ఇంట్లో మనీ మాత్రం ఎప్పుడూ నిల్లే!" అన్నాడు ఆయన నోరంతా తెరిచి పెద్దగా నవ్వుతూ.

ఆ నవ్వు ఎందుకో అయాయకంగా తమాషాగా అనిపించింది నాకు. ఆయనే అన్నాడు "అయినా.. ఏదో నమ్మకం అదొక వెర్రి ప్రయత్నం అంతేగానీ మనీప్లాంట్ పెడితే మనీ వస్తుందటండీ. కష్టపడి సంపాదిస్తే వస్తుందిగానీ, అసలు ఈ మొక్కకు ఆ పేరు పెట్టినవాడ్ని అనాలి. అనవసరంగా ఇంతమందిలో ఎంతో ఆశ కల్పిస్తున్నందుకు. నా చిన్నప్పుడు మా నాన్నని అవీ, ఇవీ కొనుక్కోవడానికి రూపాయో, అర్థో అడిగితే "డబ్బులు ఇక్కడ చెట్లకు కాస్తున్నాయటరా వెధవా! ఒక్క పైసా స్వయంగా సంపాదించి చూడు అప్పుడు తెలుస్తుంది అందులోని సాధకబాధకాలు ఏమిటో!' అనేవాడు.

ఉన్నంతలో సర్దుకుపోయే తత్వాన్ని డబ్బు విషయంలో నిక్కచ్చితనాన్ని మనకున్న దాంట్లోనే మరొకరికి పెట్టే తత్వాన్ని ఆయన నుంచే నేను నేర్చుకున్నాను. తృప్తిలేనివాడికి ఎక్కడి డబ్బూ సరిపోదు. అది ఉన్నవాడికి పైసాలో పరమాత్మ కనిపిస్తాడు. డబ్బు అవసరం ఉన్న సాటి మనిషి కనిపిస్తాడు." అనగానే నాకు బుద్ధుడిలా బోధి వృక్షం కింద కూర్చుని ఉన్న భావం కలిగింది. నేనలా ట్రాన్స్‌లో ఉండగానే ఆయన లోపలికి వినిపించేలా "ఇదిగో ఏం చేస్తున్నావ్. మన ఇంటికి ఓ అతిథి వచ్చారు కాస్త వేడిపానీయమో శీతలపానీయమో ఏదయినా" అని భార్య నుద్దేశించి కాబోలు అన్నారు.

ఆయన మాటలు ఇంకా పూర్తికాకుండానే గుమ్మానికి తీగతో తగిలించిన 'పాత చీర కర్టెన్'ను తొలగించుకుని ఓ పెద్దావిడ మెల్లిగా బయటికి వచ్చింది. ఆమె చేతిలో స్టీలు గ్లాసు ఉంది. ఆమెను చూసీ చూడగానే ఆశ్చర్యంతో అలాగే ఉండిపోయాను నేను. ఆవిడ మా వంటమనిషి పార్వతమ్మగారు.

ఆవిడా నన్ను చూసి ఆశ్చర్యపోతూ "మీరా?!" అని, భర్తవైపు తిరిగి "వీరింట్లోనే నేను వంట చేసేది!" అంది.

"అవునా! అయితే ఇంకేం మనం మనం కావల్సిన వాళ్ళమే. ఆ దేవుడు చెట్టుమీది కాయకు సముద్రంలోని ఉప్పుకూ ఆవకాయకారం జాడీలో లింకు పెట్టినట్టు మనిషికీ మనిషికీ చిత్ర విచిత్ర బంధాలతో అనుబంధాలతో అవసరాలతో ఎలా లింకు పెడతాడో చూడు. అదే మనిషికి కావాల్సిన మనిషి సంపాదించుకోవల్సిన అసలు ధనం. మనింట్లో ఈ మనీప్లాంట్ పెంచడం వల్లే అనుకోకుండా ఇబ్బడి ముబ్బడిగా మనకు ప్రతినిత్యం ఆ ధనం దొరుకుతోంది. చూసావా నా నమ్మకం వమ్ము కాలేదు" అన్నాడు ఆయన చిన్నపిల్లాడిలా మురిసిపోతూ సాటిమనిషి కనిపించగానే ఆయన పొందే ఆనందం గతంలో రెండు సార్లు నేను గమనించిందే గనుక అప్పుడు కొత్తగా నాకేమీ అనిపించలేదు. చిన్నపిల్లాడిలా మారిపోయి ఉల్లాసంగా, ఉత్సాహంగా చనువుగా, నిర్మొహమాటంగా, ప్రేమగా వాళ్ళతో

మసలుతాడు. వాళ్ళ అవసరాలు తీరుస్తూ తన అవసరాలు తీర్చుకుంటూ ఉంటాడు. లేనిపోని అహాలతో బిగుసుకుపోయో తెచ్చిపెట్టుకున్న మొహమాటాలతో దూరం పెంచో కాక కలివిడిగా ఉంటాడు' అంటూ ఆయన వ్యక్తిత్వాన్ని అంచనా వేయడం మొదలు పెట్టింది నా మనసులో రేఖామాత్రంగా ఏదో అపరాధ భావం తొంగిచూసింది. అహం అక్కడికక్కడే తోకముడిచినట్లు అనుభవమయింది.

"టీ తీసుకోండి" అంది పార్వతమంగారు నన్ను ఉద్దేశించి. నీళ్ళలో టీపొడి వేసి మరిగించి కొద్దిగా పాలు పోసి తయారు చేసిన ఆ టీ నాకు అమృతంలా రుచించింది. వాళ్ళ మనసుల్లాగే ఆ ఇంట్లోనుంచి బయటకు వస్తుంటే గురుకులంలో చదువుకుని వస్తున్న భావన.

●●●

## త్రితంత్రం

### డా.మూలా రవికుమార్

**"భామా కలాపం గురించి విన్నావా?" మా ఆవిణ్ణడిగాను.**

"నేను మిలట్రీ కేంటిన్‌లో సబ్బులూ పేస్టులూ తెమ్మంటే భామా కలాపం ఏమిటి?"

"చెబుతా. ముందు నేనడిగింది చెప్పు."

"పేరు విన్నాను. దానిగురించి పెద్దగా తెలీదు."

"కూచిపూడిలో అది ఒక ప్రక్రియ. శ్రీకృష్ణుడి (ప్రేమ) కోసం సత్యభామా, రాధా వాదులాడుకోవడం. నాట్యపరంగానే కాక సాహిత్య పరంగా కూడా చాలా గొప్ప ప్రక్రియ."

"అయితే?"

"అందులో ఉన్న హాస్యపాత్రని శ్రీకృష్ణుడు 'మాధవరాయా' అనే పురుష పేరుతోనూ, సవతులిద్దరూ 'మాధవీ' అనే చెలికత్తెగానూ పిలిస్తే, సందర్భానికి తగ్గ హాస్యం ఒలికిస్తాడా పాత్రధారి."

"విషయం చెప్పకుండానే ఇంత ఉపోద్ఘాతమా! పిల్లలకి పాఠాలు చెప్పడానికి కొంచెం బుఱ్ఱ మిగల్చండి."

"ఉపోద్ఘాతం అయింది. అందులో కృష్ణుడు, 'మాధవరాయా, పదునాలుగు భువనములూ, ముల్లోకములూ నాయందేయున్నవి. నాబాల్యమున నా తల్లి యశోదకు నోరు తెరిచి చూపించితినీ అని గంభీరంగా చెబితే, 'స్వామీ, చిన్నపనుంది ఒక్కసారి నోరుతెరుస్తారా' అని అడుగుతాడు. 'ఎందులకు మాధవరాయా?' అంటే, 'స్వామీ, నిన్న నేను పద్యాలు సాధన చేసుకుంటూ, పశువుల పాకలోకెళితే, మా గేద ఝుడుసుకుని, కట్టుతెంపుకుని పారిపోయింది. ఎంతవెతికినా దొరకలేదు. మీరు నోరు తెరిస్తె, ఎవరిపొలంలో ఉందో చూసి వెళ్ళి తోలుకొస్తాను, అసలే చూడిగేదె అంటాడు, హాస్యగాడు."

అంత అసహనంలోనూ గలగలా నవ్వి, "హాస్యం బాగానే ఉంది ఇప్పుడెందుకు చెప్పినట్టు?" అని అడిగింది.

"ఇండియన్ ఆర్మీలో ఆఫీసర్ పోస్టుకి ఇంటర్వ్యూ పిలుపు వచ్చిందని నేను సంతోషిస్తూ ఉంటే, వెయ్యి కిలోమీటర్ల దూరం నుంచి, రూపాయీ, అర్థరూపాయీ తగ్గుతుందని సబ్బులూ, పేస్టులూ తెమ్మంటావా? ఐనా కేంటిన్ సదుపాయం సెలెక్టయ్యాక

ఉంటుంది గానీ, అదేమీ పచారీ దుకాణం కాదు. అక్కడ ఐడెంటిటీ కార్డూ వగైరాలు చూపించాలి. ఇంటర్వ్యూ కొచ్చే వాళ్ళకేమీ ఇవ్వరు. అయినా కాశీవెళ్ళి గాడిదని మోసుకొచ్చేరట, చవగ్గా దొరికిందని.''

ఆర్మీలో సివిల్ ఇంజనీర్లకి షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీకోసం నేను పంపిన దరఖాస్తు అంగీకరింపబడి, మౌఖిక పరీక్షకి హాజరు కమ్మని వచ్చిన ఆహ్వాన పత్రం చూసి మా ఆవిడ, వస్తూ వస్తూ, ఆర్మీ కేంటిన్‌లో సబ్బులూ పేస్టులూ తెమ్మని చెప్పిన తరువాత మా మధ్య పై సంభాషణ జరిగింది.

నిజానికి నేనీ ఇంటర్వ్యూ కెళ్ళటం ఆవిడకిష్టం లేదు.

మూణ్రోజుల కిందట పోస్టు చూడగానే అంది, 'ఆర్మీలోకి వెళ్ళొద్దు'ని.

''అది ఉజ్జోగంలో చేరమని వచ్చిన కబురు కాదు. ఐనా నేను చేరాలనుకోగానే ఎర్రతివాచీ పరిచెయ్యరెవరూ. వాళ్ళకి ఇరవైమంది ఇంజనీర్లు అవసరమైతే, ఇంటర్వ్యూ కొచ్చిన ఐదొందల మందిలోనూ పదిహేనుమందే వాళ్ళ ప్రమాణాల్లో అర్హులైతే, ఐదూ ఖాళీగా వదిలేస్తారు గానీ, మిగిలిన నాలుగొందల ఎనభై అయిదులో, పై ఐదుగుర్నీ తీసుకోరు. అంచేత, ముందు వాళ్ళకి నేన్నచ్చాలి. ఒకవేళ సెలెక్ట్ కాకపోయినా ఆ ఐదు రోజుల ఇంటర్వ్యూ ఇవ్వటమే ఒక గొప్ప అనుభవం'' నాకు తెలిసింది చెప్పాను.

''అలా నచ్చితే?'' 'కొంపతీసి జాయినయిపోతారా' అన్నట్టు అడిగింది.

''అదో గొప్ప అవకాశం. వదలకూడదు.'' నీ భయం నిజమే అన్నట్టు చెప్పాను.

''నిమ్మకాయరసం పిండేసినట్టు పిండేస్తారటకదా, ఆర్మీలో పనిచేసే ఇంజనీర్లనైనా, డాక్టర్లనైనా?''

''అలా పిండేయటం వల్ల ఏర్పడిన ఖాళీలో అమృతం నింపుకోవచ్చు''

''వాళ్ళకేంటిన్లో అది చవటకదా. కొంచె ఎక్కువ డబ్బులు పెట్టి బయట కొనుక్కోవటం మానేసి, దానికోసం అరుణాచల్ ప్రదేశ్ కొండల్లోనూ, కాశ్మీర్ మంచులోనూ, రాజస్తాన్ ఎడారుల్లోనూ పనిచేస్తానంటారేంటీ. మీకు ఆ అమృతం చవగ్గా కావాలంటే, మీ అత్తవారి ఇంటినుంచి గంటలోపల యానాం వచ్చేస్తుంది. కాకినాడలో డెబ్భైరూపాయల సరుకు అక్కడ నలభయ్యేనట.''

''అయ్యో, నేను నింపాలనుకున్నది అలా ఎక్కువ ఖరీదుకి బయట దొరికే అమృతం కాదమ్మాయ్. ఒకవేళ అది చవగ్గా కావలిస్తే, నా ఫ్రెండ్స్ ఆర్మీలో పనిచేస్తున్నారు. యానాం లాంటి చోట కక్కుర్తిపడి, మా అత్తవారింట్లో పేరుపడదల్చుకోలేదు.''

''అక్కడికి మా వాళ్ళింట్లో మీకేదో బోల్డంత మంచి పేరున్నట్టూ! మీతో నేనెప్పుడూ కాకినాడ వెళ్ళినా నాకు భయమే, ఎవరితో ఎలా మాట్లాడేస్తారోనని. ఇంతకీ ఆర్మీలో మీరు ఆశిస్తున్న అమృతం ఏంటీ?''

''అమృతం అంటే, చూడు, ఈ ఫోటోలో ఏం కనిపిస్తోంది?''

''ఒక ముసిలి ఆర్మీ ఆఫీసరూ, ఒక పెద్ద ఆర్మీ ఆఫీసరూ ఉన్నారు.''

''నువ్వన్న ముసలి ఆఫీసరు వయస్సు తొంభై అయిదేళ్ళు. ఆయన పక్కనున్నాయన ప్రస్తుత ఆర్మీ చీఫ్, అరవయ్యేళ్ళాయన.''

''తొంభై అయిదేళ్ళవరకూ రిటైరవలేదా, లేదా రిటైరయ్యాక కూడా యూనిఫాం సరదాగా వేసుకున్నాడా?''

''మాములుగా అయితే, ఆర్మీ చీఫ్, 'జనరల్' అనే రేంక్‌లో ఉంటాడు, అరవయ్యో, అరవైరెండో ఏళ్ళకి రిటైరౌతాడు.

కానీ, సర్వీసులో అసాధారణ ప్రతిభ చూపిన జరల్‌కి భారతప్రభుత్వం 'ఫీల్డ్ మార్షల్' అనే గౌరవరేంక్ ఇస్తుంది. వీరికి పరిపాలనాధికారాలుండవు, కానీ జీవించినన్నాళ్ళూ, రిటైర్మెంటూ ఉండదు. గత అరవయ్యేళ్ళలో పదిహేనుమందికి పైగా ఆర్మీ చీఫ్‌లలో ఫీల్డ్ మార్షల్ రాంక్ పొందింది ఇద్దరే. నువ్వు ముసలి ఆర్మీ ఆఫీసర్ అన్నాయన ఫీల్డ్ మార్షల్ మానెక్ షా. అందుకే ఆయన యూనిఫాంలో ఉన్నాడు. ఆయన ఆర్మీ చీఫ్‌గా రిటైరయ్యేసరికి ప్రస్తుత చీఫ్ ఏ ట్రైనింగ్‌లోనో ఉండి ఉంటాడు.''

"ఏదో జీకే పుస్తకంలో మానెక్ షా పేరు చదివినట్టు గుర్తు. ఇంతకీ అమృతం చూపెడతానని, ఈ ఫోటో చూపెడతారేమిటీ."

"అక్కడికే వస్తున్నాను. మానెక్ షా గారి చేతులు చూడు. చర్మం గుడ్డలా వేలాడుతోంది. ముఖంలో అన్నీ ముడతలే. కానీ, మొహంలో చురుకుదనం చూడు. ఇప్పటికిప్పుడు యుద్ధం మధ్యలో నుంచుని, యంగ్ ఆఫీసర్లని గైడ్ చెయ్యటానికి సిద్ధం అన్నట్టు లేడూ? ఇంకో నమ్మలేని నిజం ఏమిటంటే, రెండో ప్రపంచ యుద్ధంలో ఈయనకి శరీరంలో విరగగలిగే ప్రతీ ఎముకా విరిగి, అపస్మారక స్థితిలో మూడునెలలున్నాకా మరో ఏడాది హాస్పిటల్లో గడిపి, డ్యూటీలో చేరి, ఐదేళ్ళు తిరక్కుండానే, కాశ్మీరు విలీనం సందర్భంగా జరిగిన మిలటరీ చర్యల్లో పాల్గొని, బంగ్లాదేశ్ ఆవిర్భావం నాటికి ఆర్మీ చీఫ్ అయ్యాడు. ఆ సందర్భంగానే భారత ప్రభుత్వం ఈయన్ని ఫీల్డ్ మార్షల్ చేసింది. అంటే ఆర్మీ జీవితం కొంత అమృతం నింపుతుమనేగా. మృత్యువుకూడా ఆయనకి సెల్యూట్ చేసి తీసుకెళ్ళాల్సిందే"

"పెద్దాయన్ని వందేళ్ళూ బ్రతకనివ్వండి"

"ఆయనకి నూరో పుట్టినరోజు జరిపే అదృష్టం ఈ దేశానికి లేదు, పోయినేడాది స్వర్గస్తుడయ్యాడు. నేను చూపిస్తున్న ఫోటో ఆయనకు మృత్యువు సెల్యూట్ చేయటానికి మూణ్ణెల్ల కిందటిది."

"మీక్కూడా ఫీల్డ్ మార్షల్ అవాలనుందా?" యాభయ్యో ఏట ఎమ్మెల్యే టికెట్‌కి ప్రయత్నిస్తున్న అనామకుణ్ణి 'ప్రధానమంత్రి అవాలని ఉందా?' అని అడిగినట్టు అడిగింది.

"ఇరవయ్యో ఏట, లెఫ్టినెంట్ అనే ప్రారంభ రేంక్‌తో కెరీర్‌లోకి అడుగుపెట్టే ఆఫీసర్లలో నూటికి తొంభైకి పైగా, యాభై ఎనిమిదో ఏట, నాలుగో పదోన్నతితో కల్నల్ గానో, ఆ పైనున్న బ్రిగేడియర్‌గానో రిటైరవుతాడు. జనరల్ అనేది ఎనిమిదో పదోన్నతితో వచ్చేది. ఇరవయ్యారేళ్ళ ఇంజనీర్ని, పొరపాటున సెలెక్టైతే, ఐదేళ్ళ తర్వాత రెండో రేంక్‌లో కెప్టెన్‌గానో, మరో ఐదేళ్ళ పొడిగింపు కుదిరితే, మూడో మెట్టు మేజర్‌గానో బయటకొస్తే ఈ జీవితానికాపాటి అమృతం చాలు."

"మేజర్ అంటే అడుగునుంచీ మూడో రేంకేనా? మరి ఒక హిట్ సినిమాలో, మనవల తాత కాశ్మీర్ తీవ్రవాదులతో పోరాడి మేజర్‌గా రిటైరవటం చూసనే"

"సహజత్వం అనేది తెలుగు సినిమాకి ప్రధమ శత్రువు. ఐఏఎస్ పాసయిన హీరో వెంటనే స్వంత జిల్లా కలెక్టర్‌గా రావటంలాంటిదే ఇదికూడా. అయినా నువ్వు చెప్పిన మేజర్ పాత్రధారికి ఆ సినిమా తీసేనాటికే డెబ్బై ఏళ్ళు. అదీకాక, ఆయన ధుర్యోధనుడి వేషం వేస్తే ఆ సినిమాలో భీముడు చవటా, దద్దమ్మలా ఉండవలసిందే కదా! మహాభారతాన్నే మార్చేవాళ్ళకి మిలటరీ రూల్సోలెక్కా?"

"పిట్టకథలు చాలుగానీ నా అసలు సందేహం తీరలేదు." నీటి పారుదల శాఖలో అసిస్టెంట్ ఇంజనీరుగా స్థిరమైన ఉజ్జోగంలో ఉంటూ, ఈ ప్రయత్నాలెందుకని ఆవిడ అసలు సందేహం.

"నాకసలైన ప్రేరణ ఎక్కడ ఉందో చెప్పగలిగే ప్రశ్న వేశావ్. విను. కిందటేడు నల్లమల కొండల్ని దొలిచి సొరంగ కాలువ త్రవ్వే పనిమీద సర్వే జరుగుతోంది."

●●●

ఎస్ ఈ గారు అనబడే సూపరెంటెండెంట్ ఇంజనీర్ రాఘవరావూ ఈఈ అనబడే ఎక్జిక్యూటివ్ ఇంజనీరు గోపాలూ, ఏయీ కిరణ్ కుమార్, ఇద్దరు సూపర్ వైజర్లూ, ఒక క్లర్కూ, ఒక ఎటెండరూ, జీపులో శ్రీశైలం నుంచి బయలుదేరి నాలుగ్గంటల తర్వాత సొరంగాలు తవ్వాల్సిన కొండలమధ్య అప్పటికే సిద్ధం చేసి ఉంచిన సైట్ ఆఫీస్ చేరుకున్నారు. ఆఫీస్ చూస్తూనే డ్రైవర్, కిరణ్‌ని అడిగాడు. "మూడురోజుల క్రితం ఇక్కడేమీ లేదు కద్సార్!"

"దీన్ని ప్రీ ఫేబ్రికేటెడ్ చేంబర్ అంటారు లింగప్పా. ఫైబర్‌తో ఫ్లోరూ, గోడలూ, కిటికీలూ, పైకప్పూ, అన్నీ కొలతల ప్రకారం ఫేక్టరీలో తయారుచేసి, ట్రక్కుల్లో కావలసిన చోటకి తీసుకెళ్ళి, అక్కడ వీటిని అమర్చి,నట్లూ, బోల్టులూ బిగించేస్తే, ఒక పూతలో ఈసైజు బిల్డింగ్ తయారవుతుంది. ఇక్కడ పని అయిపోగానే విప్పేసి, అవసరమైన చోటకి తీసుకెళ్ళి బిగించుకోవచ్చు. ఖర్చు దాదాపు కాంక్రీటు బిల్డింగ్ అంతా అవుతుంది గానీ, చాలా తొందరగా అవటమే కాక, పదేళ్ళ వ్యవధిలో కనీసం నాలుగుచోట్లకి మార్చుకోవచ్చు. ఆ తర్వాత తుక్కు అవుతుందనుకో." కిరణ్ చెప్పాడు.

వీళ్ళు కొంచెం సేదతీరాకా, కంట్రాక్టు పొందిన కంపెనీ, వశిష్ట ప్రోజెక్ట్స్ నుంచి, డైరెక్టరూ, జనరల్ మేనేజరూ, ఇద్దరు సైట్‌మేనేజర్లూ, పదిమంది సైట్ ఇంజనీర్లూ వరకూ వచ్చి, కలిసారు. ఇటు ప్రక్క కిరణూ, అటు ప్రక్క సైట్ ఇంజనీర్లూ విన్నారు. మిగిలినవాళ్ళు, వాళ్ళ స్థాయిలను అనుసరించి మాట్లాడారు. మరో గంట తరవాత ఎస్‌ఈ, ఈఈలు అదే జీపులో శ్రీశైలం వెళ్ళిపోయారు. కిరణూ, ఎల్డీసీ తమ సామాన్లతో ఫేబ్రికేటెడ్ గదిలో కెళ్ళగా, మిగిలినవాళ్ళు కొంచెం దూరంలో వేసిన గుడారాల్లో సర్దుకున్నారు.

మర్నాడు కంపెనీ సైట్ ఇంజనీరు అడిగాడు. "ఈఈ గారు ఇక్కడే ఉంటారని చెప్పారు కదా సార్?"

వాళ్ళ మేనేజర్ చెప్పాడు. "ఆయనకి నచ్చినచోట ఉండే అధికారం ఉంది. మనం మాత్రం, ఆయన ఇక్కడున్నట్టే పనిచేసి ఏఈ గారి సంతకం తీసుకుంటే, వారానికోసారి ఆయనిక్కడికొచ్చినప్పుడు, అన్ని పేపర్లమీదా ఎస్ అనిపించుకోవాలి."

ఆరెండ్ బీలో డ్రైవర్‌గా రిటైరయి, ఇపుడు వాళ్ళ కంపెనీలో జీపు నడుపుతున్న మల్లన్న చెప్పాడు. "సార్, ఎస్‌ఈ గారు శ్రీశైలంలో ఉండాలి గానీ, వారానికి రెండురోజులు హైదరాబాద్ లో పని ఉంటుంది. అందుకని, ఇక్కడ ఏ ఈ గారొక్కరే సైట్‌లో ఉంటారు."

రెండోరోజు మేనేజర్ చెప్పాడు. "రేపట్నించీ మనతోపాటు జనరల్ మేనేజర్ వచ్చి మనతో పాటే ఉంటారు. మనం చాలా జాగ్రత్తగా పనిచెయ్యాలి."

"అంత పెద్ద ఆఫీసర్ వరానికోసారి వచ్చిపోతారుగానీ రోజూ ఉంటారా?" ఒకబ్బాయి అడిగేడు.

"ఏ జనరల్ మేనేజరూ ఉండడు. కానీ ఈయన ఆర్మీలో పనిచేసిన ఇంజనీరు. పేరు కల్నల్ నాయర్. తెలుగు బానే వచ్చుట." మేనేజర్ చెప్పాడు.

"కర్నల్ సాబ్ ఫౌజ్‌మే బహుత్ బడే ఆఫీసర్ హోతాహై." సైటింజనీర్లలో ఒకడైన లాఖన్ సింగ్ చెప్పాడు. ఉత్తరాదివారు, కెప్టెన్‌ని, కప్తాన్ సాబ్, అనీ కల్నల్‌ని, కర్నల్ సాబ్ అనీ పలుకుతారు.

మర్నాడు నాయర్ వస్తునే అందర్నీ పరిచయం చేసుకున్నాడు. అక్కడ ఏకైక ప్రభుత్వ అధికారి అవటం వల్ల కిరణ్‌తో తరచుగా మాట్లాడేవాడు. తన కంపెనీ వాళ్ళందర్నీ పరుగులు పెట్టించేవాడు. అప్పటివరకూ జీఎం స్థాయివాడు సైట్‌లో రోజులతరబడి ఉండటమే వింత అయితే, ఇప్పుడలా ఉన్నవాడు తమకంటే ఇరవయ్యేళ్ళు పెద్దైనా వేగంగా నడవటం, అలసట లేకపోవటం వగైరా లక్షణాలు కనిపించేసరికి వీళ్ళ అలసట చెప్పలేకా పనిచెయ్యలేకా తంటాలు పడేవారు.

కిరణ్ కూడా కల్నల్ చురుకుదనానికి, పనిలో చూపే శ్రద్ధకి ముగ్ధుడై, తన డిపార్ట్ మెంట్‌లో నాలుగు రేంకుల పైవాడికిచ్చే గౌరవం ఇస్తూ తన సందేహాలు తీర్చుకునేవాడు. ఇది చూసిన క్లర్కులు చెప్పి చూసారు. "సార్ మనం గవర్నమెంటువాళ్ళం. కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆఫీసర్లకి అంత రెస్పెక్టివ్వకూడదు." కిరణ్ వింటేగా.

కిరణ్ అందరిలాంటి ఏఈ కాదని, డిపార్ట్ మెంట్‌లో డ్రైవరు, ప్యూనుతో సహా ఎవరి ఉపదేశాలూ చెవికెక్కించుకోవటం లేదన్న విషయం గ్రహించాక, కల్నల్ కిరణ్‌ని ఆప్యాయంగా చూసేవాడు.

మాటల సందర్భంలో అన్నాడు. "కిరణ్, మీరు కార్పొరేట్ సెక్టర్‌లో బాగా రాణించగలరు. మీ సేలరీకి రెట్టింపు మీద నేను ఇప్పుడే తీసుకోగలను. ఒక రెండేళ్ళలో మిమ్మల్ని మీరు నిరూపించుకోగలిగితే ఇక అడ్డే ఉండదు. నాకింద పనిచేసే సైటింజనీర్లందరూ రోజూ పరిస్థితుల్నీ నన్నూ తిట్టుకుంటూ పనిచెయ్యటమే గానీ, ఒక్కరోజు కూడా ఇష్టంతో పనిచెయ్యట్లేదు. మీలాంటివాళ్ళని ఏ కంపెనీ అయినా గౌరవిస్తుంది"

"కానీ గవర్నమెంట్ జాబ్ వదిలేసే రిస్క్ చెయ్యలేను సార్" కిరణ్ చెప్పాడు.

నాల్రోజుల తర్వాత కల్నల్ చెప్పాడు. "మా వాళ్ళకి మోటివేషన్ కోసం ఒక మేనేజ్ మెంట్ ఎక్స్‌పెర్ట్‌తో మూడురోజుల ప్రోగ్రాం పెట్టించాను. మీరు కూడా అందులో కూర్చోండి." అని

కిరణ్ అందులో కూర్చుని డిపార్ట్‌మెంట్ పరువు తీస్తున్నాడన్న పిర్యాదు ఎస్ఈ కి చేరింది. ఎస్ ఈ మాత్రం కిరణ్‌ని గట్టిగా వారించలేదు. సైట్‌లో ఇబ్బంది అని ఇదివరకు రెండు హైదరాబాద్ ప్రోగ్రాంలో కిరణ్‌ని వెళ్ళకుండా అడ్డుకున్నవాడు కదా!

ఎక్స్‌పెర్ట్ తెలుగాయనే. ఢిల్లీలో ఏదో మేనేజ్‌మెంట్ స్కూల్లో ప్రొఫెసరు. యాభైఏళ్ళుపైనే ఉంటాయి. మూడురోజులూ ఏవేవో చెప్పి, కొన్ని గ్రూప్ టాస్క్‌లూ, కేస్ స్టడీలూ చేయించి, ఆఖరు రోజున ఫీడ్ బేక్‌తో పాటు, మీ సమస్యలేమిటని అడిగాడు. అప్పటికి ఒకపూట మిగిలి ఉంది.

ఎవరూ మాట్లాడకపోతే ప్రొఫెసర్ చెప్పాడు. "మీ ఫిర్యాదులు నన్ను దాటి మీ బాసులకు చేరవు."

"ఒకబ్బాయి చెప్పాడు. జీఎం గారికి ఒక ఫేబ్రికేటెడ్ చాంబరూ, ఇద్దరు మేనేజర్లకీ కలిపి ఒకటి ఉంటే, మా పన్నెండుమందికీ కలిపి రెండే ఉన్నాయి సార్."

"పోయిన వారం డైరక్టరుగారు విజిట్‌కి వచ్చినప్పుడు ఇక్కడ ఒకరోజు పెట్టిన ఖర్చు మా అందరిమీదా ఒకనెల పెట్టినా మేం సంతోషిస్తాం సార్."

"మాకు సెలవలు ఇవ్వాలంటే మా తలకాయలు లెక్కెట్టి, కనీసం పదిమందిని సైట్‌లో ఉండేటట్టు చూసి ఇస్తారేగానీ, మా అవసరాన్ని పట్టించుకోరు సార్."

"ఏడాది క్రితం మధ్యప్రదేశ్‌లో ఉన్నారు సార్. వచ్చే ఏడాదీపాటికెక్కడుంటానో తెలియదు. ఇలా అయితే ఫేమ్లీ ఏమవాలి సార్?"

అలాంటి కొన్ని పిర్యాదులు విన్నాక ప్రొఫెసరుగారన్నారు. "ఒకరోజు బుద్దుడి దగ్గరకి ఒకావిడ తన మూడేళ్ళ కొడుకు శవాన్ని తెచ్చి మీ మహిమతో వీణ్ణి బ్రతికించమని అడిగిందట."

"బ్రతికించాడా సార్? ఐనా అది కథే కదా!"

వెంటనే ఆ ఇల్లాలితో బుద్దుడు, "ఊళ్ళోకి వెళ్ళి ఎవరి ఇంటినుంచైనా పిడికెడు గోధుమలు తీసుకురా. కాకపోతే ఆ ఇచ్చిన వాళ్ళింట్లో ఇంతవరకూ ఎలాంటి మరనమూ జరగలేదన్న తరువాతే గోధుమలు స్వీకరించు" అని చెప్పాడుట.

ఉస్సురుమన్నారు ఇంజనీర్లు, తమకిచ్చిన సందేశం అర్థమయి.

"నిరుత్సాహపడకండి. యుద్ధంలో ఉన్న ప్రతీ సైనికుడికీ ఒకే రకమైన కష్టాలు ఉంటాయి. కాకపోతే, పై అధికారుల్నీ పరిస్థితుల్నీ తిట్టుకుంటూ ఉండేవాడితో పోలిస్తే వాస్తవం తెలుసుకుని సమస్యల్ని ధైర్యంగా, వీలైతే చిరునవ్వుతో ఎదుర్కొని పోరాడేవాడి విజయావకాశాలు ఎక్కువ."

"మిలట్రీ ఉదాహరణిచ్చేడేంటీ? మన కల్నల్ కరిచినట్టున్నాడు" కిరణ్ ప్రక్కనున్న వాడు గొణిగేడు.

మళ్ళీ ప్రొఫెసరే మొదలెట్టాడు. చిన్నప్పుడు, పంచతంత్రం కథలూ, వేమన, సుమతీ శతకాలూ మధ్య పెరిగాను. ఇరవై రెండో ఏట డార్జిలింగ్ టీ ఎస్టేట్‌లో వర్కర్స్ మీద సూపర్ వైజర్‌గా ఉద్యోగం ప్రారంభించి చాలా ఊళ్ళు మారి ముప్పై ఏళ్ళ తరువాత ఇలా ఉన్నాను. నాకెప్పుడు సమస్య వచ్చినా, ఆ సందర్భాన్ని గుర్తుచేసే కథో, పద్యమో గుర్తు చేసుకొనేవాణ్ణి. మీసమస్యలు, నా ముప్పై ఏళ్ళకిందటి సమస్యలకి ఏ మాత్రం తీసిపోవు. కానీ కెరీర్ లో వాస్తవం తెలుసుకోండి'' అంతూ తన బ్రీఫ్‌కేస్ లోంచి ఒక సీడీ తీసి టీవీలో ప్లేచేసాడు. ముందుగా కేరళలో ఒక దేవాలయ విగ్రహాలు ఊరేగించే ఏనుగు దినచర్య, ఆ తరువాత గుర్రప్పందేల్లో వాడే గుర్రాల మీద వీడియో, చివరగా హిమాలయాల్లో సరుకు రవాణాకి వాడే గాడిదల్నీ చూపించారు, ఆ పావుగంట వీడియోలో.

ఆ వీడియో ద్వారా ప్రొఫెసర్ చెప్పదలచుకున్నదేమిటో వీళ్ళ కర్థం కాలేదు.

ప్రొఫెసర్ టీవి ఆపి మొదలెట్టాడు. ''ఇప్పుడు నేను చూపించిన మూడు జంతువులూ ఒకే చోట ఉన్నట్టు ఊహించుకుని, నేనడిగినవాటికి చెప్పండి. గాడిదని చూడగనే మీకేమనిపిస్తుంది?

''దీన్నో తన్ను తన్నొచ్చని, సార్.'' నవ్వుతూ చెప్పాడో ఇంజనీర్.

''గాడిద శరీరం బరువు ఎంత ఉంటుంది?''

''రెండొందల కేజీలకు అటూ ఇటుగా, సార్''

''మరిదాని వెన్ను మీద వేసే బరువు?''

''వందకేజీలవరకూ''

''మేత?''

''గుంపు మధ్యలో గడ్డిపడేస్తారు. చాలకపోతే, కనిపించిన చెత్త తింటుంది.''

''ఒక కాపరి ఎన్ని గాడిదల్ని చూస్తున్నాడు?''

''కనీసం ఇరవై''

''ఏ గాడిదైనా నీరసంగా ఉంటే''

''ఆ రోజుకి దాన్ని మరిచిపోతారు.''

''సరిగ్గా నడవలేకపోతే?''

''బూతులు తిడుతూ, ఓ తన్ను తంతారు''

''తన్నులు తిన్న గాడిద కోపంగా చూస్తుందా?''

''ఏ మాత్రం రాదు, రాకూడదు''

''గుఱ్ఱాన్ని చూడగానే ఏమనిపిస్తుంది?''

''దాని దర్జా, బలం, చురుకుదనం, ఎవరైనా మెచ్చుకోవలసిందే, సార్''

''దాని బరువు?''

''ఐదొందలకేజీలు''

''అది మోసే బరువు?''

''డెబ్బై కేజీల మనిషి మోస్తూ పరుగెట్టాలి, సార్''

''వేగం తగ్గితే''

కొరడాతో అదిలిస్తూ, ఎక్కువ శబ్దం, తక్కువ నొప్పి వచ్చేటట్టూ కొడుతున్నారు''

''మేత?''

''ఒక్కో గుఱ్ఱానికీ విడిగా పెడతారు. సరిపోయిందో లేదో, అజీర్తి చేసిందేమో చూసి, మర్నాటి దాణా వేస్తారు.''

''వాటి సంరక్షణా?''

''దాదాపు మూడేసి గుఱ్ఱాలకొక మనిషి ఉన్నాడు''

''సంరక్షణ తగ్గితే''

''గుఱ్ఱం కోపగిస్తుంది. అప్పుడు దాన్ని, దువ్వీ, బెల్లం తినిపించీ, శాంతపరుస్తారు''

''ఏనుగుని దగ్గరనుంచి చూడగానే ఏమనిపిస్తుంది?''

''మొదట భయం, తరువాత గౌరవం''

''బరువు''

''మూడువేలకేజీలపైనే''

''మోసే బరువు''

''రెండొందల కేజీలలోపే. అదికూడా ఏడాదికి నాలుగైదు సార్లే''

''మేత?''

''చాలా జాగ్రత్తగా, కొన్ని దినుసులైతే, పనివాళ్ళు రుచి చూసి మరీ పెడతారు.''

''దాని సంరక్షణ?''

''ఒక మనిషి పూర్తిగా దానికిందే ఉండిపోవాలి. ఊరేగింపప్పుడైతే, దాన్ని కనిపెట్టేవాళ్ళు నలుగురు''

''దానికెప్పుడైనా కోపమొస్తుందా''

''దూరం నుంచి చూసి, కోపం లేదని తెలిసాకే దగ్గరకెళతారు.''

''ఒక ఏనుగుని మేపే ఖర్చుతో ఎన్ని గుఱ్ఱాల్ని మేపొచ్చు''

''కనీసం ఐదారు''

''ఒక గుఱ్ఱం ఖర్చుతో, ఎన్ని గాడిదలు పెంచొచ్చు?''

''కనీసం ఐదారు.''

''మరి ఏ గాడిదైనా, గుర్రాలమీదా, ఏనుగుల మీదా అలగవచ్చా? వాటితో తమని పోల్చుకోవచ్చా?''

''అలాంటిగాడిదల్ని వెళ్ళగొట్టాలి సార్.''

''తప్పు బాబు. తమపైనున్న జంతువుల దాణా మెయ్యాల్సింది కూడా గాడిదలే. అయినా మీ అభిప్రాయాలు మీవి. నేను ఐదునిమిషాలు బయటకు వెళ్ళి వస్తాను. ఈలోపల, గత గంటన్నరగా జరిగిన ప్రతీ సంభాషణనీ మననం చేసుకొండి''

ఐదు నిమిషాల తరువాత ప్రొఫెసర్ మళ్ళీ వచ్చేసరికి నవ్వులు ఆగాయి. ఒకడన్నాడు. ''మరీ మమ్మల్ని వాటితో పోల్చారేంటి సార్?''

''నా కెరీర్‌లో మొదటి పదిహేనేళ్ళూ నేనూ అలాగే ఉన్నాను. ప్రభుత్వంలో అయితే అయ్యేఎస్, ఐపీఎస్ లాంటి వాళ్ళు తప్ప మిగిలిన అధికారులకు కూడా మీకున్న సమస్యలే ఉంటాయి. ఉన్నచోటు, పని స్వభావం వల్ల సమస్యల తీవ్రతలో హెచ్చు తగ్గులుంటాయి''

"ఇంతకీ ఈ కథ పేరేంటి సార్?"

"మూడు జంతువులున్నది కనుక త్రితంత్రం అని పెడదాం." మరో సైటింజనీరన్నాడు.

"కానీ పంచతంత్ర కథలు ఐదు జంతువులకు సంభందించినవి కాదే" కిరణ్ క్వొరీ వేసాడు.

"ఆలోచనని మెచ్చుకోకుండా అభ్యంతరాలు పెడుతున్నావ్. ఎంతైనా గవర్నమెంటు వాడివి కదా!" ప్రొఫెసర్ నవ్వుతూ అన్నారు.

మరికొన్ని కులాసా కబుర్లతో కార్యక్రమం ముగిసింది.

●●●

"ఇంతకీ త్రితంత్రానికీ ఈ మిలిట్రీ ఉజ్జోగానికి పూర్తిగా లింకు అర్ధమవలేదు" మా ఆవిడంది.

"ఆ ప్రొఫెసర్ గారి ప్రోగ్రాం తర్వాత కల్నల్‌ని బాగా పరిశీలించా. ఆయన, సైట్‌లో పనిచేస్తున్నా, అదే అర్హత, అంతే అనుభవం ఉన్న మిగిలిన సైటాఫీసర్లకన్నా ఎంతో ఉన్నతంగా ఉన్నాడు. అదీకాక, కంపెనీ డైరెక్టర్లు వచ్చినప్పుడు మిగిలిన సైటాఫీసర్లు ప్రదర్శించే వినయాలు ప్రదర్శించడు. కొన్ని సదుపాయాలు, కంపెనీ డైరక్టర్లతో దాదాపు సమంగా ఉంటాయి. తనతో మాట్లాడినప్పుడర్థమైందేమిటంటే, ఆర్మెడ్ ఫోర్స్ అధికారుల విధుల స్వభావం వల్ల, వీళ్ళ ప్రమేయం లేకపోయినా, ధైర్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయి అని అర్ధం అయ్యింది. అంతలో ఈ షార్ట్ సర్వీస్ కమీషన్ ప్రకటన రావటం, ఎప్లై చేసేముందు కల్నల్ సలహా తీసుకోవటం జరిగాయి."

"అంతా బాగానే ఉంది, గానీ.." మొహం విచారంగా పెట్టింది.

"ఏమైంది?"

"నాకు పెళ్ళి సంబంధాలు చూసే రోజుల్లో, ఒక సాఫ్ట్ వేర్ ఇంజనీరుకి, నెలకి లక్షరూపాయల జీతం ఉన్నా, గున్నఏనుగులా ఉన్నాడని వద్దనుకున్నారు డాడీ. మిమ్మల్ని చూడగానే రేసు గుర్రంలా ఉన్నారనుకుని, ఇప్పటివరకూ అలాగే మురిసిపోయాను. ఇప్పుడు మీరు గుర్రం కాదని, తెలిసాక.." మొహం విచారంగా ఉంచటానికి కష్టపడుతోంది.

●●●

## కనువిప్పు — ఆకెళ్ళ కృష్ణకుమారి

**" అనిత వాళ్ళు లెక్సస్ కారు కొన్నారుట విన్నారా?" అంది కవిత.**

"ఆ. చూశాను కూడాను. చాలా బాగుంది" అన్నాడు సుందరం.

" మరి మన మెప్పుడు కొనుక్కుంటాం అలాంటి కారు? మనం, మన టొయోటా నేనా, ఎప్పటికైనా లెక్సస్ కారు కొనుక్కోగలమా?"

"చూడు, కవితా, ప్రస్తుతం మన అవసరాలకు టయోటా బాగానే ఉంది. అనితా వాళ్ళు కొనుక్కున్నారు కనుక మనం లెక్సస్ కొనుక్కోనక్కరలేదు. సత్యం డాక్టరు. బాగా సంపాదిస్తున్నాడు. పైగా వాళ్ళకు మంచి పెద్ద కారు అవసరం. అందుకని వాళ్ళతో పోల్చు కోకు. ఉన్నదానితో తృప్తిపడు".

"మీరెప్పుడూ ఇంతే. అందరూ అన్నీ కొనుక్కోవాలని చూస్తుంటారు. మీకు అలాంటి ధ్యాసే ఉండదు. నేను చెప్పినా వినరు" అని కోపం తెచ్చుకుంది కవిత.

కవిత, సుందరంలకు ఇది అలవాటే. సుందరం తండ్రి స్కూలు మాస్టర్ . తండ్రి కష్టపడి సుందరానికి ఇంజినీరింగ్ చెప్పించాడు. సుందరం కూడా తల్లితండ్రుల కష్టసుఖాలు అర్ధం చేసుకుని, బాగా చదివి పైకొచ్చాడు. ఇప్పుడు న్యూ జెర్సీ లోసాఫ్టువేరు ఇంజినీర్ గా పని చేస్తున్నాడు. సౌమ్యుడు. అమెరికాలో ఉద్యోగాలు, వాటి అభద్రత తెలుసు కనక డబ్బు విషయంలో జాగ్రత్తగా ఉంటాడు. అలా అని అవసరాలకు ఖర్చు పెట్టటానికి వెనకతీయడు.

కవిత తండ్రి ఇంజినీర్. కవిత హైదరాబాద్ లో MCA చేసి, సుందరంని పెళ్ళి చేసుకుని అమెరికాకి వచ్చింది. మొదట్లో కొన్నాళ్ళు ఇంట్లో ఉంది కాని కొడుకు వసంత్ స్కూల్లో చేరిన తర్వాత ఉద్యోగం చేస్తోంది. వాళ్ల అమ్మ, నాన్నలకు ఒక్కత్తే కూతురు. గారాబంగా పెరిగింది. ఏదైనా కావాలంటే అమ్మ,నాన్న వెంటనే తెచ్చిపెట్టటం అలవాటు. అమెరికాలో ఇన్ని వస్తువులు చూస్తుంటే అన్నీ కొనుక్కోవాలని మోజు పడుతుంది. మనస్సు మంచిదేకాని కోపం త్వరగా వస్తుంది.

భార్యాభర్తలిద్దరికీ మనుష్యులు కావాలి. అందుకని చాలామంది స్నేహితులున్నారు. డాక్టర్లు, బిజినెస్ వాళ్ళు, స్టార్టప్ లో డబ్బు వచ్చినవాళ్ళు, రకరకాల వాళ్ళు ఉన్నారు.

ఒక రోజు సుందరం స్నేహితుల ఇంట్లో పార్టీ కి వెళ్ళారు ఇద్దరూ. అక్కడ ఆడవాళ్ళు అందరూ రకరకాల చీరలు, సరి కొత్తఫాషన్లవి కట్టుకు వచ్చారు. ఆ చీరల గురించి అందరూ మాట్లాడుకున్నారు. బాగున్నవాటిని చూసి చాలా మెచ్చుకున్నారు. అక్కడినించి ఇంటికి వచ్చీ రాగానే సాధించటం మొదలు పెట్టింది కవిత. " లలిత ఎంత మంచి చీర కట్టుకు వచ్చిందో పార్టీకి. 25 వేలకు వాళ్ళాయన బెంగుళూరులో కొన్నాడుట. పట్టుచీరంతా కుట్టుపని చాలా చక్కగా చేశారు. ఎంతో బాగుంది. అలాంటిది ఒక్కటైనా నాకు కొని పెట్టారా మీరు? ఒక్క సరదా అయినా లేదు" అంటూ.

"నువ్వు కట్టుకున్న చీర కూడ ఎంతో బాగుంది. కంచి పట్టు చీర కావాలని తెచ్చాను నీకు. ఈ రంగు నీకు బాగా నప్పింది" అని సుందరం చెబితే వినిపించుకోలేదు. ఏదో తనకు తక్కువైందని బాధ పడుతూనే ఉంది ఆ రాత్రంతా.

భార్యాభర్తలిద్దరికీ ఊళ్ళో అమ్మకానికి పెట్టిన ఇళ్ళు శనివారం వెళ్ళి చూడటం అలవాటు. ఇద్దరికీ అలా చూడటంలో సరదా ఉంది.

ఒక రోజు కవిత ఇంటికి రాగానే, " ఏమండీ, ఈ సంగతి విన్నారా. మొన్న మనం ఓపెన్ హౌస్ కి వెళ్ళి చూశామే, మన పక్క వీధి లో 5 బెడ్రూములు, 3 బాత్రూములు, పెద్ద కాంపౌండు తో ఉన్న ఇల్లు , అది కృష్ణ కొన్నాడు ట. ఈ 16 న గృహప్రవేశాని కి మనల్ని పిలిచారు" అని చెప్పింది.

ఇద్దరూ ఆ గృహప్రవేశానికి వెళ్ళారు. కృష్ణ దంపతులు ఆ ఇంట్లో మంచి ఫర్నిచర్ కొని, అన్ని గదుల్లోనూ మంచి పెయింటింగ్స్ పెట్టి ఇల్లు చాలా బాగా అలంకరించారు. అది చూసి వచ్చినప్పటినించి అలాంటి ఇల్లు మనకు లేదే అని బాధ పట్టుకుంది కవితకి.

"మనకి ప్రస్తుతానికి మంచి 3 బెడ్రూముల ఇల్లు ఉందికదా. మన ముగ్గురికి ఇదే చాలా పెద్దది గా ఉంది. చేతులో బాగా డబ్బు వచ్చి, మనకు అవసరమైనప్పుడు పెద్ద ఇల్లు కొనుక్కోవచ్చును" అని సుందరం చెబితే నచ్చలేదు.

కవిత కొలీగ్ మేరీకి రకరకాల నగలు కొనుక్కోటం ఇష్టం. కొత్త నగలు కొనుక్కున్నప్పుడల్లా కవితకి చూపించి , ఎక్కడ కొన్నదో, ఎంత ఖరీదో చెబుతూ ఉంటుంది. ఒక రోజు మంచి డైమండ్ ఉంగరం పెట్టుకుని వచ్చింది.

" చాలా బాగుంది. ఒక కారట్, ఒకటే రాయి. ఎక్కడకొన్నావు?" అని అడిగింది కవిత.

" నేను కొనలేదు. నా 40 వ పుట్టినరోజుకి మా ఆయన ఇచ్చిన కానుక" అని చెప్పింది మేరీ.

ఉంగరం చాలా బాగుందని మెచ్చుకుంది కవిత.

ఇంటికి రాగానే మొగుడితో పోట్లాట పెట్టుకుంది " ఈ దేశంలో 40 వ పుట్టినరోజు అంటే చాలా విశేషం. ఆ రోజు మొగుడు పెళ్ళానికి మంచి కానుక ఇస్తాడు. మీకు అచ్చటా, ముచ్చటా ఏమీలేదు. మీరు నా 40 వ పుట్టినరోజుకి నాకు డైమండ్ ఉంగరం కాదు కదా, మామూలు ఉంగరమన్నా ఇవ్వలేదు" అంటూ.

" ఆవేళ నువ్వు మంచి డ్రెస్ కావాలంటే కొన్నాను కదా " అని సుందరం చెబితే , ఆ మాటే వినిపించుకోలేదు.

దసరాకి కవిత స్నేహితురాలు రజని ఇంట్లో పార్టీ కి పిలిస్తే వెళ్లారు కవిత, వాళ్ళాయన. రజని, కుటుంబం అప్పుడే శలవల్లో ఇటలీ వెళ్లి వచ్చారు. అక్కడ వాళ్ళు చూసిన సిస్టిన్ చాపెల్, ట్రేవీ ఫౌంటెన్ , డేవిడ్ శిల్పం, కేప్రి ద్వీపం గురించి చెప్పి, వాళ్ళు తీశిన ఫొటోలు, విడియోలు చూపించారు అందరికీ. అప్పటినించి కవితకు తను కూడా అలా అన్ని దేశాలు తిరగాలన్న కోరిక పట్టుకుంది.

ఇలాంటివి తీసిన కొద్దీ కవిత కి రాను, రాను తనకు అన్నీ లేవే అన్న అసంతృప్తి ఎక్కువ కావటం మొదలు పెట్టింది. సుందరం ఎంత నచ్చచెప్పటానికి చూసినా, అతని మీద కోపం వచ్చిందే కాని ఫలితం లేకపోయింది. సుందరానికి ఏం చెయ్యాలో తోచలేదు.

ఇలా ఉండగా ఒకరోజు కవిత నాన్నగారికి గుండెపోటు వచ్చిందని, హాస్పిటల్లో ఉన్నారని ఇండియా నించి ఫోను వచ్చింది. ఆ కబురు తెలియగానే కవితకి ఒక్కసారి గా షాకు వచ్చినట్లు అయింది. జీవితంలో మొదటి సారి ఇలాంటి కష్టం వస్తే తట్టుకోలేకపోయింది. సుందరం వెంటనే కవితకి, వసంత్ కి టిక్కెట్టు కొని ప్లేను ఎక్కించాడు. వాళ్ల నాన్నగారికి వైద్యానికని కొంత డబ్బు చేతికి ఇచ్చాడు. వెళ్ళేటప్పుడు "మీ నాన్నగారికి మంచి వైద్యం చేయించు, ఇంకా డబ్బు కావాలంటే నేను పంపిస్తాను" అని చెప్పాడు.

దేవుడి దయవలన కవిత నాన్నగారికి త్వరగానే నయమయింది. కొన్నాళ్ళలో హాస్పిటల్నించి ఇంటికి వచ్చేశారు. ఆయనకి బాగా కులాసాగా ఉండేదాకా కవిత అక్కడే ఉండి, తర్వాత అమెరికా వచ్చేశింది.

ఈసారి వచ్చినప్పటి నుంచీ కవిత చాలా హాయిగా ఉంది. స్నేహితుల ఇళ్ళల్లో పార్టీలకి వెళ్లినాకూడా ఏమీ గొడవ చేయటం లేదు. సుందరానికి కవితలో ఈ మార్పు ఎలా వచ్చిందో అర్థం కాలేదు.

ఒకరోజు కవిత చాలా సంతోషంగా ఉన్న టైము చూసి సుందరం అడిగాడు, "కవితా, నువ్వు ఈసారి ఇండియా వెళ్ళి వచ్చిన తర్వాత చాలా మారావు. ఏమి జరిగింది?" అని.

అప్పుడు కవిత " అవునండీ. నిజంగానే నాలో మార్పు వచ్చింది. మా నాన్నగారికి జబ్బు చేసిందని వినగానే ముందు నాకు షాకు వచ్చింది. నాన్నగారు ఉండరేమోనన్న ఆలోచనవస్తేనే భయం వేసింది. ఆయన కులాసాగా ఉండి ఇంటికి వస్తే, నేనే పెద్ద జబ్బు పడి లేచినట్లు అనిపించింది.

'పెళ్ళి అయి అమెరికా వచ్చిన  తర్వాత ఎప్పుడు ఇండియా వెళ్లినా హడావిడిగా అందర్నీ కాసేపు చూడటం, కబుర్లు, షాపులకి వెళ్లటం తప్ప నిదానంగా ఒకచోట ఎప్పుడూ ఉండలేదు నేను. ఈసారి మా నాన్నగారిని చూసుకుంటూ ఇంట్లోనే ఉన్నాను. ఎక్కడికీ వెళ్ళలేదు. అందువలన నా చుట్టూతా ఉన్న ప్రపంచం కాస్త నిశితంగా గమనించటానికి టైము దొరికింది'.

'ఆ రోజుల్లో నాన్నగార్ని, మమ్మల్ని చూడటానికి చాలా మంది బంధువులు వచ్చేవారు. మా పిన్ని వసుధ జ్ఞాపకముందా మీకు?'

'ఎవరూ? ఎంతో ఆప్యాయంగా మాట్లాడే పిన్నేనా?'

'ఆ, ఆ పిన్నే. తరుచు  వచ్చేది. ఆవిడకి ఈ సంవత్సరమే భర్త చనిపోయాడు. ఇద్దరు కొడుకులు చదువు కుంటున్నారు. వెనకాల పెద్ద ఆస్తిపాస్తులు లేవు. ఆవిడ టీచరు ఉద్యోగం చేస్తూ పిల్లల్ని చదివించుకుంటోంది. మనిషి చాలా కష్టాల్లో ఉంది. అయినా కాని తన కష్టాలు చెప్పుకునేది కాదు. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండేది. ఆవిడకి ఉన్న కష్టాలతో ఆవిడ అలాగ నవ్వుతూ ఎలా ఉండగలదా అని ఆశ్చర్యంగా ఉండేది నాకు.'

'మా అత్త శాలిని గురించి చెప్పే దాన్ని, జ్ఞాపకముందా?'

'చాలా నగలు వేసుకుని, ఎప్పుడూ నగలు, చీరలు గురించి మాట్లాడే ఆవిడేనా?'

'అవును. ఆవిడే. ఆవిడ కూడా అప్పుడప్పుడు వస్తూ ఉండేది. ఆవిడ భర్త మంచి పొజిషన్ లో ఉన్నాడు. మంచి జీతం, పెద్ద కారు, ఇంట్లో పనివాళ్ళు, వెనకాల ఆస్తి అన్నీ ఉన్నాయి. తను ఇంట్లో ఏమి పని చెయ్యనక్కర లేదు. భర్త మంచివాడు. పిల్లలు బుద్ధిమంతులు. బాగా చదువుకుంటున్నారు. ఇన్ని ఉన్నా ఆవిడ ఎప్పుడూ ఏదో లేదని గొడవ పడుతూనే ఉండేది. భర్త ఇంకా పెద్ద ఇల్లు కొనలేదని, తనకు మంచి చీరలు తేలేదని, నగలు కొనిపెట్టలేదని ఎప్పుడూ ఏదో తన బాధలు చెప్పుకుంటూనే ఉండేది. ఆవిడని చూసినప్పుడల్లా నేను ఏదో కొనలేదని మిమ్మల్ని సాధించటమే జ్ఞాపకం వచ్చేది. అనుకోకుండానే మా అత్తనూ, నన్నూ పోల్చుకునేదాన్ని.'

'వీళ్ళందరూ వస్తే మా ఇంట్లో పనిచేసే పున్నమ్మ, ఇంట్లో పని అంతా చేస్తూ, వీళ్ళందరినీ బాగా చూసుకునేది. దానికి ఇద్దరు చిన్న పిల్లలు. మొగుడు అవిటివాడు. పున్నమ్మకి గిన్నెలన్నీ తోమి, ఇల్లు తుడిచి, బట్టలు ఉతికి పని చేస్తే, మా అమ్మ 1000 రూపాయలు అంటే 20 డాలర్లు ఇస్తుంది నెలకి. ఇంకా ఇలాంటి రెండిళ్ళలో పని చేస్తుంది. దాంతోనే అది హాయిగా ఉండి, రోజూ శుభ్రంగా తయారై, నవ్వుకుంటూ పనికి వచ్చేది.'

'మా పిన్నిని, ముఖ్యంగా మా పనిమనిషి పున్నమ్మని చూసిన తర్వాత, వీళ్ళు ఇంత తక్కువ డబ్బులతో, ఇన్ని కష్టాలతో హాయిగా ఉండగలుగుతున్నారు , మరి నాలో ఇంత అసంతృప్తి ఎందుకు, నేను ఎందుకు హాయిగా ఉండలేకపోతున్నాను అని ఆలోచించటం మొదలు పెట్టాను. నాకు ఒక సంగతి బాగా అర్థమైంది. వాళ్ళు ఉన్నదానితో తృప్తి పడి చేతనైనంత సంతోషంగా ఉండటానికి చూస్తున్నారు. లేనివాటికి గొడవ పడటం లేదు. ఈ ఆలోచన రాగానే ఒక్కసారిగా నా కళ్ళు తెరుచుకున్నట్లు అయింది. వాళ్ళతో పోల్చుకుంటే నాకు ఎన్ని ఉన్నాయో ననిపించింది.

' ఇప్పటిదాకా ఏదో నాకు తక్కువైందని అనుకోవటమేగాని నాకు ఏమి ఉన్నాయో నేను చూసుకో లేదు. ఎన్ని ఉన్నా, ఇంకా మనకు లేనివి చాలానే ఉంటాయి. ఈ కోరికలకు అంతు ఎక్కడ? నేను కూడా ఈ కోరికల వలయంలో, అమెరికా పోటీతత్వంలో పడి కొట్టుకు పోతున్నానని బాగా తెలిసి వచ్చింది. కష్టం, సుఖం కాని, సంతృప్తి, అసంతృప్తి కాని మన మనస్సును బట్టి, మనం చూసే పద్ధతిని బట్టి ఉంటుందని అర్థమైంది.'

'నేను అదృష్టవంతురాల్ని. నాకు అన్నీఉన్నాయి. గారాబంగా చూసే తల్లితండ్రులు, ప్రేమగా చూసి, బాధ్యతగా మంచి, చెడ్డలు చెప్పే మీలాంటి భర్త, చక్కటి కొడుకు, ఉండటానికి మంచి ఇల్లు, సంపాదించుకోవటానికి కావలసిన చదువు, ఇంతకన్నా ఏమి కావాలండీ? ఇకనించి ఉన్నవాటికి సంతోషిస్తూ, వసుధ పిన్ని లాగ, పున్నమ్మ లాగ హాయిగా ఉండాలి అని నిశ్చయం చేసుకున్నాను" అని చెప్పింది.

అంతా విన్న సుందరం కవితలో మార్పుకి మనసారా సంతోషించి, కవితని చూసి గర్వపడ్డాడు.

# మార్గమేదే మనసా? తాడికొండ కె. శివకుమార శర్మ

"సంగీతజ్ఞానము భక్తి వినా సన్మార్గము గలదే ఓ మనసా" అన్నాట్ట త్యాగయ్య. భక్తి నాకు చాలా ఎక్కువంటుంది మా ఆవిడ. వెంటబడల్లా పెళ్ళిచేసుకోవడానికి – నన్నే, ఇంకెవరినీ కాదు – ఒప్పించాను గనుక నాకు మనసుందంటానికి ఋజువు తనేనంటాను. పెళ్ళైన కొత్తల్లో ఆ డైలాగ్ కొట్టగానే నాకు ఓ ముద్దిచ్చేది. ఇప్పుడు మాత్రం, "మ పోయి నస మిగిలింది" అంటుంది.

నా భక్తి ఆవిడమీదయితే కోపం తెచ్చుకోవడానికి ఆవిడకి అంత అవకాశం ఉండేదికాదు. అది ఆ రామయ్య మీద మాత్రమే అయినా ఆవిడ చెప్పిన పనులన్నీ చేసిన తరువాత తీరిక సమయాల్లో "జై శ్రీరాం" అనుకుంటే ఆవిడకేమీ అబ్జెక్షన్ వుండేదికాదు. కానీ, ఆవిడ చెప్పే పనులు చెయ్యడానికి కుదరనీయకుండా, ఆ భక్తికి ఎరువులేసి, నీళ్ళుపోసిన రామానందసాగర్ గారంటే ఆవిడకి చెప్పలేనంత కోపం. ఎందుకంటే, ఆయన తీసిన రామాయణం సీరియల్ అమెరికాలో మాకు శనివారం పొద్దున్న పది గంటల ప్రాంతంలో టీవీలో ప్రసారం చేసేవాళ్ళు. అది సరిగ్గా మా పిల్లలకి స్విమ్మింగ్ క్లాసుల సమయం. నేను రామాయణం వంకపెట్టుకుని శనివారం అనికూడా దయలేకుండా, బయట ఎండయినా ఎముకలు కొరికే చలి అయినా నిర్దాక్షిణ్యంగా ఆవిణ్ణి పొద్దున్నే నిద్రలేపించి, మా మూడు, ఆరు ఏళ్ళ పిల్లలని తయారుచేయించి, కార్లో అయిదుమైళ్ళు తోలుకుని వెళ్ళేలా చేశానని ఆవిడకి నామీదే కాక దానికి కారణభూతుడయినందుకు ఆ సాగర్ గారిమీద కూడా కోపం.

ఎంత కోపం అంటే, నేను ఆ సాగర్ గారి రామాయణం పోస్టర్ ఒకటి ఇండియా ట్రిప్పులో పట్టుకొచ్చానా – అదే, సీతాలక్ష్మణమారుతి సహిత రాముడుండేది – దాన్ని మా లివింగ్ రూంలో తగిలిస్తానంటే ఆవిడ ససేమిరా అంది. "రాముడి బొమ్మని కూడా ఇంట్లో ఉండనియ్యవా, నువ్వు రావణుడి చెల్లెలువా? " అని ఎగిరాను. ఆ నాగాస్త్రాన్ని, "మీ భార్యని" అన్న గరుడాస్త్రంతో ఛేదించింది. నాకు చిర్రెత్తి ఏకంగా సాగర్ గారి ఫోటోనే సంపాదించి ఫ్రేం కట్టల్లా నిలబెట్టాను. ఆ పాశుపతాస్త్రాన్ని తట్టుకోలేక ఆవిడ ఆ పక్కనించీ వెళ్ళినప్పుడల్లా కళ్ళకు చెయ్యి అడ్డుపెట్టుకునేది.

ప్రతీ సీరియల్‌కీ మొదటి ఎపిసోడ్ లాగానే చివరి ఎపిసోడ్ కూడా తప్పదు అనేది జగమెరిగిన సత్యం. దాని మీద పెట్టుకున్న మా ఆవిడ ఆశలు కాస్తా వెనువెంటనే "మహాభారాత్" మొదలుకాగానే ఆవిడతోబాటు స్విమ్మింగ్ పూల్‌కి వెళ్ళి అందులో దూకి ఆత్మహత్య చేసుకున్నాయి.

ఈ కాలంలోనే మా ఇండియా గ్రోసరీ షాపువాడు రామాయణం వీడియోటేపుల సెట్టుని అమ్ముతుంటే నాలుగు వందల డాలర్లు పెట్టి కొనుక్కొచ్చేశాను. దానితో, శని ఆదివారాల్లోనే కాకుండా మిగిలిన రోజుల్లో కూడా, పిల్లలకి కల్చర్ గూర్చి చెప్పడానికి ఇది మంచి మార్గం అని తోచడంవల్ల, ఆఫీసునించీ ఇంటికొచ్చిన తరువాత ఆ టేపులని ప్లే చేస్తూండేవాణ్ణి. తరువాత్తరువాత మెల్లిగా జారుకున్నారుగానీ నేను చెప్పింది వింటూ మొదట్లో పిల్లలు శ్రద్ధగానే చూశారు. ప్రత్యేకంగా ఆ హిందీ రామాయణంలో నాకు నచ్చినదేమిటంటే, డైలాగ్‌కీ డైలాగ్‌కీ మధ్య, దానిని తీరిగ్గా తర్జుమా చేసే సమయం ఉండడం. మీకూ గుర్తుండే వుంటుంది. ఒక సీన్లో నలుగురు వ్యక్తులు – ఉదాహరణకి రాముడు, దశరథుడు, వసిష్ఠుడు, విశ్వామిత్రుడు – ఉన్నారనుకుందాం. దాన్లో విశ్వామిత్రుడు, "రాముణ్ణి నాతో పంపించండి మహారాజా" అన్న డైలాగ్ చెప్పిన తరువాత, కెమేరా లాంగ్‌షాట్‌లో మొదలై, మెల్లిగా క్లోజప్పులోకెళ్ళి చిరునవ్వుతోవున్న రాముడి ముఖాన్ని టీవీ స్క్రీన్ మొత్తం నిండేలాగా చూపించి మళ్ళీ అంత మెల్లిగానూ లాంగ్ షాట్‌లోకెళ్ళి, ఆ తరువాత అదే విధంగా దశరథ మహారాజునీ, అటు పిమ్మట వసిష్ఠుణ్ణీ, మళ్ళీ విశ్వామిత్రుణ్ణీ లాంగ్‌షాట్-క్లోజప్-లాంగ్‌షాట్ కాంబినేషన్లో చూపించిన తరువాత గానీ దశరథుడు విశ్వామిత్రుడికి జవాబివ్వడు. ఈ సమయం పిల్లలకి ఆ డైలాగ్‌ని తర్జుమా చెయ్యడానికి మాత్రమే కాక, వాళ్ళకి అప్పుడప్పుడూ వచ్చే సందేహాల నివృత్తికై హరికథల్లోనూ, పురాణ ప్రవచనాల్లోనూ దొర్లే పిట్టకథలాంటివాటిని కూడా చెప్పగలిటంత వ్యవధినిచ్చేది. ఆ నటీనటుల హావభావాల్ని అంత అందంగా కాప్చర్ చేసిన సాగర్ గారంటే నాకు ఎనలేని గౌరవం వున్నాగానీ ఆ సమయాన్ని కాఫీ తయారుచేసుకోవడానికీ, బాత్రూంకి వెళ్ళిరావడానికీ కూడా అప్పుడప్పుడూ వినియోగించుకొనేవాణ్ణి. మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చున్నప్పుడు ఆయన్ను క్షమాపణ కోరుకుంటూ చెంపలేసుకునేవాణ్ణి.

మా పెద్దవాడికి పదేళ్ళు వచ్చేసరికి మాకు తెలుగు ప్రోగ్రాములు టీవీలో రావడం మొదలుపెట్టాయి. వారానికి ఏదో ఒక అరగంట రావడంలా కాకుండా మాటీవీ, ఈటీవీ, ఆటీవీ, ఏదోఒకటీవీ – అబ్బ ఎన్ని ఛాయిస్‌లో – 24గంటలూ రావడం మొదలుపెట్టాయి. ఇవ్వొచ్చి నా రామాయణం చూసే స్కెడ్యూల్‌కి అంతరాయం కలిగించాయి – ఎందుకంటే, రిమోట్ కంట్రోల్ మా ఆవిడకి ఒక శరీరభాగమైపోయింది. పిల్లలు హోంవర్క్ చేసే టైంలో ఈ సీరియల్స్ ఎందుకు అని నేను విసుక్కుంటే, ఇలాగయినా తెలుగుభాష పిల్లల చెవిని పడుతుందని ఆవిడ ప్రజాసేవ చెయ్యడానికి మాత్రమే ఎలక్షన్లలో నిలబడుతున్నానన్న రాజకీయ నాయకుని చందాన వాదించింది. నాక్కూడా అవుట్‌సోర్సింగులవల్ల విదేశాలలో వున్నవాళ్ళతో — అదే, భారతదేశంలో వున్నవాళ్లతో – డీల్ చెయ్యవలసివచ్చి నా రూంలోకెళ్ళి తలుపేసుకుని పనిచేసుకోవడంవల్ల నేను టీవీ చూడడం బాగా తగ్గిపోయింది.

సన్మార్గానికి త్యాగయ్య చెప్పిన రెండు ముఖ్యమయిన వాటిల్లోనూ నేనిప్పటిదాకా రెండోదాన్ని గూర్చి మాట్లాడలేదెందుకని అన్న సందేహం మీకు రావడం సహజమే. దానికి కారణం సీతారావుఁడు. నేను ఐఐటీ మద్రాసులో పీహెచ్‌డీ చేస్తున్న రోజుల్లో వాడు హాస్టల్లో నా పక్కరూంలో ఉండేవాడు. వాడిని అక్కడే వదిలేశానన్న తృప్తినీ, ఆనందాన్నీఓ పదిహేనేళ్ళపాటు హాయిగానే అనుభవించాను. వాడు ఈసారి పర్మనెంట్‌గా నాజీవితంలో ప్రవేశించడానికి కారణం మా ఆవిడ.

ఒక శనివారంనాడు నేనింట్లోవున్న సమయంలో "ఓ" అని దీర్ఘంగా సాగదీస్తూ ఏడుస్తున్న ఒక గొంతు నాకు వినిపించింది. సీతారావుఁడు మా యింటికెప్పుడొచ్చాడు అని నేను గబగబా మా లివింగ్‌రూంకి వచ్చి చూసినప్పుడు వాడు కనపడలేదుగానీ మా ఆవిడ చూస్తున్న టీవీలోంచి ఎవరో ఒకావిడ రెప్పలార్చకుండా మా లివింగ్‌రూంలోకే చూస్తోంది. ఆపాటికే ఆవిడ మా యింట్లో కనిపిస్తున్న

సరంజామా అంతా చిట్టారాసుకుని వుండకపోతే, నేనొచ్చి ఆవిడని చూస్తూ వుండిపోయిన సమయంలో ఖచ్చితంగా ఆ పనిని ముగించి వుండవచ్చు. ఆవిడని టీవీద్వారా లోపలకి రానిచ్చిన మిగతా ఇళ్ళల్లో వున్న సామానంతా కూడా చిట్టాని రాసుకోగలిగేంతసేపు ఆవిడ అలా చూసిందనే నా నమ్మకం. కెమెరా ఏంగిల్ మారేసరికి ఆవిడకి సమాధానమిచ్చినవాడు మా యింటికప్పుకేసి చూస్తున్నాడు. బావుంది – ఆవిడేమో సామాన్ల చిట్టా రాస్తుంది, వీడేమో యింటివాసాలు లెక్ఖపెడతాడు – టీం వర్కన్నమాట! అనుకున్నాను. ఎంతయినా, రాముడు నా కళ్లల్లోకి చూట్టం వేరు, వీళ్లెవరో మా యింట్లోకి అలా చూట్టం వేరు – కాదంటారా, చెప్పండి!

నేనీమాత్రం నా మెదడుకి డైవర్షన్ని కలిపించి వుండకపోతే టీవీలో వస్తున్న సీతారావుఁడి ఘోషకి స్పృహకోల్పోయిన నన్ను అర్జెంటుగా హాస్పిటల్కి తీసుకెళ్ళాల్సివచ్చేది. దానికి కూడా మా ఆవిడ ఆ ఎపిసోడ్ అయిపోయేదాకా ఆగేదనే నా నమ్మకం. రాయిలా బిగదీసుకుపోయి నిలబడివున్న నన్ను చూసేసరికి మా ఆవిడకి ఆనందం వేసింది. "రండి, కూర్చుని బిగదీసుకు పొండి," అని సోఫాలో పక్కన చోటిచ్చింది. భయపడి అక్కణ్ణించీ పారిపోయి నా రూంలోకి దూకి ధడాల్న తలుపేసి చెవుల్లో దూదిపెట్టుకున్నాను.

చెవులు ముయ్యగలనుగానీ మెదడులో తిరిగే న్యూరాన్లను ఆపగలనా? కళ్ళకి చేతులని అడ్డంపెట్టగలనుగానీ మూసిన కనురెప్పల వెనుక వేసే సినిమాని చూడకుండా వుండగలనా? వద్దన్నా సీతారావుఁడు కనిపించాడు.

వాణ్ణిగురించి చెప్పాలంటే ముందు వాడి హార్మోనియంగూర్చి చెప్పాలి. ఆ నోరులేని జీవంమీద వాడి చుట్టుపక్కల వుండేవాళ్ళకి అమితమైన కసిని కలిగించినవాడు వాడే. దాని దశ బావున్నప్పుడు వాళ్ళ తాతయ్యకి నాటకరంగం మీద ఒక వెలుగు వెలగడానికి హీరోలాగా తోడయ్యింది. ఈ దశలో, ముసలివాడయిన హీరో ఏదో ఒక సైడ్ కారెక్టర్ దొరికితే చాలు ఈపూట గడవడానికి అని తిరిగినట్లుగా ఆశతో వీడిదగ్గరకి చేరింది. నా దురదృష్టంకొద్దీ, వాడు నాకు అప్పుడయిన తరువాతకానీ అది రంగస్థల ప్రవేశం చెయ్యలేదు. (అలా కాపోయుంటే వాడికి దూరంగా ఎప్పుడో పారిపోయుండేవాణ్ణి.) అంటే అది నడిచొచ్చిందనికాదు. వాడే పట్టుకొచ్చాడు. తాతగారి ప్రతిభని ఆయన పోయినదాకా గుర్తించనందుకు వాడు చింతించి, ఎప్పుడో విన్న "పరాబ్రహ్మ పరమేశ్వర"ని దానిమీద వాయిస్తూ గొంతుకలపబోయాడు.

అయితే, దానికి అతని శరీరభాగాలు అంతగా సహకరించలేదు. వాడి గొంతులోనుండీ వెలువడే శబ్దాలను కలవడానికి హార్మోనియంలో ఏ మెట్లు ఎక్కాలో వేటిని తొక్కాలో చేతివేళ్ళకి తెలియలేదు. వాడి గొంతులో పలికినది తప్పకుండా ఏదో ఒక స్వరం అయ్యేవుంటుంది. ఆ హార్మోనియంలో కూడా ఏదో ఒక మెట్టుతో అది కలవవచ్చు. కానీ ఈ వేళ్లే భక్తిసోపానపటంలో ఎదురయ్యే దేవకాంతల్లాగా అడ్డొచ్చాయి. హార్మోనియం శబ్దాలకీ వాడి గొంతు పోకడలకీ పొసగట్లేదని వాడి చెవులకి తెలియకనైనా వుండాలి లేక చెవులు చేరేసినా అర్థం చేసుకునే సామర్థ్యం వాడి మెదడుకైనా లోపించివుండాలి. ఇంక గొంతు విషయానికొస్తే, సంగీతం బాగా నేర్చుకున్నవాళ్లకి కూడా ఎంతో కృషిచేస్తేగానీ రాని శృతిభేదం వాడికి అలవోకగా పట్టుబడింది – వాడి గొంతు ఒక శృతిలో ఎప్పుడూ ఏ పాటనీ పూర్తిగా వెలువరించకుండా వీడికోసమే తయారుచేసిన ప్రత్యేక కేటగిరీలో గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి వీణ్ణి ఎక్కించింది.

హాస్టల్లో మూడవ అంతస్తులో మొదట్లో అప్పుడప్పుడూ ఆ తరువాత క్రమంగా ఎల్లప్పుడూ అర్ధరాత్రివేళ మొదలుపెట్టే వీడి సంగీతవిభావరి చుట్టుపక్కల చెట్లమీద నిద్రపోతున్న కాకులని భయపెట్టడమే కాకుండా అవి కొంపలు మునిగిపోతున్నట్లు బావురుమంటూ చేసే ఆక్రోశాలను కూడా కలిపి చుట్టుపక్కల వాళ్లు “కాకిగోల” అని తిట్టే తిట్లు వాడిగూర్చేనన్న సందేహం వాడికెప్పుడూ రాలేదు. అక్కడ భారతదేశభాషలన్నీ రిప్రజెంట్ చెయ్యబడడంవల్ల మిగిలిన భాషల్లో తిట్లన్నీ అప్పుడయితే ఎంత నిద్రలోవున్నప్పుడు నన్ను లేపినా చెప్పేవాణ్ణేగానీ ఇప్పుడేవీ గుర్తులేవు. భాష వాడకపోతే మర్చిపోతారంటారుగదా, నా విషయంలో అదే జరిగింది. నన్ను ఒకసారి వాడి కచేరీగూర్చి నా అభిప్రాయాన్ని అడిగినప్పుడు కర్ర విరగకుండానూ పాము చావకుండానూ వుండేటందుకని, “నువ్వు తప్ప ఎవరూ అలా కచేరీ చెయ్యలేరురా”

అని చెప్పా. అప్పటినించీ వాడి కచేరీకి ఒక వేళాపాళా లేకుండాపోయింది. ముప్పైరెండు రూముల ముందు పొడుగ్గావున్న కారిడార్‌కి రెండు చివర్లా బాత్‌రూములున్నా, వాడి రూముని దాటడానికి భయపడ్డవాళ్ళంతా ముప్పై రూములని దాటైనా సరే వెళ్లి ఎప్పుడూ రెండో బాత్‌రూం దగ్గరే క్యూ కట్టేవారు.

నేను వాడిని ప్రోత్సహించానని మా హాస్టల్లో మిగతావాళ్లు నాతో మాట్లాడ్డం మానేశారు. నాక్కోపంవచ్చి, ఒకరోజున నేను వాడి రూంతలుపు తెరిచివుండగా చెయ్యిపట్టుకుని అర్జెంటుగా నారూంకి లాక్కొచ్చా. ముందుగా ప్లాన్ చేసిన ప్రకారం మా మెస్‌వర్కర్ ఒకడు ఆ హార్మోనియాన్ని ఎత్తుకెళ్ళిపోయాడు. ఒప్పందం ప్రకారం వాడు డాబామీదకెక్కి అక్కణ్ణించీ పడెయ్యాలి. మాకు అది పడ్డ శబ్దం వినిపించలేదుకానీ, అది మాయమయ్యిందికదా అని తృప్తిపడ్డాం. ఆరోజు నిద్ర కరువయ్యింది సీతారావుఁడికొక్కడికే.

ఆ ప్రశాంతత రెండ్రోజులుకూడా నిలవలేదు. ఒకనాడు రాత్రి తొమ్మిదిగంటలకు హాలీవుడ్ హారర్ సినిమాల్లో వచ్చే శబ్దంవంటిది వినిపించి భయపడుతూ వాడి గదిలోకి తొంగిచూస్తే అక్కడ వాడి చేతిలో ఒక వయొలిన్ కనిపించింది. నేర్చుకుంటున్న మొదట్లో వయొలిన్ దాన్ని నేర్చుకునేవాడికిచ్చే సహకారం వైల్డ్‌బుల్ బుల్‌ఫైటర్‌కిచ్చేటంత. అయితే, ఆ దున్నపోతు వల్ల బాధపడితే పడేది ఆ బుల్‌ఫైటర్ మాత్రమే. వయొలిన్ కలిగించే వయొలెన్స్‌కి గురయ్యేది మాత్రం చుట్టుపక్కలవాళ్లందరూను. హార్మోనియం వాయిస్తున్నప్పుడు ఏ మెట్టు నొక్కినా స్వరం శుద్ధంగానే వస్తుంది. అలాంటిదాన్ని వయొలిన్‌లోంచి బయటికి లాగాలంటే ఎంతో కృషిచెయ్యాలి. మా ఖర్మం కాలి, ఎంత కష్టపడ్డా గానీ ఏ ఒక్క స్వరం చిరునామాని కూడా వాడు ఆ వయొలిన్‌లో పట్టుకోలేకపోయాడు.

ప్రతీ శనివారం రాత్రి తొమ్మిదన్నరకి ఆలిండియా రేడియోలో వచ్చే శాస్త్రీయ సంగీతం కార్యక్రమంలో హిందూస్తానీ గాత్రసంగీతం వచ్చినప్పుడు వాడికి పగ్గాల్లేకుండాపోయేవి. వాడు ఆ గాయకులతోబాటు సమంగా గొంతు కలుపుతున్నాడనుకున్నాడుకానీ మా అభిప్రాయాన్ని చెప్పమని ఎప్పుడూ అడిగిన పాపాన పోలేదు. అడగకుండానే చెపితే దాన్ని జెలసీకింద కొట్టిపారేశాడుకూడా. ఇంక ఎవరయినా ప్రముఖవ్యక్తి దివంగతుడయినప్పుడు ప్రభుత్వం సంతాపదినాలుగా ప్రకటిస్తే వాడి ఆనందానికి అవధులుండేవికాదు. రోజంతా వచ్చే ఆ సారంగి, సరోద్‌ల సంగీతమంటే వాడు చెవికోసుకునేవాడు. వయొలిన్ మీద వాడు పలికిస్తున్న ప్రతీ స్వరమూ ఆ సంగీతమేననుకునేవాడు. రాజీవ్‌గాంధీ పోయినప్పుడు పదిరోజులకే దేశమంతటా సంతాపప్రకటన ఆగిపోయినా మాకుమాత్రం వాడి వయొలిన్ వల్ల ప్రతీ దినమూ సంతాపదినమే.

ఇలాకాదని ఒకరోజు వాణ్ణి మా ఓపెన్ ఎయిర్ థియేటర్లో వేస్తున్న జాస్ సినిమాకి లాక్కొనివెళ్లాను — వాడి వయొలిన్‌కి కాకపోయినా చుట్టుపక్కల కాకులకయినా కొంచెం విరామాన్నిద్దామని. వాడు ఏ చేతబడికి గురయ్యాడోగానీ ఆ సినిమాలోని నేపథ్యసంగీతం వాడిని బాగా ఆకట్టుకొంది. ముఖ్యంగా ఆ షార్క్‌ని బోటులో వేటాడుతూ వెదుతున్న సీన్లో. మరునాడు వాడి రూంలో ఒక డ్రంసెట్ ప్రత్యక్షమయింది. ఆ తరువాత వాణ్ణి హాలీవుడ్ సినిమాలు చూడనీకుండాగానీ ఆ ఛేజింగ్ సీన్ల మ్యూజిక్‌ని ప్రాక్టీస్ చెయ్యనీకుండాగానీ ఆపడం నావల్ల కాలేదు. అవ్వే కాక మాస్కో ఆన్ ది హడ్సన్ సినిమా చూసి రొమాంటిక్ సీన్లకోసం శాక్సఫోన్‌ని కూడా కొన్నాడు. ఆ తరువాత క్లారినెట్.

“వాడిట్లా వాయిద్యాల ఘోషలో పడి కొట్టుకుంటుంటే చదువుకి అది అడ్డంరాదా?” అన్న ప్రశ్న మీకు కలగవచ్చు. కానీ, రీసెర్చ్ చేసేటప్పుడు త్వరగా అవగొట్టాలన్న తపన ఆ పరిశోధకుడికుండాలి. ఆ తొందర వాడికిలేదు. అయితే, ఆ ఘోష కలిగించిన కలవరాన్ని కాకులే వాళ్ల నాన్నకి చేరేసివుండాలి. ఆయన వచ్చి వాడి గైడ్‌ని కలిశారు. అప్పటికి వాడు ఏడేళ్లు అక్కడ గడిపేశాడు మరి! డిగ్రీ చేతిలో పడితే చాలు వుద్యోగం వేయించుకుంటానని ఆయన చెప్పారనీ, గైడ్‌గారు తన కూతుర్ని వాడు పెళ్లిచేసుకుంటేనే అన్న షరతుని విధించారనీ గిట్టనివాళ్లు చెప్పుకున్నాగానీ ఆరోజు వాడి హాస్టల్‌లో వాళ్లు పండగ చేసుకున్నారని నాకు తరువాత తెలిసింది — అప్పటికి నేను ఆ హాస్టల్ని వదిలి అమెరికాచేరి రెండేళ్లయింది.

అదిగో, దాని తరువాత వాడిగొంతుని వినడం నేనిదే.  అయినాగానీ, ఘంటాపథంగా ఒకటిమాత్రం చెప్పగలను.  వాడి గొంతు అమెరికా కాకులనికూడా లేపే స్థాయికి చేరింది. ఎంతో ఓర్పుని ప్రదర్శించి మా ఆవిడపక్కన కూర్చుని ఇంకొన్ని సీరియల్సూ ఎపిసోడ్సూ చూశాను – చక్రవాతం, అక్కాతమ్ముళ్లు, పూతరేకులు .... ప్రతీదాంట్లోనూ వాడి ప్రతిభ కొట్టొచ్చినట్లు కనిపించింది.  చెప్పుల్లో కాళ్లు దూర్చబోతున్నప్పుడు గుండెలదిరిపోయేలా డ్రంస్ వినవస్తాయి – ఆ చెప్పుల్లో బాంబు వున్నదని ప్రేక్షకుడికి సంకేతమిస్తున్నట్లుగా.  కానీ ఏ బాంబూ పేలదు! బీరువా తీస్తుంటే నక్కలు ఊళపెడతాయి దాన్లోనించీ దయ్యం బయటికివస్తుందన్నట్లుగా.  ఏ దయ్యానికీ ఆ టీవీవాళ్లు టీవీ స్టూడియో చిరునామా ఇచ్చినట్టు కనబడదు!! దండెం మీద తుండుగుడ్డ  వెయ్యబోతుంటే స్స్ స్స్ అని శబ్దం వినవస్తుంది అక్కడేదో పాము కరవడానికి నక్కివుందన్నట్లుగా.  అక్కడ పాముకాదు సరిగదా వానపాము కూడా వుండదు!!!

వాడు చేసిన (సంగీతం సమకూర్చిన – అని నాచేత అనిపించడం మీ వల్లకాదు!) సీరియల్స్‌లో ప్రతీదానికీ ప్రత్యేకత వుంది. పళ్లేల శబ్దాలు ఒక సీరియల్లో మాత్రమే వినిపిస్తాయి. చెంప ఛెళ్ మనడాలు ఒకదానికి ప్రత్యేకం. ఇవేకాక అన్నింటిలోనూ నక్కలు ఊళపెడున్నట్లు వాడి ఆక్రోశం, వయొలిన్ గరగర, డ్రమ్ముల డబడబ, సన్నాయి పీపీ, గుర్రాల గిట్టలమోత, రైలింజన్ శబ్దాలూ, హార్మోనియంలో ఏవో రెండుమెట్లని మార్చి మార్చి వాయించడాలూ – ఈపాటికి పరిస్థితి మీకు అర్థమయ్యేవుంటుంది. నేను గమనించినదేవిటంటే, ఇదంతా డైలాగ్‌కీ డైలాగ్‌కీ మధ్య ఫిల్లర్ మాత్రమే!  కనిపించే దృశ్యంతోగానీ, కల్పించిన సన్నివేశంతోగానీ, చెబుతున్న డైలాగ్‌తోగానీ ఏమాత్రం సంబంధం ఆ ఫిల్లర్‌కి ఉండనక్కరలేదు. ఉదాహరణకి, సూర్యోదయం స్క్రీన్‌మీద కనిపిస్తున్నప్పుడు వాడి గొంతులో ఆక్రోశం వినపడుతుంది.  సూర్యుడు కాబట్టి దాన్ని తట్టుకుంటున్నాడు.  అతడే గనక నాలాంటి అర్భకుడయితే పారిపోయి ప్రపంచాన్నంతటినీ పర్మనెంట్‌గా చీకట్లో ముంచేసేవాడు. వాడు గాత్రిస్తున్నప్పుడు మాత్రం అది హిందూస్థానీ సంగీతమేనని వాడు అనుకుంటాడని నా పూర్తినమ్మకం.

నాకు అర్థంకానిదల్లా ఒకటే.  వీడికి ఒక్కస్వరమయినాగానీ – అది వయొలిన్‌మీదయితేనేం, శాక్సాఫోన్‌మీదయితేనేం – సరిగ్గా వాయించడం ఎప్పుడొచ్చిందా అని.  ఇండియా వెళ్ళి వాణ్ణి కలిసినప్పుడు తెలిసింది – అది కీబోర్డ్ ప్రతిభ అని.  (ఆ మాత్రం తెలియని నాలాంటివాడి పి.హెచ్.డీ డిగ్రీని ఇచ్చినవాడు తలకిమాసినవాడని మా ఆవిడ తీర్మానించిందనుకోండి, అది ఉన్నవిషయం కావచ్చేమో కానీ తప్పకుండా వేరేవిషయం!) వాడి అడ్రస్‌ని టీవీ స్టేషన్ల ద్వారా సంపాదించి వాణ్ణి కలిశాను. వాడు తలుపు తీసి నన్ను ఆప్యాయంగా కావలించుకుని లోపలకి తీసుకువెళ్లాడు.  లోపలకు వెళ్ళగానే, తలుపులు మూసివున్నా బయటికి చొచ్చుకునివస్తున్న శబ్దం నిలయవిద్వాంసుల గిన్నెలవాద్యం అని నాకు బోధపడింది.  (వాడు, అది రాబోయే కొత్త సీరియల్‌కోసం ప్రత్యేకంగా చేస్తున్న కంపోజిషన్ అని చెప్పాడు – చుట్టుపక్కల శబ్దాలుకూడా వచ్చేలాగా రికార్డ్ చేస్తూ) అది కుటుంబసమేతంగా జరుగుతోంది.  వాళ్ళావిడ గాత్రవాయిద్యాన్ని వాడికి వదిలేసి పాత్రవాయిద్యాన్ని మాత్రం తన స్వంతం చేసుకున్నందుకు, "ఆహా! ఏమి నీలలు రామా! నీ భక్తుల సహనపు పరిమితులు నీకుగాక వేరెవరికి తెలుసు! ఆవిడకూడా గాత్రిస్తే మాలాంటి అర్భకులేమైపోయేవారోగదా!!" అని మనసులోనే వందనాలర్పించాను.   ఆవిడ వాళ్ల పిల్లలమీద గిన్నెలని విసరడం ఆపి, “రండన్నయ్యగారూ! మీగూర్చి ఆయన ఎంతో చెప్పారు. ఇదంతా మీ ప్రోత్సాహంవల్లనే” అన్నది.  నాగుండెకి చక్రవాతం కమ్మింది. “నా ప్రోత్సాహంవల్లనా?” అన్నాను నీరసంగా.

“అదేరా.  నువ్వు తప్ప ఎవరూ ఇలా వాయించలేరు – అన్నావు.  గుర్తులేదా?” అన్నాడు.  నేను ఏమాత్రం విలువనివ్వని వాడి ప్రతిభని ఆంధ్రదేశం గౌరవిస్తోందంటే అది నాలోని లోపమే అయ్యుండాలన్న నిర్ణయానికొచ్చాను. బైర్లుకమ్మిన నాకళ్లకి మొదట కనిపించింది హార్మోనియం. “ఇది ..” అన్నాను.  “మా తాతయ్యదేరా. నా అదృష్టంకొద్దీ ఆ కొట్టేసినవాడెవడో వేలాచేరిలో అమ్మేశాడు. నాక్కనిపించింది. వెంఠనే తెచ్చుకున్నాను,” అన్నాడు. (ఆ వేలాచేరి అన్న పేట మా ఐఐటీ కాంపస్ వెనకే వుంటుంది.)  అది ఎవరి పాదాలచెంతో వున్నట్టు

కనిపించి తలెత్తి చూశాను. ఆ పాదాలు నిలువెత్తునవున్న రామానందసాగర్ గారి ఫోటోలోవి. "నీక్కూడా ఆయనంటే ..." అని మధ్యలోనే ఆపేశాను.

"నేను ఇంతవాణ్ణవడానికి కారణం ఎవరనుకున్నావ్? ఆయనే నాగురువు" అన్నాడు భక్తిగా చేతులని జోడిస్తూ. నామొహం చూస్తే వాడికర్థమయ్యుండాలి, "ఏకలవ్య శిష్యరికం" అని జోడించాడు. నేను ఆయన తీసిన రామాయణంలోని డైలాగుల మధ్య గాప్‌లని మా పిల్లలకోసం తెలుగులోకి తర్జుమా చెయ్యడానికి వాడుకుంటే, వాడు ఆ టైంలో వచ్చిన మ్యూజిక్ ఐడియా తీసుకున్నాడన్నమాట. వాడు నాకు చెప్పినదేమిటంటే, టీవీ సీరియళ్లు మొదలుపెట్టిన కొత్తల్లో యాక్టర్లకి సీన్లని వివరించడానికి సమయమూ, వనరులూ లేక, షూటింగ్ జరుగుతుండగా అసిస్టెంట్ డైరెక్టర్ ముక్కలుముక్కలుగా అందిస్తున్న డైలాగుల్ని యాక్టర్లు అప్పచెబుతుండగా కలిగిన ఎమోషన్ల గాప్‌ని వీడి శబ్దకాలుష్యంతో (ప్రతిభతో – అని వాడన్నాడు) నింపడంవల్ల ప్రేక్షకులు పట్టించుకోలేదట. ఫస్ట్‌మువర్ ఎడ్వాంటేజ్ తీసుకుని వీడు అంచెలంచెలుగా ఎదిగిపోయాడు. కీబోర్డులో ప్రి-ప్రోగ్రాం చేసివున్న మెరుపులు, ఉరుముల శబ్దాలు, రకరకాల వాయిద్య శబ్దాలు, వాడికి బాగా సహకరించాయి. సహకరించనిదల్లా ఎప్పటిలాగా వాడి గాత్రమే.

ఉన్న కొద్దిపాటి భక్తీ – రాముడిమీద కాకపోయినా సాగర్‌గారి మీద – చూపిన సన్మార్గమేదో సీతారావుడికి తెలుసు. నేను మాత్రం, ఇంటికెళ్లగానే మా యింట్లో వున్న సాగర్‌గారి ఫోటోని లివింగ్‌రూం గోడమీదనించీ స్టోరేజీ రూంలోకి మార్చాలని నిర్ణయించుకున్నాను – ఆయన మీద కోపంతో కాదు. ఆ ఫోటోని చూసినప్పుడల్లా మదిలో మోగే సీతారావుడి మోతలని అరికడదామన్న నిశ్చయంతో మాత్రమే. భక్తికి తగినంత సంగీతజ్ఞానం నాకు ఉన్నదో లేదో తెలియదుగానీ నన్ను నేను తట్టుకోవడానికి దొరికిన మార్గం మాత్రం ఇదే.

# మంచు గూడు — ఎస్. నారాయణస్వామి

**మిస్ జెరూ గొంగళిపురుగుల్ని గురించి వాగుతూనే ఉంది.** ఆవిడ మాట్లాడుతున్న మాటలు గాలిలో మెలికలు తిరుగుతూ నా డెస్కు దాకా వచ్చేస్తున్నాయ్ గొంగళిపురుగుల్లాగానే. నాకు గొంగళిపురుగులంటే భయం. అవి నా దగ్గిరికి వచ్చినప్పుడల్లా ఉఫ్ మని ఊది వాటిని చెదరగొట్టేస్తున్నా. ఈ ట్రిక్ నాకు నా బెస్ట్ ఫ్రెండ్ డోరా చెప్పింది. డోరాకి గొంగళిపురుగులంటే అస్సలు భయం లేదు. సమతా, ఉఫ్ మని ఊదేస్తే ఆ మాటలన్నీ చెదిరిపోతాయ్ అని చెప్పింది డోరా. ఈ గొంగళిపురుగుల్నిఅలా ఒదిలేస్తే అవి చెవిలోనుంచి నా బుర్రలో దూరేసి నాకు తలనెప్పి తెస్తాయి. డేడీ అమెరికా వచ్చాకా నేనూ అమ్మాకొన్నాళ్ళు గుంటూర్లో నానమ్మ దగ్గిర ఉన్నాం కదా, అప్పుడు నానమ్మ కూడా ఇలాగే వాగుతూనే ఉండేది. అవి గొంగళిపురుగులు కూడా కాదు, తేళ్ళు, జెర్రులు. నా బుర్రలో దూరేసి ఛాలా తలనెప్పి తెచ్చేవి. అప్పటికింకా డోరా నాకు తెలియదుగా అందుకని ఈ ట్రిక్ కూడా తెలియదు. అలాగే తలనెప్పితో ఏడుస్తుండేదాన్ని. ఆ తరవాత విజయవాడ తాతయ్యా అమ్మమ్మా దగ్గిరికెళ్ళిపోయాంగా.

అబ్బా, ఇప్పుడు డోరా నా పక్కన ఉంటే ఎంత బాగుణ్ణో. గొంగళిపురుగుల్నిఉఫ్ మని ఊదేస్తూనే కిటికీ లోంచి బయటికి చూస్తూ కూర్చున్నా. కిటికీ బయటంతా మంచు, ఎక్కడ చూసినా మంచే. బయట యార్డు, చెట్లు, పార్కింగ్ లాట్ .. అంతా మంచే. నాకిష్టం మంచు. మా విజయవాళ్ళో ఎప్పుడూ వేడిగానే ఉంటుంది. ఇక్కడ మొంటానాలో ఒకటే మంచు. పాపం అమ్మకి మాత్రం మంచు అస్సలు ఇష్టం లేదు. ఇంట్లో వెచ్చగానే ఉన్నా, బయట మంచు పడ్డం చూసి కూడా వణికిపోతుంది. ఇంక బయటికి రావడం అంటే .. హమ్మో, అసలు అడుగు తీసి బయటికి పెట్టదుగా. అందుకనే మొన్న డేడీకి కోపం వచ్చింది. పాలు ఐపోయాయి. సూపర్ మార్కెట్ పక్కనే కదా, వెళ్ళి తెచ్చుకోవచ్చుకదా అన్నారు డేడీ. ఈ మంచులోనా, నేను చచ్చినా వెళ్ళను అంది అమ్మ. డేడీకి చాలా కోపం వచ్చింది. సమతా, నీ గదిలో కెళ్ళు అన్నారు. డేడీ చెప్పకముందే నేను నా పుస్తకాలు, సంచీలో పెట్టేసుకుని నా గదిలోకెళ్ళిపోయాను.

తలుపేసేస్కున్నాను. ఐనా వాళ్ళ మాటలు గొంగళిపురుగుల్లా తలుపు సందుల్లోంచి దూరి లోపలికొచ్చేస్తున్నాయి. అందులో డేడీ పురుగులు కొన్ని – అమ్మ పురుగులు కొన్ని.

"ఏంటి లలితా ఈ మొండితనం?"

"నాదా మొండితనం? ఎవరు ఈ మంచుగుహలోకి తీసుకొచ్చి పడేసింది? నేనా?"

ఇంకా వస్తున్నాయ్. ఈ సారి అవి గొంగళిపురుగుల్లా లేవు. వాటిని చూస్తుంటే నాకు మెల్లగా భయం మొదలవుతోంది. అంతలోనే ..

"హుష్. మెల్లగా. సమత వింటే బాగోదు. గొంతు తగ్గించు." చూస్తుండగానే విచిత్రమైన పురుగులు చిన్న చిన్నవైపోయి మొత్తానికి మాయపోయినై. హమ్మయ్య, అని నేను బెడ్ మీదనించి కాళ్ళు మెల్లగా కిందికి దించి నా బేగులోనించి పుస్తకం తీసుకుని చదువుకోడం మొదలెట్టాను. అలా పుస్తకంలో మునిగిపోయాను.

ఎంతసేపయిందో తెలీదు. అంతలోనే .. గొంగళిపురుగుల్లా కాదు మెలికీసుల్లా, జెర్రుల్లా .. లోపలికొచ్చేస్తున్నాయ్ మాటలు .. కాదు కాదు అరుపులు, కేకలు. నేను గబుక్కుని కాళ్ళు బెడ్ మీదికి లాక్కున్నా. ఐనా అవి గదంతా నిండిపోతున్నై. అప్పుడే డోరా నాకు ఈ ఐడియా చెప్పింది. ఉఫ్ ఉఫ్ మని ఊదడం మొదలెట్టాను. నా చుట్టూ గిరికీలు కొడుతున్న జెర్రులు పఫ్ పఫ్ మని మాయమైపోతున్నై. ఇదేదో భలే ఉందే అని ఇంకా బలంగా ఊదడం మొదలుపెట్టాను. చాలా సేపు అలా ఊదుతూనే ఉన్నాను. బుగ్గలు నెప్పెడుతున్నాయి. ఒక పక్కన నిద్దరొస్తున్నది. నిద్దరపోతే భయం, ఎక్కడ జెర్రులు నా చెవుల్లోకి దూరేసి తలలో నొప్పెడతాయో అని. ఆవలిస్తున్నాను. ఉఫ్ ఉఫ్ మని ఊత్తూనే ఉన్నాను. ఎప్పుడు నిద్రపోయానో? పొద్దున నా అలారం మోగేప్పటికి మెలకువొచ్చింది. డోరా ఎప్పుడెళ్ళిపోయిందో?

ఇప్పుడూ డోరా ఉంటే ఎంత బాగుణ్ణు. కిటికీనించి ఇటు క్లాసులోకి చూశాను. క్రిస్టీ తన పక్కన డెబ్బీతో ఏంటో గుసగుసలాడుతోంది. క్రిస్టీ అంటే నాకు ఇష్టం. డోరా అంత ఇష్టం కాదు. కానీ బాగా ఇష్టమే. నేను ఫస్ట్‌లో ఈ స్కూల్లో చేరినప్పుడు .. అంటే ఇప్పుడు ఫస్ట్ ఫస్ట్‌లో అమ్మా నేనూ విజయవాడ తాతయ్య దగ్గిర్నించి విమానంలో డేడీ దగ్గిరికి, ఇక్కడ మొంటానాకి వచ్చేశాం కదా. ఈ వూరి పేరు గ్రేట్ ఫాల్స్ లే. అబ్బ, అదికాదు నేను చెప్దామనుకున్నది ఏంటంటే మరే క్రిస్టీ ఉందికదా. నేనేమో ఈ స్కూల్లో చేరినప్పుడు ఫస్ట్‌లో నాకెవ్వరూ తెలీదు. మా విజయవాడ స్కూల్లోనేమో నాకు చాలా మంది ఫ్రెండ్స్ ఉన్నారు. టీచర్స్ అందరికీ కూడా నేనే ఫేవరెట్. కానీ ఇక్కడ నేను కొత్త కదా. ఇంకా మిస్ జెరూకి నేను మాట్లాడితే అర్థం అయ్యేది కాదు. అబ్బ, ఎందుకంత గడబిడగా మాట్లాడుతావు, మెల్లగా చెప్పు అనేసింది మొదటి రోజునే. ఏంటో, మా నానమ్మ దగ్గర ఒకామె వచ్చేదిలే. వేసంకాలంలో ఆవకాయ అవీ చేసేటప్పుడు ఉప్పూ కారం

దంచడానికి. ఆమెకి తెలివితక్కువంట. అందుకని అందరిమీదా అరుస్తుండే నానమ్మ ఆమెకి మాత్రం ఏం చెయ్యాలో పని అంతా మెల్లగా విడమరిచి చెప్పేది. గబగబా చెబితే ఆమెకి అర్థమయ్యేది కాదంట. నేను కూడా ఇక్కడ మిస్ జెరూతో అలాగే మెల్లగా ఆమెకి అర్థమయ్యేట్టు మాట్లాడ్డం అలవాటు చేసుకున్నా. నాకు ఆ కారం దంచే ఆమెతో మాట్లాడినట్టే ఉండేది, టీచర్ గారితో మాట్లాడినట్టు కాకుండా. అదృష్టంగానీ, అప్పుడేమైందంటే, నేను క్లాస్‌లోకి వచ్చి కూర్చున్నాక మిస్ జెరూ నన్ను క్లాస్‌కి పరిచయం చేశారు కదా. అప్పుడు ఫస్ట్ క్రిస్టీయే నన్ను చూసి పలకరింపుగా చిర్నవ్వు నవ్వింది.

తరవాత బ్రేక్ టైంలో తనే వచ్చి పలకరించింది. క్రిస్టీ ఎంత బాగుంటుందో. బలే తెల్లగా ఉంటుంది. ఈ వూళ్ళో అందరూ తెల్లగానే ఉంటారు, కానీ క్రిస్టీ స్పెషల్. తన కళ్ళు నీలం రంగులో ఉంటాయ్ తెల్సా. విజయవాడ తాతయ్య ఎడమచేతివేలికి బ్లూ స్టోన్ ఉంగరం ఉందే, అట్లా మెరుస్తాయ్ క్రిస్టీ కళ్ళు. నేను కూడా తెల్లగానే ఉన్నా. కానీ క్రిస్టీ పక్కన చాలా డార్క్ గా ఉన్నట్టు ఉన్నా. ఆ ఫస్ట్ రోజున లంచ్ టైంలో లంచ్ తినేశాక ఇద్దరం ఒక్కసారే చేతులు కడుక్కోడానికి సింక్ దగ్గిరికి వెళ్ళాం. పక్క పక్కనే చేతులు కడుక్కుంటూ ఉంటే క్రిస్టీ తన తడి చేతిని నా చెయ్యి పక్కన పెట్టి – మనిద్దరం చాకలెట్–వెనిల్లా పక్కపక్కన ఉన్నట్టు ఉన్నాం – అంది. నాకప్పుడు చాలా కోపం వచ్చింది. నేనేం చాకలెట్ లాగా నల్లగా లేను అని అరుద్దామనుకున్నా. కానీ ఇంకా కొత్తగదా అని ఊరుకుండి పోయా. తరవాత క్రిస్టీ నాకింక ఫ్రెండ్ కదా, అందుకని ఇంకేమనలేదు.

బస్ దిగేప్పుడు అమ్మ అక్కడ ఉంటుందేమోనని చూశా. లేదు. మొదట్లో బస్ వచ్చే సమయానికి అమ్మ అక్కడిదాకా వచ్చి నాకోసం చూస్తుండేది. నేను బస్ దిగంగానే హగ్ ఇచ్చి ముద్దుపెట్టుకునేది. ఇద్దరం చేతులు పట్టుకుని ఊపుకుంటూ ఇంటికి నడిచేవాళ్ళం. మంచు పడడం మొదలైనాక అమ్మ నా బస్ దగ్గిరికి రావడం మానేసింది. ఐనా నాకేం భయం లేదు. నేనొక్కదాన్నే ఇంటికెళ్ళిపోతా. ఐనా ఒక్కోసారి ఎదురు చూస్తుంటా, అకస్మాత్తుగా అమ్మకి మంచు అంటే భయంపోయి బస్ దగ్గిరికి వచ్చిందేమోనని.

మెయిల్ బాక్సులోంచి ఉత్తరాలు తీసుకున్నా. ఎప్పుడూ అన్నీ తెల్లగా ఉండే కవర్లు – బోరు కవర్లు – అన్నీ డేడీ కోసమే. బేంకు నించి, క్రెడిట్ కార్డు నించి, ఫోన్ కంపెనీ నించి, ఇలాగ. ఇవ్వాళ్ళ ఒకలాంటి వయొలెట్ రంగులో ఒక కవరుంది. ఏంటబ్బా అని చూస్తే, దాని మీద అమ్మ పేరుంది, కానీ ఎక్కణ్ణించి వచ్చిందో ఎడ్రస్ లేదు. ఇండియా స్టాంపులు అంటించి ఉన్నై. తాతయ్య దగ్గర్నించేమో. కానీ ఎడ్రసు రాసింది తాతయ్యకాదు. ఐనా తాతయ్య అంత బిజీ కదా, కూర్చుని కవర్ మీద ఎడ్రస్ తనెందుకు రాస్తారు, సెక్రటరీ రాస్తుంది కానీ. అంతే, తాతయ్య దగ్గిర్నించే అయ్యుంటుంది ఈ కవరు.

నేను ఇంట్లోకెళ్ళేప్పటికి ముందు ఫోయర్ చీకటిగా ఉంది. లైట్ వేసి హాల్లో మెట్ల మీద ఉత్తరాల్నీ నా స్కూల్ బేగ్‌నీ పెట్టి, అక్కడే కూర్చుని స్నో బూట్లు విప్పుతూ అమ్మా అని పిల్చా. తాతయ్యనించి ఉత్తరం వచ్చినందుకు అమ్మ చాలా సంతోషిస్తుంది. నా పిలుపుకి బదులు చప్పుడు లేదు. బూట్లనీ, చలికోటునీ జాగ్రత్తగా క్లోసెట్‌లో పెట్టేసి, స్కూల్ బేగ్ మళ్ళీ భుజానికి తగిలించుకుని ఉత్తరాలు మళ్ళీ పట్టుకుని ఫేమిలీ రూంలో కెళ్ళాను. అక్కడకూడా చీకటిగానే ఉంది కానీ హాల్లో నేను వేసిన లైటు వెలుతురు కొద్దిగా కనిపిస్తోంది. కిటికీల తెరలన్నీ వేసేసి ఉన్నాయి. అమ్మకి కిటికీలోంచి మంచుని చూసినా వొణుకే.

అమ్మా అని గట్టిగా పిలుస్తూ గదిలోకెళ్ళా. "హుష్. ఎందుకలా అరుస్తావ్! మెల్లగా .. నాకు తలనొప్పిగా ఉంది." అమ్మ గొంతు రిక్లైనర్ లోనించి వినబడింది. బడి సంచీ పక్కన పడేసి పరిగెత్తుకెళ్ళి రిక్లైనర్ ముందు మోకాళ్ళ మీద కూర్చుని అమ్మ వొళ్ళో మొహం దాచుకున్నా.

ఎప్పట్లా అమ్మ నన్ను హత్తుకోలేదుకానీ ఒక చేత్తో నా తల నిమిరింది. "హబ్బ, ఎంత చల్లగా ఉందో నీ జుట్టు. ఏమి చలిదేశమ్రా దేవుడా!" అంది అమ్మ.

నేను తల మాత్రం పైకెత్తి అమ్మ మొహంలోకి చూస్తూ "అమ్మా, ఇవ్వాళ్ళ ఉత్తరాల్లో ఏం వచ్చిందో తెల్సా?" అన్నా. "ఏమొచ్చిందే పండూ?" అంటుందనుకున్నా.

అమ్మ అసలు నా మాట విన్నట్టు లేదు. అలాగే ఒక చేత్తో నా తల నిమురుతూ ఎక్కడో గది మూలకి చూస్తోంది పరధ్యానంగా.

ఇలాక్కాదని అక్కణ్ణించి ఇవతలకి దూకి టేబులు మీద పడేసిన ఉత్తరాల్లో ఆ మసక వెల్తుర్లోనే గబగబ వెతికి ఆ వయొలెట్ కవర్ తెచ్చి అమ్మ చేతిలో పెట్టా. పెట్టేసి, వెళ్ళి పెద్ద లైటు వేశా. అమ్మ ఇంకా అలాగే గది మూలకి చూస్తూ కూర్చుని ఉంది, చేతిలో ఇండియా ఉత్తరంతో. పాపం, తలనెప్పి బాగా ఉందేమో, మొహం చాలా శాడ్‌గా ఉంది. నేను మళ్ళీ అమ్మ దగ్గరికెళ్ళి కుదుపుతూ "చూడమ్మా, విజయవాడ తాతయ్య దగ్గర్నించి ఉత్తరమొచ్చింది." అన్నా. అప్పుడు అమ్మ తన చేతిలో ఉన్న కవర్ని చూసింది. చూడంగానే తన మొహంలో నేను అనుకున్న రియాక్షన్ వచ్చేసింది. ఆనందంతో చిరునవ్వు నవ్వింది. తన మొహంలో శాడ్‌నెస్ అంతా ఫట్ – ఫినిష్. ఉత్సాహంగా లేచి నించుంది. నించుని గబగబా కవరు తెరిచి ఉత్తరం చదువుకోవడం మొదలెట్టింది. ఉత్తరంలో ఏముందో చెబుతుందేమోనని నేను అలాగే నించుని చూస్తున్నా. కానీ అమ్మ మాత్రం నన్నస్సలు పట్టించుకోలా.

ఏంటో ఈ అమ్మ. నేను వంటగదిలోకెళ్ళి పాలు మైక్రోవేవ్‌లో వేడి చేసుకుని, కుకీ జాడిలోనించి రెండంటే రెండు కుకీలు తీసుకుని నా గదిలోకెళ్ళాను, ఒకటి నాకు, ఒకటి డోరాకి. నేను అమ్మ మీద అలిగాను. అందుకని నా గది తలుపేసేస్కున్నాను. అసలు తాతయ్యకి నేనే మోస్ట్ ఫేవరెట్. అదే అడిగాను డోరాని. నాకే ఉత్తరం రాయొచ్చు కదా, అమ్మకెందుకు రాశారు. ప్రిన్సెస్ అని నన్నే కదా పిల్చే వాళ్ళు, అమ్మని పిల్చారా ఏంటి? మరి లెటర్ నాకే కదా రాయాలి. తాతయ్య మీద బోల్డు కోపమొచ్చింది. డోరా అంది, తాతయ్యెందుకు, మీ డేడీ ఉన్నారుకదా అని. నిజమే, అబ్బ డేడీ ఐనా ఇంట్లో ఉంటే బాగుణ్ణు. డేడీ ఎప్పుడూ ఇంతే, ప్రతి రోజూ. తాతయ్య ఏ టైంలో ఇంటికి వచ్చినా నా ప్రిన్సెస్ ఏదీ అని గట్టిగా పిల్చి, నేను పరిగెట్టుకు రాంగానే నన్ను గట్టిగా పట్టేసుకుని ముద్దులు పెట్టేసేవాళ్ళు. డేడీకి పాపం ఇంకా అలవాటు లేదు కదా. ఎప్పుడన్నా నన్ను ఎత్తుకుని వొళ్ళో కూర్చో పెట్టుకుంటాడు, ఫస్ట్ ఫస్ట్‌లో నేనూ క్రిస్టీ ఫ్రెండ్స్ అయినప్పుడు ఐ లవ్ మై డాడ్ అని చెప్పిందది. డోరాతో చెప్తే, తనన్నదీ, నువ్వు కూడా యూ లవ్ యువర్ డాడ్. నిజమే కదా. కానీ రోజూ అలిసిపోయి వస్తాడు. అసలు ఒక్కో రోజునైతే డేడీ వచ్చేప్పటికి రాత్రైపోయి నేను నిద్రపోయుంటాను. నాకే పాపం అనిపిస్తుంది. అందుకనే అది కావాలిదికావాలని ఏం అడగను.

ఇవ్వాళ్ళ క్రిస్టీ అడిగింది లంచ్ దగ్గర – "మీ ఇండియాలో అమ్మాయికీ అబ్బాయికీ వాళ్ళ అమ్మానాన్నా చూసి పెళ్ళి చేస్తారంట కదా – ఎవరికి వాళ్ళు ఎంచుకోడానికి కుదరదంట కదా?" అని. ఇంతట్లోనే ఆ డెబ్బీది అందుకుంది – "ఛీ, యక్! పేరెంట్సా? నేనైతే నా రిక్కీని తప్ప చేస్కుకోనే చేసుకోను!" ఈ డెబ్బీదంతా ఓ పేద్ద బడాయి. ఫోర్త్ గ్రేడ్ అమ్మాయిల్లో దీనికొక్కదానికే బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడు. వాడు మా బళ్ళోనే ఐదో క్లాసు చదువుతున్నాడు. ఐతే ఎవడికి గొప్ప? అసలుకి క్రిస్టీ అడిగిన ప్రశ్న ఏంటో నాకు మొదట అర్థం కాలేదు. అర్థమైనాక చాలా కోపమొచ్చింది.

"నీకెలా తెల్సు, నువ్వు చూసొచ్చావా?" అన్నా, కొంచెం కోపంగానే.

"కాదు కాదు, కోప్పడకు. నువ్వు ఇలాగ మా క్లాస్ లో చేరావని మా అమ్మకి చెప్పాను. ఇండియా అంటే ఎక్కడ, ఎలాంటి ప్లేస్ అని అడిగాను. అప్పుడు కంప్యూటర్లో చూసి, ఇండియా గురించి చాలా చెప్పింది, బొమ్మలూ విడియోలూ చూపించింది. అలాగ

కంప్యూటర్లో చూసిందే మా డేడీతో చెబుతుంటే నేనూ విన్నా? ఏంటి నిజమేనా? పెళ్ళిళ్ళు పేరెంట్సే చేస్తారా? మీ అమ్మా నాన్నా పెళ్ళికూడ అలాగే జరిగిందా? మా డేడీ ఐతే మరి మా మమ్మీని హైస్కూల్లోనే ప్రేమించి, హైస్కూలైపోయి ఆయనకి గనుల్లో ఉద్యోగం రాగానే పెళ్ళి చేసుకున్నాడు."

"మా నాన్న కూడ మా అమ్మని ప్రేమించే పెళ్ళిచేసుకున్నాడు తెల్సా" అనేశాను.

ఎప్పుడో చూసిన అమ్మా డేడీల పెళ్ళి ఫొటోల ఆల్బం గుర్తొచ్చింది. ఇద్దరూ ఎంత ఆనందంగా ఉన్నారు? నిజమే, నా కళ్ళముందు వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నట్టు – అంటే 100%లవ్‌లో నాగచైతన్య తమన్నాలాగ – ఎప్పుడూ కనబళ్ళేదు, నిజమే. కానీ ఇంకా ముందు, వాళ్ళ పెళ్ళికి ముందు, నేను పుట్టక ముందు .. వాళ్ళు కూడ లవ్ చేసుకునే ఉంటారు కదా. అసలు లవ్ చెయ్యకుండా ఎవరన్నా పెళ్ళి చేసుకుంటారా, ఈ క్రిస్టీ వాళ్ళ మమ్మీ పిచ్చిగాని. డోరాతో నేనీ విషయం చెబితే తను కూడా అదే అంది. డేడీ అమ్మని లవ్ చేసే పెళ్ళి చేసుకున్నాడు. మరప్పుడే కదా నేను పుట్టాను. లవ్ లేకపోతే నేను లేను. నేనున్నాను కాబట్టి లవ్వుండాలి.

ఐనా అమ్మనే అడిగేస్తే పోలే? ఇదే డోరాతో అన్నాను, కుకీ తింటూ. అడక్కపోతేనే మంచిదేమో అంది తను. సరే అని ఇద్దరం స్క్రాబుల్ ఆడుతున్నాం. ఆటలో డోరా పార్టీ అనే మాట పెట్టింది. అది చూడంగానే గుర్తొచ్చింది నాకు ఈ రోజున జరిగిన ఇంకో విశేషం. ఇందాక అమ్మకి చెప్పడమే మర్చిపోయాను. అమ్మకి చెప్పకపోతే ఏం, నా బెస్ట్ ఫ్రెండ్ కదా, అందుకని డోరాకి చెప్పేశాను.

"వచ్చే వీకెండ్ క్రిస్టీ పుట్టినరోజంట. నన్ను పార్టీకి పిల్చిందివ్వాళ."

డోరా ఏం ఉత్సాహం చూపించలే. నాక్కొంచెం కోపమొచ్చింది.

"అదేంటి, నీకు తెలుసుగా నాకు క్రిస్టీ అంటే ఎంతిష్టమో. తను పార్టీకి నన్ను పిల్చిందంటే ఎంత ఉత్సాహంగా ఉందో నాకు!"

డోరా తన అక్షరాలకేసే చూస్తూ ఏం మాట్లాడలేదు.

క్రిస్టీ నా ఫ్రెండ్ కానీ డోరా ఫ్రెండ్ కాదుగదా పార్టీకి నాతోబాటు తను గూడా రావడానికి కుదరదు కదా, అందుకని డోరాకి నేను కూడ వెళ్ళడం ఇష్టం లేదేమోనని నాకనిపించింది. పోనీ క్రిస్టీకి చెప్పి డోరాని కూడా పిలవమని చెపుదామా అనుకున్నా. కానీ డోరా ఉత్సాహం చూపించకపోతే నాకు మాత్రం ఏం పట్టింది? నేను కూడా నా అక్షరాలకేసి చూస్తున్నా ఎట్లాగైనా ఈ సారి ట్రిపుల్ వర్డ్ స్కోరు కొట్టెయ్యాలని.

కింద మెయిన్ డోర్ తెరిచి మూసిన చప్పుడైంది. డేడీ వచ్చినట్టున్నారు. ఇవ్వాళ్ళ తొందరగానే వచ్చారే అని ఆశ్చర్యం వేసింది నాకు. వెళ్ళి డేడీతో క్రిస్టీ పార్టీ గురించి చెబుదాం అనుకున్నా గానీ ఇక్కడ గేం చాలా పట్టుగా ఉంది. ఇంతట్లో నా గది ముందునించి డేడీ నడిచి వెళ్ళినట్టు అడుగుల చప్పుడైంది. లోపలకొస్తారేమో ననుకుని డోరావంక చూశా. డోరా తన అక్షరాలకేసే చూస్తోంది. డేడీ లోపలికి రాలేదు. అడుగుల చప్పుడు నా గదిని దాటి వాళ్ళ బెడ్రూముకేసి వెళ్ళిపోయాయి. నేను మళ్ళీ నా అక్షరాల్లో మునిగిపోయాను.

సడన్‌గా చూస్తే చుట్టూతా గాల్లో మెలికీసులూ, జెర్రులూ, తేళ్ళూ. వాటిలిని రెండు చేతుల్తో చెదరగొడుతూ, నోటితో ఉఫ్ ఉఫ్ఫని ఊదేస్తున్నాం నేనూ డోరా. మొన్నట్లాగా నాకు భయమెయ్యలా. డోరాకూడా ఉందిగా, అందుకని నాకు ధైర్యంగానే ఉంది.

ఇంతట్లో బయట ఎవరో పరిగెడుతున్నట్టు గబగబా అడుగుల చప్పుడు. ధడాల్న నా గది తలుపు తెరుచుకుని అమ్మలోపలికి పరిగెట్టుకొచ్చింది. వచ్చి తలుపు వేసేసి, లాక్ చేసేసి అలాగే తలుపుకానుకుని రొప్పుతూ నిలబడింది. నేను నిర్ఘాంతపోయి అలా చూస్తూ ఉండిపోయాను, కానీ అమ్మఅసలు నాకేసి చూడనే లేదు. తన కళ్ళు మూసుకుని ఉన్నాయి. గుండెలెగిసి పడేట్టు గట్టిగా గాలి పీల్చి వదుల్తోంది. ఇంతట్లో తలుపు గడగడా ఊగింది. బయట్నించి గట్టిగా డేడీ గొంతు.

"లలితా, తలుపు తియ్."

అమ్మఒక్క ఉదుటున తలుపుని వదిలి గది లోపలికి గంతు వేసింది. గడగడలాడుతున్న తలుపుకేసి భయంగా చూసింది. నేనైతే తలుపు విరిగిపోతుందనే అనుకున్నా.

"లలితా, జస్ట్ నీతో మాట్లాడాలి." ఈ సారి డేడీ గొంతు కొంచెం నెమ్మదిగా.

అమ్మతలుపుకేసే చూస్తూ తల అడ్డంగా ఊగించిది.

"లలితా?" తలుపు ఇంకోసారి గడగడలాడింది.

రెండు వేపులా నిశ్శబ్దం.

ఒక నిమిషం తరవాత తలుపవతల నించి పెద్ద నిట్టూర్పు చప్పుడు, అక్కణ్ణించి డేడీ అడుగులు వాళ్ళ గదివేపు వెళ్ళిపోయాయి. వాళ్ళ గది తలుపు మూసిన చప్పుడు.

అమ్మమాత్రం అలా నా గది తలుపువేపే భయంగా చూస్తూ నించుండి పోయింది. నేను ఏమనాలో, ఏం చెయ్యాలో తెలియక అలాగే ఉండిపోయాను. కాసేపయ్యాక మంచం దిగి అమ్మచెయ్యి పట్టుకున్నాను. అమ్మనాకేసి చూసింది. అది అమ్మమొహమే, కానీ ఆ కళ్ళు అమ్మకళ్ళు కావు. అమ్మకళ్ళల్లో ఉండే మెరుపు ఈ మొహం కళ్ళల్లో లేదు. ఒకసారి క్లాసులో మిస్ జెరూ చచ్చిపోయిన చేపనొకదాన్ని చూపించిందిలే. ఈ మొహంలో కళ్ళు కూడా ఆ చచ్చిన చేపకళ్ళల్లా కనిపించాయ్ నాకు.

అమ్మా అని మెల్లగా పిలిచాను. తనకి వినిపించినట్టు లేదు.

నేను తన చెయ్యి పట్టుకుని మంచం పక్కకి తీసుకెళ్ళి, మెల్లగా మంచం మీద పడుకోబెట్టాను. అటుపక్కకి తిరిగి వొత్తిగిలి కాళ్ళు పైకి ముడుచుకుని పడుకుంది.

నేను మంచానికి అవతలి వేపుకెళ్ళి, నేను కూడా మంచం ఎక్కి మమ్మీని కావిలించుకుని పడుకున్నాను.

అమ్మతన తల తెచ్చి నా పొట్టకి ఆనించింది. నేనే అమ్మకి మమ్మీని అయినట్టుగా అనిపించింది.

ఇద్దరం అలాగే నిద్దరపోయాం.

★★★

నేను స్కూల్నించి ఇంటికొచ్చేసి హోం వర్కు చేసుకుంటున్నా. అమ్మఇవ్వాళ్ళ బాగానే ఉంది. తనే నాకు పాలు, కుకీస్ తెచ్చి పెట్టింది. ఇంతట్లో ఫోన్ మోగితే తనే ఎత్తింది.

ఎవరో మరి అవతలి వాళ్ళే చాలా సేపు మాట్లాడారు. అమ్మఆ వూ అని తప్ప ఏం మాట్లాడలేదు. కాసేపైనాక ఫోన్ పెట్టేసి, నా కుర్చీ వెనగ్గా వచ్చి నా నెత్తిమీద చెయ్యి వేసి నిమిరింది. నేను తనకేసి చూశాను.

అమ్మకళ్ళల్లో నీళ్ళు.

నాకొంచెం భయమేసింది, మళ్ళీ ఏమైందోనని.

"సమతపండూ, ఆ పిలిచింది క్రిస్టీవాళ్ళమ్మ."

"ఊ."

"సమతపండూ – ఒక బేడ్ న్యూస్. నువ్వు క్రిస్టీ పార్టీకి వెళ్ళట్లేదు."

"అదేంటి, క్రిస్టీనే నిన్న పిలిచింది కదా?"

"ఔను. కానీ ఇవ్వాళ్ళ ఒక సమస్య వచ్చింది వాళ్ళకి. బెట్టీ అనే పిల్ల రానందిట. ఎందుకు అంటే, సమత వస్తే నేను రాను,

అంతే కాదు నా ఫ్రెండ్స్ ఎవ్వరూ రారు అని చెప్పిందిట. క్రిస్టీ ఇంట్లో ఏడుస్తూ కూర్చుందిట. అందుకని క్రిస్టీవాళ్ళమ్మ కాల్ చేసింది.”

నాకు అర్థమై పోయింది. బెట్టీ ఎంత కుళ్ళుమోతుదో నాకు ముందునుంచీ తెల్సు. విసురుగా కుర్చీలోంచి లేచి నా గదికేసి పరిగెత్తాను, కానీ వెనకనే ఉన్న అమ్మనా చెయ్యి పట్టుకుని గట్టిగా నన్ను తనకేసి లాక్కుంది. అలాగే నన్ను పట్టుకుని తన రిక్లైనర్లో కూర్చుని నన్ను వొళ్ళోకి తీసుకుంది. తీసుకుని, ఏడవకు అంది. నాకు ఏడవాలని లేదు. అర్జంటుగా బెట్టీ ఇంటికి పరిగెత్తుకుపోయి దాని బ్రౌన్ రంగు చింపిరి జుట్టు పట్టుకుని నాలుగు గుద్దులు గుద్దాలని ఉంది. కానీ అమ్మనన్ను గట్టిగా పట్టేసుకునుంది. అందుకని అలా అమ్మమెడకేసి వెక్కుతూ ఉండిపోయాను.

కాసేపయ్యాక అమ్మనన్ను వదిలేసింది. నేను లేచి నించున్నా. అమ్మకూడా రిక్లైనర్లోంచి లేచి, నన్ను ఒక్కత్తినీ రిక్లైనర్లో కూచోపెట్టింది. అక్కడే ఉండు అన్నట్టు చెయ్యి ఊపి, డీవీడీలు ఉండే అలమారులో కొద్దిగా వెదికి ఒక డీవీడీ పట్టుకొచ్చి ప్లేయర్లో పెట్టి టీవీ ఆన్ చేసింది. చేసి, తను కూడా రిక్లైనర్లో నా పక్కన ఇరుక్కుని కూర్చుంది.

నాకేం సినిమా చూడాలని లేదు అన్నా.

హుష్ అని నా నోరు మీద వేలు పెట్టింది.

టీవీలో సినిమా మొదలైంది.

అది పోయినేడు నా బర్త్ డే పార్టీ విడియో .. విజయవాడలో తాతయ్య ఇంట్లో. ఇల్లంతా లైట్లు, పెద్దహాల్లో బోలెడు డెకరేషన్లు. అరిగో అమ్మమ్మా, తాతయ్య – గెస్టుల్ని గ్రీట్ చేస్తూ.

అదిగో అమ్మ, మంచి వర్క్ చీరలో సినిమా హీరోయిన్ లాగా ఉంది. పార్టీ అంతా తిరుగుతూ అందర్నీ పలకరిస్తోంది. మా స్కూల్ ప్రిన్సిపల్ గారు, ఇద్దరు టీచర్స్ అరుగో. అక్కణ్ణించి, వనజాంటీ ప్రకాషంకుల్ వాళ్ళు. ఇంకా ఎవరో పెద్దవాళ్ళు, తాతయ్య ఫ్రెండ్స్ అనుకుంటా. అమ్మతో కలిసి చదువుకున్న ప్రభాంటీ, సుధాంటీ, శీలాంటీ, అనిలంకుల్. ఎవరి దగ్గరికి అమ్మవెళ్లినా, వెంటనే వాళ్ళల్లో ఎంత మార్పో, వాళ్ళ కళ్ళల్లో ఎంత మెరుపో. అందరికీ ఇష్టమే అమ్మతో మాట్లాడ్డమంటే. ఇంక వాళ్ళ కాలేజ్ ఫ్రెండ్సయితే అసలు వదిలి పెట్టనే లేదు. అదిగో, సెంటర్ టేబుల్ మీద నా బర్త్ డే కేక్. ఎనిమిది కేండిల్స్ తో. అదిగో నేను. ఎంత ప్రెట్టీగా ఉన్నానో. అంతకంటే ఎంత హేపీగా ఉన్నానో. అమ్మ కూడా నా పక్కనే వచ్చి నించుని నాతో కేక్ కోయించింది. ఫస్ట్ ముక్క అమ్మకే పెట్టాను. పక్కన అనిల్ అంకుల్ ఏదో అన్నాడు. అమ్మకేక్ తింటూనే గట్టిగా నవ్వి కొరబోయింది. తాతయ్య అమ్మనెత్తిమీద చిన్నగా తట్టి, తనే హడావుడిగా వెళ్ళి గ్లాసులో మంచి నీళ్ళు తెచ్చి తాగిస్తున్నారు. మై ఓన్ అమ్మా.. సో బ్యూటిఫుల్... సో హేపీ. మై హేపీ బర్త్ డే.

★★★

మిస్ జెరూ గొంగళిపురుగుల గురించి మాట్లాడుతూనే ఉంది. ఇంతలో బ్రేక్ బెల్ కొట్టారు. క్రిస్టీ నన్ను పిలుస్తోంది. బెట్టీ నాకేసి కోపంగా చూస్తోంది. నేను ముందు పలకొద్దు, మాట్లాడొద్దు అనుకున్నా. కానీ క్రిస్టీనే నా దగ్గిరికొచ్చింది.

“అయాం సో సారీ సమతా.”

నేనేమనలేదు.

“బెట్టీ అలా నన్ను బెదిరించినందుకు కోపమొచ్చి ఏం చెయ్యాలో తెలియక, ముందు ఏడ్చాను.”

నేనేమనలేదు.

"మా మమ్మీ మీ యింటికి అలా కాల్ చేసిందని కూడా నాకు తెలియదు. తరవాత చెప్పింది మా మమ్మీ. అప్పుడు మా మమ్మీతో పోట్లాడాను. సమత ఎంతో మంచిది, బెట్టీకి ఇష్టంలేకపోతే అది బెట్టీ సమస్య, నా సమస్య కాదు అన్నాను. సమత రాకపోతే నాకసలు పార్టీయే వొద్దు అని కూడా గట్టిగా చెప్పాను."

నేను ఆశ్చర్యంగా చూశాను క్రిస్టీ నీలం రంగు కళ్ళల్లోకి. తను నా చెయ్యి పట్టుకుంది.

"బెట్టీ సమస్య నాది కాదు. తనకి సమస్య అయితే రావడం మానేస్తుంది. మిగతా ఫ్రెండ్స్ అయినా అంతే. కానీ నువ్వు మాత్రం రావాలి."

"సరే, మా అమ్మనడిగి చెబుతా."

"ఓ, మరిచిపోయా. మా మమ్మీ చెప్పింది, మీ మమ్మీనికూడా తీసుకురమ్మని."

★★★

సాయంత్రం అయిదింటికే బాగా చీకటి పడిపోయింది. బయట వీధి లైట్లు వేసేశారు. ఆ రోజు మంచు పడలేదుగానీ ముందు రోజుల్లో పడిన మంచు అంతా గుట్టలుగా రోడ్డు పక్కల పేరుకుని ఉంది.

ఎప్పట్లాగే ఆ రోజుకూడా ఇంకా డేడీ రాలేదు.

అమ్మానేనూ ఎక్కడా కొంచెం కూడా చర్మం కనబడకుండా వెచ్చటి దుస్తులు తొడుక్కుని, స్కార్ఫులు చుట్టుకుని, కోట్లు బూట్లు తొడుక్కుని ఇంట్లోంచి బయటికొచ్చాం. నేను క్రిస్టీ కోసం బహుమతి పట్టుకున్నాను. నిన్న డేడీ కొనుక్కొచ్చారు. నేనే గిఫ్ట్ రేప్ చేశాను. అమ్మచేతులకి గ్లవులు తొడుక్కుని, ఇంటికి తాళం వేసింది. ఇద్దరం క్రిస్టీ వాళ్ళ ఇల్లున్న వీధివేపుకి నడవడం మొదలెట్టాము.

బహుమతి పేకెట్టు గిఫ్ట్ రేప్ మీదున్న సీతాకోకచిలుకలు నాలుగు గాల్లోకి లేచి మా చుట్టూ ఎగరడం మొదలె ట్టాయి. ఇప్పుడు డోరా ఉంటే ఎంత బావుణ్ణో!

(Dora The Explorer is a cartoon TV character, of Hispanic ancestry (dark hair, brown skin) who explores a new part of the world in each episode, spreading message of friendship, respect and collaboration. http://en.wikipedia.org/wiki/Dora_the_Explorer )

# నీకేం తెలుసు? వరలక్ష్మి పోలిన

"వరద గోదారిలా పెల్లుబికే కన్నీటికి అడ్డుకట్ట వేయడం చాలా కష్టం... కానీ అలా వేసే అడ్డుకట్ట నీకు ఎంతో సంతోషాన్ని ఇస్తుంది అంటే నా ప్రాణాన్నే ఆనకట్ట గా వేస్తా..." తాను రాస్తున్న కొత్త కథ లో మాటలని పదే పదే చదువుటొంది వాసవి.

ఇవ్వాళ ఎందుకో ఎంత ప్రయత్నించినా ఒక వాక్యం కాదు కదా ఒక పదం కూడా రాయడం కుదరడం లేదు. ఈ పైన వాక్యాలనుంచి

మనసు, కళ్ళు పక్కకి తప్పుకోవడం లేదు .. ఎందుకో.. అనుకుంది మళ్ళీ మళ్ళీ మనసులో..

ఇలా అయితే ఈ వారం స్వాతి వీక్లీ కి కథ ని పంపించలేను అనుకుంటూ లేచి కాఫీ కలుపుకుని వచ్చి పాదాలు బయటికి పెట్టి అలా దొడ్డి గుమ్మం దగ్గర కూచుంది. అలా ఎంతసేపు కూచున్నదో తెలియదు కానీ ఎక్కడనుంచో విసురుగా వచ్చి తన పాదాలని తాకిన వాన చినుకుకి మేలుకొని ఆకాశం వైపు చూస్తూ – ఈ ఆకాశం కూడా నాలానే గంభీరం గా ఉందే ఇవ్వాళ.. నేనైతే బాధ ని దాచుకున్నాను.. మరి ఈమె ఏం దాచుకుందో – అనుకుంటూ వారం రోజులనుంచి జరిగిన సంగతి గురించి విశ్లేషించడం మొదలుపెట్టింది...

వారం రోజుల ముందు టి .వి లో వచ్చే ఏదో ధారావాహిక యథాలాపంగా చూస్తూన్న వాసవి కి తనకి సుపరిచితమైన కాదు కాదు తనకే సొంతమైన మాట విన్నట్టు అనిపించి చెవులు రిక్కించింది. సంవత్సరాలు సాగినా మొదలైన చోటనే నిలిచే తెలుగు సీరియల్ లో ఒకే సంభాషణ మళ్ళీ మళ్ళీ రావడం లో తప్పు లేదు కదా.. అవును అదే మాట.. " నీకేం తెలుసు "..కొన్ని సంవత్సరాల సంసార సాగరం లో ఈ నీకేం తెలుసు అనే అలా తనని ఎన్ని సార్లు ముంచేసిందో కదా అనుకుంటూ జ్ఞాపకాల్లోకి వెళ్ళిన వాసవి కి –

పెళ్ళైన కొత్తలో "ఏమోయ్ .. వచ్చే ఆదివారం అలా బయటికి తిరిగొద్దాము .. ఎలాను ఖాళీగా ఇంట్లోనే కూచుంటావు కదా.. ఎక్కడికి ఎక్కడికి వెళ్దామో ఆలోచించు" అని చెప్పిన శ్రీవారి మాటలకి మనసులోనే ఎగిరి గంతేసి ..ఏమేమి చెయ్యాలో.. ఎలా ఎలా చెయ్యాలో.. అనుకుంటూ రెండు రోజులు కలలో కూడా అదే ఆలోచిస్తూ నెలవారీ సరుకుల లిస్ట్ కంటే పెద్ద లిస్ట్ తయారు చేసుకుని సిద్ధమయ్యేసరికి ఆ ఆదివారం కాస్తా రానేవచ్చింది. ఆదివారం పొద్దున్నే శ్రీవారు "ఏంటి చెప్పిన పని చేసేవా?" అని అడిగేసరికి తాను తయారు చేసిన లిస్ట్ ఎదురుగా పెట్టింది. ఓపిగ్గా అంతా చదివేక... ఏమేం చెప్తారో అనుకుంటూ చూస్తున్న వాసవి కి

" ఏవిటోయ్ ఇదా నువ్వు రెండు రోజులనుంచి కుస్తీ పట్టి చేసిన ప్లాను. ఇదంతా చూస్తుంటే నీకేం తెలియదని బాగా అర్ధం అవుతోంది. ఇదేమి వద్దు కానీ .. మనం బయట రెస్టారెంట్ కెళ్ళి తిని సినిమా చూసి వచ్చేద్దామ్" అనగానే .. నీకేం తెలియదని అనిపిస్తోంది అన్నది గుండెల్లో ఎక్కడో గుచ్చినా, రెస్టారెంట్, సినిమా బాగానే అనిపించి బయల్దేరింది..

ఆ తర్వాత ఏదో అడపా దడపా ఇలాంటి సన్నివేశాలు కదలాడినా " మా వారే " కదా అని సర్దుకుపోయిన వాసవి కి ఆ రోజు గట్టి దెబ్బ కొత్త ఇంటి రూపం లో తగిలింది..

"ఆ ఇంటి కాంట్రాక్టర్ ఒక నాలుగు అయిదు ఇళ్ళు చూపిస్తా అన్నాడు వెళ్దాం. వెళ్ళి చూసొద్దాం. ఉండేది నువ్వు నీ పిల్లలూ కదా.. నీకు నచ్చితే ఏదొకటి ఇవ్వాళ ఖాయం చేసేద్దామ్.. పదా!" అనేసరికి కొత్త ఇల్లు అనే సంతోషంగా బయల్దేరిన వాసవికి అక్కడ కూడా ఇదే ప్రశ్న వీడిపోని చుట్టంలా ఎదురయ్యింది. తనకి నచ్చిన యే ఇంటినైనా ఇష్టపడకుండా ఆయనకే నచ్చిన ఇల్లుని ఒప్పేసుకుని..వస్తున్న శ్రీవారిని ఏమనాలో తెలియక.. ఏదో ఆలోచనల్లో ఉండగానే ఇల్లు రావడం, ఇంట్లో అనుకోని అతిధులు .. అత్త..ఆడపడుచులు వాళ్ళ వాళ్ళు అందరూ ఉండటం వాళ్ళకి ఫలహారాలు సర్దడం లో పడిపోయిన వాసవి కి హాల్ లో మాటల్లో " ఆ దానికేం తెలుసు.. చూపించిన ఇళ్ళల్లో దానికి నచ్చిన వాటిల్లో వెలుతురు సరిగా రావడం లేదు .. అని" ఏదో తనకే అన్నీ తెలుసు అన్న గొప్పతనంతో చెప్పుకుపోతున్న శ్రీవారు కనుపాపకి అడ్డం వచ్చిన నీటిపొర మూలాన ఏమో ... మసగ్గా కనపడ్డం మొదలెట్టేరు.

ఇలా గత ముప్పై సంవత్సరాల సంసార జీవితంలో, ఆడపడుచుల పెళ్ళిళ్ళప్పుడు, పెట్టుబడులప్పుడు, పిల్లల చదువులప్పుడు, పెళ్ళిళ్ళప్పుడు.. ఎన్నో సార్లు పలకరించిన ఈ ప్రశ్న ని తన నేస్తం చేస్కోవాలని చూసిన వాసవి కి దానితో స్నేహం కంటే శత్రుత్వమే

ఎక్కువయ్యింది. వారసత్వం గా నాన్ననుంచి పిల్లలకి వచ్చిన అలవాట్లలో ఇది ఒకటయ్యిపోయి . పిల్లలూ కూడా “అమ్మా నీకేం తెలియదు ఊర్కో” అని అంటుంటే.. ఇంతింతై వటుడింతై అన్నట్టు తన అసహనానికి పరీక్ష పెడుతున్న ఈ ప్రశ్నకి సమాధానాన్ని లేఖ రూపంలో రాసి పెట్టింది.. శ్రీవారికి ప్రేమలేఖ రాసిన ఇదే చేతులతో ఇలాంటి లేఖని ఎలా రాయగలిగానా అని ఒకసారి చదవాలనిపించి రెండు రోజుల క్రితం తలగడ కింద పెట్టిన ఆ ఉత్తరాన్ని తీసి చదవసాగింది.

ప్రియమైన శ్రీకర్,.

ఎప్పుడో పెళ్ళైన కొత్తలో మీకు ఏదైనా చెప్పాలనుకుంటే సరదాగా ఉత్తరం రాయడం అనేది మనకెంతో ఇష్టమైన వాటిల్లో ఒకటి. అలా ఆ ఉత్తరాలు రాసేటప్పుడు ఎప్పుడు ఇలాంటి ఉత్తరం రాస్తాను అని అనుకోలేదు. పెళ్లి అయిన నాటి నుంచి మీ నుంచి నేను ఎదురు చూస్తున్నది– నన్ను నన్ను గా ఎప్పటికైనా గుర్తిస్తారని. ఎంతసేపు నీకేం తెలుసు అనడమే కానీ .. దీనికీ ఏమైనా తెలుసా అని ఎప్పుడైనా ఒక్కసారైనా నా గురించి ఆలోచించేరా? అప్పట్లో ఇది చెప్పిన మాటలు పట్టించుకుంటే ఇప్పుడు ఇలా అయ్యి ఉండేది కాదేమో అని, ఆడపడుచు అత్తవారింటి గురించి ఏడుస్తూ చెప్పినప్పుడు కానీ.. లేదా.. నాకు డాక్టర్ అవ్వాలని ఉంది కానీ ఇంజినీర్ కాదు అని ఇమడలేక మన బాబు మూడో సంవత్సరం లో మానేసినప్పుడు కానీ .. ఎప్పుడైనా అనిపించిందా శ్రీకర్ మీకు? చిన్న చిన్న సరదాలన్నిటిని మీకోసం మీకు నచ్చదని వదిలేసిన ప్రతీసారి ..నానుంచి నన్ను ఒంటరిగా వదిలేసి ఎగిరిపోతున్న ఆశలని చూసిన ప్రతీసారి.. ఎక్కడో ఏదో తెలియని బాధ. ప్రతీ దానికి ఒక మొదలు ఒక తుది ఉంటాయి. నా జీవితంలో భాగమైన ఈ ప్రశ్నకి మొదలెప్పుడో తెలియదు కానీ చివరి చుక్క నేనే పెట్టాలనుకుంటున్నాను. ఇన్నాళ్ళు నాన్నకి కూతురిగా.. మీకు అణకువైన భార్యగా .. మంచి తల్లిగా ... మీ అందరికోసం ఉంటున్న నేను నాకోసం బ్రతకాలనుకుంటున్నా. నాకు అన్నీ తెలుసు. నాకు కూడా ఒక మనసుంది అది ఆలోచిస్తుంది అని మీకందరికి తెలిసేలా బ్రతకాలనుకుంటున్నా. అందుకే నా బాధ్యతలన్నీ తీరేటంత వరకు వేచిన నాకు ఇక మీనుంచి శెలవు తీస్కోవడమే ఈ ప్రశ్న కి తుది అని భావిస్తున్నాను.

మీ

వాసవి.

ఈ ఉత్తరం మళ్ళీమళ్ళీ చదివిన వాసవికి తన కథ లో రాస్తున్న అక్షరాలు కళ్ల ముందు కనపడసాగాయి. కథల్లోనూ వేరే వాళ్ళకి చెప్పడం లోనూ సహాయపడే సలహాలు తనకి తాను చెప్పుకుంటే వర్తించవా అంటూ లోపల నుంచి ఎవరో అడుగుతున్నట్టు అనిపిస్తుంది. అవును ప్రస్తుతం భారత దేశంలో విలువ కోల్పోతున్న పెళ్లిళ్ళ గురించి, ఉనికిని కోల్పోతున్న ఉమ్మడి కుటుంబ సంబంధాల గురించి ఎంతో విశ్లేషణ తో వ్యక్తీకరిస్తూ వాటికి పూర్వ వైభవం కోసం ఎంతగానో పాటు పడుతున్న రచయితల్లో ఒకరైన వాసవి ఇలాంటి మానసిక సంఘర్షణ లో పడటం ఆశ్చర్యం కాదు.ఎంత సేపు శ్రీకర్ నాకేమైనా తెల్సేమో అని ఆలోచించలేదు అని బాధ పడుతున్నానే కానీ.. నా గురించి నా కుటుంబం గురించి మంచికే పదే పదే ఆలోచిస్తారే కాబట్టే ఇప్పుడు ఇంత ఉన్నత స్థానం లో ఉన్నాము కదా అని ఆలోచించనెందుకు. యే బంధాన్ని కాదనుకోడానికి తెంపుకోడానికి ఒక నిమిషం పట్టదు కానీ అదే ఒక బంధాన్ని

నిలబెట్టుకోడానికి ఒక జీవిత కాలం సరిపోదు .. ఇంతకాలం ఈ బంధం లో నే ఉన్ననేను అదే ఆస్వాదించడం మళ్ళీ మొదలుపెడితే తప్పేముంది.. అవును .. నేను చెప్పడమే కాదు చేసి చూసిస్తాను.. అని అనుకున్న వాసవి.. గుండెల్లో ఎంతో బరువు గా గూడు కట్టుకున్న విషాదమంతా సూర్యుడి కాంతి రేఖకి కరిగిపోయిన మంచు కొండ లా కరిగిపోయింది. అలా సంతోషంగా బయట కు వచ్చిన వాసవికి ఎదురు గాలికి మబ్బులన్నీ తేలిపోయి తొంగి చూస్తున్న సూర్య కిరణాలు స్వాగతం చెప్పాయి.

చూసే మనసుని బట్టి ఎదుటి వస్తువులో అందం కనిపిస్తుంది అని అనుకుంటూ శ్రీవారు ఎప్పుడొస్తారా.. అని ఎదురు చూస్తూ కథలో లీనమై రాస్తున్న వాసవి కి తెలియని విషయం ఏంటి అంటే .. శ్రీకర్ ఆ ఉత్తరం నిన్ననే చదివాడని.. ఆ మాటలు అతనిలో మార్పు తెస్తాయని.. ఇద్దరిలో ఆ మార్పు తో సంతోషాలు వెల్లివిరుస్తాయని !!

# శూన్యమేరా జీవితం

మధు పెమ్మరాజు

ఆగకుండా మ్రోగుతున్న ఫోను శబ్దానికి ఉలిక్కిపడి లేచా, వాచీ కేసి చూస్తే అర్ధరాత్రి రెండు..ఈ అపరాత్రి కాల్స్ అంటే నాకు మహా భయం, హడావిడిగా వెళ్లి రిసీవర్ ఎత్తగానే బాగా దగ్గరైన గొంతు "హలో, నేనురా నవీన్ని"

"ఏంటి ఈ టైములో కాల్ చేసావు, అంతా ఓకేనా"

"నిద్రలో లేపినందుకు సారీరా, ఏ దారీ లేక నీకు చేస్తున్నా" వాడి మాటల్లో ఎప్పుడూ వినని ఆదుర్దా

"పరవాలేదులే పడుకుని ఓ గంటే అయ్యింది, ఏమిటి ప్రాబ్లం"

"అర్జెంట్గా పన్నెండు లక్షలు కావాలి, నాలుగు నెలల్లో తప్పకుండా తిరిగిచ్చేస్తా"

"ముప్పై వేలా! అంత అమౌంట్ దేనికిరా?"

"దూరంగా ఉన్నావు అనవసరపు టెన్షన్ ఎందుకని నా విషయాలు నువ్వడిగినా చెప్పలేదు, గత ఏడాదిగా బిసినెస్లో బాగా నష్టాలు వచ్చి పార్టనర్స్ మధ్య బ్లేం-గేమ్ మొదలు..ప్రతీ మీటింగ్లో అరుపులు, బెదిరింపులు, ఈ గొడవలు నాకొద్దు నా దారిన పోతానంటే డబ్బిచ్చి కదలమంటున్నారు, అస్సలు సరైన వాళ్ళు కాదు...ఎలాగైనా అమౌంట్ సర్దాలిరా ప్లీజ్ "

"ఎప్పుడు అడిగినా ఏమీ చెప్పకపోతే అంతా బానే ఉందేమో అనుకున్నా, వింటుంటే చాలా షాకింగ్గా ఉందిరా"

"కొత్త ప్రాజెక్టులు వస్తే అవే సద్దుకుంటాయని ఏడాదిగా, చాలా ఓపికగా వెయిట్ చేసాను, అనుకున్నవేమీ జరగలేదు పైపెచ్చు రోజు రోజుకీ విషమించాయి"

"నా పరిస్థితి నీకు పూర్తిగా తెలుసు.. వచ్చిన రోజు నుంచీ సరైన ప్రాజెక్ట్ లేదు  పే-చెక్ లేదు..ఏదో గటా గటి..అంత అమౌంట్ లేదురా?"

"ఇది వరకే తెలిసినవాళ్ళ దగ్గర, బ్యాంక్లో అప్పులు చేసాను దాంతో ఈ పట్టు చిల్లి గవ్వ పుట్టలేదు, రెండు రోజుల్లో అప్పు తీర్చలేకపోతే సుయ్యో గొయ్యో తప్ప వేరే దారి లేదు, నువ్వే ఆఖరి హోప్ రా, ప్లీజ్ ...ఆరు నెలల్లో అమీర్ పెట్  ప్లాట్ అమ్మి పక్కాగా తీర్చేస్తాను" - ఆప్తమిత్రుడి నిస్సహాయ వేడుక వినగానే కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

(వాడు అంత తేలికగా తేలిపోయే మనిషి కాదు, నా దగ్గర ఏదో దాస్తున్నాడని అర్థమయినా...పెద్ద ఇష్యూలో చిక్కుకున్నాడు అనేది ముమ్మాటికీ నిజం)

"వెర్రి ఆలోచనలు మానేసి ఓపిక పట్టు, నా ప్రయత్నాలు ఏవో చేసి రెండు రోజుల్లో ఏ విషయమో చెప్తా" అని గట్టిగా భరోసా ఇచ్చి ఫోన్ పెట్టడం తప్ప ఆ పరిస్థితిలో వేరే ఆలోచన తట్టలేదు

వాడి మాటలు తలుచుకుంటూ కిటికీలోంచి బయటకి చూస్తూ కూర్చున్నా, ముగ్గుకొండలా పేరుకున్నమంచు, అర్థరాత్రి నిశ్శబ్దం, ఏమీ చెయ్యలేని అసహాయత అన్నీ కలిసి తెరలు తెరలుగా గతంలోకి లాకెళ్ళాయి

★★★★★★★★★

మండుటెండలో బాబూఖాన్ ఎస్టేట్ వైపు నడుస్తూ "ఇదే చివరి అవకాశం!" అనుకోవడం పదోసారి అనుకుంటా, నెల క్రితం నాన్నగారిని అడిగితే "నేను అప్పు చెయ్యను, ఎక్కడా సంతకాలు పెట్టను...ఒక్కసారి ఆ ఊబిలో పడ్డావంటే బయటపడ్డం కష్టం' అని గట్టిగా బోధించారు, మేనమామని అడగితే "మా అమ్మాయిని చేసుకుంటావా" అని ఎదురు బేరం పెట్టాడు, మా స్నేహితులు నా లాంటి వాళ్ళే!

ఈ అవకాశం చేజారిందంటే నే వెలగపెట్టిన ఇంజనీరింగ్కి బస్సు షెడ్ కెళ్ళేదాకా (రిటైర్) గంగప్ప ఫ్యాక్టరీలో ఒళ్ళు హూనమయ్యే చాకీరీ తప్పదు. అన్ని దార్లు మూసుకున్నవాడికి మిణుకు మిణుకుమంటూ ఓ దీపం కనిపిస్తుందంటారు..ఈ రోజు ఇలా బ్యాంకు వైపు ఆశగా నడుస్తున్నానంటే వాడి చలవే..వాడు చెప్పబట్టే బ్యాంకు నాలాంటి వాళ్ళకిచ్చే ప్రత్యేక రుణాల గురించి తెలిసింది. నా ప్రశ్నోత్తరాలు పూర్తయ్యేసరికి బ్యాంక్ గుమ్మం ముందు మావాడు ఎదురుచూస్తూ నిలబడ్డాడు..దగ్గరకి చేరగానే జాగ్రత్తలు చెప్పాడు-

"బ్రాంచ్ మేనేజర్ సుబ్బారావుగారు చాలా పద్ధతైన  మనిషి. లోన్ ఇచ్చే ముందు యోగ్యతలన్నీ చెక్ చేసి, సంతృప్తి పడితేనే కాగితంపై సంతకం, ఎక్కడ తేడా వచ్చినా రిజెక్ట్ చెయ్యడానికి వెనకాడని ముక్కుసూటి మనిషి! నీ లాంటి ఇంజనీర్కి మొదటి యోగ్యత - డ్రాయింగ్ పరీక్షలో పద్ధతిగా ఫెయిలయ్యే వాళ్ల అమ్మాయికి ప్రైవేటు చెప్పడం, కమిషన్ పెట్టిన కవర్ నవ్వు మొహంతో ఇవ్వడం రెండో యోగ్యత, ఆఖరిది -పక్కా ఇల్లు ఉన్న నాలాంటివాడి హామీ సంతకం, చివరిది నేను మానేజ్ చేస్తాను కానీ మిగిలిన షరతులు ఏమీ ఆలోచించకుండా ఒప్పేసుకో"

వాడు మంచి మాటకారి, వ్యవహారవేత్త, బ్యాంకు మతలబులు తెలిసిన మనిషి.. లోపలకెళ్ళి ఏం మాట్లాడో కానీ ఇద్దరూ నవ్వు మొహంతో బయటకి వచ్చారు, మేనేజర్ గుమస్తాకి చెప్పి నా చేత్తో పది ఫారాలపై ముప్పై సంతకాలు పెట్టించి ఒక చెక్ ఇప్పించారు, ఆ రోజంతా నవీన్ అమెరికా కోరికలు నెరవేర్చే శ్రీకృష్ణ పరమాత్ముడిలా కనపడ్డాడు.

బ్యాంక్లోకి వెళ్లకముందు ఇరుకు సందులు, వెక్కిరించే భవనాలు, ప్రశ్నించే మోహాలు బయటకి అడుగు పెట్టగానే..విశాలంగా, ఆహ్వానిస్తూ, చక్కిలి గింతలు పెట్టినట్టు కనపడ్డాయి అంతా జేబులోని చెక్ మహిమ, ఆహా! డబ్బు ఇచ్చే ధైర్యం, ఆహ్లాదమే వేరు!!

మాటల్లో పడి నవీన్ ఎవరో చెప్పలేదు..స్కూల్ గోడల మధ్య పదేళ్ళూ జంట కవులం, ఏ గోడల భద్రతా లేని నిజ జీవితంలో వెంటుండే నీడలం!! మా స్నేహం గురించి నన్ను తట్టే భావం..పటిష్టంగా కనపడే రాతి కట్టడాల కంటే బలమైనవి ఈ బంధాలు...కట్టడాలు తుఫానుల తాకిడికి కూలిపోవచ్చు, సునామిలో కొట్టుకుపోవచ్చు, ఎన్నడూ విడిపోని ఆధారం మా ఇద్దరి బంధం!

మొదటి షరతు ప్రకారం రెండు రోజులు పాఠాలు చెప్పేసరికి చదువు కంటే టీవీ సీరియల్స్, అమ్మలక్కల కబుర్ల పై చెవి పడేసిన సుబ్బారావుగారి అమ్మాయి "ఈయనకి ఏమీ రాదు, సొంతంగా చదువుకుంటా" అని నన్ను విముక్తుణ్ణి చేసింది. పూర్తి సమయం నేను జేరిన కంప్యూటర్ కోర్స్ పైనే ధ్యాస పెట్టి, విజయవంతంగా పూర్తి చేసి కంపెనీ ఆఫర్, ప్లేన్ టికెట్ సంపాదించి అమెరికా చేరాను.

★★★★★★★★★★

వాడి మాటలకి ఇక నిద్ర పట్టలేదు, లేని డబ్బులు ఇవ్వడం ఎలా? ప్రాక్టికల్ నిర్ణయం కాకపోయినా బయట అప్పుచేసి ఇవ్వడం తప్ప వేరే మార్గం లేదు..ప్రతీ నిముషం లెక్కపెట్టి, తెల్లారింధనిపించి ప్రయత్నాలు మొదలుపెట్టా –

"హలో శేఖర్! నేను రవీని బావున్నావా "

(నవ్వుతూ) "నీ ఫోన్ వచ్చే దాకా మంచిగున్నా, ఏంది పొద్దుగాల గుర్తు జేసినవ్ "

"నీలాంటి గ్రీన్ కార్డు నాలాంటి లోటు బడ్జెట్ గాళ్ళకి ఏ.టీ.ఎమ్ కార్డు... (బలం లేని నవ్వు నవ్వి) జోకులు కాదు నిజంగా ఒక అర్జెంట్ అప్పు మా ఫ్రెండ్ నవీన్ కి కావాలి, చాలా పెద్ద ప్రోబ్లంలో ఉండి 'సుయ్యా, గొయ్యా' అంటూ అర్ధరాత్రి కాల్ చేసాడు, ...4 నెలల్లో తప్పక తీర్చేస్తాడు"

"అప్పు అడుగుట మొదటిసారారా ?"

"అంత మాట అనేసావేమిట్రా బాబూ బానే అలవాటుంది "

"లేకపోతే ఏందిరా, మీ ఫ్రెండ్ కష్టాల్ల ఉంటె నేను అప్పు ఇచ్చుడేంది?"

"మరి అప్పు ధర్మమేమిటో చెప్పు"

"అప్పు తెలిసిన వాళ్ళకి ఇస్తరు, తెలిసిన వాళ్ళ దోస్తులకి, వాళ్ల పక్కింటి వాళ్ళకి ఇయ్యరు "

"సరేరా బాబూ అప్పు పాఠాలు తీరిగ్గా చెబుదువు ముందు, ముందు పనికొస్తాయి ..అప్పు నాకే కావాలి చాలా?"

"మన మధ్య ప్రాబ్లం రావద్దు అందుకే పైసల విషయంలో చాలా పక్కాగుంటా…అప్పు మార్కెట్ రేట్ కంటే రెండు పాయింట్స్ ఎక్కవకిస్తా, ముందే పోస్ట్-డేటెడ్ చెక్కులు కొరియర్ల పంపాలే"

"తప్పకుండారా రేపే పంపిస్తా"

"ఇంకో విషయం వడ్డీ నాకు పర్సనల్గా ఒద్దు ....ఒక చారిటీ సంస్థ అడ్రస్ ఇస్తా వాళ్ళకి పోస్ట్ జెయ్యాల, ఇవన్ని ఒకే అంటే జెప్పు రెండు దినాల్ల పైసల్ వైర్ చేస్తా"

(వాడు ఇస్తాడని అనుకోలేదు, దాంతో ఆనందం రెట్టింపయ్యింది)

" చాలా థాంక్స్ రా ..నాకన్నీ ఓకే, రేపే కొరియర్ పంపుతాను"

మనుషుల్ని స్టీరియో టైప్ చెయ్యడం అందరికి చాలా తేలికయిన పని, 'పిల్లికి బిచ్చం', 'ఎంగిలి చేత్తో కాకికి' అని అంతా కామెడీ చేసే శేఖర్, అడగ్గానే అప్పు ఇవ్వడంలో ప్రాక్టికాలిటీ, వడ్డీ చారిటీకి ఇవ్వడంలో చూపిన సేవా గుణం వాస్తవానికి, అభిప్రాయానికి తేడా స్పష్టంగా చూపెట్టింది.

సమయానికి డబ్బు చేరి నవీన్ ఊపిరి పీల్చుకున్నాడు "చాలా, చాలా థాంక్స్ రా, పెద్ద ఇబ్బందిలోంచి బయట పడేసావ్..థాంక్స్ ఎగైన్" వాడి కృతజ్ఞతల కన్నా అవసరంలో ఆత్మీయుడి అక్కరకి వచ్చానన్న భావం గర్వపడేలా చేసింది.

గోడపై క్యాలెండర్ పేజీలు మారుతూ నెలలు, సంవత్సరాలు గడిచిపోయాయి. ఓపిక పట్టినందుకు మంచి ప్రాజెక్టులు దొరికి "అమెరికా అవకాశాల స్వర్గం" అనే వాళ్ళ కోవలోకి చేరిపోయా…దానికి సాక్ష్యం- మొహం నిండా కళ, ఒంటి బరువు!

అప్పులకి, అవసరాలకి మనం చేసే రెండు రాళ్ళ పొదుపుతో అవినాభావన సంబంధం..ఒక్కొక్కటి వరసగా బుద్ధిమంతుల్లా నిలబడ్డాయి - బ్యాంక్ అప్పు నవీన్ సహాయాన్ని తలుచుకుంటూ తీర్చేసా, ఇంటి బాధ్యతలు నిర్వర్తించా, ఇండియా వెళ్ళిన ప్రతీసారీ నాన్న కళ్ళల్లో కంటెంట్మెంట్ చాలా ఆనందంగా అనిపించేది, అలాగే మా వాడిని కలిసి ఊటబావి లాంటి పాత జ్ఞాపకాలు తవ్వుకుని గొంతు తడుపుకోవడం తప్పనిసరి.

వ్యాపారాల్లో ఎన్ని సార్లు దెబ్బలు తిన్నా పట్టుదలతో మల్టీ-మీడియా స్టూడియో పెట్టి వాడు బానే పుంజుకున్నాడు. ఎప్పుడైనా అప్పు ప్రస్తావన వస్తే, ఎదుగుతున్న పిల్లల్లా కొత్త వ్యాపారానికి వర్కింగ్ కాపిటల్ అవసరాలు ఎక్కువ దాంతో నా అప్పు విషయం తేలలేదు, పెద్దగా అవసరం లేకపోవడంతో గట్టిగా నొక్కి అడగనూలేదు.

★★★★★★★★★

"మా కొత్త రియల్ ఎస్టేట్ సముదాయాన్ని మార్కెటింగ్ చేసే ఇంటర్నెట్ ఐడియాలు ఉంటె చెప్పు"

ఆ మధ్య పరిచయమైన రియల్ ఎస్టేట్ బిల్డర్ జాక్, నాలా బాస్కెట్బాల్, టెన్నిస్ అభిమాని అవ్వడంతో కామన్ టాపిక్లు దొరికి అప్పుడప్పుడు బాతాఖానీ పెట్టుకునేవాళ్ళం, ఓ సందర్భంలో మాటలు అలా ముందుకు వెళ్ళాయి.

"3-D వాక్-త్రూలు, ఆనిమేటెడ్ ప్రేసేన్టేషణ్ మీ వెబ్ సైట్లో కొత్తగా మార్కెటింగ్కి బావుంటాయి"

"ఎవరైనా తెలిసిన ప్రోగ్రామర్ కానీ, కంపెనీ గాని ఉంటే చెప్పు, మాకు మల్టీ-మీడియా పనికొస్తుందో తెలుసుకుంటా" ఆయనకి రెండు రోజుల్లో వాకబు చేసి చెప్తానని మాట ఇచ్చాను.

"నవీన్! నాకు తెలిసిన పెద్ద రియల్ ఎస్టేట్ మాగ్నెట్ మార్కెటింగ్ సాధనాలకై చూస్తున్నారు, ఆయనకి మల్టీ-మీడియా కొత్త! నీ పని నచ్చితే వేరే బిల్డర్స్ ని కూడా పరిచయం చేస్తారు.. నీకేమైనా ఇంట్రెస్ట్ ఉంటె చెప్పు మాట్లాడతాను"

వాడికి వెంటనే ఐడియా నచ్చింది ""అమెరికా అయితే బ్రహ్మాండం! ఈ మధ్యే దుబాయ్ ప్రాజెక్టులు చేస్తున్నాం, ఏవైనా శాంపిల్(ప్రోటో-టైప్) కావాలా అని అడుగు డెవలప్ చేసి చూపిద్దాం, మన క్వాలిటీ వాళ్ళకి తప్పక నచ్చుతుంది "

"బాగా ఆలోచించుకోరా, నీకు వర్క్ అవుట్ అవుతుందో లేదో?" ఏ కొత్త పని మొదలుపెట్టినా సాధక బాధకాలు కొత్తగా, కష్టంగా ఉంటాయి, వాడు అవన్నీ అలోచించి అడుగు వెయ్యాలని నా ఉద్దేశ్యం

"రిస్క్ లేకుండా ఏ బిజినెస్ లేదు, ఇనుము వేడిగా ఉన్నపుడే దెబ్బ వెయ్యాలి..నువ్వు జాక్ తో తప్పకుండా మాట్లాడి ఒప్పించు"

నవీన్ కంపెనీ తాలూకు ప్రాజెక్టులు, మల్టీ-మీడియా అనుభవం, హైదరాబాద్ లో వాళ్ల స్టూడియో ఫెసిలిటీ, ప్రొఫెషనల్ పని తీరు అన్నీ వివరంగా రెండు మూడు మీటింగ్స్ లో జాక్ వాళ్ళ కంపెనీకి మార్కెట్ చేశా, ఆయనకి నాపై ఉన్న అభిప్రాయం తోడయ్యి పని ఇవ్వడానికి ఒప్పుకున్నారు. మా మధ్య కుదిరిన బేరం – ఆరు వారాల్లో ప్రోటో-టైప్ అందచెయ్యాలి దానికి కొంత అమౌంట్ ఇచ్చేట్టు, ప్రోటో-టైప్ నచ్చితే పూర్తి కాంట్రాక్టు ఇచ్చేట్టు ఒప్పుకున్నాం.

"ఎంకి పెళ్లి......" సామెతలా ఇద్దరి మధ్యన కుదిర్చిన బేరం నా ఫుల్ టైం ఉద్యోగంలా తయారయి, నా అసలు ఉద్యోగానికి ఎసరులా తయ్యారయ్యింది..అయినా తంటాలు పడి అనుకున్న సమయానికి ప్రోటో-టైప్ అందగలిగేలా అంతా కష్టపడ్డాం, అందగానే జాక్ నుండి – "మేము మీ ప్రోటో-టైపు పరిశీలిస్తున్నాము, త్వరలో మా నిర్ణయాన్ని చెప్తాము" అని ఓ ఈమెయిలు వచ్చింది, ఆ తర్వాత ఏ స్పందనా లేకుండా మూడు – నాలుగు వారాలు గడిచాయి, ఎన్ని సార్లు ఫోన్ చేసినా, పర్సనల్ గా వెళ్ళినా జాక్ కలవలేదు. ప్రాజెక్ట్ పని పై వేరే ఊళ్లు తిరగం ఎక్కువయి వాకబు చెయ్యడం కష్టం అయిపోయింది "నేను ప్రయత్నిస్తూనే ఉంటాను. జాక్ చాలా పరపతి ఉన్న బిజినెస్ మాన్ మన డబ్బులు ఎక్కడికీ పోవు" అని మా వాడికి భరోసా ఇచ్చాను.

★★★★★★★★★★

కోటికొక్కర్ని అర్థరాత్రి కోటీశ్వరులని చేసిన డాట్.కాం బుడగ, సాఫ్ట్వేర్ని నమ్ముకున్న ఎంతో మంది భవిష్యత్తు తెల్లారిపోయేలా చేసిన సంవత్సరం– 2001, అసలు ఇవి సరైన ఉద్యోగాలా, పేకమేడలా? ఇక్కడ అవస్థలు పడ్డమా, వెనక్కి వెళ్లి ఏదో ఒక ఉద్యోగం చేసుకోవడమా? అని సతమతపడ్డ గడ్డు కాలం..అప్పటికే క్రెడిట్ కార్డులు నిండా వాడేసి తడుముకుంటుంటే నా పాత అప్పు గుర్తొచ్చింది

"నవీన్! బావున్నావా, బిసినెస్ ఎలా ఉంది?"

"బానే ఉంది, నువ్వెలా ఉన్నావ్?"

"పేపర్లో చదివే ఉంటావు డాట్.కాం సంగతి, ప్రాజెక్టులు ఆగిపోయి చాలా ఇబ్బందిగా ఉంది –సాలరీ లేదు క్రెడిట్– కార్డ్స్ నిండిపోయాయి, ఇన్సురన్స్ కట్టే పరిస్థితి కూడా లేదు.. కొంత అమౌంట్ అర్జెంట్ గా కావాలిరా"

"Sorry to hear, న్యూస్ లో ఫాలో అవుతున్నా"

"అవునురా ..నీకు అప్పుడు ఇచ్చిన డబ్బులు కావాలి, వైర్ చెయ్యగలుగుతావా?"

"ఆ డబ్బులు ఇవ్వలేను"

"ఎందుకు"

"నీ అప్పుకి, జాక్ కి మేము చేసిచ్చిన ప్రోటో–టైప్ ఖర్చుకి చెల్లు..I don't owe you anything "

(ఒక్క సారి కరెంటు షాక్ తగిలినట్లయ్యింది)

"అదేంటిరా, నా అప్పుకి..ఆ క్లయంట్ ప్రోటో–టైప్ కి సంబంధం ఏమిటి? మనం మొదలెట్టక ముందు అన్నీ నచ్చితేనే ఒప్పుకోమని క్లియర్గా చెప్పాను, నువ్వూ రిస్క్ తప్పదనే దిగావు..ఇప్పుడు దాంట్లోకి నన్నెందుకు లాగుతున్నావు?"

"ఇవి మా బోర్డ్ నిర్ణయాలు, ప్రోటో–టైప్ అయినా ప్రాజెక్ట్ అయినా మా కంపెనీ పెట్టే శ్రమ ఒకటే...ఖర్చుకి ఎమోషన్ తెలీదు, ఇంకో నిమిషంలో అర్జెంట్ మీటింగ్ ఉంది, ఖాళీ అయ్యాకా నేనే ఫోన్ చేస్తా" అని పెట్టేసాడు.

నిజజీవితంలో క్లిష్ట సంభాషణలు ఎక్కువ సమయం తీసుకోవు, పెద్దగా మేలోడ్రామా ఉండదు...ఒక మాట, ఒక వాక్యం చాలు సారాంశాన్ని గుణపంతో గుచ్చినట్టు చెప్పేస్తాయి. ఆ మాటలు విన్నాకా ఎన్నో జవాబు లేని ప్రశ్నలు, ఆ నిమిషంలో అప్సెట్ అయ్యింది డబ్బు గురించి కాదు.. నవీన్ అవసరాన్ని అవకాశంగా మార్చుకొన్న విధానం, ఏళ్ళ స్నేహన్ని ఒక్క లావాదేవితో సరిపెట్టేయ్యడం! వాడు చేసింది బిసినెస్ పరంగా కరెక్టే కావొచ్చు కాని మాది బిసినెస్ రిలేషన్ కాదు...ఆ తర్వాత ఎన్ని ఈ–మెయిల్స్ పంపినా జవాబు లేదు.

ఈ వేగం, దూరాలు, దేనికి టైం లేని జీవితాల్లో ఏ విషయాన్ని ఎక్కువ రోజులు పట్టుకుని కూర్చోలేము, బాధ కూడా ఓ ప్రాజెక్ట్ లాంటిదే...ఎక్కడో పుడుతుంది సందర్భం చూసి సమాధి చెయ్యడమే!

ఇది జరిగిన కొన్ని రోజులకి మెయిల్ బాక్స్ తెరవగానే జాక్ నించి వచ్చిన ఎన్వెలప్, ఏమిట్రా అని విప్పి చూస్తే ఓ చెక్, దాంతో పాటు ఓ నోట్ – "ఇన్ని రోజులు మిమ్మల్ని కాంటాక్ట్ చెయ్యలేక పోయినందుకు చింతిస్తున్నాము. మా కంపెనీ Merger పనుల వలన చాలా బిజీగా ఉన్నాను, మీ ప్రోటో–టైపు మార్కెటింగ్ కొలేటరల్గా మా Merger కి బాగా ఉపయోగపడింది, దాని తాలూకు మనం ఒప్పుకున్న మొత్తానికి చెక్ జతపరిచాను, మీకు వీలైనపుడు వస్తే ప్రాజెక్ట్ గురించి మాట్లాడుకుందాం"

ఆ చెక్కులో అమౌంట్ బదులు వాడు పోగొట్టుకున్న పెద్ద అవకాశం కనపడింది, ఎప్పుడో విన్న మాటలకి "I don't owe you anything " బదులుగా – "అవును మన మధ్య బాకీ ఏమీ లేదు" అని వినపడింది.

★★★★★★★★★★

ఇది గడిచిన చాల ఏళ్ళకి చికాగో నించి పాత క్లాస్మేట్ ఫోన్, ఏదైనా కొత్త విషయం తెలిస్తే అది చెప్పే దాకా వాడి పొట్ట ఉబ్బరం తగ్గదు

"మొన్న ఇండియా వెళ్తే నవీన్ చేసిన విషయం తెలిసింది, చాలా ఫీల్ అయ్యారా"

"ఇట్స్ ఒకేరా మర్చిపోయి చాలా రోజులయ్యింది, అయినా ఒక రకంగా నా తప్పే "

"నీ తప్పు ఎందుకురా?"

"డబ్బులు ఇన్వాల్వ్ చేస్తే గొప్ప, గొప్ప రిలేషన్స్ దెబ్బ తింటాయి, నేనే కొద్దిగా ప్రాక్టికల్గా ఉండాల్సింది"

"అసలు విషయం విను– నవీన్ వాడేవడికో పెద్ద మొత్తానికి హామీ సంతకం పెట్టాట్ట, తీసుకున్నవాడు అడ్రస్ లేకుండా దేశాలు పట్టి పోయాడు. వీడు హామీదారు కావడంతో బ్యాంక్ కోర్ట్ నోటిస్ పంపింది, చేతులు తడిపి తప్పించుకుందుకు విపరీతంగా ప్రయత్నించాట్ట కానీ ఈ మధ్య బ్యాంకులు ఖచ్చితంగా ఉండడంతో మొత్తం కట్టి సెటిల్ చెయ్యడం తప్పలేదుట, ఈ ప్రహసనం మొత్తం అయ్యేసరికి పుల్లలా తయారయ్యాడు" ఆ సంభాషణ నచ్చక వేరే మాటలు మాట్లాడి సెలవు తీసుకున్నా.

ఎదురుదెబ్బలు తగిలితే సెల్ఫ్–పిటి, కోపం, న్యూనతా భావం ఓ రెండు రోజులుండే సహజమైన ఫీలింగ్స్, ఆ తర్వాత జీవితమనే ల్యాబ్లో ప్రాక్టికల్ పాఠం అనుకుని ముందుకెళ్లడమే! ఒక్క ట్రాన్స్అక్షన్ వల్ల చిరకాల మిత్రుడు దూరమయ్యాడు అని బాధపడ్డా, జీవితాన్ని నడిపించే తత్వం నాలో ఇంకి పోయింది–మన కూడికలు, తీసివేతలు, స్వర్గాలు, నరకాలు అన్నీ ఇక్కడే....పైన ఏముందో తెలీదు, కింద ఏముందో ఇప్పుడే తెలుసుకోవాలని లేదు, మధ్యలో ఉన్నదే నిజం..ఆ నిజాన్ని తెల్లగా, స్వచ్ఛంగా ఉంచడం మన చేతిలో ఉంది, దాన్ని తలరాతకి, తప్పుడు చేతలకి వదిలేస్తే మిగిలేది శూన్యం...వెంటాడి, వేధించే శూన్యం !!!

# నువు నడు - నే వస్తా చిలుకూరి సత్యదేవ్

**"ఏరా, 'నువు నడు – నే వస్తా' సినిమా చూసావా?" అని అడిగాడు సుబ్బారావ్.**

"క్రొత్త సినిమా అని తెలుసు గానీ నేను చూళ్ళేదు, ఏమిటి సంగతి?" విస్తుపోయి నేను ఎదురుప్రశ్న వేసాను.

డా. సుబ్బారావ్ తెలుగు సినిమాలు ఎక్కువ చూడడు.

అందుకు కారణం లేకపోలేదు. ముప్పై ఏళ్ళ క్రితం తను ఈ దేశానికి వచ్చినప్పుడు తెలుగు సినిమాలు ఇక్కడ చూసే అవకాశాలు చాలా తక్కువ. ఒకవేళ ఎవరైనా తెలుగు సినిమా టేపులు తెచ్చినా సుబ్బారావ్ అభిరుచికి సరిపడేవి అయితేనే చూసేవాడు. ఇప్పుడైతే, "ఈ కాలపు చెత్త సినిమాలు నాకు నచ్చవు, వాటిల్లో ఎవరికీ సరిగ్గా తెలుగు పలకడం రాదు, నోరు తెరిస్తే అన్నీ బూతులే" అంటాడు.

అలాంటి వ్యక్తి ప్రత్యేకంగా ఫోన్ చేసి ఒక క్రొత్త సినిమా గురించి అడగడం విశేషమే!

"ఆ సినిమా గురించి నీతో మాట్లాడాలి. నీకు ఆ డీ.వీ.డీ. దొరక్కపోతే నేను పంపుతాను, తప్పకుండా చూడు" అని ఎంతో గంభీరంగా చెప్పి ఫోను పెట్టేసాడు.

ఎట్టకేలకు ఆ సినిమా చూడగలిగాను. యథాప్రకారం నాయికల నాభీదర్శనభాగ్యం కలిగించే పాటలు ఆరూ, బాంబు పేలుళ్ళ వల్ల గాల్లోకి ఎగిరే టాటా–సుమోలు నూరూ, వాటి వెనుక ఏదో కథలాంటిది దాగి ఉంది. తెలిసిన కథలా అనిపించింది, నేను ఎక్కడైనా చదివిన నవలను "స్ఫూర్తి"గా తీసుకుని ఈ సినిమా తీసి వుంటారు. అందులో 'నటులు' అనదగ్గ వారెవరూ లేరు, సినిమారంగంలోని అగ్రతారలు కొందరు మాత్రం ఉండడం వల్ల సినిమా బాగా ఆడిందనుకుంటా. ఆం.ప్ర.లో వృషభం, ఎద్దు వంటిదేదో పేరుగల బహుమతి కూడా ఇచ్చారట.

ఇంతకూ మావాడు ఈ సినిమా నన్నెందుకు చూడమన్నాడో నాకు అర్థం కాలేదు. ఫోన్ చేసి అడుగుదామనుకున్నా గానీ వెంటనే కుదరలేదు.

★★★

తరువాత నెల రోజులు సెలవు పెట్టి హైదరాబాదు వెళ్ళాను. బల్కంపేటలోని ఎల్లమ్మ గుడి నుండి యాదగిరిగుట్ట వరకు చేసిన తీర్థయాత్రలూ, ఊళ్ళో బంధుమిత్రుల సందర్శనాల హడావిడీ వల్ల సుబ్బారావ్ గురించీ, ఆ సినిమా గురించీ పూర్తిగా మర్చిపోయాను.

ఒక రోజు మధ్యాహ్నం హైదరాబాదులోని మా ఇంటి తలుపు తట్టిన చప్పుడు. తలుపవతల కోరియర్ మనిషి, నాకు ఉత్తరం తెచ్చి సంతకం కావాలంటూ నుంచున్నాడు. ఇక్కడ నాకు కోరియర్ పంపేవారు ఎవరా అని ఆలోచిస్తూ ఉత్తరం తెరిచి చూసి అదిరిపోయాను.

నన్ను కోర్టుకు రమ్మంటూ ఉత్తర్వు ("సమన్స్") అది. సుబ్బారావ్ 'నువు నడు – నే వస్తా' సినీ నిర్మాత పై వేసిన దావాలో సాక్ష్యం చెప్పమంటూ వచ్చిన న్యాయస్థాన ఆహ్వాన పత్రిక అన్నమాట!

బుద్ధవిగ్రహంలా నుంచుని ప్రశ్నార్థకంగా పెట్టిన నా మొహాన్ని చూసి మా ఆవిడ గాబరా పడింది. ఆమె చేతికి ఉత్తరమిచ్చి సుబ్బారావ్ ఇంటికి గబగబా డయల్ చేసాను. అతను పనిమీద భారత దేశం వచ్చాడని అతని భార్య చెప్పింది. హైదరాబాదులో అతని సెల్ నెంబరు తీసుకుని పిలిచాను.

సుబ్బారావ్ రెణ్ణెల్ల క్రితం నావద్ద ఆ సినిమా ప్రసక్తి ఎందుకు తెచ్చాడో కొంత అర్థమైనా, నాకూ ఆ కేసుకూ సంబంధం ఏమిటో తెలియలేదు. వాణ్ణి అప్పుడే మరింత గుచ్చి అడగవలసింది.

"నాకు తెలుసు నువ్వు ఫోన్ చేస్తావని, కోర్టుకు రమ్మని పిలుపు వచ్చిందా?" ఫోన్ తీస్తూనే అడిగాడు.

"అవును, ఏమిటి ఈ కేసూ, కమామిషూ? అసలు నువ్విక్కడికి ఎప్పుడు వచ్చావు?"

"నిన్ననే ఈ కేసు విషయమై వచ్చాను. అది సరే, నేను చెప్పినట్టు ఆ సినిమా చూసావా?"

"చూసాను, అయితే దానికీ నాకొచ్చిన ఈ ఉత్తరానికీ లంకె కుదరడం లేదు. అసలు నువ్వు ఆ నిర్మాత మీద దావా ఎందుకు వేసినట్టు?" అడిగాను నేను.

"వాళ్ళు నా కథను కొట్టేసి సినిమా తీసార్రా, కనీసం నాకు ధన్యవాదాలు చెబుతూ టైటిల్సులో నా పేరైనా వెయ్యకుండా" అని వాపోయాడు.

మరింత ఆశ్చర్యం. "అది నీ కథా? అయినా నేను నీ తరపు సాక్షినవడం ఏమిటి? నాకేంటి సంబం..." అంటున్న నాకు బుర్రలో ఎక్కడో ఒకమూల తళుక్కున మెరుపు మెరిసినట్టయింది.

సగంలో ఆగిన నా వాక్యాన్ని పూర్తి చేస్తూ "సంబంధం ఏమిటో తెలిసిందా? నువ్వు చెయ్యవలసిందల్లా ఒక్కటే – వాయిదా రోజున వచ్చి ఆ సినిమా కథ గురించి నీకు తెలిసింది న్యాయస్థానంలో చెప్పాలి" అని అర్థించాడు.

నేను గతాన్ని నెమరు వేసుకున్నాను.

మూడేళ్ళ క్రితం తను వ్రాసిన ఆంగ్ల కథలు కొన్ని ఒక ఫైలులో పెట్టి నా అభిప్రాయాలు చెప్పమని ఇచ్చాడు సుబ్బారావ్. దాదాపు నలభై దాకా కథలున్నాయి అందులో. నాకు కొంత సాహిత్య పిచ్చి వుందనీ, అడపాదడపా ఇంట్లో పనులు కూడా మానుకుని సాహితీసభలంటూ తిరుగుతుంటాననీ వాడికి తెలుసు. ప్రతి వారం ఒకటో రెండో కథలు చదివి వాటి మీద నా విమర్శలు, సవరణలు వాడికి పంపసాగాను.

కొన్నాళ్ళకు నేను ఆఫీసు పని మీద ఫిలడెల్ఫియాకు బయల్దేరుతూ అతని కథల ఫైలును కూడా తీసుకుని వెళ్ళాను. సామాన్యంగా ఇలాంటి ప్రయాణాల్లో నా ప్రక్కన కూర్చున్న వ్యక్తులతో కబుర్లు చెబుతుంటాను, ముఖ్యంగా ఎవరైనా దేశవాళీ, అందులోనూ తెలుగు, మొహాలు కనిపిస్తే. ఆ రోజున కూడా ఎవరో తెలుగతను తగిలినట్టు గుర్తు.

ఫిలడెల్ఫియాలో దిగినాక లాప్‌టాప్ సంచిలో చూసుకుంటే కథల ఫైలు కనపడలేదు. బహుశ: విమానంలో వదిలేసి ఉంటాను. ఏర్‌లైన్ వాళ్ళ ఆఫీసుకు ఫోను చేసి అడిగాను, ఫలానా విమానంలో నా ఫైలొకటి పోయింది, దొరికితే చెప్పమని. లాభం లేకపోయింది.

ఆ దుర్వార్త వెంటనే సుబ్బారావ్‌కి చెప్పగా, "ఫరవాలేదులే, అన్నీ నా కంప్యూటర్ లో వున్నాయి. బొత్తిగా వీలు చిక్కక ఈ మధ్య కథలు వ్రాయడం మానేసాను కూడా" అన్నాడు.

"హమ్మయ్య" అనుకొని నేనా విషయాన్ని వదిలేసాను.

ఇప్పుడు కోర్టు కాగితాలు చూసి నాకు అర్థమయిన విషయం ఇది: సుబ్బారావ్ కథల్లో ఒకటి 'నువు నడు – నే వస్తా' సినిమాగా తీసారన్నమాట. అందువల్లనే కామోసు, సినిమా చూసినప్పుడు తెలిసిన కథావస్తువులా అనిపించింది.

"సరే, తప్పకుండా కోర్టుకు వస్తాను" అని హామీ ఇచ్చాను. "అయితే, వాళ్ళ నుండి డబ్బులు లాగుదామనా ఈ దావా?"

అమెరికా వెళ్ళినాక మంచి వైద్యుడిగా పేరు ప్రఖ్యాతులూ, డబ్బూ సంపాదించిన సుబ్బారావుకు ఈ కేసులో వచ్చే నాలుగురాళ్ళూ సముద్రంలో కాకిరెట్టే అని నా నమ్మకం.

"అదేమీ లేదు, కేవలం వాళ్ళు నా కథను దొంగిలించారనే నా బాధ. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ చౌర్యం క్షమించరానిది బ్రదర్, ఊరికే వదలదల్చుకోలేదు" అన్నాడు కసిగా.

ఎవరి పిచ్చి వారికానందం! మధ్యలో నేను మాత్రం ఇరుక్కుపోయాను.

"ఇంకో రెండు వారాల్లో నేను తిరిగి హ్యూస్టన్ వెళ్ళిపోతున్నాను, ఈ కేసు కోసం ఇక్కడ ఉండిపోవడం కుదరదు" అని హెచ్చరించాను.

"భయం లేదులే, చిన్న కోర్టులో విచారణ, అదే రోజు తీర్పు కూడా చెప్పేస్తారు" అని ధీమాగా చెప్పాడు.

★★★

అనుకున్న తేదీకి సికింద్రాబాదులోని న్యాయస్థానానికి వెళ్ళాను. సాక్షికానికే వెళ్తున్నాను కాబట్టి పెద్దగా తయారవవలసింది లేదు – సత్యం పలకడానికి నోట్లో నాలుక తప్ప ఇంకేమీ అక్కర్లేదు గదా?

"ఆ సినీ నిర్మాత నా కథను చేజిక్కించుకుని, సినిమా తీసి ఎంతో డబ్బూ, కీర్తీ సంపాదించాడు. పోతే, అది నా కథ కాబట్టి ఆ విషయాన్ని ఒప్పుకుంటూ బహిరంగ ప్రకటన చెయ్యాలి, ఇకపై ఈ సినిమా టైటిల్సులో మూలకథ నాదని చూపిస్తూ సవరణ చెయ్యాలి", ఇదీ వ్యాజ్యం వేసిన సుబ్బారావ్ న్యాయం చేయమంటూ కోర్టుకెక్కి జడ్జీగారి ముందు వెళ్ళగక్కిన బాధ, విజ్ఞప్తి.

"మీ కథ ఎక్కడైనా ప్రచురించబడిందా?" అవతలి వైపు న్యాయవాది ప్రశ్న.

"లేదు" సుబ్బారావ్ సమాధానం.

"మరి అది మీరు రాసిన కథేననడానికి సాక్ష్యం ఏమిటి?"

"నా లాప్‌టాపులో ఈ కథ ఉంది"

"అది మీరు సినిమా చూసినాక వ్రాసి ఉండవచ్చు కదా?"

"లాప్‌టాపులో కథ యొక్క సృష్టి తేదీ కూడా రికార్డయి వుంది. అది చూపమంటారా?"

"కంప్యూటర్లో ఫైళ్ళ క్రియేషన్ డేట్ ఎవరైనా మార్చవచ్చునేమో గదా?"

ఇలా సాగింది విచారణ. అది సుబ్బారావ్ వ్రాసిన కథేనని రుజువు చెయ్యడం కష్టమౌతున్నది.

★★

ప్రతివాది తరఫు నుండి కొంతమంది సాక్షులను ప్రవేశ పెట్టారు.

వారిలో సినిమాకు కథ వ్రాసానని చెబుతున్న వ్యక్తిని ప్రశ్నలడుగుతున్నారు.

చూడ్డానికి యువకుడిలా ఉన్నాడు. అమెరికాలోనే పెన్సిల్వేనియాలో అతని నివాసమట, అంటే ఈ కేసు కోసం ప్రత్యేకంగా వచ్చి ఉంటాడు. అతన్ని ఎక్కడో చూసినట్టుంది గానీ జ్ఞాపకం రావడం లేదు.

తాను ఆ సినిమా నిర్మాతకు బామ్మర్దిననీ, తనకు తట్టిన ఆ కథాంశాన్ని క్లుప్తంగా ఆయనకు చెప్పగా అది నచ్చి పూర్తి కథను వ్రాసి ఇమ్మన్నాడనీ, ఇలా చెప్పుకొచ్చాడతను.

నేను ఆలోచిస్తూనే ఉన్నాను, ఇతగాడిని ఎక్కడ కలిసానా అని.

ప్లీడర్లు అడిగే ప్రశ్నలకు సమాధానం చెబుతున్న అతను కొద్దిసేపటికి తల తిప్పి నా వైపు చూసి గతుక్కుమన్నాడు. ముఖంలో గాబరా కనబర్చాడు, తాను చెబుతున్న మాటల్లో తడబడ్డాడు. సాక్షిగా వచ్చినవాడు ముద్దాయిలా మొహం పెట్టి దొంగచూపులు చూడసాగాడు.

అతను అలా నా కళ్ళలోకి చూసిన మరుక్షణమే నా చిన్ని మెదడులో మరోసారి దీపం వెలిగింది – గుర్తొచ్చేసింది అతన్ని ఎక్కడ చూసానో.

నేను అప్పుడెప్పుడో ఫిలడెల్ఫియాకి వెళ్ళినప్పుడు నా ప్రక్క సీటులో కూర్చున్నది ఈ ప్రబుద్ధుడే! నేను చదువుతున్న సుబ్బారావ్ కథల ఫైలూ, అందులో నేను రాసుకుంటున్న వ్యాఖ్యలూ చూసి అతనే నన్ను పలకరించాడు. ప్రక్కనున్న బ్లాండు కురుల పదహారణాల అమెరికా వనితను భార్యగా పరిచయం చేసాడు. ఫలానా ప్రఖ్యాత తెలుగు సినిమా నిర్మాత తనకు చుట్టమని గొప్పగా చెప్పాడు; ఆ పేరు నాకు తెలియదని చెబితే జాలిగా చూసాడు కూడా.

అయితే, నేను నా ఫైలును విమానంలో వదిలెయ్యగా వీడు దాన్ని తీసుకుని, చదివి, నాకు తిరిగి అప్పజెప్పకపోగా తన స్వంతానికి వాడుకున్నాడన్నమాట! ఔరా, ప్రయాణ–మిత్ర ద్రోహీ!

★★★

నన్ను సాక్ష్యం చెప్పమని పిలవడంతో మళ్ళీ వాస్తవంలోకి వచ్చాను.

"పూర్తి నిజమే చెబుతాను, నిజం తప్ప ఇంకేమీ చెప్పను" వగైరా ప్రమాణాలు చెయ్యమన్నారు.

సుబ్బారావ్ నాకిచ్చిన ఫైలు గురించీ, అది విమానంలో పోగొట్టుకున్న వైనాన్నీ వివరించాను. ఆ నిర్మాత చుట్టాన్ని కలిసిన విషయం కూడా చెప్పి, ఫైలు అతనికి దొరికి ఉండవచ్చునని అన్నాను.

"అతన్ని కలిసినట్టు సాక్ష్యం ఉందా?" అని వాళ్ళ న్యాయవాది అడిగాడు.

ఆలోచించి, "ఆ రోజున ఎక్కిన విమానం తాలూకు టికెట్టు యొక్క నకలు నా లాప్‌టాపులో ఉంది, ఇప్పుడే చూపగలను. అతని ప్రయాణ వివరాలు కూడా అతని వద్ద ఉండవచ్చు, లేదా ఏర్‌లైన్ వద్ద నుండి కోర్టువారి ఆదేశం మేరకు సంపాదించవచ్చు" అని చెప్పాను.

"అతన్ని విమానంలో కలిసితివిబో, మీరిద్దరూ ప్రక్క సీట్లలో కూర్చున్నారని ఏమి నమ్మకం?"

"బోర్డింగు పాసులో సీటు నెంబర్ల ద్వారా. అతని వద్ద అది లేకపోతే ఏర్‌లైన్ నుండి ఆ వివరాలు కూడా సేకరించవచ్చు." నా సమాధానం.

"అతని ప్రక్కనే కూర్చుంటివిబో, ఆ విమానంలో నీ వద్ద కథల ఫైలున్నట్టూ, దాన్ని నువ్వు పారేసుకున్నట్టూ దాఖలాలేమైనా వున్నాయా?"

"విమానం దిగిన రోజే ఏర్‌లైన్ వారి ఆఫీసులో ఫైలు పోయినట్టు చెప్పాను. వాళ్ళు తమ కంప్యూటర్లో ఎక్కించుకున్నారు."

"ఆ ఫైలును విమానంలో వదలితివిబో, దాన్ని సదరు రచయితగారే తీసుకున్నారని ఎలా చెప్పగలవు?"

ఈ ప్రశ్నకు మాత్రం నా వద్ద సమాధానం లేదు. ఫైలు దొరికితే గానీ సమస్య తేలేట్టు లేదు. దాన్ని ఈపాటికి అతను ఎక్కడో దాచేసే ఉంటాడు, లేక నాశనం చేసి ఉంటాడు.

అంతలో కోర్టు బంట్రోతు జడ్జీగారి వద్దకు వచ్చి చెవిలో ఏది చెప్పి ఒక ఫోను ఇచ్చాడు. ఇంటి నుండి వాళ్ళావిడే అయి ఉంటుంది, మాట్లాడినాక మొహం ఆముదం తాగినట్టు పెట్టి భోజనాల తరువాత విచారణ కొనసాగిద్దామని చెప్పేసి విసురుగా లేచారాయన.

★★

సుబ్బారావూ, నేనూ కోర్టుకు సమీపంలోనే ఉన్న బృందావన్ హోటలుకెళ్ళాము. లోపల అడుగు పెడుతూనే పైన చెప్పిన "రచయిత" గారు ఎవరితోనో కలిసి ఒక టేబిలు వద్ద భోజనం చేస్తూ కనిపించారు. నేనతన్ని సమీపించి పరిచయం చేసుకుని, "హలో, ఎలా వున్నారు, గుర్తు పట్టారా" అని అడిగాను.

అతను బెంబేలు పడిపోయి ఏమనాలో తెలియని పరిస్థితిలో "కేసు నడుస్తోంది, నేను మీతో మాట్లాడ్డం సబబు కాదని మా లాయరుగారు చెప్పారు" అని నసిగాడు.

అప్పుడతనికెదురుగా కూర్చున్నావిడ, "ఎవరు హనీ ఇతను, ఆ సుబ్బారావ్ తరపు సాక్షి కదా? మీతో ప్రయాణం చేసానని అబద్ధపు సాక్ష్యం చెప్పి ఇరుక్కుపోయినట్టున్నాడు" అన్నది.

అమెరికాలో మొగుడూ పెళ్ళాలు సంబోధించుకున్నట్టు అతన్ని "హనీ" అని పిలవడం విని, నేనావిడ వంక తిరిగి ఆ ముఖారవిందాన్ని చూసి తెల్లబోయాను. మునుపు విమానంలో చూసిన బ్లాండు సుందరి కాదీమె, తెలుగుదనం ఉట్టిపడే భారతనారి!

వెంటనే "ఏమిటోయ్ సంగతి? ఈవిడెవరు, విమానంలో ఆవిడెవరు?" అన్నట్టు కనుబొమలెగరేసి అతనివేపు చూసాను.

నా చూపులోని అంతరార్థం గ్రహించినట్టున్నాడు. "నేనీయనతో మాట్లాడాలి డార్లింగ్, నువ్వు బిల్లు కట్టేసి కోర్టుకు రా" అని ఆమెకు చెప్పి, నన్ను ప్రక్కకు రమ్మంటూ భోజనం పూర్తి చెయ్యకుండానే లేచాడు.

తన కళ్ళముందు ఏమి జరుగుతున్నదో అర్థం కాని సుబ్బారావ్‌కు నేను కన్నుగొట్టి "మిత్రమా, ఒక్కడివే భోంచేసి కోర్టుకు నువ్ నడు, ఇతనితో మాట్లాడినాక నే వస్తా " అని చెప్పి మన కుహనా రచయితగారితో హోటలు బయటకు వెళ్ళాను.

ఇద్దరు పెళ్ళాల ముద్దుల భర్తగా వెలుగుతున్న తన విషయం బయటపెట్టి తనను ముంచెయ్యద్దనీ, జైలుపాలవుతాననీ, ఈ కేసులో ఏమి కావాలంటే అది చేస్తాననీ బ్రతిమిలాడుతూ దాదాపు కాళ్ళమీద పడినంత పని చేసాడా "రచయిత".

★★

ఆ మధ్యాహ్నం కోర్టులో విచారణ పది నిమిషాల్లో ముగిసింది. భోజన విరామంలో సుబ్బారావూ, నిర్మాతా ఒప్పందానికి వచ్చినందువల్ల సుబ్బారావ్ తన ఆరోపణను వెనక్కు తీసుకున్నాడు. జడ్జీగారు ఆ ఒప్పందం ప్రకారం నడుచుకొమ్మని వారిద్దరికీ చెప్పి కేసును మూసేసారు.

★★★

మూడ్రోజుల తరువాత హైదరాబాదులో ఒక తెలుగు దినపత్రికలోని పదమూడవ పేజీలో ఒకమూల అతి చిన్న అక్షరాలతో 'నువు నడు – నే వస్తా' సినిమాకు కథామూలం సుబ్బారావ్ గారిదని ఆ చిత్ర నిర్మాతగారి 'బహిరంగ ప్రకటన' వచ్చింది. ఆ వార్తను ఎంతమంది చదివారో తెలియదుగానీ నిర్మాత మాత్రం సుబ్బారావ్ మళ్ళీ తన మీద కేసు పెట్టకుండా చేసుకున్నాడు.

ఆరునెలల తరువాత అలనాటి ఫైలు–చోరుడి గురించి "ఫిలడెల్ఫియాలో ఫలానా భారతీయుడిపై ద్వికళత్ర నేరం (బిగమీ లేక బైగమీ) మోపబడింది, అతను ఊచలు లెక్కబెట్టాల్సి వచ్చేట్టుంద"ని మా ఊళ్ళోని పటేల్ బ్రదర్స్ అనే కిరాణా కొట్టులో దేశీయ వారపత్రికలో చదివాను. అతని రహస్యం నేను బయట పెట్టినా పెట్టకపోయినా ఎంతకాలం దాగుతుంది?

మరో మూడు నెలలకు ఫోన్ చేసి "ఏరా, 'సొరంగంలో మృదంగం' సినిమా చూసావా?" అని అడిగాడు మా సుబ్బారావ్.

"రాంగ్ నంబర్" అని ఫోను పెట్టేసాను.

🦋🦋🦋

# హక్కు బాధ్యతే

ప్రవీణ కొల్లి

"వాట్?"

"అవును..హాస్పిటల్లో అడ్మిట్ చేసాము"

"నేను నమ్మలేకపోతున్నాను"

"మా అందరి పరిస్థితి అలాగే ఉంది. ఇంకా షాక్ లోనే ఉన్నాము?", బొంగురుపోయిన గొంతుతో మాట్లాడి ఫోన్ పెట్టేసాడు దీపక్.

శ్రావణి ఆత్మహత్యా ప్రయత్నం. నమ్మలేకపోతున్నాను, అస్సలు నమ్మలేకపోతున్నాను. నేను విన్నది నిజమేనా? నాలుగు రోజుల

క్రితమే మాట్లాడాను. ఎప్పుడూ వుండే సమస్యల గురించే మాట్లాడుకున్నాం. ఇంతలో కొత్తగా ఏమైంది? అలాంటి నిర్ణయం ఎందుకు తీసుకుంది? ఎందుకు..ఎందుకు? కారణం ఏమిటి?....బహుశా నాకు తెలుసేమో? తెలుసా? తెలుసా?.....

"ఆర్ యు ఓకే?", రెండు చేతులతో తలను పట్టుకుని కిందకు చూస్తూ ఆలోచనలో మునిగిపోయిన నేను ఉలిక్కిపడ్డాను.

"ఐయాం ఓకే. ఐ నీడ్ యువర్ హెల్ప్", నావైపు ఆందోళనగా చూస్తున్న కొలీగ్ తో అన్నాను.

విషయం చెప్పి, నేను అర్జెంట్ గా చెయ్యాల్సిన పనిని తనకు అప్పగించి హాస్పిటల్ కు పరుగులు తీసాను.

కొంగుతో మాటిమాటికీ కళ్ళు తుడుచుకుంటూ, దుఖాన్ని దిగమింగుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ ఆంటీ ఐసియు ముందు కనిపించారు. నన్ను చూడగానే కట్టలు తెచ్చుకున్న దుఖంతో నా చెయ్యి పట్టుకుని, "చూసావా తల్లి, ఎంత పని చేసిందో శ్రావణి", గుండెల్లో బాధ మాటల్లో ధ్వనించింది.

"ఇప్పుడెలా ఉందాంటీ?" , అడిగాను.

"48 గంటలు గడిస్తే కానీ చెప్పలేమంటున్నారు డాక్టర్లు"

"ఏం చేసుకుంది", అడగలేక అడగలేక అడిగాను.

"వాళ్ళత్త గారి నిద్ర మాత్రలు మింగేసింది. సమయానికి ఆవిడ చూసుకోబట్టి సరిపోయింది. వెంటనే అంబులెన్సు పిలిసి హాస్పిటల్లో అడ్మిట్ చేసారు"

"కంగారు పడకండి, అంతా సర్దుకుంటుంది", ఆంటీ భుజం చుట్టూ చెయ్యివేసి పట్టుకున్నాను.

లిఫ్ట్ లో నుంచి వస్తున్నా అంకుల్ ని చూసి లేచి నించున్నాను. అంకుల్ వెనుకాలే దీపక్ మూర్తిభవించిన శోఖగ్రస్తుడిలా ఉన్నాడు. జుట్టు రేగిపోయి, ఎర్రబడ్డ కళ్ళతో మొహం పీక్కుపోయి ఉన్నాడు. దిగ్భ్రాంతి, దుఖం కనిపిస్తున్నాయి అతని ప్రతి కదలికలోనూ.

"పరువు తీసేసిందమ్మా నీ ఫ్రెండ్", అంకుల్ గొంతులో బాధతో సమానంగా కోపమూ వినిపించింది. అలా అనకండి అని సూటిగా అనలేక, "ప్లీజ్ అంకుల్.." అన్నాను. నాకా సమయంలో ఇంకేమి మాట్లాడాలో అర్థం కాలేదు.

దూరంగా గోడకు ఆనుకుని నుంచున్న దీపక్ దగ్గరకు వెళ్లాను.

"డాక్టర్ ఏమంటున్నారు దీపక్?", పలకరించాను.

"పరిస్థితి విషమంగానే ఉందంట. షి టుక్ హెవీ డోస్ అఫ్ స్లీపింగ్ పిల్స్", కళ్ళల్లో తిరుగుతున్న నీళ్ళు కనిపించకుండా పక్కకు చూస్తున్నాడు.

"డోంట్ వర్రీ, షి విల్ బి ఓకే", మాటలు కూడబలుక్కున్నాను.

"హోప్ సో", ఇంక మాట్లాడటం ఇష్టం లేనట్టు పక్కకు తిరిగాడు.

నేను ఆంటీ దగ్గరకు వెళ్లి పక్కన కూర్చున్నాను. చేతులు రెండూ జోడించి కనిపించని ఏ దైవానికో మొక్కులు మొక్కుతున్నారు. చీరకొంగు నోటికడ్డం పెట్టుకున్నా, ఎగిరెగిరి పడుతున్న గుండెలు దుఖాన్ని దాయలేకపోతున్నాయి. ఆంటీ చేతిని నా చేతుల్లోకి తీసుకుని నిమురుతూ కూర్చున్నాను.

మరో గంట తర్వాత శ్రావణి అత్తామామ వచ్చారు. ఇలాంటి పరిస్తితుల్లో ముందు వెనుక ఆలోచించకుండా బేషరుతుగా నిందారోపణ చేసేది వారి పైనే. వారి కదలికలలో ఆ భావం కనిపిస్తుంది. అత్తగారు దూరంగా ముభావంగా కూర్చున్నారు. మామగారు కొడుకుతో నాలుగు

మాటలు మాట్లాడి, మొక్కుబడిగా కాసేపు కుర్చుని వెళ్ళిపోయారు.

నేను రాత్రి దాకా ఉండి ఇంటికి వచ్చాను. ఉదయం ఈ వార్త తెలిసినప్పటి నుంచీ నాలో కమ్ముకున్న దిగులు మేఘాలు ఉరుములు మెరుపులతో వర్షించటం మొదలుపెట్టాయి. తలగడల మధ్యలో మొహాన్ని దాచుకుని ఎక్కి ఎక్కి ఏడ్చాను. నాలో నుంచీ ఎన్ని కడవల కన్నీరు తోడానో తెలియదు. ఇంకా ఇంకా ఊరుతూనే ఉన్న ఈ కన్నీటికి ఆనకట్ట వెయ్యలేక పోతున్నాను. ఇది అని చెప్పలేని ఏదో గిల్టీ ఫీలింగ్ నన్ను దహించేస్తోంది.

శ్రావణి..శ్రావణి...ఇలా ఎందుకు చేసావు? ఎందుకు ఎందుకు?...నీలో భావాల సంఘర్షణను నేను సరిగ్గా అర్థం చేసుకోలేకపోయానా? లేక తేలికగా తీసుకున్నానా? నిన్ను నిర్లక్ష్యం చేసానా? నేను సైతం కారణమయ్యానా?

శ్రావణి..శ్రావణి...ప్లీజ్ కం బ్యాక్. వెళ్ళిపోకు...నేనీ గిల్టీ ఫీలింగ్ ని జీవితాంతం మోయలేను . నువ్వు నా బాల్యపు స్మృతివి, నా జ్ఞాపకాల అల్లికలో దారానివి. నువ్వెళ్ళిపోతే మాల చెల్లాచెదురైపోతుంది.

"నీకేదో పోస్టల్ లెటర్ వచ్చింది"

లెటర్..నాకెవరు రాస్తారు? ముత్యాల్లాంటి చేతి రాతతో మా ఇంటి అడ్రస్ రాసి ఉంది. ఆత్రంగా విప్పాను.

***నా ఒయసిస్సుకు,***

ఆశ్చర్యపోతున్నావా? నేనే శ్రావణిని......ఎడారిలాంటి నా జీవితంలో ఒయసిస్సువి నువ్వు. నా జీవితంలోని ప్రతీ ఘట్టంలోనూ నువ్వున్నావు. నీ చేతిని శాశ్వతంగా వదిలివెళ్ళిపోతున్న నా ఈ చివరి క్షణాలు సైతం నీతో పెనవేసుకుని ఉన్నాయి. నా జీవనాధారానికి వీడ్కోలు చెప్పకుండా ఎలా వెళ్ళిపోతాను? అందుకే ఈ ఉత్తరం.

ఎంత కాలమైందో పేపరుపై పెన్నుతో తెలుగు అక్షరాలు రాసి. పోనీలే.....చివరి పనైనా అందంగా చేస్తున్నాను.

నేస్తమా, నువ్విచ్చిన ప్రోత్సాహం, నువ్వందించిన సహకారంతోనే ఇప్పటిదాకా ఈ బండిని లాక్కొచ్చాను. ఇంక నా వాళ్ళ కాదు.

ఎందుకీ నిర్ణయం తీసుకున్నానంటే........ ఎక్కడ మొదలుపెట్టను? ఏమని రాయను? నీకు తెలియకపోతే కదా?!

....

....

......

నాన్న చదువు నేర్పించారు. "నువ్వు ఇంజనీరవ్వాల్సిందే"..... నా మొదటి మైలురాయిని నాన్నే నిర్ణయించారు, సోషయాలజి చదవాలన్న నా ఆశను మొగ్గలోనే తుంచేస్తూ. ఇళ్ళు, కాలేజి, సబ్జెక్టు పుస్తకాలు.....ఇవే నాకు తెలియాల్సిన నాలోకం ఆనాడు. డాన్స్ నేర్చుకోవాలన్న నా కోరిక, సాహిత్యం చదవాలన్న నా అభిలాష, వీణ వాయించాలన్న నా ఆశ...అనేకానేక అంక్షల సంకెళ్ళలో బంధింపబడి నా స్వేచ్ఛకు ప్రశ్నలుగా మిగిలాయి. పుస్తకాలలో పాఠా లను నేర్చుకున్నాను, బతికే స్థైర్యాన్ని నేర్చుకోలేకపోయాను.

నేను ఎదుగుతున్నానా లేక కుంచించుకుపోతున్నానా అని ఆలోచించే జాస మా ఇంట్లో ఎవరికీ లేదు. మార్కుల జాబితాలో నేనూ ఓ మార్కునే!

ఆరాధనగా చూస్తున్న వెనుక బెంచీ కుర్రాడు నా చేతిలో ప్రేమలేఖ పెట్టిన నాడు, నేనేందుకలా ఏడ్చాను? "ధైర్యం ఉంటే వెళ్లి ఆ అబ్బాయితో మాట్లాడు. పోనీ నన్ను వెళ్లి మాట్లాడనీ. లేకపోతే నోర్మూసుకుని ఊరుకో, ఇలా ఏడుస్తూ ఉండకు". నువ్వారోజు నన్ను ఓదార్చలేదు, తిట్టావు?...గుర్తుందా?

అమ్మా,నాన్న, ఇళ్ళు, గౌరవం, పరువు, కులం, మతం.....నాకా సాహసం లేదని తేల్చేసి చెప్పేసాను కదూ. అది ప్రేమో ఆకర్షణో తేల్చుకునే అవకాశం కుడా ఇవ్వకుండా మనసు నోరు నొక్కేసాను.

బేరసారాల లెక్కల్లో, లాభనష్టాల బేరీజుల్లో కుదిరిన నా పెళ్ళిలో మూడుముళ్ళు, ఏడడుగులూ అంకెలే. పెళ్ళీ వ్యాపారమే!

"నీ మనసు చెప్పినట్టు విను. నువ్వు జీవితం పంచుకోవాల్సిన నిర్ణయం. కాంప్రమైజ్ అవ్వకు",నీకు గుర్తుందా? ఆ రోజు నన్నెంత ప్రోత్సహించావో.

నాకు మరో ఛాయస్ లేదు. తలవంచేసాను. అదిగో అప్పుడూ మనసు ఎదురుతిరిగింది. యధావిధిగా నోరు మూసేసాను.

ఇదొక వ్యాపారం. నేనొక భాగస్వామిననుకున్నాను. పొరపాటు పడ్డాను. ఇదొక కోర్టు. ఈ కోర్టులో నేను శాశ్వత ముద్దాయిని. కూరలో పిసరంత ఉప్పు తక్కువైనా, పిల్లలకు పరీక్షలో మార్కులు తక్కువొచ్చినా, అత్తగారు బిపి టాబ్లెట్ వేసుకోవటం మర్చిపోయినా, మామగారి షుగర్ లెవెల్ పెరిగినా,చివరకు మావారికి ఆఫీసులో పని ఒత్తిడి ఎక్కువైనా .....అది ఇది అని కాదు, అన్నింటా అన్ని వేళలా నేనే ముద్దాయిని. ఒకే షాట్ తో అమలయిపోయే ఉరి లాంటి మరణ శిక్షలు వుండవిక్కడ. మాటల కొరడాలు ఝుళిపించే యావజ్జీవ శిక్షలే ఇక్కడన్నీను! ఈ కోర్టులో జడ్జ్ గారికి, లాయర్లకు ఎంత మంచి పేరని!? మంచి సంపాదన, ఆస్తి పాస్తులు, చీరలు, నగలు...నేను అదృష్టవంతురాలినంట!

మనసు ఎదురుతిరిగినప్పుడల్లా నీ భుజంపై వాలిపోయేదాన్ని. "ఎన్నాళ్ళిలా సర్దుకుపోయి బతుకుతావు. నీ ఇష్టాలు చెప్పు, కష్టాలు ఎత్తి చూపు". నువ్వేన్ని సార్లు చెప్పినా ఆ పని చెయ్యలేకపోయాను. మంచితనం మాటునున్న అసమర్ధత, చేతకానితనం నన్ను కట్టిపడేస్తూనే వున్నాయి ఈ క్షణం వరకు.

ప్రేమ కోసం తపించి తపించి అలిసిపోయాను. నాకొక స్వచ్ఛమైన కౌగిలి కావాలి, ఆర్తిగా నుదుటన ముద్దు కావాలి. ప్రేమగా మాట్లాడే మాట కావాలి. నా ఇష్టాలు గౌరవించే మనిషి కావాలి. నా పై చూపించే అధికారాన్నే ప్రేమని భ్రమించి బతకలేను. ఎదిరించి నిలదీసి బతికే ధైర్యాన్ని నా జీవితంలో నేను నేర్చుకోలేకపోయాను.

నేస్తమా, నీ ప్రోత్సాహం నన్ను అడుగువెయ్యమంటుంది. నడిచే శక్తి నాకు లేదు. అందుకే ఓడిపోతూ వెళ్ళిపోతున్నాను.

***ఇట్లు,***

***నీ నేస్తం***

***శ్రావణి.***

నా కన్నీటి చుక్కలతో అక్కడక్కడా అక్షరాలు అలుక్కుపోయాయి. ప్రతి వ్యాక్యం శ్రావణి గుండెలో గూడుకట్టుకున్న గుబులును, ఒంటరితనాన్ని తెలియజేస్తున్నాయి.

ఎంత తప్పు చేసాను? నాలుగు మంచి మాటలు చెప్పే ప్రయత్నం చేసి ఊరుకున్నాను. తను డిప్రెషన్ లోకి కూరుకుపోతుందని గ్రహించలేకపోయాను. కౌన్సిలింగ్ కి తీసుకెల్లాలన్న ఆలోచనే రాలేదు నాకు. ప్రొఫెషనల్ హెల్ప్ తీసుకుంటే పరిస్థితి ఇక్కడి దాకా వచ్చి వుండేది కాదేమో.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

"అవుట్ అఫ్ డేంజర్. ఈరోజు రూంకి షిఫ్ట్ చేస్తారంట", దీపక్ మోహంలో రిలీఫ్.

"అంకుల్, కాఫీ తాగి వద్దామా?", ప్రమాదం తప్పిందన్న ఆనందం అంకుల్ కళ్ళలో కనిపిస్తుండగా అడిగాను. ఇద్దరం కాఫీ తాగుతూ కార్నర్ టేబుల్లో కూర్చున్నాము.

"అంకుల్, మీరు కోపం తెచ్చుకోను అంటే ఒక మాట చెపుతాను".

ప్రశ్నార్ధకంగా నా వైపు చూసారు. శ్రావణి రాసిన ఉత్తరం అంకుల్ చేతిలో పెట్టాను. లెటర్ చదువుతుండగా అంకుల్ కళ్ళలో కదలాడిన చెమ్మ నాలో ఆశను పెంచింది.

"మీకు శ్రావణంటే ఎంతిష్టమో నాకు తెలియంది కాదు. తన కోసం మీరు అన్ని సమకూర్చి పెట్టారు. కానీ అంకుల్.......శ్రావణికి ఇష్టాలు ఉంటాయనే విషయాన్ని మాత్రం మర్చిపోయారు. మీ కూతురు శ్రమ లేకుండా ప్రయాణిస్తుందని మార్గాన్ని మీరే నిర్మించి ఇచ్చారు. ఆ దారి మీ కూతురికి నచ్చిందో లేదో కూడా అడగటం విస్మరించారు."

"నేనేది చేసినా తన మంచికే చేసానమ్మా"

"ఐ అండర్స్టాండ్ అంకుల్. కూతురి భవిష్యత్తును కలలుగా కంటూ అదే జీవితంగా బతికారు. మన మధ్యతరగతి కుటుంబాలలో తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ఎన్నెన్నో త్యాగాలు చేస్తారు. చట్రంలో ఎంతో పద్దతిగా పెంచుతారు ", ఒక్క నిమిషం ఆగి , "ఊపిరి సలపనంత పద్ధతిగా పెరుగుతాం మేము", ముగించి తలకిందకు దించేసాను అంకుల్ కళ్ళలోకి చూడలేక.

పది నిమిషాలు ఏమి మాట్లాడకుండా వుండిపోయారు అంకుల్. నేను కూడా నిశ్శబ్దంగా ఉండిపోయాను.

"మరొక్క మాట.....శ్రావణిని, దీపక్ ను కౌన్సిలింగ్ కు పంపిద్దాము", అంకుల్ మౌనాన్ని చేధిస్తూ అన్నాను.

"కౌన్సిలింగ్.....అంటే.....అదీ....మరి...నలుగురు ఏమనుకుంటారు"

" మన అమ్మాయి జీవితానికి మించిన పరువా చెప్పండి? ", అంకుల్ కళ్ళలోకి చూస్తూ అడిగాను.

సమాధానం చెప్పలేక తలదించుకున్నారు.

"శ్రావణి చేసింది పొరపాటు పనే. తనలా చెయ్యకుండా వుండాల్సింది. మనమేవ్వరమూ తనను నినదించవొద్దు. కోప్పడి, ఇలా చేసావేంటి అని తిడితే ఇంకా ముడుచుకుపోతుంది. మనసు విప్పి మాట్లాడదు. ప్రేమగా మాట్లాదాం. నీకు మేమున్నామన్న ధైర్యాన్ని తనకు కలిగిద్దాం."

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

"దీపక్, నాకు తెలిసిన సైక్రాటిస్ట్ ఉన్నారు. మీకు అభ్యంతరం లేకపోతే అపాయిట్మేంట్ తీసుకుంటాను"

"చివరకు నన్నా స్థితికి తీసుకొచ్చింది శ్రావణి"

"చదువుకున్న మీరు కూడా అలా అంటే ఎలా?"

"తనకేం తక్కువ చేసాను?"

"ధనం, దర్పం, చీరలు, నగలు..ఇవి అమర్చిపెట్టారు. మానసికంగా తన మనసును హత్తుకున్నారా? శ్రావణి ఎంత ఒంటరితనంతో

బాధపడుతుందో ఒక్కసారి ఆలోచించండి దీపక్ ."

ఇంకా ఎంతో మాట్లాడాలన్న నా ఆత్రాన్ని ఆపేసుకుంటూ ,"ప్రేమ లేదని కాదు. ఒక కమ్యునికేషన్ గ్యాప్. శ్రావణిని అర్థం చేసుకోండి. కౌన్సిలింగ్ కి వెళ్ళండి దీపక్, ప్లీజ్...ఇద్దరికీ ఉపయోగపడుతుంది"

"సరే, అపాయిట్మెంట్ తీసుకోండి."

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

శ్రావణి కాస్త కోలుకుంది. సాలిడ్ ఫుడ్ తీసుకోగలుగుతోంది. మానసికంగా ఎంత ఒత్తిడికి లోనయిందో తన మొహం చూస్తుంటే అర్థం అవుతుంది.

బంధుమిత్రులకు, ఇరుగుపొరుగు వారందరికీ ఈ వార్త అందేసినట్టుంది. మ్యుజియంలో బొమ్మను చూడటానికి ఎగబడినట్టు క్యూ కట్టేశారు. సమస్యేంటి అంటూ ఆరా తీసేవాళ్ళు కొందరైతే, ఏమైందంట? ఎందుకిలా చేసిందంట? అంటూ ఇంట్రాగేసన్ చేసేవాళ్ళు మరికొందరు. ఇలాంటి పరిస్థితుల్లో పరామర్శలకు రాకూడదని, పలకరింపుల అవసరం లేదనే ఇంజ్ఞిత జ్ఞానం ఎంత నాగరికత నేర్చుకుంటే తెలిసేది?! కొన్ని కొన్ని విషయాలలో మన ఇండియన్ కమ్యూనిటీ మారాల్సింది ఎంతైనా ఉంది అనిపిస్తుంది.

ఏకాంతం దొరకగానే "శ్రావణి..." అని పిలిసాను. మాట్లాడేలోపే బోరున ఏడ్చేసింది. ఏడవనీ, కరువు తీరా ఏడవని. మనసు కరిగి నీరవ్వనీ. నేను మాట్లాడకుండా తననే చూస్తూ ఉండిపోయాను. కాసేపటికి కుదురుకుంది.

"నీకు కుదిరినప్పుడు తీసి చదువు. ఏకాంతంలో ప్రశాంత మనసుతో చదువు. ఆలోచించు బాగా ఆలోచించు ", కవరు చేతిలో పెడుతూ అన్నాను.

***శ్రావణి,***

ఇలా ఉత్తరం రాయాల్సిన పరిస్థితి వచ్చినందుకు బాధ పడుతూనే, కనీసం ఈ అవకాశాన్ని నాకు మిగిల్చినందుకు ఆ దేవుడికి ఎప్పటికీ రుణపడి ఉంటాను.

నీ ఉత్తరానికి ప్రత్యుత్తరమే అనుకో! మాటల మూటలు విప్పితే భావాలు అటు ఇటు ఎగిరిపోతాయేమోనని, అక్షరాలలో బంధించి నీకిస్తున్నాను. నీ కళ్ళలోకి సూటిగా చూస్తూ ప్రశ్నించాలనుంది. నీ కన్నీరు ఎక్కడ నా ప్రశ్నల గాఢతను తగ్గిచేస్తుందేమోనన్న అనుమానంతోనూ ఈ ఉత్తరం రాస్తున్నా.....అర్థం చేసుకుంటావు కదూ!

ఏయ్ పిచ్చి మొద్దూ......మమ్మలనందరినీ వదిలేసి అలా ఎలా వెళ్ళిపోదామనుకున్నావు? ఈ పాశం అంత తేలికగా తెగిపోతుందనుకున్నవా?

నీ గురించి ఆంటీ ఎంత తల్లడిల్లిపోయారో మాటల్లో చెప్పలేను. దుఖాన్ని దిగమింగుకుంటూ అంకుల్ డాక్టర్ల చుట్టూ తిరుగుతుంటే చూసి తట్టుకోలేకపోయాను. శ్రావణి భవిష్యత్తు కోసం కనని కల లేదు, చెయ్యని ఏర్పాటు లేదు...చివరకు ఇలా అయింది అంటూ ఆంటీ అంకుల్ ఇద్దరూ కుమిలిపోతున్నారు. నువ్వు లేని లోకంలో ఆ వృద్ధ దంపతులు బతకగలరనుకుంటున్నావా?

దీపక్ హటాత్తుగా పదేళ్ళు పై పడినట్టు అయిపోయాడు. "మీరెళ్లి ఫ్రెష్ అయి రండి, నేనుంటాను శ్రావణి దగ్గర", అని నేనెన్నిసార్లు చెప్పినా, నిన్ను క్షణం కూడా వదిలి వెళ్ళలేదు. ఏ సమయాన ఏ అవసరం వస్తుందో అని కనిపెట్టుకుని కూర్చున్నారు. అతని కళ్ళల్లో కదలాడిన

దిగులు వెనుక ప్రేమ లేదంటావా? తనకు నీ పై ఉన్న ప్రేమను వ్యక్తపరచటం చేతకాదను..నేను ఒప్పుకుంటాను. అంత మాత్రానికే ఒదిలి వెళ్ళిపోవాలా? మార్చుకోలేవా ? ఆలోచించు...

శ్రావణి...నీ గుండెలపై చెయ్యి వేసుకుని నిన్ను నువ్వు ప్రశ్నించుకో.నీ ఈ పరిస్థితి కి నువ్వు కారణం కాదంటావా? నీ తల్లిదండ్రులు, భర్త, అత్తమామలు..చివరకు సమాజం సైతం నీ ఈ స్థితికి కారణమని ఒప్పుకుంటున్నాను. వీటన్నింటికి మించి, నిన్ను నువ్వు నిలబెట్టుకోవాలని ఎన్నడన్నా ప్రయత్నించావా?

అంకుల్ నీ చదువు, పెళ్ళి నిర్ణయించినప్పుడు....అది నీకు ఇష్టం లేకపోయినా ఎందుకు తలవంచావు శ్రావణి ?

అత్తగారి బిపి, మావగారి షుగర్ నీ భుజాలపై మోపినప్పుడు, నా అధీనంలో లేని వాటిని నేనెలా మోయగలను అని నువ్వెందుకు నిలదీయలేదు?

నిజం చెప్పు..వంట కుదరకపోయినా, పిల్లలకు మార్కులు తక్కువ వచ్చినా, నిన్ను నువ్వు దోషిని చేసుకోలేదూ?

ఎందుకు శ్రావణి, ఈ మంచి అనిపించుకోవాలన్న ఆరాటం మనకెందుకు?

నీ జీవితంలో అసంతృప్తి రాజ్యమేలుతున్నపుడు పిరికిగా జీవితాన్నే ముగించాలనుకున్నావు. ధైర్యం చేసి ఆ గిరిలో నుంచీ ఒక్క అడుగన్నా బయటకు వెయ్యాలని ఎందుకు అనుకోలేదు? ఎందుకంటే...పంజరంలో బంధీగా ఉండటంలో నీ స్వార్థం ఉంది. ఆ స్వార్థం మరేదో కాదు , అది నీ కంఫర్ట్ జోన్. లొంగిపోవటంలో ఉన్న సుఖం ఎదురు తిరగటంలో లేదు. ఇక్కడ వింత ఏమిటంటే...స్వార్థం అట్టడుగున ఉన్న కనీకనిపించని పొర, దానిపై జాలి అనే భావన, దానిపై త్యాగం అన్న పేరు. నీ ఆత్మసాక్షిలోకి తొంగిచూడు, నేను అన్నది నిజమని ఒప్పుకుంటావు. ఏదో పోతుందని భయపడుతూ, నిన్ను నిన్ను కోల్పోయావు.

మన సమాజంలో మగాడు ఎప్పుడూ కంఫర్టబుల్ పోసిషన్ లోనే ఉన్నాడు. తరాలుగా స్త్రీ మగాడి ఆధీనంలోనే ఉంటూ వచ్చింది. ఒక్క నిమిషం ఆడ,మగ అన్న సంగతి పక్కన పెట్టి ఆలోచించు . ఏ మనిషైనా తన అధికారాన్ని, సౌకర్యాలను ఒదులుకోవటానికి సమ్మతంగా ఉంటారా ?

శ్రావణి, స్త్రీలుగా మన హక్కులను తెలియపరచటం మన హక్కు మాత్రమే కాదు , అది మన బాధ్యత . నీ బాధ్యతను నువ్వు నిర్వహించావా అని కూడా అడగట్లేదు, అసలు గుర్తించావా?

ఈ ముసుగులు తీసెయ్. ఈ హిపోక్రాసి మనకొద్దు. ఇది నేను అనే హక్కును తెలియచెప్పే బాధ్యతను నిర్వహిద్దాం, మన కోసం, మన ముందు తరాల కోసం.

శ్రావణి.....నన్ను క్షమించు. నిన్ను పూర్తిగా అర్థం చేసుకోవటంలో విఫలమయ్యాను. నా సహకారం నీకు మరి కొంత అందించి ఉండాల్సింది.

*ఇట్లు,*

*నీ స్నేహితురాలు*

# ధర్మో రక్షతి రక్షితః

ఆర్. శర్మ. దంతుర్తి

**కామ్యక వనం. రాత్రినుండి భీముడు అసహనంగా ఉన్నాడు.** రాత్రి పొద్దుపోయి పడుకోవడం ఒకటి, ద్రౌపది ఏడుపొకటి మనసుని పిండేస్తున్నాయి. అరణ్యవాసానికి వచ్చామన్న మాటేగానీ ఈ ధర్మరాజుకి ఎక్కడున్నా ఒకటే అన్నట్టుంది. రాజ్యం పోయినందుగ్గానీ, ఇలా గుప్పెడు అన్నం ఆకులో తినేటప్పుడు గానీ ఈయనకి తాను రాజుననే గుర్తేలేదు. ఎలా బతుకుతేనేం అనుకునే ఆయనకి రాజ్యం ఎలా వస్తుంది? ఆయన పేరుకి క్షత్రియుడే, అయితేనేం? కండబలం ఉండొద్దూ? ధర్మం, ధర్మం అంటూ ఒక చోట మట్టి ముద్దలా పడి ఉంటే ఆ దుర్యోధనుడు రాజ్యం ఇస్తాడా? ఈయన వానపాము అని తెలిసే అలా ఆడించాడు మనందర్నీ. సరే ఈ ఆలోచన్లు ఎంతకి తెగేవికావు. తల విదిలించి కుటీరంలోంచి బయటకొచ్చాడు.

యుధిష్ఠిరుడు దూరంగా ఉన్న చెట్లకేసి, అరణ్యాలకేసి చూస్తూ ఉన్నాడు తదేకంగా. భీముడికి చిరాకనిపించింది. ఏవుంది వాటిలో చూడ్డానికి? ఈయన రాజ్యం పోయినా ఇంత నిదానంగా ఎలా ఉన్నాడు? ఇప్పుడు ఇంకా ఎవరూ అభ్యాగతులు రాలేదు కనక ఇప్పుడే పోయి ద్రౌపదిని పిలిస్తే? ఆ ఆలోచన రావడమే తడవుగా లోపలకెళ్ళి ద్రౌపదిని పిలుచుకొచ్చాడు. ఇద్దరూ ధర్మరాజు దగ్గరకెళ్ళి "ఆర్యా" అన్నారు.

వెనక్కి తిరిగి చూసి నవ్వుతూ అన్నాడు ధర్మరాజు "నేనే మిమ్మల్ని పిలుద్దాము అనుకుంటున్నాను, చూడండి, ఈ కొండలూ కోనలూ, అరణ్యాలలో ఈ పక్షులూ ఎంత సంతోషంతో ఉన్నాయో. మనం రాజ్యం చేస్తే మాత్రం ఈ మాత్రం సంతోషంగా ఉండగలమా?" అన్నాడు.

భీముడికి ఒక్కసారిగా కోపం పెల్లుబికింది. "అంటే మనం ఎల్లకాలం ఇక్కడే ఉంటే మంచిదనేనా మీరు చెప్పేది?" అడిగాడు.

"లేదు లేదు, నేను మనముందున్న వాటి గురించే, ప్రస్తుతంలోనే చెపుతున్నాను."

"మీ సుక్షత్రియులు, క్షత్రియ ధర్మం యుద్ధమే అని శాస్త్రాలు చెప్తున్నాయి కదా? వాడు మనందర్నీ ఇలా అడవిలోకి పంపేసి సుఖంగా ఉంటే, మీరు ధర్మం ఏమి పాటిస్తున్నారు? నేనూ రోజూ నేలమీద పడుకోవడం మీ ధర్మమా?" కొంచెం వెటకారంగా అడిగింది ద్రౌపది.

"ద్రౌపదీ.! యుద్ధం క్షాత్రియ ధర్మమే, కాదని ఎవరన్నారు? కానీ కత్తి చేతిలో ఉంది కదా అని, కనపడిన ప్రతిదాన్నీ చంపంకదా? యుద్ధం అవసరమైనప్పుడు తప్పకుండా అదే పాటిద్దాము" చెప్పాడు ధర్మరాజు శాంతంగా.

"మీ రాజ్యం పోయింది. మిమ్మల్ని అందరూ వెలివేసినట్టు అడవికి పంపించేరు. ఇప్పుడు కాక మరెప్పుడు మీ ధర్మం పనికొస్తుంది? ఇప్పుడే క్షత్రియ ధర్మం చూపించాలి కదా?" అసహనంగా అన్నాడు భీముడు.

"తమ్ముడూ, నేను ధర్మం ప్రకారం పాచికలాటలో ఆడి, ఓడాను. ఆ ధర్మం ప్రకారం పన్నెండేళ్ళ అరణ్యవాసం, ఒక ఏడు అజ్ఞాతవాసం తప్పదు. ఇప్పుడు యుద్ధానికి పరుగెడితే మనల్నందర్నీ రక్షించగల అర్జునుడు దివ్యాస్త్రాలు కోసం వెళ్ళి ఉన్నాడు, రాజులందరూ నేను ధర్మం తప్పానని ఆడిపోయరూ?"

"నేనొక్కడ్నే వాళ్ళందర్నీ చంపేయగలను" భుజాలు ఉప్పొంగిస్తూ చెప్పాడు భీముడు.

"నువ్వు అంతటి వాడవేనోయి తమ్ముడూ! కానీ మనం ఒప్పుకున్న ప్రకారం అరణ్యవాసం చేయకపోతే మనకి వాగ్దాన భంగం కాదూ? ఒకసారి ఆలోచించు. ప్రస్తుతానికి ఇది మన సమయం కాదు. పరమేశ్వరుడు మనల్ని రాబోయే దానికి సంఘటితం చేస్తున్నాడని నాకనిపిస్తోంది. అంచేత ఆయన మీద భారం వేసి చూద్దాం."

"ఆ పరమేశ్వరుడి మీద భారం వేసే బదులు ఆయన్నే ఈ కష్టాలన్నింటినీ తొలిగించమని అడగొచ్చుకదా? మీరడిగితే కృష్ణుడు ఆ మాత్రం సహాయం చేయడా?" చురుగ్గా అంది ద్రౌపది.

"చూడు ద్రౌపదీ, మనస్ఫూర్తిగా అడిగితే కృష్ణుడు రాజ్యమే కాదు, భూమండలం అంతా ఇస్తాడు. ఈ పర్వతాలూ, అరణ్యాలూ చూడు, భగవంతుడు సృష్టించిన వీటిని చూసి నేను ఆనందించగలనే తప్ప పరమేశ్వరా ఇది నాకు ఇయ్యి, ఇది నువ్వు తీసుకో, అని నేను ఆయనతో బేరం చేయలేను. అలాంటివి నన్ను అడక్కండి. ఆయనిచ్చిన వాటితో సంతృప్తిగా ఉండడమే నేను చేయగలిగేది. నేను చేసేది తప్పు అయితే ఈ పాటికి ఆయనే చెప్పి ఉండేవాడు కదా?" ఇంక ఇక్కడితో ఆపుదాము అన్నట్టు యుధిష్ఠురుడు చెయ్యెత్తి చూపించాడు.

ద్రౌపది మారు మాట్లాడకుండా కుటీరంలోకి నడిచింది. భీముడు వేరే పనిమీద అడవిలోకి బయల్దేరాడు.

●●●

పోయే దారిలో కోపంగా అరుస్తూ, జంతువుల్ని భయపెడుతూ నడక సాగిస్తున్నాడు భీముడు. చేతిలో ఉన్న ఖడ్గం రాత్రి నుంచి ఉన్నకోపాన్ని దాచలేకపోతోంది. "ధర్మం," అహహ అనుకుంటూ భీకరారణ్యంలోకి నడుస్తున్నాడు.

పోగా పోగా చంటిపిల్ల ఏడుపులాంటిది వినిపించింది. ఆగి చెవులు రిక్కించేడు. దగ్గిర్లోనే ఉన్న గుహలోంచి వస్తున్నట్టుందే? కాలులో కాలు వేసి నడుస్తూ ఖడ్గం పట్టుకుని ముందుకు నడిచేడు. ఒక్కసారి బుస్సుమనే శబ్దం. వెంటనే మహాపర్వతం తనపైన పడినట్టూ అల్లల్లాడిపోయాడు. విసుర్లో చేతిలో కత్తి దూరంగా పడింది. ఒక్కసారి వళ్ళు విదుల్చుకుని లేవబోయాడు. విచిత్రంగా చేతులు కదలడం ఆగిపోయాయి.

"ఎవరది నేనెవర్ననుకుంటున్నారు? వేల ఏనుగుల బలం ఉన్న భీమసేనుడ్ని. ప్రాణాల మీద ఆశ ఉంటే ఎదురుగా వచ్చి యుద్ధం సాగించు." అరిచాడు.

"అబ్బాయీ, నీ మటుక్కి నువ్వే నా గుహలో అడుగుపెట్టావు. నువ్వు ఈ రోజుకి ఆహారం. నీకు ఓపిక ఉంటే నా పట్టులోంచి బయటపడు. ఉత్తి ప్రగల్భాలు దేనికి?" అని ఒక మానవ కంఠం వినపడింది.

"ఎవరు నువ్వు?"

"నేను ఇక్కడ గుహలో ఉండే కొండచిలువని."

కొంతసేపు గింజుకునేసరికి భీముడికి తెలిసింది, తనని పట్టుకున్నది సాధారణమైన కొండచిలువకాదు. ప్రయత్నం మానేసి గట్టిగా అరవడం మొదలు పెట్టాడు.

****

భోజన సమయానికి అడవిలోకి వెళ్ళిన భీముడు ఇంకా రాలేదేమని యుధిష్ఠురుడు ఆదుర్దాగా ఉన్నాడు. రెండు ఘడియల క్రితం భీముడు కోపంగా అడవిలోకి వెళ్ళడం తానెరుగును. ఏదైనా ఆపదలో పడలేదు కదా? అసలే వాడికి దూకుడెక్కువ. ఆలోచిస్తున్నాడు ధర్మ తనయుడు. కుటీరంలోపల కెళ్ళేసరికి నకులుడూ, సహదేవుడూ, ద్రౌపదీ కూడా కొంచం ఆదుర్దాగా ఉన్నట్లూ తెలిసింది.

"భీముడింకా రాలేదేం?" అడిగాడు.

"ఈ పాటికి వచ్చుండాలి మరి" ద్రౌపది అంది. ఇంతలో భీముడు పెడుతున్న అరుపులు లీలగా వినిపించాయి. అనుమానంగా చెవులు రిక్కించారు. ఒకసారి అనుమానం దృఢపడ్డాక ధర్మరాజు విల్లంబులూ, కత్తి చేతిలోకి తీసుకుని చెప్పాడు నకులుడితో "నేను భీముడ్ని చూడడానికి వెళ్తున్నాను. నువ్వు జాగ్రత్తగా ఉండు. ద్రౌపదిని, సహదేవుడ్ని నీ ఆధీనంలో ఉంచి వెళ్తున్నాను. అతిథులెవరైనా వస్తే సత్కరించడం మర్చిపోవద్దు."

"సరే" చెప్పాడు నకులుడు.

ధర్మరాజు గడపదాటుతూంటే, సహదేవుడూ, ద్రౌపదీ "ఈయనా భీముడ్ని రక్షించేది?" అనుకుంటూ కిసుక్కున నవ్వడం యుధిష్ఠిరుడికి వినిపించింది. నకులుడు మాత్రం మౌనంగానే ఉన్నాడు. దాన్ని పట్టించుకోకుండా ముందుకు నడిచాడు ధర్మనందనుడు.

●●●

భీముడు పెడుతున్న కేకల్ని అనుసరించుకుంటూ పోయి ధర్మరాజు కొండచిలువ ఉండే గుహని సులభంగానే చేరుకోగలిగాడు.

కత్తితీసి లోపలికి వెళ్ళగానే వికట్టహాసం వినపడింది. ఎదురుగా మొహంలో జీవకళ లేని భీముడూ, భీముడ్ని అనేక చుట్లు చుట్టుకుని ఉన్న కొండచిలువా కనిపించాయి. వెంటనే ఒక మానవ కంఠం వినబడింది.

"చూడబోతే అర్భకుడిలా ఉన్నావు. వెయ్యి ఏనుగుల బలం ఉన్న భీముడ్ని పట్టుకున్న కొండచిలువని నువ్వుటయ్యా విడిపించేది?"

ఒక్క క్షణంలో ధర్మరాజుకి విషయం అవగతం అయ్యింది. "అజగరమా, నీకు ఆహారం కావలిస్తే రోజూ నేను తెచ్చిపెట్టగలను. అదీ కూడదంటే నన్ను తీసుకుని నా తమ్ముడ్ని విడిచిపెట్టి, నీకు కావాల్సింది కోరుకో" అన్నాడు.

"నాకు కావాల్సింది ఆహారం కాదు. నా ధర్మ సందేహాలకి సమాధానం చెప్పగలిగితే నీ తమ్ముడ్ని వదులుతాను. లేకపోతే ఇతడే నాకు ఆహారం.

"ధర్మ విషయంలో మహామహులే ఒకొక్కప్పుడు తప్పు బడటం జరుగుతూ ఉంటుంది. ధర్మ నిర్ణయం అనేది నా బోటి వాళ్ళకి కత్తిమీది సాములాంటిది. అయినా తమ్ముడ్ని విడిపించుకోవడానికి నాకు చేతనైనంతలో మీకు సమాధానం చెప్పగలను. మీ ప్రశ్నలు సంధించండి."

"బ్రాహ్మణుడంటే ఎవరు?"

"శుద్ధ మనస్సు, క్షమా, దయా, దాతృత్వం, ఇటువంటి గుణాలున్నవాడే బ్రాహ్మణుడని శాస్త్రాలు చెబుతున్నాయి."

"అయితే ఇటువంటి గుణాలు ఉన్నవారు మిగతా వర్ణాలలో కూడా ఉన్నారుగా?"

"తప్పకుండా. జన్మ మూలాన ఏ వర్ణంలో పుట్టినా ఇటువంటి గుణాలున్నవారిని బ్రాహ్మణులనే చెప్పవచ్చు. ఏ వర్ణంలో పుట్టినా ఇటువంటి గుణాలు నేర్చుకోవచ్చు. అదే భగవంతుడు మానవ జన్మకిచ్చిన వరం."

"సరే అయితే, ప్రపంచంలో అనేకానేక మంది జ్ఞానం కోసం ప్రాకులాడుతున్నారు. ఈ జ్ఞానాకి గీటురాయి ఏమిటి?"

"బ్రహ్మతత్త్వం తెలుసుకుని జన్మ రాహిత్యం చేసుకోవడమే జ్ఞానానికి గీటురాయి."

ఇలా నడిచిన ప్రశ్నోత్తరాలతో కొంతసేపు గడిచేక ఒక్క మెరుపు మెరిసినట్టైంది గుహలో. భీముడు ఆశ్చర్యంగా చూసాడు చుట్టూ. తనని ఇప్పటిదాకా చుట్టుకున్న కొండ చిలువలేదు. ధగధగా మెరుస్తున్న తేజస్సుతో ఒక మహాపురుషుడు నిలబడి ఉన్నాడు. పక్కనే నవ్వుతూ అన్న యుధిష్ఠిరుడు.

"మీరెవరో సెలవీయండి" అడిగాడు యుధిష్ఠిరుడు మహాపురుషుడ్ని ఉద్దేశించి.

"నా పేరు నహుషుడు. నేను నూరు అశ్వమేధాలు చేసి గర్వం మూలంగా అగస్త్యముని శాపం వల్ల ఇలా కొండచిలువగా పడి ఉన్నాను. ఈ రోజు నువ్వు ఇచ్చిన సమాధానం వల్ల నా శాపం పూర్తైపోయింది" నహుషుడు చెప్పాడు. "ధర్మజా నువ్వు నాకు చేసిన సహాయం మరువలేనిది. మీకు శుభం కలుగుగాక."

●●●

యుధిష్ఠురుడు, భీముడూ ముందుకు నడిచారు. ముందుగా ధర్మరాజు నడుస్తూంటే, వెనకే భీముడు. మొహం కొంచెం పాలిపోయి ఉంది. పాము చుట్టబెడితే, పక్కటెముకలూ, ఊపిరి తిత్తులూ నలిగిపోయి మరుక్షణంలో చావవల్సిందే భీముడు కనక తట్టుకున్నాడు. కొంత దూరం నడిచాక యుధిష్ఠురిడికి వెక్కిళ్ళు వినపడ్డాయి. ఆగి వెనక్కి చూసాడు.

భీముడు కూలబడిపోయి ఏడుస్తున్నాడు. దగ్గిరకెళ్ళి అనునయంగా మీద చెయ్యి వేసి అడిగాడు యుధిష్ఠురుడు, "ఏమి నాయనా, ఒళ్ళు బాగా నెప్పెడుతోందా? కుటీరంలోకి వెళ్ళగానే వేడి నీళ్ళతో స్నానం చేద్దువుగాని. కాదంటే ఇక్కడే నేను నీకు ఒళ్ళు పట్టగలను."

ఈ మాటలతో అప్పటిదాకా ఓర్చుకున్న భీముడికి ఈ అనునయంతో ప్రవాహం కట్టు తెగినట్టైంది. వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టాడు. ధర్మరాజు ఆపడానికి అడ్డుకోలేదు. ఆ ప్రవాహం బయటకి పోవడమే మేలు కాసేపటికి తేరుకుని అన్నాడు భీముడు. "ఇంత బలం ఉండీ ఆఖరికి నేను ఒక పాము చేతిలో ఏమీ చేతకాని వాణ్ణయ్యాను అన్నా. మీరు వచ్చి విడిపించవలసి వచ్చింది. నేను రాబోయే యుద్ధంలో ఏమి చేయగలను? నా ఒంటినెప్పులకంటే, మనస్సే ఎక్కువ బాధిస్తోంది, ఇలా ఐనందుకు."

ధర్మరాజు కంగారుగా అన్నాడు. "ఇందులో నీ భుజబలం ప్రసక్తి లేదు. నిన్ను పట్టుకున్నది సాధారణమైన పాము కాదు నాయనా. నూరు అశ్వమేధాలు చేసి శాపం పొందిన నహుషుడు. ఇంద్రపదవికి దేవతలు కోరి ఎంపిక చేసుకున్న రారాజు ఆయన. ఆయన ధర్మంతో సంపాదించుకున్న బలం ముందు నువ్వూ నేనూ ఏ పాటి? అందుచేత అటువంటి ఆలోచనలు పెట్టుకోకు."

భీముడింకా ఇలా అన్నాడు, "ఇంటికెళ్ళాక ఇప్పుడు నన్ను ద్రౌపది చేతకాని వాడికింద జమకట్టదూ?"

మందహాసం చేసాడు ధర్మరాజు "ఈశ్వరానుగ్రహంతో ద్రౌపది సాక్షాత్తూ యజ్ఞ గుండంలోంచి పుట్టినది అని మర్చిపోతున్నావా? అటువంటి ద్రౌపది అలాంటి చిన్న చిన్న ఆలోచన్లు చేయదనే నా నమ్మకం."

కాసేపటికి తేరుకుని భీముడు అడిగాడు, "అన్నా ఒక్క ప్రశ్న. మీరు నహుషుల వారితో మాట్లాడుతున్నప్పుడు, నేను విన్నదాని ప్రకారం, ఇదీ ధర్మం అని చెప్పడం కష్టం. అందుకంటే అనేకానేకులు రకరకాలుగా చెప్తూ ఉంటారు. మీ ప్రకారం ధర్మం అంటే ఒక మాటలో చెప్పగలరా?"

యుధిష్ఠురుడు చెప్పేడు స్థిరంగా, "ప్రపంచం, ముల్లోకాలూ నీకు ఎదురు తిరిగినప్పుడు నీవు దేన్నైతే పట్టుకుని నీ కాళ్ళమీద నుంచో గలవో అదే ధర్మం. ధర్మో రక్షితి రక్షితః. ప్రపంచం అంతా నిన్ను వదిలేసిన నువ్వు ధర్మాన్ని ఆచరించినట్టైతే అదే నిన్ను కాపాడుతుంది. మనల్ని ఎల్లవేళలా కాపాడేది మనం చేసుకున్న పుణ్యం, మనం ఆచరించే ధర్మమే కానీ భుజబలం కాదు."

కుటీరంలోకి వచ్చక భోజనం చేస్తూంటే భీముడే అందరికీ చెప్పాడు యుధిష్ఠురుడు తనని ఎలా కొండచిలువ బారి నుంచి రక్షించినదీ. ద్రౌపదీ, సహదేవుడూ ధర్మరాజు బయల్దేరుతున్నప్పుడు నవ్వినందుకు నొచ్చుకుని తలదించుకున్నారు. నకులుడు మాత్రం మందహాసం చేసాడు.

భీముడడిగేడు, "నకులా ఎందుకలా నవ్వుతావు? నేను చేతకాని వాణ్ణయ్యాననేనా?"

"కాదు అన్న, పెద్దన్న నిన్ను రక్షించడానికి వెళ్తూంటే ద్రౌపదీ, తమ్ముడు నవ్వేరు 'ఈయనా భీముణ్ని రక్షించేదీ' అంటూ. ఆయన ఆచరించే ధర్మం మూలానే మన మనుగడ ఆధారపడి ఉంది అని అర్థమైంది. ఇప్పుడు నేను నవ్వినది ద్రౌపదీ, సహదేవుడు నవ్వినందుకు, నిన్ను చూసి కాదు." నకులుడు చెప్పాడు.

కాసేపు మౌనంగా ఉన్నాక ద్రౌపది అడిగింది యుధిష్ఠిరిడిని, "భీముడి కోసం నకులుణ్నో, సహదేవుణ్నో పంపక మీరె ఎందుకు వెళ్ళారు అడవిలోకి?"

"ఎప్పుడైనా తమ్ముడ్ని కాపాడుకునే బాధ్యత అన్నదే కదా? అదే ధర్మం కూడాను. ధర్మం అనేది మాటల్లో కాదు చేతల్లోనే చూపించాలి." యుధిష్ఠిరుడు చెప్పాడు.

***(పాండవులు అరణ్యావాసంలో నివసించిన అడవుల్లో కామ్యక వనం ఒకటి. ఈ కథలో అడవి పేరు తప్పు అనిపిస్తే, తప్పు కావచ్చు, కానీ కథకి ప్రేరణ అది కాదు. పాఠకులు గ్రహించి నాపై నిప్పులు విసరవద్దని మనవి. ధన్యవాదములు)***

# కాదేదీ బిజినెస్ కనర్హం

## తాడికొండ కె.శివకుమార శర్మ

**నేను బిజినెస్** మేన్‌ని కావాలన్న మా ఆవిడ కోరిక నేను రిటరయిన తరువాత మాత్రమయితేనేం, తీరబోతోంది.

అప్పటిదాకా పండుగలకి మాత్రం – ముఖ్యంగా జనవరి ఒకటోతారీకున – గుళ్లో అడుగుపెట్టే ఆవిడ భక్తి ఇంట్లో ఎప్పటినించోవున్న దేవుడి విగ్రహాలకీ, ఫొటోలకీ రోజూ పూజలుచేసేదాకా ఎదిగిపోయింది. "పిల్లలు ఎదుగుతున్నప్పుడు వాళ్లపనులతోనే సరిపోయేది రోజంతా. ఇప్పుడు తీరిక దొరికింది, అంతే!" అని నేను ఏమీ అనకుండానే సమర్థించుకునేదాకా వచ్చింది. పిల్లల్లో ఆఖరివాడు కాలేజీ చదువుకని బయటికి వెళ్లిన పదేళ్ల తరువాత ప్రత్యేకంగా ఇప్పుడు తీరికదొరకడం నాకేగాక మీక్కూడా ఆశ్చర్యం కలిగించక మానదు. ఆవిడ ఉద్యోగంచెయ్యడంకోసం బయట అడుగుపెట్టినదెప్పుడూ లేదని నేను సవినయంగా మనవిచేసుకుంటాను.

మా పెళ్లయినదగ్గర్నుంచీ ఆమె చిరాకుపడ్డ మా నాన్న దైవభక్తి ఆయనపోయిన పదిసంవత్సరాల తరువాత నయితేనేం ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుని ఆయన ఫొటో మా ఇంట్లో గోడమీద కెక్కడానికి సహాయపడ్డది.

"దేనికయినా సమయం రావాలి!" అన్నాడు విఠల్‌జీ.

విఠల్‌జీమీద ఆవిడకి విపరీతమయిన నమ్మకం. పిల్లాడి ముఖంలో వర్చస్సుంది (నాకన్నా వయసులో పదేళ్లు చిన్నవాళ్లు కుర్రాళ్లుగానూ, ఇరవయ్యేళ్లు తక్కువయితే చిన్నపిల్లలుగానూ, నా వయసులో సగం ఉంటే పసిపిల్లలుగానూ నాకు అనిపిస్తారు). అయితేనేం,

విఠల్‌జీ నా చేతిలో అయిదువేల డాలర్లు పెడుతున్నప్పుడు ఆవిడ మొహమ్మీద అంతకన్న వెలుగొచ్చిందని నేను ప్రమాణంచేసి చెప్పగలను. అమెరికాలో పాదపూజలకి ఆహ్వానాన్నందుకుని విఠల్‌జీ ఒక గృహస్థు ఇంట్లో అడుగుపెట్టాలంటే కనీసం అయిదువేల డాలర్లు ఆ గృహస్థు ఆయనకి సమర్పించుకోవాలి. అలాంటిది, విఠల్‌జీ ఆ మొత్తాన్ని నాకు ఇవ్వడమా! ఆయన నాకు పాదాభివందనంచెయ్యడం మాత్రం గుర్తులేదు శాంతికి – అదే, మా ఆవిడకి. అయినా, విఠల్‌జీ నాకు పాదాభివందనంచేస్తే నాకు ఆయుక్షీణమనిచెప్పి ఆయన చేసివుండడని వాదిస్తుందికూడా!

సత్యంగారింట్లో విఠల్‌జీకి జరిపే పాదపూజకి ఆహ్వానం వస్తే వెళ్లాము శాంతీ, నేనూ. మేం వెళ్లేసరికి సత్యంగారిల్లు భక్తసమూహంతో కిటకిట్లాడిపోతోంది. వాళ్లు నేలమీద కూర్చుని లలితాసహస్రనామాలు చదువుతున్నారు. నాకు అవి నోటికి ఎలానూ వచ్చు గనుక నేనూ గొంతుకలిపాను. ఎంతోకాలంగా అలవాటయిన నామాలతో నోరు తనపని తాను చేస్తుంటే, కళ్లు చుట్టూ పరిశీలించాయి. భక్తులకు సౌకర్యంగా ఉంటుందని లివింగ్‌రూంలో ఒకమూలగా జరిపిన సోఫామీద కూర్చునివున్నారు విఠల్‌జీ. నెరుస్తున్న పొడుగైన శిరోజాలు, బాగాపెరిగి, నెరుస్తున్న గడ్డమూ, కాషాయవస్త్రాలూ, మెళ్లో రుద్రాక్షమాలా – అంతా స్టాండర్డ్ స్వామీజీ గెటప్. అయితే, ఈయన మోడర్న్ స్వామీజీ అనడానికి ఆధారం చేతిలోవున్న సెల్‌ఫోన్. అది ఊరికేనే కూర్చోలేదు, ఆయన మాటలని ఎక్కడికో చేరవేస్తోంది. ఆయన రెండోచెయ్యి గడ్డాన్ని నిమురుతోంది. పాదాలు పూజలు అందుకుంటున్నయ్. కళ్లు చుట్టూ భక్తసమూహాన్ని పరికిస్తున్నయ్. తెలిసిన మొహం కనిపించినప్పుడల్లా, గడ్డాన్ని నిమిరే చెయ్యి గాల్లోకిలేచి వాళ్లని గుర్తుపట్టానని చెబుతోంది. పాదపూజ చేస్తే అంగావధానం ఫ్రీ అన్నట్లుగావుంది ఆయన్ని చూసేవాళ్లకి.

పూజలు అయిన తరువాత పాటలు వచ్చినవాళ్లని పాడమన్నారు. ఓ ఇద్దరు ముగ్గురు పాడిన తరువాత "పాహిమాం శ్రీ రాజరాజేశ్వరీ" అన్న కీర్తనని పాడాను. "స్వామీజీ మీవైపే చూస్తూండిపోయారు మీరు పాడుతున్నప్పుడు," అన్నది శాంతి పాటపూర్తయిన తరువాత నా చెవిలో.

భక్తసమూహంతో కలిసి ప్రసాదభోజనం చేసిన తరువాత "వెళ్లొస్తాం," అని సత్యంగారితో చెప్పి బయలుదేరబోతుంటే, "మీరాగదిలో కెళ్లి రెండునిముషాలు వెయిట్ చెయ్యండి. మీ అదృష్టం. ఇంతమందిలో స్వామివారు మీతో మాట్లాడాలంటున్నారు," అన్నారు సత్యంగారు.

నేనూ, శాంతీ పక్కగదిలోకెళ్లి ఎందుకో అర్థంకాక మొహాలు చూసుకుంటూ అరగంటకిపైగా నిరీక్షించవలసివచ్చింది. చివరకి, ఆయన గదిలోకి అడుగుపెడుతుంటే లేచి నిల్చున్నాం.

"ఆలస్యమయింది, క్షమించాలి!" అంటున్న ఆయన గొంతు నాకు పరిచయమయినదిగానే అనిపించింది. ఆయన గదితలుపు వేస్తుంటే కలిగిన ఆశ్చర్యంకాస్తా ఆయన నా కాళ్లమీదపడేసరికి షాక్‌గా మారిపోయింది.

"మీరు పెట్టిన భిక్ష ఈ జీవితం," అన్నాడాయన. లేచి నిల్చొని, నా చేతిలో డబ్బులుపెడుతూ, "గురుదక్షిణ," అనికూడా కలిపాడు.

పరీక్షగా అతని మొహంలోకి చూసి, "కృష్ణమూర్తీ!" అన్నాను సంభ్రమంగా.

"మీ దయవల్ల మా కుటుంబం ఒక కొలిక్కివచ్చింది. మా అబ్బాయి ఇప్పుడు నా మేనేజర్. మా ఆవిడ ఇప్పుడు నాతోనే ఉంటోంది. అసలు నేను మీదగ్గరకు వచ్చి ఇచ్చుకోవాలి ఈ గురుదక్షిణ. కానీ నా స్కెడ్యూల్ చాలా టైట్‌గా, బిజీగావుంది. నెలరోజుల అమెరికా పర్యటన తరువాత సింగపూర్, ఆ తరువాత మలేషియా వెళ్లాలి. మీరిక్కడికి రావడం నా అదృష్టం. నన్ను కార్లల్లో తిప్పుతున్నవాళ్లని మీ ఇంటికి తీసుకెళ్లమంటే ఎందుకని అడుగుతారని ఆ ధైర్యంచెయ్యలేదు," అన్నాడు కృష్ణమూర్తి.

"అయిదువేలు," అన్నది శాంతి కార్లో ఎక్కగానే డబ్బులెక్కపెట్టి. అంతడబ్బు నాకు అనాయాసంగా ఇచ్చాడంటే అతను ఎంత సంపాదిస్తున్నాడో ఊహించగలను.

"దేనికన్నా దైవానుగ్రహం ఉండాలి," అన్నది శాంతి. కృష్ణమూర్తి – అదే, విఠల్‌జీ – మాత్రం, "రావుగారి అనుగ్రహం" అనడం నాకు బాగా గుర్తు.

"లేకపోతే, అమెరికాలోవుండి తిరిగి ఇండియావెళ్లినవాడు సన్నాసి అవుతాడని ఎవరయినా అనుకుంటారా?" అని జోడించింది.

"సన్నాసి కాదు, సన్యాసి," లాభంలేదని తెలిసినా కరెక్టుచేశాను. కృష్ణమూర్తిభార్య మాత్రం అతణ్ణి సన్నాసనే అన్నది. పిల్లలుకూడా తల్లికి వంతపాడారు. ఐటీ అంటూ అందరూ అమెరికావచ్చి రెండుచేతులా సంపాదిస్తుంటే అతనుమాత్రం బెంచీమీద ఎక్కుతూ, దిగుతూ, ఎక్కినప్పుడు జీతంలేక, దిగినప్పుడు ఇండియా మేనేజర్లు ఆ ఇచ్చేదేదో సరిగా ఇవ్వకపోవడంవల్ల ఆర్థికంగా ఇబ్బందులుపడ్డాడు. తెలిసినవాళ్ల పిల్లలకి బేబీసిటింగ్‌చేస్తూ అతనిభార్య కొద్దిగా సంపాదిస్తుండేది. హైదరాబాద్‌లో ఉన్న మంచి ఉద్యోగాన్ని వదిలేసి ఇక్కడికి వచ్చిన తరువాత, తిరిగివెడదామనే అతని ప్రతిపాదనని అతని భార్యా, పిల్లలూ తోసిపుచ్చారు. మొదట అతనూ, ఆ తరువాత అతని విశేషాలూ నాకు తెలియడానికి కారణం నాకొచ్చిన మంత్రాలు.

అంటే, నేనేదో మంత్రాలతో అతని వివరాలని కనుక్కున్నాననికాదు. ఒకరోజున గుళ్లో అభిషేకం జరుగుతున్నప్పుడు నేనుకూడా గొంతుకలిపి చదవడం, ఆ తరువాత నేను శాంతితో తెలుగులో మాట్లాడ్డం విని, నా దగ్గరకొచ్చి, "నాకు ఆ మంత్రాలు నేర్పుతారా?" అనడిగాడు.

అవి మానాన్న నాకు పెట్టిన భిక్ష. కొడుకు పైకిరావాలి అన్న కోరిక ఆయనకి ఉన్నా, అది వేదాలు నేర్చుకోవడంతో మాత్రమే జరిగేదికాదని ఆయనకి తెలిసినా వాటిని నాకు చిన్నప్పుడే మొదలుపెట్టి నేర్పించారు. హైస్కూల్లో చదువుతున్నప్పుడు మా తెలుగు ఉపాధ్యాయుని ప్రోద్బలంతో ప్రతీ ఏడాదీ రామనామక్షేత్రంలో శ్రీరామనవమినాడు జరిగే పోటీలలో పాల్గొనడానికి భగవద్గీతలోని దాదాపు పద్ధెనిమిది అధ్యాయాలనీ, వాల్మీకి రామాయణంలోని కొన్ని సర్గలనీ కంఠస్థం చేశాను. ఆ పోటీలల్లో మొదటిబహుమతుల నందుకున్నానుకూడా. కృష్ణమూర్తి పరిచయంతో అతని జిజ్ఞాసతో అవన్నీ బయటికి వచ్చాయి. పిల్లలు హైస్కూలు చదువులకొచ్చేసరికి వాళ్లు నా మానాన్న నన్ను వదిలెయ్యడంతో పాతపుస్తకాలని దుమ్ముదులిపి, కొత్తపుస్తకాలని అధ్యయనంచేసీ చాలా విషయాలని తెలుసుకున్నాను, వాటినతనితో చర్చించాను.

అలా అయిదారేళ్లు గడిచిన తరువాత గ్రీన్ కార్డ్ వచ్చినందుకు అతని కుటుంబం సంతోషించింది. పిల్లలు అతన్నెదిరించీ, చదువులని అశ్రద్ధచేస్తూ మెక్డోనాల్డ్స్‌లో ఉద్యోగాలు పెట్టారు – అలా సంపాదించే డబ్బులని వాళ్లకి కావలసివచ్చినట్లు ఖర్చుపెట్టుకోవచ్చని.

రోజుకోసారి మా ఇంటికొచ్చే కృష్ణమూర్తి వారంరోజులపాటు రాకపోవడంతో, అతని ఆరోగ్యం బాగాలేదేమోనని అనుమానించి వాళ్లింటికి ఫోన్‌చేశాను. ఎక్కడికయినా వెళ్లేటట్లయితే నాకు తప్పకుండా చెప్పేవాడు. వాళ్లబ్బాయిగామోసు ఫోన్‌తీశాడు. "హి ఈజ్ నాట్ హియర్," అన్నాడు. ఆపైన కొన్నాళ్లకి, వేరేవాళ్లద్వారా తెలిసింది – అతనుమాత్రం ఇండియా వెళ్లిపోయాడని. తరువాత అతణ్ణి చూడడం ఇదే!

"అతనికి దైవానుగ్రహం ఉన్నది," అన్నది శాంతి. అతను మాయింటికొచ్చినప్పుడు మాయింట్లో జరుగుతున్న కార్యక్రమాన్ని "వేధఘోష" అనేవాళ్లు ఇంకొకళ్లయితే. "ఏమిటో ఈ గోల!" అని విసుక్కున్నది ఈ శాంతే. పైగా, ఇప్పుడంటుందీ, "యాభయ్యేళ్లుగా మీకు చేతకానిది – మీదగ్గర ఇట్టే అయిదేళ్లల్లో నేర్చేసుకున్నాడు, చూడండి – రెండుచేతులా ఎట్లా సంపాదిస్తున్నాడో!" అని.

పాపం, మానాన్నమాత్రం నేను అమెరికా రావడమే దైవానుగ్రహమనుకొన్నారు! రిటయిరయిందాకా ఏ ఒడుదుడుకులూ లేకపోవడమే దైవానుగ్రహమనుకొన్నాను నేను!!

కృష్ణమూర్తికి "అమెరికాస్వాములవా"రని పేరున్నదని మా బావమరిది ప్రసాద్ చెప్పాడు ఇండియానించీ స్కైప్‌లో. ఒకగుళ్లో పూజారి చదువుతున్న మంత్రాల్లోని తప్పులని అక్కడ గడ్డంపెరిగి, మాసినబట్టలతోవున్న ఒకాయన సరిచేసేసరికి చుట్టుపక్కలవున్న భక్తులు ఆశ్చర్యపోయార్ట. ఆయనకి వేరే ఇల్లేదీ లేదని తెలుసుకున్న తరువాత ఒకపూట భోజనం పెడితే చాలు, చక్కగా ప్రవచనంచెప్పే అతని వాగ్ధాటికీ, ఇచ్చే వివరణలకీ ముగ్ధులయ్యారట.

"ఇండియాలో ఏ స్వాములు ఇప్పుడు ఇలా చెబుతున్నారు? వాళ్లకి డబ్బులమీద యావ తప్ప ఇంకేం ఉండదు," అనుకుంటూ ఈయన ప్రవచనాలని వినడానికి ఎగబడ్డార్ట. పేరున్న స్వాములయితే సామాన్యప్రజలకి అందుబాటులో ఎలాగా ఉండరు. ఆయనని అందుబాటులో ఉంచుకున్న వాళ్లకి స్వాముల ప్రవచనాలమీదకాక వాళ్లు సృష్టించగల స్వర్గాలమీదే ఆసక్తి అంతాను! అయితే, వీధి చివర చిన్నగుడిలో మొదలుపెట్టిన ఈ స్వాములవారుకూడా అనతికాలంలోనే ఒక ఎన్నారై చెవినబడి, సింగపూర్ రమ్మనడంతో ఆయన దశ తిరిగిందట. ప్రవచనాలకి పేరుపొందిన విఠల్‌జీ ఉపన్యాసాలని కాకుండా ఆయన పాదాలని మాత్రం కోరిన సత్యంగారిది రాముని చెప్పుల మీద భరతుడి భక్తి అయితే కావచ్చేమోగానీ మంచి మాటలని వినే అవకాశాన్ని ఆయన ఆరోజు వాళ్లింట్లో చేరిన ఎవరికీ లేకుండా చేశారనిపించింది.

"ఆయన కొచ్చినవన్నీ మీరు నేర్పించినవేగా! మీరామాత్రం సంపాదించలేరా?" అన్నది శాంతి.

"నన్ను సన్యాసం పుచ్చుకోమంటావేమిటి, కొంపదీసి?" అన్నాను.

"బిజినెస్ పెట్టు బావా," అన్నాడు ప్రసాద్.

"ఏం బిజినెస్సు?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"సన్యాసులని తయారుచేసేది," అన్నాడు ప్రసాద్.

"ఒరేయ్, నిన్ను మీ ఆవిడ, నన్ను మీ అక్కయ్యా ఎప్పుడో సన్నాసులని చేసేశారు, నా ప్రమేయమేమీ లేకుండా," అన్నాను.

"అదికాదు బావా. ఇప్పుడు చూడు, ప్రతీ ప్రొఫెషన్‌కీ ఒక డిగ్రీయో, సర్టిఫికెటో అవసరం ఉన్నదా, లేదా? వాటి అవసరం లేనిదల్లా అడుక్కోవడానికీ, రాజకీయ నాయకుడవడానికీ, సన్యాసి అవడానికీని. మొదటివాళ్లకి డబ్బులేదు. రెండవ కేటగిరీకి డబ్బు కుప్పలుకుప్పలుగా ఉంటుంది, లేకపోతే ఆ కుప్పల ఆచూకీని, అక్కడికి చేరే మార్గాలనీ ఎలాగోలా పట్టుకొంటారు. కానీ, ఈ సన్యాసులుంటారే, ఎక్కణ్ణుంచొస్తారో తెలియదు. వాళ్లకెంత తెలుసో ఎవరికీ తెలియదు, తెలుసుకోవాలన్న ఆసక్తీ ఎవరికీ ఉండదు. వాళ్లచుట్టూ చేరే భజన బృందం ఎంత పరపతివున్నదయితే ఆ స్వాములకి అంత పేరొస్తుంది. పేరొస్తున్నకొద్దీ చుట్టూ చేరే భజనబృందం ఇంకా పరపతి కలిగినదవుతుంది."

"అదంతా సరే. ఇంతకీ నన్నేం చెయ్యమంటావ్?"

"సన్యాసి ట్రైనింగ్ సెంటర్ పెట్టు," అన్నాడు ప్రసాద్.

"అంటే?" అన్నాను అర్థంకాక.

"అందుకే మిమ్మల్ని సన్నాసి అనేది!" అన్నది శాంతి ప్రేమగా నా మెడచుట్టూ చేతులేస్తూ. తన కళ్లముందు అప్పుడే కనకవర్షం కురవడం మొదలుపెట్టింది. "మీరు కృష్ణమూర్తికి ఏం నేర్పారో అవే ఇంకొంతమందికి నేర్పండి, డబ్బులు తీసుకుని," అన్నది.

"డబ్బులకి ఈ పరిజ్ఞానాన్ని అమ్ముకోమంటావేమిటి?" అన్నాను.

"ఏం, బిల్ క్లింటన్ ఒక గంటసేపు ప్రసంగించడానికి లక్షడాలర్లు తీసుకుంటాట్ట! ఓడిపోయిన ప్రెసిడెన్షియల్ కాండిడేట్లు కూడా కనీసం పాతికవేల డాలర్లు తీసుకుంటార్ట. కాపిటలిస్ట్ దేశంలో నలభయ్యేళ్లకి పైగా వుండి నేర్చుకున్నదిదేనా? అయినా, ఇండియాలో సంగీతమో, నాట్యమో నేర్చుకొచ్చి, అమెరికాలో ఒకపక్క సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు చేస్తూనే రెండోపక్క ఆదాయంకోసం పిల్లలకి వాటిని డబ్బులు తీసుకుని నేర్పుతున్నప్పుడు మీరు సన్నాసులని  తయారుచేస్తే తప్పేమిట్టా?" అన్నది నడుంమీద రెండుచేతులూ పెట్టుకుని నన్ను నిలదీస్తూ. ఆ పోజుకి చేరిందంటే ఇంక తనకి ఓపిక నశించినట్లే.

అయినా శాంతి మాటల్లో నిజంలేకపోలే దనిపించింది. ఆయన నేర్పిన విద్యకూడా డబ్బుగడించడానికి తోడ్పడుతోందంటే – అదికూడా డాలర్లల్లో – మా నాన్నకూడా అడ్డంచెప్పేవారుకాదని నాకు నమ్మకం కలిగింది. పాతకాలంలో రాజులు ఇచ్చిన సంభావనలకీ వీటికీ తేడా ఏమున్నది? అప్పుడు ఆశించారు, ఇప్పుడు ముందే అడిగి తీసుకుంటాను, అంతేగా!

"ఎంత ఛార్జ్ చేస్తావేమిటి?" అన్నాను.

"అయిదువేల దాలర్లు," అన్నది శాంతి పుటుక్కున.

పెద్దగా నవ్వాను. "అయిదువేల డాలర్లు.  రెండున్నరలక్షల రూపాయలు. వీటినాశిస్తోంది భారతదేశంలోని వాళ్లదగ్గర్నుంచీ," అన్నాను.

"అమెరికా స్వామి విఠల్‌జీని చూసిన తరువాత కూడా ఆమాత్రం ఛార్జ్ చెయ్యకపోతే మీకు పవర్ లేదనుకుంటారు. అయిదువేలకి నయాపైసా తగ్గేదిలేదు," అన్నది శాంతి లక్ష్మణరేఖ గీస్తూ.

"బావా! ఇండియా సంగతి నువ్వు మర్చిపోయినట్లున్నావ్.  ఉచితంగా చెబుతానంటే రారు. నామినల్ ఫీజు ఛార్జ్ చేస్తానంటే శ్రద్ధగా వినరు. విపరీతంగా ఛార్జ్‌చేస్తే, సత్తావుండబట్టే నువ్వంత ఛార్జ్ చేస్తున్నావని నమ్మి తోసుకుంటూ వస్తారు. ఇంకొకటి గుర్తుంచుకో.  మనది కర్మభూమి. మంచి జరిగితే మన అదృష్టం.  కాకపోతే ప్రయత్నలోపమేమోనని కూడా ఆలోచించకుండా మనకలా రాసిపెట్టివుందని నమ్ముతాం. అందువల్ల నీకు డబ్బూ ఆ పైన మంచిపేరూ తప్పితే చెడ్డపేరు రావడమనే ప్రశ్నే లేదు. సరిగ్గా చెప్పలేదన్న నింద నీ ఛాయలకికూడా రాదు."

"అంత డబ్బు ఖర్చుపెట్టేవాళ్లు రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్‌గూర్చి ఆలోచించరా? సన్యాసి అయినాగానీ రెండుచేతులా డబ్బు గడించగలరన్న హామీ ఏముంది?" అన్నాను.

"లక్షల్లక్షలు తీసుకున్న సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ సెంటర్లు తరువాత ఉద్యోగాలు వస్తాయ్యని హామీలిస్తున్నారేంటి?  ఇదీ అంతే," అన్నది శాంతి.

"బకరాలెలా వస్తారు?" అస్త్రసన్యాసంచేస్తూ అడిగాను.

"మీ వృత్తిమీద గౌరవం మీరే చూపించకపోతే ఇంకెవరు చూపిస్తారు? వాళ్లని స్టూడెంట్సనో లేక ట్రైనీలనో అనడం మొదలుపెట్టండి." కోప్పడింది శాంతి.

"అడ్వర్టయిజ్‌మెంట్ ఇద్దాం," అన్నాడు ప్రసాద్.

"ఏమని? సన్యాసులని తయారుచేస్తామనా?" అన్నాను వ్యంగ్యంగా.

"యస్. నీ స్టార్ స్టూడెంట్ ఫోటో వేద్దాం. రిజల్ట్స్ గారంటీ అని చెబుదాం."

"నాయనా, ప్రసాదూ! నేను విఠల్‌జీని తయారుచెయ్యలేదు బాబూ. కృష్ణమూర్తికి నాకు తెలిసినవి చెప్పానంతే. అతన్ని సన్యాసిగా మార్చింది వాళ్లింట్లో వాళ్లు. ఆ ఘనత వాళ్లకి దక్కాలి," అన్నాను.

"ఆమాత్రం సహకారం ఇవ్వని కుటుంబమెక్కడో చూపించు! భగవద్గీతలో కృష్ణుడేమన్నాడు? కర్మణ్యేవాధికారస్తే – అనికదా?"

"కృష్ణమూర్తి అయిదారేళ్లు శిష్యరికంచేశాడు," అన్నాను, ఈ ట్రైనింగేదో అంత త్వరగా తెమిలేదికాదని పుల్ల నడ్డంవేస్తూ. ఇప్పుడంతా ఇన్‌స్టెంటేనియస్ గ్రాటిఫికేషన్ కావాలికదా ప్రజలకి! ఏదో ఇంకా పిల్లలని కనడానికి నవమాసాలు మోయాలంటే ఒప్పుకొంటున్నారు. దాన్నికూడా తొందరగా తెమల్చడానికి రీసెర్చ్ చెయ్యమని ప్రజలు నినాదాలు చేసే రోజులు దగ్గరపడుతున్నాయని నా నమ్మకం.

"అప్పుడయితే మీరు ఉద్యోగంచేసేవారుకాబట్టి రోజూ ఒక గంటసేపు పాఠం చెప్పేవారు. ఇప్పుడు రోజంతా ఖాళీయేగా! రోజుకు పదిగంటలు – కాకపోతే పదహారుగంటలు చెప్పండి" ఆజ్ఞాపించింది.

"ఒక సెమెస్టర్ – మహా అయితే ఆర్నెల్ల సిలబస్ పెట్టు," అన్నాడు ప్రసాద్.

"సిలబస్సా?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"అదే బావా. నీకొచ్చిన వేదమంత్రాలతోబాటు భగవద్గీత, రామాయణాల్లోంచి కొన్ని శ్లోకాలూ, భారత, భాగవతాల్లోంచీ, తిరుపతి వెంకటకవుల పాండవోద్యోగవిజయాల్లోంచీ కొన్ని పద్యాలూ చెప్పు – ఉషశ్రీగారి రామాయణం, భారతాల సీడీలని నీకు పంపిస్తాను, అవసరానికుంటయ్. ఇంకా పిట్టకథలూ – అవునూ, నీకవి కొన్నయినా వచ్చా?"

"ఏవో, ఒకటి, రెండు," నసిగాను.

"అలా అయితే లాభంలేదు. ఇక్కడో రీసెర్చ్ వింగుని ఏర్పాటుచేస్తాను. వాళ్లు పాత చందమామలనీ, బొమ్మరిల్లులనీ వెదికి మనకి కావల్సినన్ని అందిస్తారు. " మహా ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు. "నీకు సంగీతజ్ఞానంకూడా ఉన్నది గనుక భజన్లనీ, రామదాసు, అన్నమాచార్య కీర్తనలనీ కూడా సిలబస్‌లోపెట్టు," అన్నాడు.

"సరే! ఓ పర్ణశాలని రెంట్‌చెయ్యి, హైదరాబాద్ అవుట్‌స్కర్ట్‌స్‌లో," అన్నాను, ఇక్కడ భరించలేని చలికాలాన్ని ఆ మిషతోనైనా తప్పించుకోవచ్చుగదా అని ఆశిస్తూ.

"మీ మొహం! ట్రైనింగ్ అమెరికాలో అయితే ఎవరయినా వస్తారుగానీ ఇండియాలో అంటే మీ మొహాన్ని చూడడానికి కూడా ఎవరూ రారు," అన్నది శాంతి చిరాకుపడి.

"అయిదువేలడాలర్లు నాకు చదివించుకునీ, ప్రయాణానికీ,ఇక్కడ ఆర్నెల్లు గడపడానికీ అయ్యే ఖర్చుల్ని భరిస్తూ – ఎవడొస్తాడు? అలా దాదాపు అయిదులక్షలు తగలబోసి ఎవడయినా వస్తానన్నా నేను రానివ్వను. సాఫ్ట్‌వేర్‌కి అంత ఖర్చుపెడితే కొంతైనా వస్తుందన్న నమ్మకముంది. దీనికి అలాంటి గారంటీ ఏమీ లేదు," అన్నాను.

"నీకు గారంటీ కావాలా? నా ఖర్మ. రిక్రూట్స్‌కి వెయ్యాల్సిన ఎరని నీకు చూపాల్సొస్తోంది. సరే, విను. వాళ్లు అమెరికానించీ వచ్చిన తరువాత రెండుమూడు గుళ్లల్లో ఉపన్యాసాలని అరేంజ్ చేస్తానిక్కడ. ఇంకా ఎక్కువ డబ్బులిచ్చినవాళ్లకి చిక్కడపల్లిలో త్యాగరాయగానసభలోనూ, రవీంద్రభారతిలోనూ మీటింగులని అరేంజ్‌చేస్తాను. పరపతివున్న మనుషులొచ్చేలా చూస్తాను."

"నీకు అంత పరపతి ఉన్నదా?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"అబ్బ, బావా! టీవీల్లో సీరియళ్లు రావడం మొదలయిన తరువాత ట్రైనింగ్ పొందినవాళ్లూ లేనివాళ్లూకూడా నటీనటులమంటూ కోకొల్లలు తయారయ్యారు. కొందరు గెస్ట్ అప్పియరెన్సుల నిచ్చినవాళ్లని టీవీలో మొహం కనపడేలా చేస్తామనిచెప్పి పట్టుకొస్తాం. వీళ్లని

అప్పటికే టీవీల్లో చూసిన ప్రజలు ఇట్టే గుర్తుపట్టేస్తారు. మరీ కాకపోతే ఓ అయిదారుమందికి ఖద్దరు డ్రెస్సులని తొడిగించి, ఆడవాళ్లయితే పట్టు చీరెలని కట్టించి, ఇంకొంతమందికి సూట్లూ బూట్లని కట్టబెట్టి, అద్దెకార్లల్లో ఆడిటోరియంముందు దింపి దానికి టీవీ కవరేజ్‌ని జోడిస్తే పరపతి దానంతట అదే పరిగెత్తుకుంటూ వస్తుంది. అయితే, టీవీ కవరేజ్‌కి కొంచెం ఖర్చవుతుంది."

"అందరినీ అమెరికా స్వాములక్రింద జమకట్టేస్తే రెండుమూడు సెమెస్టర్లయేసరికి వాళ్లల్లోనే కాంపిటీషన్ మొదలై మనకి ప్రాబ్లం వస్తుందేమో!" అన్నాను. ప్రతీ సమస్యనీ అన్ని కోణాలనించీ పరిశీలించాలనే దుగ్ధ నాది.

"పేరే గదా! వర్జీనియా స్వామి అనీ, కాలిఫోర్నియా స్వామి అనీ, న్యూయార్క్ స్వామి అనీ – పేర్లెన్నో పెట్టచ్చుగానీ నువ్వు రిక్రూటింగ్ మొదలుపెట్టరా!" శాంతి తమ్ముడికి ఆజ్ఞని జారీ చేసింది.

మొత్తానికి మా ఆవిడ కోరికతీరి నేను బిజినెస్‌మేన్‌ని కాబోతున్నాను. "డబ్బు సంపాదిస్తున్నానని అయినా నాకు కొంచెం రెస్పెక్ట్ ఇవ్వచ్చు గదే," అంటే "ఇండియాలో ప్రతీ మగవెధవా సంపాదిస్తున్నాడు," అని ఇప్పటిదాకా నన్ను తీసిపారేసిన ఆవిడ దృష్టిలో గౌరవాన్ని సంపాదించుకోబోతున్నాను!

ఈ బిజినెస్‌కి పోటీ రావచ్చు. చైనాకి అవుట్‌సోర్సింగులు జరిపించి చవగ్గా చెప్పించడానికి ఇంకెవరయినా ముందుకు రావచ్చు. 'ముప్పైరోజుల్లో సన్యాసి కావడం ఎలా?' అన్న పుస్తకాలు అచ్చులో రావచ్చు. ఇంట్లో కూర్చునే ఇంటర్నెట్లోంచి డవున్లోడ్ చేసుకుని చదువుకునేలా కర్రికులాలని తయారుచెయ్యవచ్చు. ఎవరిదాకానో ఎందుకు, ఆ పుస్తకాలని నేనే రాయవచ్చు, ఆ ఇంటర్నెట్ కోర్సులని నేనే డెవలప్ చెయ్యవచ్చు! ఉదరనిమిత్తం వేసే వేషాల్లో “స్వామీజీ” అనే వేషం కూడా ఒకటయినప్పుడు వాళ్లకి కావలసిన ఆహార్యాన్ని సరిగ్గా సమకూరేలా చెయ్యడానికి తోడ్పడడంలో తప్పేముంది?

కర్మభూమిలో డాక్టర్లకీ యాక్టర్లకీలాగే సన్యాసులకీ ఎప్పుడూ గిరాకీ ఉంటుంది. వాళ్లకి ఉద్యోగం ఊడడం అనే సమస్యే రాదు. పైగా, అమెరికాలో సైకియాట్రిస్టులకన్నా ఇండియాలో స్వామీజీలకి ఎక్కువ ఉంటుంది గిరాకీ. "స్వామీజీ" అనేది సమాజానికి కావలసిన ప్రొఫెషన్ అని ప్రజలు ఆమోదించినప్పుడు ఎంతమంది కావాలి అన్న ప్రశ్నకి లా ఆఫ్ డిమాండ్ అండ్ సప్లై కాలక్రమాన జవాబిస్తుంది.

ఏది ఏమైనా గానీ, స్వామీజీలని ప్రొఫెషనల్‌గా తయారుచెయ్యడానికి ఒక ప్రొఫెషన్ని క్రియేట్‌చేసి, ఎంతోమందికి జీవనోపాధి కలిగించబోతున్నందుకు నాకు ఆనందంగా ఉన్నది.

# నిత్యసుమంగళి

## ఓలేటి సత్యనారాయణ రావు

( ఈ కథ నా కాలేజ్ రోజుల్లో, ఎమర్జెన్సీ టైం లో వ్రాసాను. అన్ని పత్రికలూ "హాట్ పొటేటో" లాగా వెనక్కి పంపాయి. ఒక ఎడిటర్ " కథ బాగుంది కానీ ప్రస్తుతం వేసుకోలేం" అని నోట్ పెట్టాడు. ఒక మిత్రుడు "రా.వి. శాస్త్రి లాగా కటకటాలు లెక్క పెట్టాలని ఉందా?" అని అడిగాడు, కథ చదివాకా. మొన్న త్రవ్వకాల్లో దాదాపు మూడు దశాబ్దాల తరవాత, ఇది బయటపడింది. ఎలాంటి మార్పులూ చెయ్యకుండా యథాతథంగా అలాగే ప్రెజెంట్ చేస్తున్నాను. అప్పట్లో కలర్ టీ.వీలే చాలా అరుదు, ఇక రిమోట్ లు ఇప్పటి టెక్నాలజీ రాసుకుంటూ, మార్పులు చేసుకుంటూ పోతే, 'ఫ్లేవర్ ' పోతుందేమోననిపించింది.---- ***రచయిత***)

రామ రావణ యుద్ధం ముగిసింది.

రామలక్ష్మణులు, ఆంజనేయుడు, సుగ్రీవుడు యుద్ధం లో తమ వ్యూహాల్ని విపులీకరిస్తున్నారు.

ఇంద్రుడు విలాసంగా రంగుల దూరదర్శినిలో రావణ సంహారం తదుపరి అన్ని లోకాలలో జరుగుతున్న సంబరాలూ, వేడుకలూ చూస్తున్నాడు.

వెలుగు నీడల్ని కొంచెం చేసి సింహాసనంలో వెనక్కి వాలాడు. అమృతం సేవిస్తూ, సాలోచనగా కుంభకర్ణుణ్ణి ఎలా హతమార్చేరో వివరిస్తున్న ఆంజనేయుణ్ణి చూశాడు.

ఇంతలో " స రి గ మ" వరసలో శ్రావ్యంగా మోగింది ఎర్ర దూరవాణి. తేలు కుట్టినట్టు సింహాసనం లోంచి అడుగు దూరం ఎగిరిపడ్డాడు ఇంద్రుడు. గుండె గుభేలుమంది,ఈ ఎర్ర దూరవాణి ఎప్పుడో కానీ మ్రోగదు. మోగిందీ అంటే ఏదో పెద్ద ఉపద్రవం ముంచుకొచ్చిందన్న మాటే. అది ప్రధాన దేవత "హాట్ లైన్".

శచీ దేవి కూడా భయంగా చూస్తోంది భర్త వైపు.

వణుకుతున్న చేత్తో రిసీవర్ తీసాడు ఇంద్రుడు.

"తమరి దాసానుదాసుడు, విధేయుడు, సేవకుడు అయిన ఇంద్రుడికి ఏమి ఆజ్ఞ, అమ్మా?" అన్నాడు వినయంగా.

"ఊఁ, రామరావణ యుద్ధం చూసావా?' అని అడిగింది అవతలి కంఠం గంభీరంగా. పట్టలేనంత కోపం వచ్చినప్పుడు మాత్రమే ప్రధాన దేవత గొంతులో అంత గంభీరత చోటు చేసుకుంటుంది.

ఇంద్రుడి గుండె బెజారెత్తి పోయింది.

"చిత్తం, నాకే కాదు, అన్ని లోకాల్లో ప్రజలకీ, తమరు ఎంతో దయతో అనుగ్రహించిన పరికరాల వల్ల, రామరావణ యుద్ధం తిలకించే మహద్భాగ్యం కలిగింది. ఇలాగే మీ కటాక్షవీక్షణాలు మాపై ఎప్పుడూ ప్రసరిస్తే అంతకంటే మాకు కావల్సిందేమీ లేదు, అమ్మా, మీకు కృతజ్ఞత ఎలాగ చెప్పుకోవాలో తెలియని మందమతులం తల్లీ..........." అని స్తోత్ర పాఠం పది నిమిషాలు వల్లించాడు.

ప్రధాన దేవత గొంతు గంభీరంగానే ఉన్నప్పటికీ, కొంచం ప్రసన్నత చోటు చేసుకుంది.

"చూడు,ఇంద్రా, నేను మొదట్నుంచీ హెచ్చరిస్తూనే ఉన్నాను. ఎవడో భక్తుడు నాలుగు స్తోత్రాలు చదివి, పొగిడేసరికి కరిగిపోయి, మీ దేవతలు, అధికారులు, అనధికారులూ కళ్లు మూసుకుని వరాలు ఇచ్చేయడం, మనల్ని అందర్నీ ఇరకాటంలో పెట్టెయ్యడం పరిపాటైపోయింది........."

"........................... ఈ దాసానుదాసుణ్ణి మన్నించండి, అమ్మా, మీ అక్షరలక్షలు విలువ చేసే మాటలకి అడ్డు వస్తున్నందుకు. మీరు క్రితం సారి హెచ్చరించినప్పుడే అందరికీ ఉల్లంఘిస్తే శిక్షలు తీవ్రంగా ఉంటాయని చెప్పడమే కాదు, చీడ పురుల్ని ఏరేసి, అధోలోకాలకి, పాతాళ లోకాలకి పంపేసాను" అన్నాడు వినయ విధేయలతో.

"ఇంద్రా" అని గర్జించింది ప్రధాన దేవత.

ఇంద్రుడి నోటికి మూత పడింది.

"నేను గమనిస్తున్నాను, పనిలో నీ చురుకుదనం తగ్గి పోయింది. నీ క్రింది దేవతలు ఎడా పెడా వరాలిచ్చేస్తున్నారు నాలుగు చేతుల్తో, రాబోయే పరిణామాల గురించి ఆలోచన లేకుండా. ఇప్పుడు వాళ్ళ నిర్లక్ష్యం వల్ల నువ్వు నీ పదవినే పోగొట్టుకోవచ్చు." అంది ప్రధాన దేవత కఠినంగా.

ఇంద్రుడి గుండెలో రాయి పడింది. ఏదేదో చెప్పాలనుకున్నాడు.

"అమ్మా" అని మాత్రమే, ఆవేదన, బాధ, ఆశ్చర్యం మేళవించి, అనగలిగాడు.

"నాకు ఇప్పుడే మండోదరి నుంచి అభ్యర్ధన అందింది. తను నిత్య సుమంగళి గా ఉండేటట్టు వరం పొందినట్లు చెప్పి, భోరుమని ఏడిచింది. ఇదేనా మీ పాలనలో న్యాయం అని చాలా దురుసుగా మాట్లాడింది. ఆ వరం ఇచ్చిన మూర్ఖుణ్ణి శిక్షిస్తేనే సరిపోదు. మండోదరికి ఇచ్చిన వరం అమలు జరిగేలా చూడాలి. ఆ బాధ్యత నీది. చెయ్యలేకపోయినా, చెయ్యకపోయినా, ఇంద్ర పదవికి రాజీనామా పంపించు. పాతాళ లోకానికి రాజ్య పాలుడిగా వెళ్ళడానికి సిద్ధంగా ఉండు" అంది ప్రధాన దేవత.

ఇంద్రుడికి దుఃఖం, కోపం అన్నీ ముంచుకొచ్చాయి.

"అమ్మా, మిమల్ని ఇన్ని యుగాలుగా భక్తి, శ్రద్ధలతో సేవించుకుంటున్నాను. ఈ దాసుణ్ణి కరుణించండి. రావణాసురుడు మరణించి చాలా సేపైంది. నాకు ఈ విషయం కొంచం ముందే తెలిసుంటే, రాములవార్ని బ్రతిమాలుకునేవాడిని, సమ్మోహనాస్త్రం వేసి రావణుణ్ణి "కోమ" లో ఎల్లకాలం ఉండేలా చేయ్యమని. ఇప్పూడెలాగ, తల్లీ, తమరే రక్షించాలి, అన్యధ్యా శరణం నాస్తి......" అని మళ్ళీ పదిహేను నిముషాలు స్తోత్రం చదివాడు.

ప్రధాన దేవత కొంచం శాంతించింది.

"ఒక్కటే మార్గం ఉంది. అత్యవసర సమావేశం పెట్టు. అన్ని శాఖల దేవతలూ, వారి అనుచరులూ, వాహన చోదకులూ సౌధాలు శుభ్రం చేసే చేవకులూ అందరూ వచ్చి తీరాలని ఆజ్ఞాపించు. అంత మందిలో నీ పదవి కాపాడే అద్భుతమైన ఆలోచన ఎవడో ఒకడికి వచ్చే అవకాశం లేకపోలేదు." అంది.

"ఒక వేళ రాకపోతే, అమ్మ?" అని అడిగాడు, ప్రాణాలు అరచేతిలో పట్టుకుని.

నిముషం పాటు నిశ్శబ్దం రాజ్యమేలింది.

"చెప్పటం మరిచిపోయాను, ఇంద్రా, భూలోకంలో ఒక పుణ్యాత్ముడు నీ పదవి గురించి ఘోరమైన తపస్సు చేస్తున్నాడు కదా, నువ్వు పంపిన సంగీతం, రంభోర్వశీ మేనక తిలోత్తమలే కాకుండా, భూలోకంలో నాట్యకత్తెలూ, లంచాలూ ఏవీ అతన్ని కదిలించ లేక పోయాయి. నీ రాజీనామా పత్రంతో బాటు పేర్లు ప్రతిపాదిస్తూ ఇంకో పత్రం కూడా పంపించు" అని దూరవాణిని పెట్టేసింది ప్రధాన దేవత. ఇంద్రుడికి కళ్ళు బైర్లు కమ్మినట్టనిపించింది. అతనికి స్పృహ వచ్చే సరికి శచీదేవి గబగబా దూరవాణిలో ఎవరితోనో మాట్లాడుతోంది. ఇంద్రుడు నీరసంగా దూరదర్శిని వైపు చూసాడు. రావణాసురుడి దేహాన్ని రాజలాంఛనాలతో తీసుకుపోతున్నారు. శోకదేవత లాగ మండోదరి పక్కనే నడుస్తోంది. కళ్ళు మూసుకుని కాస్సేపు మర్చిపోదామనుకున్నా, అనిమేషనేత్రుడు, సహస్రాక్షుడు కావడం చేత వీలు పడలేదు."అలాగపడుకుంటే ఎలాగ? లేవండి" అంది శచూదేవి ఇంద్రుడి వైపు కోపంగా చూసి.

"ఎందుకు?" అన్నాడు నిస్త్రాణగా.

"ఎందుకేమిటి? అత్యవసర సమావేశం ఇంకొక గంటలో ఏర్పాటు చేసాను. దేవతలంతా, చిన్న ఉద్యోగుల దగ్గిర్నుంచీ, అగ్ని, వాయు, వరుణ దేవుళ్ళదాకా అంతా వస్తున్నారు. త్వరగా బయలుదేరండి" అంది ఇంద్రుడి రెక్క పట్టుకు లేవదీస్తూ.

ఇంద్రుడు పేలవంగా నవ్వాడు.

"పిచ్చిదానా, నీకు ఇంకా అర్థం కాలేదా? అమ్మకి మన మీద దయ తప్పింది. అందుకే ఇలాంటి ఇరకాటంలో పెట్టింది. మండోదరి మాంగల్యం నిలబెట్టడానికి మనం రావణుడి గొంతులో అమృతం పోసి బ్రతికించామో, రాములవారు మన మీద దండెత్తటం మాట అటుంచి, పధ్నాలుగు లోకాల వాళ్ళు అవిశ్వాస తీర్మానం పెట్టి మనని ఏ త్రిశంకు స్వర్గానికో తోసేస్తారు. పోనీ ఊరుకుందామా అంటే అమ్మ పాతాళలోకానికి రాజ్య పాలుడిగా తోసేస్తోంది. లాభంలేదు, శచీ, ఇదంతా వృధా శ్రమ. పట్టు పీతాంబరాలూ, నగలూ సర్దు రేపే" శచి తోక త్రొక్కిన తాచు లాగ లేచింది.

"ఇదేనా మీ పౌరుషం? దైవ ప్రయత్నమేదో మనం చేద్దాం. ఫలితాలు ప్రధాన దేవతకే వదిలేద్దాం. మీరిలాగ వెనుకంజ వేస్తే, పాతాళలోకంలో కూడా నన్ను చులకనగా చూస్తారు. మీకు కావల్సింది కూడా అదేగా" అని సాధింపు మొదలుపెట్టడంతో ఇంద్రుడు హడావిడిగా పరుగెత్తాడు సభకి.

ఇంద్రుడు సభలో కొలువు తీరాడు. చుట్టూ చూసి గతుక్కుమన్నాడు. సభ అంతా క్రిక్కిరిసి పోయింది. గవాక్షాల్లో, స్తంభాల పైనా, నేల మీదా ఇసక వేస్తే రాలనట్టుగా ఉన్నారు దేవతలు. కొందరు ఇంకొకరి భుజాల మీద కూర్చున్నారు.

ఇంద్రుడు లేచి గొంతు సవరించుకున్నాడు. అంతా నిశ్శబ్దం ఆవరించింది. ఇంద్రుడు క్రీగంట టీ.వీ కెమరాల వైపు చూసాడు. ప్రధాన దేవత ఈ సభా కార్యక్రమాన్ని తిలకిస్తూ ఉంటుందని అతనికి తెలుసు.

"సభాసదుల్లారా, మన అమ్మ దయ వల్ల రావణాసురుడు హతమార్చబడ్డాడు. ఆ చల్లని తల్లి పాలనలో తిరిగి న్యాయం, ధర్మం గెలిచాయి ఎప్పటిలాగే. మనం ఎప్పటికీ అమ్మకి విధేయులమై ఉంటామని వాగ్దానం చేద్దాం. అమ్మ కరుణ........." మళ్ళీ పదిహేను నిముషాలు స్తోత్రం చేసాడు.

దేవతలకి ఆకలి, నిద్ర లేకపోవడం వల్ల ఆవలించే ప్రసక్తి లేదు. కానీ స్తోత్రం కుదిస్తే బాగుండుననిపించింది, భుజాలపై ఇంకొకళ్ళని మోస్తున్న వాళ్ళకి.

ఇంద్రుడు హఠాత్తుగా ఆపేసాడు స్తోత్రం. కారణం అతని దృష్టి పక్కనే ఉన్న ఇంకో దూరదర్శిని మీద పడటం.

అప్పుడే చందనం చెక్కలు పేర్చడం మొదలుపెట్టారు. ఇంద్రుడికి ముచ్చెమటలు పోసాయి. కష్టపడి చూపులు మరల్చుకున్నాడు.

"సభాసదులారా, ఇక్కడ ఉన్నదేవతల్లో ఒక అవిధేయుడున్నాడు, అమ్మ ఇంతగానో హెచ్చరించిన తరవాత కూడా, ఆవిడ అజ్ఞని ధిక్కరించిన నేరానికి, శిక్షని కొంతవరకూ తగ్గించగలను, ధైర్యంగా నేరాన్ని ఒప్పుకుంటే" అని నాటకీయంగా ఆగి, సభంతా కలియిచూసాడు. అంతా ఉత్కంఠతో చూస్తున్నారు.

"మండోదరికి నిత్య సుమంగళి వరం ఇచ్చిందెవరు?" అని అమ్మ లాగే గంభీరంగా ప్రశ్నించాడు.

రెండు నిముషాలు నిశ్శబ్దం రాజ్యమేలింది. అప్రయత్నంగానే ఇంద్రుడి చూపులు దూరదర్శిని మీద పడ్డాయి. అప్పుడే చందనం చెక్కలు ఒక అడుగు ఎత్తు వరకూ లేచాయి.

నేల మీద కూర్చున్న ఒక వాళ్ళల్లో ఒకరు లేచి నిలుచున్నారు. సభలో కల్లోలం చెలరేగింది.

"నేరం చేసినట్టు ఒప్పుకుంటున్నావా?' అని ఆడిగాడు ఇంద్రుడు అనుమానంగా. మండోదరికి వరాలు ఇవ్వగలిగేటంత ఉన్నత పదవి, శక్తి అతనికి ఉన్నట్టుగా ఇంద్రుడికి అనిపించలేదు. లేదని తల అడ్డంగా ఊపాడు.

"మరి?" అని అడిగాడు ఇంద్రుడు. అతనికి అర్థంకాలేదు.

"ప్రభూ, అంతరిక్షయానంలొఓ ప్రమాదాలు నివారించే బాధ్యత గల అధికారిని నేను. కొంతకాలం క్రితం కొన్ని వాయి శకటాలు, వాహనాలు అమిత వేగంతో, నియంత్రించిన వేగం కంటే చాలా రెట్ల వేగంతో ప్రయాణిస్తూ ఉంటే, వారిని వెంబడించి అపాను. కానీ, వారు ప్రధాన దేవత కుమారుడు, మేనల్లుడు వారి స్నేహితులని గమనించి, క్షమార్పణలు చెప్పి, స్తోత్రాలు చదువి, పాదాభివందనం చేసి, వారి పాద ధుళి శిరస్సున జల్లుకున్నాను. దానికి వారు ప్రసన్నులై, తాము మండోదరికి వరప్రదానం చేయడానికి వెళ్తున్నామని, వారిని ఆపి అవమానించినా, నా భక్తికి మెచ్చి క్షమించి వదిలేస్తున్నామని సెలవిచ్చారు, ప్రభూ" అని సవినయంగా మనవి చేసుకున్నాడు.

ఇంద్రుడు ఎగిరి గెంతులు వేయాలన్న కోరికని గట్టిగా అణుచుకున్నాడు. పెదవుల మీదకి రాబోతున్న చిరునవ్వుని అదుపులో పెట్టుకోవడానికి గట్టిగా తొడు గిల్లుకున్నాడు. భ్రుకుటి ముడిచాడు. ఈ సభలో జరుగుతున్నాదంతా ప్రధాన దేవత చూస్తోందని తెలుసు. జాగ్రత్త వహించాడు.

"మూర్ఖుడా, ప్రధాన దేవత కుమారుల పైన ఇటువంటి నింద వేసేటంత కండకావరమా? నిన్ను తక్షణం పాతాళలోకానికి పంపిస్తున్నాను. ఫో, ఇక్కణ్ణుంచి" అని గర్జించాడు ఇంద్రుడు.

"కాని, ప్రభు, అక్కడ అంతరిక్షం, వాయు శకటాలు ఉండవు ప్రమాదాలు నిరోధించడానికి" అన్నాడు అతను గజగజా వణికిపోతూనే.

"పాతాళలోకం రాజ్య పాలుడికి వర్తమానం పంపుతాను, నీ లాంటి మందభాగ్యుడు, మందమతికి పానశాల లోనో, వంటశాల లోనో తగిన పని చూడమని. ఇంక ఫో" అనేసరికి , మంచులాగ కరిగి మాయమయ్యడు.

ఇంద్రుడు ఇబ్బందిగా గొంతు సవరించుకున్నాడు.

"ఎవరి మండోదరికి వరం ఇచ్చారు అన్నది అప్రస్తుతం. అది నిజమయ్యే లాగ చూడాల్సిన బాధ్యత మనందరిదీ. మీరంతా వెంటనే గ్రంథాలయాల్లో పుస్తకాలు తిరిగెయ్యండి. పరిశోధించండి. ఈ ఉప్రద్రవం నుంచి మన దేవతల పరువు కాపాడినవాడికి (అర్ధరాజ్యం అనబోయి, తమాయించుకున్నాడు) వారివారి శాఖల్లో ఉన్నతాధికారం ఇస్తాను. ఉన్నతాధికారిలే పరువు కావాడగలిగితే, వారి ఏ కోరికైన (ఇంద్ర పదవి తప్ప) తీర్చబడుతుంది" అన్నాడు ఇంద్రుడు.

గొప్ప కలకలం చెలరేగింది. ఒకళ్ళనోకళ్ళు త్రోసుకుంటూ గ్రంథాలయాల్లోకి పరుగులు తీసారు. అందరూ తలోపుస్తకం తిరగేస్తున్నారు.

"వరాలు-నిబంధనలు", "వరలు ఇవ్వటంలో పాటించాల్సిన కొన్ని జాగ్రత్తలు", "నిత్య సుమంగళి-విధులు, నిబంధనలు" మొదలైన పుస్తకాలు వెతికేస్తున్నారు.

ఇంద్రుడు సింహాసనంలో వెనెక్కి జేరగిలబడి నిట్టూర్చాడు. తమ చేయగలిగింది చేసాడు. దిగజారిపోతున్న ధైర్యాన్ని కూడదీసుకున్నాడు. కానీ దూరదర్శన్ చూసేసరికి ధైర్యం జావ కారిపోయింది. అప్పుడే రావణాసురుడి చితికి నిప్పటించారు. మంటలు పది, పదిహేను అడుగుల ఎత్తుకి నాలుకలు జాపి ఎగబ్రాకుతున్నాయి. పక్కనే అమర్చిన మెట్ల దిగువ నిలబడి మండోదరి నిస్తేజంగా మంటల్లోకి చూస్తోంది. శచీదేవికి దూరవాణిని చేసాడు.

"శచీ, అన్నీ సర్దేటప్పుడు నేను అమృతం తాగే కలశం మర్చిపోకు" అన్నాడు దిగులుగా.

"అంతేనా?" అంది సచీదేవి నిరాశగా.

"ప్రభూ" దాదాపు తన చెవిలో ఎవరో అరిచేసరికి ఉలిక్కిపడ్డాడు ఇంద్రుడు.

"ఏమిటి?" అని అడిగాడు అత్రంగా.

ఆ వచ్చిన దేవలోక సభ్యుడు  రొప్పుతున్నాడు ఉత్సాహంతో.

"చూడండి, ప్రభూ, చూడండి" అంటూ, ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ, చేతిలో పుస్తకం చూపించాడు.

ఇంద్రుడు అతను ఆపుస్తకంలో అతను చూపించిన చోట చదివాడు ఆత్రంగా. ఇంద్రుడి కష్టాలన్నీ పటాపంచలయ్యాయి. పట్టలేని ఆనందంతో లేచి ఇంద్రుడు అతన్ని కౌగలించుకున్నాడు.

"నెవ్వెక్కడ పని చేస్తావు?" అని అడిగాడు.

"న్యాయ శాఖలో గదులు శుభ్రం చేస్తాను, ప్రభూ" అన్నాడు వినయంగా.

"సరే, నిన్ను న్యాయశాఖ ప్రధాన న్యాయమూర్తిని చేస్తున్నాను" అన్నడు ఇంద్రుడు.

"మహా ప్రసాదం" అంటున్న అతని మాటలు వినకుండానే హుటాహుటిన ఐరావతం ఎక్కి భూలోకానికి బయలుదేరాడు ఉత్సాహంగా, శచీదేవిని తీసుకుని

మండోదరి మంటల్లోకి దూకబోతున్న ఆఖరి క్షణంలో శచీదేవి ఆమెని పట్టుకుని ఆపింది.

మండోదరిని క్రిందకి తీసుకువచ్చారు.

"నన్నెందుకు ఆపారు? నా భర్తతో బాటే నేనూ భస్మమవుతాను" అంది మండోదరి నిర్వికారంగా.

ఇంద్రుడు, శచీదేవి టీ.వీ కెమేరాల వైపు తిరిగి మందహాసాలు చేసారు.

"అమ్మా, మండోదరీ, నువ్వు ధన్య చరితవు, మహాపతివ్రతవి. నీ కథ ఆచంద్రతారార్కం నిలిచి ఉంటుంది. నిత్య సుమంగళిగా చరిత్రలో నీకొక ప్రత్యేక స్థానం ఉంటుంది." అన్నారు చేతులు ముకుళించి నమస్కరిస్తూ.

మండోదరికి అర్థం కాలేదు. ఉజ్వలంగా ప్రజ్వరిల్లుతున్న చితివైపు, ఇంద్రుడి వైపు మార్చి, మార్చి చూసింది.

"కానీ......." అనబోయింది.

"అమ్మా , మండోదరీ, ప్రధాన దేవత పాలనలో అన్న మాటతప్పడం, వరం ఇచ్చేక ఉల్లంఘించడం జరిగే అవకాశం లేదు, అది అసంభవం. ధర్మంనాలుగు పాదాలమీద నడిచేలా చూడటం, న్యాయ పరిరక్షణ, దుష్టశిక్షణ, శిష్ట రక్షణ, దారిద్ర్య నిర్మూలన నిరంతరంగా

కొనసాగుతాయి, ఆమె పాలనలో. అందులో సందేహంలేదు..........." అని ఇంద్రుడు, శచీదేవి గడగడా స్తోత్రం చేస్తూ ఉంటే, అసహనంగా అడ్డు తగిలింది మండోదరి.

"నేను నిత్య సుమంగళిని ఎలా అయ్యాను?" అని అడిగింది విసుగ్గా.

దీని కోసమే ఎదురుచూస్తున్న ఇంద్రుడు చిరునవ్వులు ఒలకబోసాడు.

"ఇదిగో చూడు మండోదరీ, "పాతివ్రత్యము-సతీసహగమనము" అనే ఈ న్యాయశాస్త్ర గ్రంధంలో, 'నిత్యసుమంగళి' అనే అధ్యాయంలో నాలుగోపంక్తి చదువుతాను. "పతిదేవిని కాష్ఠము పూర్తిగా కాలునంతవరకూ, సతి సుమంగళియేనని గుర్తించవలసినది" అని స్పష్టంగా ఉంది." అని సంజ్ఞ చెయ్యగానే, వాయుదేవుడు, అగ్నిదేవుడు వచ్చి నమస్కారం చేసి ఒక పక్క నుంచున్నారు.

"వాయు, అగ్ని దేవుళ్ళు రావణకాష్ఠాన్ని ఆచంద్రతారార్కం మండేలాగ, చితి ఎప్పుడూ ప్రజ్వరిల్లూతూ ఉండే లాగ చూస్తూనే ఉంటారు....."

ఇంద్రుడు నమ్మోహనకారమైన చిరునవ్వుతో చెప్పుకు పోతున్నప్పుడు, మండోదరి విరగబడి నవ్వడం కానీ తరవాత స్పృహ తప్పి నేల కొరగడం కానీ దూరదర్శన్ చూసేవారికి కనబడలేదు, కారణం ఆమె ఆ దరిదాపుల్లో లేకపోవడమే.!!!!

# రానీ..ఆయన్ని!

## పుట్టపర్తి తులజాదేవి

**"నేనింక ఆయింటికి వెళ్లనుగాక వెళ్లను"**

పెట్టే, బేడాతో అకస్మాత్తుగా ఊడిపడ్డ కూతురు వైనం ఏమాత్రం అర్థంకాలేదు రామూర్తికి రాజసులోచనలకు

"ఏమైందమ్మా?" అంటూ అనునయంగా, జమిలిగా అడిగారు.

సుజాత సూట్‌కేస్‌ను సోఫాలో పడేసి చేతులు ఒత్తుకుంటు కూర్చుంది.

"నింపాదిగా చెప్తుందిలే. కొంచం నిదానించు" అంటూ రామ్మూర్తి కూతురు పక్కన సోఫాలో కూర్చున్నాడు.

"వెళ్లమ్మా! కాస్త ముఖం కడుక్కుని ఫ్రెషప్ అవ్వు. వేడివేడిగా కప్పు కాఫీ తాగితే అలసటంత హాంఫట్ అయిపోతుంది."

"ఊ...." అంటూ సుజాత బ్రష్షూ, పేస్టు తీసుకుని బాత్రూం లోదూరింది. అరగంట గడిచింది. ఎంతకూ బయటకురాని కూతురి కోసం రాజసులోచన బాత్రూం దగ్గరకి వెళ్తే ఆక్కడినుంచీ సెల్ లో మాటలు వినిపించాయి. సుజాత భర్తతో మాట్లాడుతూ వుంది.

"నేను రాను రాం, నీవే రా యిక్కడికి. మనం పర్సనల్‌గా మాట్లాడుకుందాం. ఇంత జరిగాక నీవు నేను చెప్పినట్లు వినకపోతే నీకు నాకూ రాం రామే." తెగేసి చెప్తున్న సుజాతను కొయ్యబారి పోయి చూస్తూ నిలుచుంది రాజసులోచన.

కూతురి వెనక వంటింట్లోకి వచ్చి వేడివేడి పొగలు గక్కే ఫిల్టరు కాఫీ సుజా చేతికిచ్చింది.

కాఫీ తాగేదాకా కూతురిముఖం వైపు చూస్తూ కుర్చున్నారు దంపతులిద్దరూ. గ్లాసు టేబుల్ మీద పెడుతూ రిలాక్స్‌డ్‌గా కూర్చుంది సుజాత.

"మీ అత్త, ఆడబిడ్డలూ అందరూ బాగున్నారా అమ్మా." ఉపోద్ఘాతంలా అందుకుంది సులోచన.

" ఆ.. ఆ.. బాగున్నారు" వాళ్లకేమైందీ అన్నట్లు సుజా సాగదీస్తూ చెప్పింది.

" ఇంతకూ విషయం చెప్పావు కాదు" రాజసులోచన అడిగింది.

"అమ్మా! తలనొప్పిగావుంది. రాత్రంతా ప్రయాణంలో నిద్రలేదు ఒకటే ఒళ్ళునొప్పులుగా వుందమ్మా!"

"చెప్తుందిగా అలసటగా వుందనీ! కాస్లేమ్మ. కాసేపు పడుకో. నిద్ర తక్కువైతే తలనోప్పేగా మరీ!" అంటూ ఆ రోజు పేపరు తీసుకుని కళ్లద్దాలు సవరించుకుంటూ వరండాలోకి నడిచాడు రామ్మూర్తి.

సులోచనా కూతుర్ని నిద్రపొమ్మని, దినసరి కార్యక్రమానికి వంటింట్లోకి వెళింది.

మధ్యాహ్నం ఒంటి గంటైంది. భోజనాది కార్యక్రమాలన్నీ ముగిసేసరికీ. ఈ సారి ఆగలేక పోయింది రాజసులోచన సుజాత ఎదురుగా కూర్చుంది విషయం చెప్పమని.

"అమ్మా! నన్ను అత్తవారింటికి పంపే రోజు గుర్తుందా? నా దోసిట్లో బియ్యం యింట్లో పడేటట్లు విసిరేయమన్నారు. అదేదో ఆనవాయితే అట! అంటే ఏమిటి అర్థం. ఇంటి నించీ లక్ష్మీదేవిలాంటి ఆడపిల్ల అత్తరింటికి వెళ్లిపోయినా పుట్టింట్లో దేనికీ కొదవ ఉండకూడదనేకదా! అలాగే అత్తింట్లో అడుగుపెట్టేటప్పుడు, గడపమీద చెంబుతో బియ్యం వుంచారు. లోపలికి వెళ్లేటప్పుడు కుడికాలు బొటనవ్రేలితో యింట్లోకి తోసి రావాలని. సరే ఇంట్లోకి క్రొత్తగా వచ్చిన కోడలు వస్తూ వస్తూ సిరిసంపదలు వెంట తెస్తుందని వాళ్ల ఊహ. అలాగే చేశా కాని ఆ బెంచికి బేస్ సరిగా వున్నట్లులేదు. నేను కాస్త బలంగానే తోశా. ఎందుకంటే నేల నాలుగు చెరగులా అన్నట్లు సంపద ఇబ్బడి ముబ్బడిగా నాతో రావాలిగా మరి! రూము మూల మూలలా బియ్యం వెదజల్లినట్లు పర్చుకున్నాయి. ఇక చూడు.. అత్త ఆడబిడ్డల ముఖాలు! బియ్యాన్ని చీపురుతో ఊడవరాదు. నేను పదహార్రోజుల పడుగవరకూ చీపురు ముట్టరాదు. ఇక చేతుల్తోనే బియ్యాన్నంత ఎత్తి పోసుకున్నారు. అప్పటినుంచి ముభావం. కావాలంటే పిన్నిని అడుగు. నాతో వచ్చిందిగా. నాలుగురోజులయ్యామా నేనక్కడకి వెళ్లి? మా ఆడబిడ్డ బట్టలుతుకుతూ వుంది. నల్లా తిప్పితే నీళ్లే. ఆ పిల్ల ఒక్కతే కష్టపడుతూ వుంది కదా ఊరికే కూర్చున్నా నేను కాస్త సాయం చేస్తే బాగుంటుందనిపించింది. వెళ్లాను. వద్దు వద్దు అంటూనే ఆరేయమని చేతికి పిండిన బట్టలిచ్చింది. సరే మా అత్తగారి చీర తొమ్మిది గజాలది. మడిచార పోసి కట్టుకుంటారుకదా ఆవిడ! అది ఉట్టిదే బరువు. పైగా నీళ్లల్లో పిండినచీర. మడతలువేశా మడిచీరకదా! ఇంట్లో దండెంమీద ఆరేయాలి. మడతపెట్టి కర్రతో దండెంమీద వేయబోయా. అది టపుక్కున జారి మా అత్తగారి నెత్తి మీదపడింది. ఆవిడ అక్కడే కూర్చుని కూరగాయలు తరుగుతూ వుందాయె మరి. ఇక చూస్కో దిమ్మెక్కి పోయినట్లు తల పట్టేస్కుని కూర్చింది ఆవిడ.

"చేతకాకి పోతే ఊరికే కూచోవచ్చుగా వదినా!" అనవసరమైన పనులు చేసి తలనొప్పి తెస్తావెందుకన్నట్లు చిన్నాడపడుచు ఆరిందాలా మాట్లాడింది. అక్కడికి నేనేదో కలగన్నట్లూ, కావాలని చేసినట్లు ఆ రోజంత మూడాఫ్. మీ అల్లుడు కూడా తప్పునాదేనన్నట్లు తల్లి తల ఒత్తుతూ కూర్చున్నాడు. మూడు నాలుగు రోజులు నాతో సరిగా మాట్లాడ లేదు కూడా.

"పొరబాటున జరిగిన తప్పుతప్పే కదమ్మా! పాపం పెద్దావిడ..." సులోచన సర్దుబాటుగా ఇంకా ఏదో చెప్పబోతూంటే అడ్డుకుంది సుజాత.

"తప్పెనమ్మా! ఒప్పుకుంటున్నాను కదా! సారీ చెప్పా నేను కూడా. మా ఆయన చేతి మీద చేయేసి, ఆవిడ తల నొక్కబోయా, అబ్బే ..!మన ఫీలింగ్స్ వాళ్లకు అర్థంకావు .ఈయనా ఆవిడా నా చేయి దులిపి అవతల తోసేశారు." సులోచనా, రామ్మూర్తి ఏమ్మాట్లాడాలో తెలియక చూస్తూ వుండి పోయారు.

"అదైందా? మొన్నటికి మొన్న ఆదివారం చిన్నాడబిడ్డ లెక్కల పుస్తకం ముందేసుక్కూర్చుంది. ఆ పిల్ల చదివేది అయిదో క్లాసు. మా పెద్దాడబిడ్డ టెన్త్ వరకే చదివింది. టెన్త్ దాటలేదు కూడా.

" నాకీ లెక్కలు రావుగానీ వదినెనడుగు పో. అర్థం అయ్యేలా చెప్తుంది" అని ఆ పిల్లను నా దగ్గరకి పంపింది.

సరే " ఏంటి సమ్మ?" అని బుక్కు ఓపెన్ చేశా. జనరల్. గోపాల్ దగ్గర కొంత సొమ్ముంది. అతడు అందులోంచి శ్యాం కు ఆరు రుపాయలిచ్చి అప్పు తీర్చాడు. ఇంక గోపాల దగ్గర నాలుగు రూపాయలున్నాయి. అప్పు తీర్చకముందు గోపాల్ దగ్గర ఎంత డబ్బుంది? చిన్న లెక్కే. అక్కడికీ ఎగ్జాంపుల్ కూడా చెప్పా. తీర్చిన అప్పూ, మిగిలిన సొమ్మూ యాడ్ చేస్తే గోపాల్ దగ్గర ముందున్న సొమ్మెంతో తెలుస్తుంది. చేయమ్మా అని చెప్పా. పేపర్ మీద ఏవో లెక్క లేస్తుంది. వేళ్లమీద ఏదో లెక్కేస్తుంది ఏదేదో చేస్తుంది. అర్థంకాలే. ఇంకోలెక్క. ఒక్కో అరటిపండూ రెండు రూపాయలు. నీ దగ్గర పదిహేను రుపాయలున్నాయి. నీ కెన్ని అరటి పళ్లు వస్తాయి? ఇంకెంత డబ్బు నీ దగ్గర మిగుల్తుంది అని, పదిహేనును రెండుతో డివైడ్ చేయి ఆన్సర్ అంటే దానికీ తెల్లమొగమే "చిన్నదే కదమ్మ చెయ్" అన్నా. అంతే కళ్లల్లోంచి బొట బోటా కన్నీళ్లు ఆపకుండా ఏడుపు. ఏమైందంటే ఏమైందని మా అత్తా, ఆడబిడ్డా, మరిదీ, మొగుడూ అందరూ ఆడగడం "చదువుకున్న దానివి కదా. కాస్త అర్థమయ్యేలా చెప్పమ్మా.. అంటే పిల్లదాన్ని ఏడిపిస్తావా? ఇంత మాత్రం చెప్పలేని దానివి చదువు లెందుకు? ఉద్యోగాలెందుకు? వీళ్ల నాన్నగానీ నేను గానీ పిల్లల్ని పల్లెత్తు మాట అనలే. ఇట్లా ఏడిపించాలా? చాల్లే సంబడం". అని ఆ పిల్లను రెక్కపట్టి తీసికెళ్లింది ముక్కు చీదుకుంటూ మా అత్తగారు. ఇంతకూ సమస్య ఎక్కడంటే, ఆ అయిదో తరగతి పిల్లకు యాడ్, డివైడ్ అర్థం కాలేదట! తెలుగు మీడియం కదా! అక్కడికీ అన్నా తెలుగులోనే చెప్తారా అని "చాల్లేమ్మా పిల్లదాన్ని బాగానే బెదరగొట్టావు" అంటూ మా అత్తగారు యీసడించేశారు. మీ అల్లుడు సరేసరి. "పాపం చిన్నపిల్ల నీ స్టాండర్డ్‌లో చెప్తే ఎలా అర్థం అవుతుంది? కాస్త లెవెల్ దిగి అంటే? ఏమిటి అర్థం? నేనేం లెవెల్ పోతున్నాను? అక్కడే మేమిద్దరం మాటా మాట అనుకున్నాం. చిలికి చిలికి గాలివానైంది. నేను పెట్టె సర్దుకుని వచ్చేశా. చీరకొంగు వేలికి చుట్టుకుంటూ సుజాత చెప్పడం ఆపింది. ఆ పిల్లకు ట్యూషన్ పెట్టిస్తే సరిపోతుంది అని తీర్మానించారంతా. మా పక్క వీధి కాక ఆ పక్క వీధిలో ఎవరో శకుంతలా అట! ఆవిడ దగ్గరకు నేను వెళ్ళి మా ఆడబిడ్డకు ట్యూషన్ చెప్పండి అని మాట్లాడాలట! నా వెంట సజెస్ట్ చేసిన పిల్లా రాదట, ట్యూషన్ చెప్పించుకునే యీ పిల్లా రాదట! నే వేళ్లి మాట్లాడి వచ్చాక పంపుతారట! బాగుంది కదా! ఊరుకొత్త, ఎవరూ తెలీదు. నేనేం మాట్లాడ గలను? నా మొగుడూ, మరిదీ ఆఫీసుకు వెళ్లేవాళ్లు. వాళ్ల వాళ్ల పనుల్లో బిజీ. నేనే ఖాళీ, కాబట్టి నేనే వెళ్లాలి. సరే నోరుంది కదా, ఎవరినైన అడిగితే చెప్తారు కదా! అని చెప్పులేసుకుని బయల్దేరి గేటు దాకా కూడా వెళ్లలా.. వెనక నుంచీ మాటలు "ఎవరి కోసం చేస్తుందీ". అంతే చటుక్కున వెనుతిరిగి చెప్పులు విడిచేసి రూంలో కెళ్లి తలుపు లేసేసుకున్నాను. సాయంత్రం ఆయనొచ్చాక మళ్లీ సీను. పోమ్మా నావల్ల కాదు. నేనింక వెళ్లనక్కడికి" అంది మొండిగా సుజాత.

"అలా అంటే ఎలాగమ్మా?" సులోచన ఇంకేదో చెప్పబోతూ వుంటే మధ్యలోనే సుజాత అడ్డుకుంది.

"అమ్మా! సర్దుబాటు అని ఒకసారి మనం అనుకుంటే వాళ్లకలా ఉండడం అలవాటైపోతుంది. నేనూ సర్దుబాటుకే అలవాటు పడాల్సొస్తుంది. ముల్లూ అరిటాకు అంటూ నచ్చచెప్పడానికి ప్రయత్నించకు. అలాంటి మాటలన్నింటికీ యిప్పుడూ కాలం చెల్లింది.

అడ్జస్టెట్మెంట్ అందరికీ అవసరమే. చిన్న చిన్నవేలే అని నేను సర్దుకు పోతే వాళ్ల అలవాటు నాకు నాతో పాటూ మీకూ తలనోప్పొతుంది. కాబట్టి" నిక్కచిగా అంది సుజాత "రానీ........ఆయన్ని!!"

# భూతబలి ఆదూరి హైమవతి

బంగాళాఖాతంలోవాయుగుండంతో పదిరోజులుగా జోరువానలు నేలతల్లిని ముంచెత్తుతున్నాయి. కాస్త తెరిపిచ్చి ఎండపొడ రాగానే నేనూ బయటికి బయల్దేరాను.ఈ పదిరోజులుగా అలసి పోయిన నేను మెల్లిగా చీమనడకతో ఊరిచివర ఉన్నస్లం దగ్గరకెళ్ళాను.గుడిసెలన్నీ ఇంచుమించు నీళ్ళలో ఉన్నట్లున్నాయి. ఒకగుడిసెలోంచీ సన్నగా వినిపిస్తున్నమాటలు నా చెవినపడ్డాయి.

" ఓరే! రావుడా ! కడుపు నకనకలాడతన్నాదిరోరే! పేగులు ఎండిపోతన్నైరా! యావన్నా దొరకద్దేవో కాత్తంత సూడరాదంట్రా!పేనం పోయేట్టుందిరో "మూడురోజులుగా ఏమీ తినక మాట పెకలించుకుని అంటున్న తాతను, 'రెన్నాల్లకితం బెద్దుముక్కింతతిని ,మాట్టాన్నే సకితిలేక మూడంకేసి పడున్నసెల్లినిసూత్తాంటే మనస్సు నీరుగారతాండాది 'అనుకున్నాడు పన్నెండేళ్ళరావుడు. వీడిప్పుడేం చేస్తాడో! ఎలాబువ్వతెచ్చి తాతకూ, చెల్లిలికీ తినిపించి వాళ్ళనిబ్రతికించుకుంటాడోని నేను ఆత్రంగా చూడసాగానువాడ్ని. .

కాస్తంతసేపు ఏదో యోచించి"ఉండేతాతా చనంలోవత్తా!"అంటూ బయటికెళ్ళి ఆటూఇటూ చూశాడు రావుడు. గుడిశల ముందంతా మోకాల్లోతు నీళ్ళు, దారేలేదు.. ఏంచేయాలో వాడికి పాలుపోయింది కాదు. 'వాతోన్నం బాగున్నపుడు ఊరిసివర్నున్న పొలాలకాడ్నింసీ ఆక్కూర్లు మారుబారంకి తీస్కుని బండి మీదేస్కుని అమ్ముకుంటుంటి, వొచ్చిందాంతో తాతకూ సెల్లికీ కూసింత అన్నమో,గంజో కాసిపోస్తుంటి. ఇప్పుడు పద్దినాలుగా ఓటే వానాయె ,గుడిసెకూడా కురత్తాంది. తాతాసెల్లీ కూళ్ళే కసచ్చేట్టుంన్రు!యాంసేయాలబ్బా!'అని ఆలోచించిన వాడి మనస్సులో ఏదోమెరుపులా మెదలగా ,ఉన్నపాటున గుడిసెలోకెళ్ళి తాతను భుజంపై ఏసుకుని బండిమీద పడుకోబెట్టాడు. ఆ తర్వాత లోపల్నుంచీ చెల్లినీతెచ్చి బండిమీదేశాడు. నేను ఆశ్చర్యంగా చూస్తుండగానే ఆ మోకాల్లోతు నీళ్లలో బండితోసుకుంటూ గుడిసెల మధ్యనుండీ బయటకు వచ్చాడు. వాడిమనస్సు తాతనూ చెల్లినీ బతికించుకునే మార్గం గురించీ మెరుపు వేగంతో ఆలోచించసాగింది. వీడిలా ఇద్దర్నీ బండిమీదేసుకుని ఎక్కడికెళతాడో చూద్దామని నేనూ వెంటపడ్డాను .

' దేవుడున్నాడంట్రు ! ఆ దేవుడు ఉన్నోల్లకేనా !మాబతుకులిట్టా బుగ్గవాల్చిందేనా!ఆకల్తో సావాల్సిందేనా! ' అని లోపల్లోపల అనుకుంటూన్న రావుడికి ,ఆ రోజు శనివారమని గుర్తువచ్చింది.

" తాతోయ్! ఈరోచ్చనోరం! దేవుల్లకి చానా చానా నయ్యేద్యకాలెడతరు , నేఎల్లి తెత్తనుండే!" అంటూ వెంకటేశ్వరస్వామి ,హనుమాన్ ,వినాయక,సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల కాంప్లెక్సుకు దగ్గరగా ఉన్న ఒకచెట్టుక్రింద తన తోపుడు బండాపి, గబగబాల్న లోపలి కెళ్ళాడు రావుడు.

లైన్ గా దర్శనం చేసుకుని వస్తున్నవారికంతా ఆకుదొన్నెల్లో పులిహోర ప్రసాదం ఇస్తున్నారు. రావుడు ఆత్రంగా గుళ్ళోకెళ్ళి దేవుని ముందునిల్చి"ఓ దేవుడా!నువ్వున్నవంటరంతా!నీవేగానుంటేఇయ్యాల మాసెల్లినీ,తాతనీకాయి. యాంసేత్తవో నాకెరికనేదు, మా పానాలు కాయిదేవుడా ! ఆల్లుసత్తే నాకింకెవరుంటరయ్యా! నేను నిన్ను నమ్మిత , నీకు శాతైన సావసేస్కుంట! " అని మొక్కుకుని బయటికి క్యూలైన్లో నడిచాడు. ప్రసాదం దొన్నె అందుకుని బయటికొచ్చి చొక్కా విప్పేసి దాన్లో ఆ ప్రసాదం దొన్నె నడుంకి కట్టుకుని మళ్ళా దర్శనంకోసం క్యూలో నిల్చాడు.

అంతా చూస్తున్న నేను ' ఓరివీడి తెలివి ! ఎంత చాక చక్యంగా మళ్ళ క్యూలో దూరాడు!' అని ఆశ్చర్యంగా గమనిస్తున్నాను.

రెండోమారూ దేవునికి మొక్కుకుని వరుసలో వచ్చి ప్రసాదం అందుకున్నాడు.బయటికి రాగానే వెనకనుండీ ఎవరో పిల్చినట్లై వెనక్కి తిరిగిచూశాడు." ఒరేయ్ ! ఇట్రారా ! పిల్లోడా!"అని పిలవంగానే రెండుమార్లు ప్రసాదం తీసుకున్నవిషయం గమనించి పిలుస్తున్నారేమోని భయంతో వాడిగుండె లబ్ డబ్ అనికాక' లాగితంతా రని 'కొట్టుకుంది.

" ఒరే పిల్లోడా! ఇక్కడున్నకచ్చడా అంతా తీసి ఆమూలున్న డస్ట్బిన్లోవెయ్యరా!నీక్కాస్త ప్రసాదంపెట్టిస్తా." అనగానే తన చేతులో ఉన్న ప్రసాదం దొన్నెను కూడా నడుంకున్న చొక్కాలోకి కుక్కి ,గబగబా వెళ్ళి అక్కడున్న పూలూ ,అంతా ప్రసాదంతిని క్రింద వేసిన ఆకు దొన్నెలూ ఎత్తి తెచ్చిడస్ట్ బిన్లో వేశాడు.

కుళాయివద్ద చేతులు కడుక్కుంటూ చూశాడు, గుడికి నాల్గువైపులా సిమ్హద్వారాని కిరువైపులా,ధ్వజ స్థంభం ముందూ ఉంచిన ' భూతబలి'అన్నంముద్దలు!వాడికళ్ళకవి బంగారుముద్దల్లా కనిపించాయి. ముందుగా కసఊడ్చినందుకిచ్చిన ప్రసాదందొన్నె ఈ మారు పెరుగన్నం తీసుకుని బయట పడి గబగబా తోపుడుబండి వద్దకొచ్చి" తాతాలేయ్యే,తిండితెచ్చిన్ను." అంటూ తాతను, చెల్లిని లేపి ,తాను తెచ్చిన పెరుగన్నం , పులిహోర కలగలిపి వాళ్ళ నోటికందించాడు.

పాయే ప్రాణం తిరిగి గుండెల్లో ప్రవేశించగా తడారిన నో టినుండీ ఒక్కమారుఅన్నం మెతుకులనుపడేసరికి మూడుదినాల్నుంచీ పస్తున్న పొడారిన  తాత పొట్ట తట్టుకోలేక దగ్గుతో తలమునకలయ్యాడు. బండికిందున్న సీసాతో గభాల్నపరుగుతీసి గుడి ముందున్నకుళాయిలో నీరు తెచ్చి తాపించాడు రావుడు. చెల్లీ,తాతా నాల్గుముద్దలు తిన్నాక," ఓరి రావుడూ ! నీకేదోరే!!అంతా మానోటబెడతన్నవ్ !"అంటూ తనచేతిలో పెట్టిన ముద్దను మనవడి నోటి కందించాడు తాత. రావుడు కన్నీళ్ళుకారు తుండగా ఆ ముద్ద తిని " తాతా దేవుడున్నడే!నేనులోనికెల్లి మొక్కినాంక ఈ పెచాదం దొరికి మనపేనాలు నిల్చినయ్యే ! కుసింతాగుతాతా మనకు కడుపు నిండేటంతతెత్తా " అని మళ్ళా ఆలయంలోని కెళ్ళాడు రావుడు.

అప్పటికే జనం పల్చబడ్డారు, తనచొక్కా జోలిలా మడిచికట్టుకుని ఆలయంలోని నాల్గుమంటపాల వద్దా ,ధ్వజస్థంభాల వద్దా పెట్టిన'భూతబలి'పిండాలను ఏరి జోలేలో వేశాడు,ఆ తర్వాత కొంతదూరంగా ఉన్న కూరగాయలషాపులవద్ద పొడైపోయి బయట పడేసిన టమోటాలు, వంకాయలూ, కేబేజీ, ఆలుగడ్డలూ ఇంకా అన్నికూరలూ ఏరుకుని ఒక ప్లాస్టిక్ కవర్లో వేసుకున్నాడు. చుట్టూ ఎర్రగా పసుపూ కుంకుమ రాసి దిష్టితీసి పడేసిన కుండ ఆలయంముందు పడుండగా అది తీసుకున్నాడు, కొత్తకార్లకి దిష్టి తీసి కొట్టిన కొబ్బరిచిప్పలు ఏరుకున్నాడు, ప్రచారంకోసం కట్టిన ఫ్లెక్సీబోర్డులు ఊడిక్రిందపడ్డ వాటిఫ్రేంలన్నీ విరిచి కట్టకట్టు కున్నాడు. ఆ చెట్టుక్రిందకెళ్ళి మూడురాళ్ళుపెట్టి పొయ్యిలాచేసి ఆలయం బయటప్రమిదల్లో ఉంచిన దీపం పట్టుకొచ్చి పొయ్యి వెలిగించాడు, దానిలో కడిగిన కూరలన్నీ చేత్తో తుంపివేసి సీసాలో నీళ్ళు కాసిని పోశాడు , కొబ్బరిముక్కలు రాతికేసి కొట్టి, చిన్నచిన్నముక్కలుగా తనబండిలో ఉన్న చాకుతో కోసికుండలో వేశాడు, పొయ్యిలోమంట పైకిలేచి కాస్సేపట్లోనే లోపలికూరలు ఉడికాయి, తాను చొక్కా జోలెలో తెచ్చిన అన్నంముద్దల్ని దాన్లో వేశాడు, ఒక

కర్రముక్కతో కుండలో పదార్థాన్నికలిపాడు, ఆలయం ముందుడస్ట్ బిన్ లో వేసిన ఆకుప్లేట్స్ కడిగితెచ్చి దాన్లోకి తానువండిన 'పులగం ' పిడతవంచి చొక్కాతో పట్టుకుని మూడుప్లేట్లలోకి వంపాడు. తాతకొకటి, చెల్లికొకటీ ఇచ్చి"తాతా పొట్నిండా తాగే ,ఇగ మంకి కూడుకిబ్బందేలేదే. రోజూ ఇట్నేవండుతానే సెల్లిమ్మా! తాగే,తాగు." అంటూ తానూ నోట్లో పెట్టుకోబోతుండగా, దూరంగా తన ముందుగుడిసెలోని ముసిలవ్వ తమ మూడేళ్ళ మనవడ్నిచంకనేసుకుని ఆశగా రావుడి వంక చూడసాగింది. రావుడులేచి, దగ్గరకెళ్ళి తనచేతులో ఉన్న అన్నప్పళ్ళెం ఆమె చేతులోపెట్టాడు.

" రావుడూ నీవ్ దేవుడివిరా!" అంటూ అవ్వ చేయెత్తి దీవించింది.

" కాదవ్వో దేవుడున్నడు, అదినేకాదే ఆడున్నడుగుల్లో మనకూ కూడెడతాల్లేవే. తాగు, బుల్లోడాతాగొరే! " అంటూ తిరిగి బండివద్దకొచ్చాడు రావుడు.

వాడు ఆలయంలో కి వెళ్ళినప్పట్నుండీ వాడిని అనుసరించివాడుచేసే పనులన్నీచూస్తున్న నేను వాడి ఆత్మ స్థైర్యానికి, వాడిజాలిగుండెకూ, వాడిలో కనిపించిన ధర్మానికీ, తోటివారి పట్ల వాడి ప్రతిస్పందనకూ వాడిలోని దేవుడికీ మనస్సులోనే నమస్కరించుకున్నాను. నాకు రూపంలేదు కానీ ఉండుంటే వాడికి షేక్ హ్యాండిచ్చుందును.! నేను గాలినై పోయాను మరి!!!

## చిక్కుముడి — కన్నెగంటి అనసూయ

**సూర్యానికి మనసంతా అదోలా ఉంది.** ఏదో చెప్పలేని చిరాకు అంతుపట్టని అశాంతి. ఇదమిద్ధంగా ఇదీ అని చెప్పలేని గుబులు. ఆ గుబులుతోనే స్నానం ఏదో అయిందనిపించి ఫ్రిజ్‌లో ఉన్నవేవో తినేసి కాసేపు అటూ ఇటూ తిరిగి పదయ్యేసరికి లైటార్పి నిద్రకుపక్రమించాడు.

బాగా పొద్దుపోయాక కాస్తంత కలత నిద్రపట్టిందనుకున్నా అసలే గుండెల్లో గుబులుగా ఉందేమో సరిగ్గా మూడూ మూడున్నరయ్యేసరికి మెలుకువొచ్చేసింది. ఇక నిద్రకోసం ప్రయత్నించటం భగీరథ ప్రయత్నమే అని మనసులో అనుకుని లేచి ముందు గదిలోకొచ్చి సోఫాలో కూర్చున్నాడు. కాసేపు అలా కూర్చుని ఆవులిస్తూనే టీవీ చూద్దామని ఎదురుగా టీపాయ్ మీదున్న రిమోట్ కోసం ముందుకి వంగేసరికి ఎదురుగా కనిపించిందది. రైల్వే స్టేషన్లో ఎవరో స్వచ్చంద సేవా సంస్థ కార్యకర్త ఇచ్చిన ఫాంప్లేట్. అతనికి రైల్వే స్టేషన్లో ముందు రోజు సాయంత్రం జరిగిన సంఘటన కళ్ళ ముందు మెదిలింది.

నిజానికి సూర్యం రెండు రోజుల ఆఫీసు పనిమీద వైజాగ్ వెళుతూ పనిలో పనిగా బామ్మరిది ఇంటిక్కూడా వెళ్ళినట్టుంటుందని పిల్లలక్కూడా శెలవులు కావటంతో ఫ్యామిలీని కూడ వెంటబెట్టుకుని వెళ్ళాడు. వాళ్ళ పిల్లల్లక్కూడా అప్పుడే శెలవులు అవటంతో ఎంజాయ్ చేసింది సరిపోక ఇంకా రెండు మూడురోజులు అక్కడే ఉంటామని పెళ్ళాం పిల్లలూ గొడవ చేసేసరికి వెళ్ళిన పని పూర్తిచేసుకుని వాళ్ళని అక్కడే వదిలి వైజాగ్‌లో మధ్యాహ్నం రెండున్నరకి హౌరా చెన్నై ఎక్స్‌ప్రెస్ మెయిల్ ఎక్కి రాజమండ్రి చేరేసరికి కాస్త అటూ ఇటూగా అయిదూ అయిదున్నర అయింది.

సరిగ్గా అదే సమయానికి అవతల ఫ్లాట్‌ఫాం మీదకి హైదరాబాద్ నుంచొచ్చే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కూడా వచ్చి ఆగటంతో ఎక్కేవాళ్ళూ, దిగేవాళ్ళూ, లైసెన్స్ కూలీకూ, వెండర్స్‌తో క్షణాల్లో ఫ్లాట్‌ఫాం అంతా రద్దీగా అయిపోయింది.

ఇంత రద్దీలో వీళ్ళందర్నీ రాసుకుంటూ వెళ్ళటమెందుకులే వెధవ చెమట వాసన్లు... వీళ్ళూనూ ఫ్యామిలీ ఎలాగూ లేదు. ఇంటికెళ్ళి మాత్రం చేసేదేముంది, కాస్త కాఫీ తాగి నెమ్మదిగా బయలుదేరదాం లెమ్మని చేతిలో లగేజ్ కూడా లేకపోవటంతో తీరిగ్గా కెఫ్టేరియా వైపు అడుగులేసాడు సూర్యం.

వేడి వేడి కాఫీ కడుపులో పడేసరికి కాస్త రిలాక్సింగ్‌గా అనిపించింది సూర్యానికి. అతనుండే ఇల్లు స్టేషన్‌కి దగ్గరే కావటంతో కాసేపు అటూ ఇటూ తిరిగి ప్రయాణీకుల రద్దీ కాస్త తగ్గిందనుకున్నాకా ఈస్ట్ ఎంట్రన్స్ నుంచి వెళితే ఇల్లు అక్కడికి దగ్గరని మూడవ నెంబరు ఫ్లాట్‌ఫాం మీదికి వెళ్ళటానికి తీరిగ్గా రైల్వే ఓవర్ బ్రిడ్జి ఎక్కి నడవటం మొదలెట్టాడు.

అలా నడుస్తూ నడుస్తూ సరిగ్గా సగం దూరం వచ్చాడేమో. ఎదురుగా ఏదో గుంపు దారికి అడ్డంగా ఉండేసరికి టక్కున ఆగిపోయాడు. సరిగ్గా బ్రిడ్జికి మధ్యలో దారికి అడ్డంగా నిలబడి కొంతమంది అక్కడేదో చూస్తూండటంతో ఆ గుంపు పక్కగా వెళుతూ ఏంటా అనే కుతూహలం కొద్దీ ఆ గుంపులోకి తనూ తొంగి చూశాడు సూర్యం.

అక్కడో యాచకురాలు నల్లటి మాసిపోయిన గుడ్డొకటి ఎదురుగా పరచుకుని తన ఇద్దరు పిల్లలతో కూర్చుని ఉంది. ఆ పరచిన గుడ్డ మీద అక్కడక్కడా ఏవో కొన్ని చిల్లర నాణేలు. ఎన్నో సార్లు సూర్యం ఆ బ్రిడ్జి మీదుగా వెళుతూ చూశాడామెని. ఆ దృశ్యం కొత్తకాదతనికి.

కానీ ఆ ముష్టిదాని ఎదురుగా తెల్లటి చుడీదార్ వేసుకున్న పాతికేళ్ళ అమ్మాయి మోకాళ్ళ మీద కూర్చుని ఆమెతో ఏదో చెబుతూంది. భుజానికో సంచీ, చేతిలో ఏవో కాగితాలతో చాలా సాత్వికంగా కనిపిస్తున్న ఆ అమ్మాయి ఎంతో అనునయంగా ఆ ముష్టిదానికి చెబుతున్నది వింటూ వాళ్ళ చుట్టూ కొంతమంది వ్యక్తులు నిలబడి ఉన్నారు. ఆ మనకెందుకులే అని ఏడెనిమిది అడుగులు ముందుకెళ్ళి పోయిన సూర్యం అదేంటో వింటే పోలా అనుకుని మళ్ళీ వెనక్కి తిరిగొచ్చి వాళ్ళదగ్గర నిలబడ్డాడు నడుం మీద చెయ్యేసుకుని వాళ్ళిద్దరి వైపూ మార్చి మార్చి చూస్తూ. అప్పటిదాకా ఏం చెప్పిందోగానీ సరిగ్గా సూర్యం వెళ్ళేసరికి ఆ అమ్మాయి చెబుతోంది ముష్టిదానితో.

"..పాపం ఆ పిల్లలు చూడు ఎంత చూడముచ్చటగా ఉన్నారో. వాళ్ళు అలా పదిమంది ముందూ చేయిచాపటం నీకు బాధగా లేదూ. వాళ్ళూ నీకులాగే ఇలా బిక్షమెత్తుకుని బ్రతకాలా? నీ జీవితం కంటే వాళ్ళ జీవితం మెరుగ్గా ఉండాలని నీకు అనిపించటంలేదా? అందుకే నా మాట విని నాతో పాటు వచ్చి హోంలో చేరు. అక్కడ నీ జీవితమే మారిపోతుంది. నీతో పాటు నీ పిల్లలు కూడా ఎవరి ముందూ చేయి చాపి యాచించాల్సిన అవసరం ఉండదు. నీ పిల్లల్ని స్కూల్లో చేర్పించి పెద్ద పెద్ద చదువులు చెప్పిస్తాము. నీక్కూడా ఏవైనా చేతి వృత్తులు నేర్పించి నీ కాళ్ళమీద నీవు నిలబడేటట్టు చేసి సమాజంలో నీకో స్థానం కల్పించి నువ్వు గౌరవంగా తలెత్తుకు బ్రతికేలా చేస్తాము" చెప్పుకు పోతూంది ఆ పిల్ల.

కిమ్మనకుండా వింటూ కూర్చుంది తప్ప ఏం మాట్లాడలేదు ఆ యాచకురాలు. ఆమె ఎంతకీ మాట్లాడకపోయేసరికి అక్కడున్నాళ్ళలో ఒకతను కలగజేసుకుని "మరింకేవమ్మా ఇంతకంటే అదృష్టం ఏముంటది. మూటా ముల్లె సర్దుకుని బయలుదేరు. నీ పిల్లలకి తిండీ బట్టా చదువూ, నీకు చేతుల్నిండా పని ఇంక అంతకంటే ఏం కావాలి ఎవరికైనా. నువ్వు ఇంతసేపు ఆలోచించటానికి మాత్రం ఏముందందులో. చేతులు చాపి రోజూ ఇలా మనిషి మనిషినీ దేబిరించటం మానేసి నీడపట్టున ఉంటావ్. నీ పిల్లలు చూడు ఎంత ముచ్చికలల్లే ఉన్నారో. ఆమె చెప్పినట్టు విని నువ్వా హోంలో చేరితే వాళ్ళ బ్రతుకులు కూడా బాగుపడతాయ్ కదా. కనీసం

వాళ్ళకోసమన్నా ఆ అమ్మాయి చెప్పేది నువ్వు వినచ్చు కదా. అయినా ఆమెకేమి అవసరం చెప్పు ఇలా నిన్ను బ్రతిమలాడుతూ కూర్చోవటానికి? నీ బాగు కోరే కదా ఆ పిల్ల చెప్పేది." గుంపులో నిలబడ్డ ఒకాయన అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడకుండా గబగబా ఆ గుడ్డమీద, పిల్లల చేతుల్లోనూ ఉన్న చిల్లర నాణేలను తీసి సంచిలో వేసేసుకుని ఆ సంచిని బొడ్లో దోపుకున్నాక ఒక చేత్తో ఆ గుడ్డను మడుస్తూనే మరో చేత్తో తన బిడ్డల్ని దగ్గరకు తీసుకుని మరింతగా పొదివి పట్టుకుంది. ఇవేవీ పట్టకుండా అక్కడ పరిచిన గుడ్డమీద రూపాయి రెండు రూపాయల బిళ్ళలతో ఆడుకుంటున్న పిల్లలు ఉన్నటుండి తల్లి తమ చేతుల్లోని డబ్బుల్ని లాక్కోవటమే కాకుండా దగ్గరకి లాక్కుని గట్టిగా పట్టుకునేసరికి ఆమె ఒడిలో ఒదిగిపోతూనే మా అమ్మని తిట్టేస్తున్నారు వీళ్ళంతా అన్నట్టు ఆ అమ్మాయి వైపు, ఆ చుట్టూ ఉన్న వాళ్ళందరి వైపు చురా చురా శత్రువులల్లే చూడటం మొదలెట్టారు వాళ్ళు. ఇంతలో..

ఆ పక్కనున్నాయన ముందు మాట్లాడినాయన మాటలకి కొనసాగింపుగా "ఆ ఎందుకు చేరతారు. ఆళ్ళకిలాగే ఇష్టం. కష్టపడక్కరలేదు. పైగా ఎక్కడికీ వెళ్ళనుకూడా అక్కరలేదు. కాస్తంత గుడ్డ ముక్క పరిచేసి కూసుంటే అవే రాల్తాయ్ డబ్బులు. ఆకలేసినప్పుడు అందులోంచి తీసుకుని కాస్త అలా వెళ్ళి తినేసి రావటం, నిదరొత్తే పడుకోటం, తర్వాత లేచి కూచోవటం. ఆ గుడ్డ మాత్రం అక్కడే ఉంటాది. అక్షయపాత్రల్లే. ఇంక కొదవేముంది? పొయ్యిలోకి ఎతుక్కోవాలా? పొయ్యి మీదకి ఎదుక్కోవాలా? తెల్లారిలేత్తే మనకి ఏవి ఉన్నాయో ఏవి లేవో అని ఒకటే తడివిట్లు. ఎందుకొచ్చిన గొడవ చెప్పు ఇదంతా" వెటకారంగా అన్నాడు గుంపులో నిలబడ్డ ఇంకొకాయన.

"ఆ ఏం డబ్బుల్లెండి పాపం. ఎన్నొస్తాయ్ నా బొంద. మా వస్తే సాయంత్రానికి ఓ యాభై లేదంటే వందా అంతకన్నా ఏం వస్తాయి చెప్పండి. ముగ్గురు బ్రతకాలంటే అవో మూలకొస్తాయా?" బొంద అనే పదాన్ని వత్తి పలుకుతూ చదువుకున్నాడిలా కనిపిస్తున్నాయన వత్తాసు.

"సాయంత్రానికి యాభైయ్యా? భలేవారండి మీరు. చిన్నపిల్లలున్నారుగా సెంటిమెంటు కోసం. వాళ్ళే ఆమె ఆస్తి. ఎంతమందిని చూడ్డం లేదు. ఎంతలేదన్నా రెండు మూడొందలు తక్కువ రావు రోజుకి నేననుకోవటం. ఇక వీళ్ళు తినేది రోడ్డు పక్క తిళ్ళేగా. ఈలోగా ఎవడన్నా నాబోటోడు పైసలెందుకులే వెయ్యటం, ఆటితో మత్తుగా తాగేసి పడుకుంటారు, దానికంటే ఏ అరటిపళ్ళులాంటివో లేక రాత్రి రైల్లో తినగా మిగిలిన పులిహోరో, చపాతీలో, పెరుగన్నమో పడెయ్యటానికిష్టం లేక వీళ్ళకిస్తే కాస్త తిననైన తింటారు కడుపు నిండుద్దని వేసారనుకోండి. ఇంక అవ్వాళ్టికి ఆ ఖర్చు కూడా ఉండదు ఏవంటారు? అయినా మీరు పేపరు చదవరనుకుంటా. ఫలానా చోట ముష్టివానికి రెండిళ్ళున్నాయని, బ్యాంకు బ్యాలన్సులున్నాయని గోనె పట్టా కింద లక్షల్లక్షల నోట్లని తెల్లారి లేస్తే పేపర్లనిండా ఇవే సంగతులు కదండీ బాబూ. ఏం చెప్తారండి మీరు. యాభయ్యంట యాభయ్. గంటలో వస్తాయ్ యాభయ్." వెటకారంగా అంటూ భళ్ళున నవ్వాడు. నవ్వుతూ నవ్వుతూనే ఆ కార్యకర్త వైపు చూస్తూ "పక్కోడి ప్రాణం పోతన్నా పట్టించుకోరమ్మా ఈ జనాలు. రూపాయికి ఏమీ రావటం లేదు కాబట్టి ఆ రూపాయేదో ఇటే పారేస్తే కాస్త పుణ్యమైనా వస్తాదని, దాంతో స్వర్గంలో సీటు గ్యారంటీ అనుకునే మనుషులున్నంత కాలం వీళ్ళకి తిరుగులేదమ్మా. ఇంకో విషయం గమనించారో లేదో కానీ బండి గోదారి బ్రిడ్జెక్కిందో లేదో ఫటఫటా పడిపోతాయ్ గోదాట్లో పైసలు. అదెంత మూర్ఖత్వమో చూడు. నువ్వెన్ని చెప్పు వాళ్ళు మారరు తల్లీ నీ కష్టం వృధా.. నీ.."

ఆయనింకా ఏదో చెప్పబోతూండగానే ఆ కార్యకర్త సర్రున లేచి నిల్చుని "కరెక్ట్‌గా చెప్పారండి. నిజం మీరు దానం అనుకుని విసిరిన ఆ నాణెం ఒక జీవితాన్నే నాశనం చేసేస్తుంది. మీరు పుణ్యం అనుకుంటున్నారు కానీ ఆలోచించటం లేదు. అంతేకాదు ఆ నాణమే బాలల్లో సహజ సిద్ధంగా ఉండే అమాయకత్వాన్నీ దూరం చేసి వాళ్ళ బాల్యాన్ని చేతులు సాచే స్థితికి అంత చిన్నతనంలోనే

నెట్టేస్తుంది. అంత చిన్న వయసులో అప్పనంగా వస్తున్న ఆ నాణేల వెదుకులాటలో వాళ్ళ జీవితాన్ని అక్కడే ఆపేస్తుంది కూడా. అంతకంటే ఘోరమైన విషయం ఏమంటే క్రమంగా ఆ నాణెం వీళ్ళని యాచక ముఠాల బారిన పడేయటమే కాక రేపటి దొంగగానో, ఒక మాఫియా ముఠా సభ్యుడిగానో లేకపోతే ఒక వ్యభిచారిగానో కూడా మార్చేయచ్చు. అంతెందుకు క్రమేణా వీళ్ళు మాదక ద్రవ్యాలకు బానిసలవ్వటమే కాక, వీళ్ళ ద్వారా అయితే ఎవరికీ అనుమానం రాదని కాలేజీలకి యూనివర్శిటీలకి మత్తు మందుల్ని సరఫరా చేసేందుకు వీళ్ళని పావుగా వాడుకుంటున్న సంఘటనలకీ కొదవలేదు. ఎవరూ దీని గురించి సీరియస్‌గా ఆలోచించటం లేదుగానీ ఆలోచిస్తే తెలుస్తుంది పుణ్యమనుకునో, జాలితోనో, పోనీలే అనుకునే మనం వేసే ఒకో నాణెం యాచన అనే ఒక భయంకరమైన కంపెనీకి మనం పెట్టుబడి పెడుతున్నామని తద్వారా ఒక విష సంస్కృతికి తెర తీస్తున్నామని, సమాజం భ్రష్టు పట్టిపోవటానికి కారకులం అవుతున్నామని"

ఆవేశంగా అంటూనే క్షణం పాటు ఆగి తన భుజాన వేలాడుతున్న సంచిలోంచి మంచినీళ్ళ సీసా బయటికి తీసి రెండు గుక్కలు తాగి దాన్ని సంచిలో పెట్టేస్తూ మళ్ళీ మొదలెట్టింది.

"ఆలోచిస్తే ఈ అపసవ్యతలకి సమస్యలకి మూలకారణం మనమే అనిపిస్తుంది. మరి అలాంటప్పుడు పరిష్కార కర్తలం మనం కామా? ఆలోచించండి. అందుకే ఈ అస్తవ్యస్త సమాజానికి, ఈ భయంకర విధ్వంసానికి మనం ఎందుకు కర్తలం కావాలి? మనం చేయీ చేయీ కలిపి వాటిని ఒక సక్రమమైన మార్గంలో నడిపించలేమా? చెప్పండి? అందుకే రండి పిడికిలి బిగించి ముందుకు రండి. ఒక నవసమాజ నిర్మాణానికి ఇటుకలు అందిస్తూ సహాయపడదాం" చెబుతూనే సంచిలోంచి కరపత్రాలు తీసి పంచి పెడుతున్న కార్యకర్త మాటలు పూర్తి కాకుండానే ఎవరూ ఊహించని విధంగా అందరూ ఆశ్చర్యపోయేలా

"ఏందమ్మో అందరూ ఇంటన్నారనా తెగ ఇదయిపోతన్నావ్. ఏంటి ఏటేటో మాట్టాడేత్తన్నావ్ నువ్వన్నయ్ ఏయీ మాకు దెలవదు అడుక్కోవటం, ఆకలి ఏలకి ఏద్దారొకితే అది తినేత్తం తప్ప. ఇందులో ఎవురికి మేం అన్నేయం సేత్తన్నామని నువ్వలా సెప్తున్నావ్ ఈఅల్లందరికీని నేనేమన్నా దరమం చెయ్యండని ఓర్నయినా అడిగినానా? లేదే నా మానాన నేను నా ముందో గుడ్డ పరచుకుని నా బిడ్డల్నేసుకుని కూకున్నాను. అది తప్పెలా అయిపోద్ది. ఆ సారన్నట్టు మాకేసి డబ్బులిసిరితే మీకు పున్నెం వత్తాదని మీరిసురుతున్నారు తల్లీ. నా మీన నా బిడ్డల మీన జాలితో ఏత్తన్నారా? నేనేమన్నా ఎల్లే వాళ్ళ మీద వచ్చేవాల్ల మీదపడి లాక్కున్నానా? రక్కినానా? కోట్లాడినానా? దవురుజన్యం సేసినానా? పైగా అయ్యేమన్నా పదిరూపాలా? ఎయ్యి రూపాలా బోడి రూపాయి కాసు ఏవత్తందమ్మా రూపాయికి? టీసుక్కొత్తందా." ఆవేశంగా, కోపంగా అంటూనే గట్టిగా ఊపిరి ఎగబీలుస్తూ మళ్ళీ అంది.

"ఇలా అడుక్కుంటం మేవియ్యాల కొత్తగా మొదలెట్టలేత్తలీ. నా తాత ముత్తాతల కాడ్నించీ ఉన్నదే ఇయ్యాల కొత్తగా సేత్తన్నాననుకున్నవేమో మాయమ్మా ఇదే పని సేసింది. మా నానా ఇదే పని సేసేడు. మా తాత ముత్తాతల కాడ్నించీ మాదిదే పని. ఇది మా కులపోల్ల పని. ఇయ్యాల తప్పవతాకి ఇయ్యాలే పుట్టిందా ఈ అడుక్కుతింటం అనేది. అన్ని తెలిసి నోరు మీరే సెప్పండయ్యా? మేమెవరికి ఏమన్యాయం సేసినాం తల్లీ మేమిలా అడుక్కోవటం వల్ల ఎవరికీ నట్టంలేదే? ఎవర్నీ ఇబ్బంది పెట్టలేదే? మరి మా మీదెందుకమ్మా మీకింత గస.."

రోషంతో ఆమె అంటూన్న మాటలు, ఆ మాటల్లో తీక్షణత అక్కడెవర్నీ కదలనివ్వకపోవటమే కాక ఆలోచింప చేసేలా ఉండటంతో మరింత ఆసక్తి పెరిగి ఆశ్చర్యంగా ఆమెనే చూస్తున్నారు సూర్యంతో సహా - అంతా.

"ఏందమ్మా ఏదో వ్యభిసారం గ్రటా అంటన్నావ్. నేనూ నా బిడ్డలూ నీకెలా కనిపిత్తన్నాం తల్లీ సూడముచ్చటగా ఉన్న నా బిడ్డల్ని అంత మాటంటాకి నీకు నోరెలా వచ్చింది? కావాలంటే ఎల్లి సూడు మూడో నంబరు ప్లాట్ ఫారం మీద పదో నంబరు దిమ్మకాడున్న ఆ కుంటోడే నా మొగుడు. ఆడూ గౌర్నంగా బెతికినోడే రైల్లల్లో సమోసాలమ్మీవోడు. పెట్టిమారి ఇంకో పెట్లోకి మారతా కాలుజారి రైలు

కిందడి కాలు పోగొట్టుకున్నాడు. మాయాయనేవీ అన్నేయంగా సెయ్యలా యాపారం. ఆడు నాయంగా సమోసాలమ్మినన్నాళ్ళూ ఆడి సంపాదన పెద్దయ్యోర్ల లంచాలకే సరిపొయ్యే. ఆనాడా పైసలు తీసుకున్న నాయాళ్ళెవరూ ఈడికి కాలిరిగిందని, పెళ్ళాం పిల్లలున్నోడు ఎలా బెతుకుతాడని జాలితో పదిపైసలు కూడా ఎడం సేత్తో ఇసరలా. యవరాదుకున్నారు అయ్యాల? ఈ రైల్వే వోల్లు గానీ గవర్నమెంటోల్లు గానీ, ఇసుమంటి పెద్ద మనసులు గాని రూపాయిచ్చిన పాపానబోలేదు. మాయాయన అక్కడడుక్కుంటే నేనిక్కడ అడుక్కుంటన్నా. ఎవరికి నట్టం ఇందులో. ఈ అడుక్కోవటంలో దరమం ఉంది, నాయం ఉంది, దయుంది. అంతేగానీ తప్పని నా ఎదురుగ్గా సెప్పండి సూద్దాం. పేద్ద సెప్పొచ్చారు. హోములో జేరమని ఆయమ్మ సెప్పటం ఈ అయ్యలు ఆయమ్మకి వంతపల్కటం. సానా బాగుంది. ఇంత సెప్పున్నావ్ గందా. ఒక్కమాట సెప్పు అడగతన్నా. సింపేసిన కాయితం ముక్కల్లే గాలెటు ఈస్తే అటెగిరి, ఎండకి ఎండుతా వరసంలో తడిసి యాడ కడతేరతాయో తెలవని బతుకులు మాయి. మాకు ఎలచ్చన్లలో ఓటు లేకపోయేతలికి మమ్మల్ని, మా కట్టాల్ని పట్టిచ్చుకునే వోరు లేక రోగాలొత్తే వైజ్జగం జరక్క ఆ రోగంతోనే రోడ్ల పక్కన పడుండి ఈగల్నీ దోమల్నీ తోలుకుంటా ఏ టైయిములో సత్తామో ఎలా సత్తామో, సచ్చాకా ఏమవుతామో దెలవని బతుకులు మావి. అందుకే సెప్తన్నా సిన్న ఇంటిజాగా గానీ, తెల్ల రేసన్ కారుడు గానీ ఇప్పిచ్చగలవా? సెప్పు ఆ హోమూ గీమూ పక్కనెట్టి కనీసం ఓ తెల్లకార్డు ఇప్పిత్తే వైజ్జగమన్నా సేపిచ్చుకుంటాం తల్లీ? ఇప్పియ్యగలవా? నీ వల్లయితదా? నువ్వది సేసిన్నాడు సత్తెపెమానకంగా మేమీ పని మానేసి కాయా కట్టం సేసుకుని నీ పోటో ఎట్టుకుని పూజిత్తాం మా కులపోల్లమంతా. సెప్పుతల్లీ ఎన్నేల్లనించో ఈడనే అడుక్కుతింటా బెతుకుతున్నాం గందా ఒక్క తెల్ల రేసన్ కారు డిప్పియ్యగలవా? సెప్పు నీకు దండం పెడతా లెచ్చర్లిత్తం కాదు. సెప్పు తల్లీ కూటికి లోటు లేనే లేత్తల్లీ ఆరోగ్గేలు గావాల నువ్వా కారుడిప్పిస్తే'' అంటూ ఆ యాచకురాలు సెయ్యెత్తి ఏడుస్తూ దండం పెట్టేసరికి పిల్లలు కూడా తల్లితో పాటు ఏడుస్తూ పెడుతున్న దండాలు అక్కడున్న వాళ్ళ మనసుల్ని కలచివెయ్యగా అవాక్కయి వింటున్నారంతా. ఆమె అడిగే ప్రశ్నలకి జవాబులు కానీ, అడుగుతున్న సహాయం కానీ సాధ్యం కాదని అక్కడున్న వాళ్ళ ముఖాలే చెబుతున్నాయ్.

ఈ సందట్లో ఎప్పుడెళ్ళిపోయిందో ఆ కార్యకర్త జాడే లేదు.

అదంతా గుర్తొచ్చి రకరకాల ప్రశ్నలు, ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోగా ఏం చెయ్యాలో తోచక అక్కడే టేబుల్ మీద పురికొసతో కట్టి ఉన్న న్యూస్ పేపర్లని పురికొస ఊడదీసి ఓపెన్ చేశాడు. రెండు రోజులు ఊరెళ్ళటంతో పేపరు వాడు విసిరినవి విసిరినట్టున్నాయ్. తాళం తీసి లోపలికి వస్తూనే గుమ్మం ముందు పడున్న వాటిని తెచ్చి అక్కడున్న టేబుల్ మీద పడేశాడు రాత్రి. ఆ పేపర్లు తిరగేస్తూ కూర్చున్నాడు సూర్యం.

ఏ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం, నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం అన్నట్టుగా ఏ పేజీ తిరగేసినా

''రాత్రి పొద్దుపోయాకా భాగ్యనగరంలో ప్రముఖ ఐదు నక్షత్రాల హోటల్పై పోలీసుల రైడింగ్. పట్టుబడిన వారు ఉన్నత వర్గానికి చెందిన యువతీ యువకులుగా గుర్తింపు''

''మాదక ద్రవ్యాలను విక్రయిస్తూ పట్టుబడ్డ నైజీరియన్ మూలాలు ఫిలిం నగర్లో''

''గనుల శాఖ ముఖ్య కార్యదర్శికి బెయిల్ నిరాకరణ''

''లంచం తీసుకున్న కేసులో జాతీయ పార్టీ అధ్యక్షునికి ఏడాది జైలుశిక్ష, నలభైవేల జరిమానా'' ''విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనం విలువ లక్షల కోట్లు అన్నా హజారే'' ''వారసత్వ కేసులో సీనియర్ నాయకుని వద్ద నుంచి బలవంతం గానైనా డి.ఎన్.ఎ.టెస్ కొరకు ఇంటికెళ్ళి రక్తనమూన సేకరించండి'' సుప్రీం కోర్టు హుకుం.

"2జి స్పెక్ట్రం కేటాయింపుల్లో చేతులు మారిన సొమ్ము విలువ లక్షా డెబ్బై అయిదు వేల కోట్లు" "వరకట్న వేధింపుల కేసులో పోలీసు అధికారి అరెస్ట్"

"జూనియర్ ఆర్టిస్ట్ వరాచౌదరి వద్ద దొరికిన ఫోన్ నంబర్లలో రాజకీయ ప్రముఖులు, పోలీసు అధికార్లు, సినీనటుల ఫోన్ నంబర్లు, నీలిచిత్రాలు, సీ.డీల్లో రికార్డు చేసిన అశ్లీల సంభాషణలు"

ఏమిటి ఇదంతా? ఎందుకు జరుగుతూంది ఇలా? ఎవరు వీళ్ళంతా? ఒక వ్యాపార వేత్తగా, బ్యూరో క్రాట్‌గా, రక్షణ కల్పించాల్సిన పోలీసు ఉన్నతాధికారిగా, ప్రజలచేత, ప్రజల కొరకు, ప్రజల వలన అనే సిద్దాంతం ప్రాతిపదికగా ఏర్పడ్డ ప్రజాస్వామ్యంలో ప్రజల్ని పాలించటానికి ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధిగా ఉన్నత స్థానాల్లో ఉంటూ పదిమందికి ఆదర్శంగా ఉండాల్సిన వీళ్ళు ఎందుకిలా తయారయ్యారు? ఎవరు దీనికి కారణం?

జీవితంలో కేవలం డబ్బు, డబ్బుతో పొందే విలాసాలు తప్ప ఇంకేం లేవా?

చిన్నప్పటి నుంచీ ఎంతో క్రమశిక్షణతో కాన్వెంట్ చదువులు చదివి నేర్చుకున్న నీతిని, విజ్ఞానాన్ని పక్కదారి పట్టించి డబ్బు సంపాదనే ధ్యేయంగా నీతి నియమాలకి తిలోదకాలిచ్చి అవినీతిపరులకు కొమ్ముకాసే వీళ్ళు సమాజానికి ఎక్కువ ప్రమాదకారులా? దారికి ఒక పక్కగా తన మానాన తాను కూర్చుని ఎవరయినా ఒక రూపాయి దానం చేయకపోతారా టీ నీళ్ళు తాగచ్చని ఆశగా ఎదురు చూసే ఒక యాచకురాలు సమాజానికి ఎక్కువ ప్రమాదమా?

ఆ కార్యకర్త చెప్పిన విధంగా చూస్తే మాఫియా ముఠాలుగా, మాదక ద్రవ్య సరఫరాదారులుగా, సంఘవ్యతిరేక శక్తులూ, దొంగలూ, వ్యభిచారులుగా తయారై సమాజాన్ని అధోగతి పాల్జేసిన వీళ్ళంతా యాచకులుగా జీవితాన్ని ప్రారంభించి ఎవరూ జ్ఞానబోధ చేయక, ఏ హోంలోనూ చేర్చి ఎవరూ వీళ్ళని ఉద్ధరించకపోవటం వల్ల ఈ విధంగా పెడదారులు పట్టిన వారై ఉండాలి. మరి అంతేగా?

ఆ కార్యకర్త ప్రయత్నం, అభిప్రాయం ఎంతవరకూ సమంజసం? అనాదిగా జానెడు పొట్టకోసం చేయిచాపే యాచకులే దొంగలూ దోపిడీదార్లుగా మారుతున్నారన్న ఒక అభిప్రాయం సమాజంలో పాతుకుపోయింది. ఒక యాచకుడు యాచన చేసినా, ఒక వ్యభిచారి వ్యభిచారం చేసినా అది కేవలం ఆకలి తీర్చుకోవటానికే. ఎంతసేపు యాచించినా ఆ యాచకురాలు చెప్పినట్టుగా వాళ్ళు చివరికి వైద్యం కూడా కరువై దిక్కులేని చావు చావాల్సిందే తప్ప వాళ్ళు ఉన్నత స్థానాలకు ఎగబాకిన సందర్భాలెక్కడా లేవు చరిత్రలో కడుపు నిండక వాళ్ళు అలా చేస్తుంటే కడుపు నిండీ నవనాగరిక సమాజానికి నిర్మాతలమని చెప్పుకునే వీళ్ళు చేస్తున్నదేమిటి? చేసేదెందుకు? పేదవాళ్ళూ, యాచకులే సంఘవిద్రోహశక్తులుగా మారుతున్నారని భావించినప్పుడు వాళ్ళని హోంలో చేరిస్తే ఈ సమస్యకి శాశ్వత పరిష్కారం లభించినట్లని, మరి అలాంటి వాళ్ళను సంస్కరించటానికి ఆమె చేసిన ప్రయత్నమే నిజమైతే గనుక మరి ఇప్పటికే అలా అన్నిరకాలుగా సంఘవిద్రోహ శక్తులుగా తయారైన వారిని దారిలో పెట్టటానికి, వారిని బాగు చేయటం కోసం ఏ ప్రయత్నం చెయ్యాలి? అది ఎవరి వల్ల అవుతుంది? అసలు సాధ్యమవుతుందా? ఏ ఒక్క ప్రశ్నకీ సమాధానం తెలియని పరిస్థితుల్లో మనసంతా చికాగ్గా తయారై, గందరగోళంగా అనిపించగా

"అమ్మో ఇదో పెద్ద చిక్కుముడి దీన్ని ఎవరు విడదీయగలరు?" అని తనలో తాననుకుంటూ ఆలోచనల్తో బుర్రవేడెక్కిపోగా పేపర్లన్నీ మడచి ఓ మూలన పడేసి పెరట్లోంచి కూ..కూ.. అంటూ కోయిల కూతలు వినిపించేసరికి అప్పుడే తెల్లారిపోయిందా అనుకుంటా వంటింట్లో కెళ్ళి కాఫీ కలుపుకుని వీధి తలుపు తెరిచి అప్పటికే అక్కడ పడున్న న్యూస్ పేపర్‌ని తీసుకుని మళ్ళీ ముందు గదిలోకొచ్చి కూర్చున్నాడు సూర్యం. శుభమా అంటూ పేపర్ తెరిచాడో లేదో తాటికాయలంతా అక్షరాలతో ఫ్రంట్ పేజీలో కనిపించిందా వార్త.

"అక్రమ జీవోల జారీలో మంత్రుల అరెస్ట్" అంటూ. భగవంతుడా ఇలాంటి వార్తలు తప్ప ఈ రాష్ట్రంలో పరిపాలనలో భాగంగా రాష్ట్ర ప్రజల బాగోగులకు సంబంధించిన వార్తలకి తావే లేదా అని తనలో తానే విరక్తిగా అనుకుంటూ, ఉదయాన్నే కాస్త భక్తికి సంబంధించినది ఏదైనా వింటే తప్ప మనసు ప్రశాంతంగా ఉండదని భావించి కాఫీ తాగుతూనే రిమోట్ చేతిలోకి తీసుకుని టీవీ ఆన్ చేశాడు. భక్తి ఛానల్ కోసం ఛానల్స్ మారుస్తూంటే మధ్యలో ఏదో ఛానల్ లో ఎవరో స్వామీజీలా అనిపించి ఆయన భక్తిప్రభోదాలు విందామని ఛానల్స్ మార్చటం కాస్త ఆపి చూసేసరికి మరింత షాక్‌కి గురయ్యాడు సూర్యం.

ఎవరో స్వామి లీలానంద అట. ఒక పక్క ప్రజలు ఆయన పాదాలపై పడి దండాలు పెడుతున్న సన్నివేశాలు చూపిస్తూనే మరో పక్క బ్రేకింగ్ న్యూస్ అంటూ "జూనియర్ నటితో స్వామి లీలానంద శృంగార లీలలు" అంటూ ఆ నటితో అతను సాగిస్తున్న జుగుప్సాకర సీన్లని చూస్తూనే భళ్ళున వాంతి చేసుకున్నాడు సూర్యం అప్పటిదాకా తాగిన కాఫీని.

ఆ తర్వాత ఏ ఛానల్ చూసినా ఇదే న్యూస్.

ఒకలాంటి విరక్తితో టీవీ ఆఫ్ చేయబోతూంటే.

"ఇప్పుడే అందిన వార్త" అంటున్న న్యూస్ రీడర్ గొంతులో కంగారు చూసి

"సర్లే అదేమిటో చూసి అప్పుడు కట్టేద్దాంలే టీ.వి. ఆఫీసుకి కూడా టైమవుతూంది కదా అనుకుంటూ అలాగే నిలబడి చూస్తున్నాడేమో అప్పుడు వినపడిందతని చెవికి కంచే చేను, గట్టూ, బావీ, నీరూ ఏకమై పైరునే కాదు అసలు పొలాన్నే మాయం చేసిన మాట అదేమంటే.

"అక్రమాస్తుల కేసులో ముఖ్యనేత అరెస్ట్. రాష్ట్ర వ్యాప్తంగా అల్లర్లకు సిద్దపడ్డ కార్యకర్తలు. ముందస్తు చర్యగా అదుపులోకి తీసుకున్న పోలీసులు"

"నిజమే ఇందాకనుకున్నట్టు ఇది ఎవరూ విడదీయటానికి సాధ్యం కానీ చిక్కుముడే" తనలో తాననుకుంటూ ఆఫీసుకి టైమవుతుంటే టవల్ భుజాన వేసుకుని స్నానానికి బయలుదేరాడు సూర్యం.

## యుద్ధం — గన్నవరపు నరసింహమూర్తి

**గ్రీష్మం కావడంతో** తొమ్మిది గంటలకే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపడం మొదలుపెట్టాడు. శ్రీధర్ బస్టాండ్ చేరుకునేసరికి 'పల్లెవెలుగు' బస్సు హారన్ కొడుతూ వచ్చి ఆగింది. కొద్ది క్షణాల తరువాత బేగ్ చేత్తో పట్టుకుని బస్సు దిగుతున్న ప్రకాష్‌ని చూసి ఆనందంతో "ప్రకాష్" అంటూ చెయ్యి ఊపాడు శ్రీధర్. ప్రకాష్ కూడా శ్రీధర్ని చూసి చెయ్యి ఊపుతూ అతని దగ్గరకు వచ్చాడు.

"ఏరా! చాలా రోజులకి నీ దర్శనం ఇన్నాళ్ళ తరువాత నేను గుర్తుకొచ్చానట్రా?!" అన్నాడు చిరుకోపాన్ని ప్రదర్శిస్తూ శ్రీధర్.

"ఇప్పటికైనా వచ్చినందుకు సంతోషించు. అయినా నేను తెచ్చిన తీపి కబురు వింటే నీ కోపం పోయి ముఖం ఆనందంతో వెలిగిపోతుంది తెలుసా" అన్నాడు ప్రకాష్.

"ఇంక నా జీవితంలో తీపి కబుర్లేముంటాయిరా జరగవలసిన నష్టం ఏదో నా కాలు పోవడం ద్వారానే జరిగిపోయింది. సరే ఆ విషయాలన్నీ ఇప్పుడెందుకు గానీ వెళ్దాం పద" అంటూ వాకింగ్ స్టిక్‌ని నేలకి ఆన్చుతూ నడవటం మొదలు పెట్టాడు శ్రీధర్. అప్పుడు అతని కాలుని పరిశీలనగా చూసాడు ప్రకాష్. అంత పరిశీలనగా చూస్తే తప్ప పెట్టుడు కాలని తెలియదు.

శ్రీధర్ని అలా చూస్తుంటే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఒకప్పుడు ఎలా ఉండేవాడు శ్రీధర్. ఊరికే జలపాతంలా చురుగ్గా ఉండేవాడు. చిరుతలా పరిగెత్తేవాడు అటువంటివాడు ఇప్పుడు ఇలా ఒంటికాలుతో ఎలా నెగ్గుకొస్తున్నాడో?

"ఏంట్రా ప్రకాష్ మౌనంగా ఉన్నావ్? అర్జెంట్‌గా వస్తున్నానని నీ ఫోను రాగానే మొదట్లో చాలా కంగారు పడ్డాను. మీ ఇంట్లో అందరూ బాగున్నారా?"

"అంతా బాగున్నార్రా. అది సరే అప్పుడే నీ కాలుపోయి సంవత్సరం కావస్తోందంటే నమ్మబుద్ధికావటం లేదురా.

నిజానికి ఆ రోజుని తల్చుకుంటే నాకిప్పటికీ ఒళ్ళు గగుర్పొడుస్తుంటుంది. ఒక్క క్షణం.. నీ అడుగు ఆలస్యం అయివుంటే నీకా ప్రమాదం తప్పిఉండేది. ఏం చేస్తాం? ఏదీ మన చేతిలో లేదు. నిజానికి ఆ రోజు నీ వల్లే మన రెజిమెంట్ మొత్తం ప్రాణాలతో బయటపడింది. ఇప్పటికీ మన ఫ్రెండ్స్ ఎవ్వరు కనిపించినా నిన్ను తల్చుకోకుండా ఉండలేరు. అయినా ఈ విషయంలో దేవుడు నీకు అన్యాయం చేసాడనిపిస్తుంటుంది" కంట్లో తడిని రుమాలుతో తుడుచుకుంటూ చెప్పాడు ప్రకాష్.

"సర్లేరా నువ్వే అన్నట్లు ఏదీ మన చేతిలో లేదు. నా నుదుట అలా వ్రాసి ఉంది కాబోలు. అందుకే అలా జరిగింది. ఇంతకీ ఇప్పుడా విషయాలు ఎందుకు గానీ ఇంకేవైనా మాట్లాడు"

"ఇంతకీ ఈ జైపూర్ ఫుట్‌ని ఎప్పుడు పెట్టించుకున్నావ్? ఇప్పుడు సులభంగా నడవగలుగుతున్నావా?"

"ఇది పెట్టి నాలుగు నెలలైందిరా. మొదట్లో ఇబ్బందిగా ఉన్నా ఇప్పుడు అలవాటైపోయి ఫరవాలేదు బాగనే నడుస్తున్నాను"

అలా ఇద్దరూ మాట్లాడుతుండగానే శ్రీధర్ ఇల్లు వచ్చేసింది. ఇంటి వరండాలో కొందరు విద్యార్థులు చదువుకుంటూ కనిపించారు.

"ఏదో సమయం గడవటానికి ఉదయం, సాయంత్రాలు కొందరు పిల్లలకి ట్యూషన్లు ఉచితంగా చెబుతున్నాను" అన్నాడు శ్రీధర్.

"ఇంట్లో ఎవ్వరూ లేరేంట్రా? అయినా ఊరికి దూరంగా ఇక్కడ ఇల్లు కట్టావేంట్రా?" కుర్చీలో కూర్చుంటూ అడిగాడు ప్రకాష్.

"కార్గిల్ యుద్ధం ముగిసి నా కాలు పోయిన తరువాత ఇక్కడికి వచ్చేసరికి మా అమ్మ చనిపోయింది. అన్నదమ్ములు కూడబలుక్కుని నాకు సక్రమంగా రావలసిన పదెకరాల పొలానికి కేవలం ఆరు ఎకరాలే ఇచ్చి మిగతాది ఇవ్వమనీ గొడవచేసారు. యుద్ధానికి ముందు పిల్లనిస్తానన్న మామగారు నా కాలు పోవడం చూసి మా పెళ్ళిని రద్దుచేసాడు. ఇలా ఎన్నో సమస్యలు. అందుకే ఒంటరిగా ఊరికి దూరంగా ఇక్కడ ఇల్లు కట్టుకుని ఉంటున్నాను" బట్టలు మార్చుకుంటూ చెప్పాడు శ్రీధర్.

"నువ్వు చెబుతున్నవి వింటుంటే నాకు చాలా ఆశ్చర్యం కలుగుతోందిరా. మనుషుల్లో మరీ ఇంత స్వార్థమా?"

"ఈ ప్రపంచంలో స్వార్థం లేనిదెవ్వరికిరా. సర్లే ముందు స్నానపానాదులు కానివ్వు తరువాత మాట్లాడుకుందాం" అంటూ ప్రకాష్‌కి బాత్‌రూముని చూపించాడు.

ప్రకాష్ స్నానానికి వెళ్ళిన తరువాత శ్రీధర్‌కి గతం గుర్తుకు రాసాగింది. ప్రకాష్‌తో కార్గిల్ సెక్టార్‌లో గడిపిన రోజులు గుర్తుకురాసాగాయి. కార్గిల్ యుద్ధం గుర్తుకురాసాగింది. తను కాలు పోగొట్టుకున్న ఆ భయంకరమైన కాళరాత్రి గుర్తుకు వచ్చింది. అలా గతం అలలు అలలుగా అతని కళ్ళముందు కనిపించసాగింది.

కాశ్మీర్ లోని కార్గిల్ సెక్టార్, హేమంతం కావడంతో చలివిపరీతంగా ఉంది. మంచు వర్షంలా కురుస్తూ రహదారులన్నింటినీ కప్పేసింది. పాకిస్థాన్‌తో యుద్ధం మొదలై పదిరోజులు కావస్తోంది. శ్రీధర్ ఆ రెజిమెంట్‌లో ఓ సోల్జర్. అతను మిలట్రీలో చేరి రెండేళ్ళయింది. ప్రస్తుతం విమానాలతో పాకిస్థాన్ సేనలు తలదాచుకున్న బంకర్స్ మీద దాడులు చేస్తోంది. భారత వాయుసేన ఇంకా ఓ యాభై బంకర్స్ ఉన్నట్లు "రా" (రీసెర్చి అండ్ ఎనాలిసిస్ వింగ్) ద్వారా సమాచారం అందింది సైన్యానికి. వాటిని నాశనం చేస్తేనే యుద్ధం పూర్తవుతుంది.

శ్రీధర్ ఆ రోజు తన టెంట్‌లో విచారంగా కూర్చుని ఉన్నాడు.  ఈ యుద్ధం ఎప్పటికి పూర్తవుతుందో తను ఎప్పుడు ఇంటికి వెళతానో అని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అతనిది విజయనగరం దగ్గర ఒక పల్లె. శ్రీధర్ తల్లి లక్ష్మీదేవి బలవంతం చేసి అతన్ని మిలట్రీకి పంపింది. అతని ఇద్దరు అన్నలు పల్లెటూరులో వ్యవసాయం చేస్తుంటారు. నెలరోజుల క్రితం శ్రీధర్‌కి ఇంటినుంచి ఉత్తరం వచ్చింది. అందులో తల్లికి ఒంట్లో బాగోలేదని వెంటనే బయలుదేరి రమ్మనమని అతని పెద్దన్న వ్రాసాడు. అతను శలవు పెట్టి ఇంటికి వెళ్ళేసరికి ఆమె ఆయాసంతో బాధపడుతోంది. కానీ అదృష్టవశాత్తూ శ్రీధర్ వెళ్ళిన రెండురోజులకు ఆమె కొద్దిగా కోలుకుంది. కానీ తరచు తనకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతుండడంతో ఈసారి శ్రీధర్‌కి పెళ్ళిచేసెయ్యాలని నిశ్చయించుకుంది. అందుకే ఆ ఊళ్ళోని తమ దగ్గర బంధువు సూర్యారావు కూతురు మాధవితో శ్రీధర్ వివాహాన్ని కుదిర్చి ముహూర్తాలు పెట్టించింది. తను చనిపోయేలోపు ఆఖరికొడుకు శ్రీధర్ వివాహం చేసెయ్యాలనీ ఆమె కోరిక. శ్రీధర్ మరో నెలరోజులు శలవు పొడిగించాడు.

కానీ వారం రోజుల తరువాత పిడుగులా వచ్చింది టెలిగ్రామ్. కార్గిల్ యుద్ధం మొదలైందనీ, వెంటనే శలవుని రద్దు చేసుకుని తమ హెడ్ క్వార్టర్స్‌కి రిపోర్ట్ చెయ్యమని అందులో ఉంది. ఆ విధంగా అతని పెళ్ళి ముహూర్తం పొడిగించబడింది. మర్నాడే శ్రీధర్ కార్గిల్ బయలుదేరి వచ్చేసాడు మనిషైతే వచ్చాడు కానీ అతని మనసంతా ఇంటిమీదే ఉంది.

రాత్రంతా అతనిది పెట్రోల్ డ్యూటీ కాబట్టి సమయం గడిచిపోతోంది. ఆ రోజు శ్రీధర్ టెంట్‌లో ఉండగా ప్రక్క టెంట్‌లోని మరో తెలుగు సిపాయి ప్రకాష్ అతని దగ్గరకు వచ్చాడు.

"ఏరా శ్రీ ఏం చేస్తున్నావ్? కేంటిన్ కెళ్దాం పద. వేడిగా ఛాయ్ తాగితే మైండ్ ఫ్రెష్ అవుతుంది" అంటూ అతన్ని కెళ్దాం పద. వేడిగా ఛాయ్ తాగితే మైండ్ ఫ్రెష్ అవుతుంది" అంటూ అతన్ని కేంటిన్‌కి తీసుకెళ్ళాడు. ఛాయ్ త్రాగుతూ "ఏంట్రా ప్రకాష్ విషయాలు?" అని అడిగాడు శ్రీధర్.

"ఈ యుద్ధం ఇంకా రెండు నెలలకి పైగా కొనసాగేటట్లుందిరా. పాకిస్థాన్ వాళ్ళ బంకర్స్‌ని మనవాళ్ళు గుర్తించలేకపోతున్నారట. పాకిస్థాన్ కూడా ఈ యుద్ధాన్ని ఎలాగైనా పొడిగిద్దామనీ చూస్తోందట" అన్నాడు ప్రకాష్. తరువాత కొద్దిసేపు పిచ్చాపాటి మాట్లాడి వెళ్ళిపోయాడు ప్రకాష్,

అతని వెళ్ళిన తరువాత శ్రీధర్ తీవ్రంగా ఆలోచించసాగాడు. ఈ యుద్ధం ఎప్పుడు పూర్తౌతుంది. ఎప్పుడు తను ఊరువెళ్తాడు. అమ్మ ఆఖరి దినాల్లో ఆమె దగ్గరుండాలన్న కోరిక నెరవేరుతుందా? ఆలోచనల్తో అతని మస్తిష్కం వేడెక్కసాగింది. కాసేపటి తరువాత ఉత్తరాలేవైనా వచ్చాయేమోనని కనుక్కునేందుకు బేరెక్స్‌కి వెళ్ళాడు. అక్కడ హవాల్దారు కనుక్కుంటే ఒక ఉత్తరం వచ్చిందని అతనికి ఇచ్చాడు. అది అతని తల్లి లక్ష్మీదేవి రాసింది.

అందులో "దేశమాతకోసం యుద్ధం చెయ్యమనీ తన ఆరోగ్యం గురించి బాధపడవద్దనీ, యుద్ధం పూర్తైన తరువాతే రమ్మనమనీ" ఆమె వ్రాసింది. ఆ ఉత్తరం చదివిన తరువాత అతని మనస్సు శాంతించింది. మర్నాటి నుంచి పూర్తి స్థాయి యుద్ధం మొదలైంది. వారం

రోజుల్లో చాలా బంకర్స్ ఉన్నాయనీ వాటిలో చాలామంది శత్రు సైనికులు దాక్కుని ఉన్నారనీ రిపోర్ట్స్ రావడంతో శ్రీధర్ వాళ్ళ రెజిమెంట్ ఆ రాత్రే వాటిని నాశనం చెయ్యాలని నిశ్చయించుకుంది.

ఆ కొండని తెల్లవారి మూడుగంటల సమయంలో ఎక్కి వాళ్ళు దాక్కున్న బంకర్స్ మీద బోఫోర్స్ తుపాకీలతో ముట్టడించింది భారత సైన్యం. కానీ మన సైనికులు ఊహించినదానికన్నా అక్కడ పాకిస్థాన్ సైనికులు ఎక్కువగా ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకోవడం కష్టమైంది భారత సైన్యానికి. ఇరువురి మధ్య భీకర యుద్ధం జరిగింది. తెల్ల వారే దాకా వాళ్ళతో పోరాడటం చాలా కష్టం అనిపించసాగింది శ్రీధర్ బృందానికి. తెల్లవారితే యుద్ధ విమనాలు వస్తాయి. ఓ ప్రక్క ఫైరింగ్ ఇంకో ప్రక్క బంకర్స్‌ని పేల్చడం ఇలా రెండుగంటల పాటు భీకర పోరాటం జరిగింది. అప్పటికి చాలా బంకర్స్ నాశనం అయ్యాయి. చాలామంది పాక్ సైనికులు చనిపోయారు. చివరి బంక్‌ని ఎటాక్ చేసినప్పుడు దురదృష్టవశాత్తూ ఒక పాక్ సైనికుడు ఒక్కసారిగా ఆ కొండల్లో తుపాకుల మోత ఆగిపోయింది. భారత్ వెనకనుంచి జరిపిన కాల్పులు వల్ల ఆ బుల్లెట్ శ్రీధర్ కాల్లోకి చొచ్చుకుపోవడం వల్ల అతను నేలకొరిగిపోయాడు.

ఇంతలో తెల్లవారడంతో భారతయుద్ధ విమానాలు వచ్చి వాళ్ళ బంకర్స్ మీద దాడి చెయ్యడంతో చాలామంది శత్రు సైనికులంతా చనిపోయారు. మరికొందరు ప్రాణాలతో పట్టుబడ్డారు.

గాయపడ్డ శ్రీధర్‌ని హెలీకాప్టర్‌లో మిల్రటీ హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ తప్పని పరిస్థితులో కాలుకి ఆపరేషన్ చేసి దాన్ని తొలగించారు డాక్టర్లు. ఒక్కసారిగా ఆ కొండల్లో తుపాకుల తుపాకీల మోత ఆగిపోయింది. భారత్ విజయ పతాకం కార్గిల్ కొండల్లో రెపరెపలాడుతూ ఎగరసాగింది. ఆ రోజునుంచి వారం రోజుల పాటు దేశమంతా సంబరాలు చేసుకుంది.

కాలుపోగొట్టుకున్న శ్రీధర్ని మిల్రటీ విమానంలో విశాఖపట్నం తీసుకొచ్చి అక్కడినుంచి వేనులో అతనింటికి చేర్చారు. శ్రీధర్‌కి పోయిన తన కలుని చూస్తే దుఃఖం వేయసాగింది. తాము యుద్ధంలో గెలిచామన్న సంతోషం కన్నా ఒంటికాలుతో గడపబోయే భావిజీవితం గుర్తుకొచ్చి అతనికి భయం వేయసాగింది.

కానీ అతను ఇంటికి చేరేసరికి అతనికి అమ్మ గుమ్మంలో కనిపించలేదు. అతను గాబరాపడుతూ "అమ్మేది?" అని అడిగాడు తన అన్నల్ని. కొద్దిసేపు మౌనం తరువాత అతని పెద్దన్న కంట తడి పెడుతూ "నువ్వెళ్ళిన వారం రోజులకు అమ్మ చనిపోయిందిరా. చనిపోయే ముందు నీకు ధైర్యం చెప్పాలని లేవలేని స్థితిలో కూడా నీకు ఉత్తరం వ్రాసింది. చనిపోయేముందు నీకా విషయాన్ని చెప్పొద్దని మాట తీసుకుని మరీ కన్నుమూసింది" అని చెప్పాడు.

మరో రెండు రోజుల తరువాత అవిటివాడైన శ్రీధర్‌కి తన కూతురు మాధవినిచ్చి పెళ్ళిచేసి ఆమె జీవితాన్ని నాశనం చెయ్యలేననీ, అందుకే ఆ వివాహాన్ని రద్దుచేస్తున్నాననీ శ్రీధర్ కుటుంబానికి సూర్యారావు కబురు పంపాడు.

●●●

"ఇది రా జరిగింది ప్రకాష్ మనం కార్గిల్ కొండల్లో మంచులో తడుస్తూ శత్రువుల పడగనీడల మధ్య రెండేళ్ళు గడిపాము. అయినా సమయం ఎలా గడిచిపోయిందో తెలియదు. కానీ యుద్ధం తరువాత నాకాలు పోయి ఈ ఊరొచ్చిన తరువాత కాలం ముందుకు కదలటంలేదు" శ్రీధర్ చెప్పుకుపోతున్నాడు. ప్రకాష్, శ్రీధర్ ఇద్దరూ ఆ సాయంత్రం ఏటి ఒడ్డుకు వచ్చి కబుర్లు చెప్పుకోసాగారు.

"అయినా నీ కాలు పోవడానికి పెళ్ళికి ఏం సంబంధంరా? ఒకవేళ ఆ రోజు టెలిగ్రాం రాకుండా ఉండి మీ పెళ్ళి అయిన తరువాత యుద్ధంలో నీ కాలుపోతే ఏం చేసేవాడట?" కోపంగా అన్నాడు ప్రకాష్.

"ఈ ప్రపంచంలో చాలామంది స్వార్థంగానే ఆలోచిస్తార్రా. కానీ నీకో ఆశ్చర్యమైన విషయం చెబుతాను. నన్ను కాదని మాధవికి అమెరికాలో పనిచేస్తున్న అబ్బాయితో పెళ్ళి జరిపించాడు ఆమె తండ్రి. కానీ విధివక్రీకరించి పెళ్ళైన ఆర్నెల్లకే అతను రోడ్డు ప్రమాదంలో మరణించాడు. పాపం మాధవి ఇప్పుడు ఈ ఊళ్ళోనే తండ్రి దగ్గర ఒంటరిగా ఉంటోంది"

"శ్రీధర్ నీ విషయాలు వింటూ నేను వచ్చిన అసలు విషయం చెప్పడం మరచిపోయాను. ఈ సంవత్సరం గేలంట్రీ అవార్డ్‌కి రక్షణశాఖ నీ పేరుని నామినేట్ చేసింది. మొన్ననే ఢిల్లీ వెళ్ళినప్పుడు మన హెడ్ క్వార్టర్స్ ఆఫీసుకి వెళితే ఈ విషయం తెలిసింది. ఆ విషయాన్ని స్వయంగా నీతో చెప్పాలనే నేనొచ్చాను. కానీ ఇక్కడి నీ పరిస్థితిని చూస్తుంటే ఎందుకో నాకు ఆ విషయం చెప్పబుద్ధికాలేదు. నిజానికి ఓ సైనికుడికి రిపబ్లిక్ దినోత్సవం నాడు రాష్ట్రపతి చేతుల మీదుగా శౌర్యపతాకాన్ని తీసుకోవడం కన్నా గొప్ప విషయం ఏముంటుంది చెప్పు?!" కంట్లో నీటిని తుడుచుకుంటూ చెప్పాడు ప్రకాష్.

"ఈ సమాజాన్ని చూస్తుంటే నాకు జాలివేస్తోందిరా ప్రకాష్. రాను రాను మనుషుల మధ్య అనుబంధాలు మసకబారిపోతున్నాయ్. డబ్బే మనుషులకు ప్రధానంగా మారిపోవడం చాలా బాధకలిగిస్తోంది. పూర్వం యుద్ధంలో పాల్గొన్న సైనికులకు సమాజంలో చలా గౌరవం ఉండేది. ఇప్పుడు గౌరవం కాదుకదా కనీసం సానుభూతి కూడా దొరకటంలేదు. వీళ్ళని చూస్తుంటే ఇలాంటి స్వార్థపరుల కోసమా నేను యుద్ధంలో కాలు పోగొట్టుకున్నానన్న బాధకలుగుతోంది. అందుకే నువ్వు చెప్పిన వార్త నాకు అంతగా ఆనందం కలిగించలేదు, ఇటువంటి పరిస్థితుల్లో ఢిల్లీ వెళ్ళి ఆ పతాకాన్ని స్వీకరించాలన్న కోరిక నాకు లేదురా" శ్రీధర్ చెబుతుంటే ప్రకాష్ మౌనంగా వింటున్నాడు.

"మరిప్పుడేం చేస్తావురా? నాతో బాటు హైదరాబాద్ రాకూడదర్రా. నీక్కూడా నేను పని చేసే కంపెనీలో ఉద్యోగం చూస్తాను"

"నేనెక్కడికీ రానురా ప్రకాష్. ఇక్కడ నేను చేయవలసిన పనులు చాలా ఉన్నాయి. నా పొలాన్ని మా అన్నలు ఆక్రమించుకున్న విషయాన్ని తహసీల్దార్‌కి ఫిర్యాదు చేస్తే అతను డబ్బుకి అమ్ముడుపోయి నాకు న్యాయం చెయ్యటం లేదు. అలాగే ఈ ఊరి సర్పంచ్ పేదవాళ్ళ పేరుమీద బినామీ లోన్లు తీసుకుని వాళ్ళకి అన్యాయం చేస్తున్నాడు. ఈ ఊరి పిల్లలకు సరియైన విద్య, పేదవాళ్ళకు సరియైన వైద్యం అందటంలేదు. ఒక్క టీచరుగానీ, డాక్టర్లు కానీ ఈ ఊరుకి రావటం లేదు.

ఈ సమస్యలన్నింటి మీదా మనం కార్గిల్‌లో పాకిస్థాన్‌తో చేసిన యుద్ధం కన్నా పెద్ద యుద్ధమే చెయ్యవలసి ఉంది. అయినా వెనుకంజ వెయ్యను. ఈ యుద్ధంలో గెలుపు నాదే" ఆవేశంగా చెప్పాడు శ్రీధర్.

"పదరా శ్రీధర్. చీకటి పడుతోంది. మళ్ళీ నేను తెల్లవారగానే బయలుదేరాలి. నువ్వు చెయ్యబోయే యుద్ధంలో నీకు విజయం కలగాలనీ కోరుకుంటున్నాను" అన్నాడు లేస్తూ.

# హాశ్చర్యం!

## పోలంరాజు శారద

ఆఫీసు పనిమీద పొరుగూరు వెళ్ళి వారంరోజుల తరువాత ఇంటికి తిరిగి వచ్చిన గోపాల్‌కు ఇంటిముందర “వెల్‌కం” అని పూలతో అందమైన ముగ్గు స్వాగతం పలికింది. గుమ్మానికి బంతి చేమంతిపూల తోరణాలు ఆహ్వానం పలుకుతున్నాయి.

ఈ రోజూ ఏ పండుగ లేదే! ఈ అలంకరణ ఏమిటో అర్ధం కాక అయోమయంగా కాలింగ్ బెల్ నొక్కటమే తరువాయి తలుపు తెరుచుకుంది. ఎదురుగా దృశ్యం చూసి విస్తుపోయినాడు. హెవీ వర్క్ చేసిన చీర. మణికట్టునుండి మోచేతిదాకా మాచింగ్ గాజులు. అట్లాగే చేయంతా డిజైన్ వేసిన గోరింటాకు. ఎప్పుడు కొన్నదో ఏమో మెడలో చెవులకు బరువైన నగలు. ఫుల్ మేకప్. ఈ అవతారంతో భార్య సుధ చేతిలో బొకే అందించబోతూ "వెల్‌కం" అంటూ కనిపించేటప్పటికి కళ్ళుతిరిగినట్టు అయిపోయింది.

తేరుకొనే లోపే ఇవ్వబోతున్న బొకే కిందకు వాల్చేసి,"మీరా?" అంటూ నిరుత్సాహంగా లోపలికి నడిచింది.

ఇంక లోపల దృశ్యం వింతలోకంలోకి వచ్చినట్టు వుంది. ఇల్లంతా నీట్‌గా సర్ది వుంది. సోఫాలమీద అందమైన కవర్లు తొడిగిన కుషన్లు. సెంటర్ టీపాయ్ మీద గాజుపూలకుండీలో ఫ్రెష్ పూలు. గది కార్నర్‌లలో కొత్త పూలస్టాండ్‌లు అమర్చి వాటిలో కూడా పూలు అలంకరించి వున్నాయి. గుమ్మాలన్నిటికి చాల అందమైన కర్టెన్లు.

ఇదంతా చూసిన గోపాల్‌కు అదొక ఫైవ్ స్టార్ హోటల్ రూమా! అన్న భ్రమ కలిగి, "ఏమిటి సుధా ఇదంతా? ఇంత పొద్దున్నే ఇల్లంతా ఈ అలంకరణ ఏమిటి? కొత్తగా నీడ్రెస్, మేకప్ ఏమిటి?" అంటూ అడిగాడు. తండ్రిగొంతు విని అప్పటిదాకా గదుల్లోనే వున్న కూతురు, కొడుకు ఒక్కసారి బయటకు వచ్చారు. కొడుకు మంచి సిల్క్ కుర్తా పైజామా వేసుకొని వున్నాడు. కూతురు కూడా పట్టుపరికిణీ వోణీ వేసుకొని తల్లి లాగే నగలు మేకప్ చేసుకొని వుంది.

"అబ్బ, ఏం చెప్పమంటావు నాన్నా? నాలుగు రోజులనుండి అమ్మ ఇదే తంతు." అంటూండగానే మళ్ళీ కాలింగ్ బెల్‌మోగింది.

"పింకీ బాబీ, మీరు లోపలికి పోండి.ఏమండీ మీరుకూడా గదిలోకి వెళ్ళి స్నానం చేసి మంచి డ్రెస్ వేసుకోండి. నేను పిలిచేదాకా ఎవరూ బయటికి రావద్దు."అంటూ హడావుడిగా మళ్ళీ బొకే చేతిలోకి తీసుకొని “వెల్‌కం” అంటూ తలుపు తెరిచింది.

"ఏమిటమ్మగారూ ఇది. ప్రతిరోజూ వచ్చేదాన్ని నాలుగు రోజుల మట్టి చూస్తున్నాను. ఎందుకమ్మా నాకు ఈ పూలు? అయినా నేనొచ్చి చేసేదాకా ఆగకుండా ఇల్లంతా మీరే శుభ్రం చేస్తున్నారు." పనిమనిషి సిగ్గుపడుతూ లోపలికి వచ్చేటప్పటికి, సుధ విసుగ్గా, "నీ సిగ్గు బుగ్గయిపోనూ. పో పోయి పెరట్లో అంట్లు వున్నాయి తోము పో." అంటూ వచ్చి హాల్లో కూలబడింది.

మళ్ళీ గదుల్లో దాక్కున్న వాళ్ళంతా పుట్టల్లోంచి చీమల్లాగా బయటకు వచ్చారు.

ఇదంతా చూస్తున్న గోపాల్‌కు మహా చిరాగ్గా వుంది. అప్పటికే ప్రయాణం చేసి వచ్చిన అతనికి కప్పు కాఫీ కూడా ఇచ్చే దిక్కు లేదు.

"పింకీ ముందర ఒక కప్పు కాఫీ పట్రా. సుధా ఏమిటి ఇదంతా? ఈ అలంకరణ ఏమిటి, ఈ బొకేతో స్వాగతాలు పలకబోయి విసుగు చెందటం ఏమిటి?" మొహం నిరాశగా పెట్టుకొని ఇంకో సోఫాలో చతికిలబడ్డ సుధను అడిగాడు.

"నేనుచెప్పుతాను నాన్నా." అంటూ కాఫీ కప్పు పట్టుకొచ్చిన పింకీ పక్కన కూర్చొని చెప్పటం మొదలెట్టింది.

"హాహా టివి వాళ్ళు హాశ్చర్యం అనే కార్యక్రమం చేస్తారు కదా! అందులో రిజిస్టర్ చేసుకున్న వాళ్ళింటికి హఠాత్తుగా వచ్చి కుటుంబ సభ్యులను పరిచయం చేసుకొని వాళ్ళతో కాస్సేపు ఆటలుపాటలు అంటూ కాలక్షేపం చేసి పెట్టింది మింగి ఏవేవో గిఫ్ట్స్ ఇచ్చి పోతారు. అమ్మ ఆ కార్యక్రమానికి తన పేరు కూడా రిజిస్టర్ చేసిందిట. అదిగో అప్పటి నుండి ప్రతిరోజూ ఈ విధంగా ఇల్లంతా అలంకరించి, తాను అలంకరించుకొని మా దుంప తెంచుతూ మాక్కూడా ఈ అవతారం వేసి వాళ్ళ కోసం ఎదురు చూస్తూ రోజంతా కూర్చుంటుంది. మమ్మల్ని కాలేజీలకు కూడా పోనివ్వటం లేదు." తల్లిమీద ఈ నాలుగు రోజులగా పేరుకొన్న కసి అంతా తండ్రి ముందర ప్రదర్శించింది పింకి.

భార్య టివి ప్రోగ్రాంల పిచ్చి తెలిసిన గోపాల్‌కు అరికాలి మంట నెత్తికెక్కింది.

"ఏమిటి సుధా ఈ పిచ్చి పనులు. పో పోయి డ్రెస్ మార్చుకొనిరా. పిల్లలూ మీరిద్దరూ కూడా డ్రెస్ మార్చుకొని కాలేజీలకు పోండి. నేను కూడా ఆఫీసుకు వెళ్ళాలి. త్వరగా వంటచేసి నాకు భోజనం పెట్టు."

"అది కాదండీ. టివి వాళ్ళు ఏ సమయంలోనైనా రావచ్చు. కావాలంటే మీరు బయట ఏదైనా తిని ఆఫీసుకు వెళ్ళండి. కాని వాళ్ళు రాగానే మీకు ఫోన్ చేస్తాను. వెంటనే రావాలి సుమా! పింకీ బాబీ మటుకు ఇంట్లోనే వుంటారు." మొండిగా చెప్పింది. "అయినా వాళ్ళు మొన్న ఫోన్ చేసినప్పుడే చెప్పారు మీ ఇంటికి ఏ సమయంలోనైనా వస్తామని. వాళ్ళొచ్చే దాకా ఇంతే."

"నీ కర్మ. అయినా ఫోన్ లో వాళ్ళేం చెప్పారట?"

"అట్లా అడగండి చెప్పుతాను. నేను ఫోన్ చెసి రిజిస్టర్ చేయగానే వాళ్ళు చెప్పిన మాటలు. "థాంక్యూ ఫర్ రిజిస్టరింగ్ ఫర్ అవర్ ప్రోగ్రాం హాశ్చర్యం. మా టీం వారం రోజులలోగా మీ ఇంటికి రావచ్చు. చూస్తూనే వుండండి హాహా టివి." అని చెప్పారు కూడా"

గోపాల్ నెత్తిపట్టుకొని కూలబడ్డాడు. "ఓసి వెర్రి మొహమా! అది రికార్డెడ్ మెసేజి. ఎవరు ఫోన్ చేసినా అదే మెసేజి వస్తుంది. అయినా హఠాత్తుగా వచ్చి నిన్ను హాశ్చర్యం లో ముంచటానికి వాళ్ళంత ఎర్రిబాగులోళ్ళు కారు. వాళ్ళదంతా ఒక ప్లాన్డ్ గా వుంటుంది. ఎవరింటికి వెళ్ళబోతున్నారో వాళ్ళకి ముందే చెప్పి మరీ వెళ్ళుతారు. కాబట్టి మీరంతా మీమీ పనులు మామూలుగా చేసుకోండి. టివి వాళ్ళ ఫోన్ కోసం వెయిట్ చేయండి." అంటూ ఆఫీసుకు వెళ్ళిపోయినాడు.

సుధ మటుకు తన ఆశ వదులుకోదలుచుకోలేదు. తిరిగి సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి వచ్చిన గోపాల్‌కు మళ్ళీ అదే స్వాగతం ఎదురయింది.

అంటే కాలింగ్ బెల్మోగిన ప్రతిసారి ఇదే దృశ్యం పునరావృతం అవుతోందన్నమాట.

"ఇంక హాహా టివి వాళ్ళ ఆఫీసు టైం కూడా అయిపోయి వుంటుంది. ఆ బొకే అక్కడ పెట్టి ఇంక ఇంటి పని చూస్తావా?" అన్న భర్త హెచ్చరికతో సుధ తన అవతారం మార్చింది. కాని తెల్లారి మళ్ళీ అదే తంతు.

అనుకున్న వారం రోజులు గడిచిపోయాయి. ఈ వారం రోజులకు గాను ప్రతిరోజూ ఫ్రెష్ పూలకోసం బొకేలకోసం వాకిళ్ళకు కట్టిన తోరణాలకోసం అయిన ఖర్చు మాత్రం ఎదురుగా పెనుభూతంలా కనిపించింది గోపాల్‌కు.

ఆదివారం. వారం తరువాత అంతా ప్రశాంతంగా ఎటువంటి ఆర్భాటాలు లేకుండా భోజనాలు మధ్యాహ్నం టిఫిన్‌లు కూడా ముగించుకొని మామూలుగా వున్నారు. అంతా రిలాక్స్ అయి వున్నారు.

మామూలుగా అంటే ఆడవాళ్ళు నైటిలలో చింపిరి జుట్టుతో,

మగాళ్ళు మోకాళ్ళదాకా నిక్కర్లు చేతులు లేని బనియన్లు,

హాల్లో సోఫాల నిండా పుస్తకాలు, చదివి పడేసిన న్యూస్‌పేపర్లు.

ఒక కుర్చీలో టివి రిమోట్, ఇంకో దాంట్లో ఒక మొబైల్ ఫోన్,

కాళ్ళు బారచావుకొని ఒకరు, కాళ్ళకింద పుస్తకాలు తన్నుకుంటూ సోఫాకు అడ్డంగా ఒకరు.

అక్కడక్కడ అలంకరించిన ఫ్లవర్ వాజ్‌లలో వాడి ఎండిన పూలు.

బయట వాకిట్లోకి తొంగి చూస్తే, చెత్త ఎత్తేవాళ్ళు రానందున వారం రోజులుగా కొని పారేసిన ఎండిపోయినబొకేలు పూలతోరణాల కుప్ప.

ఎక్కడ పడితే అక్కడపొద్దుటి నుండి తాగిపెట్టిన ఎంగిలి కాఫీ కప్పులు, మంచినీళ్ళగ్లాసులు. అప్పుడే తిన్న టిఫిన్ ప్లేట్లు.

మర్రోజు పనిమనిషి వచ్చి శుభ్రం చేస్తేనే ఆ హాలుకు మోక్షం. అదీ మామూలు దృశ్యం.

టివిలో సినిమా.

కాలింగ్ బెల్ మోగింది. ఎవరికి కదల బుద్ధి కావటల్లేదు. అందరి మొహాల వంక చూసిన సుధ ఇంక తనకు తప్పేటట్టు లేదని తలుపు తీయటానికి లేచింది.

ఆరోజే మద్రాసు ఐఐటిలో చదువుకుంటూ సెలవలకని వచ్చాడు పెద్ద కొడుకు విశాల్.

"అమ్మా పొద్దున్న నువ్వు బాత్రూం లో వున్నప్పుడు ఒక ఫోన్ వచ్చింది. చెప్పటం మర్చేపోయాను. హాహాటివి నుండి మాట్లాడుతున్నాము. ఈ రోజు సాయంత్రం నాలుగు గంటలకు మా హాశ్చర్యం టీం మీ ఇంటికి వస్తున్నారు. ఏర్పాట్లు చేయండి. అన్నారు. నాకు ఒక్క ముక్క అర్ధం కాలేదు. ఎవడో జోక్ చేస్తున్నాడెమోననుకొన్నాను."

అతని మాటలు పూర్తికాకుండానే సుధ తలుపు తీయటం, ఎదురుగా కెమెరా పట్టుకొని ఒక కెమెరామాన్, రకరకాలుగా అలంకరించుకున్న ఒక ఏంకర్, "మేము హాహా టివి హాశ్చర్యం ప్రోగ్రాం కోసం వచ్..........చా.-.-...." బయట చెత్త చూసే అయోమయంగా వచ్చిన హాహా టివి హాశ్చర్యం టీం లోపలి దృశ్యం చూసి హాశ్చర్యంతో హాహాకారాలు చేసారు.

# యుటోపియా

భద్రిరాజు శ్రీనివాస్

**"అమ్మా యుటోపియా అంటే అర్థం ఏమిటి?"** చదువుతున్న పుస్తకం లోనుంచి తలయెత్తి అడిగింది అరుణిమ.

అరుణిమ 8 వ తరగతి చదువుతోంది తమ్ముడు అనిరుద్ 6 వ తరగతి చదువుతున్నాడు.

"వీకెండ్ అయినా తమ్ముడూ , నీవూ ఉదయమే నిద్ర లేచి ఎంత చక్కగా హోంవర్క్ చేసుకుంటూ శ్రద్ధగా చదువుకుంటున్నారో చూడు అదే యుటోపియా " , భర్త కుమార్ కి కాఫీ అందించి తను త్రాగుతూ , నవ్వుతూ అన్నది నిర్మల.

"అబ్బ నువ్వయినా చెప్పు డాడీ, సోమవారం టెస్ట్ ఉన్నది. "

"నే చెపుతాను ఇలా రావే అమ్మా , పిలిచింది" అరుంధతి గారు. అరుంధతి నిర్మల అత్తగారు, కుమార్ తల్లి.

" మీ అమ్మ చెప్పింది నిజమే. యుటోపియా అనే పదాన్ని మొట్ట మొదట సర్. థామస్ మోర్ అనే ఆయినా 1516 లో ఉపయోగించినారు, అదే పేరు గల పుస్తకంలో. ఏవిధమయిన దోషమూ , లోపమూ లేని సమాజం, లేక వ్యక్తి, లేక పరిస్థితులను తెలియ పరచడానికి "యుటోపియా" అనే పదాన్ని వాడుతూ ఉంటారు. ప్రపంచంలో యుద్ధాలు లేకుండా , అన్ని దేశాలవారూ అన్ని ప్రాంతాల వారూ, అన్ని మతాల వారూ గౌరవం తో ప్రేమాభిమానాలతో , త్యాగనిరతితో, నివసించే ఊహాజనిత వసుధయిక కుటుంబాన్ని యుటోపియా అని పిలువవచ్చు."

అరుంధతి గారు ఉపాధ్యాయని వృత్తిలో ఉండే వారు.

ఉద్యోగ విరమణ చేసి దాదాపు పదేళ్ళయినా చలాకీగా ఉంటూ , ఇరుగూ పోరుగుకు చేదోడు వాదోడుగా , ఉంటారు. కొడుకూ కోడలూ తమ యింటికి వచ్చినా తాము వారింటికి వచ్చినా , మనవరాలూ, మనవడూ, బామ్మగారి దగ్గర చేరి , తమకు అర్థంకాని విషయాలు అడగటం , ఆవిడకు చక్కని కాలక్షేపం. అక్కడక్కడా నెరసిన వెంట్రుకలున్నా ఒత్తుగా ఉండే పొడుగయిన జడతో , ఆరోగ్యంగా చలాకీ గా ఉండే అరుంధతి గారికి ఏడు పదుల వయస్సంటే నమ్మలేరెవరూ. రెండేళ్ళక్రితం భర్త పోయాక , ఆవిడే ఒక్కతే తన సొంత ఇంటిలోనే ఉన్నది ఎవరి పైనా ఆధారపడడం ఇష్టం లేని ఆవిడ.

"అత్తయ్యా.. ఎందుకు మీరొక్కళ్ళే ఉండటం? హైదరాబాద్ వొచ్చేయ్యండి. అందరం కలిసే ఉండొచ్చు" అని నిర్మల అంటే.
" లేదమ్మా.. ఈ ఇల్లు మీ మామయ్య గారూ నేనూ ఎంతో కష్టపడి దగ్గరుండి కట్టించుకున్నాము. ఈ యింటిని ఒక ఆస్తి కన్నా ఒక ఆత్మ బంధువుగా అనుకొన్నాము ఎప్పుడూ. అందులో లెక్కలేనన్ని జ్ఞాపకాలు, అనుభవాలు. కుమార్ ఈ ఇంటిలోనే పుట్టేడు. కొంత కాలం పాటు ఆ

జ్ఞాపకాలు నేమరేసుకుంటూ, ఆయన్ను తలచుకుంటూ ఇక్కాడే ఉంటానమ్మా. ఒక్కత్తినీ ఈ ఇంటిని మేనేజ్ చేయ్యలేని నాడు వేరే ఏర్పాట్లు అలోచిస్తాను."

ఒక ఏడాది గడిచింది.ఒకనాడు ఆమె నుంచి ఉత్తరం వొచ్చింది, "బాబూ.. ఒకసారి ఒచ్చి హైదరాబాద్ తీసుకుని వెళ్ళమని" "వెంటనే బయలుదేరండి, అత్తయ్య గారు ఇక్కడకు వస్తాననంటే చాలా సంతోషంగా ఉంది. ఆవిడ ఒక్కరూ అక్కడ ఉంటె ఎప్పుడు ఏదో దిగులు, బెంగాను ఎలా ఉన్నారో ఏమిటో అని."

"ఏమిటోయి నిర్మలా.. నువ్వు ఇలా ఉంటె "అత్తలేని కోడలుత్తమురాలూ ఓయమ్మా' అని ఘంటసాల గారు పడిన పాట ఉత్తదయి పోతుంది." నవ్వుతూ అన్నాడు కుమార్.

ఆమె నడుంచుట్టూ చెయ్యి వేసి దగ్గరకు లాక్కుంటూ. "చాల్లెండి అల్లరి, పిల్లలింట్లోనే ఉన్నారు. యీవేళ వీకెండ్.. మరిచిపోయారు అయ్యా గారు." నవ్వుతూ దూరం జరిగింది నిర్మల.

అత్తా కోడలూ అంటే సిగపట్లు పట్టుకోవాలన్నది ఒక రివాజు. "అందరూ అలానే ఉంటారా? అత్తయ్య గారెప్పుడూ నన్ను కూతురికన్నా ఎక్కువగా అపేక్ష గా చూస్తారు , నాకూ ఆమె అంటే గౌరవం. మధ్యలో మీకెందుకూ? ఉడుకుమోతా?" నవ్వుతూ అంది నిర్మల.

అత్తయ్య గారు వచ్చాక సమయం చక్కగా గడుస్తున్నది. పిల్లలిద్దరూ స్కూల్నించి రాగానే బామ్మగారితో కబుర్లు చెప్పి ఆడుకుంటారు.కుమార్ ఇంటికొచ్చే సరికి 5.30 –6 అవుతుంది ఆఫీసు నుండి. కలెక్టర్ ఆఫీసు లో అప్పర్ డివిజన్ క్లర్క్ గా పనిచేస్తున్నాడు. నిర్మల బాంకులో టెల్లర్ గా పనిచేస్తున్నది. 4 –5 గంటలకల్లా ఇంటికొచ్చేస్తుంది. నిర్మల ఇంటికిరాగానే కాఫీ అందిస్తున్న అత్తయ్య గారిని చూసి.. "మీకెందుకీ శ్రమ అత్తయ్యగారు? మీరు విశ్రాంతి తీసుకోండి. నేను చేస్తాను గా!" అన్నది ఆప్యాయంగా.

అరుంధతి గారు, కొడుకూ కోడలి సంసారంలో కలగచేసుకొనే వారు కాదు. చిన్న చిన్న పనులకి ఎవరి పైనా ఆధార పడే వారు కాదు. కొన్ని కొన్ని విషయాలలో నిర్మల వేరేలా ఆలోచించినా చేసినా, తప్పు పట్టడం, దెప్పడం లాంటివి అస్సలు యెరుగరు. ఒక్కో పనిని భిన్న వ్యక్తులు భిన్న పద్ధతుల్లో చేయవచ్చని , ప్రతిదానికి తప్పు, ఒప్పు ఉండవని ఆవిడ అభిప్రాయం.

"నేను ఇల్లాలిగా "రిటైర్" అయ్యాను రా. ఇది నా కోడలి సంసారం. సలహా ఏమయినా అడిగితే తోచింది చెప్పడమే తప్ప, నేను చెప్పినట్టే చెయ్యాలీ అనే మనస్తత్వం కాదు నాది వారు. విశ్రాంత ఉద్యోగులందరూ రోజూ ఆఫీసుకి వచ్చి కూచొని ప్రస్తుత ఉద్యోగులను దెప్పుతూ , మా టైంలో ఇలా చేసేవాళ్ళం అలా చేసేవాళ్ళం అంటూ అన్ని అన్ని వ్యవహారాల్లోనూ వేలు పెడితే ఎలావుంటుందో ఒకసారి ఆలోచించు" అనేవారు. ""అందరం ఎవరి పరిధిలో వారుండి, పరస్పరం గౌరవించుకొంటూ, భిన్నత్వంలోని ఔన్నత్యాన్ని గ్రహించి మసలుకొంటే ఎవరికి ఏ ఇబ్బందులూ ఉండవు. ""

అరుంధతిగారు వచ్చి నెల రోజులయ్యింది. రాత్రి భోజనాలయ్యాక బాల్కనీలో కూర్చొన్నారు నిర్మల, కుమార్, అరుంధతి గారూ. పిల్లలిద్దరూ వేరే గదిలో చదువుకొంటున్నారు.

"ఈ నెల రోజులూ ఒక్క రోజులా హాయిగా గడిచిపోయాయి. ఇక నేను ఈ వూళ్ళోనున్న "ఆనంద నిలయం" లో చేరాలనుకొంటున్నాను " అన్నారు అరుంధతి గారు.

"అదేమిటమ్మా?" ఆశ్చర్య పోయాడు కుమార్.

" అదేం మాటత్తయ్యా. మేమంతా ఉండగా వృ ద్ధాశ్రమంలో చేరతారా? నావల్ల ఏమయినా పొర పాటు జరిగిందా, మీకేమయినా ఇబ్బందిగా ఉందా , ఒక్కగానొక్క కొడుకూ తల్లిని వృద్ధాప్యంలో ఆదరించలేదని మీ అబ్బాయినీ, నన్నూ కూడా ఆడిపోసుకోరా నలుగురూ?" ఉద్విగ్నంగా , బాధతోనూ గుక్కతిప్పుకోకుండా మాట్లాడింది నిర్మల.

"అమ్మా నిర్మలా!, నీ అపేక్ష నాకు తెలియనిదా? నా ఈ నిర్ణయం, మనందరి మధ్య ప్రేమాభిమానాలను పెంచుతుందే తప్ప తగ్గించదు. చూడండి, మనిషి సంఘజీవి. సంఘానికీ సమాజానికీ గౌరవం ఇవ్వాలి, కానీ అన్నివేళలా ఎవరేమనుకుంటారో అనే భయానికి మన వ్యక్తిగత స్వేచ్ఛను తాకట్టుపెట్టి , మన జీవితాలకు సంబంధించిన నిర్ణయాలను చేస్తూ ఉంటె మనశ్శాంతి ఉండదు. అన్ని వేళల అందరినీ సంతృప్తి పరచలేము కదా. ఇక వృద్ధాప్యం అంటారా అసలు ఆ పేరుకి నేను ఒప్పుకోను. వృద్ధాప్యం అనేది శరీరానికి గాని మనస్సుకు కాదుకదా. వయస్సుతోనూ జీవితానుభావంతోనూ కొంత పరిణతి కలుగుతుంది కాదనను. అయితే కేవలం వయస్సు ప్రాతిపదికగా మనుష్యులను వర్గీకరించడం సబబు గాదు.. అందుకే నేను పిల్లలు నా కళ్ళకి దణ్ణం పెట్టటం లాంటివి ప్రోత్సహించను. పిల్లల్లో అందరి ఎడ పరస్పర గౌరవం తప్పకుండ నేర్పాలి కాని ఎవరి కాళ్ళ మీద ఎవరూ పడటం అనవసరం నా దృష్టిలో.వాళ్ళకన్నా కొన్ని సంవత్సరాల ముందర పుట్టిన కారణానికి నేనేదో దిగివచ్చిన దేవతను గాను కదా. విభిన్న ప్రవృత్తుల, కోరికల, భావాల, ఆలోచనల, ఆవేశాల నిరంతర పరస్పర సంఘర్షణకు నిలయమయిన అందరిలాంటి మనిషినే నేను. నా జీవిత రధానికి నేనే సారధిని కావాలని కోరుకుంటాను. అలాగే ఇతరుల జీవితలమీద వారి సాధికారతను గుర్తించి గౌరవిస్తాను. నేను వెళ్ళాలని నిర్ణయించుకొన్న చోటును వృద్ధాశ్రమం అనడాన్ని నేను వ్యతిరేకిస్తాను. అది మన సమాజంలో ఉన్న ఒక Mindset కి ప్రతిబింబం. సంస్కృతి సంప్రదాయం పేరుతో , మన పురాణాలూ, పుస్తకాలూ, సినిమాలు ఒక విధంగా అలోచించడానికి "కండిషన్" చేసాయి మనల్ని. కాలానుగుణంగా మన పూర్వ తరాల వారు వారికుండిన పరిజ్ఞానపు పరిధిలో వారిజీవితాలను నడుపుకున్నారు. ఆ పూర్వ సంప్రదాయంలోని మంచి గ్రహిస్తూనే మనకు తెలిసిన పరిజ్ఞానంతో అవుసరమయిన మార్పులుచేసుకొని మన జీవితాలను గడపాలి తప్ప మూర్ఖంగా "పాతకి" బందీలు కారాదు. గతం ఎప్పుడూ బంగారంలా కనిపిస్తుంది. ఒక ఉదాహరణ చెపుతాను. ఇప్పుడు వయస్సు మళ్ళి వేషాలు తగ్గినా సినిమా నటీనటుల , గాయకుల ఇంటర్వ్యూలేవయిన చూసినట్టయితే వాళ్ళు: యిప్పటి సినిమాల్లో విలువలేల తగ్గిపోతున్నాయో, వాళ్ళు నాయకా నాయకుల్లా ఒక వెలుగు వెలిగిన "పాత రోజుల్లో" అంటే 1980, 1990 దశకాల్లో వచ్చిన సినిమాలు ఎంత కళాత్మకంగా ఉండేవో చేపుకుని వాపోతూ ఉంటారు. అలాగే చాలామంది 1950-1960 దశకాలు తెలుగు సినిమాకు స్వర్ణయుగం అంటారు. అయితీ నేనీమధ్య ఓ పత్రికలో నటి స్వర్గీయ భానుమతిగారు 1959 లో వ్రాసిన ఒక వ్యాసం చదివాను. అందులో ఆమె "ఈ రోజుల్లో" సినిమా వ్యాపారాత్మకమై విలువలు పడిపోతున్నాయని వ్రాసారు.దీనర్ధం ఏమిటంటే అంతా మన దృక్పథం మీద ఆధారపడి ఉంటుంది. మన దృక్పథం మన అనుభవాలు, పరిస్తితులను బట్టి ఉంటుంది. కనుక ఏది ఆబ్సొల్యూట్ కాదు. వయస్సు మళ్ళిన వారు మీరు వృద్ధాశ్రమమని అనుకునే చోట స్వతంత్రంగా వారి గదో, అపార్ట్మెంటో వారికుంది, పనులు చూడ్డానికి సహాయం ఉంది , వారి వయస్సు గల ఇతరులతో కాలక్షేపం ఉండి , నచ్చిన వ్యాపకాలతో జీవితం గడపగలిగితే తప్పులేదు గదా.

పిల్లలూ వారికి నచ్చినట్టు వారి సంసారం గడుపుతారు. అంతా అపుడప్పుడూ కలుసుకొంటూ ఉంటె ఆపేక్షలూ, ప్రేమలూ బలంగా ఉంటాయి. తల్లితండ్రులు వారి స్వంత కోరికల్ని తీర్చుకొనే క్రియకి ఫలితంగా పిల్లలు

పుడతారు. వారిని పెంచిపెద్ద చెయ్యటం , బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దటం తల్లితండ్రుల బాధ్యత. మాతృత్వం చక్కని అనుభూతి కాదనను అయితే దాని సాకుచేసుకుని ;నవమాసాలూ కానీ పెంచాను, బట్టలు కొన్నాను, అన్నమ్పెట్టాను, చదువు చెప్పించాను అంటూ కాబూలివాలాల్లాగా పిల్లల్ని జీవితాంతం రుణగ్రస్తుల్ని చెయ్యటం Guilt complex తోవాళ్ళు సంఘర్షణకు లోను కావటం ఇదంతా అనవసరం. ప్రకృతిలోని ప్రతిజీవిలాగే మనంకూడా పిల్లల్ని కనిపెంచుతాం. జీవితపు సాయంసంధ్యలో స్వతంత్రంగా హాయిగా బ్రతకడానికి , వయస్సుండి, సంపాదించే రోజుల్లో అంత ముందుచూపుతో ప్రణాళికాబద్ధంగా డబ్బు దాచుకోవాలి. అంతేగాని పిల్లలు చూసుకోవాలని వాళ్ల స్వేచ్ఛకు సంకెళ్ళువేసి మన బాధ్యతను వాళ్ళపైన నెట్టకూడదు. పొదుపు చేసుకోవాలి. మన జీవితాలకు మనమే బాధ్యత వహించాలి.

కొడుకులు పోషించాలనీ అనుకోవడం మానిన నాడు,కూతుళ్ళను పొత్తిళ్ళలో చంపుకోవడం మానగలుగుతామేమో!! మనలాగే పిల్లలకీ వాళ్ల పిల్లల బాధ్యతలుంటాయి అని గుర్తించాలి. ఒకరిమీద ఒకరు ఆధారపడకుండా ఉన్ననాడు మనమధ్య పరస్పర ప్రేమా భిమానాలు పెరుగుతాయే గాని తగ్గవమ్మా! అమ్మాయి నిర్మలా, గుంటూరులోని మన ఇల్లు అమ్మేశాను. దానితో నాకూ మీ మామగారికి అనుబంధం అంతే. మా తరువాత హైదరాబాద్లో సెటిల్ అయిన మీకు మీ సొంత అనుబంధాలుంటాయి, ఉండాలి. కనుక యిల్లు అమ్మేసాను. నీ బాంకు లో ఫిక్స్డ్ డిపాజిట్ వేసి పెట్టు. ఆ వచ్చే వడ్డీతో నేను శేష జీవితాన్ని ఆనందనిలయంలో స్వాతంత్ర్య జీవనం గడుపుతాను. పిల్లాపాపలతో హాయిగా మీరుంటే చూసి ఆనందిస్తాను. నా తదనంతరం ఆ ఫిక్స్డ్ డిపాజిట్లో మిగిలిన డబ్బును అనిరుధ్, అరుణిమల చదువులకు బామ్మా తాతయ్యల కనుకగా ఉపయోగించండి." అరుంధతిగారి మాటలను సాలోచనగా విన్నారు కుమార్, నిర్మల.

“త్వరగా తయారవండి బామ్మగారిని చూడటానికి బయల్దేరాలి.” పిల్లలని తొందర చేసింది నిర్మల.

"ఒకే మమ్మీ మేం రెడీ". అనిరుధ్, అరుణిమ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు.. ఆవేళ శనివారం. ప్రతి శనివారం, నిర్మల, ఆమె భర్త కుమార్, పిల్లలు అనిరుధ్ , అరుణిమ ఉదయమే బయలుదేరి కుమార్ అమ్మగారి ని చూచి అమెతూ ఆ రోజు గడపటానికి వెళ్ళడం ఆనవాయితీ అయ్యింది.

"రండి రండి మీకోసమే చూస్తున్నాను" ఎంతో సంతోషంగా ఎదురొచ్చి లోపలి తీసుకొని వెళ్లారు అరుంధతి గారు . శనివారం వొచ్చిందంటే ఆవిడ హడావుడి అంత ఇంతా కాదు.కొడుకూ , కోడలూ, మనవడు , మనవరాలో అంత వచ్చి ఆ రోజంతా ఆమెతోనే గడుపుతారు. బామ్మతో కూర్చుని ఆమె చెప్పే కథలు వింటూ, వాళ్ళ స్కూలు విశేషాలు ఆమెకు చెపుతూ ఉంటె ఎప్పుడు, బ్రేక్ఫాస్ట్ అయ్యిందో, ఎప్పుడు లంచ్ అయ్యిందో యింతలోనే సాయంకాలం , యిక ఇంటికి తిర్గి వెళ్ళే సమయం." అమ్మ ఇక వెళ్లి రామా మరి?" అన్నాడు కుమార్.

"మంచిది బాబూ... " అన్నారు అరుంధతి గారు.

"అత్తయ్యా వెళ్లి వస్తాం"" అన్నది నిర్మల.

"మంచిదమ్మా"" నవ్వుతూ సాగనంపేరు అందరినీ.

కొడుకూ కుటుంబం వస్తే ఎంతో సంతోషం ఆవిడకు కాని రోజంతా వాళ్ళతో గడిపేక ఎవరి దారిన వాళ్ళు వెళ్ళితే ఆవిడ తిరిగి తన వ్యాపకాల్లో బిజీ గాఉంటారు.. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ ఉంటారు. మిత భోజనం, వయస్సుకి తగ్గ వ్యాయామం, యోగా. ఉదయమే లేచి, కాలకృత్యాలు తీర్చుకొని, యోగా వ్యాయామం, తరువాత స్నానం చేసి, ఒక అరగంట పూజ చేస్తారు. తరువాత అల్పాహారం చేసి , వాలంటీర్ పని చేస్తారు.

ఇంటికి తిరిగి వెళుతూ భర్త తో అన్నది నిర్మల. "అత్తయ్యాగారు సంతోషం గాఉన్నారు. వారు చెప్పిన మాటే సబబయినది."

"అవును నిర్మలా! అమ్మ బాగా అలోచించి చక్కని నిర్ణయం తీసుకుంది. దాని వల్ల అందరకి శాంతి సంతోషం" నవ్వుతూ అన్నాడు కుమార్.

**కొసమెరుపు**

"పొద్దేక్కేవరకూ నిద్ర లేవదు. దరిద్రగొట్టు మొహం. పొద్దున్నే ఇంత  కాఫీ చుక్కకూడా  దిక్కులేదు. దాని చెంగుపట్టుకు తిరుగుతాడేకాని, కన్నతల్లి అనేది ఏవయినా ఉందా వాడి ముఖానికి,?" పక్కవాటా పెద్దమ్మకు తన కష్టాలు చెప్పుకొంటూ కళ్ళూ ముక్కూ తుడుచుకుంటున్నారు అరుంధతమ్మ గారు.

" ఆయ్యో పాపం, ఏం పిల్లాలూ ఏం కాలం . మా రోజులలో అయితేనా  ఎంత భయం, ఎంత భక్తి.. పెద్దలంటే ?"  అని పక్కింటి పెద్దమ్మ ఉచితంగా యాకాలపు పిల్లల మీద  ఒక చిన్న తీర్పు ఒదిలేసింది.   పెళ్ళయిన ఏడాదికే వేరు కాపురం పెట్టించడం, విధవరాలయిన అత్తగారిని కాశి లో ఒదిలిపెట్టి రావడం అన్నీ మరచి పోయిందా  పక్కింటి దొడ్డ ఇల్లాలు.

వారమంతా   ఆఫీసు పని, ఇంటి చాకిరీతో అలసిన నిర్మలకి , క్రిందటి రాత్రి కాస్త కునుకు పట్టింది.

ఆ  సణుగుడు విని మెలకువ వొచ్చిన నిర్మల గబా గబా మొహం కడుక్కొని, స్నానంచేసి వచ్చింది. స్నానం చేయకుండా వంటింట్లో కెళితే అదో గొడవ. రోజంతా సనుగుతారు అత్తగారు.

" అమ్మా , యుటోపియా అంటే ఏమిటమ్మా?"  అని కూతురు  అడుగుతుంటే  నవ్వుతూ,

"యుటోపియా అంటే రాత్రి నా కొచ్చిన  చక్కని కలమ్మా!!"  అంటూ వంటింటిలోకి  నడిచింది నిర్మల.

## హింసాయా మా అహింసాం గమయ...  వి-రాగి

### కౌముది - రచన నిర్వహించిన  కథల పోటీ(2013)లో విశిష్ట బహుమతి పొందిన కథ

**ఓ వైపు భౌతికంగా నక్షత్రగర్భాల్ని శోధించగలుగుతున్నా** - మరోవైపు వదుల్చుకోలేని క్రీనీడలతో క్రిక్కిరిసిన మనిషి మనసులా ఉంది బయట ఇంకా కమ్ముకున్న చీకటి. కరెంటు బిల్లు కట్టలేదని పంచాయితీకి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వెలగని వీధిదీపాలు - అందరి జీవితాల్లో ఆనందం నింపగలిగినా హద్దుల్లేని కొందరి స్వార్థం వల్ల వినియోగంలోకి రాని జ్ఞానంలా ఉన్నాయి. గూట్లోకి పాము చొరబడ్డట్టు పీడకల వచ్చిందో ఏమో ఎక్కడి నుంచో 'కీచు'మంటూ పిట్ట అరుపు. గుర్తొచ్చీ రానట్టుండే శైశవస్మృతుల్లా - ఆకాశంలో మిణుకు మిణుకు మంటున్న చుక్కలు. ఆ జ్ఞాపకాల నడుమ అమ్మా నాన్నల ప్రేమలా - ఆ చుక్కల మధ్య మెరుస్తోంది వేగచుక్క. పొద్దు గుంకినప్పటి నుంచీ నిలువుకాళ్ళపై ఉన్న నైట్ డ్యూటీ వాచ్‌మేన్‌కు ఆ శ్రమతో నిలువెల్లా చమాయించినట్టు - చీకటిని అంటుకుని అంతటా పల్చని పొగమంచు. మడుగులో నీటినీ, నాచునూ చీల్చుకుంటూ గట్టుకు సాగే నావలా - చీకటినీ, పొగమంచునూ

చీల్చుకుంటూ దూరంగా ఉన్న గుడి మైకు నుంచి వస్తోంది ఘంటసాల భగవద్గీతా గానం. 'ప్రభో కృష్ణా! రణరంగంలో అయినవారి రక్తం కళ్ళజూడలేను. వారి ప్రాణాలు తీయలేను. ఈ రాజ్యం నాకు వద్దు. ఈ రక్తపు కూడు నేను కతకలేను' అంటున్న అర్జునుడి దుఃఖార్తి - ఎంత ఆకలితో ఉన్నా, కలిసి వేటాడిన జంతువును తోటివాడు సొంతం కాజేసినా, వాడిని పడగొట్టగల బలమున్నా కలబడడానికి సంకోచించిన ఒకానొక ఆదిమ మానవుడి అంకురప్రాయమైన మనోమార్దవం, నాగరిక చింతన మరింత 'వికసిస్తున్న సవ్వడి'లా ఉంది.

●●●

నిద్రలేస్తూనే భగవద్గీతా గానం వినబడటంతో సుగుణ 'తాతయ్య ఇది వింటూ ఇష్టమైన తాయిలం తింటున్న పిల్లవాడిలా మురిసిపోయేవాడు' అనుకుంది. ఇంద్రజిత్తు బాణం దెబ్బకు ప్రాణం కడబట్టిన లక్ష్మణుడికి ఆంజనేయుడు తెచ్చిన సంజీవినీ పర్వతం పునర్జీవితం ప్రసాదించినట్టు - నిరాశాస్పృహలతో కుంగిపోయిన వారిని మెరుపు తీగలుగా మలచే శక్తి గీతకు ఉందనే వాడు తాతయ్య. గీత ప్రపంచంలోనే అతి గొప్ప గ్రంథమనీ, మానవజాతికి శ్రీకృష్ణుడు ప్రసాదించిన వరమనీ, అలాంటి భరతభూమిలో పుట్టడం మన అదృష్టమనీ పులకించిపోయేవాడు. ఎన్టీ రామరావు శ్రీకృష్ణుడి పాత్ర పోషణలో అనితరసాధ్యుడనీ, గీతను గానం చేసిన ఘంటసాల వంటి మరో గాయకుడు పుట్టలేదనీ, పుట్టబోడనీ, వారిద్దరూ తెలుగువారు కావడం తెలుగు వారందరికీ గర్వకారణమనీ ఛాతీ ఉప్పొంగుతుండగా చెప్పేవాడు.

డిగ్రీ చదివిన సుగుణకు చిన్నప్పటి నుంచీ సాహిత్యమంటే మక్కువ. బాలసాహిత్యం నుంచి నవలల వరకూ దొరికిందల్లా చదివేది. కాలేజీ రోజుల్లో వచన కవిత్వం రాసేది. ఇంట్లో చదవడానికి ఏమీ లేకపోతే తాతయ్య చదివే ఆధ్యాత్మిక గ్రంథాలూ చదివేసేది. భగవద్గీత కూడా చదివింది కానీ గీతాసారం కొంత అర్థమయ్యీ, కొంత అర్థం కానట్టు ఉండేది. కానీ ఓసారి మాత్రం 'గీత' ఆమెకు ఉపయోగపడింది. తొమ్మిదో తరగతిలో క్లాస్ ఫస్ట్ వస్తానని గట్టి నమ్మకంతో ఉన్న ఆమె తీరా రెండోస్థానం మాత్రమే దక్కేసరికి ఏడుపు లంకించుకుంది. అప్పుడు తాతయ్య దగ్గరకు తీసుకుని బుజ్జగించాడు. 'గీతలో కృష్ణుడు చెప్పినట్టు - కష్టపడి చదవడమే నీ వంతు, నీకే ఫలితం రావాలన్నది నీ చేతుల్లో ఉండదు. కాబట్టి కుంగిపోకు. నువ్వు ఆశించింది పదో తరగతిలో సాధించడానికి ప్రయత్నించు' అంటూ ఊరడించాడు. ఫలితాన్ని ఆశించకుండా ఏదైనా చేయడమెలాగో ఆమెకు బోధపడలేదు. కానీ, తాను ఆశించిన క్లాస్ ఫస్ట్ తన స్నేహితురాలు వసంతకు వచ్చిందని అసూయపడకుండా ఉండటానికి మాత్రం తాతయ్య చెప్పింది సాయపడింది. తనను చూడగానే సంతోషంతో ముఖం పువ్వులా విచ్చుకునే వసంతపై మనసులో ముల్లులాంటి కుళ్ళు బుద్ధి నాటుకోకుండా అడ్డుపడింది. తమకు రావలసిన రాజ్యాన్ని కాజేసి, కష్టాల పాలు జేసిన దుర్యోధునిడిపై యుద్ధం చేయడానికే అర్జునుడికి మనసొప్పలేదు. అలాంటిది తనలాగే కష్టపడి చదివిన వసంతకు ఫస్ట్ వచ్చిందని తాను కోపం తెచ్చుకోవడం గానీ, దాన్ని ద్వేషించడం గానీ తప్పు కదా అనిపించింది. అలా అనిపించాక గుండె తేలికపడింది.

●●●

సుగుణ డిగ్రీ పూర్తి చేయగానే 'రోడ్డు పక్కనే పదెకరాల పొలం ఉంది. రెండు బోర్లున్నాయి. కుర్రాడు కూడా చదువుకున్నా ఉద్యోగం కోసం వెంపర్లాడకుండా ఉన్న పొలంలోనే శ్రద్ధగా వ్యవసాయం చేసుకుంటున్నాడు. బుద్ధిమంతుడు. పిల్లను చేసుకుంటామని కోరి వచ్చారు. కట్నం అడగడంలేదు. పెట్టుపోతల గురించీ పట్టింపుగా లేరు. కాదనడానికి ఏముంది? దగ్గర్లో మా కళ్ళెదుట ఉంటావు. అదే ఉద్యోగస్తుడికిచ్చి చేస్తే ఎంత దూరాభారాన ఉంటారో తెలీదు. కడుపులో మెదిలినా కంట చూడడానికి ఉండదు' అంటూ తల్లితండ్రులు వారికి పూర్తిగా నచ్చిన సంబంధం గురించి చెపుతూనే పరోక్షంగా 'ఒప్పుకోమ్మా' అని సుతిమెత్తగా ఒత్తిడి చేశారు.

రామకృష్ణ సుగుణకూ నచ్చాడు. ముంగిట కాసిని ముద్దబంతుల మొక్కలు, మల్లె, సన్నజాజి అంట్లూ కనీసం ఓ జామ చెట్టూ, కొబ్బరి చెట్టూ పెంచుకోలేని పట్నంలోని ఫ్లాట్ బతుకులంటే ఆమెకు ఎలాగూ ఇష్టం లేదు. అందుకే అమ్మా నాన్నలు చెప్పిందానికి తలూపింది.

●●●

ఇంకా భాష నేర్వని పురాతన మానవులెవరో భగాద్గీతాగానానికి తాళం వేస్తున్నట్టు వంటింట్లోంచి 'బులక్‌గులక్'మంటూ కవ్వంతో చిలుకుతున్న సవ్వడి వినిపించింది. 'ఈవిడకు ఎంత చెప్పినా అంతే. మీగడ విడిగా తీసి మిక్సీలో వేస్తే వెన్న వస్తుంది కదా. కష్టపడి చిలకడం ఎందుకన్నా వినదు. చిలుకుడు వెన్నకున్న కమ్మదనం మిక్సీ వెన్నకు రాదంటుంది. చూడ్డానికి ఒకేలా ఉన్నా దానికీ, దీనికీ మల్లెకూ, మొల్లకూ ఉన్నంత తేడా ఉందంటుంది' అత్తగారి గురించి అనుకుంది సుగుణ.

పిల్లలిద్దరూ మంచి నిద్రలో ఉన్నారు. తల్లి పొదుగు కుడుస్తున్న దూడను పలుపుతాడు వేసి బలవంతంగా లాగేసినట్టు - అయిదేళ్ళ పెద్దాడిని రోజూ గాఢనిద్రలో ఉండగానే లేపాల్సి వస్తోంది సుగుణకు. హోలీ ఆడుతుండగా ఎవరో ఉండేలుబద్దతో రాయిని సంధించి కొట్టడంతో కుండ పగిలి రంగులు కలిపిన నీరు ఒలికిపోయినట్టు - వాడి లేత నేత్రపటలాల నుంచి కలలు ఒలికిపోతుంటాయి.

'అంత తొందరగా లేపకపోతే వాడు ఫస్ట్ క్లాస్ చదువుతున్న ఆ రాజమండ్రి స్కూలు బస్ వచ్చే ఏడున్నరకల్లా తయారు చేయడం కష్టం మరి. అలాగని ఊళ్ళో ఉన్న గవర్నమెంట్ స్కూళ్ళో చదివించడానికీ మనసొప్పదు. చదువు - బామ్మ చెప్పే పేదరాసి పెద్దమ్మ కథలా కాక - చేయని నేరానికి పోలీసులు ఇచ్చే కౌన్సిలింగ్‌లా మారిపోయింది. ఏం చేస్తాం. ఇవాళ తన పుట్టినరోజు కావడంతో వాడిని స్కూలుకి పంపడంలేదు. దాంతో సెలయేటి పయనం నదిలో కలిసే వరకూ నిరాటంకంగా సాగినట్టు వాడి కలలు వాడంతటవాడికి మెలుకువ వచ్చే వరకూ కొనసాగుతాయి' అనుకుంది సుగుణ. రెండేళ్ళు దాటిన రెండో వాడినీ ఈ వేసవి తర్వాత ప్రీకేజీలో వేయాలనుకుంటున్నారు.

డ్రెస్సింగ్ టేబుల్ మీదున్న సెల్‌ఫోన్ మోగింది. అవతలి నుంచి రామకృష్ణ. "మెనీ హ్యాపీ రిటర్న్స్" అంటూ పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పాడు. "థాంక్స్. త్రీ ఫేజ్ కరెంటు తీసేసే టైమైందిగా - ఓ అరగంటలో వచ్చేస్తారా?" అడిగింది.

"వచ్చేస్తాలే" చెప్పాడు. వ్యవసాయానికి విద్యుత్‌ను అర్ధరాత్రి తర్వాతే ఇస్తున్నారు. అదీ పట్టుమని ఆరు గంటలు కూడా ఉండడంలేదు. కంటిని రెప్పలా పంటను కాచుకునే రైతు కంటికి కునుకు కరువైనా ఓర్చుకుంటాడు గానీ పంట దెబ్బ తింటే తట్టుకోలేడు. రామకృష్ణ అలాంటి రైతే. అందుకే అరటి తోటకు తడి పెట్టడానికి బైక్ పై పాలేరుని వెంటబెట్టుకుని రాత్రెప్పుడో వెళ్ళాడు.

●●●

తాను తలస్నానం చేసి అమ్మ పంపిన కొత్త చీర కట్టుకున్నాక సుగుణ పిల్లలిద్దరినీ లేపింది. వాళ్ళకు స్నానాలు చేయించి, కొత్తబట్టలు వేసింది. పెద్దాడు కోరినట్టు - భూగోళం మీది జీవ వైవిధ్యాన్నీ, జీవన విశేషాల్నీ కళ్ళకు కట్టినట్టు చూపే ఓ ఛానల్ పెట్టి, ఇద్దరికీ పాయసం తినిపిస్తూ తానూ టీవీ చూస్తోంది. ఆ ఛానల్ చూసిన ప్రతిసారీ అందులో చూపే యదార్థ సన్నివేశాలను ఎంత కష్టపడి, ఎంత ఓపిగ్గా ఎదురు చూసి షూట్ చేసి ఉంటారోనని విస్తుబోతుంటుంది.

"అమ్మా! టైగర్" పెద్దాడు యశ్వంత్ హుషారుగా అన్నాడు. చిన్నాడు హేమంత్ అన్నను అనుకరిస్తూ "అమ్మా! తైగల్!" అన్నాడు. పెద్దాడిని 'చిచ్చుగాడు' అనీ, చిన్నాడిని 'బూడుగాడు' అనీ ముద్దుగా పిలుచుకుంటారు.

టీవీలో ఏదో అడవిలో రాత్రివేళ సంచరిస్తున్న పెద్దపులిని చూపుతున్నారు. దాని కళ్ళు ఆకలితో ఉన్న మృత్యుదేవత కబళం కోసం ఆ చీకట్లో అన్వేషించడానికి రగిలించిన రెండు కాగడాల్లా ఉన్నాయి. కెమేరా సవ్వడి కాకుండా నడుస్తున్న పులినే అనుసరిస్తోంది. ఉన్నట్టుండి పులి ఓ చెట్టు దగ్గర ఆగిపోయింది. కెమేరా చెట్టు మొదట్లో నిదురిస్తున్న కోతి మీదకు ఫోకస్ అయింది. చెట్టు బోదెకు

ఆనుకుని తలవాల్చి నిద్రపోతోంది ఆ కోతి. అది నెలలు నిండిన కోతి అని చూడగానే తెలిసిపోతోంది. తనలో రూపుదిద్దుకున్న ప్రాణి పట్ల నిద్రలోనూ తన బాధ్యతను మరవనట్టు ముంగాళ్ళు రెండింటినీ పొట్టపై పెట్టుకుని ఉందది. అంతవరకూ అతి మెల్లగా అడుగులు వేసిన పులి మృత్యుదేవత విసిరిన గదలా కోతిపైకి లంఘించింది. రెప్పపాటులోనే కోరలతో కోతి పీకను కొరికి, పంజాలతో పొట్టను చీల్చేసింది. ప్రసవ వేదనా, మరణయాతనా కలగలిసిపోయినట్టు కోతి అడవి దద్దరిల్లేలా అరిచింది. కొన్ని క్షణాలు గిలగిలా తన్నుకుని చచ్చిపోయింది. ఆ వ్యవధిలోనే దాని పొట్టలోంచి ఊడిపడింది శిశువు. అది ఒళ్ళంతా జిగటతో – మృత్యువు దాని తల్లిని నమిలి మింగేసి ఊసిన మాంసపు ముద్దలా ఉంది. తల్లి కడుపుపై పులి కొట్టిన దెబ్బ దాని పాలిట ప్రాణిగా లోకంలోకి రాకముందే ప్రాణాంతకంగా మారినట్టుంది. పురిటి కందుగానే అది మరణయాతన పడుతోంది.

అప్పుడే లోకంలోకి వచ్చి కన్ను తెరవలేకపోతున్న, గొంతెత్తి అరవలేకపోతున్న ఆ ప్రాణి మూగవేదనను చూసి పులిలో ఏదో మార్పు వచ్చింది. మృత్యుదేవత ప్రయోగించిన ఆయుధంలా దాని తల్లిని హతమార్చిన పంజాతోనే – తల్లి బిడ్డను నిమిరినట్టు కోతిపిల్లను మృదువుగా తాకింది. విజాతికి చెందిన ఆ లేత జీవిని అతి మెల్లగా అటూ ఇటూ కదిల్చింది. తర్వాత అశాంతిగా, అస్థిమితంగా దాని చుట్టూ తిరిగింది. తర్వాత దానికి దగ్గరగా పడుకుని మళ్ళీ కదల్చింది. తిరిగి లేచి మళ్ళీ ప్రదక్షిణలు చేసింది. పులి ముఖంలో ఏదో చేయాలన్న ఆత్రం, ఏమీ చేయలేకపోతున్న నిస్సహాయత. ఇప్పుడు దాని కళ్ళు మృత్యుదేవత రగిల్చిన కాగడాల్లా లేవు. మాతృ సహజమైన దయతో వెలుగుతున్న దివ్వెల్లా ఉన్నాయి. కాసేపటికి కోతిపిల్లలో చలనం నిలిచిపోయింది. అప్పటి వరకూ మనసు కుదురులేనట్టు దాని చుట్టూ తిరుగుతూ, తాకుతూ, పడుకుంటూ, లేస్తూ గడిపిన పులి కోతిపిల్ల కట్టెను మళ్ళీ సున్నితంగా కదిపింది. కొంతసేపు దిగులుగా దానికేసే చూసింది. తర్వాత భ్రమగా కదిలి అడవిలో, అంధకారంలో కలిసిపోయింది. పిల్లలు టైగర్ వెళ్ళిపోయిందని అంటుండగానే ఆ సన్నివేశం, దాన్ని వివరిస్తున్న వాయిస్ ఓవర్ ముగిసిపోయి దాని చిత్రీకరణలో పాల్గొన్న వారి పేర్లు వచ్చాయి.

పులి ప్రవర్తనతో సుగుణ ‘కత్తిమొనకు పువ్వు పూసిందా?‘ అన్నంత ఆశ్చర్యచకితురాలైంది. తాను పొట్టన పెట్టుకున్న జీవి పొట్టలోంచి వచ్చిన లేత ప్రాణిపై దానికి ఇంత అనుకంప దేనికో? అవయవాలు వికసించి, మెదడు, నాడీ వ్యవస్థ ఉన్న ప్రతి ప్రాణికీ తన జాతి శిశువులపై మమకారం, ప్రేమ సహజమే. అయితే తన జాతిది కాని ప్రాణి కోసం ఇంత ఆరాటం, దాని వేదనను చూసి ఇంత కలతా – అందున పులిలాంటి క్రూరమృగంలో, అదిన్నీ అప్పటికి కొన్ని క్షణాల ముందే దాని తల్లిని ఒక్క పంజా దెబ్బకు ప్రాణం పోయేలా చేసిన పులిలోనే వ్యక్తం కావడం ఆమెను విభ్రాంతికి గురి చేసింది.

●●●

ఇంటి వెనుక పెరట్లో విరగబూసిన ముద్ద నందివర్ధనం మొక్క పక్కన ఆ పూలరాశిలా ఉంది బ్రాయిలర్ కోడి. చిచ్చుగాడు "బోబు.. బోబు.." అంటూ దానిని తరుముతుంటే బూడుగాడు కూడా "బోవు..బోవు" అంటూ దాని వెంట పడ్డాడు. చివరికి ఇద్దరూ కలిసి దాన్ని పట్టేసుకున్నారు. పోటీపడి ఎత్తుకున్నారు. రెండు చేతులతో పొదువుకున్నారు. ఆ చిన్నపిల్లలిద్దరి నుంచీ తనకు రాగల ముప్పేదీ లేదని తెలియక అది ‘కొకొక్.. కొకొక్..‘ అని కలవరపడుతుంటే కిలకిలా నవ్వారు. అది గింజుకుని, వాళ్ళ చేతుల్లోంచి తప్పించుకుని పారిపోతుంటే వెంటపడి, మళ్ళీ పట్టుకున్నారు. అది మళ్ళీ గింజుకుంది. అలా కాసేపయ్యాక కోడికి వాళ్ళు మాలిమి అయినట్టున్నారు – అంతకు ముందులా గింజుకోవడం మానేసింది. పిల్లలు తనను పట్టుకుని, బాసింపట్టు వేసుకుని, ఒళ్ళో పెట్టుకుంటే ఏ మాత్రం బెరుకు లేకుండా తల్లి ఒడిలో బిడ్డలా ఒదిగిపోయింది.

వాళ్ళలా ఆడుకుంటుండగా రామకృష్ణ స్నానం ముగించి, టిఫిన్ చేసి పొలం బయల్దేరాడు. పాలేరు కోడిని కోసే వేళైంది. పిల్లలు అదంతా చూడడం ఎందుకని కావాలనే వాళ్ళని వెంట తీసుకువెళ్ళాడు. గంటన్నర తర్వాత వాళ్ళు తిరిగొచ్చేసరికి కోడిని కోసి, ఈకలు పీకి, కాల్చి, ముక్కలుగా నరికి, కూర వండడం పూర్తయింది.

కోడికూరతో కలిపిన అన్నం తెచ్చిన సుగుణ "పిల్లలూ! బువ్వ పెడతాను రండి" అని పిలిచింది.

"ఏం కూరమ్మా?" అని చిచ్చుగాడు అడిగితే "ఏం తూలమ్మా?" అని అడిగాడు బూడుగాడు. "కోడి మాంసం" చెప్పింది. బూడుగాడికి కోడి మాంసం కూరంటేనే నోరు లాలాజలపాతమవుతుంది. ఆత్రంగా ముందుకు వచ్చిన వాడికి ఏమి ఆలోచన వచ్చిందో ముద్ద తినడానికి తెరిచిన నోటితోనే "అమ్మా! బోబేయి?" అని అడిగాడు.

"ఆ బోబుదేరా ఈ కూర" చెప్పింది సుగుణ. తన పెదాలను తాకింది అన్నం ముద్ద కాదు - చింతనిప్పు అన్నట్టు చటుక్కున తల్లి ముద్ద పెట్టబోతుంటే ఇంకా ఇంకా వెనక్కి జరిగాడు. ఎక్కడో నింగిలో ఉన్న కారుమబ్బు తేటనీటి కొలనులో ప్రతిఫలించినట్టు కనిపించింది. చిగురు కొమ్మపై రాబందు వాలినట్టు - వాడి లేతకళ్ళను చలింపజేస్తూ చిక్కటి దుఃఖం.

"నా బూడుబాబు కదూ... తినమ్మా!" అంటూ తల్లి ఎంత బుజ్జగించి తినిపించబోయినా నోట ముద్ద పెట్టలేదు. కాళ్ళు తపతపా నేలకు కొడుతూ, చేతులు గాలిలో అడ్డంగా ఊపుతూ "నాతొద్దూ" అని అరిచినట్టన్నాడు. లేత రావియాకుల్లాంటి వాడి పెదాల నుంచి వెలువడిన ఉక్కు సంకల్పానికి సుగుణ నిర్ఘాంతపోయింది. చేసేది లేక కలిపిన అన్నం చిచ్చుగాడికి తినిపించేసి. బూడుగాడికి చారన్నం తినిపించింది. తర్వాత పెరుగుబువ్వ పెట్టబోతే - తెల్లని ఆ అన్నంలో కూడా బ్రాయిలర్ కోడే కనిపించినట్టుంది "వద్దు" అంటూ మళ్ళీ మూతి బిగించేశాడు.

●●●

నలుగురూ రాజమండ్రి వెళ్ళి ఫస్ట్ షో సినిమా చూసొచ్చారు. భోజనాలప్పుడు మళ్ళీ అడిగినా కోడికూర తినడానికి ఒప్పుకోలేదు బూడుగాడు. పిల్లలిద్దరూ నిద్రలోకి జారుకున్నాక రామకృష్ణ మళ్ళీ తోటకు తడి పెట్టడానికి వెళ్ళిపోయాడు. సుగుణకు ఎంత ప్రయత్నించినా నిద్రపట్టడంలేదు. కోతిపిల్ల వ్యధను చూసి చలించిపోయిన పులీ, కోడి మాంసం ముక్క నోట పెట్టనంటే పెట్టనన్న బూడుగాడూ ఆమెను ఆశ్చర్యపరుస్తూనే ఉన్నారు. ఆ ఇద్దరితో పాటు కురుక్షేత్రంలో విషాదభరితుడై అస్త్రసన్యాసం చేసిన అర్జునుడూ గుర్తుకొచ్చాడు. ఆ ముగ్గురిలో ఏదో పోలిక తోస్తోంది. అలాగే ఏదో తేడా కూడా ఉందనిపిస్తోంది. అవేమిటో స్పష్టం కాక ఆమె మనసు వడగళ్ళ వాన వేళ చెరువులా కల్లోలితమైంది.

'తనకు పెట్టబోయిన మాంసం ముక్క అంతకు ముందు తాను ఆడుకున్న కోడిదే అన్న వాస్తవం బూడుబాబు లేతమనసుకు కష్టం కలిగించింది. మాంసం అంటే ఉన్న ఇష్టంకన్నా ఆ కష్టానిదే పై చేయి అయింది. మషాలా వాసన ముక్కుపుటాలకు సోకితేనే నోటి వెంట చొంగలు కార్చే వాడి బుల్లి గుండె బెంగటిల్లింది. నోట్లో ఊరే తడి కంటికి బదిలీ అయింది. అపరాధ భావనో, కరుణో, దయో, కొంతసేపటి క్రితం తనకు సంతోషాన్నిచ్చిన జీవి ఇక లేదన్న దుఃఖమో వాడిని కుదిపేశాయి. తాను బలవంత పెట్టినా మాంసపు ముక్క తినడానికి ఒప్పుకోలేదు. వాడిలో కలిగిన విముఖత మాంసపు ముక్కపై వాడికున్న ప్రీతిని - చిన్న కలుపు మొక్కను పదునైన పలుగు పెకలించినంత తేలికగా రద్దు చేసింది. తనకు ఇది నమ్మశక్యంగా లేదు. మాంసం కూర ఉడుకుతున్నప్పుడు విరగబూసిన చెట్టును వీడని తేనెటీగలా వంటగది చుట్టే తిరిగేవాడు. కోడికూర కలిపిన అన్నం పెట్టేటప్పుడు 'ఇంతో ముత్త.. ఇంతో ముత్త' అని మరిన్ని ముక్కల కోసం గునుస్తూ సతాయించేవాడు. ఉన్నట్టుండి ఇంత విరక్తిని వ్యక్తం చేశాడు. తాను వండినది వాడు ఆడుకున్న బోబు మాంసమేనని చెప్పిన క్షణం నుంచి ఆ మాంసాన్ని తినడానికి నిరాకరించే క్షణం వరకూ - ఆ కొద్ది క్షణాల వ్యవధిలోనే వాడి లేత మనసులో ఎంత

సంఘర్షణ జరిగిందో. ఏ దృశ్యాలు విచ్చుకునే గులాబీపై తొలిపొద్దుకు మెరిసే మంచు కణం లాంటి వాడి పసి మనోఫలకంపై ప్రతిఫలించి, ఏ సహజాత కారుణ్య భావనతో హృదయం సంచలించి, స్పందించి ఇష్టమైన తిండిపై విరక్తిని వ్యక్తం చేసే నిర్ణయానికి కారణమైందో!! దూసుకువచ్చే బాణం దిశను మళ్ళించాలంటే ఎంత పెనుగాలి వీయాలి? ఆ శిశు హృదయం అలాంటి దృఢ నిర్ణయానికి వచ్చే ముందు ఎలాంటి కల్లోలాన్ని ఎదుర్కోవలసి వచ్చిందో? వాడి లోపలి మధనానికి మాటల రూపం ఇవ్వలేకపోవచ్చు గానీ కడలి కడుపున బడబానలంగా అది నిజం.

తాను గాలిలోకి పరివ్యాప్తం చేసే దాన్ని పరిమళం అంటారనీ, అది ఆనందాన్నిస్తుందనీ పువ్వుకి తెలియకుండానే దానిలో అది పుట్టినట్టు - పులిలో, బూడుగాడిలో తమ జాతి కాని తోటి జీవిమీద దయో, జాలో, కరుణో పుట్టాయి. వాటికి పేర్లు పెట్టగలంత వికాసం, వ్యక్తం చేయగల అవకాశం ఆ ఇద్దరికీ లేకపోవచ్చు. కానీ - ప్రాణికి ఆకలీ, భయమూ, బాధా, స్వార్థమూలాగే జాతివేరైనా మరో ప్రాణి పట్ల కారుణ్యం, అనుకంప, అనుబంధం సహజాతమేనన్నమాట. వేరే జాతి ప్రాణులైనా అవి దెబ్బ తింటే, బాధ పడుతుంటే, వాటి ప్రాణం పోతుంటే దుఃఖపడగల లక్షణం కూడా అంతే సహజమన్నమాట. పులికి కోతిపిల్లతో ఉన్నది - తాను చంపిన తల్లికోతి కడుపులోంచి అది రావడమన్న విభ్రమాశ్చర్యాన్ని కలిగించిన క్షణాల అనుబంధం మాత్రమే. బూడుగాడికి కోడిపెట్టతో ఉన్నది కాసేపు ఆడుకున్న అనుబంధం మాత్రమే. పులిలో వచ్చిన మార్పు మర్నాడు దానికి ఆకలేసి ఏ లేడినో పంజాతో కొట్టినప్పుడు ఒలికే నెత్తుటిలో కొట్టుకుపోవచ్చు. మాంసాహారంపై బూడుగాడి విరక్తి రేపో, ఎల్లుండో మళ్ళీ వాడి ముక్కుపుటాలకు మషాల వాసన దట్టంగా సోకితే తోకముడవవచ్చు. మరి, అర్జునుడు అలా కాదే అతడు సంపూర్ణంగా ఎదిగిన వ్యక్తి. ప్రకృతి తనలో నిక్షేపించిన గుణాలకూ, లక్షణాలకూ మరింత నగిషీ పెట్టుకోగలవాడు. వాటిలో కొన్నింటి పట్ల మక్కువ పెంచుకుని, వాటినే తన వ్యక్తిత్వానికి మకుట ప్రాయంగా అనుసరించగల 'స్వేచ్ఛ' కలిగిన వాడు. తల తెగిపడేంత పరిణామాలు ఎదురైన ఖాతరు చేయకుండా, తన తలపుల్లో మొలకెత్తిన సంకల్పానికి తుదిశ్వాస వరకూ కట్టుబడగల మానసిక సార్వభౌమత్వం ఉన్నవాడు. ప్రకృతిలో కనిపించని త్యాగాన్ని విశ్వరూపంలో చూపగలవాడు. అతడికి జాలికలిగినది కూడా విజాతి మీద కాదు. స్వజాతి మీదే అందునా బాల్యం నుంచి తనకు ఏదో రూపేణా అనుబంధం ఉన్న వారిమీదే వారిలో కొందరితో బాల్యం నుంచీ విరోధం ఉంటే ఉండవచ్చు గాక కొందరితో కలసి అతడు బాల్యంలో ఆటలాడాడు. ఎన్నో పండుగలను పంచుకున్నాడు. వారితో కలిసి ఒకే గురువు వద్ద విద్య నేర్చుకున్నాడు. అలాంటి వారిపై బాణం ఎక్కుపెట్టడానికి ప్రాణం ఒప్పలేదన్న మనిషి ఆ మాటకే కట్టుబడి ఉండాల్సింది. అయ్యో! అర్జునా! మళ్ళీ అస్త్రం పట్టి, నెత్తురు చిందించి, ప్రాణాలు నిలువునా తీసి ఎంత పొరపాటు చేశావయ్యా! అస్త్రాల్ని నేలమీద విడిచి, నింగి ఎత్తుకు ఎదగబోయిన వాడిని అంతలోనే నేలబారుకు దిగిపోయావు కదయ్యా.

అదేమిటో ఆ శ్రీకృష్ణుడు కూడా అలా చేశాడు? అయినవారితో పోరుకు విరక్తుడైన అర్జునుడిని చూసి ముగ్ధుడు కావాల్సింది. ఎందుకంటే మహోదాత్త లక్ష్యాలైన 'అసతోమా సద్గమయ', 'తమసోమ జ్యోతిర్గమయ', 'మృత్యోర్మా అమృతంగమయ'ల సరసన 'హింస నుంచి అహింసకు' అన్న లక్ష్యాన్ని కూడా చేర్చితే నరులకు విశిష్టత మరింత పెరుగుతుంది కదా! దేవుడు పోసిన ప్రాణాలను బలిగొనడానికి మనసొప్పక అలాంటి దైవగుణ సంపన్నుడు కావడానికి ప్రయత్నించిన అర్జునుడిని శ్రీకృష్ణుడు అక్కున చేర్చుకుని 'బావా! జీవిలోని అతిగొప్ప లక్షణాన్ని విశ్వరూపంలో చూపావు కదయ్యా' అంటూ కదిలిపోయి, కౌరవుల వద్దకు తోడ్కొని వెళ్ళి ఉండాల్సింది. అర్జునుడిని 'కదన కర్తవ్యదీక్షా కంకణబద్ధుడి'ని చేసే గీతను కాక - కౌరవులను 'కారుణ్య వ్రత నిష్ఠాగరిష్ఠుల్ని' చేసే గీతను ప్రవచించి ఉండాల్సింది. రణ విరక్తుడైన అర్జునుడిని దారుణ మారణాస్త్రాలు సంధించేలా మార్చగలిగిన శ్రీకృష్ణుడికి సమరోన్మత్తులైన కౌరవుల హృదయాల్లో కారుణ్యం, శాంతిప్రియత్వం నింపగల శక్తి ఎందుకుండదు? చిటికెన వేలిపై గోవర్ధన గిరినే ఎత్తి, గోకులం పై ఒక్క వాననీటి

చుక్క పడకుండా అడ్డుకోగలిగిన వాడికి - కౌరవుల హృదయాల్లోని కక్ష, కార్పణ్యాలను దూది పింజల్లా ఎగరగొట్టి, కురుక్షేత్రంలో ఒక్క నెత్తుటి చుక్క, రాలకుండా చూడగల శక్తి ఎందుకుండదు?

కౌరవులకు అర్జునుడిని చూపి 'ఇతడు వీరుడు. ఇతడొక్కడే ఒక్క సైన్యం పెట్టు. ఇతడు సంధించే ప్రతి అమ్మూ ఆ మృత్యుదేవతకు వడ్డించిన విస్తరి లాంటిది. అలాంటి వాడు అస్త్రసన్యాసం చేశాడు. కారణం ఇతడిలో తోటి ప్రాణుల పట్ల దయ పురి విప్పుకుంది. కారుణ్యం రేకులు తొడిగి పరిమళించింది. హింసా, రక్తపాతాలన్న తలపే ఇతడిని హృదయంలో గుచ్చుకున్న బాణపు ములికిలా బాధిస్తోంది. మీరు చేసిన అన్యాయాలు, మీపై క్రోధం ఇతని స్మృతిపథం నుంచి కార్చిచ్చులో దగ్ధమైన ముళ్ళలా అదృశ్యమయ్యాయి. ఇప్పుడితడి మనసులో మీపై అనురాగమే ఉంది. ఆప్యాయతే ఉంది. ఇప్పుడితడు మీతో అనుబంధాన్ని కాంక్షిస్తున్నాడు. మీరూ మనుషులే. నీరు ఏ రూపంలో ఉన్నా ప్రవాహంగా పల్లానికి పారినా, మరిగి ఆవిరై పైకి ఎగసినా, మంచుగా ఘనీభవించి నిశ్చలంగా ఉన్నా దాని నుంచి తడి అవిభాజ్యమైనట్టు మీలోనూ తోటి వారి పట్ల దయా, ప్రేమా ఉన్నాయి. ఉంటాయి. ఉదయపు వెలుగుకు విచ్చుకునే కమలంలా వాటిని విచ్చుకోనివ్వండి. యుద్ధం జడలు విరబోసుకున్న మృత్యుదేవత లాంటిది. ఆ జడలు అమావాస్య చీకటి కన్నా చిక్కనైనవి. వాటిలో చిక్కుకున్న వారికి తోటి మనుషుల రక్తపు మడుగుల్లో జలకాలాడాలనిపిస్తుంది. వారు ప్రాణాలు తీయడాన్ని ప్రీతిపాత్రమైన క్రీడగా ఆస్వాదిస్తారు. ఓ కౌరవ యోధులారా! విచ్చుకున్న పువ్వు రేకులు తుంచడం సులభం. తెంచిన రేకులతో తిరిగి పువ్వు సృష్టించడం అసంభవం. ఒక్క యోధుడు వేల ప్రాణాల్ని హరించగలడు. కానీ, వేల మంది యోధులు పోయిన ఒక్క ప్రాణాన్ని తిరిగి తేలేరు. నా మాటలను వీనులతో కాదు హృదయంతో ఆలకించండి. మీ మనసుల్లోని మత్సర, ద్వేషాలను - రథచక్రాల కింద చవుడు గడ్డల్లా నుగ్గు కానివ్వండి. ఇదిగో - ఆయుధాల్ని పరిత్యజంచిన ఈ పార్థుడిని చూడండి - మబ్బులు లేని ఆకాశంలా, మచ్చలేని జాబిలిలా ఎంత తేటగా కనిపిస్తున్నాడో. అదిగో - అక్కడ అతడు విసర్జించిన విల్లంబులను చూడండి. అతడి హృదయంలోని కక్ష, కార్పణ్యాలనే కణితులను శస్త్రచికిత్సతో తొలగించి అక్కడ పడేసినట్టు లేవూ! రణభూమి ప్రాణాల్ని హరించి, పీనుగుల్ని సృష్టిస్తుంది. ఆ పీనుగలు కుళ్ళిపోయి దుర్గంధాన్ని వ్యాపింపజేస్తాయి. అదే వనభూమి అయితే అసంఖ్యాక బీజాలు మొలకెత్తి, చిగురించి, మొగ్గ తొడిగి వికసిస్తాయి. పరిమళాల్ని వెదజల్లుతాయి. రండి - అర్జునుడిలాగే అంతరంగతరంగాల నుంచి ద్వేషమాత్సర్యాలను తుడిచి వేయండి. కరుణావనమాలులు కండి. కురుక్షేత్రాన్ని మరుక్షేత్రంగా కాక విరిక్షేత్రంగా మారుద్దాం రండి' అంటూ కౌరవులకు కారుణ్యగీతను ప్రవచిస్తే ఎంత బాగుండేదో కదా! అలా చేసి ఉంటే అప్పుడు కదా - 'వందే జగద్గురుమ్' అన్న ప్రశంసకు 'వంద'రెట్లు అర్హుడై ఉండేవాడు. అయ్యో కన్నయ్యా! వేణువుగా మారిన వెదురుకు ములికిని పొదిగి మళ్ళీ మారణాయుధంగా మలిచినట్టు - కరుణాంతరంగుడిగా మారిన అర్జునుడితో తిరిగి మారణ హోమం చేయించావు కదయ్యా!' అనుకుంది సుగుణ. ఆమె మనసు మొసళ్ళు చొరబడ్డ చెరువులా అల్లకల్లోలమైంది.

●●●

ఎప్పుడో అర్ధరాత్రి దాటాక నిద్రపట్టిన సుగుణకు కలలో బూడుగాడు టీవీలో చూసిన పులినెక్కి కనిపించాడు. పులీ, వాడూ తమ ఊరికి ఉత్తరాన ఉండే కొండకన్నా ఎత్తున్నారు. వాళ్ళ ఎదుట - వటవృక్షం ముందు ముడుచుకుపోయిన అత్తిపత్తి మొక్కంత ఉన్నాడు అర్జునుడు. గాండ్రింపు తప్ప మాటలు రాని పులీ, మాటలు వచ్చీ రాని బూడుగాడూ - షట్చక్రవర్తులు, విష్వక్సేనుడు కన్నా కష్టమైన ఏవేవో పదాలతో సహా తెలుగు ధారాళంగా మాట్లాడేస్తున్నారు. వాళ్ళు చెపుతున్నది ఘంటసాలే చెవులు రిక్కించి వినేంత మధుర గంభీరంగా ఉంది. ఘంటసాల గానం చేసిన భగవద్గీత వింటూ తాతయ్య మైమరచిపోయినట్టు అర్జునుడు ఆ మాటలను పరవశించి వింటున్నాడు. శత్రువుపై అస్త్రాలు సంధించడం కన్నా ఆత్మీయతతో ఆలింగనం చేసుకోవడం ఎంత వాంఛనీయమో, రక్తం కళ్ళజూడడం

కన్నా కళ్ళలో కారుణ్యం నింపుకోవడం దైవాంశకు ఎంత సన్నిహితమో ఒక జీవి ప్రాణం తీసి నిర్జీవిగా మార్చడం కన్నా ఆ జీవిని ప్రాణప్రదంగా ప్రేమించడం ఎంత రుచికరంగా ఉంటుందో పులీ, బూడుగాడూ అతడికి ఉపదేశిస్తున్నారు. ఇష్టంలేని పని విధి లేక చేయాల్సి వచ్చిన సంకట స్థితిలో చిక్కుకుని విహ్వలుడైన అర్జునుడికి - మధ్యాహ్నవేళ నిదురించి, చీకటి పడ్డాక మేలుకుని బెంగటిల్లిన పసివాడికి తల్లి హత్తుకున్నప్పుడు కలిగే ఊరటలాంటిది కలిగింది. ఆ మంటలు అతడిలో అప్పటికే పాదుకున్న హింసా వ్యతిరేకతను గాఢతరం చేస్తున్నాయి. అప్పటికే అతడిలో వికసించిన కారుణ్యాన్ని మరింత గుబాళింపజేస్తున్నాయి. అర్జునుడి మోము శ్రీకృష్ణుడి వెనుక ఉండే తేజో చక్రం కన్నా కాంతివంతంగా ఉంది. పక్కన పడి ఉన్న అమ్ముల పదునైన లోహపు ములుకుల్లో ఆ మోము ప్రతిఫలిస్తోంది. తల్లి వేరుకూ, పిల్లా పీచూ వేళ్ళకూ భూమి నుంచి నీరూ, సారం పుష్కళంగా అందుతుంటే మొలక మొక్కై, మొక్క చెట్టై, చెట్టు వృక్షమై, వృక్షం మహావృక్షమైనట్టు - వాళ్ళ హితోపదేశం మనసుకు హత్తుకుంటుండగా అర్జునుడు క్షణక్షణానికీ విస్తరిస్తున్నాడు - అతడిని సొంతంగా కాదు కదా, అతడి కనుపాపనైనా ఆ కడలి సైతం ప్రతిబింబించలేనంత మహారూపునిగా, గీతోపదేశవేళ శ్రీకృష్ణుడు ప్రదర్శించిన విశ్వరూపమే అతడి ముందు - సంజీవినీ పర్వతం ఎదుట చురకత్తి మొనంత చిన్నబోయేంతగా.

(ఐపోయింది)

●●●

## *కథ వెనుక కథ*

*2010 నవంబర్ 12 న ఉదయమే మా బుజ్జి (సుగుణ)కి ఫోన్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పాను. మధ్యాహ్నం తాను తిరిగి నాకు ఫోన్ చేసి చెప్పిన విషయం విని ఆశ్చర్యపోయాను. సంభ్రమమూ కలిగింది. ఆ పూట కోయడానికి తెచ్చిన పౌల్ట్రీ కోడితో బూడుగాడు ఆడుకున్నాడనీ, తర్వాత దాన్నే కూర వండారని తెలిసి తినడానికి ససేమిరా అన్నాడనీ అన్నదే ఆ విషయం. అది విన్న వెంటనే యానిమల్ ప్లానెట్, మరో ఛానల్లో ప్రసారం చేసిన పులి, కోతిపిల్ల ఉదంతం గుర్తుకు వచ్చింది. వెంటనే కురుక్షేత్రంలో యుద్ధ విరక్తుడైన అర్జునుడు మదిలో మెదిలాడు. ఈ మూడు ఘటనల నడుమా సామీప్యత తోచింది. వాటిని ముడివేసి ఓ కథ రాయాలన్న ఆలోచన ఆ క్షణంలోనే అంకురించింది. భగవద్గీత గురించి నాకు కొన్ని నిశ్చితమైన అభిప్రాయాలూ, ఆక్షేపణలూ ఉన్నాయి. వాటినే కథలో ప్రకటించాలంటే కథలో నేను పాత్రను అయి తీరాలి. వాటిని ప్రకటించడానికి నేను పాత్రనైతే బూడుగాడూ, పులి ఉదంతాలను అర్జునుడి వైరాగ్యంతో పోల్చడం మొక్కుబడిగా మిగిలి - కథ ఆ రెండు ఉదంతాలకూ చాలా ఎడమైపోతుంది. అలా రచయిత కోసం కథ ఆకస్మికంగా దారి మళ్ళడంలో అనౌచిత్యం తోచింది. దాంతో కథలో నేను పాత్ర కారాదనీ, మూడు ఘటనల ముప్పేటగానే కథ సొంతం సాగాలనీ, సుగుణ కేంద్రంగా కథను నడిపించాలనీ, గీతపై స్పందనను కూడా ఆమె స్థాయిలోనే - నిశిత విమర్శతో నిరసించినట్టు కాక .. మృదువుగా వ్యక్తం చేయాలనీ, అంతిమంగా అహింసా ప్రియత్వాన్ని విశ్వరూపంలో చూపాలనీ నిర్ణయించుకున్నాను. అయినా కథా రచనకు ఉపక్రమించడానికి రెండేళ్ళు ఆగాను. అందుకు కారణం తీరిక లేకపోవడం కాదు - ఎలా ముగించాలో తోచకపోవడమే. ముగింపు తోచాక రాయడం మొదలు పెట్టి వారంలో ముగించాను. నాకు సంస్కృతం ఏ మాత్రం తెలీదు. అయినా 'మృత్యోర్మా అమృతంగమయ ' రీతిలో కథకు పేరు పెట్టాలని ఉబలాటం. సంస్కృతం తెలిసిన వారిని సంప్రదించాను. 'హింస నుంచి అహింసలోకి పరివర్తన చెందడం - అన్న భావనను ఆ భాషలో ఎలా రాయాలి ' అని. ఒకరు 'హింసోమా అహింసంగమయ ' అనొచ్చన్నారు. ఇంకొకరు*

'అది తప్పు. హింసోమా అహింసగ్గమయ' అనాలన్నారు. మరొకరు 'ఆ రెండూ తప్పే. మీ కథకు 'అహింసా పరమో ధర్మ' అని పేరు పెట్టుకోవడమే శరణ్యం' అన్నారు. నేను అయోమయంలో చిక్కుకున్నాను. చివరికి ఆ భాషలో ఉద్దండులైన కొవ్వూరు వాస్తవ్యులు శ్రీ దోర్బల ప్రభాకర శర్మగారిని అడిగి సందేహ నివృత్తి చేసుకుని 'హింసాయా మా అహింసాం గమయ' అన్న పేరు పెట్టాను.

యు-సూర్యచంద్రరావు(వి-రాగి)

# అహం బ్రహ్మాస్మి

## డా. వెంకట రావు కూచిభొట్ల

ఈ స్థితిలో సుందరం జ్ఞాపకాలు నన్ను ఎందుకు వెంటాడుతున్నాయో తెలియదు. నా తలలో సూదితో పొడుస్తున్నట్లు నొప్పి. ఎడమ చేయి లోలోపలికి లాగేస్తున్నట్లు బాధ. నా రెండో కొడుకు డాక్టర్ తో ఫోన్ లో మాట్లాడుతున్నాడు. కోడలు పిల్లల్ని దూరంగా తీసుకెళుతోంది. "అంబులెన్సు వస్తోంది, కార్పొరేట్ హాస్పిటల్ కాబట్టి అన్నీ వాళ్ళు చూసుకొంటారు, నేను ఉంటాను, నువ్వు ఆఫీసుకి వెళ్ళు, అవసరమైతే ఫోన్ చేస్తాను" అని అబ్బాయి కోడలితో చెబుతున్నాడు. తన మాటలు నాకు సంతోషాన్ని బాధని కలిగిస్తున్నాయి.

పెద్ద కొడుకు ఫారిన్ లో ఉంటున్నాడు. వీడు రెండో కొడుకు. మంచివాడే ఐనా, బాగానే చూస్తున్నా, ఏదో భయం, తను మంచి వైద్యం చేయిస్తాడోలేదో. నా వైద్యానికి తన సంపాదన చాలదు. కనీసం నా డబ్బు ఐనా వాడతాడో లేక డబ్బు దండగ అని మానేస్తాడో. నాకు బ్రతకాలని ఉంది.

"అది నా గది, తాతగార్ని అక్కడ పడుకోపెట్టారేం, ఆయన గది ఉందిగా?" – మనవడు గొడవ చేస్తున్నాడు.

తనకి అన్నీ నా పోలికలే అని అన్నోసార్లు ఆనందంగా అనుకొనేవాడిని.

"మీ నాన్నగారు మన అబ్బాయిని బాగా గారం చేస్తున్నారు, తను ఆయన లాగే తయారైతే మీరు తట్టుకోలేరు, మీరు దీన్ని గురించి ఆలోచించండి" అని కోడలు అబ్బాయితో చెప్పడం చాలా సార్లు విన్నాను. నేనంటే మనవడికి చాలా ఇష్టం. కానీ ఇప్పుడు మనవడి మాటలు నాకు సూదుల్లా గుచ్చుకున్నాయి. నిజానికి మనవడిది నా పోలికే. నాకు కూడా నావస్తువులు ఇంకొకరు వాడటం నచ్చదు.

"నీవస్తువులు ముట్టుకోనివ్వవు, అందరివీ నువ్వు వాడేస్తావు నీకేం అనిపించదా?" సుందరం మాటలు గుర్తుకు వచ్చాయి. నీనేప్పుడూ అది ఆలోచించలేదు, ఆ అవసరం నాకు లేదు కూడా. ఎదుటి వాడు ఊరుకొంటేనే కదా నే వాడేది, ఎందుకో సుందరానికి ఈ చిన్నవిషయం

అర్ధం కాదు. కాని, ఇప్పుడు ఇది ఎందుకు గుర్తుకు వస్తోంది. ఇది గుర్తుకురావడమో, నన్ను నిలదీసి బాధించడమో తెలీట్లేదు. ఈ స్థితి భరించలేకపోతున్నాను. అంబులెన్సు వచ్చిందనుకొంటా, నన్ను మంచం మీదనుంచి లేపుతున్నారు. నన్ను బయటికి తీసుకెళుతుంటే, మనవడు మంచం పై ఉన్న దుప్పటి లాగి విసిరేయడం కనిపించింది. నామనవడి మాటలు, ప్రవర్తన  ఈవాళ్ళ బాధ పెడుతున్నాయి, బయటి వాళ్లకి ఇంట్లో వాళ్లకి తేడా లేదా వీడికి? అనిపించింది.

"నాది అనే పరిధి అందరికీ ఉంటుంది, కాకపోతే నీకున్నంత వెర్రి నాకు లేదు అంతే తేడా" –  నేను సుందరంతో అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

కళ్ళముందు చిన్నాన్న నేపనిచేసే ఆఫీస్ కి వచ్చినప్పటి రూపం కనిపించింది. అప్పటికి ఆయనకి 60 ఏళ్ళు దాటాయి. ఇద్దరు ఆడపిల్లలు. మగపిల్లలు లేరు. చిన్నప్పుడు నన్నే తన కొడుకులాగా చూసుకొన్నాడు. ఏవో మెడికల్ టెస్టు్లు చేయించుకోవడానికి హైదరాబాద్ వచ్చాడు. నేను ఆఫీస్ పనిమీద ఊరు వెళ్ళాలి అనిచెప్పి తప్పించుకొన్నాను. లేకపోతే, నేనే దగ్గర ఉండి తీసుకెళ్లవలసి వస్తుంది, మా ఇంట్లోనే ఉండండి అనాలి. అసలే మా ఆవిడకి ఊపిరి సలపనంత పని. పిల్లల్ని రెడీ చేసి స్కూల్ కి పంపాలి, నేను ఆఫీసుకి వెళ్ళాలి. ఇక తను టిఫిన్ తినే టైం లేక, బాక్స్ సర్దుకొని తన ఆఫీస్ లో తింటుంది. ఈయనకి కూడా చేయాలి అంటే తన వల్ల అవదు. అసలే మే నెల, హైదరాబాద్ లో, ఈ ట్రాఫిక్ లో, నా కార్లో తిప్పవలసి వస్తే నరకం కనిపిస్తుంది. అందుకే అలా చెప్పవలసి వచ్చింది.

"మీ చిన్నాన్న తో అలా అనడం బాగాలేదురా" అన్నాడు సుందరం.

"నిజమే, నాకూ బాధగానే ఉంది, కానీ ఏంచేస్తాం" అన్నాను.

"అదేమిటి, మీ నాన్న లాంటి వ్యక్తి. నిన్ను కొడుకులా ప్రేమించాడు, మీ నాన్న అయితే అలా అంటావా?" అన్నాడు.

"నిజమే నేనంటే చిన్నాన్నకి ప్రేమే, అయినా ఆయన నా ఇంట్లో వ్యక్తి ఎలా అవుతాడు? నా ఫ్యామిలీ అంటే నేను, నా తల్లితండ్రులు, నా భార్య, పిల్లలు అంతే, అయినా నీకంత బాధగా ఉంటే నువ్వు సహాయం చేయి" అన్నా.

నిజంగానే సుందరం సహాయం చేసాడు. మంచివాడు అనిపించుకోవాలనే కుతి సుందరానికి ఎక్కువ అని ఎన్నిసార్లు అన్నానో, అనుకొన్నానో నాకే తెలీదు. సుందరం మీద కోపం తీరక ఒకసారి తనతోనే అన్నా "నాది అనే పరిధి అందరికీ ఉంటుంది, కాకపోతే నీకున్నంత వెర్రి నాకు లేదు అంతే తేడా".

"మానాన్న ఏవేవో మాట్లాడుతున్నాడు, పిలిస్తే పలకట్లేదు, అదోలా చూస్తున్నాడు, అసలు స్పృహలో లేడు" అని చిన్నబ్బాయి డాక్టర్ తో చెబుతున్నాడు. నేను స్పృహలో లేకపోవడం ఏమిటి!, మనవడి మాటలు చేతలు, ఫోన్ చేయడం, వీళ్ళ మాటలు అన్నీ తెలుస్తున్నాయి. వీళ్ళకే నాబాధ తెలీట్లేదు, నామాట వినటంలేదు. ఇంతలో ఏదో గుచ్చుకొంది, ఇంజక్షన్ అనుకొంటాను, నా జ్ఞాపకాలు, సుందరం మాటలు కరిగి పోతున్నాయి. నిద్ర వస్తున్నట్లు ఉంది, మత్తు ఇచ్చినట్లున్నారు.

నేను కళ్ళు తెరిచేసరికి icu లో ఉన్నాను. రెండు రోజుల తరువాత గది లోకి మార్చారు.

"తాతయ్యా సుందరం ఎవరు?" మనవడు ఎందుకు అడిగాడో అర్థం కాలేదు. చిన్నాడికి నాపరిస్తితి అర్థమైనట్లు ఉంది.

"ఏంలేదు నాన్నా, నీకు బాగా లేనప్పుడు ఏవేవో పలవరించావు, అసలు మా ధ్యాసలో లేవు. అవి పిల్లాడు విన్నాడు" అంటూ మనవడి కేసి తిరిగి, "సుందరం అనే ఆయన తాతగారికి చిననాటి స్నేహితుడు, కలిసి పెరిగారు, కలిసి ఒకే ఆఫీస్ లో పనిచేసి రిటైర్ అయ్యారు," అన్నాడు.

"ఏడిసాడు, తను నాకు స్నేహితుడేంటి, ఆఫీసులో నాక్రింద ఉద్యోగి, అహంకారి, ఏం చేసినా నాదే తప్పు అన్నట్లు మాట్లాడేవాడు, ఇప్పుడు తన గురించి ఎందుకు", విసుగ్గా అన్నాను.

చిన్నాడు పకపకా నవ్వేసాడు, "కాదులేరా, సుందరనికే తాతయ్య స్నేహితుడు". ఈమాట ఇంకా చిరాకు పెట్టినా నేనేం మాట్లాడలేదు. "డాక్టర్ ఏమన్నాడురా" మాట మార్చాను.

"ఏం చెప్పలేదు నాన్నా, కానీ, ప్రమాదం దాటింది ఫరవాలేదు అనిమాత్రమే చెప్పారు" అన్నాడు.

"పెద్దాడికి చెప్పావా?".

"ఆ, చెప్పాను, తను రావడానికి ఏవో అడ్డంకులు వచ్చాయి, అయినా తేలిగ్గానే ఉంది కదా, నెమ్మదిగా వీలుచూసుకొని వస్తానన్నాడు".

"మరి డబ్బులు ఏమైనా పంపాడా?" అన్నాను.

"నేనడగలేదు, ఆమాటలు రాలేదు, అయినా నాదగ్గర ఉన్నాయి నాన్నా, అవేం ఆలోచించకు" అన్నాడు.

"ఏమిటి ఆలోచించకు, నువ్వేం సంపాదిస్తున్నవో నాకు తెలీదా, నీతోటి లాయర్లు అందరూ లక్షలు సంపాదిస్తున్నారు, నీకులా మడి కట్టుకొని ఎవరూ కూర్చోరు", కొంచెం చిరాగ్గానే అన్నాను.

చిన్నాడు ఏం మాట్లాడలేదు. కాసేపాగి బయటికి వెళ్ళాడు. మనవడు అక్కడ ఉన్న మందులు అవీ పరిశీలిస్తున్నాడు.

"ఏం రా, నువ్వు డాక్టర్ అవుతావా?" అన్నాను.

"డాక్టర్ అయితే బాగా డబ్బు వస్తుందా తాతయ్యా" అన్నాడు.

"ఆ, గొప్ప పేరు, హోదా, నీ పెద్ద నాన్న లాగా అమెరికా వెళ్ళొచ్చు, పెద్ద కారు, బంగాళా, చాలా బాగుంటుంది" అన్నాను.

తను కళ్ళు పెద్దవి చేసుకొని చుట్టూ చూస్తూ, "మరి మానాన్నకి ఎందుకు లేవు?" అన్నాడు.

"మీనాన్నా సంపాదించొచ్చు, కాని, తను అదో టైపు, చెప్పినా వినడు" అన్నాను. ఎప్పుడు కోడలు వచ్చిందో చూడలేదు,

"పిల్లాడితో అల్లా మాట్లాడతారెంటి, మీ రెండో అబ్బాయి పెద్దబ్బాయి లాగా ఉంటే ఈరోజు మీరు ఎక్కడ ఉండేవాళ్ళు?" గొంతు నొక్కిపెట్టి మాట్లాడినా తన కోపం స్థాయి తెలిసిపోతోంది.

"అసలు నీకు ఏం కావాలిరా" అన్న సుందరం మాటలు గుర్తుకు వచాయి. ఈమాట తను చాలాసార్లు అన్నాడు.

అవి నా పెద్ద కొడుకు అమెరికాకి వెళ్ళుతున్న రోజులు. తను ఇండియా లోనే ఉండాలని నాకోరిక. వాడంటే నాకు ప్రాణం.

"మీ గురించి ఇక్కడే ఉండిపోనా? అక్కడికి వెళ్ళితే నాకే కాదు, నాభార్య పిల్లల జీవితమే మారిపోతుంది" అన్నాడు.

"అదే డబ్బు ఇక్కడా సంపాదించొచ్చు కదా" అన్నాను.

"ఆ సంపాదించొచ్చు, ఏం చేసుకోను, మంచి గాలి ఉండదు, నీరు ఉండదు, నా పిల్లలకి మంచి చదువు చెప్పే స్థాయి టీచర్లకి లేదు, ఉన్నా ఆ నిబద్ధత లేదు, జనానికి సివిక్ సెన్స్ ఉండదు, ఎవడి ఇష్టం వాడిది, ఈ డర్టీ కంట్రీ లో ఏం చేసుకోను డబ్బుని" అన్నాడు.

"చిన్న విషయాల్ని పెద్దవి చేసి మాట్లాడకు. నువ్వూ, నేనూ అలాగే ఉన్నాం, నీకు మెడిసిన్ లో సీటు అలాగే వచ్చింది, నీకన్నా డబ్బు ఉన్నవాళ్లు చాలా మంది ఇండియాలోనే ఉన్నారు, ఎవరూ దేశం వదిలేసి పోలేదు" అన్నాను.

"ఎవడి అదృష్టం వాడిది నాన్నా, నాకు అవకాశం వచ్చింది – చదివాను, ఇంతకన్నా బాగా బ్రతికే అవకాశం వస్తే బు బుద్ధి ఉన్నవాడు ఎవడూ వదులుకోడు" అన్నాడు.

"ఎందుకు వదులుకోరు, నీ తమ్ముడు ఉన్నది చాలు అనుకోలేదా, ఇంకా ఇంకా కావాలని అయిన వాళ్ళని వదులుకొని తను వెళ్ళతాడా" అన్నాను.

పెద్దాడు చాలా విచిత్రంగా చూసాడు నాకేసి. ఒక్క క్షణం తను ఏమీ మాట్లాడలేదు.

"తమ్ముడి పద్ధతి నీకు నచ్చిందా" అన్నాడు.

నేను షాక్ తిన్నాను. నిజమే, తన పద్ధతి నాకు నచ్చడమేమిటి?. తనకి అస్సలు బాగుపడే లక్షణాలు లేవు, డబ్బు విలువ తెలీదు. నీ అన్నయ్యని చూసైనా నేర్చుకోరా అని ఎన్ని సార్లు తిట్టానో. కొంతకాలం మాట్లాడటం మానేసాను కూడా. తను జీవితంలో బాగుపడడు. ఇప్పుడు తన గూర్చి ఇల్లా ఎందుకు అన్నానో నాకే తెలీలేదు. నా స్థితి పెద్దాడికి బలాన్నిచినట్లుంది,

"వాదన వద్దు నాన్నా, అమెరికా వేళ్ళుతున్నాను అంతే, నీకంతగా నన్నొదిలి ఉండలేక పోతే నాతో రావచ్చు" అన్నాడు.

ఇక నేనేమీ మాట్లాడలేక పోయాను.

ఆ తరువాత ఒక సారి సుందరం తో మాట్లాడుతూ అన్నాను, "నాకంతగా కావాలంటే రావచ్చు అన్నాడు కానీ, తనకి నేను రావాలని లేదురా".

"నువ్వు అలా ఊహించుకొంటున్నావేమో, అనవసరంగా బాధ పడకు" – సుందరం సముదాయించాడు.

"అది కాదురా, నాకు భార్య పోయింది, నాకోడలికి అమ్మ, నాన్న ఇద్దరూ ఉన్నారు. వాళ్ళను తీసుకెళితే పనిలో తల్లి సాయం ఉంటుందని కోడలు తనతో అంది. వాళ్లకి కూడా టికెట్స్ తీసుకొని చాలా రోజులు అయ్యింది కానీ, నాకు తీసుకోలేదు, వస్తావా అని అడగలేదు. నావల్ల ఉపయోగం లేదు అని వాళ్ళ లెక్క. తనకి డబ్బు పిచ్చి పట్టింది రా".

నా మాటలు సుందరానికి బాధ కలిగించిందో, జాలి కలిగించిందో అర్థం కాలేదు. "అసలు నీకు ఏం కావాలిరా? తన చిన్నతనం నుంచి నువ్వే ఇవన్నీ నేర్పావు, ఇవాళ్ళ అవే తప్పు పడుతున్నావు" అన్నాడు సుందరం.

"అవును తనూ ఇదే ప్రశ్నించాడు" నాలో అనుకొన్న మాటలు బయటికే వచ్చేసాయి.

మనవడు ఇంటినుంచి తెచ్చిన పళ్ళు, నా బట్టలు సర్దుతున్నాడు. కోడలు ఆఫీస్ నుంచే తిన్నగా వచ్చినట్లుంది, అలసటగా కూర్చుంది.

నర్స్ వచ్చి ఇంజక్షన్ని రెడీ చేస్తూ అడిగింది "మీ అబ్బాయి ఏం చేస్తున్నారు?".

తను అడిగింది నా రెండో అబ్బాయి గురించే అని తెలుసు. కానీ అక్కడ ఇంకా చాలా మంది ఉన్నారు, నలుగురిలో చెప్పడానికి ఏముంది తన గురించి? నాకు వైద్యానికి కూడా తనదగ్గర డబ్బు సరిపోతుందో లేదో. నేను సంపాదించాను కాబట్టి ఆ ధైర్యంతో తను ఈ కార్పొరేట్ హాస్పిటల్ కి తీసుకొచ్చి ఉంటాడు.

అందుకే పెద్దబ్బాయి గురించి చెప్పాను, "అమెరికా లో పెద్ద డాక్టర్" అని.

"నువ్వు చూసింది ఆయన రెండో అబ్బాయిని, హైకోర్ట్ లో లాయర్ ఆయన" అంది నా కోడలు. తన స్వరం తీవ్రంగానే ఉంది.

నర్స్ కోడలి కేసి తిరిగి అంది, "ఆయన గురించి తెలియగానే పెద్ద డాక్టర్ గారు చాలా ఆనందంగా ఫీల్ అయ్యారు. ఆయన తండ్రికి వైద్యం చేయడం తన అదృష్టం అన్నారు. తన ఫీజు బిల్ లో వేయద్దని చెప్పారు. చాలా జాగ్రత్తగా చూసారు. మందు ఖర్చులు కూడా డాక్టర్ గారే పెట్టుకొంటారట. పెద్ద డాక్టర్ గారి వల్లే మీ మామగారు బ్రతికారు, సమయానికి ఆయన ఇక్కడ ఉండటం అదృష్టం".

మనవడు చేస్తున్న పని ఆపేసి నర్స్ కేసి చూస్తూ ఉండిపోయాడు. కోడలి చూపులో ఒకింత గర్వం, నామీద ఏదో భావం రెండూ చిత్రంగా కలిసున్నాయి. నర్స్ మాటలు నాకు అర్థం కాక పోయినా రెట్టించలేదు. ఇంతలో డాక్టర్ వచ్చాడు. చాలా చిన్న వయసులోనే పెద్ద పేరు

సంపాదించాడు. రొటీన్ గా చెక్ చేసి, "మీకేం భయం లేదు రెండు మూడు రోజులు ఉంచి డిశ్చార్జ్ చేసేస్తాం. మీ అబ్బాయి గురించి వినటమే గానీ చూసే అదృష్టం మీ కారణంగా కలిగింది. ధైర్యంగా ఉండండి" అన్నాడు నాతో.

"చాలా థాంక్స్ మీ వల్లే మా మామగారు కోలుకొన్నారు, మేం మర్చిపోలేని సహాయం చేసారు" అంది కోడలు.

"భలేవారే మీరు అలా అనకూడదు, మీ వారు ఎల్లాంటి కేసులు వాదిస్తారో ఎంత మంది జీవితాలు నిలబడ్డాయో మాకు తెలుసు. ఆయన ఆర్టికల్స్ పేపర్లో చదువుతూ ఉంటాం. న్యాయం కోసం చేసే ఆయన ఫైటింగ్ స్పిరిట్ చాలా గొప్పది, దాంతో పోలిస్తే ఇదెంత" అని మనవడి దగ్గరికి వెళ్లి "మీనాన్న గారిలా గొప్పవాడివి కావాలోయ్" అని భుజం తట్టి వెళ్ళిపోయాడు.

కాసేపటికి చిన్నబ్బాయి వచ్చాడు. మనవడు తండ్రి చేతిలో బాగ్ అందుకోవడం, తండ్రి ప్రక్కనే కూర్చుని తండ్రి చేతిమీద తన చేయివేసి, తండ్రి కేసి ఆరాధనగా చూడడం చిన్నాడు గమనించలేదు కాని, కోడలు చూసింది. కోడలి మొఖంలో వెలుగు నేను చూసాను. నాకు అర్థం కానిదేదో అర్థం అయినట్లనిపించింది. అయినా వీటి విలువెంత, ఇల్లాంటి వాటి గురించి లోతుగా ఆలోచించకూడదు అనుకొన్నాను.

"ఏదీ లోతుగా ఆలోచించక పోవడం మన సంస్కృతి అయిపోయింది!" – సుందరం మాటలు గుర్తుకు వచ్చాయి.

మా పెద్దబ్బాయి అమెరికా వెళ్ళిన రోజులవి. తనంటే నాకు పిచ్చి ప్రేమ. తను లేకపోవడాన్ని తట్టుకోవడం కష్టంగా ఉంది. దానికి తోడు భార్య కూడా లేదు. ఏ ప్రయత్నమూ నాకు శాంతినివ్వలేదు, నా వంటరి తనాన్ని పోగొట్టలేదు. ఆరోజుల్లోనే నేను మారు మనసు పొందాను. ఈ క్రొత్త ప్రయత్నం కొంత శాంతి నిచ్చింది. పైగా ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చింది. ఇది ఆ దేవుని దీవెన అనుకున్నాను. ఇంతవరకు చాలానే సంపాదించాను. ఇక నాకు డబ్బు పై వ్యామోహం ఏమిటి అనిపించింది. పైగా పై అధికారిని అవటం వల్ల వ్యవస్థాపరంగా నావాటా నాకు వస్తుంది. నేను వద్దన్నా కుదరదు, వాళ్ళు నొచ్చుకొంటారు. ఎప్పుడూ సీరియస్సుగా ఉండే నాముఖం చిరునవ్వుతో ఉండటం మొదలైంది. అప్పటినుంచి మనసు ఎంతో ప్రశాంతంగా మారిపోయింది. నా క్రింది ఉద్యోగస్తులు సాయంత్రం నాలుగు మంచి మాటలు చెప్పించుకోవడానికి వస్తుండేవారు. క్రమంగా కొత్త "సాయంకాలం మిత్రులు" ఏర్పడ్డారు. నాలో ప్రశాంతత మరింత పెరిగిందనిపించింది.

ఒక రోజు ఓ ముసలాయన ఆఫీసు లో నారూం కి చాల కోపంగా వచ్చాడు. అతని కొడుకు పోయాడు. కంపెంసేటరీ గ్రౌండ్స్ లో కొడుకు ఉద్యోగం భార్యకి వస్తుంది. ఆ ఫైల్ మా ఆఫీసులో ఉంది. అదీ కాక, ఆ అమ్మాయికి ఉద్యోగం ఇదే ఊర్లో, ఇక్కడే వచ్చేలా చేసి సాయం చేయాలి. ఆ ముసలాయన కోడలు ఆఫీస్ కి వచ్చినప్పుడు ఆఫీస్లో "వాడు" ఎవరో అసభ్యంగా ప్రవర్తించాడని కంప్లైంట్ చేయడానికి వచ్చాడు. చాలా బాధ పడ్డాను. కూర్చోబెట్టి సముదాయించి ఆయనకి న్యాయం చేస్తానని ధైర్యం చెప్పాను. నేను భక్తిమార్గం పై రాసిన పుస్తకం ఒకటి ఇచ్చాను.

కళ్ళ నీళ్ళు పెట్టుకొని, "మీరు దేముడు సార్" అని నమస్కరించి వెళ్లి పోయాడు.

వాడ్ని పిలిచి తప్పుకదయ్యా అని మందలించాను.

"అదేంలేదు సార్ నేను రొటీన్ గా "ఖర్చు అవుతుంది" అనే అన్నాను.

"లంచం ఇవ్వకుండా ఎలా పని అవుతుందో నాకు తెలుసు– అని, ఇలా గొడవ చేసింది సార్" అన్నాడు.

ఏమో నాకెందుకు అని ఊరుకొన్నాను. ముసలతను నన్ను కలవడానికి రెండు మూడు సార్లు వచ్చాడు కాని, నాకెందుకు ఈ గొడవ అని, "నాకు పని వత్తిడిగా ఉంది, అతని పని చూసి పంపించేయండి" అని చెప్పాను.

అనుకోకుండా ఒక రోజు దీనిపై ఎంక్వయిరీ ఆర్డర్స్ తో పై అధికారి వచ్చాడు. మర్నాడు ఎంక్వయిరీ.

వాడు వణికిపోతూ నాదగ్గరికి వచ్చాడు. "సార్ మీరే ఆదుకోవాలి, పిల్లలు కలవాడిని" అన్నాడు. స్టాఫ్ ని అడిగితే వాడు తప్పు చేసాడని నిర్ధారించారు. సుందరం ఆ రోజు తను సెలవులో ఉన్నాను గాబట్టి తెలీదు అన్నాడు.

"అయినా, వాడు ఇలా చేయడం ఇదే మొదటిసారి కాదు, వాడి వల్ల బాధపడినవాళ్ళు చాలా మంది ఉన్నారు. అసలు వాడు సర్వీసు అంతా ఇలాగే గడిపాడు, ఇది ఇలాగే వదిలేయడానికి వీల్లేదు" అన్నాడు సుందరం.

"సరే జరిగిందేదో జరిగింది, వాడు తప్పు ఒప్పుకున్నాడు, పిల్లలు గలవాడు, ఏదో పెద్ద వాడిగా దైవ భక్తి ఉన్నవాడిగా చెబుతున్నా, మనం క్షమించాలి, మనలో తప్పులు చేయంది ఎవరు?, వాడు ఆడపిల్లలా కన్నీళ్ళు పెట్టుకొని ఏడుస్తుంటే గుండె కరిగిపోతోంది, ఎంక్వయిరీ లో మీరు రాసే దానిమీద వాడి కుటుంబం భవిష్యతు ఉంటుంది" అని చెప్పి వెళ్ళిపోయాను.

ఆ తరువాత సుందరం తన సహోద్యోగస్తులతో ఆవేశంగా చాలాసేపు మాట్లాడాడట.

ఎంక్వయిరీ ఆఫీసర్ చుట్టం, నా సాయంకాలం మిత్రుల్లో ఒకడు ఉన్నాడు. అతని దగ్గరికి వాడ్ని తీసుకెళ్ళి పరిచయం చేసాను. పాపం పశ్చాతాప పడుతున్నాడు. కాస్త సహాయం చేయమని అడిగాను. అతను సహాయం చేస్తానన్నాడు.

మర్నాడు ఎంక్వయిరీ పూర్తయింది. రిపోర్ట్ తయారైయింది. ఎంక్వయిరీ ఆఫీసర్ ఆ ముసలాయన్ని, అతని కోడల్ని తన గదిలోకి కబురు చేసాడు. "మీరు పెద్దవారు, అమ్మాయి కష్టాల్లో ఉంది. అందుకే చెబుతున్నా. మీ అప్లికేషనులో లోపాలు ఉన్నాయి, డాక్యుమెంట్లు అన్నీ పెట్టలేదు, ఇవి మీకు పోస్ట్ ద్వారా తెలియ చేసారు. అయినా అది మీకు అంది ఉండకపోవచ్చు అది వేరే సంగతి. వీటన్నిటికీ రికార్డు ఆధారాలు ఉన్నాయి. అందుకే మీ ఫైల్ కదలలేదు. మీరు కావాలని కంప్లైంట్ ఇచ్చినట్లు, వాడ్ని బెదిరించినట్లు ఆఫీసులో కొంతమంది రాసారు, ఇంకొంతమంది తమకు తెలీదు అని రాసారు. సుందరం అనే ఆయన ఒక్కరే మీరు చెప్పింది నిజం కావచ్చు అనిరాసాడు. అదికూడా ఆరోజు ఆయన సెలవులో ఉన్నందువల్ల ఏమీ తెలీదు అని రాసాడు. ఇప్పుడు మీ పరిస్థితి మరీ ఘోరంగా మారుతుంది. ఈ ఎంక్వయిరీ ప్రభావం మీమీద ఎలా పడుతుందో, పోయిన మీ అబ్బాయి స్థానంలో ఎప్పుడు ఈ అమ్మాయికి ఉద్యోగం వస్తుందో తెలీదు, మీరు కంప్లైంట్ వెనక్కి తీసుకొని పని అయ్యేల్లా చూసుకోండి, తరుమాత మీ ఇష్టం. ఒకసారి పెద్దాయనతో మాట్లాడమ్మా, మీ మామగారితో నేను మాట్లాడాల్సినవి కొన్ని ఉన్నాయి" అని అమ్మాయిని నా దగ్గరికి పంపించాడు.

అమ్మాయి అందంగానే ఉంది అనుకొన్నాను చూడగానే. వాడు కాకపోతే ఇంకొకడు పట్టుకొంటాడు, మామగారు తప్ప నా అనేవాళ్ళు లేరు ఎలాబ్రతుకుతుంది?.

"చూడమ్మా, నిన్ను చూస్తే చాలా బాధగా ఉంది. ఎక్కడో ఒకచోట ఉద్యోగం చేసుకొని నువ్వు బ్రతకాలి, పిల్లల్ని పెంచాలి, రోజులు బాగాలేవు, ఏవడైనా దుర్మార్గుడి చేతిలో పడితే జీవితం నాశనమైపోతుంది. నీకు నా అనేవాళ్ళు లేరు, భర్త పోయాడు, మామగారికి పెద్దవయసు వచ్చేసింది. వాడు నీతో ఎలా ప్రవర్తించాడో, ఏమన్నాడో తెలీదు కానీ, నాకు తెలిసినంత వరకు వాడు డబ్బు, పలుకుబడి ఉన్నవాడు, మంచివాడు, రెండు చేతులా సంపాదిస్తాడు, అలాగే ఖర్చు పెడతాడు కూడా. డబ్బు విషయంలో ఇలా ఖర్చు పెట్టేవాళ్ళు అందరూ ఉండరు. నువ్వు కంప్లైంట్ వెనక్కి తీసుకొంటే నీకు మంచి జరుగుతుంది. నువ్వు ఇంకొంచెం ధైర్యం చేసుకొంటే జీవితం ప్రశాంతంగా వెళిపోతుంది, సుఖపడతావు అనిపిస్తోంది" అన్నాను.

అమ్మాయి ఆలోచిస్తూ ఉండిపోయింది.

నాకున్న దైవభక్తి వల్ల నాలో ఎంతో శక్తి వచ్చిందని నా నమ్మకం. నా మాటతీరు, ప్రవర్తన, ఎంతో మారాయి. నా గొంతులో ధ్వనించే ప్రేమ, నిజాయితీ అమోఘమైనవి. నా మాటలు పనిచేస్తున్నాయని గ్రహించాను.

ఆ సాయంత్రం వాడు వచ్చాడు.

"సార్, మీరేం చెప్పారో కాని ఆ అమ్మాయి వెళుతూ వెళుతూ నాదగ్గరికి వచ్చి సారీ సార్ అంది. కంప్లైంట్ వెనక్కి తీసుకొంటారట, మీ ఋణం తీర్చుకోలేను" అన్నాడు.

"అమ్మాయి మంచిదయ్యా బాగుంది, అన్యాయం చెయ్యకు" అన్నాను.

"అయ్యో గురువు లాంటివారు మీరు, మీకు మాటిస్తున్నాను, డబ్బు విషయంలో ఎవరికైనా ఇప్పుడైనా లోటు చేసానా" అన్నాడు.

వాడు వెళ్ళిన గంటలోపే సుందరం చాలా విసురుగా వచ్చాడు. అంత కోపంగా తనని చాలాసార్లు చూసినా, ప్రతీ సారీ నాకు భయం వేస్తుంది.

"ఏం మాట్లాడావ్ ఆవిడతో?" అన్నాడు.

"ఆవిడా? ఎవరూ?" అన్నాను.

"నీకు తెలుసు ఎవరో, సరిగా మాట్లాడు" అన్నాడు.

"నువ్వు పై అధికారితో మాట్లాడే పద్ధతి బాగాలేదు, నువ్వే సరిగా మాట్లాడు", కొంచెం మృదువుగా అన్నా నాగొంతులో తీవ్రత దాచలేక పోయాను. మళ్ళీ సర్దుకొని అన్నాను, "చూడు సుందరం, నేను వాడికే కాదు ఎవరికీ అపకారం చేయలేను. ప్రేమ తప్ప ఈ కోపాలు, సాటి కొలీగ్ మీద ద్వేషం లాంటీవి నాకు సరిపడదు. నీలా నేను తీవ్రవాదిని కాదు. ఆ అమ్మాయి ఉన్న పరిస్థితిలో, ఉన్నంతలో మంచి మాటే చెప్పాను, నాకు ఇందులో స్వార్ధం ఏమీలేదు".

సుందరం ఒకసారి సాలోచనగా చూసాడు. "నేను నీ ఫిలాసఫీ వినటానికి రాలేదు. ఇదివరకులా నేను వంటరివాడిని కాదని చెప్పడానికి వచ్చాను, నాలాంటి వాళ్లకు ఒక బలమైన ఆయుధం దొరికింది" అన్నాడు.

"ఏం చేస్తావ్?" కొంచెం పరిహాసంగా అన్నాను.

"నీ రెండోకొడుకు ఏం చేస్తున్నాడు?" సుందరం ప్రశ్న నాకు అర్థం కాలేదు, సందర్భం లేకుండా ఇదేం ప్రశ్నా? "లాయర్ గా హైకోర్ట్ లో ప్రాక్టీసు చేస్తున్నాడు" అన్నాను.

"అతను వాదించే కేసులు ఎలాంటివి, ఎలా వాదిస్తున్నాడు?" మళ్ళీ అడిగాడు. ఇప్పుడు అర్థమైంది. అంటే సుందరం నా కొడుకు సహాయంతో కోర్ట్ కి వెళ్ళతాడన్న మాట. నారెండో కొడుకు దేశాన్ని ఉద్ధరించేవాడిలా, పనికి మాలిన కేసులన్నీ తీసుకొని వాదిస్తున్నాడు. సంపాదన ఏమీ లేదు కానీ నలుగురిలో గొడవ మనిషిగా తయ్యారయ్యాడు. తన తెలివి అంతా రూపాయి లాభం లేని కేసులు నెగ్గడానికి వాడుతున్నాడు. మనకెందుకు రా అంటే వినడు.

సుందరం అన్నంత పనీ చేసాడు. నా రెండో కొడుకు ఈ కేసు వాదించాడు. వాడి ఉద్యోగం పోయింది, ఆ అమ్మాయికి మా ఆఫీస్ లోనే ఉద్యోగం వచ్చింది. ఇంతా చేసి ఆ అమ్మాయి రెండో, మూడో ఏళ్ళు ఉద్యోగం చేసిందంతే. సుందరం, నాకొడుకు కలిసి ఏదో సంబంధం కుదిర్చి, ఆ అమ్మాయి మామగారిని ఒప్పించి, మళ్ళీ పెళ్లి చేసారు. ఆ అమ్మాయి ఉద్యోగం మానేసి వెళ్ళిపోయింది.

"ఈ మాత్రానికే వాడి ఉద్యోగం పోగొట్టావు కదరా, వాడి కుటుంబం ఉసురు నీకు తగులుతుంది" అన్నాను.

సుందరం విచిత్రంగా చూసాడు నాకేసి. "ఈ దేముడు, నీ భక్తీ, నిజమేనా?, అవి నీ జీవితం లోకి వచ్చాయా?" అన్నాడు.

"ఏం?, ఈ మార్గం నా జీవితంలో ఎంతో మార్పు తీసుకొచ్చింది. నాకు దేవుని నిదర్శనాలు కూడా ఉన్నాయి" అన్నాను.

“ఈ మార్పు నీకూ నీ అంతరాత్మ కీ మధ్యలో మరో అడ్డుగోడ, నీ స్థితి నీకు తెలీకుండా నువ్వు వేసుకొన్న మరో బలమైన ముసుగు, ఇంతకన్నా నీ పాత స్థితి, నీ కొడుకుమీద బెంగా, బాధ, అవే నయం, కనీసం నీకు నీ అనుభూతులేనా తెలిసేవి. ఇది మత్తులా ఏమీ తెలీనివ్వట్లేదు, అదే శాంతి అనికొంటున్నావు” అన్నాడు.

నాకు తన స్థితిని చూసి చాలా జాలి వేసింది. “ఒరేయ్ నీ మాటలు వినే వాళ్ళు, అర్ధం చేసుకోనేవాళ్ళు ఎవరైనా ఉన్నారా?” అన్నాను.

కాసేపు నిశబ్దంగా ఉండి “అవును ఏదీ లోతుగా ఆలోచించక పోవడం మన సంస్కృతి అయిపోయింది!” అన్నాడు.

అవును, తను చెప్పింది నిజం, నేను ఎప్పుడూ లోతుగా ఆలోచించలేదు, అసలు ఆలోచనే చేయలేదేమో!. నాకు ఇప్పుడిప్పుడే నా చిన్నకొడుకు అర్థమవుతున్నాడు. అది డాక్టర్ గారు మనవడి తో అన్నమాటలవల్ల జరిగిందా? ఏమో, నేను ఇంతకాలం చిన్నాడి దగ్గర ఉన్నందువల్ల కలిగిన భాగ్యం అనిపించింది.

“నీ చిన్నకోడుకు దగ్గరే నీ చివరి రోజులు గడవాలని కోరుకో. అది నీకు మంచి చేస్తుంది” అన్న సుందరం మాటలు గుర్తుకు వచ్చాయి.

అవి సుందరం చివరి రోజులు, నాలాగే ఇదే హాస్పిటల్ లో చేరాడు. కాకపోతే తను నాలా అనారోగ్యంతో హాస్పిటల్ కి రాలేదు, తనని ఎవరో తీవ్రంగా కొట్టారు. ఏ వెధవో తన వల్ల నష్టపోయి, దారి కాసి కొట్టి వుంటాడు. ఇలా జరుగు తుందని తనకీ తెలుసు. ఐనా దానికి సిద్దపడే ఉన్నాడని నాతో చాలాసార్లు అన్నాడు. తను బెడ్ మీద ఉండగా చివరిగా చెప్పిన మాటలు మళ్ళీ వినిపిస్తున్నాయి. “ఒరేయ్, నువ్వు ఆస్తికుడిని అని చెప్పుకొనే నాస్తికుడివి, ఏ మతానికీ చెందని వాడివి. ముందు నువ్వు నాస్తికుడివని గ్రహించు. ఈ నీ జీవితానికి అదే సార్ధకత. నేను నాస్తికుడినని నాకు తెలుసు. ఆస్తికుడిగా మారాలని, నిదర్శనం కోసం వెదుకుతున్నాను. నువ్వు అనుకొన్నట్లు నేను ఎవరికీ ఉపకారం చేయలేదు. నా అన్వేషణలో అవి భాగాలు మాత్రమే. ఆ ప్రయత్నాల్లో నాకు నేను కొద్దికొద్దిగా అర్థం అవుతున్నాను. నా లోపాలు సరిచేసుకోవదానికి చేసే ప్రయత్నమే ఎదుటి వారికి చేసే సహాయంగా అందరికీ కనిపించేది. ఆస్తికుడిగా మారడం మన వల్ల అవదురా!, కానీ, ఆ ప్రయత్నం చాలు, చాలా హాయినిస్తుంది, నీకు ఎంతో స్వేచ్చనిస్తుంది. అసలు స్వేచ్ఛ అంటే ఏమిటో తెలుస్తుంది. నీ చిన్నకోడుకు దగ్గరే నీ చివరి రోజులు గడవాలని కోరుకో. అది నీకు మంచి చేస్తుంది”.

ఎంత దగ్గరగా సుందరం మాటలు వినిపిస్తున్నాయో అంత దూరంగా నాకు సుందరం ఉన్నాడని అనిపించింది. నాకు సుందరాన్ని చూడాలని ఉంది అని అనిపించింది.

“సుందరం నువ్వు నాకు అర్ధమవుతున్నావు, నిన్ను చూడాలని ఉంది, నీ దగ్గరికి రావాలని ఉంది” అన్నాను.

నాకళ్ళు మూసుకొనే ఉన్నా అన్నీ కనిపిస్తున్నాయి. నా చిన్నబ్బాయి, కోడలు, మనవడు, ఉలిక్కి పడటం నాకు తెలుసు.

చిన్నబ్బాయి నాదగ్గరికి వచ్చి “ఏమిటి నాన్నా” అంటున్నాడు. కుదిపి మాట్లాడించడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇప్పుడు నాకు సమాధానం ఇవ్వాలని అనిపించట్లేదు. కోడలు డాక్టర్ దగ్గరికి అనుకొంటా, పరుగెడుతోంది. మంచం పై పడి ఉన్న నా శరీరం నాకు కనిపిస్తోంది. దీన్నే out of the body feeling అంటారేమో. నా ఈ కొత్త రూపం, మంచం పై పడిఉన్న ఆ శరీరం కన్నా ఎన్నో రెట్లు తేలికగా, హాయిగా ఉంది. కాని ఈ స్థితిలో ఉండలేని పరిస్థితి. ఈ స్థితి ఎంత బాగుందో అంతగానూ బాధిస్తోంది. నేను అని నేననుకోనేది ఏదో కరిగి పోతోంది. నన్ను నేను భక్తుడినని, మంచివాడినని, నా ఉదాసీనతే మంచితనమని, ఇలా ఉండకపోతే బ్రతకలేమని, ఎన్నో, ఎన్నెన్నో నాకు నేను చెప్పుకొన్న ఎన్నో అబద్దాలు, వేసుకొన్న ఎన్నో ముసుగులు, కట్టుకొన్న ఎన్నో గోడలు, అవన్నీ చిరిగి పోతున్నాయి, కూలిపోతున్నాయి. నాకు నేను ఏ ఆచ్ఛాదన లేకుండా కనిపిస్తున్నాను. నా గుర్తింపుకోసం, నా స్వార్ధం కోసం, చేసిన పనులు, అన్న మాటలు, వాటివల్ల ఎదుటి

వారిలో కలిగిన బాధ, నేను చిన్నప్పుడు తూనీగను తాడుతో కట్టి ఆడినప్పటి ఆ తూనీగ బాధ నుంచి, భర్త పోయి సహాయం కోసం నాదగ్గరికి ఆ అమ్మాయి వచ్చినప్పుడు, నామాటలకు తను పడిన బాధ వరకు అన్నీ తెలుస్తున్నాయి. అన్నీ గుర్తుకు వస్తున్నాయి. వీరందరి బాధ ఒక్కొకటిగా కాదు, ఒకేసారి గుర్తుకు వస్తున్నాయి, నాలోంచే ఆ బాధ పుట్టి నాకు అనుభవంలోకి వస్తోంది. దుర్భరమైన బాధ.

సుందరం దూరంగా కనిపించాడు. "సుందరం నాకేమైంది, ఇది స్వర్గంగానూ ఉంది, నరకంగానూ ఉంది, నాకు సహాయం చేయి" నేను అనుకొన్నది సుందరానికి తెలిసింది.

"స్వర్గం నరకం ఏదీ కాదు. నీకు నువ్వు తొడుక్కొన్న ముసుగుల భారం పోయి, నీకు నీవు తేలికగా ఉన్నావు. నువ్వు కట్టుకొన్న గోడలనుంచి బయటకి వచ్చి ఈ కొత్త ప్రకృతికి దగ్గరగా ఉన్నావు. అందుకే హాయిగా ఉన్నావు. ఇది మనం ఇంతవరకు ఉన్న ప్రకృతి కన్నా ఉన్నతమైనది. మన గురించి మనం మర్చిపోయే మరుపు, మనకు మనం వేసుకొన్న ముసుగులు అన్నీ మనం ఇంతకాలం ఉన్న ఆ ప్రకృతిలో తయారైనవి. అవి అక్కడే కలిసి పోయాయి. అక్కడ జీవికి, జీవికి మధ్య ఆచ్ఛాదన ఉంటుంది. ఒకరు అనుకొన్నది చెబితే కానీ మరొకరికి తెలియదు. అక్కడి ఆచ్ఛాదన ఇక్కడ ఉండక, అన్నీ అనుభవంలోకి వస్తాయి. ఒకే శక్తి నిరంతరం మనందరిలో ప్రవహిస్తూ ఒకరు అనుకొన్నది మరొకరికి తెలుస్తుంది. నీ పనులే నిన్ను బాధిస్తున్నాయి. ఒకే ప్రకృతి, నీకు నరకం గానూ, నాకు స్వర్గంగానూ ఉంటుంది. తేడా మనలోనే ఉంది" సుందరం భావం నాలోకి వచ్చింది.

"ఈ సుఖం కావాలని ఉంది, కానీ ఈబాధ పడలేకపోతున్నాను, నాకు సహాయం చేయి సుందరం" అన్నాను.

"నేను అందుకే వచాను. నువ్వు ఆచ్ఛాదన ఉన్న ఆ ప్రకృతిలోనే ఉండలేక పోయావు, ఏ ఆచ్ఛాదన లేని అంతకన్నా స్వేచ్ఛామయమైన ఈ ప్రకృతిలో ఎలా ఉంటావు?" సుందరం మాటలు మా తాతయ్య మాట్లాడినట్లే ఉంది.

నా చిన్నతనంలో వేసవికి మా తాతయ్య ఊరికి వెళ్ళేవాళ్ళం. మా తాతయ్య పాముని చేత్తో పట్టుకోని దూరంగా తీసుకెళ్ళి వదిలేసేవారు అంటే సుందరానికి చాలా ఆశ్చర్యమేసి ఓ వేసవికి, మాతో మా తాతయ్య ఇంటికి వచ్చాడు. తెల్లటి గడ్డం, సన్నని పొడవైన శరీరం. వయసు పై పడినా చలాకీ తనం పోలేదు మా తాతయ్యకు. ఇల్లు, ఇంటి వెనుక మామిడి తోట. సాయంత్రం మామిడి చెట్టుకింద మంచాలేసుకొని సుందరం నేను కబుర్లు చెప్పుకొంటున్నాము. ఇంతలో తాతయ్య బయటి నుంచి వచ్చారు.

"తాతా, నువ్వు పాముని చేతితోనే పట్టుకొంటావు అని చెబితే చూస్తానని సుందరం వచ్చాడు, ఒకసారి మాకు చూపించవా" అన్నాను.

"మనం కావాలని దాని జోలికి వెళ్ళకూడదు, దానికీ ఇష్టాయిష్టాలు, స్వేచ్ఛ ఉంటాయి, ఆ సమయం వస్తే చూపిస్తాను" అన్నారు.

"మరి పాము కాటువేయదా" అన్నాడు సుందరం.

"దానికి అవసరం అనిపిస్తే వేస్తుంది, మనం సరిగా ఉంటె అదెందుకు కాటేస్తుంది, దానికి మనం ఆహారం కాదు కదా!" అన్నారు.

ఇంతలో పెరట్లో ఆవు అరిచింది. "వస్తున్నా రా రాముడూ" అంటూ లేచారు.

"తాతగారు మిమ్మల్ని ఆవు పిలిచిందా?" సుందరం ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆవు అరుపులో తేడా ఉంటుంది. నేను బయటినుంచి రాగానే ముందు దానిదగ్గరికే వెళ్ళాలి, లేకపోతే ఊరుకోదు" అంటూ, ఆవు దగ్గరికి వెళ్లి, గంగడోలు దువ్వుతూ ఏవేవో కబుర్లు చెబుతున్నారు. దాని వొళ్ళు కడిగి, తవుడు పెట్టి, పాలు పితికి, స్నానం చేసారు.

భోజనం అయ్యాక, ఆరుబయట వెన్నెల్లో మంచం వేసుకొని ఊరివాళ్ళతో ఏవో మాట్లాడుతూ గడిపారు. వాళ్ళు వెళ్ళిపోయాక మేము తాతగారి ప్రక్కనే కూర్చొన్నాము. ఆయన చిన్నతనంలో విషయాలు చెబుతున్నారు.

"తాతగారూ మీరు ఆవుతో మాట్లాడుతున్నారు కదా, దానికి అర్థమవుతుందా?" సుందరం అడిగాడు.

"నాకోసం అది అరిచే అరుపు లో తేడా నాకర్థం అయినట్లే, దానికీ అర్థం అవుతుంది. నేను చెప్పే పదాల అర్థం కన్నా ఆ మాటల వెనుకనున్న అనుభూతి, నా ప్రేమ దానికి అర్థం అవుతుంది. అది పాలిచ్చే యంత్రం కాదు. దానికి ప్రేమ ఉంటుంది. దాని పిల్ల పోయినప్పుడు అది ఎంత ఏడ్చిందో, నాకు జ్వరం వచ్చి దాన్ని కలవని రోజుల్లోనూ అంతే ఏడ్చింది, గడ్డి ముట్టలేదు. నేను వచ్చి తినిపించాకే అది తింది".

మేము ఈ కబుర్లు చెప్పుకొంటుండగానే బాగా పొద్దు పోయింది. లోపలికి వచ్చి పడుకోమని నాన్న నుంచి పిలుపొచ్చింది. ఈ వాళ్ళ తాత దగ్గరే పడుకొంటానన్నాను.

"బయట దోమలు ఉంటాయి, రాత్రి పాములు తిరుగుతాయి ప్రమాదం లోపలి వచ్చేయ్" అన్నాడు నాన్న. నాకు అంతవరకు అందంగా కనిపించిన వెన్నెల, చెట్ల ఆకుల శబ్దాలు, చల్లని గాలి ఇప్పుడు భయపెట్టడం మొదలు పెట్టాయి.

" తాతయ్యా, చీకట్లో దయ్యాలు ఉంటాయట నిజమేనా? " అన్నాను.

"ఏమోరా నాకెప్పుడూ కనిపించలేదు. అయినా పొద్దుపోయింది లోపలికి పోయి పడుక్కో" అన్నాడు తాతయ్య.

సుందరం తాత దగ్గరే పడుకొంటానన్నాడు. నేను లోపలి వెళ్ళిపోయాను.

మర్నాడు, నేను లేచేసరికే సుందరం తాతయ్య తో పాటు లేచి స్నానం, పూజ చేసి, పొలానికి వెళ్ళాడట. రాత్రి తాతయ్య, సుందరం చాలా సేపు మాట్లడుకోన్నారట. దయ్యం మనలోనే ఉంటుందట. మన స్వార్థమే మనల్ని భయపెట్టి నాలుగు గోడల మధ్య తలుపులు మూసుకొని పడుకోనేలా చేస్తుందట. మనం ప్రకృతిని ప్రేమించడం మానేసి, వస్తువుల్లా వాడుకోవడం మొదలు పెట్టాకే ప్రకృతి మనకు భయానకంగా కనిపించడం మొదలైదట. ఆవుని, మొక్కలని పూజించడం అంటే వాటికి తిండి పెట్టడమో, హారతి ఇవ్వడమో కాదు, మన ప్రేమ అవి పంచుకోవాలి, అవి మనల్ని ప్రేమించాలి, అవి మన జీవితంలో భాగాలు కావాలి. ఒక్క ఆవు మాత్రమే కాదు, మనం ప్రేమిస్తే అన్నీ ప్రేమిస్తాయట. పాముల్ని ఎలా పట్టుకోవాలో చూపించారట. సుందరానికి నేర్పుతానన్నారట. నేనూ తాతయ్యను అడిగాను నాకూ నేర్పమని.

"ఆరుబయట పడుకొంటే వచ్చే భయం నీకు పోవాలి, ఇక్కడ ఉండే ఆనందం నీకు తెలియాలి. మనసులో పాముల్ని పట్టుకొని ఆనందించాలి అన్న కోరిక నీకు ఉండకూడదు. నీ తోటి ప్రాణిగా వాటిమీద నీకు ప్రేమ ఉండాలి. అలా కానప్పుడు, అది పాముతో చెలగాటం అవుతుంది" అన్నాడు తాతయ్య. నేను మళ్ళీ మాట్లాడలేదు, ఆరుబయటా పడుకోలేదు.

ఆ సమయంలో నాది విచిత్రమైన స్థితి. ఆరుబయట బాగుందని తెలుసు, అయినా అక్కడ ఉండలేని ఏదో భయం. లోపల గదిలో వేడిగా, అదో వాసనతో ఉన్నా ఏదో ధైర్యం, రోజూ ఆరుబయట పడుకోవాలని ప్రయత్నించే వాడ్ని. కానీ ఏదో భయం నన్ను ఇంట్లోకి తీసుకెళ్ళి పోయేది. ఆ ఊర్లో ఉన్నన్ని రోజులూ సుందరం తాతయ్య తోనే పడుకొనే వాడు. తాతయ్య తోనే తిరిగేవాడు.

ఆ ఊరి నుంచి వచ్చేటప్పుడు తాతయ్య సుందరం తో అన్నాడట "నువ్వు నేర్చుకొన్నది పాముని పట్టుకోవడం కాదు నిన్ను నువ్వు ప్రేమించుకోవడం, నీ లోపాలను సరిచేసుకొని ఇతరుల్ని ప్రేమించడం. ఇది ఎప్పుడూ మరచిపోకు, తనకు తాను దూరమైనవాడు ప్రకృతికి భయపడతాడు".

ఇప్పుడు నా స్థితి నాకు స్పష్ట పడుతోంది. ఈ కొత్త ప్రకృతిలో నేను ఉండలేను. ఈ బాధ తట్టుకోలేను, ముందు ఈ బాధ పోవాలి. నా భావం సుందరానికి అర్థమైదనుకొంటాను, సుందరం భావం నాలోకీ వస్తోంది. నాకు నేను ఎరుకలోకి వచ్చినప్పుడల్లా ఈ బాధ అనుభవంలోకి వస్తుంది. దీన్ని నా అనుభవంలోకి తెచ్చుకొంటేనే ఈ భారం పోతుంది. ఇప్పుడు నాముందు మూడు మార్గాలున్నాయి. ఈ భారం ఇక్కడే దించుకొని తక్కువ భారంతో అక్కడికి వెళ్లి సుందరం లాగా జీవించడం. రెండు, ఈ భారంతోనే, వెళ్లి అక్కడ కొంత దించుకొని ఉన్నంతలో

అక్కడ సుఖపడటం. మూడు, నాకు నేను తెలీనంతగా మరింత బలమైన ముసుగు వెతుక్కొని, అది వేసుకొని అక్కడికి వెళ్ళిపోయి ఈ బాధకు దూరంగా పారిపోయే ప్రయత్నం చేయడం. ఏదైనా అది నా నిర్ణయమే, నా గమ్యం నేనే ఎన్నుకోవాలి.

***

కథ వెనుక కథ

ఈ కథ వెనుక కథ నడుస్తున్న మనందరి కథే. మన పరిస్థితులే. మారుతున్న విలువల వెనుక బీజ రూపంలో ఉన్న మన చిన్న చిన్న తప్పులే. ఆవు గట్టున మేస్తుంటే అంతకన్నా తెలివైన దూడ చేలో మేయదా? మనం వాడుతున్న వస్తువులే కాదు మన ఆలోచనలు, పనులు, అన్నీ నాసిరకమేనేమో అనిపించింది. మనల్ని మనం సమర్థించుకొనే పనిలో మనమే మనల్ని మోసం చేసుకోవడం, మన జీవితాన్ని సుఖమయం చేసే విలువల స్థానంలో మనం డబ్బును చేర్చడం తెలిసో తెలియకో స్త్రీ పురుష భేధం లేకుండా అందరం చేస్తున్న పనే. మనకు మనం చేసుకొనే ఈ మోసం విస్తృతి ఎంత పెద్దదో, బలమైనదో గ్రహించిన కొద్దీ భయమేస్తుంది. ఆలోచనల్లోని బానిసత్వాని గుర్తించడం, తొలగించడం ఎవరివల్లా కాదేమో అనే భయం, నిరుత్సాహం, తగ్గించుకోవడానికి ఈ కథను రాసాననిపించింది. ఏది ఏమైనా, నాకు తృప్తి కరమైన సమాధానం నాకు దొరకలేదు. నాలోని ప్రేరణే అయినా, నాకు పూర్తిగా ఇది అని తెలియదు అని మాత్రం గ్రహించాను. రచయిత

# సవ్యాజమానవులు

ఎల్కెక్ట్రాన్

## వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 18వ ఉగాది రచనల పోటీలో ఎంపికైన ఉత్తమ కథానిక

**డిసెంబరు నెల. రాత్రి ఎనిమిది గంటల ప్రాంతం.** చలిగాలి పొగమంచు తెరల్ని చీల్చుకుంటూ వచ్చి, ఆ భవనం విశాల ప్రాంగణంలో వేసిన షామియానాలో కూర్చుని కబుర్లాడుకుంటున్న బంధు వర్గాన్ని కొద్దిగా ఇబ్బంది పెడ్తోంది. షామియానాలోని మెర్క్యూరీ దీపాలు వెలుగునిస్తున్నాయే కానీ వెచ్చదనాన్ని ఇవ్వటంలేదు. చాలాకాలం తర్వాత కలుసుకున్న బంధుమిత్రులు ఆప్యాయంగా చెప్పుకుంటున్న మాటల వెచ్చదనంలో వారు తమని ఇబ్బంది పెడుతున్న చలిని గురించి అట్టే పట్టించుకోవటంలేదు. పెళ్ళికూతురు ప్రియంవద చుట్టూ నలుగురైదుగురు స్నేహితురాళ్ళు చేరి వేళాకోళం పట్టిస్తున్నారు. అరచేతులనుండి జబ్బలదాక గోరింట రంగవల్లులు దిద్దించుకున్న ప్రియంవద, మాటల సందడిలో అవెక్కడ చెరిగిపోతాయేమోనని కాస్త బెదురుతోనే ఉంది. ప్రియంవద తల్లి రంగనాయకి అటూ ఇటూ తిరుగుతూ హైరాన పడిపోతూ, అర్థం పర్థంలేని పనులు పురమాయిస్తూ, అక్కడ కూర్చున్న వారి పెదాల మీద చిరునవ్వులు కలిగిస్తోంది. అంతలో ఓ టాక్సీ గేటులోపలికి వచ్చి షామియానా పక్కనే ఆగింది. టాక్సీ తలుపు తీసుకుని ఓ ఆరడుగుల

అందగాడు ఓ బ్రీఫ్‌కేసు తీసుకుని దిగాడు. టాక్సీ డ్రైవర్ డిక్కీ తెరిచి రెండు సూట్‌కేసుల్ని కిందకి దించి పక్కగా పెట్టి, డబ్బులు తీసుకుని, రివర్స్ చేసుకుంటూ గేటు దాటాడు. ఆ యువకుడు షామియానాలో అడుగు పెట్టగానే అందరి దృష్టి అతని మీద పడింది. ఆ అపరిచిత వ్యక్తి ఎవరైయుంటారా అన్న ఆలోచన చాలామందిలో కలిగింది.

ప్రియంవద స్నేహితురాలొకామె అతని కేసి చూసి, ''ప్రియా! నీకు కాబోయే మొగుడొచ్చాడనుకుంటా! నువ్వు చూపించిన ఫోటోల్లో కన్నా అందంగా ఉన్నాడు'' అంది.

ప్రియంవద చివ్వున తలతిప్పి చూసింది. ఎదురుగా, తనవైపే హుందాగా నడిచి వస్తూన్న సునీల్. సునీల్ మరో నాలుగడుగులు వేసి, బ్రీఫ్‌కేసుని కిందపెట్టి చేతులు చాచాడు. ప్రియంవద కళ్ళలో వెయ్యి జ్యోతుల వెలుగు.

'సునీల్' అంటూ లేచి పరుగెత్తుకొంటూ వెళ్ళి, ఒక్క అడుగు ముందుగా హఠాత్తుగా ఆగిపోయింది. ఒకటి చేతులకున్న మెహందీ. రెండు ఇది అమెరికా కాదు. అతనూ సంగతి గ్రహించి గాలిలోకి ఓ ముద్దు విసిరాడు.

అక్కడే తచ్చాడుతున్న రంగనాయకి రెండంగల్లో చేరింది. ''అల్లుడుగారొచ్చారని అయ్యగారితో చెప్పు'' అని ఓ పనివాడికి చెప్పి, ''అదేమిటే, ప్రియంవదా? తీసుకు వెళ్ళి కూర్చోబెట్టు'' అని కూతుర్ని సున్నితంగా మందలించింది.

షామియానాలో అలజడి రేగింది, అమెరికా అల్లుడొచ్చేశాడంటూ. ప్రియంవద తండ్రి సౌజన్యరావు పరుగు పరుగున వచ్చాడు. రంగనాయకీ, సౌజన్యరావులకి సునీల్‌ని ప్రత్యక్షంగా చూడ్డం అదే మొదటిసారి. ప్రియంవద తమకి తెలియకుండా వరుణ్ణి వెదుక్కుందన్న రవ్వంత కినుక అతన్ని చూడ్డంతోనే హరించుకుపోయింది.

సౌజన్యరావు కాస్త తడబడ్తూ, ''నువ్వు .. మీరు మీ తల్లితండ్రులతో బాటు రేపు చెన్నై నుంచి ఉదయం ఫ్లైట్‌లో వస్తూన్నట్లు, మీ బంధువర్గమంతా ఈ సాయంత్రం చార్మినార్‌లో బయలుదేరి రేపు ఉదయానికి ఇక్కడికి చేరుకుంటారనీ మీ నాన్నగారు టెలిఫోన్ చేశారు. కనీసం ముందు కబురు చెపితే మేం ఎయిర్ పోర్టుకి వచ్చేవాళ్ళం కదా?'' అన్నాడు.

''అంకుల్ మీరు నన్ను 'నువ్వు' అని పిలవొచ్చు. అలా పిలిస్తేనే బావుంటుంది. ఇకపోతే నేను మా వాళ్ళతోటే రావల్సింది. ఈ తెల్లవారు ఝామున ముంబయ్‌లో దిగగానే చెన్నై వెళ్ళిపోవలసిన వాడినే. కానీ మా కంపెనీ ముంబయ్‌లో ఓ చిన్న పని అంటగట్టింది. ఆ పని పూర్తిచేసుకుని సాయంత్రం ఫ్లైట్‌లో హైదరాబాద్ వచ్చేశాను. మీ కందరికి సర్‌ప్రైజ్ ఇద్దామని ముందుగా ఎవరికీ చెప్పలేదు'' అన్నాడు సునీల్.

''అక్కడ మీ వాళ్ళు కంగారు పడరూ?'' రంగనాయకి ప్రశ్నించింది.

''వాళ్ళకి ముంబయ్ నుంచి ఫోన్ చేశాను. నేను వస్తున్నట్టుగా మీకు తెలియజేయవద్దని కూడా చెప్పాను. లేకపోతే సర్‌ప్రైజ్ ఎలిమెంట్ ఉండదుకదా, అత్తయ్యగారూ'' అన్నాడు సునీల్.

ఆ సంబోధనకి రంగనాయకి ఉబ్బితబ్బిబ్బై పోయింది. ''వెంకన్నా! అల్లుడిగారి సామాను అవుట్‌హౌస్‌లోకి చేర్చు. వేణ్ణీళ్ళకి గీజర్ ఆన్ చెయ్యి. ఇక నీ డ్యూటీ అక్కడే ఒసేయ్ చెల్లాయి సుశీలా! అవుట్‌హౌస్ దగ్గర అల్లుడిగారికి హారతి ఏర్పాట్లు చూడు'' అని ఆజ్ఞలు పురమాయించింది.

సౌజన్యరావు సెల్ తీస్తూ, ''నువ్వు క్షేమంగా చేరినట్లు మీ నాన్నగారికి టెలిఫోన్ చేస్తాను'' అన్నాడు.

''వద్దంకుల్ నేను ఇక్కడకు చేరినట్లు ఎయిర్ పోర్టు నుంచే ఇందాక ఫోన్ చేశాను. మీ ఇంటికే తిన్నగా వస్తూన్నట్లు కాక, నా స్నేహితుడు మాధవ్ ఇంట్లో దిగుతున్నట్టు ఓ చిన్న అబద్ధమాడాను. ఇక్కడికే తిన్నగా వచ్చేసినా ఏమీ అనరుకానీ, మా అమ్మకి

సాంప్రదాయాలంటే చాదస్తం. వచ్చిన తర్వాత ఎలాగూ తెలుస్తుంది కదా, ముందే అమ్మ మూడ్ పాడుచెయ్యడం ఎందుకు?" సౌజన్యరావు అర్థం చేసుకున్నట్లుగా తలూపి, సెల్‌ని మడిచి జేబులో పెట్టుకున్నాడు.

"మూడు ముళ్ళు పడకముందే పెళ్ళాం కొంగు పట్టుకుని తిరగడానికి వెళ్ళాడని మీ వాళ్ళు అపప్రథ వేయచ్చు" అని ప్రియంవద నవ్వుతూ.

ప్రియంవద మాటలు విన్న వారిలో కొంతమంది 'పెళ్ళికి ముందే అమెరికాలో ఏం అఘోరించారో ఎవరికి తెలుసు?' అని మనస్సుల్లోనే బుగ్గలు నొక్కుకున్నారు. వాస్తవానికి రంగనాయకికీ అలాంటి ఆలోచన ప్రియంవద తమ ప్రేమ విషయమై మొదటిసారి ఫోన్‌చేసి చెప్పినప్పుడు కలిగింది. అయితే ఓ సందర్భంలో ఫోన్లో మాట్లాడుతున్నప్పుడు తన హెచ్చరికల్ని అర్థం చేసుకుని ప్రియంవద భరోసా ఇవ్వడంతో ఆ ఆలోచనని బలంగా అణిచివేసింది.

ప్రియంవద తన వారినందరినీ, స్నేహితురాళ్ళనీ పేరుపేరునా పరిచయం చేసింది. ఆ తర్వాత సునీల్‌తో అంది. "జెట్‌లాగ్‌తోనూ, ముంబయ్‌లో పనితోనూ అలసి ఉంటావు. మా అవుట్‌హౌస్‌లో అన్ని సదుపాయాలూ ఉన్నాయి. ఈ పాటికి గీజర్‌లో నీళ్ళు వేడెక్కి ఉంటాయి. మా వెంకన్న నీకు తోడుగా ఉంటాడు. తమ్ముడు రాజా నిన్నక్కడికి తీసుకు వెడతాడు. హాయిగా స్నానం చేసి సిద్ధంగా ఉండు. రాత్రి భోజనాలు తయారవుతున్నాయి."

రాజా సునీల్‌ని తీసుకువెళ్ళాడు వెంకన్న సాదరంగా అన్ని అవసరాలూ చూశాడు. సునీల్ స్నానం చేసి, దుస్తులు మార్చుకుని, షామియానాలోకి వచ్చాడు. ఆ తర్వాత కబుర్లతో డిన్నర్ ముగిసే సరికి పదిన్నర దాటింది. ఆ పాటికే సునీల్ ఆడపెళ్ళివారందరికీ నచ్చేశాడు. 'అదృష్టవంతురాలివ'ని స్నేహితురాళ్ళు అభినందించారు. రాజుని వెంటబెట్టుకుని ప్రియంవద అవుట్ హౌస్‌కి వెళ్ళింది. వెంకన్న తనూ భోజనం చేసి వస్తానని వెళ్ళిపోయాడు. పడగ్గదిలో రెండు సూట్‌కేసులు తెరిచి ఉన్నాయి. బెడ్ మీద చాలా వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.

సునీల్ ఓ పార్కర్ పెన్‌సెట్ రాజాకిస్తూ అన్నాడు. "నువ్వు కవితలు రాస్తావని మీ అక్కయ్య చెప్పింది. పోటీల్లో బహుమతులు రావాలి, ఆల్ ది బెస్ట్!" రాజా బెడ్ మీదనున్న వస్తువుల్ని వింతగా చూస్తుండగా, సునీల్ సంజ్ఞ చేసి ముందు హాల్లోకి వెళ్ళాడు. ప్రియంవద కూడా అనుసరించింది.

ప్రియంవద చెవిలో గుసగుసలాడుతూ "మీ తమ్ముణ్ణి కూడా తీసుకురావాలా ఏమిటి?" అని కాస్త ఉక్రోషంగా అడిగాడు. "అమెరికాలో నీతో ప్రేమలో పడ్డా, అక్కడ ఆమోదయోగ్యంగా ఉన్న సంస్కృతికి విరుద్ధంగా నన్ను అదుపులో ఉంచుకున్నాను. గమ్యం చేరువౌతున్న కొద్దీ మనిషిలో తొందరపాటు ఎక్కువవడం చాలా సహజం. రేపు మధ్యాహ్నం మూడింటి ముహూర్తంలో ఆ మూడు ముళ్ళూ పడిన తర్వాత నీ ఇష్టం. అంతవరకూ ఓపిక పట్టు. క్షణికావేశంలో ఇంక రేపే పెళ్ళికదాని తొందరపడిపోతామేమోనన్న భయం కొద్దీ రాజాని తీసుకొచ్చాను. వెంకన్న భోజనం చేసి వచ్చి ఇక్కడే హాల్లో పడుకుంటాడు. ఏం కావల్సినా అడుగు" అని నెమ్మదిగా అంది.

ఆ తర్వాత "రాజా! బావగారు విశ్రాంతి తీసుకుంటారు. మనవి సంతకాల పెళ్ళిళ్ళు కావు. బోలెడన్ని తంతులుంటాయి. నిద్రలేకపోతే రేపు పెళ్ళి పీటలమీద నిద్రపోయే ప్రమాదముంది, బయటికిరా!" అని గట్టిగా అంది.

రాజు బయటికి వచ్చిన తర్వాత అక్కా తమ్ముళ్ళిద్దరూ సునీల్‌కి గుడ్‌నైట్ చెప్పి అవుట్‌హౌస్ వదిలారు.

●●●

ఉదయం ఏడింటికల్లా సౌజన్యరావు తమ్ముడు త్రివిక్రమరావు మరో ఇద్దరు బంధువులతో, సికింద్రాబాద్ స్టేషన్‌కి ఓ కాంట్రాక్ట్ బస్సులో చేరుకున్నాడు. ముందుగానే పోర్టర్లని మాట్లాడుకుని టైముకే వచ్చిన చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లోంచి దిగిన మగపెళ్ళివారికి స్వాగతం పలికి, వారినీ, సామాన్లనీ భద్రంగా బస్సులోకి చేర్చాడు.

ఇదివరలో కూతురు అమెరికానుంచి ఫోన్ చేసిన తర్వాత సౌజన్యరావు దంపతులు చెన్నై వెళ్ళి సునీల్ తల్లితండ్రుల్ని కలుసుకుని, లాంఛనప్రాయంగా వారితో మాట్లాడి, వివాహాన్ని ఖరారు చేసుకుని వచ్చారు. అప్పుడు మగపెళ్ళివారమన్న అహం లేకుండా వారు తమనెంతో గౌరవంగా చూశారు. ఎన్ని పెళ్ళిపనులున్నా వాటిని అనుయాయులకి అప్పగించి, సౌజన్యరావు దంపతులు స్వయంగా స్వాగతం పలకడానికి రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో ఎదురు చూడసాగారు. బయటకు వస్తున్న వియ్యంకుడు గంగాప్రసాద్, వియ్యపురాలు భవాని కనపడగానే సౌజన్యరావు దంపతులు ముఖమంతా చిరునవ్వులు పులుముకున్నారు.

అంతలోనే సౌజన్యరావు భ్రుకుటి ముడుచుకుంది. రంగనాయికిలో ఆశ్చర్యం చోటు చేసుకుంది. వచ్చేవారితో మాట్లాడుతూ, లగేజ్ ట్రాలీని తోసుకు వస్తున్న యువకుడు అచ్చు గుద్దినట్టు సునీల్‌లాగే ఉన్నాడు.

"రంగా ఇదేదో విచిత్రంగా ఉంది. వాళ్ళకి కవలలున్నారన్న సంగతి వాళ్ళుకానీ, ప్రియంవద కానీ మనతో చెప్పలేదు. కాని పక్షంలో, సునీల్ చాలా ముందుగా లేచి, మనకి తెలియకుండా ఇక్కడకు వచ్చి, లోపలికి ప్రవేశం ఎలాగో సంపాదించి, తల్లిదండ్రుల్ని రిసీవ్ చేసుకుని ఉండొచ్చు. కంగారు పడి ఏమీ అనకు" అని హెచ్చరించాడు.

సౌజన్యరావు కుడిచెయ్యినెత్తి ఊపుతూ గంగాప్రసాద్ దృష్టిని తమ వైపు మరలించాడు. వాళ్ళు ముగ్గురూ వీరిని సమీపించారు. సౌజన్యరావు డ్రైవర్ ఆ యువకుని నుంచి ట్రాలీని తీసుకుని పార్కింగ్ లాట్‌కి దారితీశాడు. "ప్రయాణం సుఖంగా జరిగిందా?" అని రంగనాయకి భవాని చేతులు పట్టుకుని అడిగింది.

"సునీల్ ఏమిటలా చూస్తూ ఉండిపోయావు? నీక్కాబోయే అత్తమామలు, కాళ్ళకి వంగి నమస్కరించు" అన్నాడు గంగాప్రసాద్ నవ్వుతూ.

"ప్రియంవద వాళ్ళ కుటుంబ సభ్యుల ఫోటోల సీడీలు చూపించింది. ఆ మాత్రం గుర్తుపట్టలేని ఇడియట్‌ను కాను డాడీ. వంగి నమస్కరించడంలో నాకభ్యంతరం లేదుకానీ, మీకుంటుందేమోనని సందేహించాను. అయినా మీ ఆజ్ఞ శిరోధార్యం" అంటూ సునీల్ సౌజన్యరావు దంపతులకు వంగి పాదాభివందనం చేశాడు.

'బ్రహ్మాండంగా నాటకమాడుతున్నాడు, తల్లిదండ్రులకి స్నేహితుని వద్దే దిగానన్న భ్రమ కలిపిస్తున్నాడు' అనుకున్నాడు సౌజన్యరావు. రంగనాయకిని మరోమారు గుంభనంగా హెచ్చరించాడు.

డ్రైవర్ మారుతీ స్టేషన్ వాగన్‌ని తీసుకొచ్చి ముందు నిలిపాడు. వాళ్ళు ముగ్గురూ, రంగనాయకీ మధ్యలో నున్న రెండు వరసల సీట్లలో కూర్చున్నారు. సౌజన్యరావు ముందు సీట్లో కూర్చోగానే, డ్రైవర్ బండెక్కి స్టార్ట్ చేసి కదిలించాడు.

దారిలో సౌజన్యరావు సెల్ మోగింది. "డాడీ, నేను రాజుని. చార్మినార్ సరిగా టైంకే వచ్చింది. అందర్నీ విడిదిలో దింపాము. స్నాతకానికి పెందరాళే పీటలమీద కూర్చోవాలని పురోహితుడుగారు కంగారు పెడుతున్నారు. వాళ్ళు వచ్చారా?"

"వచ్చేశారు, సగందారిలో ఉన్నాం. వీళ్ళు ముగ్గురూ అక్కడికి రాగనే స్నానాలు చేసి, వెంటనే పీటల మీద కూర్చుంటారు. ఈలోపుగా మగపెళ్ళివారందరికీ బ్రేక్‌ఫాస్ట్ సర్వ్ చెయ్యండి" అన్నాడు వెనక్కి తిరిగి, తను తీసుకున్న నిర్ణయానికి అనుమతి కోరుతున్నట్లుగా గంగా ప్రసాద్ వైపు చూస్తూ.

గంగాప్రసాద్ 'అలాగే కానివ్వండి' అన్నట్లుగా తలూపాడు.

''ముగ్గురంటున్నావ్?'' సెల్‌లో రాజు అన్నాడు.

''అదే పెళ్ళికొడుకూ, తల్లిదండ్రులూనూ. అవుట్‌హౌస్‌లో అన్నీ సిద్ధంగా ఉన్నాయో లేవో మరోసారి చూడమని బాబాయితో చెప్పు. వెంకన్నని అటూ ఇటూ పోవద్దని హెచ్చరించు'' అన్నాడు సౌజన్యరావు నెమ్మదిగా.

''వాడిక్కడే ఉన్నాడు. నిన్నరాత్రినుంచీ బావగార్ని బల్లిలా కరుచుకుని ఉన్నాడు. పురోహితుడుగారూ, వెంకన్నా కలిసి బావగారికి పంచె కడుతున్నారు'' అన్నాడు రాజు.

సౌజన్యరావే కనక బండి నడుపుతూ ఉంటే బ్రేక్ మీద కాలు పడేదే. సౌజన్యరావులోని లాయరు బుర్ర పనిచేయసాగింది. రాజుకి మాట్లాడ్డానికి మరి ఆస్కారమివ్వకుండా సెల్ మూసి జేబులో పెట్టుకున్నాడు. ముఖ కవళికల్ని అదుపులో పెట్టుకుని సీటులో ఇబ్బందిగా కదిలాడు.

●●●

ఇల్లు సమీపిస్తుండగా కారుని తిన్నగా తీసుకుపోయి అవుట్‌హౌస్ దగ్గర ఆపమని డ్రైవరికి చెప్పాడు. డ్రైవరు బంగళా లోపలికి పోగానే గార్డెన్‌లోంచి కుడివైపు దారమ్మట వెనకవైపునున్న అవుట్ హౌస్‌కి తీసుకుపోయి బండినాపాడు. అనవసరంగా ఏమైనా గందరగోళం అందరి ముందూ జరగడం ఇష్టంలేక, ''నువ్వు వెంటనే నా చిన్నకారు తీసుకుని హైటెక్ సిటీకి పోయి మా పెద్ద బావగార్ని తీసుకురా. ఈ వాగన్ సంగతి రాజా చూసుకుంటాడు'' అని డ్రైవర్ని అక్కణ్ణుంచి పంపించేశాడు సౌజన్యరావు.

అందరూ ముందు హాల్లో అడుగుపెట్టారు. హాల్లో ఉన్న రాజా వాళ్ళని చూడగానే తొట్రుపాటు పడ్డాడు. అయోమయంగా పడగ్గదివైపు చూశాడు. పడగ్గదిలోంచి పురోహితుడి మాటలు వినవస్తున్నాయి. సౌజన్యరావు అందరితోబాటు ఆ గదిలో ప్రవేశించాడు. ఆ గదిలో దృశ్యాన్ని చూసి అందరూ కొయ్యబారిపోయారు. పంచెకట్టులో ఉన్న సునీల్ ఓ కుర్చీలో కూర్చుని ఉన్నాడు. ప్రియంవద మరో కుర్చీలో కూర్చుని ఉంది. వెంకన్న చేతులు కట్టుకుని నిలబడి ఉన్నాడు. పురోహితుడు స్నాతకమంటే ఏమిటో వివరిస్తున్నాడు.

కుర్చీలో కూర్చున్న సునీల్ వెంటనే లేచి, ''డాడీ వచ్చి రక్షించారు. ఈ పురోహితుడుగారు, స్నాతకం ముగియడానికీ, మధ్యాహ్నం భోజనాలు ముగియడానికీ, పెళ్ళిపీటలమీద కూర్చోడానికీ సమయపాలన అవసరమని ఉదయం నుంచీ పదే పదే చెపుతున్నారు. ఇంతకీ అతనెవరు?'' అంటూ సంభ్రమంగా ముగించాడు.

''ఇంతకీ నువ్వెవరివి?'' గంగాప్రసాద్ ఆశ్చర్యంగానూ, కోపంగానూ ప్రశ్నించాడు.

''అమ్మా! నాన్నగారికి మతేమైనా పోయిందా?'' సునీల్ భవాని కేసి చూస్తూ అన్నాడు. భవాని, ప్రియంవదలు ఇద్దరు సునీల్ని మార్చి మార్చి చూడసాగారు.

''వీరిద్దరూ మీ కవలపిల్లలు, అవునా? కావాలని సరదాగా ఈ నాటకమాడి ఉంటారు. మేము చెన్నై వచ్చినప్పుడు మీకు కవల పిల్లలన్న సంగతి మాకు చెప్పలేదు'' అన్నాడు సౌజన్యరావు నవ్వుతూ.

''మాకున్నది ఇద్దరే సంతానం. ఒకరు సునీల్, మరొకరు మా అమ్మాయి సుజాత. ఇతనెవరో మాకు నిజంగానే తెలియదు'' అంది భవాని.

''ఒకవేళ మీకు నిజంగా కవలలే పుట్టారేమో? పుట్టిన వెంటనే, మీకు తెలియకుండా ఆస్పత్రిలో ఒక బిడ్డని ఎవరైనా మాయం చేసి ఉంటారు. లేదా'' సౌజన్యరావు ఇంకా ఏదో అనబోయాడు.

''అలాంటిదేమీ జరగలేదు. స్కానింగ్ చేసింది మా సంస్థ ఆస్పత్రిలోనే. లోపాయకారిగా మొగబిడ్డ అని మా డాక్టరుగారు చెప్పారు'' అన్నాడు గంగాప్రసాద్.

"రాజూ, వెంకన్నా, నువ్వూ వెంటనే వెళ్ళి పచ్చబొట్లు పొడిచే మన యాదన్నని తీసుకుని రండి. ఈ విషయం బయటకు పొక్కడానికి వీల్లేదు కనక నోరు జారకండి, వెళ్ళండి" అని సౌజన్యరావు వారిని తొందరచేసి పంపించేశాడు. వెళ్ళి హాలు తలుపులు మూసి, గడియ పెట్టి వచ్చాడు. క్రితంరాత్రి సునీల్ వచ్చిన తర్వాత, అతనన్న మాటలతో సహా జరిగిన సంగతులన్నీ వివరంగా చెప్పి అన్నాడు

"గంగాప్రసాద్‌గారూ! ఈ విషయం నా కూతురి జీవితంలోనేకాదు, మనందరి జీవితాల్లోనూ సంక్షోభం సృష్టించే విషయం. మీరు మీ అసలు కుమారుడెవరో గుర్తించ కలగాలి. మా ప్రియంవద తన ప్రియుడెవరో గుర్తించ కలగాలి. అంతవరకూ ఈ పెళ్ళి జరిగే అవకాశం లేదు. నలుగురిలోనూ నగుబాట్లు పొందే అవకాశం ఇరు కుటుంబాలకీ ఉంది. అందుకని ఇరువురం కలిసి పరిష్కార మార్గం ఆలోచించాలి. ఏమంటారు?"

గంగాప్రసాద్‌కి ఏమనాలో తోచలేదు. మౌనంగా తలాడించాడు. పురోహితుడు లేచి వెళ్ళి, సూట్‌లో ఉన్న సునీల్ని, పంచెకట్టులో ఉన్న సునీల్ని, పక్క పక్కన కుర్చీల్లో కూర్చోబెట్టి ఇద్దరి కుడిచేతులూ, ఎడమచేతులూ, చేతుల వ్రేళ్ళూ పరిశీలించాడు.

"నా ప్రాధమిక పరిశీలనలో గమనించిందేమిటంటే - ఒకటే హస్తరేఖలు, ఇద్దరికీ అన్నివేళ్ళ చివరా చక్రాలే తప్ప శంఖులు లేవు, చిత్రంగా ఉంది" అన్నాడాయన ఆశ్చర్యంగా.

"మా వాడికి కుడిచెవి వెనక కందిగింజంత పుట్టుమచ్చ ఉంటుంది" అంది భవాని అవునవునంటూ గంగాప్రసాద్ లేచి వెళ్ళి ఇద్దరి కుడి చెవుల వెనకా చూసి, "ఇద్దరికీ ఉంది" అన్నాడు. సౌజన్యరావు ఇద్దర్నీ పరీక్షగా పరిశీలించాడు. ఇద్దరూ నిశ్చలంగా ఉన్నారు. ఏ విధమైన తొట్రుపాటుకానీ, ఆందోళన కానీ వారి ముఖాల్లో కనబడలేదు. చిద్విలాసంగా ఉన్నారు. ఉన్నట్టుండి ఏదో ఆలోచన తట్టి వెంకన్న చేత రెండు కుర్చీలను గదికి చెరోమూల వేయించాడు. వాళ్ళముఖాలు గోడలవైపు ఉండేటట్లు ఇద్దర్నీ చెరో కుర్చీలోనూ కూర్చోబెట్టాడు. ఆ గదిలో ఉన్న ఓ బల్లసొరుగులోంచి రెండు నోట్‌పాడ్‌లు తీసి ఇద్దరికీ చెరోటీ ఇచ్చాడు. పంచెకట్టు సునీల్‌కి ఎర్రఇంకు, సూట్ సునీల్‌కి, బ్లూ ఇంకుది బాల్ పాయింట్ పెన్నులు అందించాడు.

"గంగాప్రసాద్ గారూ, భవనీగారూ మీ వాడి బాల్యం నుంచీ ప్రస్తుతం వరకూ ఏవో కొన్ని ముఖ్యమైన సంఘటనలు జరిగే ఉంటాయి. ఏవైనా ప్రశ్నలడగండి. వాళ్ళిద్దరూ సమాధానాలు రాస్తారు. వాటిని పరిశీలించి మీరు నిజ నిర్ధారణ చేయొచ్చు" అన్నాడు.

గంగా ప్రసాద్‌కి అంత క్లిష్ట పరిస్థితిలోనూ సౌజన్యరావు వ్యవహరిస్తోన్న తీరు బాగా నచ్చింది. ముందస్తుగా గంగాప్రసాద్, భవానీలు కొన్ని ప్రశ్నలు సంధించారు. వాళ్ళు ప్రశ్నల్నీ సమాధానాల్నీ చకచకా రాసుకుంటూ పోయారు.

"ప్రస్తుతానికి ఇవి చాలు. ప్రియంవదా, ఇప్పుడు నీ వంతు. ప్రశ్నలు ఎంతటి అంతరంగికమైనవైనా నిస్సంకోచంగా అడుగు," అన్నాడు సౌజన్యరావు.

ప్రియంవద కొన్ని ప్రశ్నలడిగింది. వాటికీ వారు సమాధానాలు రాశారు. సౌజన్యరావు పంచెకట్టు సునీల్ వద్దనుంచి నోట్‌పాడ్ తీసుకుని దానిమీద 'హైదరాబాద్ సునీల్' అని రాసి గంగా ప్రసాద్‌కిచ్చాడు. సూట్ సునీల్ వద్దనుంచి నోట్‌పాడ్ తీసుకుని దానిమీద 'చెన్నై సునీల్' అని రాసి దాన్ని పట్టుకుని గంగా ప్రసాద్ పక్కన కూర్చున్నాడు. ఇద్దరూ ప్రశ్నల్నీ, రాబడ్డ సమాధానాల్నీ చదవసాగారు.

నువ్వు పుట్టిన ఊరు రాజవొమ్మంగి నాయనమ్మ పేరు సుభద్రమ్మ, అమ్మమ్మ పేరు మంగతాయారు.

నీకెందరు మేనమామలు ... నలుగురు.

ఎన్నో మేనమామ తన కూతుర్ని నీకిస్తానని వెనకబడ్డాడు - మూడో మేనమామ

ఆపిల్లనెందుకు కాదన్నావు.. ఆ అమ్మాయికి మెల్లకన్నులు.

నీ పన్నెండో ఏట ఓ సంఘటన జరిగింది ఏమిటది..

ఛండీగర్‌లో గాలిపటం ఎగరవేస్తూ డాబామీద నుంచి పక్కింటి ఆవరణలో తలకిందులుగా పడ్డాను. అదృష్టవశాత్తూ అక్కడ ఓ ఇసుక కుప్ప ఉండడం మూలాన ప్రమాదం తప్పింది.

"సమాధానాలిద్దరివీ కరెక్టే అక్షరం పొల్లుపోకుండా ఒకేలా ఉన్నాయి" అన్నాడు గంగా ప్రసాద్ ఆశ్చర్యపోతూ.

"దస్తూరి?" సౌజన్యరావు తన దగ్గరున్న నోట్‌పాడ్ గంగాప్రసాద్‌కి అందించాడు.

"ఇద్దరి దస్తూరీలు అచ్చుగుద్దినట్టు ఒకేలా ఉన్నాయి. దస్తూరి కూడా మా సునీల్‌దే"

సౌజన్యరావు ఎర్ర అక్షరాలతో ఉన్న హైదరాబాద్ సునీల్ రాసిన నోట్‌పాడ్‌ని తీసుకుని ప్రియంవదకి ఇచ్చాడు. చెన్నై సునీల్ నోట్‌పాడ్‌ని గంగాప్రసాద్‌నే చూడమన్నాడు. నువ్వే కంపెనీలో పన్జేస్తున్నావ్.. జనరల్ డైనమిక్స్, ఫోర్ట్‌వర్త్ టెక్సాస్.

నేనే కంపెనీలో పన్జేస్తున్నాను - కోర్‌లాబ్, డల్లాస్, టెక్సాస్ నా రూం మేట్ పేరేమిటి, ఆమె ఏ దేశస్థురాలు.. మిస్.లోపెజ్, వెనిజులా నేను ఈనాటి నా పెళ్ళికని ఇండియాకి ఏ తారీఖున ఏ ఫ్లైట్‌లో అయలుదేరాను. నవంబరు 26న ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఎ-235.

మనం తొలిసారిగా ఎక్కడ కలుసుకున్నాం, ఏం జరిగిందప్పుడు .. వాటర్ గార్డెన్, ఫోర్ట్‌వర్త్ - మీరు కాలుజారి పడిపోతోంటే నేను పట్టుకున్నాను.

"నాన్నగారూ, అన్నీ కరెక్టే. దస్తూరీ కూడా సునీల్‌దే" అంది ప్రియంవద. హాలు బయటి తలుపు తట్టిన చప్పుడు వినిపించి సౌజన్యరావు వెళ్ళి తలుపు తీశాడు. రాజూ, వెంకన్నా, యాదన్నా నిలబడి ఉన్నారు. "అందరూ లోపలికి రండి" అన్నాడు సౌజన్యరావు. ముగ్గురూ హాల్లో ప్రవేశించారు. సౌజన్యరావు తిరిగి గడియ పెట్టాడు. యాదన్నకి సౌజన్యరావంటే విపరీతమైన అబిమానం. ఓ దొమ్మీకేసులో అన్యాయంగా ఇరికించబడ్డ యాదన్నని, అతని తరపున చాలా నైపుణ్యంతో వాదించి నిర్దోషిగా నిరూపించాడు.

సౌజన్యరావు లోపలికి వెళ్ళి పంచెకట్టు హైదరాబాద్ సునీల్, గంగాప్రసాద్‌లతో, తిరిగి హాల్లోకి వచ్చాడు. "యాదన్నా! మా అమ్మాయి పెళ్ళి కబురు నీకు మొన్ననే పంపాను కదా? ఇతను నాకు కాబోయే అల్లుడు. వాళ్ళ ఆచారం ప్రకారం పెళ్ళి ముందు అబ్బాయికి జబ్బమీద పచ్చబొట్టు పొడిపించాలట. నీ నైపుణ్యాన్నంతటినీ ప్రదర్శించి అతని కుడి జబ్బమీద ఏదైనా పచ్చబొట్టు పొడు" అన్నాడు.

యాదన్న సునీల్ భుజం మీదనున్న పట్టుకండువాను కుడి భుజం మీదనుంచి తొలిగించి, కుడి జబ్బను పట్టుకుని చూశాడు. "అయ్యగారు అబ్బాయిగారిది దబ్బపండు లాంటి ఛాయ. ఈ మధ్యనే నీలిగోరింట రంగుని తయారు చేశా, దానితో బొట్టూ పొడుస్తాను. ఏం బొమ్మ పొడవమంటారబ్బాయిగారూ? బుద్దుడా, చార్మినారా, లతలా, పువ్వులా, మీ ఇష్టం" అన్నాడు యాదన్న తన కూడా తీసుకు వచ్చిన రేకు డబ్బా మూత తెరుస్తూ.

"నేను చెప్తాను. చార్మినార్ బొమ్మపొడు" అన్నాడు సౌజన్యరావు.

యాదన్న ఓ సీసాలోని ద్రావకం ఓ చిన్న గాజు దొన్నెలో పోశాడు. కొవ్వొత్తి వెలిగించి, కర్రపిడితో ఉన్న ఓ రాగిసూదిని వేడిచేసి, ద్రావకంలో ముంచుతూ బొట్లు చకచకా పొడవసాగాడు. సునీల్ అబ్బా అని మూలుగుతూ బాధని పళ్ళమధ్య బిగించాడు. యాదన్న తర్వాత మరో ద్రావకంలో దూది ముంచి బొట్లు పొడిచిన చోట శుభ్రంగా తుడిచాడు. చదరపుటంగుళం మేరలో చార్మీనార్ పచ్చబొట్టు బాగా వచ్చింది. నువ్వూ నీ కుటుంబం అందరూ ఈ రెండురోజులూ ఇక్కడే కాస్త సాయంగా ఉండి, భోజనాలు అవీ చెయ్యండి" అన్నాడు.

''వద్దయ్యగారూ నా ఇల్లాలూ, పిల్లలూ వాళ్ళమ్మగారి ఊరెళ్ళారు. ఇంటి దగ్గర నా ముసలి తల్లి ఒక్కర్తే ఉంది. మీ మాట కాదనలేక వచ్చాను.''

''సరేలే పెళ్ళి మిఠాయిలూ అవీ మీ ఇంటికి పంపిస్తాలే, వెళ్ళు,'' అన్నాడు సౌజన్యరావు. యాదన్న ఒకటికి రెండు మార్లు నమస్కరించి వెళ్ళిపోయాడు.

ముగ్గురూ లోపలి గదిలో ప్రవేశించారు. సౌజన్యరావు అందరికీ సునీల్ జబ్బమీద పొడిపించిన చార్మినార్ బొమ్మని చూపించాడు. ''గంగా ప్రసాద్ గారూ ఈ విషయం తేలేవరకూ, మనకి వీరిద్దరిలో ఎవరెవరో తెలియాలి. అందుకనే హైదరాబాద్ మా ఇంటికి తిన్నగా వచ్చిన సునీల్ జబ్బమీద గుర్తుగా చార్మినార్ బొమ్మని పొడిపించాను. ఇతన్ని చార్మినార్ సునీల్ అని, మీతో వచ్చిన సునీల్ని చెన్నై సునీల్ అనీ పిలుద్దాం ఏమంటారు?''

''ఎంతకాదనుకున్నా మీది లాయరు బుర్రే. ఏదో లీలగా తట్టినా, పచ్చబొట్టు పొడిపించడంలోని మీ అసలు ఉద్దేశం ఇప్పుడు పూర్తిగా గ్రహింపుకు వచ్చింది'' అన్నాడు గంగాప్రసాద్.

''నాన్నగారూ మీరు, మీతోబాటు వీరందరూ ఎంతటి వెర్రివారో మీకే తెలియదు. ఎందుకంటే'' అంటూ చెన్నై సునీల్ తను కట్టుకుని ఉన్న కోటు విప్పాడు. టై విప్పి కాలర్ బొత్తం, చొక్కా బొత్తాలు తీసి, కుడి భుజం మీద నుంచి చొక్కాని దిగలాగి చూపించాడు. నీలిరంగులో చార్మినార్ పచ్చబొట్టు అంగుళం చదరంలో అందరికీ కనబడింది. సౌజన్యరావు వెంటనే తేరుకుని, ''భవానీగారూ మీరు మీ అబ్బాయి భుజం మీద పచ్చబొట్టు చెన్నైలోకాని చూశారా?'' అని ప్రశ్నించాడు.

''ఇదివరలో 'అమ్మ కడుపు చల్లగా, అత్తకడుపు చల్లగా' అంటూ తలకి నూనెని దీవెనలతో పట్టించి తలంట్లు పోసేవారు. ఇప్పుడు షాంపూవాష్లూ, షవర్ బాత్లూ వచ్చిన తర్వాత తలంట్లు కాస్తా కొండెక్కి కూర్చున్నాయి. లాల్చీ, జుబ్బాల వాడకం మూలాన మగవార్ని సైతం పై బట్టలేకుండా చూడ్డం జరగట్లేదు.

అంచేత వాడు అమెరికా వెళ్ళిన తర్వాత రెండు మూడు సార్లు వచ్చినా మేం గమనించనూ లేదు, వాడు చెప్పనూ లేదు ఏవమ్మా, ప్రియంవదా నువ్వుకాని మావాడి భుజం మీద పచ్చబొట్టు కాని చూశావా?'' అంది భవాని.

ప్రియంవద కాస్త రోషంగా అంది. ''పరిస్థితి జటిలంగా ఉంది కాబట్టి నా కోపాన్ని దిగమింగుకుని సమాధానం చెపుతున్నాను. నేను సునీల్కి ఎప్పుడూ ఏకాంతంగా కలుసుకునే అవకాశం ఇవ్వలేదు. ఏవో పార్కుల్లో కలుసుకోవడం. హోటల్స్లో డిన్నర్లు చెయ్యడం తప్ప – అతని కుడి భుజం మీద చార్మినార్ పచ్చబొట్టే ఉందో, కుడి చెవి వెనక పుట్టుమచ్చే ఉందో నేనెప్పుడూ గమనించలేదు''

''నేనంత దూరం ఆలోచించలేదు. ఏదో యధాలాపంగా అడిగాను. ఏమీ అనుకోకు,'' అంది భవాని. కాస్త చిన్నబుచ్చుకున్న మొహంతో. చెన్నై సునీల్ నవ్వుతూ అన్నాడు. ''నా మూలాన ఇద్దరి మనసులూ నొచ్చుకోవడం నాకిష్టం లేదు. ఇటీవల న్యూయార్క్లో జరిగిన ఈ అంతర్జాతీయ సాంస్కృతిక ప్రదర్శనలో, ఇటలీనుంచి వచ్చిన జిప్సీలు, వాళ్ళ ప్రదర్శన గుడారంలో పచ్చబొట్ల కార్యక్రమం పెట్టారు. రకరకాల బొమ్మల నమూనాలు ప్రదర్శించారు. అవబోయే అత్తారిల్లు హైదరాబాద్ కాబట్టి చార్మినార్ బొమ్మ పొడిపించుకున్నాను. వివాహం జరిగిన తర్వాత ప్రియంవదకి చూపించి సర్ప్రైజ్ చేద్దామనుకున్నాను.''

సౌజన్యరావు ఆలోచనలో పడ్డాడు. మాటలు కూడదీసుకుంటూ అన్నాడు. ''గంగాప్రసాద్ గారూ! ప్రియంవద అన్నట్లు సమస్య జటిలమైనదదే ఇంకా వివాహం జరగలేదు కాబట్టి మేము తెరిపిలో ఉన్నా, వీరిలో మీ అసలు కుర్రవాడెవరో తెలియడం మీకు చాలా ముఖ్యం. అంతవరకూ పెళ్ళిని వాయిదా వెయ్యడం ముఖ్యం. ఏదో సాకు చెప్పి వివాహాన్ని వాయిదా వేద్దాం, ఏమంటారు?''

''ఏం సాకు చెప్పగలం?''

"ఆడపెళ్ళివారి జ్ఞాతులెవరో ఎగిరిపోవడం మూలాన పెళ్ళిని వాయిదా వేస్తున్నామని చెప్పండి"

"ఛీ ఛ ఇంతటి అమంగళకరమైన అసత్యాన్ని చెప్పడ్మ భావ్యంకాదు. మా వాడికి అమెరికా ప్రెసిడెంట్ ఆఫీస్ నుంచి ఏదో అర్జంట్ కాల్ రావడంతో అర్ధరాత్రి ఫ్లైట్‌కి వెళ్ళిపోవాల్సి వచ్చిందని చెబ్దాం. ఎటొచ్చీ వీళ్ళిద్దర్నీ ఎవరి కంటాబడకుండా ఇక్కణ్ణుంచి తప్పించాలి"

"అలా చెబితే మీడియా, 'అమెరికన్ ప్రెసిడెంట్ సలహాదారుల సంఘంలో ఆంధ్రతేజం' అని వెంటనే స్పందిస్తుంది. మరేదైనా వంక నేనే చెబుతాలెండి. పురోహితుడుగారు, వెంకన్నా, రాజూ, ఈ విషయం ఎవరికీ తెలియకూడదు. గంగాప్రసాద్‌గారూ, వీరిద్దరిలో అసలువారెవరో తెలిసే వరకూ మరో ఆనవాలు ఉండాలి. అదీకాకుండా ఒకసారి ఈ హైదరాబాద్ సునీల్ పెళ్ళి బట్టలు మార్చుకుని మామూలు దుస్తులు ధరిస్తే ప్రస్తుతంన్న ఆధారం కూడా పోయి, ఎవరు చెన్నై సునీలో, ఎవరు హైదరాబాద్ సునీలో తెలియని పరిస్థితిలో పడిపోతాం. యాదన్నని పిలిపించి మరో పచ్చబొట్టు పొడిపిస్తే అతగాడికి అనుమానం కలుగుతుంది. అందుకని.. " సౌజన్యరావు ఏమనాలో తెలియక ఆగాడు.

గంగాప్రసాద్ తన వేలికున్న ఉంగరాన్ని తీసి చెన్నై సునీల్ వేలికి తొడిగాడు. ఆ ఉంగరం మీద వెంకటేశ్వర ప్రతిమ ఉంది. "ఇటువంటి ఉంగరాన్ని హైదరాబాద్ సునీల్ క్షణంలో సంపాదించగలడు" అన్నాడు సౌజన్యరావు.

"ఇటీవలే అంతరిక్షంలోకి పంపిన పోలార్ సాటిలైట్ లాంచింగ్ వెహికిల్ని నేనే నా ఉంగరం వేలుతో బటన్ నొక్కి లాంచ్ చేశాను. అది జయప్రదమైన సంగతి మీకు తెలిసే ఉంటుంది. ఈ ఉంగరం లోపలి అంచులో జయానందస్వామివారు చెక్కించిన బీజాక్షరాలున్నాయి. అందుచేత మీరన్న అవకాశంలేదు" అన్నాడు గంగాప్రసాద్ ధీమాగా.

"మీరందరూ ఇక్కడే గొడవ చెయ్యకుండా ఉండండి. నేనూ, గంగాప్రసాద్‌గారూ అవుట్‌హౌస్‌కి బయట తాళం వేసి, షామియానాలోకి వెళ్ళి ఏదో చెప్పి వస్తాం" అని సౌజన్యరావు లేచాడు.

గంగాప్రసాద్ కూడా భవానీని స్థైర్యంగా ఉండమని చెప్పి బయలుదేరాడు. అవుట్‌హౌస్‌కి తాళం వేసి ఇద్దరూ షామియానా చేరుకున్నారు. తమ్ముడు త్రివిక్రమరావు హడావుడిగా ఉన్నాడు. పురోహితుడి అసిస్టెంట్ మైక్‌ని టెస్ట్ చేస్తున్నాడు. ఉపన్యాసాలకే కాదు, శ్రుతంగా కష్టపడి నేర్చుకున్న మంత్రాలకి కూడా ప్రచారం జరగాలికదా? పురోహితుల వేదభరితమైన కంఠనాదం కూడా అందరికి వినిపించడం న్యాయమేకదా? సౌజన్యరావు మైక్ తీసుకుని అందర్నీ ఉద్దేశించి అన్నాడు. "ఓ చిన్న అలజడి కలిగించే సందేశం. మన సాంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకోవడానికి వధూవరులు విముఖత చూపించారు. మాకు ముందు విషయం అర్ధం కాలేదు. నిన్న అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరూ మాయమైపోయారు. తెల్లవారు ఝామున గోవా ఫ్లైట్‌లో వెళ్ళిపోయారు. ఈ సంగతి ఇప్పుడే వాళ్ళు గోవాలోని ఓ చర్చిలోంచి ఫోన్ చేశారు. వాళ్ళు మతం మార్చుకున్న సంగతి మాకు తెలియదు. అయితే, మీరు మట్టుకు మధ్యాహ్నం భోజనాలు, రాత్రి విందూ చేసి మరీ వెళ్ళమని ప్రార్ధన. వాళ్ళక్కడ పెళ్ళిచేసుకున్న సందర్భంగా మనమిక్కడ సంతోషంగా విందులు చేసుకోవడంలో అసహజమేమీలేదు. వధూవరులకు మీ ఆశీస్సులు సదా ఉండేవే"

వియ్యంకులిద్దరూ కలిసి చేతులెత్తి నమస్కరించడంతో, ఇంకా స్నాతకం మొదలుకాలేదెందుకని అనుకుంటున్న చాలామందికి అనుమాన నివృత్తి అయ్యింది. అనవసరంగా ప్రయాణం ఖర్చులు దండగని కొన్న పెళ్ళికానుకల్ని ఏం చెయ్యాలని - ధనరూపేణా కానుకలివ్వదల్చుకున్నవారు ఖర్చు తప్పిందని - ఇదేం చోద్యమని ఇలా ఆలోచనా తరంగాలు షామియానాలో ప్రసరించాయి. సౌజన్యరావు తమ్ముణ్ణి పిలిచి, "తమ్ముడూ నీకు వివరాలన్నీ తర్వాత చెబుతాకానీ, వచ్చే బంధుమిత్రుల్ని ఎలాగో అలాగ మేనేజ్ చేసి ఈ రోజు గట్టెక్కించు. ఇవ్వాల్సిన సొమ్ములిచ్చి సన్నాయిమేళం వారినీ, ఇతరుల్నీ భోజనాలు పెట్టించి పంపించేయి" అని చెప్పాడు. త్రివిక్రమరావుకు

అన్నగారి మాట రామాజ్ఞ మారు మాట్లాడకుండా అక్కణ్ణుంచి కదిలి నూతన కార్యాచరణకి పూనుకున్నాడు. స్థానికులైన కొంతమంది ముందుగా బెట్టు చూపి తర్వాత భోజనాలకుండిపోయారు. పన్లున్న కొంతమంది సింబాలిక్‌గా ఖాళీ పెళ్ళి పీటలమీద అక్షంతలు జల్లి వెళ్ళిపోయారు.

భారాన్నంతటినీ త్రివిక్రమరావు మీద వదిలేసి ఇద్దరూ అవుట్ హౌస్ చేరుకుని, తాళం తీసి లోపల ప్రవేశించారు. సౌజన్యరావు తలుపు గడియపెట్టాడు. లోపల గదిలో అంతా ప్రశాంతంగా ఉంది. "ఇందాకట్నుంచీ నేనూ, ప్రియంవదా ఎన్నో ప్రశ్నలడిగాం. ఇద్దరి సమాధానాలూ ఒకేలా ఉన్నాయి. ఏం చేసేది?" భవానీ డీలాగా అంది. గంగాప్రసాద్ గదిలోని వారికి బయట సౌజన్యరావు అందరికీ చెప్పిన కారణం వివరించాడు. "సౌజన్యరావుగారు చాలా లౌక్యంగా వ్యవహరించారు. ప్రస్తుతానికి ఈ గండం గడిచినా, అసలు సునీల్ ఎవరో తెలిసిన తర్వాత ఏ అమెరికాలోనో రిజిస్టర్ మేరేజ్ చేసుకోవడం తప్ప గత్యంతరంలేదు. భవానీ మన ముగ్గురికీ, ప్రియంవదకీ రేపు ఉదయం తెల్లవారు ఝాము ఫ్లైట్‌కి చెన్నైకి టికెట్లు రిజర్వ్ చేయించిన సంగతి నీకు తెలిసిందే. ఇప్పుడు ప్రియంవద టికెట్ కాన్సిల్ చేయించి ఈ హైదరాబాద్ సునీల్ని కూడా మనతో తీసుకుపోవడం మంచిది. అసలు సునీల్ ఎవరో అక్కడ బుర్రలు బద్దలు కొట్టుకుందాం. ఈ హైదరాబాద్ సునీల్‌కి టికెట్ రిజర్వ్ చేయించడానికి ఎవర్నైనా పంపండి సౌజన్యరావుగారూ."

"ఇందాకా నేను చేసిన ప్రకటన రేపు పత్రికల అనుబంధ పేజీల్లో తప్పక మరింత మిర్చిమసాలాతో వచ్చేస్తుంది. ప్రయాణీకుల దృష్టంతా ఈ విచిత్రకవలల మీదే ఉంటుంది. కవల పిల్లలని చెప్పినా ఒకే పేరు మీద రెండు టిక్కెట్లుంటే అనుమానాలకి దారి తీస్తుంది. కొంపదీసి ఏ విలేఖరైనా విమానాశ్రయంలో తారసపడి ప్రశ్నలు సంధించడం మొదలు పెడితే తీగతో బాటు డొంకంతా కదుల్తుంది" అన్నాడు సౌజన్యరావు.

"అంత ఉదయం ఏ విలేఖరొస్తాడు కన? అయితే మీరన్నట్టుగా వీరిద్దరివైపూ అందరూ ఆశ్చర్యంగా చూడ్డం ఖాయం. దాంట్లో పెద్ద ప్రమాదమేమీ ఉండదు. ఈ హైదరాబాద్ సునీల్ పేరు వినీల్‌గా మార్చి టికెట్ కొంటే సరిపోతుందిగా?"

"అనకూడని మాట అంటున్నందుకు క్షమించండి. దురదృష్టవశాత్తూ ఏదైనా ప్రమాదం కనక సంభవిస్తే అసలు సునీల్‌కూ, మీకూ ఏమైనా అదో పర్వంకానీ, నకిలీ సునీల్ తల్లి దండ్రులకి ప్రాణ నష్టపరిహారం లభించదు. అతడు చేసిన మోసానికి అతని తల్లితండ్రులకి శిక్ష పడ్డట్లవుతుంది."

"మీదంతా లీగల్ బ్రెయిన్. మీ కందరికీ కష్టంలేని విధంగా నేనీ రాత్రి పదిగంటల ఫ్లైట్‌కి బెంగుళూరు వెళ్ళిపోతాను. వాస్తవానికి ప్రియంవదకీ, నాకూ టిక్కెట్లు ముంబయ్ నుంచే రిజర్వ్ చేయించాను. బెంగుళూరు నుంచి మైసూరు అవీ వెడదామని ప్లాన్ వేశాను. ఇప్పుడు ప్రియంవద టికెట్ కాన్సిల్ చేయించి నేను బెంగుళూరు వెళ్ళి, రేపు ఉదయం ఫ్లైట్‌లో అక్కణ్ణుంచి చెన్నై చేరుకుంటాను. నాన్నగారూ, నేను తిరిగి వచ్చేలోగా మీతో వస్తూన్న నకిలీ సునీల్‌తో జాగ్రత్తగా ఉండడి" అన్నాడు నవ్వుతూ, హైదరాబాద్ సునీల్.

చెన్నై సునీల్ కూడా నవ్వుతూ అన్నాడు. "నేనే కనక నకిలీ సునీల్నయి ఉంటే బీజాక్షరాలుగల ఈ ఉంగరం, దిగ్విజయంగా రాకెట్‌ని అగ్నిజ్వాలలతో అంతరిక్షంలోకి పంపిన ఈ ఉంగరం, నాన్నగారు నమ్మిన ఈ ఉంగరం ఈ పాటికే నన్ను భస్మీపటలం చేసేశేది. అన్నమాట ప్రకారం నువ్వు తప్పక చెన్నైరా. అక్కడ అమ్మా నాన్నలు ఏ సంగతీ తేల్చుకుంటారు. వీళ్ళందర్నీ, ప్రియంవదనీ ఇబ్బంది పెట్టడం భావ్యంకాదు"

"గంగాప్రసాద్ గారూ ఇందులో ఏదో మర్మముంది. చివరిసారిగా మీరేదైనా ప్రయత్నించండి" అన్నాడు సౌజన్యరావు.

గంగాప్రసాద్ ఒక్క నిముషం ఆలోచించి, "నువ్వు అమెరికా వెళ్ళి మొదటిసారి ఎక్కడికి వచ్చావు?" అని చెన్నై సునీల్‌ని అడిగాడు.

"మీరప్పుడు ఢిల్లీలో పనిచేస్తున్నారు. అక్కడికి వచ్చాను" చెన్నై సునీల్ సమాధానమిచ్చాడు.

"అప్పుడు నువ్వు నాకో కానుకనిచ్చావు ఏమిటది?"

"ఆర్థర్ కోనన్‌డాయల్ రాసిన మొత్తం షెర్లాక్ హోమ్స్ కథల పుస్తకాన్ని ఇచ్చాను అప్పుడు"

హైదరాబాద్ సునీల్ అడ్డు తగులుతూ అన్నాడు. "మీకు శుభాభినందనలతో అని రాసి సంతకం పెట్టడానికి. బల్లమీదనున్న పెన్ను తీసి రాయబోతే అది మొరాయించింది. అప్పుడు మీరు మీ జేబులో ఉన్న పెన్ను తీసి నాకిచ్చారు. దాంతో సంతకం చేసి ఇచ్చాను. ఆ పెన్నుని అమ్మ మీకు మీ మొదటి పెళ్ళి రోజున కానుకగా ఇచ్చిందని చాలా సందర్భాల్లో చెప్పారు."

"సౌజన్యరావూ గారూ నేను చేతులెత్తేస్తున్నాను వీరిద్దరికీ చెన్నైలో లై డిటెక్టర్ టెస్ట్ చేయిస్తాను. అంతకుమించి గత్యంతరం లేదు" అన్నాడు గంగాప్రసాద్.

"దుస్తుల్లోకి మారితే ఆనవాలు పట్టడం అసాధ్యం కాబట్టి - ప్రస్తుతానికి మీ ఉంగరం ధరించినవాడే, చెన్నైకి మీ దగ్గరకు వచ్చిన చెన్నై సునీల్. ఉంగరం పోగొట్టుకోకుండా జాగ్రత్తగా ఉండమనండి."

"పోనీ మరో పచ్చబొట్టు చెన్నై సునీల్‌కి అదనంగా వేయిస్తే?" గంగాప్రసాద్ అడిగాడు.

"అదీ పాయింటే శుభస్య శీఘ్రం, పదండి" అని సౌజన్యరావు లేచాడు. గంగాప్రసాద్, చెన్నై సునీల్, సౌజన్యరావులు స్టేషన్ వాగిన్లో ఎక్కి కూర్చున్నారు.

రాజు అవుట్‌హౌస్‌కి తాళం వేసి వాగన్ ఎక్కి డ్రైవింగ్ సీట్‌లో కూర్చున్నాడు. ఆ లోపుగా సౌజన్యరావు వాగన్ తలుపులకున్న సన్‌షేడ్ గాజు పలకల్ని పైకెత్తాడు. రాజు వాగన్‌ని వేగంగా తీసుకుని పోయి యాదన్న ఇంటిముందు ఆపాడు.

యాదన్న వారిని చూసి ఆశ్చర్యపోతూ 'రండి, రండి,' అంటూ చాప పరిచాడు.

"యాదన్నా ఇందాక మా వాడికి నువ్వు కుడిభుజం మీద నీలి రంగులో చార్మినార్ బొట్టు పొడిచావు. మా పురోహితుడుగారు ఫెంగ్‌షూ శాస్త్ర ప్రకారం సమతుల్యంగా ఉండడానికి ఎడమభుజం మీద ఎరుపు రంగులో ఏదైనా బొమ్మ ఉండాలన్నారు. అందుచేత వినాయకుడి బొమ్మ పొడు" అన్నాడు గంగాప్రసాద్.

"ఇదివరకు కేవలం ముంజేతుల మీద పచ్చబొట్లు పొడిపించుకునేవారు. ఇప్పుడు ముంజేతులకే పరిమితం కాకుండా దేహమంతా పొడిపించేసుకుంటున్నారు. మొన్ననో సినిమా నర్తకి బొడ్డు చుట్టూతా పచ్చబొట్టు పొడిపించుకుంది" అన్నాడు యాదన్న రాగి సూదిని ఆముదం దీపంలో కాలుస్తూ.

"ఎవరుట?" రాజు కుతూహలంగా ప్రశ్నించాడు.

"ఏమో? ఎవరో తెలియదు. ఆనవాలు తెలియకుండా మొహం మీద ముసుగు కప్పుకుంది" అన్నాడు యాదన్న.

"తెరమీద చూపించడానికి లేని సిగ్గు, వేయించుకోడానికెందుకో? కొత్తగా విడుదలైయ్యే సినిమాలు చూస్తే ఎవరో తెలిసిపోతుంది. అప్పుడు ఆ విషయాన్ని నీ వ్యాపారాభివృద్ధికి ఉపయోగించుకోవచ్చు" అన్నాడు రాజు.

"ఆ సంగతి చెప్పకూడదని ముందరే కండిషన్ పెట్టేసి వెయ్యి రూపాయలదనంగా ఇచ్చారు." అన్నాడు యాదన్న సూదిని చెన్నై సునీల్ ఎడమ భుజంలో పొడుస్తూ. ఎడమ జబ్బమీద ఎర్రమందారం రంగులో, చదరపుటంగుళం మేరలో వినాయకుడి బొమ్మ వచ్చింది.

"ఇలాంటి సంగతులు అందరికీ తెలిస్తే మా చాదస్తాలకి నవ్విపోతారు. అందుచేత ఈ సంగతి ఎవరితో చెప్పద్దు" అంటూ గంగాప్రసాద్ యాదన్న చేతిలో పన్నెండు వందలు పెట్టాడు. యాదన్న సంతోషంగా ఆ సొమ్ముని కళ్ళకద్దుకున్నాడు.

తర్వాత వాళ్ళు నలుగురూ సౌజన్యరావు అవుట్‌హౌస్ చేరారు. ఆలోగా హైదరాబాద్ సునీల్ చిన్ననాటి విశేషాల గురించీ, తను అల్లరి చేసినప్పుడల్లా తల్లిదండ్రులచేత తిన్న చివాట్ల గురించీ, దగ్గరి బంధువుల గురించీ, ఎన్నో కబుర్లు చెప్పాడు. అన్నీ నిజాలే. గంగాప్రసాద్ వాళ్ళూ తిరిగి రాగానే ఆ విషయాన్ని భవాని చెప్పింది.

"సరేలే, వీరిద్దరిలో ఎవరు మనవాడో ప్రస్తుతానికి ఇదమిద్ధంగా తేల్చుకోలేం. హైదరాబాద్ సునీల్. నువ్వింక మమూలు దుస్తుల్లోకి మారి, రాత్రి నీ బెంగుళూరు ప్రయాణానికి సిద్ధంకా. సౌజన్యరావుగారు, ప్రియంవద బెంగుళూరు టికెట్ కాన్సిల్ చేసేందుకు ఎవర్నైనా పంపించండి" అన్నాడు గంగాప్రసాద్.

"నా లాప్‌టాప్ ఇంటర్నెట్ ద్వారా దాన్ని కాన్సిల్ చేస్తాను, ఎవర్నీ ఇబ్బంది పెట్టనవసరం లేదు నాన్నగారూ. బెంగుళూరు ప్రయాణానికి ఇంకా చాలా సమయముంది. అయినా మీరు చెప్పినట్టుగా సిద్ధంగా ఉండడం మంచిదే" అని ఎడమ భుజం మీదుగా కప్పుకున్న పట్టుకండువాని తీసి మంచం మీద పడవేసి, సూట్ కేసు తెరిచాడు. అప్పుడు సౌజన్యరావు దృష్టి అతని ఎడం భుజం మీద పడింది. వెంటనే "గంగాప్రసాద్ గారూ అటు చూడండి" అని ఆయన దృష్టి హైదరాబాద్ సునీల్ వైపు మరలించాడు. ఎర్రమందారం రంగులో ఉన్న వినాయకుడి బొమ్మ ఎడమ భుజం మీద స్పష్టంగా కనపడింది. గంగాప్రసాద్ విభ్రంగా అడిగాడు. "హైదరాబాద్ సునీల్ ఇందాక ముందు హాల్లో సౌజన్యరావుగారు యాదన్నచేత నీ ఎడమ భుజం మీద చార్మినార్ బొమ్మ పొడిపించారు. నీ ఎడమ జబ్బమీద ఈ వినాయకుడి బొమ్మనెప్పుడు పొడిపించుకున్నావ్?"

"న్యూయార్క్‌లో అంతర్జాతీయ సాంస్కృతిక ప్రదర్శనలు జరిగినప్పుడు గ్రీక్ పెవిలియన్‌లో పొడిపించుకున్నాను. చెన్నైలో వినాయకుడు తమిళుల ఆరాధ్య దైవం కాబట్టి, సరదాగా ఈ బొమ్మ పొడిపించుకున్నాను. ఇందాక హాల్లో యాదన్న నా కుడిభుజం మీద చార్మినార్ బొమ్మ పొడిచినప్పుడు, నా ఎడమ భుజం మీద పట్టు కండువా ఉండడం మూలాన, మీకెవరికీ కనబడలేదు" అన్నాడు చిద్విలాసంగా. సౌజన్యరావు, గంగాప్రసాద్‌లు మరోసారి చేతులెత్తేశారు. రాజు మౌనంగా ఉండిపోయాడు. అంతవరకూ వారెవరికీ తిండీ తిప్పలు లేవు. రాజు గుంభనగా అవుట్ హౌస్‌కి భోజనాలు తెప్పించాడు. వెంకన్నతో సహా అందరూ ఎంగిలి పడ్డారు. అక్కడ త్రివిక్రమరావు భోజనాల సందడి ముగించి అందర్నీ సగౌరవంగా సాగనంపాడు. అతిథులూ, బంధువులూ సౌజన్యరావు, గంగాప్రసాద్‌లను కలుసుకునే ప్రయత్నం చెయ్యక, త్రివిక్రమరావుతో చెప్పి వెళ్ళిపోయారు. వాళ్ళని పలకరిస్తే మతమార్పిడీ, ఉడాయింపూ, అన్యరీతిలో వివాహంలాంటి విషయాల్లో సానుభూతి ప్రదర్శించి మరింత ఇబ్బంది కలిగించడం వారికిష్టం లేకపోయింది.

అందర్నీ సాగనంపి చీకటి పడిన తర్వాత త్రివిక్రమరావు అవుట్ హౌస్ చేరి తలుపు తట్టాడు. రాజు తలుపు తీసి, చిన్నాన్న లోపలికి రాగానే మళ్ళీ తలుపు వేశాడు. లోపలి గదిలో దృశ్యాన్ని చూసి త్రివిక్రమరావు ఆశ్చర్యపోయాడు. సౌజన్యరావు జరిగినదంతా వివరంగా చెప్పాడు. అంతావిని "అన్నయ్యా! ఈ పరిస్థితుల్లో నువ్వు చెయ్యగలిగింది చేశావు. ఇరుపక్షాలా అయిన ఖర్చు వృధాగా పోతే పోయిందికానీ, అసలు విషయం తేలేదాకా, పాపం గంగాప్రసాద్‌గారికి చికాకే" అన్నాడు త్రివిక్రమరావ్ సానుభూతిగా.

రాత్రి పదిగంటల బెంగుళూరు ఫ్లైట్‌కి, హైదరాబాద్ సునీల్ని షంషాబాద్ విమానాశ్రయానికి తీసుకుపోయి రాజు వీడ్కోలు చెప్పాడు. ఉదయం ఫ్లైట్‌కి గంగాప్రసాద్, భవాని, చెన్నై సునీల్‌లు చెన్నై వెళ్ళిపోయారు. సౌజన్యరావు ఎయిర్ పోర్టుకి వస్తానంటే వద్దని వారించాడు గంగాప్రసాద్. నెలరోజులు సెలవు పెట్టి వచ్చిన ప్రియంవదకి మనసు కకావికలమైంది.

"డాడీ! నేను నాలుగైదు రోజుల్లో అమెరికా వెళ్ళిపోతాను. అనవసరంగా సెలవు దండగ" అంది. రంగనాయకి ముందు కాస్త బ్రతిమలాడి నా తర్వాత ఒప్పుకుంది. సౌజన్యరావు కూడా సరేనన్నాడు.

"వీళ్ళిద్దరూ అక్కడ తేలచ్చు. సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశంకాబట్టి వాళ్ళు నిర్ధారణ చేయకలుగుతారేమో? నేను గంగాప్రసాద్ గారితో కూడా చెబుతాను. అయితే ఏ నిజమూ తేలేవరకూ నువ్వు మట్టుకు జాగ్రత్తగా ఉండు," అని సౌజన్యరావు కూతురికి సలహా ఇచ్చాడు.

నాలుగోరోజున ప్రియంవద అమెరికా ప్రయాణానికి సిద్ధమైంది. ఎయిర్ పోర్టువరకు సౌజన్యరావు, రంగనాయకి, రాజులు వెళ్ళారు. వీడ్కోలు తీసుకుని ప్రియంవద లోపలికి వెళ్ళిపోయింది. చూడ్డానికి వీలు లేకపోయినా విమానం ఎగిరేవరకూ ఆగి వెళ్ళే అలవాటు భారతీయ తత్త్వంలో జీర్ణించుకుపోయింది. చెన్నై, హైదరాబాద్, ఫ్రాంక్‌ఫర్ట్, న్యూయార్క్ ఫ్లైట్ టేకాఫ్ చేసినట్టుగా ఎనౌన్స్ మెంట్ వచ్చిన తర్వాత, వాళ్ళు ముగ్గురూ డిపార్చర్ గేట్ వదిలి, ఎరైవల్ గేట్ ముందు నుంచి పార్కింగ్ లాట్ వైపు వెళుతుండగా, "ఒరేయ్ రాజూ నేనిక్కడ" అన్న మాటలు విని ముగ్గురూ అటువైపు తల తిప్పారు. ప్రియంవద లగేజి ట్రాలీతో బయటకు వస్తూ కనబడింది. వడివడిగా వచ్చి "అమ్మా!" అంటూ రంగనాయకిని కౌగలించుకుంది.

"వెళ్ళడానికి మనసొప్పక తిరిగి వచ్చేవా? నేను చెప్తూనే ఉన్నాను కాస్త మనసు కుదుటపడ్డ తర్వాత వెళ్ళవే అన్నా నువ్వు వినిపించుకోలేదు" అంది రంగనాయకి కూతుర్ని వాటేసుకుంటూ.

"అక్కా! డిపార్చర్ లౌంజ్ లోంచి లోపలికి వెళ్ళావు. చివరి క్షణంలో ఫ్లైట్‌కి వెళ్ళకుండా ప్రయాణం వాయిదా వేసుకుంటే డబ్బంతా పోతుందా?" అని ప్రశ్నించాడు.

ప్రియంవద తల్లి కౌగిలించి విడివడుతూ, "ఏమిటీ, మీరనేది? నేనిప్పుడే అమెరికానుంచి వస్తున్నాను. మిమ్మల్నందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తేయాలని చెప్పాపెట్టకుండా వచ్చేశాను. మిమ్మల్ని దూరం నుంచి చూసి నేను నా రాక గురించి తెలియచేయకపోయినా, నన్ను రిసీవ్ చేసుకోవడానికి ఎలా వచ్చారా అని ఆశ్చర్యపోయాను" అంది.

సౌజన్యరావు లగేజ్ టాగ్స్ కేసి గుంభనంగా చూశాడు. ఫోర్ట్‌వర్త్ - న్యూయార్క్ -లండన్ - హైదరాబాద్. "నీ రాక చాలా ఆనందంగా ఉందమ్మా. ఎవరో స్నేహితులు సింగపూర్ వెడ్తూంటే, వద్దంటున్నా వారికి వీడ్కోలు ఇవ్వడానికి రావడం మంచిదే అయింది. రాజూ, స్టేషన్ వాగన్ తీసుకురా: అన్నాడు సౌజన్యరావు. అట్టే రాద్ధాంతం చేయొద్దని రంగనాయకికి కనుసంజ్ఞ చేసి, ప్రియంవదతో క్షేమసమాచారాలు అడగ మొదలెట్టాడు."

●●●

ఇంటికి వెళ్ళిన తర్వాత సౌజన్యరావు తీరుబడిగా అంతా చెప్పి, అన్నాడు. "నువ్వు మా ప్రియంవదవో కావో నాకు తెలియదు. నిన్ను బయటికి పంపే ప్రయత్నం నేను చెయ్యకపోయినా, కావల్సిన వారందరూ నేను ఆపద్ధర్మంగా చెప్పిన అబద్ధం గురించి - అంటే మీ గోవా వివాహం సంగతీ, మతమార్పిడి సంగతి గుచ్చి గుచ్చి అడుగుతారు. సమాధానం చెప్పుకోవలసిన బాధ్యత నీదే!" ప్రియంవద చెప్పిన సంగతి వాళ్ళకాశ్చర్యం కలిగించినా నమ్మక తప్పలేదు.

"నేనింతవరకూ ఎవరి ప్రేమలోనూ పడలేదు. జనరల్ డైనమిక్స్‌లో పనిచేసే సునీల్ ఎవరో నాకు తెలియనే తెలియదు. అసలు ఆ వ్యక్తే ఎవరో తెలియనప్పుడు నేనూ మా ప్రేమగురించికానీ, వివాహంగురించికానీ మీకు ఎప్పుడూ టెలిఫోన్లు చెయ్యలేదు. వాస్తవానికి ఇటీవలి కాలంలో మా కోర్ లాబ్‌కి బ్రెజిల్ సముద్రగర్భంలో తవ్వుతున్న చమురుబావుల నుంచి తీసిన భూమి లోపలి పొరల ఇసుకరాళ్ళని అధ్యయనం చేసే కంట్రాక్ట్ లభించడంతో ఊపిరి సలపనంత పని. అందుచేత మీకు రెండు నెలలుగా ఫోన్లుకూడా చెయ్యలేకపోయాను. ఒకటి రెండుసార్లు ప్రయత్నిస్తే ఏదో రణగొణధ్వని తప్ప ఏమీ వినిపించలేదు. ఆ తర్వాత మరి ప్రయత్నించలేదు. ఇదంతా చూస్తే ఏదో పెద్ద మాయలాగా ఉంది. డాడీ మీరు గంగాప్రసాద్ గారికి ఫోన్ చేసి అక్కడేం జరిగిందో కనుక్కోండి."

సౌజన్యరావు ఫోన్ చేసిన వెంటనే, అవతలి పక్కనుంచి గంగాప్రసాద్ అన్నాడు. "నేనే మీకు ఫోన్ చేద్దామనుకుంటున్నా. తను అన్నట్టుగానే బెంగుళూరు నుంచి హైదరాబాద్ సునీల్ వచ్చాడు. ఇద్దరూ కొట్లాటలు లేకుండా సఖ్యంగానే ఉన్నారు. తర్వాత మీకే నిజం తెలుస్తుందని మా మీదే కొద్దిగా అలిగి ఇద్దరూ ఈ ఉదయం చెన్నై - హైదరాబాద్ - ఫ్రాంక్ ఫర్ట్ - న్యూయార్క్ ఫ్లైట్ కి వెళ్ళిపోయారు. వాళ్ళే పేర్ల మీద టిక్కెట్లు రిజర్వ్ చేసుకున్నారో కూడా నాకు తెలియదు. మేము ఎయిర్ పోర్టుకి వెళ్ళలేదు. ఇప్పుడిప్పుడే అమెరికానుంచి మరో సునీల్ ఫోన్ చేశాడు. తను ఈరోజు సాయంత్రం న్యూయర్క్‌లో బయలుదేరి వస్తున్నట్టు. అంతా అయోమయంగా ఉంది"

సౌజన్యరావు ఇక్కడ జరిగిందంతా చెప్పాడు. అంతా చెప్పిన తరువాత అన్నాడు "బహుశా ఇప్పుడే వచ్చిన ఈ ప్రియంవదా, రేపటికి రాబోయే మీ సునీల్ మనవాళ్ళు కావచ్చు. మీ సునీల్ ఎవరో కూడా తనకి తెలియదంటోంది. ఎవరో కావాలని మనమీద ప్రయోగాలు చేశారనిపిస్తోంది. మీ జాగ్రత్తలో మీరుండండి. అవసరమొస్తే ఫోన్ చెయ్యండి."

●●●

అయితే జరగవలసిన హాని మరోలా జరిగింది. క్షిపణి ప్రయోగంలో గంగాప్రసాద్ అద్భుతమైన మెలుకువలు సాధించాడు. ఆ మెలుకువల్ని కనుగొనడంలో అతను కంప్యూటర్ మీద అనేకానకమైన ఊహాజనితమైన అధ్యయనాలు చేశాడు. వాటిని చెన్నై వెళ్ళిన సునీల్ మాటల్లో పెట్టి కొంతగాను, గంగాప్రసాద్ తన కంప్యూటర్ మీద ఆయన చేసిన అధ్యయనాల్ని చూపించినప్పుడు మరికొంతగాను, ఆయన పాస్‌వర్డ్ గ్రహించి అధ్యయనాల్ని కాపీ చేసి పూర్తిగానూ సమాచారాన్ని గ్రహించాడు. న్యాయ సూత్రాల్ని విశ్లేషించడంలో సౌజన్యరావు దిట్ట. పాశ్చాత్య దేశాలు మనమీద రుద్దదలుచుకున్న అణుశక్తి నియంత్రణలకు సంబంధించిన ముసాయిదా కాపీని, దానికి సంబంధించి మన అణుశక్తి నిపుణులు తయారుచేసిన ముసాయిదా కాపీని పరిశీలించి న్యాయ సంబంధిత మైన లిటిగేషన్ అంశాల్నీ, జాతీయ, అంతర్జాతీయ కోణాల్లో అధ్యయనం చేసి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయవల్సిందిగా ప్రభుత్వం సౌజన్యరావుని నియక్తుణ్ణి చేసింది. సౌజన్యరావు తను వెలిబుచ్చిన అభిప్రాయాల్ని కంప్యూటర్ మీద చూపించినప్పుడు, ప్రియంవద, ఏకసంథాగ్రాహిగా వాటిని బుర్రలో నిక్షిప్తం చేసేసుకుంది. అమెరికా వారి కేంద్ర నిఘా సంస్థ ఇద్దరు నకిలీ సునీళ్ళనీ, ఒక నకిలీ ప్రియంవదనీ సృష్టించి, అసలు సునీల్, ప్రియంవదలని వారికి తెలియకుండా బ్రెయిన్ స్కాన్ చేసి వారి జ్ఞాపకాలను వీరిలోకి బదలాయించి తమకార్యాన్ని దిగ్విజయంగా సాధించింది. అయితే ఒక సునీల్‌తో కూడా కార్యం సాధించవచ్చు. కానైతే క్లోన్లని ఉపయోగించి ఎంత పకడ్బందీగా వ్యవహారం నడిపించవచ్చునన్న దానికి వారీ అవకాశాన్ని చక్కగా వాడుకున్నారు. యాదన్న హైదరాబాద్ సునీల్ కుడి భుజమ్మీద చార్మినార్ పచ్చబొట్టు పొడిచినప్పుడు, చెన్నై సునీల్ తన కుడి భుజం మీద కూడా క్లోన్ సృష్టిలో ఉన్న సాంకేతిక ప్రక్రియల ద్వారా అదే పచ్చబొట్టుని అందరికీ చూపించ కలిగాడు. అదే విధంగా యాదన్న చెన్నై సునీల్ ఎడమ భుజం మీద వినాయకుడి పచ్చబొట్టు పొడిచినప్పుడు, హైదరాబాద్ సునీల్ తన ఎడమ భుజం మీద అదే బొమ్మని చూపించకలిగాడు. అమెరికా కేంద్రనిఘా సంస్థ వారి భూగృహంలో ఈ ముగ్గురికీ ఘనమైన సత్కారం జరిగింది. ఆ విభాగపు అధినేత "ప్రస్తుతానికి రూపాన్నీ, గొంతునీ, గుణాల్నీ, జ్ఞాపకాల్ని, కనికట్టునీ, మన క్లోన్స్‌కి ఇవ్వగలిగాం. ఇక ముందు ఎదుటివారి ఆలోచనా తరంగాల్ని పసిగట్టడం, మల్లయుద్ధ మెలుకువలు నేర్పడం, ఏ రకమైన వాహనాల్నైనా నడపడం లాంటివి కనక సాధిస్తే పరిపూర్ణత లభిస్తుంది. ఇండియాలో మనకి లభించిన ఈ విజయానికి కారకులైన ఈ ముగ్గుర్నీ మరోమారు అభినందిద్దాం" అని నాలుగు మాటలు మాట్లాడి, 'ఛీర్స్' అంటూ వైన్ గ్లాస్ ఎత్తాడు. 'లాంగ్ లివ్ అమెరికా' అంటూ అందరు క్లోన్సూ తమ గ్లాసులెత్తారు.

అయితే ఆ రాత్రి ఆ ముగ్గురి ఇండియా అనుభవాల్ని తుడిచి పారేశారు. రూపాలు మారాయి. గొంతులు మారాయి. వారిని పాకిస్తాన్ పంపే శిక్షణ ప్రారంభమైంది.

●●●

గంగాప్రసాద్ నుంచి ఫోన్ వచ్చింది, "మీరన్నట్టుగా ఇప్పుడొచ్చిన సునీల్ మావాడే నకిలీ ప్రియంవద ఫోటో చూసి అసలు అమ్మాయి కూడా ఇలానే ఉంటే తనకభ్యంతరం లేదని అన్నాడు. వివాహం వరకూ వెళ్ళి ఆగిపోయిన మన బంధుత్వాన్ని తిరిగి నిలబెట్టడం సముచితమని అనిపిస్తోంది. మీ అమ్మాయిని అడిగి చూడండి" అని అర్థించాడు.

"మా అమ్మాయీ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. వీళ్ళ వివాహం మనం కందుకూరులో చేద్దాం" అన్నాడు సౌజన్యరావు.

"కందుకూరా? అదెక్కడుంది?"

"మా పూర్వీకుల గ్రామమట. ఎక్కడుందో నాకూ తెలియదు. మీరిప్పుడు అంగీకారం తెలియజేశారు కాబట్టి ఆ గ్రామమెక్కడుందో ఆరా తీస్తాను. గుట్టు చప్పుడు కాకుండా వివాహం చేద్దాం" అన్నాడు సౌజన్యరావు.

●●●

అణుశక్తి సంబంధాల చర్చలు కొనసాగిన సమయంలో, మనం చెప్పిన ప్రతిదానికీ వాళ్ళు ధీటుగా ప్రతి సమాధానాలు చెప్పినప్పుడూ, అంతరిక్ష పరిశోధనలో క్షిపణులకు కావల్సిన క్రైయోజినిక్ మోటార్లు మన దేశానికి లభ్యం కాకుండా వాళ్ళు నియంత్రించినప్పుడూ, వియ్యంకులకిద్దరికీ సవ్యాజమానవుల ద్వారా అభివృద్ధి చెందిన దేశాలు చేసిన మోసం కొంత గ్రహింపుకు వచ్చింది. కట్టుకున్నవాళ్ళయినా, కన్నవారైనా, ఎంతకావల్సిన వారైనా ఏ విధమైన ఆఫీసు విషయాల్ని గురించి ప్రస్తావించకూడదన్న జ్ఞానోదయం కూడా కలిగింది.

❦❦❦

## ద్వంద్వం — శ్రీదేవి మురళీధర్

### వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 18వ ఉగాది రచనల పోటీలో ఎంపికైన ఉత్తమ కథానిక

చదువుతున్న పుస్తకాన్ని ముగించి బెడ్‌లైట్ ఆర్పింది యామిని. తల పక్కకు తిప్పి, కిటికీ గుండా లోపలికి చొచ్చుకు వచ్చిన వెన్నెలను ఆస్వాదించింది. మనిషికి ఇంతకంటే ఏం కావాలి! మంచి పుస్తకం, స్పందించే హృదయం. 'నా వరకు నాకు ఇంతకు మించి కోరికలు లేవు. చక్కటి ఉద్యోగం, ప్రేమించే కుటుంబం, తీరిక సమయాన్ని సద్వినియోగపరచే మంచి సాహిత్యం, ఆలోచనా విధానాన్ని మలిచిన గొప్ప రచయిత... ఇంతకన్నా ఏం కావాలి!'

యామిని ఇంటర్ చదివే రోజులనుంచీ 'అగ్నిమిత్ర' అభిమాని. అతడి కవితలతో మొదలుపెట్టి, అతడి పుస్తకాలన్నీ వదలకుండా చదివింది. శ్రామికదోపిడీ మీద అతడి వ్యాసపరంపరలు, మహిళాసాధికారత కేంద్రబిందువుగా అతడు సాగించిన సాహిత్య

ఉద్యమం యామిని లాంటి ఎందరెందరో యువతీ యువకులకు స్ఫూర్తినిచ్చింది. అదేకాదు. దాంపత్యజీవితం ఎలా ఉండాలి? వివాహానికి సరైన నిర్వచనం ఏది? భార్యాభర్తలు జీవిత పర్యంతం ప్రేమికులుగా మసులకోవటం ఎలా? ఇలాంటి విషయాలెన్నో అర్థవంతంగా అగ్నిమిత్ర రచనలు ఆవిష్కరించాయి.

సాహిత్యాభిరుచి ఉన్న అమ్మాయిలు, స్త్రీలు చాలామంది అగ్రిమిత్ర ఆరాధకులే. వారికి అతడొక ఆదర్శపురుషుడు. అతడి విప్లవాత్మక భావాలు, అందమైన ఆలోచనలు, పదునైన శైలి ముఖ్య ఆకర్షణలై పుస్తకప్రియుల్ని శాశ్వత అభిమానులుగా కట్టిపడేసుకున్నాయి.

'ఆయన భార్య ఎంత అదృష్టవంతురాలు!' లక్షలసార్లు అనుకున్న మాట ఇంకొకసారి అనుకుంటూ కళ్ళుమూసుకుంది యామిని. 'ఆరడుగుల అందం, ఐశ్వర్యం, ఉద్యోగం, ఇవేవీ ముఖ్యంకాదు. వివాహబంధంలో ఆలోచనావిధానం సున్నితంగా ఒకరికోసం స్పందించే హృదయం...ప్రకృతిలోని సౌందర్యాన్ని, ప్రణయతత్వాన్నీ చూడగలిగే అంతచ్చక్షువులూ.... ఇవీ ఆనందహేతువులు'.

'అగ్నిమిత్ర' నిగూఢమైన వ్యక్తి. తన గురించి తాను చాటుకోడు. అతడి ఫోటోలు చూచిన వారు కూడా ఎవ్వరూ లేరు. ఎలా ఉంటాడో ఎవరికీ తెలీదు. అతడి అక్షరం మాత్రమే అతడి పరిచయం. అనామకుడిగా ఉండటానికే అతడు ఇష్టపడతాడు. సభ లకు, సన్మానాలకు, అవార్డులకూ ఆమడ దూరంలో ఉంటాడు. ఈ నిగూఢత కూడా అతడి ఆకర్షణలో ఒక ముఖ్యభాగం. 'సింపుల్‌మాన్! ఆయన వ్యక్తిత్వంలో ఎక్కడా భేషజం లాంటి చిక్కుముడులు లేవు' అనుకుంటూ నిద్రలోకి జారుకుంది యామిని.

అగ్నిమిత్ర రచనల ప్రేరణతో కలం పట్టిన రచయిత్రులు లెక్కకుమించి ఉన్నారు. పత్రికలలో ఎన్నెన్నో కథలను వారు అతడి కి అంకితమిస్తూండటం కద్దు.

యామిని మనసులో ఒక సంకల్పం మెల్లమెల్లగా రూపుదిద్దుకోసాగింది. రెండు నెలల కృషి వల్ల ఆ సంకల్పం సిద్ధించి ఒక పుస్తకంగా తయారైంది. అగ్నిమిత్ర రచనల ప్రేరణతో ఏళ్ల తరబడి అడపాదడపా చిత్తుగా డైరీలలో రాస్తూవచ్చిన వ్యాసాలూ, కథలూ దిద్ది ఒక చక్కటి రూపాన్నిచ్చి సంకలనంగా తయారుచేసుకుంది యామిని. అవన్నీ చదువుతున్న యామిని మనసు గర్వంతో పొంగిపోయింది. చక్కటి భాష, ప్రగతిశీలక భావజాలం కలగలిసిన ఉత్తమ రచనలు ఆవిష్కృతమైనాయి.

'ఎలాగైనా అగ్నిమిత్ర ఆచూకీ పట్టుకొని నా పుస్తకానికి ముందుమాట రాయించుకోవాలి. తన అభిమాని రాసిందంటే ఆయ నకెంత సంతోషం! నా భావాలు, నా ఆలోచనలు ఆయన సాహిత్యం పెట్టిన భిక్షే.'

అగ్నిమిత్రకు ఉన్న చిరునామా సికిందరాబాద్ పోస్టాఫీసులో పోస్టుబాక్స్ నంబర్ మాత్రమే. సన్మానాలకు, సభలకు, సాహిత్య కార్యక్రమాలకూ ఆమడ దూరంలో ఉంటాడు కాబట్టి అతడి ఇల్లూవాకిలీ ఎవ్వరికీ తెలియదు. ఎలా అతణ్ణి వెదకటం..? అతడి పుస్తకాలన్నీ సీతాఫల్‌మండీలో ఒక ప్రచురణసంస్థ ప్రచురిస్తుంది. అక్కడికే వెళ్ళింది యామిని.

'అతడెప్పుడు మా దగ్గరికి రాడమ్మా. అతడి స్నేహితుడు ఎవరో ఒకతను ఈ లావాదేవీలన్నీ చూసుకుంటాడు. ఏ పనికావల సినా అతగాడే వస్తాడు.'

'ఎవరండీ ఆ స్నేహితుడు? కనీసం అతడి అడ్రసు, ఫోను...'

'అడ్రసు ఉందమ్మా ఇస్తానుండు' అంటూ ఒక కాగితంమీద రాసి ఇచ్చాడు పబ్లిషర్.

'జయరాం నాయుడు, అడ్వకేటు' అనే పేరు, చిరునామా ఉన్నాయి.

'పోనీలే ఒక దారంటూ దొరికింది' అనుకుంటూ ఆ అడ్రసు వెతుక్కుంటూ బయలుదేరింది యామిని. కవాడీగూడాలో ఒక ఇరుకుసందులో అంతకంటే ఇరికించి కట్టిన మూడంతస్థుల మేడమీదికి చేరుకుంది. అక్కడ అరచేతి మందం తాళం కప్ప వెక్కిరించింది. ఉస్సూరంటూ వెనుదిరిగితే ఒక మధ్యవయస్కుడు ఎదురుపడ్డాడు.

'ఎవరు కావాలండీ?'

'జయరాం గారనీ అడ్వకేటు...'

'నేనే, రండి' అంటూ సాదాసీదాగా ఉన్న ఆ మనిషి తాళం తెరిచి లోపలికి ఆహ్వానించాడు.

అతడి ఆఫీసు అతి మామూలుగా ఉన్నా పరిశుభ్రంగా ఉంది. పాత కాలపు గోడగడియారం, రామకృష్ణ పరమహంస కేలండర్, చిన్న టేబుల్, నాలుగు కుర్చీలు పొందికగా అమర్చి ఉన్నాయి. 'కూర్చోండి' అన్నాడతను.

'నా పేరు యామిని అగ్నిమిత్ర గారి అభిమానిని'.

నవ్వాడతను "పబ్లిషర్ దగ్గర పట్టారా నా అడ్రసు?" నవ్వి ఔనన్నది.

'అగ్నిమిత్రగారి ఫోన్ నెంబరు, అడ్రసు కావాలండి. నా పుస్తకానికి వారిచేత ముందుమాట రాయించుకోవాలని నా కోరిక".

ఒక క్షణం మౌనం తర్వాత అన్నాడతను 'ఆయన అడ్రసు నాకు తెలీదండి!'

'అదేమిటి? వారి లావాదేవీలన్నీ మీరే చూస్తారట. మీ స్నేహితులట. తెలీకపోవటమేమిటండీ!'

'అదంతేనండి.. అవసరమైతే అతడే వచ్చిపోతూంటాడు. స్నేహితుడు అన్న పేరే గానీ అతడు నా స్నేహితుడు కాదు. నేను చేసిపెట్టే పనులకు డబ్బు ఇస్తాడు!'

ఏమనుకోవాలో అర్థం కాలేదు యామినికి.

'ప్లీజ్ జయరాం గారు, ఆయన చిరునామా నాకు ఎలాగైనా ఇప్పించండి' ఆమె ప్రమేయం లేకుండానే గొంతు గద్గదమై కళ్ళ నీళ్ళు తిరిగాయి.

అతడి కళ్ళలో జాలి కదలాడింది.

'మీకు కావలసింది ముందుమాటే కదమ్మా. నేను నెమ్మదిగా రాయించి పెడతాను. అభ్యంతరం లేకపోతే ఇక్కడ మీ రచనలు వదిలి వెళ్ళండి. మీ ఫోన్ నెంబర్ ఇస్తే పని జరగగానే తెలియపరుస్తాను'.

'ఇక్కడా?' అయిష్టంగా అన్నది యామిని. 'నేను మీకు చెయ్యగల సాయం అదొక్కటేనమ్మా!' నిట్టూర్చి అన్నాడతను.

'జయంరాం గారూ, గంపెడాశతో ఆయన్ని వెదుక్కుంటూ వచ్చాను. చిన్నప్పటినుంచీ ఆయన అభిమానిని. నాకు కావలసింది ముందుమాట ఒక్కటే కాదు, ఆయనను వ్యక్తిగతంగా కలుసుకోవటం, మాట్లాడడం. మీకు తెలీదు, అది నాకు చాలా ముఖ్యం'.

'అర్థమైంది యామిని గారు! కానీ వీలు పడాలి కదమ్మా. ఆయన ఎవ్వరినీ కలుసుకోవటానికి సుముఖంగా ఉండరు. అది ఆయన నైజం. మీలాగా ఎందరో ప్రయత్నిస్తూంటారు. ప్చ్. ఏం లాభం!'

నిరాశ అలలాగ ఆమెను ముంచేసింది. ' నాకు అదంతా తెలీదు జయరాంగారు. అగ్నిమిత్రగారి చిరునామా ఇవ్వండి. నా తిప్పలేవో నేను పడతాను, ప్లీజ్, ప్లీజ్. ఒక రచయితకి, అభిమానికి మధ్య అడ్డుగోడగా నిలబడకండి' అభ్యర్ధనగా అడుగుతున్న ఆమె వంక నిశితంగా చూశాడు జయరాం.

'సారీ యామినిగారు, అది నావల్లకాదు, నేను కొన్ని ఒప్పందాలకు కట్టుబడి ఆయనకోసం పనిచేస్తున్నాను. అర్థం చేసుకోండి , వెళ్ళిరండి' లేచి ఏవో ఫైల్స్ వెదుక్కుంటూ లోపల అలమారు వద్దకు వెళ్ళాడతను.

చేసేదిలేక లేచి బయటికి నడిచిందామె. బయట తలుపుదగ్గర పోస్ట్‌మాన్ వదిలివెళ్ళిన కవర్లు కబడ్డాయి. జయరాం పేరు మీద. కింద ఎ.ఎమ్. అని ముద్రించి ఉంది. ఆమె చూపులు అతివేగంగా అడ్రసు వెంట పరుగెత్తాయి. కవర్లు పారేసి గబగబా డాబా దిగింది యామిని. కిందికి వచ్చాక తన హాండ్‌బ్యాగ్‌లో నుంచి నోట్‌పాడ్ తీసి గుర్తుపెట్టుకున్న చిరునామా రాసుకుంది. ఆటో ఎక్కి అడ్రస్ చెప్పింది.

♦♦♦

ఆ కాలనీ ఊరికి ఎడంగా ఉంది. అవసరమై వెదికితే తప్ప ఆ కాలనీ పేరు తెలిసిన పేరుకాదు. అన్నీ మధ్య తరగతి సగటు మనుషుల సంసారాలే. రోడ్డుమీదికే గదులున్న చిన్న ఇళ్ళు. వాటికి గేట్లు పెట్టేంత స్థలం కూడా లేదు.

చిరునామాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర మలుపు తిరిగింది ఆటో. ఇళ్ళ నంబర్లు వరుసలో లేవు. సాయంత్రం ఆరు కావస్తోంది. వీధి దీపాలు లేవు. సందులే కాక రోడ్లు కూడా కచ్చా వీధుల్లాగా ఉన్నాయి. నాగరికత మర్చిపోయిన ప్రదేశంలాగా ఉన్నదక్కడ.

ఆటోవాడు విసుక్కుంటున్నాడు. 'ఎక్స్ట్రా ఇస్తాను బాబు. కాస్త ఓపికపట్టు' అంటూ నచ్చజెప్పి ఆటో దిగింది. ఆటోవాడు వీధి వారగా ఆటో నిలుపుకున్నాడు. వీధి చివరన దొరికింది ఆ నంబరు ఉన్న ఇల్లు. మిగిలిన ఇళ్ళన్నింటికన్నా కాస్త విశాలంగా ఉంది. ఒక చిన్న తడికల గేటు తెరిచి లోపలికి అడుగుపెట్టింది యామిని. చిన్ననాటి కల ఇన్నేళ్ళకు నిజం కాబోతోంది. కొద్ది క్షణాలలో తనకు ఎంతో ప్రియమైన వ్యక్తిని కళ్ళారా చూడబోతోంది. యామినికి నడవాలని లేదు. పరుగుపరుగున లోపలికి వెళ్ళాలని ఉంది. కాలింగ్‌బెల్ కనిపించలేదు.

గుమ్మం ముందు ముగ్గు వేసి ఉంది. ముందుగదుల్లో ఏవో మాటలు. ఒక మగమనిషి కంఠం కరుకుగా వినిపిస్తోంది. ఒక ఆడగొంతు ఏదో మాట్లాడుతోంది. మాటలేవీ స్పష్టంగా లేవు.

'ఏమండి, ఎవరైనా ఉన్నారా?' గొంతు పెగుల్చుకుని గుమ్మం దగ్గర నిలబడి అడిగింది యామిని.
జవాబు రాలేదు. సందిగ్ధంగా ముందుగదికి కట్టి ఉన్న నేతచీర పరదా తొలగించి ఒక అడుగు లోపలికి వేసింది.

పక్క గదిలోనే కంఠాలు వినిపిస్తున్నాయి. ఇంతలో కరెంటు పోయింది. ఆడగొంతు ఫోన్లో మాట్లాడుతూ దగ్గరగా వినిపించింది. మగగొంతు లోపలి గదిలోంచి గట్టిగా వినిపిస్తోంది.

'టైఫాయిడ్ కదా. ఇంకా పది, పదిహేను రోజులు పడుతుంది కాస్త బలం పట్టటానికి. ఏవేవో టానిక్కులు, మందులు ఇచ్చారు. కాస్త నయంగానే ఉన్నానమ్మా. నా గురించి దిగులు పెట్టుకోకు, నీ ఆరోగ్యం జాగ్రత్త' తల్లితో కాబోలు మాట్లాడుతోందామె.

‘ఫోను పెట్టెయ్యవే.....” అంటూ ఒక తిట్టు కర్కశంగా వినిపించి అదిరిపడింది యామిని. అసహ్యంతో ఆమె శరీరం జలదరించింది.

‘ఆయన బాగానే ఉన్నారమ్మా. సరిగ్గా తినరు. అదొక్కటే నా బాధ’ అతడి తిట్లు పట్టించుకోకుండా అంటోందామె ఫోన్లో.

గోడకు విసిరిన వస్తువు ఏదో ఫెటేల్మని పగిలింది. ఫోన్ పెట్టేసిన చప్పుడు.

‘పీకి పారేస్తాను వెధవ ఫోను’ కోపంగా వగరుస్తూ అంటున్నాడు ‘వెళ్ళు, ఆమ్లెట్ వేసి తీసుకురా. క్షణంలో కావాలి, ఫో.’

ఆమె లోపలికి వెళ్ళినట్లుంది. మౌనం.

ఏం చెయ్యాలో తెలియని పరిస్థితిలో ఆ ముసురుతున్న చీకటిలో రెండడుగులు ముందుకు వేసింది యామిని. ఆ ఇంట్లో చడీ , చప్పుడూ లేదు. ధైర్యం కూడదీసుకుని ‘ఏమండీ! ఎవరు ఇంట్లో’ అని వణుకుతున్న కంఠంతో పిలిచింది. ఒక నలభై ఏళ్ళ ఆడమనిషి కొంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చింది. కిటికీలో ఉన్న కొవ్వొత్తి వెలిగించి స్టాండ్‌లో ఉంచింది. పచ్చటి పసిమి , వత్తైన పొడవాటి జడ భుజంమీద నుంచి ముందుకు వేలాడుతోంది. పాత నేత చీర కట్టుకున్న ఆమెలో ఏదో సౌందర్యం.

యామినిని చూచి ఎటువంటి తొట్రుపాటు, కంగారు వ్యక్తం చెయ్యలేదు. నింపాదిగా చూస్తూ

‘ఎవరండీ? ఎవరు కావాలి?’ సౌమ్యంగా అడిగిందామె.

‘నా పేరు యామిని. అగ్నిమిత్రగారి అభిమానిని.....’

‘కూర్చోండి’ అంటూ ఒక ప్లాస్టిక్ కుర్చీ చూపించింది. ఆ గదిలో ఉన్న కుర్చీ అదొక్కటే.

‘చాలా దూరం నుంచి వెదుక్కుంటూ వచ్చాను. వారిని చూడాలని....”

‘ఇప్పుడా? వీలుపడదండి. ఆయన ఎవ్వరినీ కలవరు. ఇష్టం ఉండదు. సభలకూ, సన్మానాలకూ రారు. ఇంతకీ ఏం పనిమీద వచ్చారు చెప్పండి’.

‘అబ్బెబ్బే అవన్నీ కాదండి. నా కథా సంకలనానికి ముందు మాట ఆయన చేత రాయించుకుందామని వచ్చాను’ అన్నది యామిని. ఆమె లోపలికి వెళ్ళింది.

‘మీ కోసం ఎవరో అమ్మాయి వచ్చింది. అభిమాని. తన పుస్తకానికి ముందుమాట రాయమని...’

‘ఎవరిచ్చారు అడ్రసు?’ గొంతు చించుకుని అరిచాడతను.

‘తెలీదు..’ శాంతంగా చెప్పిందామె.

‘జయరాం గాడేనా? చంపేస్తా గాడిద కొడుకుని’ ఉన్నట్లుండి యామిని కూర్చున్న గదిలోకి సుడిగాలిలా వచ్చాడు.

యామిని తటాలున లేచి నిలబడింది. గౌరవంతో కాదు. భయంతో, జుగుప్సతో. ఆ క్షణమే కరెంటు వచ్చింది.

లావుగా, పొడుగ్గా ఉన్నాడతను. జుట్టు భుజాలదాకా పెరిగి చికాగ్గా చిందరవందరగా ఉంది.
ముఖమంతా గడ్డాలు, మీసాలు. కళ్ళు చింతనిప్పుల్లా జ్వలిస్తున్నాయి. నడుముకు ఒక ముతక తుండుగుడ్డ కట్టుకుని ఉన్నాడు. అదీ మోకాళ్ళ దాకా చాలీచాలకుండా ఉన్నది.

'న....నమస్కారం' తడబాటుతో అన్నది యామిని.

'ఏముంది చూడటానికి ఇక్కడ? రెండు కాళ్ళు, రెండు చేతులు, నీలాంటి మనిషినే. నాకేం రెక్కలూ, కొమ్ములూ లేవు' వగరుస్తున్నాడు. నోటి చివర కొద్దిగా నురుగు. శుభ్రత లోపించటం వల్ల, తాగీ తాగీ ఉండటం వల్ల అతడి నుంచి భరించలేని దుర్గంధం.

ఆ ఇంటి పరిస్థితి, అతడున్న పరిస్థితి, ఆ ఇల్లాలి పరిస్థితి కళ్ళబడిన యామినికి మనసులో, మెదడులో ఏదో నాజూకైనది ఛిద్రమైంది. ఆ బాధ కళ్ళ వెంట నీళ్ళుగా సుళ్ళు తిరుగుతోంది.

ఇంతలో ఆ స్త్రీ గదిలోకి మంచినీళ్ళ గ్లాసుతో వచ్చింది. పాపం, గృహిణీ ధర్మం.

అతడి అరుపులకు అడ్డువస్తూ 'కూర్చోండి' అన్నది యామినితో. అటువంటి పరిస్థితిలో కూడా సౌమ్యాన్ని కోల్పోని ఆమె స్థిరత్వాన్ని యామిని మనసులో మెచ్చుకుంది.

నీళ్ళు అందుకుంటూంటే ముందుకు వచ్చి యామిని చేతిలో గ్లాసు ఎగరగొట్టాడు అతడు.

భయంతో గోడవైపు జరిగింది యామిని. 'మీరు లోపలికి వెళ్ళండి. అతిధుల ముందు ఏమిటీ అల్లరి' అతడి చేతిని పట్టుకుంటూ మృదువుగా అన్నాదామె.

'నోర్ముయ్, నాకు చెప్పేదానివా నువ్వు? ఇలాంటి వాళ్ళకు మర్యాదలొకటి!' ఈసడింపుగా యామినివైపు చూశాడు. 'ఏమిటి నీ కుతూహలం? ఏం చూడాలని వచ్చావ్?' అగ్ని గోళాలలాంటి కళ్ళతో ఉరిమిచూస్తూ అడిగాడు.

యామిని గొంతు తడారిపోయింది. కాళ్ళు వణుకుతూండగా గోడ పట్టుకుని నిలదొక్కుకుంటూ అన్నది.

' నా పుస్తకానికి మీరు... ముందుమాట రాస్తారేమోనని అడగాలని వచ్చాను'.

'తప్పకుండా రాస్తారు. ఇలా ఇవ్వండమ్మా' ఆమె చొరవగా యామిని చేతిలోని ఫైల్ అందుకుంది.

'ఒక వారం టైం ఇవ్వండి. ముందు ఇవన్నీ చదవాలిగా ముందుమాట రాయాలంటే..'

ఆమెను చెడ్డగా నిందిస్తూ అతడు విసురుగా లోపలికి వెళ్ళిపోయాడు. వినలేక చెవులు మూసుకుంది యామిని.

ఆమె వంక ఎంతో బాధగా చూచి నిజాయితీగా అన్నది. 'సారీ.. ముందు తెలియపరచకుండా అనుమతి లేకుండా రావటం నాదే తప్పు. నా వల్ల మీరు మాట పడుతున్నారు. క్షమించండి'. కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లుతుండగా అన్నది. తన రాక వల్ల ఆమెకు కలిగే మన:క్లేశం ఎంతో బాధాకరం.

'పరవాలేదు పని మీద వచ్చారు కదా. ఏదో ఆరోగ్యం బావుండక చెడ్డమూడ్‌లో కనబడ్డారు మీకు. ఆయన అన్నవేవీ పట్టించుకోకండి' మామూలుగా, నిర్వికారంగా చెప్పిందామె.

అతడిని చూచి ఎంత ఆశ్చర్యపోయిందో, ఆమెను చూచీ అంతే ఆశ్చర్యపోయింది యామిని.

'వెళ్ళొస్తానండి. నా చిరునామా, ఫోన్ నెంబరు వేసి ఉంచాను. ఏదైనా రాస్తే తెలియబరుస్తారు కదూ!' ప్రాధేయపూర్వకంగా అడుగుతూ గబగబా బయటికి నడిచింది యామిని.

సన్నటి చిరునవ్వుతో తలపంకించిందామె వీడ్కోలు చెబుతూ.

♦♦♦

ఆటో ఎక్కిన ఇరవై నిమిషాలకు కాబోలు ఆదుర్దా, గుండెదడ తగ్గి మామూలు మనిషైంది యామిని. హఠాత్తుగా జరిగిన సంఘటనలు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేశాయి. అగ్నిమిత్రకోసం వెదకటం, చిరునామా దొరకటం రెండూ అనూహ్య సంఘటనలుగా తోస్తే, అతడి నిజరూపం, వ్యక్తిత్వం, ఆమె ముందు అలా బట్టబయలు కావటం ఇంకా విభ్రాంతిని కలిగించింది.

ఎన్నెన్నో ఏళ్ళుగా ఊహించుకుంటున్న సమావేశం ఈ రకంగా పరిణమించిందేమిటి? ఇంత విచిత్రంగా, ఊహకు కూడా అందనంత వికారంగా.

అసలు అది రచయిత అగ్నిమిత్ర ఇల్లేనా? ఆ జంట అగ్నిమిత్ర దంపతులేనా? ఆ ఆలోచన గగుర్పాటును కలిగించింది.

ఆ ఇంటి చిరునామా, ఆ స్త్రీతో జరిగిన సంభాషణ లోలోపల విపులంగా మననం చేసుకుంది. సందేహం లేదు, వాళ్ళే. 'సభలకు రారు' అని కూడా చెప్పింది. ఇందుకేనేమో మహానుభావుడు ఎవరి కంటా పడడు. ఇలాంటి మనిషి కాబట్టే మనుషులతో పొత్తుపెట్టుకోడు. ఎవరు భరించగలరు ఇలాంటి మానవమృగాన్ని? ఒకసారి చూచిన వాళ్లెవ్వరూ జన్మలో మర్చిపోరు. శరీరం మీద సోయిలేని మనిషి. నోటిమీద అంతకంటే అదుపులేదు. కనీస పారిశుభ్రత, కనీస మర్యాద, రెండూ కరువే.

ఇంక ఉన్నదేమిటి అతడి దగ్గర? ఒక మంచి మాట, ఒక చిరునవ్వు, ఒక స్నేహపూరితమైన చూపు... అన్నీ మృగ్యమే. ఇతడేనా నేను కలలుకన్న అభిమాన రచయిత అగ్నిమిత్ర?

అయ్యో, అతడి గురించి ఆలోచనే ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉండేది. మానవ సంబంధాల గురించి, ప్రపంచం గురించీ తనకు ఏర్పడిన అవగాహన యావత్తూ అతడి రచనల నుండి తనలో ఉద్భవించినదే. ఇతడేనా ఆ అగ్నిమిత్ర?

'ఛఛ. ఎంత తప్పు పనిచేశాను. వద్దు వద్దని జయరాంగారు చెప్పనే చెప్పారు. వెళ్ళకపోతే ఎంత బాగుండేది'. తనలోని అమాయకమైన గౌరవాదరాలు, ప్రేమాభిమానాలు శాశ్వతంగా అలాగే ఉండిపోయేవి. పదే పదే అనుకున్నదా మాటలు.

మళ్ళీ మనసు మళ్ళించుకుంది. 'అతడి వ్యక్తిగత జీవితం నాకెందుకు? అతడికి మొదటినుంచీ ఎవ్వరినీ కలవటం ఇష్టంలేదు . అది జగమెరిగిన సత్యం'. వద్దంటూంటే వినకుండా తానే... తనదే తప్పు.

అతడింట్లో అతడు ఎలాగైనా తిరుగుతాడు. చెప్పాపెట్టకుండా ఊడిపడితే అతడి ఏకాంతం భగ్నమైందన్న కోపంతో అలా ప్రవర్తించి ఉంటాడు. 'నాకెందుకు అతడి గురించిన మథన? ఎవరి వ్యక్తిగత పరిధులు వారివి. ఇతరులు వాటిని తెలిసీ అతిక్రమించటం తప్పే మరి! 'నాకు ఎవరూ వద్దురా బాబూ' అని పారిపోయేవాళ్ళని వెదికి వెంటాడటం ఎంతవరకు సబబు?'

*మనుషులు తమ అవసరాల కోసం విలువలను తరచు మార్చుకుంటారు.*
*పపంచానికి 'మార్గదర్శి'గా 'మంచి'ని బోధిస్తూ నిజజీవితంలో చెడు చేస్తూ*
*పోయేవాడు ద్వంద్వ ప్రవృత్తి గలవాడైతే –*
*తన అవసరం కోసం, తన ప్రయోజనాలు నెరవేరటం కోసం 'చెడు' అని*
*తెలిసీ దానిని ఆమోదించేవాడు కూడా ద్వంద్వం అవలంబించేవాడే.*

## ఆలోచించండి.

అలా పరిపరి విధాల ఆలోచిస్తూ వారం రోజులు గడిపింది యామిని. పోస్టులో ఒక కవరు వచ్చింది. తన కథల ఫైలు, దానికి జతచేర్చి కొన్ని కాగితాలు వచ్చాయి. ముత్యాల కోవలాంటి దస్తూరితో 'యామినికి' అని రాసి ఉన్నది.

రెండు పేజీలలో చాలా చక్కని ముందుమాట కనబడింది. కథలన్నింటినీ ప్రస్తావిస్తూ, సూక్ష్మమైన దృష్టితో, లోతైన అవగాహనతో రాసిన ముందుమాట అది. అది చదివిన వాళ్ళు యామిని పుస్తకాన్ని పూర్తిగా చదవకుండా వదలరు. అంత ఆసక్తిదాయకంగా రాశాడు అగ్నిమిత్ర. అదొక్కటీ చాలు పుస్తకం అమ్ముడు పోవటానికి.

తన పేర్న ఒక చిన్న సందేశం ఉన్నది.

'యామినీ!

ద్వంద్వం ప్రకృతిలో ఒక విలక్షణ భాగం. దానికి కారణాలు వెదకబోకు

అగ్నిమిత్ర'

నిట్టూర్చింది యామిని. 'నిజమే. ద్వంద్వాన్ని అర్థం చేసుకోవటం చాలా కష్టం. అవతల వారి జీవితం గురించిన విమర్శలలోకి పోకుండా నా మార్గంలో నేను నడుస్తాను' అనుకుంది తృప్తిగా 'ముందుమాట'ను మళ్ళీ మళ్ళీ చదువుకొంటూ.

'ఎంత గొప్పగా రాశాడు! ఈ ముందుమాట కోసం అతడు తిట్టిన తిట్లన్నీ భరించవచ్చు' అనుకుంది నవ్వుకుంటూ.

ఆ సాయంత్రం ప్రచురణా సంస్థకు వెళ్ళింది యామిని. తన కథలను, ముందుమాటను పబ్లిషర్ గదిలోకి తీసుకువెళ్ళింది. ఆయన లేడు 'అరగంటలో వస్తాడు కూర్చోండి' అన్నారు.

ఊరికే కూర్చోవటం ఎందుకని కథలన్నీ మళ్ళీ ఒకసారి చదివింది. కొన్ని తప్పులు కనబడితే దిద్దుబాటు చేసింది. ఎంతో నిజాయితీగా, స్వచ్ఛంగా తన భావాలను అక్షరాలలో పొదిగింది. ఎన్నో సమస్యలు, వాటికి తాను న్యాయమనుకున్న పరిష్కారాలు చూపించింది. ఎక్కడా సందిగ్ధత లేదు. అపశ్రుతులు లేవు.

చివరగా "ముందుమాట" చేతుల్లోకి తీసుకుని మళ్ళీ చదివింది. ఆమె మనోఫలకం మీద అగ్నిమిత్ర వికృతంగా మెదిలాడు. అతడి అరుపులు, అసహనం, నైచ్యం ఆ కాగితాలలో అడుగడుగునా కనబడసాగాయి. ఆ రోజు తాను అసంకల్పితంగా చూసిందేమిటి? ఈ అక్షరాలలో ఉన్నదేమిటి? ఏది నిజం?

ద్వంద్వమని అతనే అంటున్నాడు

అంత గొప్ప రచయిత, ఎలాంటి వాడైనా కానీ రాసి ఇచ్చిందే చాలని మురిసిపోతూ అచ్చు వేసుకోనా?

అంటే ద్వంద్వం నాలో కూడా ఉన్నదా?

ఇక క్షణం కూడా ఆలోచించకుండా 'ముందుమాట'ను ముక్కలుముక్కలుగా చింపి చెత్తబుట్టలో వేసింది యామిని. తన మనసుకు బాధ, భయం కలిగితే తన సౌమ్యతతో, చిరునవ్వుతో అనునయించిన ఆ స్త్రీ మూర్తి గుర్తుకు వచ్చింది.

మొదటి పేజీలో 'అంకితం' రాసింది.

**అంకితం**

'ఎంతటి బడబానలం లోలోపల రేగుతున్నా తొణకని నిబ్బరంతో, మెత్తటి మాటలతో, చల్లటి చిరునవ్వుతో నన్ను గెలుచుకున్న స్నేహశీలికి'

అభిమానంతో

యామిని

# దిగుడు బావి

సత్యదేవ్ చిలుకూరి

## వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 18వ ఉగాది రచనల పోటీలో ఎంపికైన ఉత్తమ కథానిక

**(క్రొత్త భేతాళ కథానిక)**

పట్టువదలని విక్రమార్కుడు ఎప్పటిలా చెట్టుపై వ్రేలాడుతున్న శవాన్ని దించి భుజమ్మీద వేసుకొని శ్మశానం కేసి నడవ సాగాడు.

అప్పుడు శవంలోని భేతాళుడు, "రాజా ..." అంటూ అలవాటు ప్రకారం ఇంకేదో చెప్పబోయాడు.

విక్రమార్కుడు నడక ఆపి, "భేతాళా, ప్రతి సారీ నువ్వే కథలు చెప్పి నన్ను ప్రశ్న అడగడమూ, నేను సమాధానం చెప్పగానే తుర్రుమని ఉడాయించడమూ చేస్తున్నావు. ఈ సారికి మొదట నన్ను మాట్లాడనీయరాదూ? నువ్వు నాకు ఇన్ని కథలు చెప్పిన ఈ కాలంలో నా రాజ్యంలో ఎన్ని మార్పులు వచ్చాయోననీ, ఆ మార్పుల కారణంగా ముమ్ముందు ఎన్ని ఇబ్బందులు వస్తాయోననీ అనుమానంగా ఉంది. అందుకు నిదర్శనంగా నేనే నీకు 'దిగుడుబావి' అన్న కథొకటి వినిపిస్తాను, నువ్వు ఒప్పుకుంటే", అంటూ ప్రాధేయపడ్డాడు.

ఏ కళనున్నాడో ఏమో, భేతాళుడు "సరే, ఈసారికి ఇలాగే కానిద్దాము. నాకు శ్రమ తెలియకుండా నువ్వే కథ చెప్పు. అయితే కథ తప్ప ఇంకేమీ చెప్పకూడదు సుమా! లేకపోతే నేను మళ్ళీ మాయమైపోతాను" అని హెచ్చరించాడు.

"శవాన్నీ నేనే మోస్తున్నాను, కథా నేనే చెబుతాను, మరి తనకు 'శ్రమ తెలియకుండా' అంటాడేంటి అర్థం లేకుండా? అయినా, ఇంతకాలానికి వీడికి కథ చెప్పే అవకాశం చిక్కింది. ఇన్ని కథలు చెప్పి నా దుంప తెంచినందుకు ప్రతీకారం తీర్చుకుంటాను" అని మనసులో అనుకుంటూ విక్రమార్క మహారాజు ఇలా చెప్పసాగాడు.

★★★

బల్కంపేట అనే వూళ్ళో ఒక బడిపంతులుగారుండేవారు. వేరే ప్రాంతం నుండి భార్యతో సహా వలస వచ్చి, ఒక పాత ఇంటిని కొని మరమ్మతు చేసుకుని, అక్కడ స్థిరపడిపోయారు.

పంతులుగారి ఇంటి ప్రాంగణంలోనే జామ, వేప, సీతాఫలం, ఆదిగా ఎన్నో చెట్లు ఉండేవి. ఇంటి ముందు బ్రహ్మాండమైన మామిడి చెట్టుండేది. తియ్యటి పళ్ళూ, పండగలకూ పబ్బాలకూ మామిడాకులూ ఆ చెట్టు సమకూర్చేది. చెట్టుమీద గూళ్ళు కట్టుకున్న పక్షులతోనూ, చెట్ల చుట్టూ తిరుగుతూ బిల్లం–గోడూ, కోతి–కొమ్మచ్చీ ఆడుకునే పిల్లలతోనూ ప్రాంగణం ఎంతో కోలాహలంగా ఉండేది.

వాళ్ళ ఇంటికీ, చుట్టుప్రక్కల ప్రజలకూ, అక్కడి చెట్లకూ, మొక్కలకూ, పొలాలకూ నీటి అవసరాలను పంతులుగారింటి ఆవరణలోని పెద్ద దిగుడుబావి తీర్చేది. ఆ బావి ఒక తాటిచెట్టంత లోతుందని అందరూ అనుకునేవారు. ఆడుకునే పిల్లల బంతి బావిలో పడిపోతే మాత్రం భారతంలో ద్రోణుడిలా ఎవరైనా వచ్చి బాణాలతో తీస్తే బావుణ్ణనిపించేది.

ఇంటికి సమీపంలోనే అక్కడి గ్రామదేవతకు పెద్ద దేవాలయం ఉండేది. ఆదివారం నాడు ఆ మైసమ్మ గుడికి దూరప్రాంతాలనుండి కూడా భక్తుల సందోహం వచ్చి దర్శనం చేసుకునేది. గుడిలోపల నిషిద్ధమవడంతో బయటే కోళ్ళనూ, మేకలనూ అమ్మవారికి బలి ఇచ్చి, ఈకలు, తాటలు వొలిచి వండుకుని తినేవారు.

గుడికి సమీపంలో ఒక కల్లు పాక ఉండేది. పూజలు, విందుభోజనాలయినాక భక్తులంతా అక్కడ చేరి సాయంత్రం ఊళ్ళకు బయలుదేరే వరకు సురాపానం చేసేవారు. ఆ మత్తులో అరుపులూ, పెడబొబ్బలూ, అడపా దడపా పోట్లాటలూ.

అందువల్ల మిగతా రోజుల్లో ఆ వీధి ఎంత ప్రశాంతంగా ఉన్నా ఆదివారం వచ్చేసరికి హడావిడి అంతా ఇంతా కాదు.

పంతులుగారు, ఆయన భార్య చుట్టుప్రక్కల వారికి చేతనైనంత సహాయం చేసేవారు. తమకు అవసరం వచ్చినప్పుడు ఆ ఇరుగు పొరుగు వారు కూడా చేదోడు వాదోడుగా ఉండేవారు.

"అమ్మాయీ, ఈ గిన్నెలో నెయ్యి ఇవ్వకపోతివి? కొద్దిసేపట్లో మా అల్లుడుగారు భోజనానికి వస్తున్నారు" అని ఇటుప్రక్క పిన్నిగారు అధికారికంగా అడగడమో, "అక్కయ్యా, తోడుకి కాస్త మజ్జిగ ఇస్తావా" అని అటుప్రక్క తోడికోడలిని ఈమె అడగడమో, "బాబాయ్, ఇవాళ్ళ బడిలో డబ్బులు కట్టాలి, ఒక పది సర్దగలవా" అని దూరపు బంధువులబ్బాయి కోరడమో జరిగినప్పుడు కాదనకుండా ఇచ్చిపుచ్చుకోవడం జరిగేది.

ఈ వాతావరణంలో పంతులుగారి జీవితం కొన్నేళ్ళు సాగింది.

ఆయనకు పుట్టిన ఇద్దరు పిల్లలు ఎంతో బుద్ధిమంతులుగా, తల్లిదండ్రుల మాట వినే మంచి బాలురుగా పెరిగి పెద్దవాళ్ళయ్యారు.

★★★

"నాన్నగారూ, క్రౌంచద్వీపంలోని ఒక సంస్థలో నాకు ఉద్యోగం వచ్చింది", అంటూ పెద్దబ్బాయి ఉత్సాహంగా చెప్పాడు.

పై చదువులకు వేరే వూరికి వెళ్ళి, నాలుగేళ్ళ పాటు అక్కడే ఉండి చదువుకుని ఉత్తీర్ణుడై ఇంటికి వచ్చిన రోజే ఈ వార్త తెలిసింది.

"ఎప్పుడు చేరమన్నారు?", అంటూ పంతులుగారు తన పెద్ద కొడుకు ఆ దూరదేశం వెళ్ళినాక కొన్నేళ్ళపాటు కనబడడనే బాధ లోపల వున్నా బయటికి సంతోషం కనబరుస్తూ అడిగారు.

"వచ్చే నెలాఖరుకు" అని చెప్పి, శుభవార్తను తన బాల్యమిత్రులతో పంచుకోవడానికి బయటకు వెళ్ళి, తన స్నేహితులతో కలసి ఊరు చూద్దామని బయలుదేరాడు పెద్దబ్బాయి.

తానక్కడ లేని కాలంలో ఊరు ఎంతో అభివృద్ధి చెందిందని విన్నాడు గానీ ఆ పురోగమనం ఫలితంగా తాను పుట్టి, పెరిగిన ప్రాంతంలో ఇన్ని మార్పులు వస్తాయని ఊహించలేదు.

ఇంటి ముందు మామిడి చెట్టూ, దిగుడుబావీ మాత్రం ఇంకా ఉన్నాయి.

"ఒకప్పటి అసంఖ్యాకమైన చెట్లూ, మొక్కలూ పోయి ఇన్ని ఇళ్ళు వచ్చినాయేమిటి మిత్రమా?" అని ఆ పరిసరాలను చూసి విస్తుపోతూ అడిగాడు.

" ఇక్కడ క్రొత్తగా వచ్చిన పరిశ్రమల్లో పని చేసే వారికోసం ప్రభుత్వం వీటిని కట్టించింది. అప్పుడు చెట్లన్నీ కొట్టించేసింది" అని సమాధానం చెప్పాడు మిత్రుడు.

మైసమ్మ గుడిలో దర్శనం చేసుకుందామని అటు వెళ్ళారు వాళ్ళు.

అక్కడ కూడా మార్పులు కనబడ్డాయి. చిన్నప్పుడు గుడి బయట వీధుల్లో వంటలు చేసుకునే భక్తులు ఎండలకూ, వానలకూ ఇబ్బంది పడేవారు. ఇప్పుడు వారి సౌకర్యం కోసం వంటశాలలు కట్టించారు.

"ఈ గుడికి వచ్చే జనాభా ఎంతో పెరిగిపోయిందిరా. అందువల్ల వీధిలో రద్దీ, గొడవలు బాగా పెరిగిపోయినాయి" అని మళ్ళీ వివరించాడు మిత్రుడు.

తిరుగుదారి పట్టి కొంత దూరం నడిచాక, "ఇదేంటి, మన బావి మెట్లన్నీ ఇలా ఎగుడుదిగుడుగా, నాచు పట్టి ఉన్నాయి? చిన్నప్పుడు మనం చదివిన బడిలోని గుమాస్తాగారి పళ్ళలా లేవూ?" ఛలోక్తి వేసానని మురిసిపోతూ అడిగి వెంటనే నాలుక్కరుచుకున్నాడు పెద్దబ్బాయి.

ఆ చిన్నప్పటి గుమాస్తాగారి కొడుకే అయిన ఆ మిత్రుడు మాత్రం మొహం ముటముటలాడించుకుంటూ, బదులివ్వకుండా తన ఇంటిదారి పట్టాడు.

ఇప్పుడు గొట్టాల ద్వారా నేరుగా ఇంట్లోకి నీరు వచ్చే సౌకర్యం వచ్చింది. అందువల్ల దిగుడుబావినిప్పుడు ఎవరూ వాడడం లేదు, అందువల్లనే మెట్లు పాడయి వుంటాయని అర్థం చేసుకున్నాడు పెద్దబ్బాయి.

ఆ ప్రాంతమంతా అంతగా మారిపోయినందుకు ఒక మూల బాధగా వున్నా, కొద్ది రోజులలో అక్కణ్ణించి వెళ్ళిపోయే తాను దాని గురించి ఆలోచించడం అనవసరమని తనకు తాను సర్ది చెప్పుకున్నాడతను. అప్పటికే బయటి ప్రపంచాన్ని చూసి వచ్చిన అతను బల్కంపేట అనే బావినుండి పూర్తిగా బయటపడాలని తెగ ఉబలాటపడుతున్నాడు.

★★★

"అమ్మా, నాకు అన్నయ్య వున్న చోటనే పై చదువులకు పిలుపు వచ్చింది", చిన్నబ్బాయి ఆత్రంగా తల్లికి చెప్పాడు, అంత దూరదేశానికి తాను వెళ్ళడానికి తల్లిదండ్రులు ఒప్పుకుంటారో లేదోనని భయపడుతూ. అప్పుడే పెట్టీ-బేడాతో ఇంటిలో అడుగుపెట్టాడతను.

పంతులుగారి భార్య, "చాలా సంతోషం నాన్నా, ఎప్పుడు వెళ్ళడం?" అంటూ, తమ గూటిలోని రెండో పక్షి కూడా రెక్కలొచ్చి ఎగిరిపోతున్నదన్న గుబులును లోపలే నొక్కివేస్తూ అడిగింది. తమ బెంగ కోసం పిల్లల భవిష్యత్తును పాడు చెయ్యడమెందుకు?

"మరొక నెల రోజుల్లో" అని బదులిచ్చాడు తనయుడు.

వేరే చోట ఆరేళ్ళుండి సొంత ఊరికి తిరిగొచ్చిన చిన్నబ్బాయి ఎన్నో పరివర్తనలు చూసాడు.

అప్పటికి అన్నగారు వృత్తిరీత్యా వేరే దేశంలో స్థిరపడిపోయాడు. తండ్రి బడిపంతులు పని నుండి విరమించి కృష్ణా రామా అనుకుంటున్నారు.

"ఇదేంటి నాన్నగారూ, మన ఇంటి వెనక పొలాలన్నీ ఏమయిపోయినాయి?" అని తండ్రితో కలసి ప్రొద్దున్నే నడకకు బయలుదేరిన చిన్నబ్బాయి అడిగాడు.

"చూసావుగా, అక్కడ కూడా ఇళ్ళు కట్టేసారు. మన వూరి జనాభా అంతగా పెరిగిపోయింది మరి" అని బదులిచ్చాడు తండ్రి.

మరి కొంత దూరం వెళ్ళినాక గుడి సమీపంలో చిన్నబ్బాయి నడక ఆపి, " ఇదేంటి, ఇక్కడ కల్లుపాక ఉండేది కదా, ఈ భవనం ఎప్పుడొచ్చింది?" అని అడిగాడు.

"అప్పటి కల్లు దుకాణమే ఇప్పటి 'ప్రభుత్వ సారాయి దుకాణం' అయింది. దీన్ని ప్రభుత్వం నడుపుతోంది యిప్పుడు" అన్నారు పంతులుగారు.

" హన్నా, అయితే ప్రభుత్వం మద్యం అమ్మే స్థాయికి దిగజారిందా? అభివృద్ధి అంటే ఇదేనన్నమాట!" అని నిష్ఠురం ఆడాడు చిన్నబ్బాయి.

ఇంటిదారి పట్టినాక దారిలో దిగుడుబావిని చూసి మరింత ఆశ్చర్యపోయాడు.

"మన బావికి చుట్టూ ఉండిన ప్రహరీ గోడ ఏమయింది?" అని అడిగాడు.

"చుట్టుప్రక్కల క్రొత్త ఇళ్ళుకట్టినప్పుడు ఈ గోడలోని ఇటుకలను కూడా ఎత్తుకుపోయి వాడుకున్నార్రా! ఎంతని కాపలా కాయగలము నేను, మీ అమ్మా?" అని బాధగా చెప్పాడు తండ్రి.

తన చిన్నప్పుడు ఇంటికి తలుపులు వేసుకోకపోయినా నష్టం ఉండేది కాదు; ఇప్పుడు గోడలలోని ఇటికలు సైతం తస్కరిస్తున్నారన్నమాట!

వృద్ధ మామిడి చెట్టు మాత్రం ఇంకా ఉంది. ఒకప్పుడు గుబురు కొమ్మలతో పచ్చగా ఉండిన ఆ చెట్టు బట్టతల వచ్చిన మనిషి తలలా తయారయింది , అక్కడక్కడ మాత్రమే కనబడే ఆకులతో.

రాత్రి భోజనాల వద్ద పంతులుగారితో చిన్నబ్బాయి, "నాన్నగారూ, నేను కూడా వెళ్ళినాక ఇవన్నీ చూసుకోవడం మీకు కష్టమవుతుంది. అందుకని ఈ ఇంటినీ, మన బావి ఉన్న స్థలాన్నీ కూడా అమ్మేసి రెండు మేడలు కట్టించెయ్యండి, ఎంతో లాభసాటిగా వుంటుంది. వాటిలో ఒక అంతస్తు మనకు వచ్చేట్టు ఏర్పాటు చేసుకుందాం; మీరు ఉండడానికి కొంతా, అద్దెకివ్వడానికి మరి కొంతా వాడుకోవచ్చు" అని సలహా చెప్పాడు.

తన పిత్రార్జితమైన ఆస్తిని అమ్మగా వచ్చిన ధనంతో కొన్న ఆ విశాలమైన స్థలాన్నీ, ఇంటినీ వృద్ధాప్యంలో తన పిల్లలకు అప్పచెబుదామని తాను కొన్నేళ్ళ క్రితం అనుకునేవాడు. పిల్లల అభిప్రాయాలూ, కోరికలూ మారాయి. కాలం మారింది, దానికనుగుణంగా తాము కూడా మారాలని పంతులుగారు అర్థం చేసుకున్నారు.

చిన్నబ్బాయితో "సరే, అలాగే చేస్తాను", అన్నారు.

★★★

కొన్నేళ్ళకు పంతులు గారికి ఒంట్లో బాగాలేదని పిల్లలిద్దరూ తమ పెళ్ళాం-పిల్లలతో బల్కంపేటకు వచ్చారు.

పాత ఇల్లూ పోయింది, మామిడి చెట్టూ పోయింది, దిగుడుబావీ పోయింది.

చిన్నప్పుడు విశాలమైన ఇల్లూ, ఆవరణలలో పెరిగారు. ఇప్పుడు పెద్ద భవనాల్లో దూరదేశంలో వుంటున్నారు. తల్లిదండ్రులుంటున్న ఆ నాలుగ్గదుల చిన్న ఇంట్లో రెండు వారాలు గడపడం కూడా కష్టమనిపించింది వారికి.

పక్షుల కిలకిలరావాలు పోయి వీధుల్లో అలవాటు లేని రద్దీ, రకరకాల వాహనాల ఘోష, వాతావరణంలో ఒకప్పటి చల్లదనం స్థానంలో ఎంతో వేడీ, చెమటా ఉన్నాయి.

ఈ మార్పుల్లో అన్నిటికన్న ఇబ్బందికరమైన విషయం నీటి కొరత.

ఇంటిలోకి నేరుగా నీరు తెచ్చేందుకు గొట్టాలు ఎన్ని వున్నా ఊరంతా నీటికొరత వున్నప్పుడు ఏం లాభం?

ప్రతి రోజూ ఎవరికో డబ్బులిచ్చి పది బిందెల నీళ్ళు ఎక్కణ్ణించో తెప్పించుకుంటున్నారు.

"ఎలా వుంటున్నారు నాన్నగారూ, ఈ నీటి కొరతతో? మాతో రమ్మంటే రారాయె! ఈ నీటి కొరత నుండి విముక్తి ఉంటుంది మీకు, అందుకోసమైనా మాతో వచ్చేయండి", అని తిరిగి వెళ్ళిపోయే రోజున పిల్లలిద్దరూ ఆహ్వానించారు.

పిలవడమైతే పిలిచారు గానీ, తమ వద్ద వుంటే అమ్మకీ, నాన్నకీ ఏ మాత్రం ఊసుపోదని వారికి తెలుసు. ఇక్కడైతే చుట్టాలు, బంధువులు, మిత్రులు, వారికిష్టమయిన ఆధ్యాత్మిక ప్రసంగాలు. తమ దేశానికొస్తే క్రొత్త చోట పగలంతా బిక్కు బిక్కుమంటూ ఇంట్లోనే ఉండవలసి వస్తుంది. ఎందుకంటే తామూ తమ భార్యలూ ఉదయమే ఉద్యోగాలకూ, పిల్లలు బళ్ళకూ వెళ్ళిపోతారు.

పంతులుగారు తల అడ్డంగా ఊపుతూ, "పిల్లలూ, మమ్మల్ని ఇలాగే ఉండనివ్వండర్రా, ఇక్కడే శేష జీవితకాలం గడిపేస్తాం. మీరే ప్రతి సంవత్సరమూ వస్తూ ఉండండి.

ఈ నీటి కొరత సంగతంటారా, అది కూడా మా స్వయంకృతమే. ఎవరు చేసిన కర్మకు వారు ఫలితం అనుభవించక తప్పదు గదా మరి? నీటికోసం ఇప్పుడు దేశం వదిలి వస్తే నా పాపఫలితాన్ని అనుభవించడానికి ఇంకా ఎన్ని జన్మలెత్తాలో!" అని వేదాంతధోరణిలో చెప్పి వాళ్ళను సాగనంపారు.

★★★

విక్రమార్కుడు కథను ఇక్కడితో ఆపి మౌనం వహించాడు.

భేతాళుడు కొంతసేపాగి, "రాజా, పంతులుగారికి ముసలితనంలో చాదస్తం ఎక్కువైనట్టుంది, అనవసరంగా చివరి రోజుల్లో పిల్లల వద్ద ఉండే అవకాశాన్ని వదులుకున్నారు.

మార్పనేది సహజం. కాలాన్ని బట్టి దేశ జనాభా పెరగడమూ, తత్ఫలితంగా నీటి కొరత లాంటివి సంభవించడమూ కూడా తార్కికమైనవే గదా?

అటువంటప్పుడు ఊరంతా నీటి కొరత వస్తే తమ స్వయంకృతమంటారేమిటి? మరీ అసమంజసంగా లేదూ? కర్మసిద్ధాంతాన్ని ఎంత గాఢంగా నమ్మిన వ్యక్తయినా, ఏం పాపం చేసారని దాన్ని తనకు ఆపాదించుకున్నారు?

ఈ ప్రశ్నకు సమాధానం తెలిసీ చెప్పకపోయినా, లేక మాట మార్చినా, నీ తల వేయి ముక్కలవుతుంది" అని హెచ్చరించాడు.

"భేతాళా, ఒకప్పుడు పంతులుగారి దిగుడుబావి బల్కంపేటలోని ప్రజలకూ, జంతుజాలానికీ, చెట్టు పుట్టలకూ నీరిచ్చేది.

వయస్సు మీద పడ్డాక అన్నీ తాను చూసుకోలేననీ, తన తరువాత వాటిని చూసుకునే వారు లేరని భయపడీ, ధనాశ తోనూ, కారణాలేమైనా పంతులుగారు మేడలు కట్టడానికి పచ్చటి చెట్లతో పాటుగా ఆ జలాశయాన్ని కూడా నాశనం చేసారు.

ప్రకృతి పట్ల చేసిన ఆ ద్రోహమే ఇప్పుడు వారందరూ అనుభవిస్తున్న నీటికొరతకు కారణం అని ఆయన నమ్మకం.

ఇందులో అసమంజసమైనది ఏమిటట?" అంటూ విక్రమార్కుడు భేతాళుణ్ణి ఎదురు ప్రశ్నించాడు.

కథ పూర్తయినాక మరేమీ మాట్లాడకుండా ఉండవలసిన రాజుకు ఇలా మౌనభంగం కలగగానే భేతాళుడు వికటాట్టహాసం చేస్తూ శవంతో సహా ఎగిరిపోయి తిరిగి చెట్టెక్కి కూర్చున్నాడు.

తనను ఇరకాటంలో పెట్టి, తల పగుల్తుందని బెదిరించి తనచేత మాట్లాడించిన భేతాళుడి తెలివికి విసుక్కుంటూ, ఈసారి అవకాశం వస్తే మరింత పకడ్బందీగా కథ చెప్పాలని నిర్ణయించుకుని విక్రమార్కుడు కాళ్ళీడ్చుకుంటూ చెట్టు వద్దకు నడవసాగాడు.

## తెగులు బ్లాగు — ఆర్ శర్మ దంతుర్తి

### వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 18వ ఉగాది రచనల పోటీలో ఎంపికైన ఉత్తమ కథానిక

ఒకటో వారం:

"... అంచేత ఓ సుబ్బమ్మా, నువ్వు ఇంట్లో కూర్చునే కంప్యూటర్ వాడటం నేర్చుకో. ఊసుపోవట్లేదని నన్ను రోజూ ఏడిపించడం ఎందుకు?" సుబ్బారావు చెప్పేడు పెళ్ళాంతో.

"నేను చదువుకున్నదే పదో క్లాసు. నాకు కంప్యూటర్ లాంటివి ఎలా అర్థం అవుతై?" సుబ్బమ్మ అడిగింది మొగుడ్ని.

"నేను నేర్పుతానుగా? ఓ రోజు ఎలకని వాడటం, ఇంకోరోజు ఇంటర్నెట్ వాడటం. ఆ రెండూ తెలిస్తే చాలు."

"తర్వాత నా మటుక్కి నేనే?" ఆశ్చర్యపోయింది సుబ్బమ్మ.

"అవును సుబ్బమ్మా నీ మటుక్కి నువ్వే. కంప్యూటర్ అంటే బ్రహ్మ పదార్థం అనుకోకు. ఓ సారి వాడటం తెలిస్తే దానంత ఈజీ ఇంకోటిలేదు."

"మరి నాకు ఇంగ్లీషు రాదుగా?"

"సుబ్బమ్మా, ఇంగ్లీషంత ఈజీ బాష ఇంకోటి లేదు. ఉన్నవి ఇరవైయారు అక్షరాలూ, ఇరవైనాలుగు టెన్స్ లూనూ, ఎటు తిరిగి ఎటురాసినా అవే. తెలుగులాక్కాదు. అదీగాక కంప్యూటర్ మీద తెలుగులో రాయొచ్చు."

"హేవిటేవిటీ? కంప్యూటర్ కి తెలుగొచ్చా?"

"రాదు గానీ, నువ్వు తెలుగులో ఎలా టైప్ చేయ్యచ్చో నేను చూపిస్తాను. ఆ తర్వాత నీ ఇష్టం వచ్చినవి నువ్వు రాసుకోవచ్చు."

"నా కొచ్చిన వంటలన్నీ రాసుకోవచ్చా?"

"వంటలేం ఖర్మ, నీ చీరలు, నగలు, పాప ఫోటోలు అన్నీ పెట్టుకోవచ్చు ఇంటర్నెట్లో."

"మరి నాకొచ్చిన ముకుందమాలా, విష్ణుసహస్రనామం?"

"అవన్నీ ఆల్రెడీ ఇంటర్నెట్లో ఉంటాయి సుబ్బమ్మా. నేను రేపోసారి చూపిస్తానులే. నువ్వు నేర్చుకోవాల్సింది ఒక్కటే ఒక్కటి. గూగుల్ ఎలా వాడాలో తెలిస్తే చాలు. "

★ ★ ★ ★ ★

రెండో వారం:

"యావండీ, నేను తెలుగులో టైప్ చేయడం నేర్చేసుకున్నాను కదా. ఇప్పుడు ఎలాగా వంటలు అవీ రాసుకోవడం?"

"ఒక బ్లాగు మొదలుపెట్టు. అందులో నీ ఇష్టం వచ్చినట్లు రాసుకోవచ్చు."

"సరే ఏమి పేరుపెట్టాలి దానికి?"

"ఆలోచించుకోమరి. సుబ్బమ్మ.బ్లాగ్ స్పాట్.కం బానే ఉంటుంది."

"ఛీ పోండీ నాపేరు అంత బావుండదు కదా?"

"నీకు నచ్చిన పేరు పెట్టుకో అయితే. ఒక సారి బ్లాగు మొదలెట్టాక అది అందరికీ కనపడాలంటే, మాలికలోనూ, హారంలోనీ అందించు. ఇక చూస్కో నీకు ఎంత పేరొస్తుందో!"

★ ★ ★ ★ ★

మూడోవారం:

అయ్యలర, అమ్మలరా నేను తెలుగు బ్లాగు ప్రారంభించాను. ఇదే నా మొదటి పోస్టు. వచ్చి మీరు ఆశీర్వదించండి. ఇదిగో నా బ్లాగు ఎడ్రస్సు.. నాతల్లోయ్.బ్లాగ్ స్పాట్.కం. కావాల్సిన వారు ఈమెయిల్ కూడా` పంపించుడి. ఇట్లు .... సుబ్బమ్మ.

మూడురోజులు పోయేక నలుగురు కామెంటారు సుబ్బమ్మ బ్లాగులో. పదాలు కొత్తగా సృష్టించకపోతే ఎలా వస్తై అని జనం అడిగేరు. అందువల్ల కొత్త కొత్త పదాలు వచ్చి అర్ధం ఇచ్చుకోవాల్సి వస్తూంది. ఖర్మ. కామెంట్ పెట్టారు = కామెంటారు.

"అనానిమస్: బ్లాగులోకానికి స్వాగతం. కామెంట్లకి వర్డ్ వెరిఫికేషన్ తొలగించండి దయచేసి."

"కుమార్ అక్కినపల్లి: సుబ్బమ్మగారు, అభినందనలు. మీది హైద్రాబాదేనా? మీ పేరుతో ఉన్నావిడ మాకు చుట్టాలు ఉన్నారు హైద్రాబాదులో"

"రవి: తెలుగులో టైప్ చేయడం మీకు ఇంకా రాదని తెలిసిపోతోంది. కాస్త శ్రద్ధ పెట్టండి. లేఖిని వాడవచ్చు సులభంగా. వెల్కం టు బ్లాగ్స్."

"అనామక: సుబ్బమ్మ గారు, రవిగాడ్ని పట్టించుకోకండి. ఆయనంతే ఎప్పుడూ గుద్దుకి ఎంట్రుకలు పీకే మడిసి. ఖతర్నాక్"

★ ★ ★ ★ ★

నాలుగో వారం:

సంకలిని లో చూపించే మొదటి పోస్టు సుబ్బమ్మదే. హెడ్డింగ్: "తియ్యని జీడిమామిడి చారు."

"మీరెప్పుడైనా జీడిమామిడి చారు తిన్నారా? అదెలా చెయ్యచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. మామూలు చారు చేసి పెట్టుకోండి. తర్వాత రెండు జీడిమామిడి పళ్లు కోసి అందులో వేయండి. ఒక ఇరవై నిముషాలు గడిచేక చారు పొంగుతూండగానే దింపేసి. ఆరు నుంచి ఎనిమిది చెంచాల పంచదార వేయండి. ఇది వేడి వేడి అన్నంలో తింటే బాగుంటుంది. చల్లారిపోతే బావోదు."

కామెంట్లు:

1. ప్రియ: జీడి మామిడి అంటే నల్లగా ఉండే గింజేనా? పళ్ళు అన్నారు, అవేమిటి?

2. లక్ష్మి నరసు: ప్రియా జీడి మామిడి పళ్ళు అంటే గింజలు కాదు. గోదావరి జిల్లాల్లో దొరుకుతాయ్. హైద్రాబాదులో అయితే ఏమో!

3. అనానిమస్సు: ఏమిటండీ ఈ గోల. చారులో పంచదార వేసేర్టా ఈ సుబ్బమ్మ గారు. తియ్యని చారు తయారైపోయింది. ఆహా, ఇంకేం? బ్లాగులో పారేయడమే. దీన్సిగతరగ ఆ మాత్రం వంటలు రాని వాళ్ళు ఎవరండీ ఈ ప్రపంచంలో?

4. పా.పా: అనానిమస్సు – కెవ్వు కేక.

5. సుబ్బమ్మ – కామెంటిన అందరికీ నెనర్లు. ఈ పదం ఇప్పుడే నేర్చుకున్నాను. నా బ్లాగులో నా ఇష్టం వచ్చినట్టు రాసుకుంటా. మీరెవరు నాకు చెప్పడానికి. ఇష్టం ఉంటే చదవండి. లేకపోతే లేదు. మా వారు నాకు చెప్పేరు బ్లాగులో ఎలా రాయచ్చో, కూడదో. ఇప్పటునుండి నా బ్లాగులో అనానిమస్సులని ఒప్పుకోను.

★ ★ ★ ★ ★

నాలుగో నెల:

రెండ్రోజుల క్రితం 'పుచ్చుపాదు గారు పెట్టిన పోస్ట్ కి ఇది కలుపుకోండి. కిందనున్న ఆడియో నొక్కితే కనకధారాస్తవం వినొచ్చు. ఈ రోజు నేను చదువుకున్న స్కూల్ కి నూట యాభయ్యోవార్షికోత్సవం. అందరికీ శుభాకాంక్షలు.

కామెంట్లు:

పుచ్చుపాదు: ఆడియో చాలా బాగుంది. ఎలా సంపాదించేరు? లీగల్ గా ఇలా అందరికీ డిస్ట్రిబ్యూట్ చెయ్యొచ్చా?

సుబ్బమ్మ: పుచ్చుపాదుగారూ, మీ కామెంట్ వల్ల నా బ్లాగు బతుకు ధన్యం ఐపోయింది. మా వారు చెప్పేరు ఏది ఎలాగ గూగిల్లో ట్రై చెయ్యచ్చో. ఎవడండీ నా మీద కేసు వేసేది. రమ్మనండి చూద్దాం. :-)

★ ★ ★ ★ ★

తొమ్మిదో నెల:

సుబ్బమ్మ బ్లాగులో హెడింగ్: రావమ్మా మహాలక్ష్మి... మనతెలుగు వాళ్ళల్లో ఎక్కువ కట్నాలు తీసుకుంటారనీ, కట్నం చావులు ఎక్కువనీ చెప్పుకుంటారుగా? కింద ఫోటోలు చూసి చెప్పండి ఇప్పుడు ఎవరు ఎక్కువ తీసుకుంటారో. ఈ ఫోటోలన్నీ నాకు మా స్నేహితురాళ్ళు పంపించేరు. మీ అందరికోసం ఇక్కడా పెడుతున్నాను. ఇవన్నీ ఆంధ్రా వాళ్ళవి కావు. (మొహాలు చూస్తూంటే తెల్సిపోవట్లే?). ఇది నా వందో పోస్టు. అప్పుడే తొమ్మిది నెలలు ఐపోయాయా అనిపిస్తోంది.

కామెంట్లు:

రవి: సుబ్బమ్మ గారు, ఈ ఫోటోలోని వాళ్ళు ఎవరైనా ఇవి చూస్తే కేసు పడుద్ది జాగ్రత్త.

నరేష్: రవి గాడ్ని పట్టించుకోకండి. సుబ్బమ్మ గారు, ఫోటోలు అదిరిపోయేయ్. ఇంతింత బంగారం ఎలా మోస్తారో మరి వీళ్ళు.

(ఇంకో నలభై కామెంట్లు సుబ్బమ్మ ని పొగుడుతూ, తిడుతూ)

సుబ్బమ్మ: రవీ, వీళ్ళందరిదీ కేరళ అనుకుంటా. నా బ్లాగు ఎలా చూస్తారు. చూస్తే నన్నేం చేయగలరు? మా వారు చెప్పేరు. నా మీద ఈగ కూడా వాలదు. ఊరికే కంగారు పడకండి. ఉల్టా పుల్టాలు నా మీదకొస్తే మావారు చూసుకుంటారు.

నరేష్: సరిగ్గా చెప్పేరు సుబ్బమ్మ గారు. మిమ్మల్ని ఎవడు ఏమీ చెయ్యలేడు. కీపిటప్! మీలాంటి వాళ్ళే మనకి కావాలి ఇప్పుడు. ధైర్యే సాహసే లక్ష్మీ.

ఇది జరుగుతున్నప్పుడే సరిగ్గా గూగిల్ కంపెనీ లో పనిజేసే రమణ ఈ బ్లాగు చూసేడు. ఫోటోలు తీరిగ్గా చూస్తూంటే ఒక ఫోటో లో మనిషిని ఎక్కడో చూసినట్టుందే అనుకుని పక్క క్యూబ్ లో అయ్యర్ ని పిల్చి అడిగేడు. "ఇది మన జోసెఫ్ కురియాకోస్ ఫోటోలా లేదూ? " అంటూ.

"లా, అంటావేంటి బాసు, వాడే. నేను వాళ్ళ పెళ్ళికెళ్ళానుగా?"

"నిజంగా? ఎవడో వీళ్ళ ఫోటోని బ్లాగులో పెట్టేడు మరి."

"బ్లాగులోనా? అది ప్రైవసీ ప్రోబ్లెం కింద వస్తుంది. ఆ లింకు నాకు పంపించు."

"పోనిద్దూ. మనకేల?"

"అదేంటి రవణా రేప్పొద్దున్న నీదీ మీ ఆవిడదీ ఎవడైనా బ్లాగులో పెడితే చేతులు కట్టుకు కూర్చుంటావా?"

"సరే పంపిస్తున్నాను." చెప్పేడు మైల్ ప్రోగ్రాంలో లింక్ అంటిస్తూ.

అలా మొదలైన మైల్ నాలు రౌండ్లు కొట్టి జోసెఫ్ కురియాకోస్ బాక్సు లోకి వచ్చి పడింది. జోసెఫ్ అది చూసే సరికే గూగిల్లో పనిచేసే సగం మందికి వాళ్ళావిడ వేసుకున్న నగలూ, వాటి విలువా తెల్సిపోయేయి. ఒక చైనావాడు ఐతే కాస్త ముందుకెళ్ళి "అందుకే ఇండియాలో వరకట్న హింసలూ, చావులూను" అనేసాడు బహిరంగంగానే.

రెండ్రోజులు కిందా మీదా పడి జోసెఫ్ ఆఖరికి వాళ్ళావిడతో చెప్పేడు జరిగింది. ఆవిడకి వళ్ళు మండిపోయింది. మీరు కంప్లైంట్ చెయ్యరేం అని పోరడం మొదలెట్టింది ఆవిడ.

చెప్పులో రాయి, చెవిలో జోరీగ, కంటిలో నలుసు, కాలిముల్లూ, ఇంటిలోని పోరు ఇంతింత కాదయా అయ్యేక జోసెఫ్ గూగిల్లో బ్లాగు సెక్షన్స్ కి వెళ్ళి ఫిర్యాదిచ్చేడు. బ్లాగు సెక్షన్లో పనిజేసే టాం , డిక్ అందరూ కల్సి ఆ రోజు నుంచీ బ్లాగ్ నిఘా మొదలుపెట్టేరు సుబ్బమ్మ బ్లాగు మీద. పనిలో పనిగా గూగిల్ ఇండియా ఆఫీసుకి ఓ కాపీ పంపించేరు.

ఇవేమీ తెలియని సుబ్బమ్మా, సుబ్బమ్మ మొగుడూ తీరిగ్గా పేపరు చదువుతూ ఎప్పట్లాగానే ఇక్కడివక్కడ కాపీ చేసి పేస్ట్ చేస్తూ బ్లాగు రాజ్యంలో ఇరగ దీస్తున్నారు. ఇరగ దీయడం అంటే ఏంటని అడక్కండేం? సినిమా డైలాగులకీ టీవీ న్యూస్ కీ కూడా అర్ధాలు చెప్పమంటే ఎలా?

మూడు వారాలు గడిచేయి. బ్లాగు నిఘా మొదలెట్టాక సుబ్బమ్మ కాపీ చేసి పేస్ట్ చేసినవన్నీ ముందుంచుకుని గూగుల్ కంపెనీ సుబ్బమ్మ కి ఒక ఈమెయిల్ పంపించింది.

"డియర్ సుబ్బమ్మ, మీ బ్లాగులో చాలా కాలం నుంచీ పెట్టకూడని కాపీ రైట్ మెటీరియల్ పెడుతున్నట్టూ మేము తెల్సుకున్నాము. ఈ విధంగా చెయ్యడం వల్ల మీకూ మాకూ అనేకానేక సమస్యలు వస్తాయి. మీరు మొదట బ్లాగు ప్రారంభించినప్పుడు కొన్ని షరతులకి ఒప్పుకున్నారు. అందులో కాపీ రైట్ మెటీరియల్ బ్లాగుల్లో పెట్టకోడదనేది ఒకటి. అంచేత మీ బ్లాగు స్కానెర్ కింద ఉంచబడింది. మీరు వెంటనే అవన్నీ తీసేయకపోతే మీమీద అవసరమైన చర్యలు తీసుకోబడతాయి. ఆ చర్యల్లో భాగంగా బ్లాగు మూసెయ్యడం ఒకటి అనేది గుర్తుంచుకోండి. ఒకసారి మేము బ్లాగు మూసేసినా దాని కంటెంట్ మీద ఇతరులు వేరే చర్య తీసుకోవచ్చనేది గమనించగలరు.

ఇట్లు

గూగుల్"

ఈ ఈమైల్ చూసిన సుబ్బమ్మ కి ఒంట్లో దడ పుట్టుకొచ్చింది. వెంటనే మొగుడికీ ఫోన్ చేసి చెప్పింది. మొగుడు ఆ రోజూ ఆఫీసులో బాస్ చేత చివాట్లు తిని ఉన్నాడేమో చిరాగ్గా ఉన్నాడు. "నేను వచ్చి చూస్తాలే, నువ్వేం కంగారు పడకూ, ఇప్పుడు పనుంది" అని ఫోన్ పెట్టేసేడు.

రాత్రి అన్నం తిన్నాక తీరిగ్గా చూసేడు ఈమెయిల్ ని సుబ్బమ్మ మొగుడు. హెడర్ నీ వచ్చిన టైం నీ చాలా సేపు మార్చి మార్చి చూసేక పెద్ద సైంటిస్టులా చెప్పేడు సుబ్బమ్మతో, "ఇది గూగుల్ నుంచి వచ్చినట్టూ ఎవడో నీ మీద కక్షతో పంపించేడు తప్ప ఇది నిజంగా గూగుల్ నుంచి వచ్చింది కాదు. డోంట్ వర్రీ"

"మీరెలా చెప్పగలరూ అది గూగుల్ నుంచి రాలేదనీ?"

"నన్ను తక్కువ అంచనా వెయ్యకు సుబ్బమ్మా!" నవ్వుతూ చివాట్లు పెట్టేడు మొగుడు.

పదిహేను రోజులు గడిచేక ఓ రోజు సుబ్బమ్మ బ్లాగులో గుమ్మిడికాయ–మావిడికాయ పులుసు రిసెపి పోస్ట్ చేద్దామని తెరిచేసరికి, బ్లాగు మూసేసినట్టు మెసేజ్ వచ్చింది. సరే మన హైద్రాబాదులో నెట్టు, కరెంటూ పోవడం మామూలే కదా తర్వాత చూద్దాం అనుకుని సాయంత్రం ఆరు దాటేక మళ్ళీ ప్రయత్నం చేసింది. అప్పుడు కూడా పనిచెయ్యలేదు. అప్పుడు మొగుణ్ణి పిల్చి చూపించింది.

★ ★ ★ ★ ★ ★

పదిహేను రోజులు పోయేక సుబ్బమ్మకి ఒక లెటరొచ్చింది పోస్ట్ ద్వారా. అందులో ఇలాగుంది.

డియర్ సుబ్బమ్మ

ఇందువలన మీకు తెలియచేయునదేమనగా, మీరు రాసే బ్లాగులో ఇతరుల కాపీరైట్ బొమ్మలు, పెళ్ళిఫోటోలు పర్మిషన్ లేకుండా పెట్టడం వల్ల మీ బ్లాగు క్లోజ్ చేసాము. ఇప్పుడు ఆ ఇతరుల లాయర్లు, కోర్టులు అడగడం వల్ల మీ బ్లాగ్ కంటెంట్ మొత్తం వారికి సమర్పించడమైనది. మొదట మీరు బ్లాగు ప్రారంభించినప్పుడు మీరు ఒప్పుకున్న షరతుల ప్రకారం మీరు రాసిన బ్లాగు కి మీరే బాధ్యులు. గూగిల్ కి కానీ గూగిల్ కి సంబంధించిన సంస్థలకి కానీ ఈ వ్యవహారంతో సంబంధం లేదని గమనించగలరు. గూగిల్ ఏ దేశంలో ఉంటే ఆ దేశంలో పోలీస్ లా అండ్ ఆర్డర్ తో సహకరిస్తుంది.

ఈ ఉత్తరం మీకు జరుతున్న విషయాలు తెలపడానికే. దయచేసి ప్రత్యుత్తరం రాయకండి. అది పరిశీలించబడదు.

ఇట్లు

గూగిల్ టీం.

ఇది సుబ్బమ్మ మొగుడు చూసి కొంచెం జడిసినా, మేకపోతు గాంభీర్యంతో చెప్పేడు సుబ్బమ్మతో, "ఏం ఫర్లేదు సుబ్బమ్మా, నేను ఉండగా నీకేమీ భయంలేదు. బ్లాగ్ స్పాట్ లో నిన్ను రాయనియ్యకపోతే నువ్వు ఇంకో దాంట్లో బ్లాగు రాయొచ్చు. మహా ఐతే, గీతే, నీ పాత పోస్టులు పోతాయి అంతే. నువ్వేం ఖంగారు పడకు."

సుబ్బమ్మ మొగుడు ఆ రోజు రాత్రి నిద్రపోలేదు. పక్కనే పడుకున్న సుబ్బమ్మ మాత్రం గురక పెట్టడం వింటూనే ఉన్నాడు.

ఇగ్నోరన్స్ ఈజ్ బ్లిస్ కాదూ?

పొద్దున్నే తనకి తెల్సిన లాయర్ స్నేహితుడి దగ్గిరకెళ్ళేడు సుబ్బమ్మ మొగుడు. "ఏవిరోయ్, ఇలా వచ్చావ్?" పలకరించేడు స్నేహితుడు.

తనకొచ్చిన ఉత్తరం, బ్లాగులో సుబ్బమ్మ కథా, ఉత్తరోత్తరా జరిగిన కథా చెప్పి అడిగేడు సుబ్బమ్మ మొగుడు, "అసలు సుబ్బమ్మ ఎక్కడా ఇంటర్నెట్లో ఇంటి ఎడ్రస్ ఇవ్వకుండా జాగ్రత్త పడినా గూగుల్ కి మా ఇంటి ఎడ్రస్ ఎలా తెల్సింది? ఇదంతా అయోమయంగా ఉంది."

లాయర్ సుబ్బమ్మ మొగుడికేసి జాలిగా చూసేడు. ఉత్తరం అవన్నీ తీరిగ్గా ఒకసారి పరిశీలించి చెప్పేడు. " గూగుల్ వాడుతూంటే దానికి మీరు ఎక్కడ్నుంచి కనెక్ట్ చేస్తున్నారో తెలుస్తుంది. ఒకసారి మీ ఐ. పి ఎడ్రస్ తెలియగానే ఆ ఇంటర్నెట్ మీకు ఎవరు సప్లై చేస్తున్నారో తెల్సుకోవడం పది నిముషాల పని. ఇంటర్నెట్ ప్రొవైడర్ తెలిస్తే మీ ఎడ్రస్ పట్టుకోవడం ఎంతసేపు?"

లాయర్ మళ్ళీ ఇలా అన్నాడు, "అయినా నీకు మీ ఆవిడకి ఇంకేమీ పనిలేదా, ఇలాంటి వెధవ పన్లు చేయడం ఎందుకూ? ఇదేం తెగులూ?"

సుబ్బమ్మ మొగుడు నోరు వెళ్ళబెట్టేడు. కాస్సేప్పోయేక నోరు పెగిలించుకుని అడిగేడు నీరసంగా, "అయితే ఇప్పుడేమి చేయమంటావ్?"

వెంటనే లాయర్ కి గేలానికి పడబోయే చేప గుర్తుకొచ్చింది. తను తొందర్లో కుటుంబ సహేతంగా తిరుపతి వెళ్ళబోతున్నాడు. ఆ ఖర్చులు ఇందులో రాబట్టుకోవడం ఎంతసేపు? ఒక్కసారి సత్తువ పుంజుకుని చెప్పేడు, "కొంచెం వేచి చూద్దాం, అటువైపు పార్టీ లాయర్లు నీకు రెండుమూడు వారాల్లో నోటీసులు పంపిస్తారు, అప్పుడు సాధారణంగా మొదట షో కాజ్ నోటీస్ వస్తుంది. దానికి సరైన లాయర్ బాషలో సమాధానం రాద్దాం. ఒప్పుకుని ఊరుకుంటే సరే సరి, లేకపోతే తర్వాత ఇంకేమైనా అయితే అప్పుడు చూసుకోవచ్చు."

"దీనికెంత అవుతుంది?" సుబ్బమ్మ మొగుడు అడిగేడు.

"తిరుపతి ట్రిప్ స్లీపర్ కోచ్ లో అయితే నేను మా ఆవిడా ఇద్దరు పిల్లలూ కల్సి మూడువేలు. కానీ అత్తగారు వస్తానని చంపుతోంది. ఇంకో వెయ్యి కలిపితే నాలుగు. అక్కడకెళ్ళాక ఖర్చులు ఇంకో మూడూ వేలు. అయినా డబ్బులు సుబ్బమ్మ మొగుడు ఇస్తోంటే కోచ్ లో వెళ్లడమేల? అసలే ఎండలు మండిపోతున్నాయి కూడాను. ఏ సి స్లీపర్ అయితే ఇంకో ఐదు వేలు కలుపుకో. ఇదంతా ఆలోచించి "కొత్తగా మార్పులు చేసిన సైబర్ లా, కంప్యూటర్ క్రైం అదీ చూడాలి, దానితో కుస్తీ పట్టి ఒక నోట్సూ, ఒక అసిస్టెంట్ చూస్తాడనుకో ఆ పని. తర్వాత నేను గూగుల్ ని కంటాక్ట్ చేసి అవతల లాయర్లని అడగాలి, కోర్టు దాకా రాకుండా ఉండడానికి. ఇదంతా నాలుగు వారాలు పడుతుంది మరి. నాదేంలేదు మధ్యలో...." ఆగేడు లాయరు.

"సరేలే నీతో బేరం దేనిగ్గానీ ఎంతౌతుందో చెప్పు"

"ఓ పదిహేను, ఇరవై వేలల్లో పనైపోతుంది." చెప్పేసేడు లాయర్.

"హేవిటీ? అవతల లాయర్లకి ఉత్తరమ్ముక్క రాయడానికి పదిహేనువేలా?"

"పదిహేను నుండి ఇరవై." తప్పు దిద్దేడు లాయరు, పదిహేను చాలదు సుమా అని సున్నితంగా చెప్తూ.

సుబ్బమ్మ మొగుడు ఇంకా ఒప్పుకోడేమో అని, "నీ ఇష్టం. నేను నిన్ను పిలవలేదు. నువ్వే నా దగ్గిరకొచ్చేవ్. నీ కిష్టం ఉంటే చెప్పు నేను చూస్తాను. కాదూ నువ్వు చూసుకుంటాను అంటే సరే. నేను అయితే లాయర్ లెటర్ హెడ్ మీద లా అదీ చదివి ఆ లా పాయింట్లు లాగుతూ రాసిస్తాను. నువ్వు రాసుకుంటానంటే చెప్పు, నా కేల ఈ గొడవంతాను? నాకు కోర్టుకు టైం అవుతోంది మరి." లాయర్ చెప్పేడు అవతల ఏవో కొంపలంటుకు పోతూన్నట్టూ.

"సరే నువ్వే చూడు," లేచేడు మొగుడు.

లాయర్ మొహంలో సంతోషం కనపడకుండా "తప్పకుండా, ఇవాళే మొదలు పెడతాను నీ పని. మళ్ళీ రా నువ్వు అటువైపునుంచి లాయర్ నోటీస్ వచ్చేక" అన్నాడు.

మొహంలో సంతోషం క్లైంట్ దగ్గిరకాదు కానీ రాత్రి అందరూ భోజనం చేస్తూంటే అత్తగారి ముందు, పెళ్ళాం ముందూ చూపించడానికి రిజర్వ్ చేసుకున్నాడు లాయరు.

ఆ రోజు సుబ్బమ్మతో లాయర్ గురించీ, డబ్బుల గురించీ చెప్పలేదు మొగుడు. సుబ్బమ్మ ఏదో అడిగితే చిరాగ్గా వచ్చింది సమాధానం. సరే ఏదో ఆఫీస్ గొడవల్లో ఉన్నార్లే అని సుబ్బమ్మ ఊరుకుంది.

మూడువారాలు గడిచేక మళ్ళీ వచ్చాడు సుబ్బమ్మ మొగుడు లాయర్ దగ్గిరకి. అటువైపు పార్టీ లాయర్ ఇచ్చిన షో కాజ్ నోటీస్ పట్టుకుని. సుబ్బమ్మ మొగుడు పదిహేను వేలకి ఇచ్చిన చెక్కుని లాయర్ తీసుకుని అప్పటికే రడీగా రాసి ఉంచిన నోటీస్ చూపించేడు., "అయ్యా నేను ఎక్కువ చదుకోలేదు. మెల్లిగా కంప్యూటర్ గురించి నేర్చుకుని బ్లాగు మొదలు పెట్టేను. తెలిసీ తెలియని టెక్నాలజీ వల్ల ఏది కాపీ చేయకూడదో ఏది చెయ్యచ్చో, దేనికి కాపీ రైట్ ఉందో గమనించలేదు. ఇది పూర్తిగా నా తప్పే అని విన్నవించుకుంటున్నాను. ఇటుపైన నేను బ్లాగ్ రాయడం కూడా మానేస్తున్నాను. ఇది నా మొదటి తప్పుగా భావించి నన్ను క్షమించగలరు. ఇప్పటినుండీ జాగ్రత్తగా ఉంటానని మనవి చేస్తున్నాను. ఇందులో తప్పు పూర్తిగా నాదే కాబట్టి జరిగిన దానికి విచారిస్తున్నాను.... ఇట్లు సుబ్బమ్మ."

ఈ లెటర్ చూసి సుబ్బమ్మ మొగుడు "ఈ మాత్రం నేను రాయలేనా" అనుకున్నాడు గానీ, వెంటనే తాను సుబ్బమ్మతో బ్లాగ్ మొదలు పెట్టించి, చేసిన నిర్వాకం గుర్తొచ్చి నోరు మూసుకున్నాడు.

ఈ లెటర్ లాయర్ ఇస్తూ చెప్పేడు "నేను ఈ లాయర్ తో మాట్లాడతాను. కోర్టు దాకా రాకుండా చూసే పూచీ నాది. సాధారణంగా ఇలాంటివి వెంటనే క్లోజ్ చేసేస్తారు ఎందుకంటే ఇందులో లాయర్లకీ, క్లైంట్లకీ ఏమీ మిగలదు. ఇంటికెళ్ళి సుబ్బమ్మ చేత సంతకం చేయించి మళ్ళీ పట్రా, నేను దీన్ని రిజిస్టర్డ్ పోస్టులో పంపిస్తాను," అని, ఒకసారి చెక్కు కేసి చూసి, “మొత్తం పద్దెనిమిది వేల చిల్లర అయింది ఖర్చు. లెటర్ పట్టుకొచ్చినప్పుడు మిగతా మూడు వేలు చెక్కు తెచ్చిపెట్టు."

ఇంటి కొచ్చి లాయర్ ఇచ్చిన నోటీస్ మీద సంతకం పెట్టిస్తూ సుబ్బమ్మ తో చెప్పేడు మొగుడు, "ఇంక మనం బ్లాగ్ రాయొద్దని చెప్పేడు లాయరు."

"అదేం? ఓ చోట కాకపోతే ఇంకో చోట రాయొచ్చన్నారుగా మీరే" అడిగింది సుబ్బమ్మ అనుమానంగా.

"ఈ గొడవల వల్ల మళ్ళీ నీ బ్లాగు మీద భూతద్దం పెట్టి చూస్తూ ఉంటారు కొంతకాలం. కొన్నాళ్ళ పాటు ఆగి మళ్ళీ మొదలెట్టొచ్చు." చెప్పేడు మొగుడు, లాయర్ కి ఇచ్చిన పద్దెనిమిది వేల సంగతీ సుబ్బమ్మతో చెప్పకుండా. చెప్తే పదో క్లాస్ చదివిన సుబ్బమ్మ ముందు పరువుపోదూ?

"పోన్లెండి, నేను మెయిల్ చూసుకుంటూ ఏదో రాసుకుంటూ ఉంటాను. ఆ బ్లాగ్ మూలానా నాకెప్పుడూ పాట్లే, ఎవరో ఏదో

అన్నారనీ, అనలేదనీ."

"సరే" అని పైకి అని, "ఇప్పుడు తెగులు కుదిరింది నాకూనూ," అనుకున్నాడు మొగుడు లోపల.

మూణ్ణెల్లు పోయేక ఓ రోజు లాయర్ పెళ్ళాం ఫోన్ చేసింది సుబ్బమ్మకి, "సుబ్బమ్మ గారూ మేం అందరం కుటుంబ సమేతంగా తిరుపతి వెళ్ళొచ్చాం, ఓ సారి రండి మా ఇంటికి, లడ్డు ప్రసాదం తీసుకుని వెళ్దురు గానీ."

"సరే, తప్పకుండా వస్తాం ఈ వారం లో ఓ రోజు." చెప్పింది సుబ్బమ్మ సంతోషంగా. సుబ్బమ్మ అడిగితే మొగుడు మాత్రం ఆఫీస్ పని వంక చెప్పి తప్పించుకున్నాడు. లేకపోతే పద్దెనిమిది వేల రూపాయల తిరుపతి లడ్డూ జీర్ణించుకోవద్దూ?

తాజా కలం:

ఈ కథలో పేర్లన్నీ "పూ-ర్తి-గా" కల్పితం. ఎవరినీ కించపరిచే ఉద్దేశ్యం లేదు. పేర్లు మీకు గానీ, మీకు తెల్సున్నవాళ్ళకి గానీ మేచ్ అయితే భుజాలు తడుముకోనవసరం లేదు. అది పూర్తిగా కో ఇన్సిడెన్స్. రోజూ తెలుగు బ్లాగులు చదివి సరదాగా నవ్వుకోడానికీ, బ్లాగులో "ఏది పడితే అది" రాయడం ఎందుకు మంచిది కాదో చెప్పడానికే ఈ చిన్న ప్రయత్నం.

## నానాటి బ్రతుకు — ఆకెళ్ళ శివప్రసాద్

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ

**ప్రియమిత్రమా,**

నీతో ముఖాముఖీగా మాట్లాడే 'ధైర్యం' లేక, చొరవ తీసుకోలేక ఈ ఉత్తరం రాస్తున్నాను. మరుగున పడిపోతున్న ఉత్తరాలు రాసే పద్ధతిలాగే, ఉపాధ్యాయ వృత్తి పూర్వవైభవాన్ని పోగొట్టుకుంటోంది. గౌరవ మర్యాదలు పూర్తిగా పోయాయని రాయలేక ఈ మాట రాస్తున్నాను.

గోదావరి జిల్లాలో ప్రసిద్ధ వేదపండితుల ఇంట్లో పుట్టిన నేను, అగ్రహారంలోనే ఉంటూ, తాతగారి దగ్గరనుండి వేదం నేర్చుకోవడమే కాక, సంస్కృతం మీద మమకారంతో ఎమ్.ఏ. సంస్కృతం పూర్తి చేశాను. సంస్కృతిని ఇష్టపడ్డాను.

వేదపండితులుగా పేరు గడించినా, ఆర్థికంగా దుర్భర పరిస్థితులలో ఉన్న మా కుటుంబాన్ని, సాధ్యమైన రీతిలో ఆదుకునే ప్రయత్నంలో ఏదైనా ఉద్యోగం చూడమని నిన్ను అర్థించాను. నా యందు దయతో నువ్వు 'హరి కాన్సెప్ట్' పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయుడిగా ఉద్యోగం ఇప్పించావు. పాఠశాలలోకి అడుగుపెట్టినప్పుడు నా 'వాలకం' చూసి ప్రిన్స్‌పాల్‌గారు "అసలు మీరు చెప్పగలరా?" అని అడిగారు.

నేను పంచమహాకావ్యాల విశిష్టతని చెపుతుంటే సగంలోనే మాటకి అడ్డుపడి -

"పోటీ ప్రపంచంలో మన స్కూలు ఎప్పుడూ ముందే ఉంటుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథ్స్ ఈ మూడు సబ్జెక్ట్‌లు ప్రతిరోజూ రెండేసి పిరియడ్స్ ఉంటాయి. వీటి తరువాత తల్లిదండ్రులు ఇంగ్లీషు గురించి అడుగుతారు కనుక, ఆ క్లాస్, ఆ పైన హిందీపోటీ పరీక్షలలో ఉపయోగపడే సోషల్, కంప్యూటర్, చివరికి తెలుగు, తెలుగు అయిపోయాకా, కేవలం ఇరవై మార్కులకి సంస్కృతం ఉంటుంది. అందులోనూ పధ్నాలుగు మార్కులు సంస్కృతంలో రాయాలి. అంటే ఆరువందల మార్కుల్లో ఆరు మార్కుల విలువ సంస్కృతం. ఆరు మార్కుల కోసం పంచమహాకావ్యాలు అక్కర్లేదు, కాళిదాసు లెవెల్లో కవిత్వం అక్కర్లేదు." అని తేల్చేసి,

ఆరు మార్కుల మీద దృష్టి పెడితే చాలు అని పరిమితులు చెప్పేశారు.

ఉద్యోగానికి వెళ్ళిన 'పాపానికి' యాచకుడిలా మాట్లాడే అవకాశం లేకపోయింది.

పాఠశాలలో చేరిన రెండోరోజే 'జోనల్ ఇన్‌ఛార్జ్' అని ఒకరు వచ్చారు. నన్ను చూసి "ఏమిటీ? తద్దిన బ్రాహ్మల్లా అంతంత బొట్లు పెట్టుకుని వచ్చారు. కార్పోరేట్ స్కూలుకి వస్తున్నారు. కర్మకాండకని కాదు" అనేసరికి తలను కోసి పాఠశాల గుమ్మానికి వేలాడదీసినట్టు అనిపించింది. భాషని మార్కుల్లో లెక్క కట్టినట్టు, మనిషిని వేషభాషల్లో బేరీజు వేస్తున్నారు.

మరో గత్యంతరం లేక ముత్యమంత తిలకాన్ని పెట్టుకుని వెళ్ళడం ప్రారంభించాను. ఆ రోజు నుండి నా మొహం చూసుకోవడం నాకే సిగ్గుగా అనిపించి అద్దంలో చూసుకోవడం మానేశాను.

●●●

"మీరందరూ ఈ రోజునుండి ప్రతి ఇంటికి వెళ్ళి మన స్కూలు గురించి చెప్పి ఎడ్మిషన్లు తీసుకురావాలి. ప్రతి టీచర్ కనీసం పదిమంది విద్యార్థులని తీసుకువచ్చే ప్రయత్నం చేయాలి. ఈ ఏడాది మన స్కూలు సాధించిన విజయాలు పత్రికలలో, టీవీలో ప్రకటనలు ఇచ్చాం. అందువల్ల ఎడ్వర్‌టైజ్‌మెంట్ ప్రభావంతో చాలామందికి మన స్కూలు గురించి తెలుసు. మీరు వెళ్ళి తల్లిదండ్రుల్ని ఒప్పించి తీసుకురావాలి" అన్నారు ప్రిన్సిపాల్ ఆ రోజు - అనడమే కాదు అందరికి రంగు రంగుల ప్రకటనల కాగితాలు ఇచ్చారు. ఇంటింటికి తిరగడానికి ఒక్కొక్కరికి ఒక్కో ప్రాంతం ఇచ్చారు. ఆ ప్రాంతంలోనే వేరే పాఠశాలల్లో చదివే పిల్లల పేర్లు ఇచ్చారు. అప్పటికే 'అలవాటు' అయిపోయిన పనిలా మిగిలిన వారంతా పనిలోకి దిగిపోయారు.

'చదువు' దగ్గరకి విద్యార్థులు వచ్చే రోజులు పోవడమే కాదు, విద్యార్థులని వెతుక్కుంటూ ఉపాధ్యాయులు రోడ్డున పడే రోజులు వచ్చేశాయి. కాలమహిమ. కేవలం నేను ఒక్కడినే కాదు అందరి ఉపాధ్యాయుల పరిస్థితి ఇదే

"బట్టల, సబ్బులు, ఫినాయిల్, అల్లం, వెల్లుల్లి ఇంటింటికి తిరిగి అమ్మినట్టే, చదువుని అమ్మాలి. మనందరం "'సేల్స్ టీచర్స్‌మి' పాఠాలు చెప్పడం ఎలా ఉన్నా అమ్మకాల్లో ప్రతిభ చూపిస్తే చాలు. మేనేజ్‌మెంట్ వారు మన ఉద్యోగాలు ఉంచడానికి" అన్నాడు పాణిగ్రాహి అనే సోషల్ ఉపాధ్యాయుడు. ఆయనా పోయిన సంవత్సరమే ఈ పాఠశాలలో జేరాట్ట. ఇద్దరికీ ఒకే ప్రాంతం కేటాయించేసరికి, నాతో పాటు వొస్తూ చాలా విషయాలు చెప్పాడు.

"ఇప్పటి పిల్లలకి 'జ్ఞానం' ఇవ్వక్కర్లేదు, మార్కులు వచ్చే మార్గాలు చెపితే చాలు. వీళ్ళ దృష్టిలో చదువంటే మార్కులు. అందులోనూ లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో వందకి వందా వస్తే వాడినిమించినవాడు లేడు. భాషా, చరిత్ర, సంస్కృతి ఇవేమీ అవసరం లేదు. ఇన్‌స్టెంట్‌గా మార్కులు వచ్చే మార్గాలు కనిపెట్టడమే టీచర్ల పని. దీనికోసం మన హెడ్డాఫీసులో కొంతమంది టీచర్లు ఉన్నారు. వాళ్ళ పోటీ పరీక్షలు మొదలయినప్పటినుండి ఉన్న ప్రశ్నాపత్రాలని సంపాదించి, జవాబులు తయారుచేసి, మధించి శోధించి ఎప్పటికప్పుడు 'ట్రెండ్' ఎలా ఉంటుందో కనిపెడ్తుంటారు. మిగిలిన స్కూళ్ళలో ఏ పుస్తకాలు ఫాలో అవుతున్నారు, ఏ ఏ ప్రశ్నలు

తయారు చేశారు వంటి విషయాలని ఎప్పటికప్పుడు 'వేగుల' ద్వారా కనిపెడ్తారు. పథకాలు వేస్తారు. సింపుల్‌గా చెప్పాలంటే 'చదువు' పేరుతో ఓ రకమైన 'మాఫియా' నడిపిస్తున్నారు. ఇక ఇలాంటి ఎడ్మిషన్స్ టైం అప్పుడయితే బస్తాలు బస్తాలతో డబ్బులు వెళ్తాయి. 'చెక్'లు వద్దంటారు. ఓన్లీ క్యాష్ పేమెంట్. ఏ కారణం వల్లనో ఇన్‌కమ్ ట్యాక్స్, ఏసీబీ వాళ్ళ దృష్టి ఈ స్కూళ్ళ మీద పడలేదు. పడివుంటే ఫీజు దగ్గర కాస్త తగ్గింపు ఉండేది. వీళ్ళు వచ్చింది వచ్చినంత పిండేస్తారు. జలగలకి జాలి ఉండదు. ఇక టీచర్లనయితే కట్టుబానిసల్లా నీచంగా చూస్తారు." అని ఇంకా ఏదో చెపుతుండగా ఓ ఇంటి దగ్గరకి ఇద్దరం చేరాం.

మా రాకలోని ఆంతర్యాన్ని తెలుసుకుని ఓ విచిత్రమైన నవ్వు నవ్వి –

"లంగాలు, లుంగీలు, చీపుళ్ళు, చింతపండు ఇలా అడ్డమైనవి ఇంటికే వొస్తున్నట్టు మీరూ రావడం బావుంది" అని మమ్మల్ని మాట్లాడనివ్వకుండా తనే మాట్లాడేసి –

"...ఏ మాత్రం కమిషన్ వొస్తోందేమిటి?" అని అడిగాడు ఆ ఇంటి యజమాని.

"అబ్బే అదేం రాదండి" పాణిగ్రాహి అన్నాడు.

"కమీషన్ లేకుండా బ్రోకర్లులా ఎందుకు పనిచేస్తారయ్యా!?" అని మొదలుపెట్టి, 'ఎడ్యుకేషన్ బ్రోకెర్లని' అభివర్ణించి నోటికి వచ్చినట్టు మాట్లాడాడు.

ఆ మాటల్ని భరించలేక వచ్చేస్తుంటే –

"మీ హరిగారి సెకండ్ సెటప్ ఒంగోలులో ఉంది. దాని తమ్ముడు నాకు తెలుసు. ఆడ్ని పట్టుకుని ఆవిడ చేత హరిని నొక్కిస్తే ఫీజు తగ్గుతుందిట. ఆ ప్రయత్నంలోనే ఉన్నా. సాయంత్రం త్వరగా ఇంటికి వచ్చినా మా పిల్లలు చదవరు. మీ స్కూలు టైమింగ్ బావుంది. లేచిన వెంటనే వెళ్ళడం, పడుక్కోవడానికి ఇంటికి రావడం" అనేశాడు. మా బడి గురించి, దాని నిర్వాహకుడికి ఉన్న 'సంబంధం' గురించి మాకన్నా బైటవాళ్ళకే ఎక్కువగా తెలుసన్న విషయం అర్థమయ్యింది.

మరొక ఇంటికి వెళ్ళాం –

అక్కడ అంతా ఆడపెత్తనమే.

మేం ఇంట్లోకి అడుగు పెట్టేసరికి మొగుడు వంట చేస్తుంటే, ఆవిడ సీరియల్ చూస్తోంది – సీరియల్ పూర్తయ్యాక –

"మా పిల్లలు శ్రీ లక్ష్మి టెక్నో స్కూల్లో ఉన్నారు. మీ హరి స్కూలుకి పోటీ ఇదేగా. మీ స్కూల్లో మొగటీచర్లు ఎక్కువగా ఉంటే, మా స్కూల్లో ఆడవాళ్ళు ఎక్కువ. పోయిన సంవత్సరం మా స్కూలుకే ఐ.ఐ.టీలో ఫస్ట్ ర్యాంక్ వచ్చింది" అని రెచ్చిపోయి, ఏ రకంగా చూసినా ఆడవాళ్ళ మేనేజ్ మెంట్ బావుంటుందని, చదువులో లింగ వివక్ష అంశం తీసుకు వచ్చింది. మమ్మల్ని కదలనివ్వకుండా ఉతికి పారేసింది.

ఆ తరువాత – ఎక్కేగుమ్మం దిగే గుమ్మం – ఈ పరంపరలో ఉపాధ్యాయ వృత్తికి ఎంత దారుణంగా 'విలువ' పడిపోయిందో తెలిసింది.

పరమ పవిత్రంగా గుర్తింపు పొందిన 'గురుస్థానం' నీచస్థితిలో ఉంది. పరిస్థితులు 'మారాయని' తెలుసు, కానీ ఇంత అధోగతా?

ఆ రోజంతా తిరిగాం. ఒకరో ఇద్దరో మా స్కూలుకి వస్తామన్నారు. సాయంత్రం మా 'ప్రోగ్రెస్' చెప్పడానికి పాఠశాలకి వెళ్ళాం. అప్పుడక్కడికి చదువుకి ఏ మాత్రం సంబంధంలేని ఓ వ్యక్తి వచ్చాడు. అతను ఆ ప్రాంతంలో 'వ్యాపారం' చూస్తాట్ట. అందరితోపాటు మేం తిరిగిన ఇళ్ళు, వస్తామని ఒప్పుకున్న వాళ్ళ ఫోన్ నెంబర్స్ మా ఇన్‌ఛార్జ్‌కి ఇచ్చాం –

"వెరీ బ్యాడ్ శ్రీ లక్ష్మీ టెక్నో, స్కూల్ వాళ్ళకి ఈ ఏడాది ఇప్పటికే చాలా ఎడ్మిషన్లు వచ్చాయి. మనకన్నా ర్యాంకులు తక్కువ... విద్యార్థులు ఎక్కువ."

"ఫీజులు మన దగ్గర బాగా ఎక్కువని" కొత్తగా చేరిన మరో మేష్టారు అంటుంటే –

"ఎక్కువే.. ఎందుకు? ఎడ్వరటైయిజ్ మెంట్ ఖరీదు పెరిగింది. స్కూలు బిల్డింగ్ అద్దె పెరిగింది. వేరే స్కూళ్ళలో బాగా చదివే పిల్లలకి, వేరే పోటీ పరీక్షల్లో ర్యాంకులు వస్తే, వాళ్ళకి డబ్బులు ఇచ్చి మన స్కూలులో జేర్చడానికి ఖర్చులు పెరిగాయి."

చదువుకి ఏ మాత్రం సంబంధంలేని ఖర్చుల లిస్టు ఏకరువు పెట్టాడు. ఆ తరువాత రాత్రి ఎనిమిది గంటలకి –

"చక్కటి సేల్స్‌మేన్ కావడం ఎలా?" అనే అంశం మీద ఆ వ్యాపారితో ఉపన్యాసం.

'చదువు' అనే వస్తువుని ఎన్ని రకాలుగా అమ్మొచ్చో, అన్ని భంగిమలు వేసి మరీ చెప్పాడు. అప్పటికి రాత్రి పదిదాటింది. బైటికి వస్తుంటే పాణిగ్రాహి అన్నాడు –

"ఈ స్కూల్లోకి ప్రొద్దునే అడుగుపెట్టడం వరకే మనకి అవకాశం ఉంది. అడుగు పెట్టాకా ఎప్పుడు బైటకి వెళ్తామో ఎవరికీ తెలీదు. అలాగని ఉదయం ఒక్క క్షణం లేటయినా జీతం కట్ అయిపోతుంది" అని.

చాలా ఆదర్శాలని ఊహించుకుని ఉపాధ్యాయ వృత్తిలో జేరాను.

వాటిలో ఏ ఒక్కటి సాధ్యం కాదని అర్థమయిపోయింది.

పాఠశాలలో తరగతులు మొదలయ్యేవరకు రిసెప్షనిస్టుగా, ఎకౌంటెంట్‌గా, కౌన్సిలర్‌గా రకరకాల అవతారాలు ఎత్తాను.

ఆత్మాభిమానం అనే మాటని గంగార్పణం చేశాను.

తరగతులు మొదలయ్యాయి.

ఆరు మార్కుల సంస్కృతానికి వారానికి ఓ క్లాసు ఉంటుంది. మిగిలిన సమయంలో ఆ పని ఈ పని అని కాకుండా చెప్పిన పని ఎదురు చెప్పకుండా చేసేవాడిని.

మొన్నామధ్య, పదోతరగతి చదువుతున్న ఓ అమ్మాయి, బైటకి వెళ్ళడానికి రిసెప్షన్‌లో కూచున్న నన్ను పర్మిషన్ అడిగింది.

ప్రిన్స్‌పాల్, వైస్ ప్రిన్స్‌పాల్‌లేరు. వాళ్ళకి చెప్పకుండా పర్మిషన్ ఇవ్వలేనని చెప్పాను.

పదిసార్లు అడిగింది. కుదరదు అనేశాను. కోపంతో మొటిమలు గిల్లుకుంది. క్షణంలో ఎవరూ ఊహించనట్టు పెద్దగా ఏడుస్తూ, మరో ఇద్దరు పిల్లల్ని తీసుకొచ్చింది.

విషయం నాకు అర్థమయ్యేసరికి మరో అరగంట పట్టింది. అప్పటికి ఎక్కడెక్కడో ఉన్న ప్రిన్స్‌పాల్, వైస్ ప్రిన్సిపాల్ జోనల్ ఇన్‌ఛార్జ్, అమ్మాయి తల్లిదండ్రులు పుట్టల్లోంచి బైటికి వచ్చిన పాముల్లా నా చుట్టూ చేరారు. విషం కక్కుతూ బుస కొట్టారు.

పర్మిషన్ కావాలంటే ఆ అమ్మాయి చేయిపట్టుకున్నానని యోగం. ఎవరూ నేను చెప్పింది వినలేదు.

అమ్మాయి తండ్రి ఎదురుగా దోషిలా నన్ను నిలబెట్టారు. అతనో కాంట్రాక్టర్. చేతికి ఉన్న ఆరో వేలితో సహా అన్నింటికి ఉంగరాలు ఉన్నాయి. బలిసిన జాతిగిత్తలా ఉన్నాడు. అమ్మాయి తల్లి అంటే, అంతెత్తు.. అంతలావు! వంటిమీద సరిగ్గా నిలబడని చీర. భుజాలు లేని జాకెట్. ఈ వివరాలు మరే ఉద్దేశ్యంతోనో రాస్తున్నవి కావు. వాళ్ళ నేపథ్యం నీకు అర్థం కావడానికి రాస్తున్నా!

ఆ కాంట్రాక్టర్ అరచేతి కన్నా పెద్దగా ఉన్న సెల్‌ఫోన్‌లలో మాట్లాడుతూ – మధ్య మధ్యలో –

"బేరమాడకుండా స్కూల్లో జేర్పిస్తే.. ఇదా మీరు చేసేపని..!?" అని రాయడానికి వీలులేని బూతుల్లో తిట్టాడు. తల్లి సరేసరి. నోరు విప్పడమే కంపుగా ఉంది. అరగంట వాళ్ళ నోటికి వచ్చినట్టు తిట్టాకా –

నా చేత ఆ అమ్మాయికి 'సారీ' చెప్పించారు. అప్పటికే పూర్తిగా చచ్చిపోయాను. వాళ్ళు వెళ్ళిపోతూ నాలాంటి దగూల్బాజీని ఎలా ఉద్యోగంలో ఉంచారో అర్థం కాలేదని మరో అనేసి వెళ్ళిపోయారు. వాళ్ళు బైటకి వెళ్ళిపోయాక – మా ప్రిన్సిపాల్ –

"వాళ్ళు చదువు కోసం రారు. ప్రెస్టేజ్ కోసం ఈ స్కూలుకి వస్తారు. ఇక పై ఇలాటి పొరబాట్లు జరగకుండా చూసుకోండి" అన్నాడు" నేను పెద్ద తప్పు చేసినట్టు – వేలమందిలో ఇలాటి స్కూలులో జేరినా కేవలం పదుల్లో ర్యాంకులు వస్తాయి. విద్యని మించిన వ్యాపారం కమ్మేసింది.

బైటకి నడిచాను. తలంతా భారంగా ఉంది. గేటు దగ్గరకి నడిచాను. వెకిలిగా నవ్వు వినిపించింది. ఆ అమ్మాయే. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతోంది –

"స్వీటీ డార్లీ.. మా డాడీ మమ్మీ వచ్చారు. ఆ సంస్కృత్‌గాడిని ఇరికించాను. ఇంక ఎప్పుడూ 'నో' అనడు. మా ప్రిన్సిపాల్ బ్లాంక్ పర్మిషన్ ఇచ్చారు. ఎప్పుడంటే అప్పుడు ఎక్కడి కంటే అక్కడికి ఇంగ్లీషు మూవీకా? స్క్రీన్ మీద చూసిందే చేస్తానంటావ్. వీకెండ్‌లో రిసార్ట్‌కి కావాలంటే నీ ఇష్టం...." ఇంకా ఏవో చెప్తూంది.

వినలేక అక్కడ్నించి కదిలాను.

సంస్కృతం నేర్పలేను,

సంస్కృతిని నేర్పించలేను!

సేల్స్‌మ్యాన్‌లా చలామణి కాలేను!

చూస్తూ చూస్తూ విచ్చల విడిగా వదలనేను.

సంస్కారమనే నిచ్చెన ఇవ్వలేని కార్పొరేట్ ప్రపంచంలో, అదీ చదువు పేరుతో ఎండు చేపల కన్నా భయంకరంగా కంపు కొడ్తున్న ఈ విద్యావ్యవస్థలో ఇమడలేకపోతున్నాను. 'నానాటి బ్రతుకు నాటకం'లా నటించలేక పోతున్నాను. అందుకే మా ఊరు వెళ్ళిపోతున్నాను. నన్ను క్షమించు.

**భవదీయుడు,**

*నానాటి బ్రతుకు – కథ వెనుక కథ*

*కొన్ని కథల దగ్గరకి రచయిత వెళ్తాడు.*

*మరికొన్ని కథలు రచయిత దగ్గరకి వొస్తాయి.*

*అలా వచ్చిన కథ – ఈ 'నానాటి బ్రతుకు'*

*రోళ్ళు పగిలిపోయే రోహిణీ కార్తెలో, ఓ మధ్యాహ్నం, ఓ బక్క పల్చటి నలభై ఏళ్ళ వ్యక్తి, కార్పోరేట్ స్కూళ్ళ వాళ్ళు చేస్తున్న విద్యావ్యాపారంలో భాగంగా సేల్స్ రిప్రజెంటేటివి అవతారం ఎత్తి తారసపడ్డాడు. ఆయన తెలుగు టీచర్. సంస్కృతం 'మమ' అనిపిస్తున్నాడు. ఉద్యోగం నిలబడాలంటే విద్యార్థులని తీసుకురావాలి. త్రిమూర్తుల స్వరూపంగా ఆరాధించే గురువు మరీ ఇంత 'లఘువుగా' మారడం బాధ కలిగించింది. ఆ బాధ మనసులో మెలిపెడ్తున్నప్పుడు కార్పోరేట్ స్కూళ్ళ 'కమర్షియల్' పంధా మరింతగా తెలిసింది. ఇమడలేకపోయినా మరో మార్గం కన్పించక చస్తూ బ్రతకడాన్ని మించిన విషాదం మరొకటి లేదు. ఆ విషాదానికి పరిష్కారం(?) వెదికే ప్రయత్నమే ఈ కథ!*

*మనసుకి తెలీని నాటకం మనిషి ఎంతకాలం ఆడగలడు ?*

*ఆకెళ్ళ శివప్రసాద్*

# ఆత్మావలోకనం

జొన్నలగడ్డ రామలక్ష్మి

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ

**భయం చిత్రమైనది.** అది తాచుపామునే కాదు, బొద్దింకను చూసినా రావచ్చు. తుపాకినే కాదు, గులాబిని చూసినా పుట్టొచ్చు. రాక్షసుణ్ణే కాదు, సాక్షాత్తూ కన్నతల్లిని చూసినా కలగొచ్చు.

నా భయం ఇప్పుడు అమ్మని చూసినందుకే....

అందులో ఆశ్చర్యమేం లేదు. నేను మా ఆవిడ మహాలక్ష్మితో గొడవపడితే చాలు– "ఐన వాళ్లందర్నీ వదులుకుని మనింటికొచ్చింది. ఇంటిపేరు మార్చుకుని మన మనిషైంది. దాన్ని నేను కన్న కూతురిలా, నువ్వు నీ చెల్లెలికంటే ఎక్కువగా చూసుకోవాలి. అది మంచితనం కాదు, మన బాధ్యత" అని మందలించేది అమ్మ.

ఆ రోజు నేను మహాలక్ష్మితో గొడవపడి రాత్రి విడిగా హాల్లో పడుకున్నా. ఒక రాత్రివేళ ఎవరో తట్టి లేపినట్లయింది. మహాలక్ష్మి అనుకుని విసుక్కుంటూ కళ్లు విప్పా. చూస్తే అమ్మ.

"అది అమాయకురాలురా. ఉత్తపుణ్యాన దాన్ని సాధించడం తప్పు. గదిలో నిద్ర పోకుండా ఒక్కత్తీ కూర్చుని ఏడుస్తోంది. వెళ్లి ఓదార్చు" అంది అమ్మ.

విని ఊరుకోవడమో, ఉక్రోషపడి వాదించడమో నాకు మామూలు. కానీ ఇప్పటి పరిస్థితి వేరు.

అమ్మపోయి ఆర్నెల్లయింది. నా ఎదుటనున్నది అమ్మ కాదు, అమ్మ ఆత్మ– అంటే దెయ్యం!

భయంతో గొంతు పెగల్లేదు. ఎలాగో శక్తినంతా కూడగట్టుకుని పడక గదికి పరుగెత్తా. లోపల మహాలక్ష్మి మంచంమీద కూర్చుని నిజంగానే ఏడుస్తోంది. నన్ను చూసిన ఆమె కళ్లలో ఆశ్చర్యానందాలు. అమ్మ చెప్పిందని కాక మళ్లీ అమ్మని చూడాల్సొస్తుందన్న భయం నన్ను తిరిగి హాల్లోకి వెళ్లనివ్వలేదు.

★★★★★

"నేను దెయ్యాన్ని చూసా" అన్నాను ఫోన్లో ఉమాశంకరంతో. నా గొంతులో మళ్లీ అప్పటి భయం.

ఉమాశంకరం నా బాల్యస్నేహితుడు. రెండేళ్లక్రితం ట్రాన్స్‌ఫర్‌మీద వైజాగ్ వెళ్లేదాకా వాడూ ఇక్కడే హైదరాబాదులోనే ఉండేవాడు. ఇద్దరం తరచుగా కలుసుకుని కబుర్లలో కష్టసుఖాలు పంచుకునేవాళ్లం. ఇప్పుడు ఫోన్లు చేసుకుంటున్నాం.

ఎప్పుడు, ఎక్కడ, ఎలా, ఎవర్ని అనడగలేదు ఉమాశంకరం, "నువ్వు చూసింది ఒక్క దెయ్యాన్ని. నేను రోజూ బోలెడు దెయ్యాల్ని చూస్తున్నా– తెలుసా?" అన్నాడు తాపీగా.

నేను నొచ్చుకోలేదు. ఇంటా బయటా మనుషులే దెయ్యాలై పీడిస్తున్న వాడి బాధ నాకు తెలుసు.

★★★★★

నేనెప్పుడు మహాలక్ష్మితో గొడవపడ్డా, "దాని తప్పేం లేదురా– నువ్వు దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడంలేదు" అని అమ్మ నన్ను తరచుగా మందలించేది. అప్పుడు నేను, "కన్న కొడుకుని– నన్నర్థం చేసుకోకుండా– కోడలికి వత్తాసు పలుకుతావా?" అని ఉక్రోషపడేవాణ్ణి.

"నేను నిన్నర్థం చేసుకున్నాను. నువ్వు దాన్నర్థం చేసుకోవాలని చెబుతున్నాను" అనేది అమ్మ.

ఇంట్లో నాకు తల్లి సపోర్టు కూడా లేదని– ఉమాశంకరానికి చెప్పుకునేవాణ్ణి. వాడు నా బాధ విని, "మగాడికి పెళ్లయ్యాక అసలు కష్టం ఏమిటో తెలుసా? అమ్మకీ, ఆలికీ పొసగకపోవడం. వాళ్లిద్దరూ ఒకటైతే జీవితం స్వర్గమే. అందుకు సంతోషించాలి" అన్నాడు.

వాడలా అనడంలో ఆశ్చర్యం లేదు.

వాడి అత్తారిది హైదరాబాదు. పెళ్లాం తలిదండ్రుల గారాల కూతురు. వంట రాదు, నేర్చుకోదు. అత్తగారు వంట చేస్తే వంకలెన్నుతుంది. ఇంటి పనులు చెయ్యదు, చెయ్యాలనుకోదు. ఇతరులు చేస్తే వంకలెన్నుతుంది. ఇంటికి భర్త తరఫు చుట్టాలొస్తే పుట్టింటి కెళ్లిపోతుంది. అది ఉమాశంకరం తల్లి వెర్షన్.

వాడి తల్లికి పెత్తనం కావాలి. మొగుడికిలాగే కొడుకునీ గుప్పెట్లో ఉంచుకోవాలనుకుంటుంది. కోడల్ని వంటింట్లోకి రానివ్వదు, ఇల్లు సర్దనివ్వదు. కోడలికి డ్రెస్సులిష్టమైనా చీరే కట్టాలంటుంది. నైటీతో పడకగది దాటి బయటికి రాకూడదంటుంది. ఇంటికొచ్చిన వాళ్లందరికీ కోడలిమీద పితూరీలు చెబుతుంది. వేడుకలకి పుట్టింటి పిలుపొస్తే పంపడానికి పెద్ద రభస చేస్తుంది. అది ఉమాశంకరం భార్య వెర్షన్.

వాడిమీద ఆధిపత్యంకోసమే రోజూ ఆ ఇద్దరికీ రామరావణ యుద్ధం. ఇద్దరికీ తనంటే ఇష్టమని తెలిసినా– ఉమాశంకరానికా ఇద్దరూ రావణులే అనిపిస్తుంది తప్ప ఏ ఒక్కరూ రాముడనిపించదు. చిత్రమేమిటంటే ఆ హోరాహోరీ పోరాటంలో– అత్తాకోడళ్లలో ఏ ఒక్కరికీ చిన్న గాయమైనా కాదు. ఆ యుద్ధంలో కనీసం ప్రేక్షక పాత్రని కూడా పోషించని ఉమాశంకరం, వాడి తండ్రి– తీవ్రంగా గాయపడతారు. అత్తాకోడళ్లా అసహాయులమీద జాలిపడరు సరికదా– తమకు సానుభూతి లభించడం లేదని– మొగసాలకెక్కడం మరో విచిత్రం.

వేరు కాపురమొక్కటే ఆ సమస్యకు పరిష్కారమని వాడికీ, తండ్రికీ తెలుసు. కానీ హైదరాబాదులో ఉండగా వేరు కాపురం మరిన్ని సమస్యలు తెచ్చిపెడుతుందని ఆ ఇద్దరికీ నమ్మకం అనతగ్గ అనుమానం.

ప్రయత్నించి ప్రయత్నించి రెండేళ్లక్రితం వైజాగ్‌కి ట్రాన్స్‌ఫర్ సాధించాడు ఉమాశంకరం. అప్పట్నించీ మా ఇద్దరి అనుబంధం ఫోన్ల ద్వారా కొనసాగుతోంది.

వైజాగ్ వెళ్లాక ఉమాశంకరానికి ఇంటిపోరు కొంత తప్పింది కానీ రచ్చ గెలవడం అసాధ్యంగా మారింది. ఆఫీసులో బాస్ శాడిస్టు. మగ కొలీగ్స్ అవకాశవాదులు. ఆడ కొలీగ్స్ దోపిడిదారులూ, బ్లాక్‌మెయిలర్సూ. బ్రతుకు హైదరాబాదులోనే నయమనిపిస్తోందని వాడి గోల.

"మరి మిగతావాళ్లెలా మనగలుగుతున్నారూ అక్కడ?" అడిగాను.

"నీకు తెలుసుగా– నేను మెతక మనిషిని. నేనూ మిగతావాళ్లలా మారితే– మనుగడకి ఏ ప్రోబ్లం ఉండదు. కానీ మారడం నా వల్లకాదు" అది ఉమాశంకరం అసహాయత.

వాడు అసహాయుడని తెలిసీ నేను నా సమస్యలు వాడికి చెప్పుకోవడం మానలేదు.

ఆర్నెల్ల క్రితం అమ్మ పోయినప్పుడు ఏడుస్తూ నా బాధని వాడితో పంచుకున్నా. వాడు మా అమ్మ గుణగణాల్ని మెచ్చుకుని- అలాంటి ఉత్తమురాలు మరణానంతరం స్వర్గసుఖాలు అనుభవిస్తుందని ఓదార్పు మాటలు చెప్పాడు. కానీ వాడి మాటలు నిజం కాలేదు. కోడలికి వత్తాసుగా ఉండాలని అమ్మ ఆత్మ మా ఇంట్లోనే తిరుగుతోంది. అనడానికి మనసొప్పదు కానీ అమ్మ దెయ్యమైంది.

★★★★★★

ఉమాశంకరానికి వివరంగా విషయం చెప్పి, "స్వర్గంలో ఉండాల్సిన అమ్మ దెయ్యమై మా ఇంట్లోనే తిరుగుతోందని బాధ. అమ్మే ఐనా- దెయ్యమంటే భయం కదా!" అంటూ నా గోడు వినిపించా.

"అంతా నీ భ్రమ. మీ ఆవిడ ఉత్తమ ఇల్లాలు. ఆవిణ్ణి వేధించినప్పుడల్లా అపరాధభావం కలిగి అమ్మ రూపంలో నిన్ను మందలిస్తోందని నా అనుమానం. నిజానికది అమ్మ ఆత్మ కాదు. నీ ఆత్మావలోకనం. ఐనా మనం భయపడాల్సింది మనిషి రూపంలో వేధించే దెయ్యాలకి. సాధారణంగా నిజం దెయ్యాలు హాని చెయ్యవు. పోనీ కొన్ని దెయ్యాలు చెడ్డవే అనుకుందామన్నా- నీక్కనిపిస్తున్నది అమ్మ- అమ్మ దెయ్యమైనా సరే- కొడుకునేం చెయ్యదు. నిశ్చింతగా ఉండు" అన్నాడు ఉమాశంకరం.

నాకు కొంత ఊరట కలిగింది, "అదిసరే- ఒకవేళ నాది భ్రమ కాదనుకో. అమ్మ నిజంగా దెయ్యమై తిరుగుతోందనుకో. అంటే- తనకేదో తీరని కోరిక ఉండిపోయిందనేగా- అదెలా తెలుసుకోవాలి?" అన్నా.

"అమ్మే కనుక దెయ్యమై ఉంటే- తన తీరని కోరిక చెప్పడానికే తాపత్రయపడుతోందేమో! ఈసారి కనిపించినప్పుడు భయపడి పారిపోక నేరుగా అమ్మనే అడిగి తెలుసుకో" అన్నాడు ఉమాశంకరం.

ఆ సలహా ఆచరణీయమనిపించింది.

★★★★★★

ఆరోజు కేవలం అమ్మకోసం మహాలక్ష్మితో గొడవపడి హాల్లో పడుకున్నా. ఒక రాత్రివేళ అమ్మ నన్ను లేపి ఎప్పటిలాగే హితవు చెప్పింది. మనసులో కాస్త భయం కలిగినా ఉమాశంకరం మాటలు గుర్తు తెచ్చుకుని కొంత ధైర్యం కూడగట్టుకుని, "అమ్మా! నువ్విలా కనిపించడం నాకెంతో సంతోషంగా ఉంది. కానీ ప్రాణం పోయాక కూడా ఈ ఇంటిని అంటిపెట్టుకుని ఉండడానికి కారణం తీరనికోరిక ఐతే- అది తీర్చడం నా విధి. నా వరకూ నీ కోడల్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటానని మాటిస్తున్నా. ఇంకా ఏమైనా కోరికలుంటే చెప్పు. తీర్చడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తా" అన్నా బింకంగా.

"వచ్చే సంక్రాంతికి కోడలికి అందె ఉంగరం చేయించి సర్ప్రయిజ్‌గా ఇవ్వాలని నేనూ, నాన్నా అనుకున్నాం. సంక్రాంతికిక రెండు నెల్లే ఉంది. నాన్నకి గుర్తు చెయ్యి" అంది అమ్మ.

నా భయం మరి కాస్త తగ్గింది, "మీ ఇద్దరికీ కోడలంటే ఎంత అభిమానమమ్మా! నాన్నకి తప్పకుండా ఈ విషయం గుర్తు చేస్తాలే. నువ్వింకా ఏమైనా చెప్పాలా?" అన్నా.

"వచ్చే మాఘమాసంలో మహాలక్ష్మికి ముప్పై నిండుతాయి. ఆ సందర్భంగా దానికిష్టమైన కథల పుస్తకం కొనివ్వాలని– శరత్, చంద్రికలకి చెప్పా. సరేనన్నారు కానీ కుఱ్రకుంకలు– మర్చిపోతారో ఏమో– నువ్వే గుర్తు చెయ్యాలి" అంది అమ్మ.

ఇవేమీ నాకు తెలియవు. "ఇంకా?" అన్నా కుతూహలంగా.

"మహాలక్ష్మికి నిద్రలేమి కూడదని డాక్టరు మరీమరీ చెప్పినా– క్రితం శివరాత్రికి మీరంతా చేస్తున్నారని తనూ జాగరణ చేసి– తర్వాత నాలుగు రోజులు మంచంమీదుంది. ఇకమీదట జాగరణ చెయ్యొద్దని నామీద ఒట్టేయించుకున్నా. నేను లేను కదా అని ఆ ఒట్టుని నిర్లక్ష్యం చెయ్యొద్దని చెప్పు" అంది అమ్మ.

"ఇవన్నీ నాకు చెప్పే బదులు వాళ్లకే చెప్పొచ్చుగా" అన్నా కాస్త విసుగ్గా.

"ప్రయత్నించా. కానీ వాళ్లెవరికీ నేను కనబడుతున్నట్లు లేదు. నువ్వొక్కడివే నన్ను చూసి నా మాటలకి బదులిచ్చావు" అంది అమ్మ నిట్టూర్చి.

నాకు కనిపించి మరెవ్వరికీ కనిపించకపోవడం– అదేమిటో మరి– అనుకుంటూ– "అంతా అయ్యారు– మరి నాకు చెప్పాల్సింది కూడా ఏమైనా ఉందా?" అన్నా.

"పాపం– బట్టలుతకడానికి మహా ఇబ్బంది పడుతోంది. కోడలికి వాషింగ్ మెషీన్ కొనిపెట్టరా" అంది అమ్మ వెంటనే.

తెల్లబోయాను. తనకేమీ కాని పరాయింటి పిల్ల, అందులోనూ కోడలంటే అమ్మకెంత కన్సర్న్!

అప్పటికి నాకు అమ్మ మనిషి కాదన్న భయం పూర్తిగా పోయింది, "అమ్మా! కోడల్ని కన్నబిడ్డలా భావించి దాని గురించి ఇన్ని చెప్పావ్. మరి కన్న కొడుకుని– నాకోసం ఏమీ చెప్పవా?" అన్నా నిష్ఠూరంగా.

అమ్మ నవ్వి, "నీకేంరా– మగ మహారాజువి. అనుకున్నవి అథార్టీ చేసి సాధించుకోగలవు. అడక్కుండా అన్నీ అమిర్చిపెట్టేందుకు– తల్లి, పెళ్లాం, పిల్లలు. రోజంతా గానుగెద్దులా తిరిగినా గుర్తింపు లేని– జీతం బత్తెం లేని నౌకరేకదా– పెళ్లామంటే! మీ నాన్నైతే అది గుర్తించి నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకున్నారు కానీ– మన సంప్రదాయంలో మగాళ్లకి– ఇంట్లో ఆడది బండచాకిరి చేస్తోందన్న స్పృహే ఉండదు. ఇలాగంటున్నానని మరోలా అనుకోకు– అలాంటి మగాళ్లకి నువ్వూ మినహాయింపు కాదు. లేకపోతే– కోడలికి వాషింగ్ మెషీన్ కొనాలని ఎప్పుడో తట్టేది నీకు" అంది అమ్మ నాకంటే ఎక్కువ నిష్ఠూరంగా.

నాకు నోటమాట రాలేదు. ఎందుకంటే అమ్మ మాటలు పూర్తిగా నిజం.........

అమ్మ, నాన్న నాతోనే ఉంటున్నా– నాన్న ఇంకా సర్వీసులో ఉన్నా– మా ఇల్లు నడిచేది ఇంచుమించు నా ఆదాయంతోటే. నాన్నకి అక్కలు, చెల్లెళ్లు, అన్నలు, తమ్ముళ్లు ఉన్నారు. అందరి బాధ్యతలూ తనవే అనుకుంటారాయన. అందుకు కొంత అమ్మ కూడా కారణం. నేను అందొచ్చాక– ఆయనకు నా బాధ్యత మాత్రమే తగ్గింది. మిగతా బాధ్యతలు వేణ్ణీళ్లైతే– ఆయన ఆదాయం చన్నీళ్లు.

నాకు బట్టల శుభ్రం ఎక్కువ. ఇంట్లోనే ఉన్నా కూడా రోజుకి రెండు జతలు మారుస్తా. మా ఆవిడా అలాగే మార్చుకోవాలంటా. మమ్మల్ని చూసి మా ఇద్దరు పిల్లలూ అంతే! ఆపైన అమ్మానాన్నల బట్టలు. అంటే మా ఇంట్లో బట్టలుతకడమే రోజూ ఓ పెద్దపని. బయట ఇద్దామంటే– హైదరాబాదులో ఉతికిన బట్టలు ఇస్త్రీ చేసేవాళ్లే కానీ– ఇంటికొచ్చి మాసిన బట్టలు తీసుకెళ్లి ఉతికి తెచ్చేవాళ్లు లేరు. డ్రై క్లీనింగుకిద్దామంటే– ఆ దుకాణాల ధరలు నా ఆదాయానికి చుక్కలు చూపెడతాయి. పనిమనిషి ఉతుకుతుంది కానీ– అందుకడిగే ఎక్స్‌ట్రాలు, అదుపు తప్పే వాషింగు పౌడర్ల వాడకం– బేరీజు వేస్తే డ్రై క్లీనింగే నయం. అందుకూ సిద్ధపడ్డా– ఇస్త్రీవాళ్లు పనిమనిషి ఉతికిన బట్టలు చూసి– "మాసిన బట్టలు ఇస్త్రీ చెయ్యం. ఉతికించివ్వండయ్యా" అంటారు.

అమ్మకి ఆరేళ్లుగా నీళ్ల ఎలర్జీ. గిన్నెలు తోమినా, బట్టలుతికినా– క్షణాలమీద చేతులు ఒరిసిపోతాయి. మా పిల్లలిద్దరికీ చదువు, హోంవర్కు, ఆటలు, టివి. మహాలక్ష్మికి ఏ పనిలోనూ సాయం చేసే అవకాశమే లేదంటారు. నాకు పేపరు, ఆఫీసు. నాన్నకీ అంతే! మనసుంటే మార్గముండకపోదు కానీ– ఇల్లాలిమీద ఉన్న మనసు– ఇంటి పనులమీద ఉండకపోవడం మన దేశంలో మగమహారాజులకి సహజమే కదా! అందుకని మా అందరి బట్టలూ ఉతికే పని మహాలక్ష్మికి తప్పనిసరైంది. ఆమెను ఉత్సాహపర్చడానికి– అందరం– తన సహనాన్నీ, త్యాగాన్నీ, శ్రమనీ అదేపనిగా పొగుడుతూ అడపాతడపా జాలి కూడా పడుతూంటాం. మన పౌరులు రాజకీయనాయకుల్ని భరిస్తున్నట్లే ఆమెకూడా మమ్మల్ని ఆప్యాయంగా, గౌరవంగా భరిస్తుంది. వాళ్లకిలాగే తనూ అసహాయంగా తిట్టుకుంటూనూ ఉండొచ్చుకానీ– రాజకీయ నాయకుల్లాగే మేమూ ఆ విషయం ఆలోచించం.

మహాలక్ష్మి బట్టలుతకడానికి వేణ్ణీళ్లు గీజర్నించి తీసుకుంటుంది. ఆ గీజరు స్విచ్చికి ఆ మధ్య లూజు కంటాక్ట్ ప్రోబ్లమొచ్చింది. ఆన్ ఐనట్లే అయి– వెంటవెంటనే ఆఫ్ అయిపోతోంది. మెకానిక్‌కి ఫోన్ చేస్తే– చెయ్యేస్తే నూటయాభై అన్నాడు. చాలామంది మగాళ్లకిలాగే నేను కూడా ఇంటి అవసరాల విషయంలో మహా పొదుపు. నూటయాభై వదులుకుందుకు మనసొప్పక కాలేజి ఫిజిక్స్ గుర్తు చేసుకుని– నేనే మెకానిక్కునై– స్విచ్చి సరిచేసా. అప్పట్నించీ గీజర్ పక్కాగా ఆన్ అయి– హీటెక్కుతోంది కానీ– ముట్టుకుంటే స్విచ్చి షాక్. స్విచ్చి ఆన్‌లో ఉన్నంతసేపూ బకెట్లో నీళ్లు షాక్. అందువల్ల స్విచ్చి మానేజ్ చేయడానికి చేతికి గ్లోవ్స్ వేసుకోవాలి. స్విచ్చి ఆఫ్‌లో ఉన్నప్పుడే బకెట్ ముట్టుకోవాలి.

మా ఇంట్లో నా సైజువి ఓ సెట్ గ్లోవ్స్ ఉన్నాయి. అవి పిల్లలకీ, మా ఆవిడకీ కూడా బాగా లూజు. కరెంటుతో వ్యవహారం– రిస్కు కూడదు కాబట్టి గీజరు పని నేనే తీసుకున్నా. ఐతే నాకు కాస్త పరధ్యానం. గ్లోవ్స్ లేకుండా స్విచ్ వేసీ, స్విచాఫ్ చెయ్యకుండా నీళ్ల బకెట్ ముట్టుకునీ అడపాతడపా షాకులు తినేవాణ్ణి. అలాంటప్పుడు మా ఆవిడ గావుకేకలు పెట్టి– కరెంటుకంటే పెద్ద షాకిచ్చేది. నేను గీజరేయడానికి వెడుతున్నానని పసికడితే చాలు– పెద్దగా అరిచి గ్లోవ్స్ గురించి గుర్తు చేసేది. ఆ అరుపుకి గ్లోవ్స్ ఉన్నా నాకు షాక్ కొట్టేది.

ఒకసారి నాకు స్విచ్చి షాకిచ్చినప్పుడు– "ఎందుకండీ ఈ డబ్బు కక్కుర్తి? మెకానిక్కుని పిలిచి గీజర్ని బాగు చేయించొచ్చుగా" అంది మహాలక్ష్మి.

నా గురించి ఆలోచించడంవల్ల ఆమె ఆ మాటనగలిగింది కానీ– నేనామె గురించి ఆలోచించని మగ మహారాజుని కావడంవల్లనేమో– వాషింగ్ మెషీన్ ఒక్కసారికూడా నా ఆలోచనల్లోకి రాలేదు.

భర్తగా నాకు స్ఫురించనిది– అత్తగా అమ్మకి తట్టింది. ఆమె దెయ్యం కాదు– దేవత!

అప్రయత్నంగా చేతులు జోడించాను.

"చేతులు పెట్టే దణ్ణాలొద్దు. నాకు నీ చేతలే దణ్ణాలు" అని మాయమైంది అమ్మ.

★★★★★

"నాన్న ఉంగరం, పిల్లల కథల పుస్తకం, మీ ఆవిడ జాగరణ– వగైరాల గురించి అమ్మ చెప్పేదాకా నీకు తెలియదు. వాళ్లనడిగి అవి నిజమేనని కూడా తెలుసుకున్నావు. అంటే నువ్వు చూసింది నిజంగా మీ అమ్మ ఆత్మనే– సందేహంలేదు. కానీ ఆత్మని దెయ్యమనకు. మంచి

మనుషులు చనిపోతే ఆత్మలౌతారు. మనుషుల్లో దెయ్యాలుంటారు. వాళ్లే చచ్చి దెయ్యాలౌతారు. అమ్మ మంచి మనిషని నాకూ తెలుసు, నీకూ తెలుసు'' అన్నాడు ఉమాశంకరం ఫోన్లో నేను చెప్పింది విన్నాక.

సందేహం నాకూ లేదు. కానీ కలిసి కాపురం చేసిన నాన్నకి కూడా కనబడని అమ్మ- కోడల్ని ప్రాణప్రదంగా ప్రేమించిన అమ్మ- వాళ్లకి కాకుండా నాకు కనబడ్డం ఆశ్చర్యంగా ఉంది.

''అందులో ఆశ్చర్యపడాల్సిందేం లేదు. ఆత్మలు కొందరికే కనబడతాయి'' అన్నాడు ఉమాశంకరం.

''మరి నేనిప్పుడేం చెయ్యాలి?'' అడిగాను.

''వెంటనే మీ ఆవిడకి వాష్ మెషీన్ కొను''

''అది కొనడం మాటలా? అంత డబ్బు నా దగ్గిర లేదిప్పుడు....''

''తల్లి పుట్టిల్లు మేనమామకి తెలియదా? ఐనా నన్ను మోసం చెయ్యడం కాదు- నిన్ను నువ్వు మోసగించుకోకు. అదీ అమ్మకి మాటిచ్చాక....'' అన్నాడు ఉమాశంకరం.

నా జీతం ఎక్కువని వాడికి తెలుసు. నా బాధ్యతలు కూడా తక్కువని వాడనుకుంటాడు. కానీ ఇంటి లోను, పిల్లల ఇంగ్లీషు మీడియం చదువులు, భవిష్యత్తుకోసం సేవింగ్సు- వగైరా వగైరాలతో- మధ్యతరగతి ఆశల చెట్టుకి ఎంత జీతమో అంత గాలి కదా!

అదే ఉమాశంకరానికి చెప్పా. వాడు నవ్వి, ''సంజాయిషీ నాక్కాదు. నీకు నువ్విచ్చుకో. తృప్తిగా ఉంటే వాష్ మెషీన్ సంగతి మర్చిపో'' అన్నాడు.

''అలా కాదురా- ఇప్పుడు కొనలేను కానీ- ఏదో ఒకరోజున వాష్‌మెషీన్ తప్పక కొంటా. ఈలోగా అటు అమ్మకీ, ఇటు మహాలక్ష్మికీ తృప్తి కలిగే ఉపాయం చెప్పు'' అన్నా.

''చాలా సింపుల్- ఇంతవరకూ మీ ఇంట్లో వాష్‌మెషీన్ ప్రసక్తే లేదు కదా! ఇప్పుడు కొంటానని ప్రామిస్ చెయ్యి'' అన్నాడు ఉమాశంకరం.

''ప్రామిస్‌తో ఆశ పెట్టేకంటే- ఎప్పుడో ఓ రోజున సర్ప్రయిజ్‌గా ఇస్తే అదో థ్రిల్ కదా!''

''ప్రామిస్‌కి ఆశ పుడుతుంది. ఆశలో ఎదురుచూపుంటుంది. ఎదురుచూపులో కలలుంటాయి. ఆ ఆనందం అనుభవిస్తేనే తెలుస్తుంది. మన రాజకీయనాయకులు ప్రామిస్‌లతోనేకదా- ప్రజలకి ఆరాధ్యులౌతున్నారు. ***ప్రపంచంలో మహదానందం కలిగేది ఎప్పుడో తెలుసా? నిజం కాదనుకున్న కల- నిజమైనప్పుడు....***''

అరటిపండొలిచినట్లు చెప్పాడు ఉమాశంకరం. నాకు కర్తవ్యం బోధపడింది.

★★★★★

కెవ్వుమని అరిచాను షాక్ కొట్టకపోయినా. మహాలక్ష్మి పరుగున వచ్చి, ''ఇక మీరు డబ్బుకి కక్కుర్తి పడితే నేనూరుకోను. వెంటనే మెకానిక్‌కి ఫోన్ చెయ్యండి'' అంది.

''నాకు డబ్బు కక్కుర్తా? నువ్వు గీజరు గురించి ఆలోచిస్తున్నావ్ కానీ- నేను నీకు వాష్ మెషీన్- అదీ ఫుల్లీ ఆటోమాటిక్‌ది కొందామనుకుంటున్నా తెలుసా?'' అంటూ బాంబు పేల్చా.

అప్పుడు మహాలక్ష్మికి షాక్కొట్టింది, ''నిజమా?'' అంది అప్రయత్నంగా. షాక్‌నుంచి తేరుకోగానే, ''ఐతే ఎప్పుడు కొంటున్నారు?'' అని కూడా అడిగింది.

ప్రస్తుతానికి గీజరు మరమ్మతు వాయిదా వెయ్యడంతోపాటు, మహాలక్ష్మిని కలల ప్రపంచానికి పంపెయ్యడం కూడా నా ఆశయం. కాబట్టి మహాలక్ష్మి వాష్‌మెషీన్ కొరివితో నా తల గోకే ప్రమాదముందని తెలిసి కూడా– "ఎప్పుడేమిటి– ఈ రోజు సాయంత్రమే బజారుకెళ్లి షాపులన్నీ తిరిగి మంచి మోడల్ చూద్దాం" అన్నా. అన్న ప్రకారం ఆ రోజు సాయంత్రం చాలా షాపులు తిరిగాం.

పాపం– మహాలక్ష్మి కష్టం సుఖం తెలిసిన ఇల్లాలు. దుబారా చెయ్యదు. అల్పసంతోషి. పదివేల లోపులో కొన్ని వాష్‌మెషీన్లు ఎన్నిక చేసింది. నాది కొనే బేరమైతే అప్పటికప్పుడే ఏదో ఒకటి కొనడం ఐపోయేది, కానీ "ఇవి జస్ట్ బట్టలుతుకుతాయంతే! వాష్‌మెషీన్ కొంటే మరి మనకి పిండడం, ఆరేయడం వగైరా పనులేం ఉండకూడదు. ఫుల్లీ ఆటోమాటిక్ కొందాం. సరేనా?" అంటూ ఆమె చెప్పినవన్నీ కొట్టిపారేసి– ఓ మంచి మోడల్ ఎన్నిక చేస్తే– దాని ఖరీదు ఇరవై వేలు.

ధర విని నేను మనసులో మురిసిపోయా కానీ పాపం మహాలక్ష్మి షాక్ తింది. ఎందుకంటే బాంకులో మా ఇద్దరిదీ కంబైండ్ అకౌంట్. మా జమాఖర్చుల గురించి ఆమెకు తెలియని రహస్యం లేదు. మా అకౌంట్లో డబ్బెప్పుడూ జీతం రోజున తప్ప ఐదంకెల్లోకి రాదు. నా జీతం తక్కువేంకాకపోయినా– చెప్పానుగా– మధ్యతరగతి అశల చెట్టుకి– ఎంత జీతమో అంత గాలి...

"ఇదైతే ఇప్పట్లో కొనుక్కోలేమండీ" అంది మహాలక్ష్మి. ఎప్పటికీ కొనలేమన్న నిరాశ కూడా ఉందా గొంతులో.

"నువ్వు నా సంపాదనని తక్కువ అంచనా వేస్తున్నావ్. ఆ మధ్య జీతాలు పెరిగాయిగా– ఆ అరియర్సింకా రావాలి. ఈ రోజునుంచీ మన అకౌంట్ ఫాలో ఔతూండు. ఎప్పుడైతే బాలన్స్ ముప్పై వేలు దాటిందో– నాతో కూడా చెప్పక్కర్లేదు. వెంటనే ఈ వాష్ మెషీన్ కొని ఇంటికి తెచ్చేసుకుని నన్ను సర్ప్రయిజ్ చెయ్యి" అన్నా.

అరియర్స్‌కి నా ప్లాన్స్ వేరే ఉన్నాయి కానీ అప్పటికది ప్రస్తుతం కాదు కదా! మధ్యతరగతి కుటుంబాల్లో ఇల్లాలు–భర్త ప్రతిరోజూ ఓటరు–నేత ఆట ఆడుకుంటారు. నేను మహాలక్ష్మికి చేసే వాగ్దానాలు మన నాయకులు పాతే పునాదిరాళ్లలా అక్కడితోనే సరి.

మహాలక్ష్మి ముఖంలో సంతోషం, ఉత్సాహం కనబడలేదు. మా అకౌంట్లో ముప్పైవేలు పట్టుమని నాలుగు రోజులుండే శుభదినం అంత తొందర్లో రాదన్న నమ్మకం, నిరుత్సాహం జోడుగా ఆమె ముఖంలో దర్శనమిచ్చాయి. నాకు మాత్రం అటు గీజర్ రిపైర్, ఇటు వాష్ మెషీన్ ప్రోమిస్‌తో– ఒకే దెబ్బకు రెండు పిట్టలు కొట్టిన సంతోషం కలిగింది.

★★★★

ఆఫీసులో నాకూ నాకొలీగ్‌కీ రెండు వారాల ఢిల్లీ టూర్ పడింది. సంతకాల పనులు కొలీగ్ చూస్తుంటే అడ్వాన్సు డ్రా చెయ్యడానికి నేను బాంకుకి బయల్దేరా. అప్పుడొచ్చాడు ఉమాశంకరం. వాడి భుజానికి వేలాడుతూ ఓ సంచీ. నా పరిస్థితి తెలుసుకుని, "టైముకే వచ్చా. పద, బాంకుకి వెడుతూ మాట్లాడుకుందాం" అని, "అన్నట్లు లాకర్ కీ దగ్గిరే ఉందిగా– లేకుంటే ఇంటికెళ్లాలి" అన్నాడు.

కీ నా దగ్గిరే ఉందని చెప్పా. ఇద్దరం స్కూటరు మీద బాంకుకి బయల్దేరాం. దారిలో వాడు, "అర్జంటు పనిమీద వెడుతూ ఇలా వచ్చా. నీకో సంచీ ఇస్తా. లాకర్లో పెట్టు. కొంత డబ్బిస్తా. నీ అకౌంట్లో వెయ్యి. మూడు వారాల తర్వాత వచ్చి డబ్బూ, సంచీ తీసుకుంటా. అప్పుడు నీకు అన్నీ చెబుతా. అమ్మమీద ఒట్టు. అంతవరకూ ఈ విషయం మీ ఆవిడక్కూడా చెప్పకు" అన్నాడు.

వాడి మాటలు చిత్రంగా అనిపించినా అంతగా పట్టించుకోలేదు. కానీ బాంకులో వాడు నా అకౌంట్లో వేసిన మొత్తం మూడు లక్షలు కావడంతో ఉలిక్కిపడి, "అంత డబ్బు నా అకౌంట్లో వెయ్యడమేంటిరా?" అన్నా.

"పరిస్థితి అలా వచ్చింది. ఏ పరిస్థితిలోనైనా నీకంటే నమ్మకస్థుడెవర్రా నాకు?" అన్నాడు వాడు.

తర్వాత వాడిచ్చిన సంచీ లాకర్లో పెట్టా. కాసేపుంటే వాడి పరిస్థితేమిటో వివరంగా మాట్లాడుకునేవాళ్లం. కానీ వాడికీ హడావుడి, నాకూ హడావుడి.

★★★★★

ఢిల్లీలో రెండు వారాలిట్టే గడిచిపోయాయి. బయల్దేరేముందు ఉమాశంకరంనుంచి ఫోనొచ్చింది. నేను టూర్నించి తిరిగొచ్చిన మర్నాడే వాడొచ్చి డబ్బు, సంచీ తీసుకుంటానన్నాడు. ఆ ఫోనొచ్చేదాకా నేనా విషయమే మర్చిపోయా. ఇప్పుడొక్కసారిగా వాడి వ్యవహారమేమిటోనని కుతూహలం రేగింది. దాంతో పెళ్లాంబిడ్డలకంటే ఎక్కువగా వాడి గురించే ఆలోచిస్తూ ఇల్లు చేరా. ఇంటికొచ్చేసరికి జరిగిపోయిందా ఘోరం.

ఒకటా రెండా ఇరవై వేలు పెట్టి ఆటోమాటిక్ వాష్‌మెషీన్ కొనేసింది మా ఆవిడ మహాలక్ష్మి.

''అంత ఖర్చుపెట్టేటప్పుడు ఒక్కసారి నాకు ఫోన్ చేసి అడగాలని తెలియదూ?'' అన్నాను కోపంగా.

నేను ఉగ్రనరసింహుణ్ణి కావడం మా ఇంట్లో మామూలే! అలాంటప్పుడు– తప్పు తనది కాదన్న నమ్మకంతో చెంచులక్ష్మి కావడం మహాలక్ష్మి అలవాటు, ''మిమ్మల్ని సర్ప్రయిజ్ చేద్దామని'' అంది శాంతంగా.

''ఇది నాకు సర్ప్రయిజ్ కాదు, షాక్'' అన్నాను ఇంకా మండిపడుతూనే.

''మీకు షాక్ కొట్టకూడదనేగా ఇది కొంట'' అంది మహాలక్ష్మి ఆప్యాయంగా.

మామూలుగా ఐతే తన సెన్సాఫ్ హ్యూమరుకి మెచ్చడమో, నవ్వడమో చేసేవాణ్ణి. అప్పుడు మాత్రం అతి కష్టంమీద కోపాన్నణచుకున్నా. కానీ ఇరవైవేలు రేపటికి సద్దడమెలా అన్న దిగులు, బెంగ ఆవహించడంతో అదోలాగైపోయా.

''మీ అకౌంట్లో ముప్పైవేలుంటే చాలు– నా ఇష్టమన్నారు. మూడు లక్షల పైన ఉంది. ఐనా నా ఇష్టమనుకుని స్వతంత్రించలేదు. మీరు చెప్పినట్లే మీరు సెలక్ట్ చేసిన మోడలే కొన్నా. మరి మీరెందుకు అదోలాగైపోతున్నారో అర్థం కావడం లేదు నాకు'' అంది మహాలక్ష్మి.

పుండుమీద కారం చల్లినట్లుంది కానీ మింగలేను, కక్కలేను. నన్ను నమ్మకస్థుడిగా భావించిన ఉమాశంకరానికి ఇరవైవేలు తగ్గాయని చెప్పేదెలా?

మనసు పాడై మహాలక్ష్మితో సరిగ్గా మాట్లాడలేదు. తను చేసిన పనికి నేను సంతోషించలేదని గ్రహించి మహాలక్ష్మి కూడా నొచ్చుకుంది. జరిగిందాంట్లో ఆమె తప్పేం లేదని తెలిసీ– అలక మానుకోలేదు నేను. ఆ రాత్రి ఒక్కణ్ణీ హాల్లో పడుకుంటే– ఒక రాత్రి వేళ అమ్మ నన్ను నిద్ర లేపింది.

''అనుకున్నకంటే చాలా ముందే కోడలికి వాషింగ్ మెషీన్ కొన్నావ్. నాకు చాలా తృప్తిగా, సంతోషంగా ఉంది. ఇక నే వెడుతున్నారా'' అంది అమ్మ.

అమ్మ మాటలు ఉక్రోషాన్ని తెప్పించాయి. ''నాదికానిది నా డబ్బనుకుని నీ కోడలు ఖర్చు పెట్టేసింది. రేపటికల్లా ఇరవైవేలూ సద్దకపోతే– తల దించుకోవాల్సిన పరిస్థితిప్పుడు నాది. నీకు తృప్తిగా ఉందా?'' అన్నా.

అమ్మ నవ్వి, ''అదే మగబుద్ధి. వాషింగ్ మెషీన్‌తో కోడలెంత సంతోషంగా ఉందో గమనించావా? ఆ సంతోషం కోసం నీ జీవితాన్నే పణంగా పెట్టొచ్చు. కానీ నువ్వు ఇరవైవేల గురించి ఆలోచిస్తున్నావ్. మరి పెళ్లికి వాళ్ల నాన్న దాని పేరున యాభై వేలకి ఫిక్సెడ్ డిపాజిడ్ వేసాడు. ఈ ఇల్లు కొన్నప్పుడు ఆ డబ్బూ, దానిమీదొచ్చిన వడ్డీ రొక్కంగా ఇస్తేనే కదా– నీకు లోనొచ్చింది. అదా డబ్బు గురించి

ఒక్కసారైనా నీదగ్గిర ప్రస్తావించిందా? ఆ డబ్బు వాడుకున్నందుకు ఒక్కసారైనా నువ్వు తల దించుకున్నావా? ఇరవైవేలకోసం అంత మథన పడుతున్నావ్‌కానీ– తల్చుకుంటే అదో సమస్యా నీకు? సమకూర్చడానికి ఎన్ని దారుల్లేవు?'' అంది.

అమ్మ చెప్పింది నిజమే! టిడిఆర్ మీదో, పీఎఫ్‌నుంచో లోన్ తీసుకోవచ్చు. నలుగుర్ని చేబదులడగొచ్చు. అసలు జరిగింది ఉమాశంకరానికే చెప్పొచ్చు. నే చేసిన వాగ్దానాన్ని, నా షరతులు పాటించి అమలు చేసిన నా భార్యని తప్పు పట్టాలని తప్ప మరో ఆలోచన రాకపోవడం– నిజంగా మగబుద్ధే ఏమో! మహాలక్ష్మి కొన్న వాష్ మెషీన్ మాత్రం తనకోసమా? ఆమె ఉతికే బట్టల్లో నావీ ఉన్నాయి. అది కొన్నందుకామె ముఖంలో సంతోషం చూసి తరించడానికి బదులు– నేను ఘొల్లుమని తనని ఘొల్లుమనిపించడమే మగతనమా?

''సారీ అమ్మా! నా కళ్లు తెరుచుకున్నాయి'' అన్నా.

''నాక్కాదు, సారీ కోడలికి చెప్పు'' అంది అమ్మ.

★★★★★

ఆఫీసులో ఉండగా వచ్చింది ఫోన్ ఉమాశంకరంనుంచి, ''సాయంత్రం 7కి మీ ఇంటికొస్తా. నా డబ్బు, సంచీ తీసుకునిరా. నీతో ఏకాంతంగా మాట్లాడాలి. ఏదో వంకన మీవాళ్లనందర్నీ బైటకి పంపించు'' అని.

బాంకుకి వెళ్లి టిడిఆర్‌నుంచి లోన్ తీసుకున్నా. అకౌంట్లోంచి డబ్బూ, లాకర్లోంచి సంచి తీసుకున్నా. ఇంటికి ఫోన్ చేసి, సాయంత్రం నా భార్యాబిడ్డల్ని సర్కసుకి తీసుకెళ్లమని నాన్నకి చెప్పా. ఆఫీసులో ఎలాగో కాలం గడిపి– సాయంత్రం ఆరున్నరకి ఇల్లు చేరా. ఉమాశంకరం కోసం ఇంటి తలుపులు తెరిచి హాల్లో కూర్చున్నా. అన్న ప్రకారం సరిగ్గా 7కి వచ్చాడు వాడు. వస్తూనే ఆప్యాయంగా నన్ను కౌగలించుకున్నాడు.

ఇద్దరం సోఫాల్లో ఎదురెదురుగా సెటిలయ్యాక వాడి డబ్బు, సంచి వాడికి అందించా.

ఉమాశంకరం వెంటనే డబ్బు నా చేతికిచ్చి, ''ఇది నీకే, ఉంచుకో'' అన్నాడు. నేను షాక్ తిన్నానని గ్రహించి, ''ఇది ఔదార్యమనుకోకు. నాకు చేయనున్న సాయానికి ప్రతిఫలం'' అన్నాడు.

''అంతా తికమకగా ఉంది. విషయమేమిటో సూటిగా చెప్పు'' అన్నా కుతూహలం పట్టలేక.

ఉమాశంకరం గొంతు సవరించుకున్నాడు, ''ఇంటాబయటా నా ఇబ్బందులకి మూలకారణం– నా మెతకతనం, నిజాయితీ. పొగరుగా ఉండాలని కొంత ప్రయత్నం చేసా కానీ– పోలార్ బేర్ ఆఫ్రికా ఎడారికొచ్చినట్లు ఫీలై మానేసా. డబ్బుంటే ఎన్ని వంకలైనా దిద్దుతుందని తెలుసు. కానీ వంకలు దిద్దేటంత డబ్బు సంపాదించడానికి నిజాయితీ వంకర్లు పోవాలి. అదీ నావల్ల కాలేదు. ఎవరేమన్నా నా మనసుకి నచ్చినట్లుండాలని గట్టిగా నిర్ణయించుకున్నా. కానీ మా ఆఫీసులో– నా బాస్, ఇద్దరు కొలీగ్సూ నా మెతకతనాన్ని అక్రమ సంపాదనకి ఉపయోగించాలనుకున్నారు. పార్టీలనుంచి తీసుకునే నల్ల ధనానికి నన్ను కస్టోడియన్ని చేసారు. నా దగ్గిరున్న డబ్బు– నేను వాళ్లకి బాకీ ఉన్నట్లు కాగితాలు రాయించుకున్నారు.  నా దగ్గిర లక్షలు లక్షలు మూలుగుతోంది. అది వాళ్లడిగినప్పుడు ఇస్తూండాలి. నేను వాడుకుందుకు లేదు. బాంకులో వెయ్యడానికి లేదు. పైసపైసా వాళ్లకి లెక్క చెప్పాలి. అలా అనుభవం వాళ్లది. రెయిడ్స్ జరిగితే ఫలితం నాది. అది నాకు పూర్తిగా అర్థమయ్యేసరికి పద్మవ్యూహంలో అభిమన్యుడిలా బయటపడలేని పరిస్థితి. విధం చెడ్డా ఫలితం దక్కలేదన్న బాధ క్రమంగా ఉక్రోషంగా మారింది. ఇకమీదట అవినీతికి సహకరించకూడదనీ, అప్పుడు నాదగ్గిరున్న డబ్బు నా వాళ్లకి చేర్చాలనీ అనుకున్నా. ఆ డబ్బుతో అజ్ఞాతంలోకి వెళ్లిపోవాలనుకున్నా. ముందుగా చెబితే నేనజ్ఞాతంలోకి వెళ్లడానికి నువ్వూ ఒప్పుకోవు, నావాళ్లూ ఒప్పుకోరు. మరి అజ్ఞాతంలోకి వెళ్లాక నా ఉద్దేశ్యం ఐనవాళ్లకి తెలియజేసేదెలా? సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో నీ ఫోన్ నాకు దారి చూపించింది. ప్రాణంపోయాక కూడా

కోడలి గురించి తాపత్రయపడే మీ అమ్మ– నా వాళ్లపట్ల నా బాధ్యతను హెచ్చరించినట్లనిపించింది. నా మనోబలాన్ని పెంచింది. అరవై లక్షల రొక్కంతో ఇల్లొదిలి నీ దగ్గిరకొచ్చా. మూడు లక్షలు నీ చేతికిచ్చి మిగతాది సంచిలో ఉంచా'' అని ఒక్క క్షణం ఆగాడు.

మంత్రముగ్ధుడిలా వింటున్నా. నేను లాకర్లో దాచిన సంచిలో మూడు తక్కువ అరవై లక్షలు. తల్చుకుంటే వళ్లు జలరించింది. ఈలోగా ఉమాశంకరం అందుకున్నాడు...

''నా బాసూ, కొలీగ్సూ ఒక మాదిరి అవినీతిపరులు. నా మెతకతనం వాళ్లకి ధైర్యాన్నిచ్చింది. ఆశని పెంచింది. నేనక్కడ కొనసాగడం అవినీతిని ప్రోత్సహించడం. అలాగని వాళ్లని కాదనీ, ఎదిరించీ బ్రతకలేను. అందుకే ఈ అజ్ఞాతం. ఇప్పుడు నువ్వు నాకు చెయ్యాల్సిన సాయమేమిటంటే–....'' ఆగాడు ఉమాశంకరం.

రెండేళ్ల క్రితం వాడు తల్లి పేరునా, భార్య పేరునా స్థలాలు కొన్నాడు. ఆర్నెల్లలో రెట్టింపౌతాయనుకుంటే– రెండేళ్లలో సగానికి పడిపోయాయి వాటి ధరలు, ''నువ్వు వాటికి ముప్పయ్యేసి లక్షల ధర కట్టి వాళ్ల దగ్గిర వాయిదాల పద్ధతిలో కొనుక్కో. సంచిలో డబ్బు క్రమంగా వాళ్లకి చేర్చు. ఆ స్థలాలు నీవి. కాస్త ఆగితే ఏదో రోజున వాటి ధర ఆకాశాన్నంటకపోదు. నీ సహాయానికి– నేనిస్తున్నది ఆ స్థలాలూ, ఈ మూడు లక్షలూనూ''

అప్పటికి నాకు వర్తమానంపట్ల పూర్తి స్పృహ కలిగి, ''ఒరేయ్– ఇంత డబ్బు దగ్గిరుంటే నాలో దుర్బుద్ధి పుట్టక మానదు. నీ అజ్ఞాతం గురించి నాకే కాకుండా మీ వాళ్లకి కూడా చెప్పడం మంచిది'' అన్నాను.

''అలాగే చెబుతా. ఏ క్షణంలోనైనా ఎవరైనా రావచ్చు. ముందీ డబ్బు జాగ్రత్త చేసిరా'' హెచ్చరించాడు ఉమాశంకరం. వెంటనే ఆ డబ్బు తీసుకుని లోపల బీరువాలో నా బట్టల అడుగున దాచి వచ్చి, ''ఇప్పుడే నా ఎదురుగా మీ వాళ్లకి ఫోన్ చేసి విషయం చెప్పు'' అన్నాను.

వాడు నిట్టూర్చి, ''లాభం లేదురా. అజ్ఞాతానికి ముందేమో చెప్పలేకపోయా. ఇప్పుడేమో అటు అమ్మావాళ్లూ, ఇటు మా ఆవిడా పిల్లలూ కూడా ఫోన్ చేస్తే పలకడం లేదు. ఎదుటపడి పలకరిస్తే కూడా చూడనట్లే మసలుతున్నారు. నువ్వొక్కడివే....'' ఆగాడు.

ఉలిక్కిపడి, ''ఏమన్నావ్?'' అన్నా. అంతలో గుమ్మంలో అడుగుల చప్పుడైంది. పక్కింటాయన కాబోలు వారపత్రిక తిరిగివ్వడానికి వచ్చాడు. నేను గుమ్మందాకా వెళ్లి పుస్తకం తీసుకుని ఆయనకి ఉమాశంకరాన్ని పరిచయం చెయ్యాలనుకున్నా. వాడక్కడ కనిపించలేదు. ఆయన్ను పంపేసి వెనక్కి వచ్చా. అప్పుడూ కనిపించలేదు.

''నీ ఫోన్ నాకు దారి చూపించింది'' అన్నాడు వాడు. ''నేను దెయ్యాన్ని చూసా'' అనికదా వాడికి ఫోన్ చేసాను. అది చూపించిన దారి ఏమిటి?... ''ఆత్మలు కొందరికే కనబడతాయి'' అన్నాడు వాడు. నాకు కనబడతాయన్న గ్రహింపే వాడి సందిగ్ధాన్ని తొలగించి అజ్ఞాతానికి తగిన మనోబలాన్నిచ్చిందా?

ఆ మెతకమనిషికి, నిజాయితీపరుడికి, ప్రేమమూర్తికి, స్నేహపాత్రుడికి– అజ్ఞాతమంటే ఆత్మగా మారడమేనని అప్పటిదాకా నాకు స్ఫురించలేదు.

ఆ తర్వాత నేను మళ్లీ ఆత్మల్ని చూస్తానో లేదో తెలియదు. కానీ దెయ్యాల్ని మాత్రం రోజూ చూస్తూనే ఉన్నాను. నేనే ఏమిటి– ఆత్మావలోకనం చేసుకుంటే మనలో ప్రతిఒక్కరూ.....

*సమాప్తం*

----0----

# కథ వెనుక కథ

ఆడది అణకువగా ఉంటే- మగాడు అథార్టీ చేస్తాడు. దానికి స్త్రీవాదులు బాకా పడతారు.
మగాడు మెత్తగా ఉంటే- ఆడది అథార్టీ చేస్తుంది. దానికి పురుషవాదులు బాకా పడతారు.
బాకాల్ని పక్కకి నెట్టి పరిసరాల్ని చూసే అలవాటున్న నాకు మన చుట్టూ- పీడితులు, రాక్షసులు స్త్రీపురుషులిద్దరిలోనూ కనిపించిన సందర్భాలు, ముఖ్యంగా మధ్యతరగతిలో, చాలా ఉన్నాయి. మనుషుల్ని స్త్రీపురుషులుగా విడదియ్యక- అందరూ మనుషవాదానికి మళ్లితే చాలా సమస్యలకు పరిష్కారం మననుంచే లభిస్తుందని నాకు అనిపించేది.
పిహెచ్‌డీలు చేసి ఉన్నత పదవుల్లో ఉన్న అత్తాకోడళ్ల కీచులాటలు, అంతంతమాత్రం చదువున్న అత్తాకోడళ్ల సామరస్యం- ఈ రెంటినీ చూస్తే సంస్కారానికి చదువొక్కటే సహకరించదనిపించేది.
ఈ విషయమై సాటి ఆడవాళ్లతో చాలాసార్లు చర్చించాను. ఒకసారి ఒకామె, 'మనుషవాదం, సంస్కారం నెలకొనాలంటే- మనకి ఆత్మావలోకనం ఉండాలి' అంది. ఆ వెంటనే మరొకామె, 'అమ్మో, నాకు ఆత్మలన్నా, దెయ్యాలన్నా భయం' అని చమత్కరించింది. అంతా నవ్వారు.
అంతే- నా మానసమందొక శీర్షిక తళుక్కుమన్నది. ఇది ఈ కథ స్ఫురణ వెనుక కథ.
కథారచనకి ప్రేరణ కావాలి. కౌముది-రచన ప్రకటించిన పోటీ ఆ ప్రేరణ ఇచ్చింది. అప్పుడు నాకు తెలిసిన అత్తాకోడళ్లూ, పురుషపుంగవులతో కథ మొదలెడితే- పేరు ఆత్మావలోకనం కదా- అవినీతీ, రాజకీయాలతో సహా- యావత్సమాజం కథలో దూరే ప్రయత్నం చేసింది. పేజీల విషయంలో కౌముది-రచన ఇచ్చిన స్వేచ్ఛ- ఆ ప్రయత్నాన్ని అర్థవంతంగా ఉపయోగించుకునేందుకు సహకరించింది. ఇదీ- ఈ కథ ఇలా రూపొందడం వెనుక ఉన్న కౌముది-రచన కథ.
పోటీలో ఈ కథకు బహుమతినిచ్చి ప్రోత్సహించిన కౌముది-రచనకు నా ధన్యవాదాలు.

జొన్నలగడ్డ రామలక్ష్మి
మే 7, 2013

# వైదేహీ మైథిలీయం — సాయి పద్మ

మొదటి ఉత్తరం :--

హలో ఏమండీ ..

ఇంతకన్నా ఎలా మొదలు పెట్టాలో తెలీదు. సారీ..

నేను, దిలీప్ ని తీసుకొని వెళ్ళిపోతున్నాను. మొదట మా అమ్మా వాళ్ళ ఇంటికి, తర్వాత, కొంచం రెస్ట్ తర్వాత, వేరే ఇంట్లోకి మారతాము. ఆ ఏర్పాట్లన్నీ అయిపోయాయి. నా సామాను ఇంక ఏమీ ఉండదు. ఒకసారి చెక్ చేసుకోండి. నా నెంబర్ మారలేదు. మీరెప్పుడైనా ఫోన్ చేయొచ్చు దిలీప్ తో మాట్లాడాలంటే, లీగల్ విషయాలన్నీ నా ఫ్రెండ్ లాయర్ సరళ కి అప్పచెప్పాను.. అన్నీ తనతోనే మాట్లాడగలరు.

మామూలుగా అయితే , ఇలాంటి ఉత్తరం మీకు షాక్ కలిగిస్తుందేమో , కలిగించకపోనూ వచ్చు. మనిషి ప్రవర్తన ఊహించగల చనువు మనమధ్య ఉందొ లేదో నాకు తెలీదు పదేళ్ళ కాపురం తర్వాత కూడా. ..! కానీ మీకు ఇలాంటి నిర్ణయం సడన్‌గా తీసుకున్నట్టు అనిపిస్తుందేమో అన్న ఆలోచనతో, విషయాలన్నీ నాకు నేను కూడా చెప్పుకున్నట్టు చెప్పుకుంటున్నాను. అలా అన్నా కొంచం తేలిక పడచ్చు కదా అన్న ఆశతో రాస్తున్న ఉత్తరం ఇది.

ఒకేసారి మన పెళ్లితో మొదలెడదామా... సారీ ... అక్కడి నుంచేగా మన కథ మొదలు !

తలంబ్రాలు పోసేటపుడే , నా ఫ్రెండ్ అంది 'మీ వారు ఏంటో అంత కలుపుగోలుగా లేడు'.. అని .. అదేంటి అలా ఎలా తెలుస్తుంది? అని సరిచెప్పుకున్నా! అది మొదలు మీతో, స్నేహం కుదురుతుందో లేదో అన్న విషయంలో , చిన్న భయం. అమ్మ చెప్పింది, 'భర్త పూర్తిగా స్నేహితుడు అవలేడమ్మా , జాగ్రత్తగా ఆచి తూచి వ్యవహరించాలి' అని. కొంచం భయపడ్డా కానీ, మీ రూపం, పెళ్లి హడావిడి, ఒకేసారి దొరికిన అపురూప క్షణాల మైమరపు నన్ను మాట్లాడనీయలేదు. ఆరోజు నుంచీ నన్ను మీకిష్టమైనట్టుగా మలచుకోవటం లో చాలా బిజీ అయిపోయాను. నిలువు బొట్టు నుండి గుండ్రని బొట్టు దాకా, నల్ల చీరలు మానేయటం దగ్గరనుండీ , పడకలో మీకు కావలసినట్టుగా మారటంలో రెండేళ్ళు ఎలా గడచిపోయాయో తెలీలేదు. అమ్మా వాళ్ళ దగ్గరకెళ్ళే తీరికే లేదు .

మొదట్లో ముభావి అనుకున్నా, తర్వాత ఫ్రెండ్స్ తక్కువ అనుకున్నాను, తర్వాత్తర్వాత మీలో చికాకు స్వభావం అర్థం అయింది. మూడేళ్లకి , దిలీప్ కడుపులో ఉన్నప్పుడు అనుకుంటా .. మీ ఫ్రెండ్స్ కలిసినప్పుడు , ఉత్సాహమైన ఆ సాయంత్రం, నేను చేసిపెట్టిన వంటలన్నీ లొట్టలేసుకొని తింటూ .. మీ ఫ్రెండ్ ఆదిత్య అనుకుంటా అడిగాడు కదా .." అదేంట్రా.. ప్రేమించి పెళ్లి చేసుకుంటానన్నావు.. ఆమె లేకపోతే నీ బ్రతుకు లేదని మమ్మల్ని గంటలు గంటలు బుర్ర తిన్నావు , ఇప్పుడు ఇలా .. వదినని ...??" అప్పటిదాకా , మీకో గతం ఉంది, అది మీరు నాతో పంచుకోలేదని దుఖపడాలో, లేదా మీ ధోరణికి కారణం నేను కాదు , నా స్థానంలో ఏ అమ్మాయి ఉన్నా ఇదే ముభావాన్ని మీరు కానుకగా ఇస్తారు, అందువల్ల నా తప్పేం లేదని సంతోష పడాలో తెలీలేదు నాకు. అలాగే చాలా కాలం దిలీప్ పుట్టేదాకా గడిచింది.

వాడికి ఒక సంవత్సరం అనుకుంటా కదండీ .. మీకు ఆ అమ్మాయి మైథిలి పరిచయం అయింది? మీ ధోరణిలో ఉత్సాహంలో చాలా మార్పు వచ్చింది. ఆ ఉత్సాహం నా మీద కూడా అప్పుడప్పుడూ జల్లులా నా మీద కూడా చిలకరించేరు. మళ్ళీ నేను కన్సీవ్ అయ్యాను. మొదటిసారి ఇంకోరి ప్రేమని మోస్తున్నట్టుగా అనిపించి, అబార్షన్ చేయించుకున్నాను. వరుసగా కేంపులు ఎక్కువయ్యి ప్రాజెక్ట్ మీద తిరుగుతున్న మీకు, ఆ విషయం నేను చెప్పలేదు, మీరు అడగలేదు . కనీసం గుర్తించి ఉండరు కూడా ! మీకు ఆ అమ్మాయితో ఘర్షణ వచ్చినపుడల్లా , నా శరీరం యుద్ధరంగమయ్యేది. కానీ తట్టుకున్నాను, ఒకటి దిలీప్ కోసం , రెండోది ఒక డైవోర్సీ గా సమాజంలో మిగిలే బదులు, ఇలా నా ఇంటి జైలుకి నేనే వార్డెన్ ని కదా అన్న ఒక ధీమాతో.

అప్పటికీ ఒకసారి విమెన్ ప్రొటెక్షన్ సెల్ నడుపుతున్న వాళ్ళ దగ్గరకు వెళ్లాను. వాళ్లేసిన ప్రశ్నల పరంపర నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది,

"అతను మిమ్మల్ని కొడతారా ? " నా మనసు జవాబు– కొట్టడు కానీ అలా చూస్తాడు.

"తాగుడు, జూదం లాటివి ఉన్నాయా" – నా మనసు జవాబు : లేవు , నిర్లిప్తత, నేనంటే చులకన ఉన్నాయి.

"వేరే అమ్మాయిలతో పరిచయాలున్నాయా" – నా మనసు కొంచం సంతోషంతో –" ఉన్నాయి, కానీ ఎవరో ఏమిటో, ఎక్కడో ఏమీ తెలీదు. "

నా నిశ్శబ్దం వాళ్లకి అర్థం కాలేదు. వచ్చేస్తుంటే ఒకమ్మాయి అంది అక్కడ– ఇలా కూడా ఉంటారా ఆడవాళ్ళు ఈ రోజుల్లో , చూస్తే చదువుకున్న ఆవిడలా ఉంది?' – నా యూనివర్సిటీ జీవితం కళ్ళముందు కదిలి నట్టయింది. ఎమ్మెస్సీ బోటనీ గోల్డ్ మెడలిస్ట్, విత్ స్పెషలైజేషన్

ఇన్ మెడిసినల్ ప్లాంట్స్. ఔషధ మొక్కలు. నువ్వు రీసెర్చ్ తప్పకుండా చేయాలమ్మా అనే మా మేడం గుర్తొచ్చింది. దిలీప్ కడుపులో పడగానే , లాంగ్ లీవ్ పెట్టిన ఉద్యోగం గుర్తొచ్చింది. నామీద నాకే కోపం వచ్చింది.

నేను చాలా రహస్యంగా దాస్తున్నాను అనుకున్న మీ ఇంకో జీవితం, నేను కూడా చాలా తెలివిగా దాచేస్తున్నాను అనుకున్నాను. కానీ, దాని పరిణామాలు మన దిలీప్ ద్వారా పరిచయం అయ్యాయి. నాన్న మనతో ఎక్కువ ఎందుకు ఉండరు? అనే ప్రశ్నతో మొదలైన వాడి ప్రస్థానం .. తనలో తనే జావాబులు వెతుక్కొని, మొదట నన్ను అర్థం చేసుకున్నా అనుకోని, తర్వాత నా మీద చాలా జాలి పడ్డాడు. వాడి ఫ్రెండ్ తో " మా మమ్మీకి అన్నీ నేనే " అని చెప్పినప్పుడు వాడు పెద్దవాడై పోతున్నాడు అని గర్వపడ్డాను. కానీ, వాడి లేత మనసులో ఎంత బాధ ఉందొ అర్థం కాలేదు. ఇప్పుడు ..మొన్న ..ఒక మాటన్నాడు .. " నాన్న మగాడు కాబట్టి తప్పు లేదు .. అంట కదా .. నానమ్మ , అమ్మమ్మ కూడా చెప్పేరు ..!" – కొరడా కాదు, చెర్నాకోల కాదు .. ఊహించలేనివన్నీ పెట్టి కొట్టి నట్టయింది నాకు. నేనేం చేస్తున్నానో, ఏం కోల్పోతున్నానో కన్నా .. !!

మరో మగాణ్ణి తయారు చేస్తున్నాననే భావం .. నన్ను కుదిపేసింది. మళ్ళీ అదే నిర్లక్ష్యం, దాన్ని దాచే భయం. దాన్నుంచి అభద్రత .. హింస .. ఇవన్నీ ..నా నిర్లిప్త ధోరణి లోంచి కూడా పుట్టి ఉంటాయి అని నాకప్పుడే అర్థం అయింది.

లాంగ్ లీవ్ కేన్సిల్ చేసాను. వేరేచోట పోస్టింగ్ తీసుకున్నాను. దిలీప్ ని తీసుకొని వెళ్ళిపోతున్నాను. మరో మనిషిని తయారు చేసే ప్రయత్నం చేయటానికి. జీవితానికో లక్ష్యం దొరికింది.

సంతోషంగా ఉంది ..

ఇట్లు

మీ మాజీ భార్య

వైదేహి

***రెండో ఉత్తరం :***

హాయ్ రాం ..

ఎలా ఉన్నావు? ఈ ఈమెయిల్ కాలంలో నా ఉత్తరం ఏంటి అని ఆశ్చర్యపోతున్నావా? దానికి కారణం ఉందోయ్ , లెటర్ మొత్తం చదివితే తెలుస్తుంది నీకు. గత వారంగా మనం కలవటం లేదు కదూ .. చాలా జరిగేయి. అన్నీ కాకపోయినా, నీ వరకూ అవసరమైన వన్నీ చెప్తాను. నేను రాయనివి నువ్వు అర్థం చేసుకోగలవు అనుకుంటున్నాను. వెల్... అలా కాకపోతే , నువ్వంటూ ఉంటావు చూడు , అది నీ ఖర్మ!

మన పరిచయం వయసు ఏడేళ్ళు. ఏడు అడుగులంటూ నవ్వుతావు కదా.. అలా నవ్వినప్పుడల్లా ముద్దిపెంగా అనిపిస్తుంది. నాతో పరిచయమైన ప్రతీ సంవత్సం నువ్వు సప్తపదిలా గుర్తుపెట్టుకొంటావు కదా అని. మళ్ళీ నాకే నవ్వొస్తుంది, వివాహం, ఆ సాంప్రదాయం, దానిలో ఉండే సఫకేషన్ కదూ.. మనిద్దరినీ కలిపింది. మన కొలీగ్స్ తో ఏడేళ్ళ క్రితం పార్టీలో , పెళ్లి గురించి నా అభిప్రాయాలు .. మన ఆఫీసులో ఈ నాటికీ సంచలనమే. ఏమన్నాను నేను? పెళ్లి ఐచ్చిక ఖైదు అని కదూ.. ఆదిమ మానవులకి ఇలాంటి సంబంధాలు, ఆ పేరుతో మనిషి స్వేచ్ఛ ని కట్టిపడేయటాలూ లేవు , అందుకే వాళ్ళు విడాకులు కనిపెట్టలేదని చెప్పాను. ఎంత మెచ్చుకున్నారు అందరూ.. ముఖ్యంగా నీ కళ్ళల్లో ఆ ఆరాధన, ఒక లాలన, కాంక్ష నన్ను నాకు తెలీకుండానే నీకు కట్టి పడేశాయి.

ఎలాంటి సమయం అది.. చలాన్నీ, ఓషో నీ .. ఒకళ్ళ కళ్ళల్లోంచి ఒకరం తాగే సమయం. దోమ్ మొరేస్ నీ మిలన్ కుందేరా నీ .. ఎన్ని రాత్రుళ్ళు చర్చించామో కదా..!

అది..బీథోవెన్ నీ, ఇళయరాజా నీ . .సంగమాల సాక్షులుగా చేసే సమయం. ఎలాంటి దాహం అది .. పగటినీ, రాత్రినీ ..మన కాపలాకి నిలబెట్టి, ప్రేమించుకొనే సమయం అది. ఈనాటికీ నేను మర్చిపోలేని సమయం అంటూ ఏదన్నా ఉంటె , అవి ఆ క్షణాలే!

రెండేళ్ళ కాలం .. రెండుక్షణాలు.. మన రెండు గుండెల చప్పుడిలా ..ఎలా కరిగిపోయిందో తెలీదు.

ఎంత రాత్రికైనా పగలు తప్పదు... ఎలాంటి నిషాకైనా దిగక తప్పదు అనేది మా స్నేహితురాలు ఒకామె. అప్పుడు నమ్మలేదు. ఇప్పుడు నమ్మక తప్పటం లేదు. ఒకటీ,ఒకటీ ..అక్షరాలు పేర్చుకొనే కవితలా .. ఆత్మ లేని బంధంలా!

నా స్నేహితులని నీకు పరిచయం చేసేటప్పుడు మారే నీ మొహం రంగులు, అన్నీ బావున్నాయంటూనే నువ్వు పెట్టె వంకలు, ఈ ఫ్రెండ్ తో పరిచయం మానుకో, ఆ మనిషికీ నీకు ఏంటి సంబంధం .. అనే శషభిషలూ ..మొదలయ్యాయి . నీకు గుర్తుందా అవేమన్నా?

మొదట్లో నేనంటే ఇంత ఇష్టమా ..నా కెరీర్ గురించి జాగ్రత్తా అనిపించేది. కానీ నీతో సమానంగా ఉద్యోగం చేస్తున్నా కదా నేను, అలాంటి నన్ను " నువ్వు అమాయకురాలివి , నీకేమీ తెలీదు, అందరూ నిన్ను మోసం చేస్తారు" అంటే చిరాకేసింది. జీవితాన్ని రేషన్ card అనుకోలేదు కాబట్టే కదా, పెళ్లి లాంటి లీగల్ సంబంధం లేకుండా నీ జీవితంలో భాగమైంది.

ఫోన్ కాల్స్ తగ్గించమన్నావు, అవి మన సమయం తగ్గించేస్తున్నాయి అన్నావు. నిజమే అనిపించి, తగ్గించాను. facebook మనలాంటి వాళ్ళ క్వాలిటీనీ , క్రియేటివిటీనీ తగ్గించేస్తుంది అన్నావు. మానేసాను. మనిద్దరి జీవితాల పాస్ వర్డ్ ఒకటే అన్నావు, మరింక వేరే వేరే పాస్ వర్డ్ ఎందుకు, నా బేంక్ నుంచీ మొదలెట్టి నా జీవితపు తాళం అన్నట్లు ఇచ్చేశాను. నీ తాళం చెవి నువ్వు జాగ్రత్తగా నీ దగ్గరే ఉంచుకున్నావని మర్చిపోయాను సుమా..!

నా స్నేహితులకి అందుబాటులో ఉండటం మానేసాను. వాళ్ళు కూడా వాళ్ళ కష్టంలో నన్ను లెక్కలోకి తీసుకోవటం అంత సహజంగానూ మానేశారు. మొన్న ఒక గ్రూప్ లో , ఒకమ్మాయి చెప్పింది.. నువ్వు సహజీవనం లో ఉన్నావు కదా మైథిలీ .. అది పెళ్లి కన్నా స్ట్రైస్ .. నిన్ను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక పిలవటం లేదు ..అని !

నా పేరు కదూ రాం నీకు నచ్చింది!? మైథిలి అంటే సీత కన్నా ..నా మైదానం నువ్వు .. చలం రాజేశ్వరి గుర్తొస్తుంది .. 'మైదూ మైదూ.. మన జీవితపు ప్రేమానుభవ మైథునం, మన ప్రయోగాల మైదానం నువ్వేనోయ్' అంటే గర్వం వేసేది.

ఇంటికన్నా మైదానంలో ప్రమాదం, స్వేచ్ఛ లేనితనం ఎక్కువ అనే విషయం రాజేశ్వరి గమనించేసరికి ఆలస్యం అయి ఉండచ్చు గానీ.. నా ఓవర్ కాన్ఫిడెన్స్ పిట్ట బుర్రకి అర్థమయ్యే సంఘటన త్వరలోనే జరిగింది.

నీ చాదస్తానికీ నాకూ ఎప్పుడూ చుక్కెదురే అది నీకు తెలుసు. ఎక్కడి కక్కడ ఎదుర్కొంటూనే ఉన్నాను. కానీ నువ్వు తీసే ఆరాలు, నీ చాదస్తానికి గుర్తు అనుకున్నా గానీ నా మీద అనుమానం అని తోచలేదు. అభిరుచులు కలవటం చాలు సహజీవనానికి అనుకున్నాను. కానీ ఇంటలెక్చువల్గా కన్నా ఎవరైనా మనిషిగా , మానవత్వంతో ఉండటం ముఖ్యం అని తెలిసింది. అనుమానాలు పెళ్ళిళ్ళలోనే అనుకున్నా , ఇలా live in రిలేషన్స్ లో కూడా ఉంటాయంటే మొదట నవ్వొచ్చింది, తర్వాత నీ చేతికి నా స్వేచ్ఛ అనే రిమోట్ కంట్రోల్ నేనే ఇచ్చానా అని ఆలోచనకి ఒళ్ళు జలదరించింది. ఏమైందీ సడన్ గా అనుకుంటున్నావా?

రెండు వారాల క్రితం, కొరియర్ వాడు ముందు గదిలోకి వచ్చి , లెటర్ ఇచ్చేసి మంచినీళ్ళు అడిగాడు. కిచెన్ లోకి వెళ్ళి తేచ్చేలోగా నా వైపు చాలా కొత్తగా, భయంగా చూస్తుంటే అడిగాను. "అదేంటయ్యా నావైపు ఎందుకలా చూస్తున్నావు? " – వాడి సమాధానం నా అస్తిత్వాన్ని, స్వేచ్ఛనీ నడివీధిలో నిలబెట్టిన ఆ సమాధానం ... వారేవా .. రాం .. నువ్వేం చేసావో తెలుసా ?

కొరియర్ వాడేం చెప్పాడో ముందు విను– " మంచిదేనమ్మా.. ఈ రోజుల్లో ఎవరినీ నమ్మకూడదు, హాల్లో సీసీ కెమెరాలు పెట్టారు కదా సారు.. కానీ బయట పెట్టి ఉండాల్సింది అమ్మా అని ..!"

ఎన్నేళ్ళుగా సీసీ కెమెరాలు ఉన్నాయో తెలీదు.. ఎన్ని నాళ్ళుగా నా ప్రతీ కదలికా, గమనిస్తున్నావో తెలీదు. వెతికాను , మొదటిసారి మొత్తం ఇల్లు వెతికాను. మన రూమ్ లో, నేను తిరిగే ప్రతీ ప్లేస్ లో, కెమెరాలు!! అగ్నిలో దూకిన మైధిలి కి వొళ్ళు ఎలా కాలిందో నాకు తెలీదు గానీ, నాకు భగభగా మండింది.

ఇనుప కచ్చడాల గురించి చదివి నేను అసహ్య పడటం గుర్తుంది కదూ నీకు .. ఇది అంతకన్నా అసహ్యం ..ఈ టెక్నాలజీ కచ్చడాలు .. వేదనగా అనిపించింది. ఎప్పుడూ నీ భార్య అంటే గౌరవమే నాకు, ఇప్పుడు నిన్ను భరించినందుకు, గుడి కట్టి పూజించాలనిపించింది.

వెళ్ళిపోతున్నాను రాం .. నీ జీవితంలోంచి.. నీ కచ్చడాల అసహ్యంలోంచి .. నీ నుంచి నాకేం సంజాయిషీ అక్కర్లేదు. నీలాంటి జబ్బు ఉన్న వాళ్ళు మనుషులుగా కూడా అనిపించరు నాకు. శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను. నిజమైన మైదానంలోకి . ఒక పాఠం నేర్చుకున్నా , అభిరుచులు ఇష్టాలూ కలవటం మంచిదే, కానీ మనసు అనేది కలవటం ఇంకా ముఖ్యం. మానవత ఇంకా ఇంకా ముఖ్యం.

నేను అనే మనిషి నాకు ముఖ్యం రాం.. నా స్వేచ్ఛ ముఖ్యం. మానసికంగా నా చోటు నాకు ముఖ్యం . ఇవి లేకుండా నన్ను కంట్రోల్ చేద్దామన్న నిన్ను చూస్తే అసహ్యం వేస్తోంది. నా ప్రేమని చూసావు, నా అసహ్యాన్ని భరిస్తావు ఇక జీవితాంతం. సీసీ కెమరాలు పెట్టటం నాకు కూడా తెలుసు. ఇంకా ఏ విధంగా నన్నా నన్ను కాంటాక్ట్ చేద్దామని ప్రయత్నిస్తే, నాలో కాళికావతారం కూడా చూస్తావు. నిన్ను ఇబ్బందిలో ఇరికించటానికి నువ్వు పెట్టిన కెమరా క్లిప్పింగ్స్ కూడా చాలు. ఇంకా చాలా మాటలు నిన్ను అనేందుకు నా సంస్కారం, తిట్టడానికి డిక్షనరీ కూడా సిగ్గుపడుతున్నాయి. నన్ను ఏ విధంగానూ కాంటాక్ట్ చేయటానికి ప్రయత్నించొద్దు. నీ అర్థం లేని కంట్రోల్ కి లొంగి ఉండటానికి నేను నీ పెళ్ళాన్ని కాను. ముందుగా మనిషిని, తర్వాత మనసున్న ఆడదాన్ని. నా శరీరాన్నీ, మనసునీ ఇచ్చాను నీకు, కానీ నా స్వేచ్ఛ పై హక్కు రాసివ్వలేదు. మంగళ సూత్రంతో మీ ఆవిడనీ , కచ్చడంతో నా స్వేచ్ఛనీ కట్టి పడేసాను అనుకుంటున్న నిన్ను చూస్తే .. గజ్జి కుక్క ని చూసిన జలదరింపు కలుగుతోంది.

గుడ్ లక్ అని నీకు చెప్పాలనిపించని

నీ

మాజీ ప్రియురాలు

మైధిలి

***ఉపసంహారం:***

" నేను నా జీవితంలో వాళ్ళిద్దరికీ క్షమాపణ చెప్పాలి ..!" – చెప్పాడు రాం . . అతను అక్కడికొచ్చి చాలా సేపయిందన్నట్టు గా బల్ల మీద రెండుత్తరాలు .. రెండు ఖాళీ కాఫీ కప్పులు ..

అభావంగా చూసిందామె రాం వైపు. ఆమె వయసో ఏభై ఉండచ్చు. హుందాగా ఉన్న మనిషి. బయట నేమ్ ప్లేట్ డాక్టర్ మాధవి , సైకాలజిస్ట్ అని సాయంత్రపు నీరెండ కి మెరుస్తోంది .. !

ఆమె కళ్ళల్లోని భావాలేమిటో తెలీవు, వాటిని తన మొహం మీద పడే జుట్టులా వెనక్కి నేట్టిందామే– ' "క్షమాపణ అనటం అలావాటై పోయింది. మిస్టర్ రాం అందరికీ .. ముఖ్యంగా మీలాంటి మగానుభావులందరికీ! కట్టుకొని ఒకమ్మాయినీ, కట్టడి చేసి మరో అమ్మాయినీ ,

మానసికంగా చంపారు మీరు. శవాలకి పోస్ట్ మార్టం లే తప్ప క్షమాపణలతో పని లేదు . కానీ మీ ఆదిమ పురుష భయానికి చాలా ట్రీట్మెంట్ అవసరం .. ఎప్పటినుండీ స్టార్ట్ చేద్దాం ? “ – అతనేదో గొణిగాడు . ఆమె తల ఊపింది కాస్త సానుభూతి లాంటి ఒక దయతో. అతను నెమ్మదిగా కుచించుకుపోతున్నట్టు బయటకి నడిచాడు.

“సరిదిద్దుకోలేని అత్యాచారాలకి క్షమాపణ చెప్పేస్తాం అనటం కాన్ఫిడేన్సో , కన్ఫెషనో– అర్థం కావటం లేదు “అని స్వగతంలా బయటకే అనుకుందామె..!

*****

సమాప్తం

*****

## కథ వెనుక కథ

ఎందుకు రాసానీ కథని? అదాటున అలా అడిగితే చెప్పటం కష్టం . ఒక సోషల్ వర్కర్ గా సమాజంతో, దగ్గర సంబంధాలు ఉన్నదాన్ని. ఒక మహిళగా కొంచం వాళ్ళ పట్ల ప్రేమతో కూడిన పక్షపాతం ఉన్నదాన్ని . అందుకే వాళ్ళ గాథలూ, వృత్తాంతాలూ కదిలిస్తాయి నన్ను . ఇది ఒక ఇద్దరమ్మాయిల కథ . చదువుకున్న ఇద్దరు సీత ' ల కథ . ఒక రాముడి కోసం. అదే రాముడుకి ఇద్దరి మీద నమ్మకం లేదని తెలిస్తే , ఎలా ఉంటుంది .. రోజూ ప్రాయోపవేశం కదా ! పెళ్లి అయినా , సహజీవనం అయినా .. మనిషిలో మానవ దృక్పథం ముఖ్యం, మానవీయ స్పర్శ ముఖ్యం . అభిరుచులతో, ఆకర్షణలతో సహజీవనం , బంధం ఎన్నో నాళ్ళు నిలబడవు అని చెప్పే ప్రయత్నం చేసాను . రేప్ లూ , అత్యాచారాలూ చేసి , క్షమాపణ అడుగుతాను అనటం ఫాషన్ గా మారింది ..టెక్నాలజీ పెరుగుతున్నా, దానిని అపసవ్యంగా వాడుకుంటే ఏం జరుగుతుందో, మైథిలి వృత్తాంతం. ఈ మధ్య ఇంటర్వ్యూ లలో , కొంత మంది సెలబ్రిటీలు , నా భార్యకి , ఇంకో మహిళకి నేను క్షమాపణ చెప్పాలి అనటం కొంత వింతగా అనిపించింది క్షమాపణలతో జీవితానికి జరిగిన అన్యాయాలు మారిపోతాయా అనే వ్యథ తో , ఇలా ఈ కథ ఇలా బయటకి వచ్చింది .

సాయి పద్మ

# వాసన

శ్రీముహ

## వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 18వ ఉగాది రచనల పోటీలో నా మొట్టమొదటి కథ విభాగంలో ఎంపికైన కథానిక

**వెంకట్రావుకి పొద్దున్నే మెలుకువ వచ్చింది.** మత్తుని వదలకుండా పాదాల నుంచి చెవులదాకా వెచ్చగా కప్పుకుని, మళ్ళీ సుషుప్తిలోకి జారాలని చూశాడు. వీలుపడలేదు.

లేచి దిండూ, దుప్పటీ దులుపుకుని, కాసిని మంచి నీళ్ళు తాగి తిరిగి నిద్రాదేవిని ఆవాహన చేశాడు. ఆవిడ ప్రసన్నురాలు కాలేదు. ఇక లాభంలేదని లేచి, మంచం మధ్య బాసింపట్టు వేసి ఆలోచించాడు. అప్పుడు తెలిసింది కారణం - ఎక్కడినుంచో సన్నగా చెడు వాసన వస్తోంది గబుక్కున 'ఇదీ' అని తెలియకపోయినా, 'ఏమీ లేదులే' అని సరిపెట్టుకోలేనంతగా ఉందది. వెంటనే పడకగదిని ఆనుకుని ఉన్న స్నానాల గదిలోకి వెళ్ళి, ఒకసారి సింహావలోకనం చేసి, ఎందుకయినా మంచిదని ఫ్లష్ చేసి, ఎయిర్ ఫ్రెష్నర్ కూడా జల్లి వచ్చాడు. ఆ తరువాత చాలాసేపు నిద్రకోసం కసరత్తులు చేసినా ఫలితం శూన్యం అయ్యేసరికి విసిగి, ఉదయం నడకకి బయలుదేరాడు.

రోడ్డు మీదకి రాగానే గుప్పున కొట్టింది వాసన. ఈసారి కొంచెం ఘాటుగా! "ఛీ, ఛీ, ఒక్కడికీ సివిక్ సెన్స్ లేదు, చెత్త ఎట్లాపడితే అట్లా పారేస్తారు, వాసన వస్తోందంటే రాదూ? ఈ మునిసిపాలిటీ వాళ్ళు కూడా తూ తూ మంత్రంగా పనులు కానివ్వడమే కానీ, బాధ్యతగా చెయ్యరు కదా? ఈ సిటీ బాగుపడదు," అనుకుంటూ నడక సాగించాడు.

చూస్తూవుండగానే పార్కు వచ్చింది. ప్రాతఃసమయంలో చిక్కటి ఆకుపచ్చరంగు చీరెలపై ముచ్చటైన మంచు బిందువుల అలంకరణ చూసుకుంటూ మురిసిపోతున్న చెట్లు, మాతృ పరిష్వంగంలోనుంచి బయట ప్రపంచంలోకి కాస్త బిడియంతోనూ మరికొంచెం కుతూహలంతోనూ తొంగిచూస్తున్న అందమయిన పూబాలలు, వాటిని తెగ సంబరపడుతూ పక్షులు చేసే కిలకిలారావాలు, రెక్కల చప్పుళ్ళు, వీటిన్నిటికీ నేనే సుమా కారణం అంటూ మహాబడాయిగా క్షణక్షణానికీ శక్తి పుంజుకుంటూన్న మార్తాండుడు. ఇవన్నీ కలగలిపిన అద్భుతమయిన దృశ్యకావ్యం వెంకట్రావు మనస్సును తాకలేదు ఆ రోజు. నిద్రలేపిన కుళ్ళువాసన పార్కులోనూ వెంటాడింది అతడిని. 'ఛా, ఆరోగ్యం కోసం జాగింగులు చేస్తారు కానీ పార్కుని శుభ్రంగా పెట్టుకోరు వెధవలు' అని తిట్టుకుంటూ ఇంటిముఖం పట్టాడు.

ఎట్లా స్నానాదికాలు కానిచ్చాడో, ఎట్లా ఆఫీసుకి వచ్చాడో గుర్తులేదు అతనికి. డెస్కు దగ్గర కూర్చుని పనిలో పడబోతుండగా మళ్ళీ తరుముకొచ్చింది కంపు. 'హతవిధీ', అనుకుంటూ ప్యూనుని పిలిచి, ముందు చెత్తబుట్ట ఖాళీ చేయించి, పనిలో పని తనగదిలో బీరువాలతో సహా అన్నీ జరిపించి అంతా శుభ్రం చేయించాడు. అయినా పాడుకంపు వదలలేదు. దాంతో మధ్యాహ్నానికల్లా తలనెప్పి పట్టుకుంది. మాత్రలు వేసుకుని ఎలాగో సాయంత్రందాకా నెట్టుకొచ్చాడు. ఇంటికొచ్చాక కూడా అదే పరిస్థితి. వదలకుండా నక్షత్రకుడిలా పీడిస్తున్న కంపుని, దానితో పాటు కలిగిన అసహనం, ఆందోళన, భయాలను కావిళ్ళుగా మోసాడు.

అలా మొదలైన వాసన ప్రహసనం కొన్ని నెలలు విరామం లేకుండా సాగింది. వెంకట్రావు ఇంటా బయటా దాని మూలాలు కనిపెట్టటానికి విశ్వప్రయత్నం చేశాడు. ఇల్లు ఆ మూలాగ్రం దులిపించి, కడిగించాడు. అలమారాలు తెరిపించి, పాతసామానులు తీసివేయించాడు. ఇంట్లో తోముకునే సబ్బు దగ్గరనుంచి పాముకునే లోషన్ల దాకా సమస్తం మార్పించాడు. కలరా ఉండలు టోకున కొన్నాడు. ఇంపోర్టెడ్ కొవ్వొత్తులు వెలిగించాడు. ఎంత చేసినా గుణం కనపడలేదు. గోరుచుట్టుపై రోకలి పోటులా తేలిన విషయం ఏమిటంటే, తనకొక్కడికే తప్ప మిగతా వాళ్ళకి ఏ వాసనా తెలియటం లేదని. ఇంట్లోనూ బయటా ఎవరికీ చీమకుట్టినట్టు కూడా లేదు. తను ప్రస్తావిస్తే, విషయం తేల్చేసిన మాట మారుస్తున్నారు. కుదిరితే తప్పించుకు తిరుగుతున్నారు. రెట్టించి అడిగితే, పిచ్చివాడ్ని చూసినట్టు చూస్తున్నారు. బాగా దగ్గరవాళ్ళు ఓసారి డాక్టరుకి చూపించుకోమన్నారు.

వెంకట్రావుకి దిగులు పెరిగిపోయి ఫామిలీ డాక్టరుకు మొరపెట్టుకున్నాడు. ఆయన ఇతనిని నఖశిఖపర్యంతం పరీక్షించి, బాడీలో ఏమీ దోషం లేదు, ఒకసారి బుర్రకూడా చూపించుకుంటేనే మంచిదని సలహా ఇచ్చారు. ఇంత బ్రతుకూ బ్రతికి చివరికి మెంటల్ డాక్టరు దగ్గరికి వెళ్ళవలసిన ఖర్మ ఏమిటి అంటూ బెంగపడినా, హృదయాంతరంలో ఈ సమస్య నిగ్గుతేలాలన్న ఒకే ఒక సంకల్పం వెంకట్రావుని భేషజాలనుండి విముక్తుడిని చేసి డా.ఆనందరావుగారి దగ్గరకు పంపింది.

మంచితనాన్ని కురిపిస్తూ ఎల్లప్పుడూ తేటగా ఉండే కళ్ళు, ఎదుటి మనిషిని ఆప్యాయంగా పలకరించే చిరునవ్వు, మంద్రంగా మెత్తగా ఉండే కంఠస్వరం, ఎదుటివాడి గోడు మనసారా విని తనదైన విశ్లేషణతో కడుపారా కష్టాలను తీర్చే విశిష్టమైన వ్యక్తిత్వం ఆనందరావుగారి ఆస్తులు. ఇతగాడి కథ సాంతం సావధానంగా విని, తరచి తరచి ప్రశ్నలు అడిగి, కొన్ని పరీక్షలు చేసి, రెండు వారాల తరువాత రమ్మన్నారు. రెండు వారాలూ రెండు యుగాలుగా గడిచాయి వెంకట్రావుకి. డాక్టరు ఏమంటారో? తనకి నిజంగా పిచ్చివుంటే ఏం చేయాలి? ఆ నిజాన్ని తట్టుగోగల శక్తి తనకు ఉందా? ఇంట్లోనూ బయటా ఎలా సర్దిచెప్పుకోగలడు? తన కుటుంబంలో ఎవరికీ లేనిది తనకి ఇలా ఎందుకు జరుగుతోంది? తనేం తప్పు చేసాడు? అనేకానేక ప్రశ్నలు అతన్ని అనవరతం పట్టి పీడించాయి.

అనుకున్న రోజు రానేవచ్చింది. ఎప్పటిలా ఆఫీసు గదిలో కాకుండా ప్రత్యేకంగా విడిగా ఉన్న గదిలో కూర్చోపెట్టారు అతనిని. చూడటానికి లైబ్రరీ గదిలా ఉంది. చుట్టూ అలమరలనిండా వివిధాంశాలకు సంబంధించిన పుస్తకాలు, గదిలో సూర్యకాంతి పడినచోటల్లా దానిని సద్వినియోగం చేసుకోవటానికా అన్నట్లు కుండీలలో చూడముచ్చటయిన మొక్కలు. గదిలో ఉన్న వస్తువులు అన్నీ శుభ్రంగా నలుగుపెట్టి తలంటిన చంటిబిడ్డలా మెరిసిపోతూవున్నాయి.

ఆనందరావు వచ్చి కూర్చుని, వెంకట్రావుని తేరిపారా చూసి, మందహాసం చేసి, "నీకు పిచ్చి లేదోయ్", అన్నారు. ఒక్కసారిగా గుండెలపై నుంచి మణుగుల కొద్దీ బరువు దిగిపోయి, అంతరాంతరాలలోంచి సంతోషం తన్నుకొచ్చింది వెంకట్రావుకి. లేచి ప్రపంచంలో అందరూ వినేలా గొంతు చించుకుని అరవాలనిపించింది. అంతలో చటుక్కున ఏదో తట్టినట్టె, 'నిజంగా నిజమే?', అన్నట్టు చూసాడు ఆనందరావు వైపు. ఆ కళ్ళు అబద్ధం ఆడటం చేతకానివి, "అవును" అన్నట్లు భరోసా ఇచ్చాయి. 'హమ్మయ్య!' అంటూ సర్దుకోబోయి మళ్ళీ వాసన మాట గుర్తువచ్చి అదే అడిగాడు వెంకట్రావు.

"మందు లేకపోవచ్చు, కానీ మార్గాంతరం ఉంది. ముందిది చెప్పు, నీకు ఎప్పుడైనా మనిషిగా ఇంకా ఎదగవచ్చు అనే భావన కలిగిందా? నువ్వు బ్రతికే తీరులో, పోషించే పాత్రల్లో - కొడుకుగా, భర్తగా, తండ్రిగా, పౌరుడిగా ఇంకా ఎదగవచ్చు అని అనిపించిందా?"

"అనిపిస్తే మాత్రం టింగున మారిపోవటానికి నాకూ కొన్ని పరిమితలు ఉంటాయి కదా? జీవితం సినిమా ఏమీ కాదుగా హఠాత్తుగా అన్నీ మంచి పనులే చెయ్యటానికి?"

"అవును, నువ్వు అన్నదీ నిజమే. కొందరు అస్సలు ఆ ఆలోచనే లేకుండా జీవితం గడిపేస్తారు. ఇంకొందరు అనుకునీ చెయ్యలేక ఏదో ఒకటి సర్దిచెప్పేసుకుంటారు. చాలా కొద్దిమందిని మాత్రం హృదయంలో మెరిసిన మెరుపు కూర్చోనివ్వదు, పడుకోనివ్వదు కర్తవ్యదీక్ష పుచ్చుకునే వరకూ."

"అంటే?"

"నిన్ను హిప్నో సిస్లో పెట్టి అడిగినప్పుడు నువ్వు అనుకునీ చెయ్యలేకపోయినవి కొన్ని సంగతులు చాకు చెప్పావు. నీ భార్యవైపు చుట్టాలు వైద్యం నిమిత్తం సిటీకి రావాలనుకుంటే తను నొచ్చుకుంటుందని తెలిసీ నీ ఇంట్లో ఉండటానికి వీల్లేదన్నావు. వైద్యం అంటే మాటలా, ఎన్నాళ్ళు పడుతుందో తెలీదు, అది నిష్ఠూరం బెస్టు అనుకున్నావు. మీ పెద్దాడు సరదాగా స్నేహితులతో నార్తు ఇండియా ట్రిప్పు కెళతానంటే ఇప్పటినుంచే ఖర్చులు ఎందుకులే అనుకుని వద్దన్నావు. ఆఫీసులో నీకు చండశాసనుడని పేరు. మిగతా డిపార్టుమెంటులతో పోటాపోటీగా పని జరిగిపోయినా, అక్కడ ఉండే సంఘీభావం నీ గ్రూపులో లేదని చింత, కానీ పద్ధతి మార్చుకుంటే నీ కిందివాళ్ళకి లోకువ అయిపోతావేమోనని బెంగ. స్నేహితుడు ఒకడు అవసరానికి డబ్బు అప్పు అడిగాడు. నువ్వు ఇవ్వగల మొత్తమే అయినా, అతను నమ్మదగిన వ్యక్తే అయినా ఇవ్వలేకపోయావు అతను ఒకవేళ ఇవ్వలేక పోతే డబ్బు పోయేది నీదేకదా అనుకున్నావు. మీ అపార్టుమెంటు బిల్డింగులో రిటైరయిన ముసలాయన "బిల్డింగు చుట్టూ ఉన్న గుడిసెలలోని పిల్లలు బొత్తిగా చేయిదాటిపోతున్నారు, వాళ్ళని ఒకచోట చేర్చి చదువు చెబుదాం, అపార్టుమెంటు పార్కింగుస్థలం వాడుకోవచ్చా?" అని సెక్రెటరి హోదాలో ఉన్న నిన్ను అడిగితే, "ససేమిరా వీల్లేదు" అన్నావు. అలగా జనం అంతా పార్కింగులోకి వచ్చేస్తే అక్కడ ఆడుకునే పిల్లలు, పెట్టిన బళ్ళు ఏమి అయిపోతాయేమోనని నీ బాధ. ఇంకా బోలెడు చెప్పావు, కానీ స్థూలంగా విషయం ఏమిటీ అంటే, ఇలాంటి విషయాలన్నీ వినటానికేగానీ మనం పూనుకుని చెయ్యటానికి కాదని నువ్వు మనసా వాచా నమ్మావు, అలానే ఆచరించావు కూడా. కానీ, గత కొన్ని మాసాలుగా మాత్రం, నీ హృదయానికి మెదడుకి పరోక్షంగా తీవ్రయుద్ధం జరుగుతోంది. అది నిన్ను మునుపటి రీతిలో సర్దిచెప్పుకోనివ్వటం లేదు. నీ వ్యక్తిత్వంలోని నీకు నచ్చని అంశాలు, వాటిని వదిలించుకోలేని నీ అశక్తత అంతా బయటకి కుళ్ళువాసనగా వస్తున్నాయి. నీ సబ్ కాన్షస్ వాటిని గుర్తించి నిన్ను వారిస్తోంది. నువ్వు చాలా అదృష్టవంతుడివి.

మనిషి సహజంగా ఒక ఐడిల్ స్టేట్లో ఉండాలని ఉంటుంది. కానీ కాలం, ప్రదేశం, ఆర్థిక మరియు సాంఘిక పరిస్థితులు చాలామటుకు అలా ఉండనీయవు. చేతనయినంత వరకు ఆ సంతులనాన్ని సాధించాలి. అలాగని, స్వప్రయోజనం చూసుకోకుండా సంపాదించినదంతా దానధర్మాలకి ఇవ్వమని కాదు, కాని ఇప్పుడున్న 'సాయం చేయకపోయిన ఫర్వాలేదు, హాని చెయ్యకపోతే చాలు..', 'ఆ, ఎవరో ఒకరు నడుము కడతారులే' లాంటి మానసిక జాడ్యాలు పోవాలి.

నీకు చెడువాసన వచ్చినప్పుడు చుట్టూ కాకుండా నీలోకి నువ్వే తొంగిచూసుకో, 'నా' అన్న భావం కొంచెం పక్కన పెట్టి, 'మనం' అనే భావన పెంచుకో. మనసుకి గోడలు కట్టకు, మనసుమూలల్లో ఉన్న మకిలిని అలాగే వదిలితే కుళ్ళి కంపు కొట్టడం సహజం. ఆ మూలల్లోకి వెలుతురుని పారనిచ్చావంటే, కంపు సమూలంగా నాశనం అవుతుంది, స్వచ్ఛత ఒకటే మిగులుతుంది. మనసుకి గోడలు కట్టకు అదే నీకు తారకమంత్రం", అంటూ లేచి భుజం తట్టి వెళ్ళారు ఆనందరావు.

వెంకట్రావు చాలాసేపు అలానే కూర్చుండిపోయి ఆలోచించాడు. తరచి చూసినకొద్దీ ఆనందరావు చెప్పిన విషయం ఎంత అమూల్యమైనదో బోధపడసాగింది. మనిషిగా ఎదగాలనే సంకల్పం మొగ్గ తొడిగింది, ఆ మరుక్షణంలోనే సుమధుర సువాసనలు ఏవో గాలిలో తేలి వస్తున్నట్లు అనుభూతి కలిగింది. ఆ అనుభూతిని నిత్యానుభవంగా మార్చుకోవాలి అనుకుంటూ లేచాడు.

# కార్పొరేట్ సుడిగుండాలు   కప్పగంతు వెంకట రమణమూర్తి

## వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 18వ ఉగాది రచనల పోటీలో నా మొట్టమొదటి కథ విభాగంలో ఎంపికైన కథానిక

మాదాపూర్ లో అదొక అందమైన కార్పొరేట్ సౌధం. చూపరులను ఇట్టే ఆకట్టుకునే విధంగా అత్యాధునికంగా కట్టిన ఆ పదంతస్తుల భవనాన్ని చూస్తే క్రింది నుంచి పైదాకా అద్దాలనే పేర్చి నిలబెట్టినట్లుగా ఉంటుంది. దేశంలోని పలు గొప్ప సంస్థలు అందులో కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. బహుళ సంస్థల లోగిలి ఒక కొత్త ప్రపంచాన్ని తలపింపజేస్తోంది. ఆ బిల్డింగ్ లోనే దేశవ్యాప్తంగా అనుసంధానం కలిగివున్న ఒక సర్వీసెస్ సంస్థ నాలుగు వరుస అంతస్థులలో ఎంతోకాలంగా వేళ్ళూనుకొని ఉంది. ఆ సంస్థలోని ప్రముఖ మేనేజర్లు అందరూ ఆరోజు ఒక వ్యక్తి కోసం వేచి చూస్తున్నారు. కొత్త చీఫ్ ఆపరేషనల్ హెడ్ గా కల్నల్ సీతారాం భాద్యతలను స్వీకరించబోవటమే ఆనాటి విశేషం. మిలిటరీలో చేసిన అనుభవం కార్పోరేట్ రంగంలో ఏమాత్రం ఫలితాలను ఇస్తుందోనన్న అనుమానం యాజమాన్యానికి ఉన్నా, కల్నల్ సీతారాం తనకు ఉన్న కమాండింగ్ స్వభావంతో ఆకట్టుకొని ఉద్యోగానికి నియమితులయ్యాడు.

ముందుగా నిర్ణయించినట్లు పదవ అంతస్థులోని పరిపాలన బ్లాక్ లో కాకుండా నేరుగా తొమ్మిదో అంతస్థులో ఉన్న తన చాంబర్ కే కల్నల్ సీతారాం చేరుకొని అక్కడి నుంచే జాయనింగ్ రిపోర్ట్ ను అడ్మినిస్ట్రేటివ్ శాఖకు పంపాడు. అతని కోసం వెయిట్ చేస్తున్న ఇతర మేనేజర్లు ఇక చేసేది ఏమి లేక ఎవరి సీట్లలోకి వారు వెళ్ళిపోయారు. ఛామనఛాయ, గుండ్రటి బట్టతలతో ఒకింత బొద్దుగా ఉన్న సీతారాం మెడకు టై యమాగా బిగించి పైన నల్లకోటు వేసుకొని ఉన్నాడు. మంచి విగ్రహపుష్టి ఉన్న వాడిలా కనపడుతున్నాడు. తన క్రిందిస్థాయి వారితో తన ఛాంబర్ ప్రక్కనే ఉన్న కాన్ఫరెన్సు హాలుకు పిలిచి సమావేశమయ్యాడు. ఎవరెవరు ఏ ఏ పనులు చేస్తున్నారో తెలుసుకొని అందరి గురించి ఓపికగా రాసుకుంటూ ఎదుటివారికి ముచ్చెమటలు పోయించాడు. మొదటిరోజే బుల్లెట్ లాంటి పదాలతో తన స్టాఫ్ గుండెల్ని అదరగొట్టాడు. వివిధ నగరాలలో ఉన్న ఇతర ఆపరేషనల్ హెడ్ ల గురించి వాకబు చేసి వివరాలను పూర్తిగా సేకరించుకున్నాడు. కంపెనీ పనిమీద టూర్లకు వెళ్ళిన వారిని వెంటనే వెనక్కి రావలసిందిగా కబురు పెట్టాలని సెక్రటరీకి ఆదేశాలు ఇచ్చాడు. కొత్త సంస్థలో చేరానని తాను కొంతకాలం అయినా ఒదిగి ఉండాలన్నసామాన్య ధోరణికి భిన్నంగా దూకుడుగా పనిని నిర్వర్తిస్తున్నట్లు చేరిన రోజే కల్నల్ సీతారాం అందరికీ ప్రస్ఫుటమయ్యాడు.

కొత్తగా కంపెనీలో చేరిన మేనేజర్లకు మొదటిరోజు అన్ని డిపార్టమెంట్ల మేనేజర్లతో లంచ్ ఏర్పాటు ఆ సంస్థ ఆనవాయితీ. ఆ సమయంలోనే కల్నల్ సీతారాం తన సెక్రటరీని వెంటబెట్టుకొని వచ్చి అందర్నీ పేరుపేరునా తెలుసుకున్నాడు. అందరితో హుందాగా ఉంటూ అప్పుడప్పుడూ వారిపై సెటైర్లు ఎక్కుపెడుతున్నాడు. అక్కడే ఉన్న కొంతమంది కల్నల్ చాకచక్యానికి గతుక్కుమంటున్నా, కొందరు ఇలాంటివాడు కంపెనీకి కావల్సిందేనని అనుకున్నారు. అదేరోజు సాయంత్రం కల్నల్

సీతారాం తన పైస్థాయి అధికారులను టీ వేళ మర్యాదపూర్వకంగా కలుసుకొని ముచ్చటించి, తాను చేయాలని అనుకుంటున్న పనుల విషయమై సూచనప్రాయంగా ఆమోదం తీసుకున్నాడు. కార్పోరేటు సంస్థల్లో నాలుగుగోడల మధ్య జరిగే విషయాలు పెను మార్పులకు పునాదులు అని అంటారు. వ్యాపారాత్మకంగానే కాక వ్యూహాత్మకంగా విధానాలు రూపొందిస్తుంటారు. అదేదో అక్కడ జరిగిందని అటెండర్ల ద్వారా క్షణాల్లో కంపెనీ అంతటా పాకింది. ఇదిగో తోక అంటే అదిగో పులి అనే సామాన్యుల మనస్తత్వాలు ఎప్పుడూ నిర్మలంగానే ఉంటాయి. కల్నల్ సీతారాం తిరిగి తన చాంబర్ కు వచ్చేసి పని విషయమై ఒక నెలకు సరిపడా ప్రణాళికలను సిద్ధం చేసుకున్నాడు. వివిధ నగరాలలో ఉన్న ఆపరేషనల్ హెడ్ లను ఫోన్ ద్వారా సంభాషించి ముందస్తు రిపోర్ట్లను పంపమని కోరాడు. ఆ రోజు పనిగంటలు ముగిసే వేళకే కల్నల్ సీతారాం పని ముగించుకొని వెళ్ళిపోయాడు.

కొన్ని నెలలు గడిచేటప్పటికి కల్నల్ సీతారాం ఒక వ్యక్తిగా కాదు ఒక శక్తిగా శాసించే స్థాయికి చేరుకుంటాడని ఎవరు ఊహించలేదు. కంపెనీ మీటింగుల్లో అన్ని విషయాలలో తనకు పట్టు ఉన్నట్లు ఆ విషయం ఈ విషయం కాకుండా అన్ని విషయాలలో తనదైన ధోరణిలో విశ్లేషిస్తూ ఇతర మేనేజర్లను చాకచక్యంగా వెనుకంజ వేయించేవాడు. కార్పోరేట్ రంగంలో సౌమ్యంగా చెప్పి పనులు జరిపించుకునే వాతావరణం లేకుండా పోయింది. మేనేజర్ల పైచేయి కోసం జరిగే పోటీలో చిరుద్యోగులే సమిధలు అన్నట్లుగా పరిస్థితి తయారయ్యింది. ఉద్యోగుల్లో అభద్రతా భావం పెరగటం, ఇతర సంస్థల్లో కూడా పరిస్థితులు ఇంతకన్నా బాగుండక పోవటంతో అన్ని అర్హతలుండీ కూడా ఆఫీసుల్లో పైవారికి దాసోహమంటున్నారు. కల్నల్ సీతారాం తన మాట నెగ్గించుకునే ప్రయత్నంలో ఇతరుల మనస్సులు చివుక్కుమనేలా ప్రవర్తిస్తున్నాడు. తన డిపార్ట్మెంట్ పై ఎవరి పెత్తనం లేకుండా తానే స్వతంత్రంగా నిర్ణయించి పని చేసేట్టట్టు ఆమోదం తీసుకున్నాడు. తనకు రిపోర్టు చేసే ఇతర నగరాలలోని ఆపరేషనల్ హెడ్ లను అటూ ఇటూ మార్చి, మరికొంత మంది స్థానాల్లో తన మనుషులను దశలవారీగా చేర్చాడు. కల్నల్ సీతారాం ను కదిపితే సంస్థ ఆపరేషనల్ విభాగం కుప్పకూలుతుందని యాజమాన్యం భావించేలా చేశాడు. సంస్థ వ్యవహారాల్లో తాను లేనిదే ఏ పని సవ్యంగా జరగదనే భ్రమలు కల్పించాడు. కంపెనీలో ఏకుకు మేకుగా అయి కూర్చున్నాడు. కల్నల్ సీతారాం విషయంలో ఇతర డిపార్టమెంట్ల మేనేజర్లు తలలు పట్టుకుంటున్నా, సరైన సమయంలో అతడిపై వేటు ఖాయమని, ఆరోజు కోసం వారువేచి చూస్తున్నారు. నల్లేరు మీద నడక ఇక ఎంతో కాలం సాగదని కల్నల్ ను బయటికి పంపే రోజు ఇక ఎంతో దూరం లేదని వారు భావించారు. యాజమాన్యం తన కుయుక్తులను కల్నల్ సీతారాం ద్వారా పన్నిస్తోందని కొందరు, కాదు యాజమాన్యమే వేచి చూసే ధోరణి అవలంభిస్తోందని మరికొందరు అభిప్రాయపడి ఎవరికి తోచినట్లుగా వారు చెప్పుకుంటున్నారు.

కల్నల్ సీతారాం గోముఖ వ్యాఘ్రంగా ఉంటూ మొత్తం కంపెనీని తన గుప్పెట్లో పెట్టుకున్నాడు. ఉద్యోగుల ప్రమోషన్లు, ట్రాన్స్ఫర్లు చేయవలసినప్పుడల్లా కుదింపు చేయమన్నప్పుడల్లా ఒక ఆచణీయమైన విధానం అనుసరించక తనకు ఎదురు తిరిగిన వారిపైనే మొదటి బాణం గురి పెట్టేవాడు. తన అడుగులకు మడుగులొత్తే వారినే తన వద్ద ఉంచుకున్నాడు. తానే మీకు అండ అని, మీరు మరెవ్వరికీ లెక్క చేయనవసరంలేదని తన స్టాఫ్ కు భోదించటం మొదలు పెట్టాడు. అన్ని కాలాలు మనవి కానట్లు కంపెనీ మార్కెట్ పరిస్థితి మందగించటంతో సంస్థాపరంగా చర్యలు తీసుకోవాలని యాజమాన్యం నిర్ణయించటంతో, కల్నల్ సీతారాం తొలి ఎత్తులో భాగంగా కంపెనీకి బాగా లాభాలను ఆర్జించేపెట్టే మార్కెటింగ్ డిపార్ట్మెంట్ ను తన పరిధిలోకి తీసుకుంటే తన హోదాకు, తాను చెప్పినట్టు పడుండే స్టాఫ్ కు ముప్పేమీ ఉండదని అనుకున్నాడు. కల్నల్ సీతారాం అనుకున్నదే తడవుగా తన సెక్రటరీని ఇంకా మరో

ఇద్దరు దిగువ స్థాయి మేనేజర్లను ఆ శాఖకు పంపి పనిని అంచనా వేసి, మీటింగ్ లో తన డిపార్టుమెంటులో మార్కెటింగ్ డిపార్టుమెంటును కలిపివేస్తే ఉద్యోగులను తగ్గించటమే కాక ఖర్చు తగ్గించవచ్చునని అనుమతి తీసుకున్నాడు.

కార్పొరేట్ తళుకు బెళుకులు మామూలు ప్రజానీకానికి గొప్పగా కనిపించినా అందులోని ఉద్యోగులు నిరంతరం ఎనలేని మానసిక వేదనని అనుభవిస్తున్నారని, వారి బాట అందరూ అనుకుంటున్నట్లు పూలబాట కాదని అనేక ఒడిదుడుకులతో కూడిన అది ఒక కార్పొరేట్ ముళ్ళ బాట అనే వాస్తవం తెలిసే రోజు వచ్చింది. హక్కుల పోరాటానికి ఏమాత్రం ముందుకు సాగాలేని కార్పొరేట్ ఉద్యోగులు యాజమాన్యాల క్రింద నవీనతరం బానిసలు. వారి ఉక్కు పాదాల క్రింద నలపబడుతున్న విద్యాధిక కుసుమాలు. కల్నల్ సీతారాం ప్రతిపాదనలన్నీ సిద్ధం చేసుకుని మార్కెటింగ్ డిపార్ట్మెంటులో ఒకరిద్దరిని మినహా అందరికీ టెర్మినేషన్ లేట్టర్లు ఇప్పించేసి తన డిపార్ట్మెంట్ స్టాఫ్ కు పనిని పెంచుకోవటమే కాకుండా వారిని అలాగే ఉద్యోగాల్లో కొనసాగించేశాడు. ఈ కార్పొరేట్ రంగం సరైన స్థిరత్వం ఇవ్వలేదని చెప్పే కొన్ని జీవితాలకు దర్పణం. కంపెనీ యాజమాన్యం కూడా కాస్ట్ కట్టింగ్ లో భాగంగా ఒప్పుకోక తప్పింది కాదు. కల్నల్ సీతారాం చేసిన కార్పొరేట్ కుయుక్తి తాత్కాలికంగా అతనికి ఊరటనిచ్చినా యాజమాన్యం సీతారాంకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. వెంట వెంటనే పావులు కదిలిపోయాయి. నిశ్శబ్దంగా రిపోర్టులు తయారుచేసింది యుద్ధంలో చిక్కిన బందీగా కల్నల్ సీతారాం అవమానంతో అతని టీంతో సహా బయటకు పోవాల్సివచ్చింది.

## దయామణి

శ్రీనివాసరావు ఆదూరి

### వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన 18వ ఉగాది రచనల పోటీలో నా మొట్టమొదటి కథ విభాగంలో ఎంపికైన కథానిక

" హలో! అర్జున్ ! మీ మిసెస్ అమలాఅర్జున్ కళ్ళు తిరిగిపడిపోయారు, రమణీ నర్సింగ్ హోంలో చేర్చాం, వెంటనే రండి!" మెసేజ్ మొబైల్ చూడగానే అర్జున్ ఆఘమేఘాలమీద బయల్దేరాడు. రమణీనర్సింగ్ హోం చేరాడు. అక్కడ డ్యూటీ డాక్టర్ దయామణిని కల్సి అడిగాడు .

"డాక్టర్! అమల నామిసెస్! ఇక్కడ చేర్చారుట! ఏమైంది?ఎలా ఉంది? ఎక్కడఉంది?నేనుచూడవచ్చా?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించాడు అర్జున్ .

డాక్టర్ దయామణి నవ్వుతూ " మరేం కంగారు లేదయ్యా! మీ ఆవిడ్ని మీరు చూసేందుకేం అభ్యంతరం లేదు,మీ మిసెస్ మీకు తండ్రిగా ప్రెమోషన్ ఇవ్వబోతున్నారంతే! రూంనెం. నైన్లో ఉంది వెళ్ళిచూడండి" అని చెప్పింది .

"అమలా!చాలాసంతోషం !మా అమ్మా నాన్నలు వంశోద్ధారకుడైన మనుమడే కావాలని కోరుకుంటున్నారు . నీవు మగబిడ్డనే కనాలి మరి ! " ప్రేమగా బుగ్గ నిమురుతూ అన్నాడు అర్జున్ .

" నాదేముందండీ ! భగవంతుడు ఎవరిని ప్రసాదిస్తే వారేగా!" అంది అమల మెల్లిగా నవ్వుతూ.

"అలా కాదు మన విషయంలో, నీవు మగ బిడ్డనే కనాలి. అది అమ్మానాన్నల అభీష్టం, మన పెళ్ళి విషయంలో కూడా వాళ్ళ కోరిక తీర్చలేక పోయాను, పిల్లల విషయంలో నైనా మనం వారినితృప్తి పరచాలి. ఏం?"అన్నాడు, అధికారస్వరంతో అర్జున్.

పేలవంగానవ్వింది అమల." పద.. డాక్టర్నడుగుదాం. మనకు పుట్టబోయేది ఆడో, మగో" అని అనితను లేపి పట్టుకుని నడిపిస్తూ డా.దయామణి రూం లోకి వచ్చారు. దయామణికి యాభై ఏళ్ళుంటాయి. పేరుకు తగినట్లే ఆమె ముఖంలో దయ ప్రస్ఫుటంగా కన్పిస్తుంటుంది. ఆమెను చూస్తేనే రోగాలన్నీ మాయమై పోతాయి. నవ్వుతూ వారిద్దరినీ చూసి" మీ ఆయన్ని బాగానే కంగారు పెట్టినట్లున్నావుగా! రండి కూర్చోండి " అంది .

" డాక్టర్ ! మాకు మగబిడ్డే పుట్టాలి,ఆడోమగో ఎప్పుడు తెలుస్తుంది డాక్టర్ !" ఆతృతగా అడుగుతున్న అర్జున్ను వింతగా చూసింది డా.దయామణి.

"మీ కిది మోదటి సంతానం ! ఆడైనా మగైనా తొలిప్రేమ సంతానం, మనస్ఫూర్తిగా ఆహ్వానించాలి.." అని ఆమె చెప్తుండగానే, అడ్డు వచ్చి" అలా కుదరదు డాక్టర్! మాఅమ్మానాన్నల కోర్కె మేరకు వంశాంకుర మైన మగ బిడ్డనే కనాలి నాభార్య, అప్పుడే వారు సంతోషించేది, కొడుగ్గా వారిని సంతష పెట్టడం నాధర్మం కాదంటారా! చెప్పండి!" అని ఉద్రేకంగా అంటున్నఅర్జున్ని వింతగా చూస్తూ..

" మీ అమ్మానాన్నల కోరిక బాగానే ఉంది, కానీ పుట్టబోయే సంతానం మీది, ఆ విషయం మరువకు! మీకంటూ ఏఅభిప్రాయమూలేదా!" అని అడిగింది డా.దయామణి.

"కాదు డాక్టర్! మాపెళ్ళి విషయంలో అమ్మానాన్నలకు ఇష్టం లేకపోయినా సర్దుకు పోయారు , పిల్లల విషయంలోనూ సర్దుకు పొమ్మటే ఎలా? వారి కోరిక ఎలా తీరుతుంది ?" ఆవేశంగా , చాలా పట్టుదలగా అంటున్న అర్జున్ను చూసి నవ్వుతూనే " ఓ.కే.మిస్టర్ అర్జున్! మీ భార్యకు ఇప్పుడు 6వారాల గర్భం కూడా దాటలేదు, నాల్గోమాసం పూర్తైతే గానీ ఆడోమగో తెలీదు. అసలిప్పుడు లింగనిర్ధారణ పరీక్షలు చేయ కూడదు, చెప్ప కూడదు అది నేరం! "అని దయామణి అంటుండగానే...

"ఇదిప్రైవేట్ నర్సింగ్ హోం, మేం మేము ఫీజ్ చెల్లిస్తే మీరు మేం కోరింది చెప్పాలి .." హక్కులా అడుగుతున్న అర్జున్ను చూసి విసుగ్గా ..

"ఓకే. మిస్టర్ అర్జున్! ఇది ప్రైవేట్నర్సింగ్హోమే, ఐనా మేమూ ప్రభుత్వ నియమాలకు వ్యతిరేకంగా ఏమీ చేయకూడదు, ఐనా మీరు మాడైరెక్టర్ను కన్సల్టవండి. ఆయన నిర్ణయం ప్రకారం అంతా జరుగుతుంది, నాల్గోమాసం పూర్తయ్యాకే ఏదీనీ తెలిసేది, వెళ్ళిరండి, కాస్త బలమైన ఆహారం తీస్కో అమలా! చాలా నీరసంగా ఉన్నావ్! పైగా నీవు జాబ్ కూడాచే స్తున్నవాయె! " అని డా.దయామణి డైట్ వివరాలు వ్రాసిచ్చి పంపింది ..

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

"డాక్టర్ ! మీరే నన్ను కాపాడాలి. ఇప్పటికి మూడు మార్లు ఎబార్షన్చేయించారు ఆడపిల్లని, నాకీ నరకం వద్దు, నాకు గర్భం రాకుండానైనా చేయండి, లేదా, ఆడోమగోనైనా చెప్పకండి" కంటికి కడివెడుగా ఏడుస్తూ తన ముందు కూర్చునున్న అమలను భుజం తట్టి ఓదార్చింది డా.దయామణి.

"మీ ఆయనతో నేను మాట్లాడతాను." అనునయంగా అంది ఆమె.

" మీరేం చెప్పినావాళ్ళు వినరు.వాళ్ళ వంశం ఉద్ధరించే మగ బిడ్డైతేనే నా ప్రెగ్నెన్సీని అంగీకరిస్తారు. లేక పోతే ఈమారూ ఎబార్షన్చేయించుకో మంటారు. ఈబాధ నేను భరించలేను, డెలివరీ ఐతే కంపెనీ సెలవిస్తుంది, లేకపోతే సెలవుపెట్టుకుని రెస్టు తీసుకోవాలి. సెలవు పెడితే మగబిడ్డను కనను చేతకాదు కానీ సెలవొకటి ' అంటూ నన్ను చేతకాని ఆడదాన్నని మాట్లాడుతున్నారు.,అదే మంటే 'గోత్రం, జాతకం, కలియని పిల్లను,నీ ఆఫీసులోపని చేస్తున్నదని, ఏమీ సరిపోకుండా నే చేసుకున్నావ్. ఇప్పుడుచూడు! కేవలం డబ్బేకాదురా చూసు కోవల్సింది, మగసంతానం మాటేంటి?' అంటూ మా ఆయన్ని వేధిస్తారు. ఆయన నామనస్సును కోసే మాటలంటారు.."వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉంది అమల.

ఆశ్చర్యంగా వింటూంది దయామణి. 'ఇంతింత చదివి ఉద్యోగాలుచేసి లక్షలు సంపాదిస్తూన్నా ఇంకా ఈ చాదస్తాలు వదలవా! 'అనుకుంటూ..,"అమలా! మీ ఆయన్ని ,అత్త మామలనూ లోపలికి పిల్చినేను మాట్లాడతాను. అప్పటికీ వారు వినకపోతే అప్పుడు చూద్దాం " అనిచెప్పి బయటవేచి ఉన్నవారంద రినీ లోపలికి పిలిపించింది డా.దయామణి.

" రండి! కూర్చోండి! మీకు కొన్నివిషయాలు చెప్పాలి..ప్రశాంతంగా నేను చెప్పేదంతా వినండి, ఆతర్వాత మీ అభిప్రాయం చెప్పండి...." అంటూ మొదలెట్టింది డా.దయామణి..

"ఇంత అధునాతనయుగంలోనూ ఈ చాదస్తాలేంటీ ! పెళ్ళిళ్ళకు జాతకాలూ , గోత్రాలూ కాదుతెల్సుకో వలసింది. బ్లడ్ గ్రూపుల టెస్టులూ! అసలు ఆడపిల్లైతేనేం? మగపిల్లాడైతేనే! ఇద్దర్నీ పెంచి పెద్దచేసి చదివిస్తారు, పెళ్లిళ్ళుచేస్తారు. ఆడపిల్లను మరోఇంటికి సాగనంపుతారు, మగపిల్లాడి భార్యను ఇంటికి తెచ్చుకుంటారు. ఇదో ఇలా వేధిస్తారు మగపిల్లాడు పుట్టక పోతే ! ఆడపిల్లకు పెళ్ళికాగానే గోత్రం, ఇంటిపేరూ మార్చేస్తారు! పుట్టింటితో బంధం, హక్కు తగ్గిపోతాయి, అతిధిగా రావటం తప్ప. అదే మగపిల్లాడైతే ఇంట్లో సర్వ హక్కులూ పొంది తల్లిదండ్రులనే శాసిస్తాడు, ముసలివారయ్యాక భార్యకు పడకపోతే వృద్ధాశ్రమంలో పడేస్తాడు, ఎక్కడో అమ్మ కూచిలు పెళ్ళాన్నేడిపిస్తూ ఆమె జీతం మాత్రం దిగమింగేవాళ్ళుంటారు! చనిపోయాక తల కొరివి పెట్టే కొడుక్కోసం ప్రయాస పడితే బ్రతికుండగానే పెడుతున్నారిపుడు కొరివి. కొడుకైతే వైతరణిని దాటిస్తాడని భ్రమపడతారు సాంప్రదాయ కుటుంబాల వాళ్ళు. వారి కోరికా న్యాయమే కావచ్చు ,కానీ దానికి బాధ్యత కేవలం కోడలుదేనా! శుక్ర శోణితాల కలయికతో పిండం ఏర్పడు తుంది .స్త్రీలలో X క్రోమోజోములే ఉంటాయి, పురుషుల్లో X Y ఉంటాయి, స్త్రీ X కు పురుషుల్లోని Y కలిస్తే మగబిడ్డ ,X కుX కలిస్తే ఆడబిడ్డ, ఈనాడు అనేక కారణాల వల్ల పురుషు ల్లో Y క్రోమోజోముల సంఖ్య తగ్గిపోతున్నది. అందువల్ల ఆడపిల్లలే పుడుతున్నారు. దీనికి మీ కోడలి తప్పేమీ లేదు. ఏబిడ్డైతేనేం కనటానికి, ఆమేమన్నా మగబిడ్డ వద్దను కుంటున్నదా! అమ్మాయి కావాలను కుంటున్నదా! ఇన్నిమార్లు ఆడబిడ్డని అబార్షన్చేయిస్తుంటే మగబిడ్డ కావాలని కోరుకోదా! విత్తును బట్టేకదాచెట్టు? ఆమెకీ మారు ఎబార్షన్చెస్తే ఇహ బిడ్డలు పుట్టేఅ వకాశమే ఉండక పోవచ్చు, గర్భసంచీ శక్తిహీనమవుతుంది కూడా "దీర్ఘంగా చెప్పింది డా.దయామణి.. కొంత ఉద్రేకమూ కన్పించింది ఆమెస్వరంలో...

" అసలు మగోఆడో ఎన్నివారాలకు తెలుస్తుంది? " ఆసక్తిగా అడిగాడు అమల భర్త అర్జున్ .

" మొదటినెల పూర్తయ్యే సరికి 0.6సెం.మీ తో గుండె ఆకారం ఏర్పడి ,హార్ట్ బీటింగ్ మొదలవుతుంది, సెంట్రల్నర్వ్స్ సిస్టం మొదలవుతుంది. రెండునెల్లు పూర్తయ్యే నాటికి 3సెం.మీ సైజ్ తోపిండం 1గ్రాం బరువు తో ,ముక్కుఫ్లాట్ గా, బ్రైన్ రూపం, పక్కటెముకలు, ముఖ్యమైన రక్తనాళాల రూపం మొదలై లోపలి భాగాలు రూపు దిద్దుకోడం ప్రారంభ మవుతుంటుంది.తల క్రింద తోక వంటి ఆకారంతో తోక చేప లానో, తోకకప్ప లానో ఉంటుంది , రక్తనాళాలు, నరాల రూపం, 3వమాసం పూర్తయ్యే సరికి 30గ్రా, బరువు తో పిండం ఉంటుంది.కళ్ళు

మూతబడి ఉంటాయి. ముక్కు, చెవులు ఏర్పడతాయ్ హార్ట్ బీటింగుకూడా వినిపిస్తుంటుంది చిన్నగా.. . పిండం కదలిక మొదలవు తుంది. నాల్గవ మాసం నిండే సరికి పిండం పెరుగుదల 18సెం.మీ. ఉంటుంది బరువు 100గ్రా. వరకూ ఉంటుంది.. తల భాగం పెద్దదిగా ఉంటుంది. మానవ ముఖపోలిక లేర్పడతాయి, తలమీద జుట్టు, జాయింట్స్ ఏర్పడి, ఒక ఆకారం కనిపిస్తుంటుంది.. జాగ్రత్తగా గమనిస్తే పిండం ఆడో మగోతెల్సుకునే స్టేజి నాలుగు మాసాలు నిండాకనే ." దయామణి చెప్తుండగా

" డాక్టర్ ! మరి తల్లి దండ్రుల పోలికలు బిడ్డలకు ఎలా వస్తాయి?" ఎంతో ఇంటరెస్టింగా అడిగాడు అర్జున్.

"ప్రతిప్రాణిలోనూ జీన్స్ ఉంటాయి. కళ్ళు, ముక్కు, జుట్టు రంగునుంచీ శరీరపు రంగువరగే కేక గుణా గణాలు, బుధ్ధులూ , అభిరుచులూ అన్ని తరతరాలకూ మోసుకెళ్ళేవి ఈ జీన్సే! ప్రతి ఒక్క జీవకణం లోనూ వారసత్వంగా సంక్రమించే జీన్లు ఒకలక్షా యాభై వేలవరకూ ఉంటాయి." వివరంగా చెప్పింది డా. దయామణి.

" సో ఇంటరెస్టింగ్! తర్వాత చెప్పండి డాక్టర్!" అడిగాడు అర్జున్.

"ఐదవ మాసం నిండే వేళకు పిండం 30 సెం.మీ.ప్రమాణంలో ఉండి 200 నుండి 450గ్రా బరువు ఉంటుంది. పిండం తిరగటం తల్లికి తెలుస్తుంటుంది. చర్మంపై వెంట్రుకలు ,.బ్రైన్లోపల భాగాలు ఏర్పడతాయి,

గుండె పూర్తిగా తయారవుతుంది. పిండం ఎదగటం మొదలవుతుంది. 6వ మాసం నిండేప్పటికి కంటి పొరలు, కనుబొమలు కూడా ఏర్పడతాయి. బరువు పెరగడం మొదలై అరచేతిలో గీతలు కూడా ఏర్పడతాయి. 7వమాసం పూర్తయ్యే సరికి 52 నుండీ 42 సెం మీ పరిధితో 1100 నుండీ 1350గ్రా. బరువుతో బిడ్డ పరిపూర్ణ ఆకారంతో తల,శరీరం తగిన విధంగా పెరిగి, కళ్ళు మూస్తూతెరుస్తూ ఉంటుంది. ఈ మాసంలో కొంత మందికి డెలివరీ అవుతుంటుంది . కొన్ని కారణాలరీత్యా వైద్యులమే డెలివరీ చేయాలని సూచిస్తుంటాం, అప్పుడు పుట్టినా బిడ్డ బ్రతికే అవకాశాలు ఉంటాయి. పిండం గర్భంలో పైకి క్రిందికీ తిరుగు తుంటుంది, ఆ కదలికలే తల్లికి బిడ్డ గుర్తింపు తెలుస్తుంటుంది. 8వ మాసం పూర్తయ్యే వేళకు 41నుండీ 45 సెం.మీ ప్రమాణంతో 2,000 నుండీ 2,300 గ్రా. బరువుతో బిడ్డవారానికి 226.8 గ్రా.చొప్పున పెరుదల ఉంటుంటుంది, అందుకే పిండం ఎదుగుదల్ని ప్రతి 15 రోజులకూ మేము పరీక్షిస్తుంటాం..9వ మాసం పూర్తయ్యే వేళకు గర్భంలోనిబిడ్డ 50 సెం.మీ. పరిమాణంతో 3,200 నుండీ 3,400గ్రా. బరువు కలిగి ఉండి. ఎముకలు గట్టిపడి బరువు పెరుగుతూ ఉంటుంది. చేతిగోళ్ళు ఏర్పడతాయి. అంటే బిడ్డ పూర్తిగా తయారై బయటి ప్రపంచంలో ప్రవేసించను ఎదురు చూస్తుంటుంది.. చాలా ఇంకా ఏమైనా కావాలా? మీరిప్పటికి ముగ్గురు కుమార్తెలను నిర్ధాక్షిణ్యంగా చంపేశారు,.ఇంత చెప్పినా ఆడపిల్ల పుటక్కి మీ భార్యదే కారణమనుకుని, ఇంకా ఈమెను హింసించడం అన్యాయం." అని

డా. దయా మణి ఆపగానే,భోరుమని ఏడ్వసాగింది అమల.

" క్షమించండి డాక్టర్ , ఇంతకాలం నిజంతెల్సోకోలేక కోరి చేసుకున్న నాభార్యను దారుణంగా హింసించాను, నాకు ఏబిడ్డ పుట్టినా ఈమారు మనస్పూర్తిగా ఆహ్వానిస్తాను. ఎవరే మన్నా పట్టించుకోను. అంతే కాదు డాక్టర్ మా బిడ్డకు మీపేరే ' దయామణి' అనిపెట్టుకుంటాను కూడా." అంటూ అమలను దగ్గరకు తీసుకుని తల నిమురుతున్న అర్జున్ను చూసి తృప్తిగా నిట్టూర్చింది డా.దయామణి.

